శ్రీమచ్ఛంకర

భగవత్పాద చరిత్ర

రచన

డా. పోతుకూచి సుబ్రహ్మణ్య శాస్త్రి, M. A. Ph. D;

Professor, Department of English

Nagapur University

ప్రకాశకులు :

సాధన గ్రంథ మండలి, తెనాలి.

మూల్యము: **15-00**

విషయసూచిక

కాళయుక్తి — శంకర జయంతి

కల్యాణీప్రెస్, తెనాలి.

ఓమ్

"శఙ్కరః శఙ్కరః సాక్షాత్"

బ్రహ్మశ్రీ సూరి రామకోటిశాస్త్రిగారు

భూతపూర్వాధ్యక్షులు

కె.యల్.యన్. సంస్కృతకళాశాల, తెనాలి.

శ్రీ శఙ్కర భగవత్పాదులు సాక్షాత్ శఙ్కరావతారము. "జ్ఞానం మహేశ్వరాదిచ్ఛేత్" అను అభియుక్త వచనానుసారము ఆయన జ్ఞానోపదేష్ట. అట్టి దివ్యపురుషుని చరిత్రను బహుభాషాకోవిదులు, వివిధ దార్శనికముల తఱచి తారతమ్య వివేచనము చేసినవారు డా. శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు,M. A; Ph. D; ఈ శంకర చరితను ఆంధ్రలోకమునకు అందించుచున్నారు. ఇది ముదావహము.

శ్రీమచ్ఛంఙ్కర భగవత్పాదచరిత్ర (1) శంకర విజయములు (2) అవతార సమయము (3) గోవిందుని శిష్యుడు (4) కాశీనివాసము (5) అద్వైతవిజయము (6) కాంచీనివాసము (7) దిగ్విజయము (8) మతామ్నాయము (9) మహానుశాసనము (10) శాంకర దర్శనము అను పది ప్రకరణములతో అలరారుచున్నది శఙ్కరవిజయములు కావ్యమార్గమును ఆశ్రయించుటచేతను భిన్నరీతుల నవలంభించుటచేతను శాసనములవలె పూర్తిగా చరిత్రకాధారముగా స్వీకరించుటకు వలనుపడకున్నది. కనుక శఙ్కరులు రచించిన ప్రస్థానత్రయ భాష్యము ప్రకరణ గ్రంథములు ఆధారముగా చేసికొని శంకరుని జీవితచరిత్రను తెలిసికొనుటకు ప్రయత్నించుట సమఞ్జసము.

శ్రీ శఙ్కరులు తమ గ్రంథములందు ఉదహరించిన దార్శనికులు. క్రీ. శ. రెండుమూడు శతాబ్దములకు చెందినవారగుటచే క్రీస్తుకుపూర్వము వీరి ఆవిర్భావము నిర్ధరించుట సాధ్యముకాదు. బ్రహ్మసూత్రభాష్య

వ్యాఖ్యాత వాచస్పతిమిశ్రుడు క్రీ. శ. 841 సంవత్సరమునకు చెందిన వాడు. అంతకు పూర్వమే పఞ్చపాదికా రచనము పద్మపాదులవారిచే చేయబడి యుండుటచే శంకరుని జననసమయము క్రీ. శ. 740 సంవత్స రమునకు పూర్వమే అని వీరి అభిప్రాయము.

బహుశః క్రీ. శ. 7వ శతాబ్దిలోకానీ, లేదా, క్రీ. శ. 5వ శతా బ్దిలోకానీ వీరి జననసమయము కావచ్చును. జన్మస్థానము కేరళదేశము లోని 'కాలటి' అను అగ్రహారము, తరువాత గోవింద యోగీంద్రులకు శిష్యులగుట, విద్యాస్థాన కాశీనివాసాదులందు ఎవరికిని విప్రతిపత్తి లేదు. వీరు ఆసేతు హిమాచలము దిగ్విజయముచేసి ఔపనిషద మగు అద్వైతమతమును ప్రచారముచేసి వైదిక ధర్మప్రతిష్ఠాపనాచార్యు లయిరి.

శ్లో॥ 'అలిఙ్గక మచక్రాఙ్క మనాసవ మనస్థికమ్,
అనుచ్ఛిష్ట మరక్తార్ఘ్యం మత మేతద్ వ్యవస్థితమ్.

అన్నట్లుగా, శైవమతమందలి లిఙ్గధారణమును, వైష్ణవమతమందలి చక్రాఙ్కణమును, శాక్తమందలి ఆసవ (మద్య) సేవనమును,కాపాలిక మతమందలి అస్థి (ఎముక) మాలాధారణమును, గాణాపత్యమందలి ఉచ్ఛిష్ట సమాశ్రయణమును, సౌరమతమందలి రక్తము నర్ఘ్యమిచ్చు టయు మాన్పించి ఆ యా మతముల సంస్కరించి పూజావిధానాదులు వేరైనను అందఱికి ఉపాస్యుడు ఈశ్వరుడు ఒక్కడే అని నిరూపించి వైదిక మతమును సుప్రతిష్ఠిత మొనర్చిరి. శ్రుతిప్రతిపాదిత మగు జీవేశ్వరైకత్వమును యుక్తులతో అనుభవమునకు తెచ్చిన శ్రీ శఙ్కర భగవత్పాదులు నిఖిలలోక వంద్యులు. లోకశాన్తిని కూర్చిన మహాను భావులు. వారి దివ్యచరిత్ర జ్ఞానోదయమును కలిగించి శాన్తి సౌఖ్యము లతో లోకము నలరారునట్లు చేయుగాక.

సూరి రామకోటి శాస్త్రి.

శ్రీః

శ్లో॥ సదాశివ సమారంభాం విద్యాశంకర మధ్యమామ్,
కల్యాణానందపర్యంతాం వందే గురుపరంపరామ్.

శ్రీభగవత్పాదులు ఎప్పుడు ఎచ్చట జన్మించినారో తెలియదు. కాని శంకర విజయములు కొన్ని విషయములను వివరించినవి అవితప్ప మనకు లభించు ఆధారములు లేవు. ప్రతి పీఠాధిపతిని శ్రీ శంకరాచార్యులని పిలుచుటచేత, కొందరు పీఠాధిపతులు తమకు సమ్మతమైన రీతిగా ఆచార్య చరిత్రలను వ్రాయించుటచేత ఈ శంకరవిజయములు లోపభూయిష్ఠము లైనవి. ఇట్టి పరిస్థితులలో ఆచార్యుల చరిత్రను వ్రాయబూనుట సాహసకృత్యమే. పైగా శ్రీ శంకరులు చెప్పిరను స్తుత్యాదికముల వారే పల్కినారనుటలోకూడ సందేహమునకు తావుగలదు. కాని వారి సిద్ధాంతమునకు అనుగుణముగా కన్పించు స్తోత్రాద్యుపదేశములను స్వీకరించుటలో నష్టము కన్పించదు. ఈ యుపదేశములను శ్రమకోర్చి అనువదించిన మా గురువర్యుల పుత్రుడు, నా స్నేహితుడు నైన శ్రీ జనస్వామి సుబ్రహ్మణ్యశాస్త్రికి నా కృతజ్ఞతలు.

శ్రీమచ్ఛంకర భగవత్పాదచరిత్రను వ్రాయుట చాలకష్టము మన పూర్వులు నేటివారివలె గాక తమ జీవితములలోని విషయములను చాటుకొనలేదు. అందుచే నిట్టి చరిత్రలను వ్రాయుటలో మనకు ఆధారమైనవి వారి రచనలే కాని ఈ రచనలలో కొన్నింటిని వేరుగా వ్యాఖ్యానింపవలసి యున్నది. భజగోవింద పంక్తులు గురుస్తుతి యగుటయే సమంజసము. కనకధారా స్తవము కాశ్మీరమున గల కనకతారా నదీతీరమున నున్న శారదాంబా స్తవమే గాని స్వర్ణామలకములను కురిపించు స్తుతి కాజాలదు. కాశీనివాసఖండమున శ్రీ విద్యారణ్యుల చరిత్రలోని కొన్ని విషయములను శ్రీ శంకరుల కారోపించుటచే ఆచార్యుల రచనలనే ఆధారముగా గ్రహించుట జరిగినది. ఇట్లే అనేక రచనలను పూర్వులకంటె భిన్నముగా వ్యాఖ్య చేయవలసి వచ్చినది.

అద్వైత సిద్ధాంతమునకు భిన్నముగాని రచనలనే ఈ గ్రంథమున ఆచార్యవాక్యములుగా గ్రహించి, వాక్యవృత్తి మొదలగువాటిని పూర్తిగా సులభగ్రాహ్యమగు నటుల చేర్చుట, ఈ గ్రంథరచనలో గల ముఖ్యాశయము. ఉపనిషద్భాష్యములను, బ్రహ్మసూత్రభాష్యములను స్థలాభావముచే నివ్వజాలకపోయినను, ఆచార్యుల ప్రధాన సిద్ధాంతమును సూక్ష్మముగా ఈ గ్రంథమున గమనింపదగును. కేవలము వారివని నిర్దుష్టముగా పరిశోధించిన తర్వాతే ఆ యా కృతుల నిందు పొందుపఱచితిమి. ఈ రచనల నాధారముగా చేసికొని ఈ చరిత్రను వ్రాయుట జరిగినది. అందుచే లభ్యమగు శంకరవిజయములను చాలవరకు త్రోసిపేయవలసి వచ్చినది. శ్రీ భగవత్పాదుల కాలనిర్ణయమున గూడ క్రొత్తమార్గము నవలంబింపవలసి యుండుటచే నీ విషయములు కొందరకు ఆమోదయోగ్యములు కాకపోవచ్చును. కాని శ్రుత్యనుసారము "సత్యమేవ జయతే".

ఈ గ్రంథమును చదివి ఆమోదమును తెలియజేయుచు దయతో పీఠిక వ్రాసియిచ్చిన పండితవర్యులు బ్రహ్మశ్రీ సూరి రామకోటిశాస్త్రి గారికి కృతజ్ఞతాభివందనములు.

మిత్రులు శ్రీ బులుసు సూర్యప్రకాశ శాస్త్రిగారు శ్రీ భగవత్పాదుల రచనలను తెలుగువారికి అందజేయుచుండుటచే వారి జీవితచరిత్రను వ్రాయమని ఆదేశించిరి. తత్ఫలితమే ఈ గ్రంథము.

నాగపురం
24-2-1978

పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి

ముందలి మాట

శ్లో॥ నారాయణ సమారంభాం, శంకరాచార్య మధ్యమాం।
అస్మదాచార్య పర్యంతాం వందే గురుపరంపరాం ॥

విశ్వశ్రేయస్కరమైన గీతోపదేశము నందిచ్చుటచే శ్రీకృష్ణుడు జగద్గురువు. అఖిలవిశ్వతారకమైన యద్వైతసిద్ధాంతమును ప్రతిపాదించి అమూల్యములగు తన రచనలచే దానికి దీప్తి కలిగించిన శంకరాచార్యుడు జగద్గురువు. జగద్గురువులు పెరిద్దరే. తత్సంప్రదాయానుసారులైన పీఠాధీశ్వరు లందరును జగద్గురు నామాంకితులై భారతీయుల హృదయములలో పూజనీయులై విరాజిల్లుచున్నారు.

లోకమునకు స్వస్వరూపజ్ఞానమును గలిగించుటకు శంకరులవలె మహాయత్న మొనరించిన వా రితరులు కానరారు. ఇట్టి మహాస్వామి యొక్క చరిత్రము అద్వైత వేదాంతప్రతిపాదకములగు వారి మహాగ్రంథములకు దుల్యమై లోకమునకు సత్పథమును ప్రదర్శింపగల్గి యున్నదన్న యూహచే ప్రేరితులై విద్యారణ్యాదులైన మహామహులెందఱో ఆచార్య చరిత్రమును గీర్వాణవాణియం దుద్గ్రంథములుగ గ్రథించిరి.

"శంకరవిజయాభిధానములైన" యీ గ్రంథములు పాఠాంతరములతో గూడి చరిత్రలోని కల్పనారహితయథార్థాంశముల నుపదేశములతో గ్రహింపఁ గుతూహలులైన పాఠకుల మానసములను సంశయగ్రస్తములు గావించుచున్నవి.

కీ. శే. బ్ర. శ్రీ వేలూరి శివరామశాస్త్రిగారు- శంకరుల కాలనిర్ణయముతోగూడి విబుధప్రశంసాపాత్రమై యొప్పు శంకరచరిత్రము తెనుగునం దింతవరకునవతరించలేదు. సత్యమై యథార్థకథాశోభితమైన శంకరచరిత్రమును మహామనీషి మాత్రమె రచింపగలడు వృద్ధుడనై యుంటిని, నేనిపుడు దానికి పూనుకొనలేను.. అనుచుండెడివారు.

ఇపుడు మండలియందు బ్ర. శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి గారు రచించిన 'శ్రీమచ్ఛంకర భగవత్పాద చరిత్రము'ను ప్రకటించుచు శ్రీశాస్త్రిగారి మాటలను స్మరించుచున్నాను. శాస్త్రిగారు జీవించియున్నచో పోతుకూచివారి యీరచనను బహువిధముల శ్లాఘించి ఆనందించెడివారు.

మహామనీషులై శాంకరగ్రంథావళిని మథించి, శంకరవిజయము లను బహుముఖముల పరిశీలించి-ప్రాచ్యపాశ్చాత్య పండితవరేణ్యుల పలుకులలోని సారము నరసి-అన్నిటిని సమన్వయించి-శంకరచరిత్ర మున దోచు చిక్కులను సరిచేసి-బ్ర. శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్య శాస్త్రిగారీ గ్రంథమును రచించిరి

శంకరవిరచిత సమస్త గ్రంథజాతమును మూలానువాదములతో ప్రకటించుటకు సమకట్టి యింతవరకు 8 భాగములను "శంకరగ్రంథ రత్నావళి" యను పేర ప్రకటించిన మామండలి శ్రీ సుబ్రహ్మణ్య శాస్త్రిగారి ఆదరము కారణముగ శ్రీమచ్ఛంకరభగవత్పాద చరిత్రమును ప్రకటించు నధికముగా ముదమందుచున్నది. శ్రీ శాస్త్రిగారికి మా ధన్యవాదములు.

పీఠిక వ్రాసియిచ్చిన గురువర్యులు బ్రహ్మశ్రీ సూరి రామకోటి శాస్త్రిగారికి హృదయపూర్వకాభివందనములు. ఈ గ్రంథము యీ రూప మున వెలుగులోనికి వచ్చుటకు నాకు తోడ్పడిన మిత్రులు శ్రీ జనస్వామి సుబ్రహ్మణ్య శాస్త్రిగారికి కృతజ్ఞతలు।

తెనుగున శంకరచరిత్రమును వెల్లడించు గద్యపద్య గ్రంథము లనేకము లున్నవి. కాని అన్నిటియందు మండలి ప్రకటించుచున్న శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు రచించిన యీ శ్రీమచ్ఛంకర భగవత్పాద చరిత్ర సారసమున్నతమని పాఠకులే గ్రహింపగలరు.

తెనాలి
24-4-78

బులుసు సూర్యప్రకాశశాస్త్రి
వ్యవస్థాపకుడు : సాధన గ్రంథ మండలి.



శ్రుతిస్మృతి పురాణానా మాలయం కరుణాలయమ్।
నమామి భగవత్పాద శఙ్కరం లోకశఙ్కరమ్॥

శ్రీః

మాత్రేనమః

శ్రీమచ్ఛంకర భగవత్పాద చరిత్ర

1. శంకర విజయములు

శ్రుతిస్మృతిపురాణానా మాలయం కరుణాలయమ్।
నమామి భగవత్పాదం శంకరం లోకశంకరమ్॥
నారాయణసమారంభాం విద్యాశంకరమధ్యమామ్।
కల్యాణానందపర్యంతాం వందే గురుపరంపరామ్॥

శ్రీమచ్ఛంకర భగవత్పాదులు అవతారపురుషులు. దేశము రాజకీయముగా కల్లోలపరిస్థితులలో నున్నసమయమున వివిధ దార్శనికులు, మతప్రచారకులు అశాంతికి బాగుగా దోహదము చేసిరి. భారతీయ సంప్రదాయమునకు ఆధారభూత మగు వైదిక వాఙ్మయమును సరిగా అధ్యయనము చేయువారు గాని, వ్యాఖ్య నొసంగగలవారు గాని చాల కొద్దిమంది యుండుటచే సంప్రదాయము పూర్తిగా లుప్తము కాగల పరిస్థితు లేర్పడినవి. క్రీ.పూ. ఆరవ శతాబ్దమున బయలుదేరిన జైన బౌద్ధ మతములు శాలివాహనశకారంభమునకు ప్రవేశ్యవేసి నిలబడసాగినవి. నాగార్జునాదులు ఆంధ్రదేశమున మాధ్యమిక బౌద్ధమతమును లేవదీసిరి నాగార్జునకొండప్రాంతము, ధాన్యకటకము, శ్రీశైలము వీరి ప్రధాన కేంద్రము లైనవి. మూడవ శతాబ్దమున విజ్ఞానవాద బౌద్ధము మైత్రేయ, అసంగ, వసు

బంధులతో బయలుదేరి, నాల్గవ శతాబ్దమున వేంగీనగరమున గల దిఙ్నాగుని రచనలలో, వాదములలో పటిష్ఠమైనది. ఇదే సమయమున న్యాయసూత్రభాష్యకర్త యగు వాత్స్యాయనుడు మాధ్యమికమును, న్యాయవార్తికకారుడగు, ఉద్ద్యోతకరులు విజ్ఞానవాదము యొక్క తొలి రూపమును విమర్శించిరి. కాని ప్రచండమైన బౌద్ధతర్కమును ఎదుర్కొనుటయే గాక వైదిక వాఙ్మయము యొక్క ప్రామాణ్యమును స్థాపించుట కూడ అవసరమైనది. ఈ కృషి నైయాయికులను మించినది. ఈశ్వరకృష్ణుని సాంఖ్యకారికలు కూడ ఇందుకు చాలలేదు.

శ్రీశంకరులు ఆవిర్భవించిననాటికి దేశమున అనేక విచ్ఛిన్నశక్తులు తల ఎత్తినవి. సూత్రభాష్యమున వైనాశికులు చెలరేగి యున్నారని చెప్పబడినది. వైదికవాఙ్మయమును చెండాడి, సంప్రదాయమును ధ్వంసము గావించువారందరును వైనాశికులే అను భావము కలుగక మానదు. ప్రశస్తపాదుని భాష్యము జడపదార్థమున కెక్కుడు ప్రాధాన్యము నిచ్చినది. సాంఖ్యకారిక ప్రకృతి పురుషులను సామరస్యమును కుదర్చలేకపోయినది. ఐనను ఉపనిషత్తుల మీద, బ్రహ్మసూత్రముల మీద సాంఖ్యమతమున కనుగుణమైన వ్యాఖ్యలు, వివరణలు విరివిగా ప్రచారములోనికి వచ్చినవి గనుకనే శారీరకభాష్యమున ప్రధాన పూర్వపక్షము ప్రధానవాదులది. దార్శనిక దృక్పథము విభిన్న వాదములతో కల్లోలితమై యుండుటయే గాక, తాంత్రికాది

వాదములు కూడ బయలువెడలినవి. బౌద్ధులలో వజ్రయానము, ఇతరులలో ఆభిచారికాది క్రియల కనుగుణమైన తాంత్రికమార్గము విచ్చలవిడిగా నున్నవి. ఈ పరిస్థితులలో వైదిక మతానుయాయులు-

"ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే"

అని శ్రీకృష్ణుని వాక్యమును స్మరించుకొనుచు, యుగపురుషుని అవతారము కొరకు ఎదురుచూచుచుండిరి.

దుష్టాచారవినాశాయ ప్రాదుర్భూతో మహీతలే।
స ఏవ శంకరాచార్యః సాక్షాత్ కైవల్యనాయకః॥

అని ఒక శాసనమున, శివరహస్యమున ఉన్నది. దుష్టాచారములను నశింపజేయుటకు కైవల్యనాయకుడగు శంకరుడే భగవత్పాదుల రూపమున అవతరించె ననిరి.

కరిష్య త్యవతారం స్వం శంకరో నీలలోహితః।
శ్రౌతస్మార్తప్రతిష్ఠార్థం భక్తానాం హితకామ్యయా॥

అని కూర్మపురాణమున గలదు. శ్రౌతస్మార్తక్రియలను సుప్రతిష్ఠితము చేసి, వైదికమార్గమును సక్రమముగా నిలబెట్టుటకు నీలలోహితుడే స్వయముగా శంకరాచార్య రూపమున అవతరించె ననినారు.

ఇట్టి అవతారపురుషుని గూర్చి పురాణములు వ్రాయుటకు ఇతివృత్తము కుదరకపోవుటచే పౌరాణికులు సంక్షిప్తముగా చెప్పిరి. తర్వాతివారు కావ్యధోరణిలో శంకర

విజయములను వ్రాసిరి. శాంకరాద్వైతు లగు స్మార్తుల కందరకు శంకరుడే గురుస్థానమున పూజనీయు డగుటచేతను, ప్రధాన పీఠాధిపతుల నందరను శంకరాచార్యనామముతో వ్యవహరించుట చేతను, అర్వాచీనులు శంకరవిజయకావ్యము లను వ్రాయుచు, తాము ఆచార్యులవారి శిష్యుల మని చెప్పు కొనినారు. కొందరు శంకరుని తమ పరమగురువుగా కొని యాడినారు, కొందరు ఆ యా పీఠాధిపతులచే ఈ గ్రంథ ములను రచించుటకు నియమింపబడినవారు. ఈ రీతిగా అనేక శంకరవిజయములు వెలసినవి. వీటిలో ఏవి ఎంతవరకు నిర్దుష్ట ములో తెలిసికొనినప్పుడే శంకరుని చరిత్రను సరిగా అవ గాహన చేసికొనుటకు వీలగును.

శంకరుని జీవితచరిత్రను తెలుపునవియు, అందుకు ఉపయోగించునవియు నగు గ్రంథములు ఈ రీతిగా పేర్కొనబడినవి.

1. చిత్సుఖుడు వ్రాసిన బృహచ్ఛంకర విజయము.
2. ఆనందగిరి రచించిన శంకరవిజయము. డిండిమ టీకా కారుని ప్రకారము ఆనందజ్ఞాననామము గల ఆనందగిరి, బృహచ్ఛంకరవిజయమును వ్రాసెను.
3. విద్యాశంకరు డనబడు శంకరానందుడు రచించిన శంకరవిజయము. ఈ శంకరానందుడే వ్యాసాచలుడు.
4. గోవిందనాథరచిత శంకరవిజయము. దీనిని ఆచార్య చరిత్ర మని, కేరళీయ శంకరవిజయ మని కూడ పిలతురు.

5. రాజచూడామణిదీక్షితుని శంకరాభ్యుదయము.
6. అనంతానందగిరికృత మగు శంకరవిజయము. ఇదే ఆనందగిరికృత శంకరవిజయ మని ప్రచురింపబడినది.
7. సదానందుని శంకర దిగ్విజయసారము.
8. చిద్విలాసుని శంకరవిజయవిలాసము.
9. మాధవుడని పిలువబడు నవకాళిదాసు వ్రాసిన శంకర దిగ్విజయము. దీనిని సంక్షేపశంకరదిగ్విజయ మని మాధవుడే వ్యవహరించినాడు.
10. వల్లీసహాయవిరచిత ఆచార్యదిగ్విజయము. వ్రాతప్రతి ఉన్నది.
11. మూకశంకరుని ప్రాచీనశంకరవిజయము.
12. వ్రాతప్రతిగా ఉన్న శంకరవిజయకథ.
13. శంకరదేశికేంద్రుని శంకరవిజయవిలాసకావ్యము వ్రాతపతి.
14. శ్రీశంకరాచార్యచరిత్ర. వ్రాతపతి.
15. ఆనందతీర్థుని శ్రీశంకరాచార్య అవతారకథ. వ్రాతప్రతి.
16. శ్రీశంకరాచార్యోత్పత్తి. వ్రాతప్రతి.
17. హింగోలి గోపాలశాస్త్రి వ్రాసిన గురువరంపరాచరిత్ర.
18. నృజరాజవిరచిత శంకరవిజయసారము.
19. కేరళోత్పత్తి.

20. నీలకంఠనంబి వ్రాసిన శ్రీశంకరాచార్యచరిత్ర.
21. వేదాంతచూర్ణిక
22. వాసనాదేహస్తుతి
} ఇవి శంకరవిరచితము లని కొందరు.
23. జగన్నాథుని శంకరవిలాసచంపు.
24. రామకృష్ణుని శంకరాభ్యుదయకావ్యము.
25. లక్ష్మణశాస్త్రి వ్రాసిన గురువంశకావ్యము.
26. విద్యారణ్యుని శంకరవిలాసము. వ్రాతప్రతి.
27. గురుస్వయంభూనాథుని శంకరానందచంపు. వ్రాతప్రతి.
28. రామభద్రదీక్షితుని పతంజలివిజయము.
29. వాక్పతిభట్టు వ్రాసిన శంకరేంద్రవిలాసము.
30. సర్వజ్ఞసదాశివబోధవిరచిత పుణ్యశ్లోకమంజరి.
31. ఆత్మబోధరచిత పుణ్యశ్లోకమంజరి.
32. సదాశివబ్రహ్మేంద్రుని గురురత్నమాల. ఇది గురువంశ కావ్యము.
33. గురురత్నమాలపై ఆత్మబోధుని వ్యాఖ్య అగు సుషమా.
34. స్వయంప్రకాశుని ప్రభావిమర్శిని.
35. చిత్సుఖుని మఠామ్నాయసేతు. ఇది చిత్సుఖుని బృహచ్ఛంకర విజయములోని పదమూడవ ప్రకరణ మని యందురు. ఇందు కాంచీమఠప్రసక్తి ఉన్నది.
36. కవిరాజ రాజగోవింద శ్రీసుదర్శనసరస్వతి వ్రాసిన జగద్గురుపరంపరాస్తుతి.

37. శివరామసూరి రచించిన శ్రీముఖదర్పణము.
38. గుఱ్ఱం వెంకన్న శాస్త్రి రచించిన శ్రీముఖవ్యాఖ్య.
39. రామానుజఅయ్యంగారి సిద్ధాంతపత్రిక.
40. అభినవోద్దండవిద్యారణ్యభారతి వ్రాసిన విద్యాశంకర విజయము.
41. శంకరవిజయసంగ్రహము.
42. ఆచార్యవిజయము.
43. జగద్గురుకథాసంగ్రహము.

ఇన్ని గ్రంథములు ఉపకారకము లనినచో ఆచార్యచరిత్రను వేలికగా వ్రాయవచ్చు నను భ్రమ కలుగుటకు అవకాశ మున్నది. కాని వీటిలో 28వ పుస్తకము నుంచి ఉన్నవాటిని ప్రామాణికముగా చాలమంది అంగీకరించరు. వీటితో బాటు ఆయా స్థలములలో ఆచార్యులవారి ప్రసక్తి గల గ్రంథము లలో నీక్రిందివి కూడ కలవని కొందరనిరి.

1. శ్రీహర్షుని నైషధీయచరిత.
2. హరిమిశ్రుని గౌడపాదోల్లాసము
3. మంథావిరచిత సిద్ధవిజయమహాకావ్యము.
4. కృష్ణమిశ్రుని గురువిజయము.
5. సద్గురుసంతానపరిమళము.
6. హయగ్రీవవధ.
7. రమిలుని మణిప్రభ.

8. సుహాలుని విద్యాభిధానచింతామణి.
9. సర్వజ్ఞాత్మ వ్రాసిన సర్వజ్ఞవిలాసము.
10. భవభూతి రచించిన మహాపురుషవిలాసము.
11. జయదేవుని భక్తికల్పలతిక.
12. అద్వైతానందుని శాంతివివరణము.
13. అద్వైతానందుని గురుప్రదీపము.
14. శ్రీహర్షుని శివశక్తిసిద్ధి.
15. శ్రీహర్షుని స్థైర్యవిచారణప్రకరణము.
16. కల్హణుని రాజతరంగిణి.
17. శంకరానందుని బృహదారణ్యకోపనిషద్దీపిక.

నైషధీయమున గల శ్లోకములో యాగ శబ్దమును యోగ శబ్దముగా పఠించి, ఇందు యోగలింగప్రసక్తి గలదని అందురు. కాని నైషధీయవ్యాఖ్యాత లందరును యాగ శబ్దమునే వ్యాఖ్యానించుటచే యోగలింగప్రసక్తి ఇచట లేదు.

మొదటి 43 గ్రంథములలోను 19, 21, 22, 42, 43 పుస్తకముల విషయమున, సద్గురుసంతానపరిమళ విషయమున మనకు గ్రంథకర్త లెవరో తెలియదు. అప్రసిద్ధమైనవి లేక సందేహాస్పదమైనవి, మనకు తెలియనివి 11, 12, 13, 15, 34, 40, 41 అను సంఖ్యలు గలవి. వీటి కోవకే చెందినవి రెండవ జాబితాలోని 2, 3, 6, 7, 8 సంఖ్యలు

గలవి. అనుపలబ్ధ గ్రంథములు, ప్రసిద్ధపురుషుల పేర్లతో ప్రచురింపబడినవి. మొదటి జాబితాలోని 1, 2, 9 సంఖ్యలు గలవి, రెండవజాబితాలోని 4, 9, 10, 11, 12, 13, 14, 15 సంఖ్యలతో నున్నవి. మొదటిజాబితాలో 2 నుంచి 10, 17, 18, 20, 28, 30 నుంచి 38, 39 సంఖ్యలు గల గ్రంథములే మనకు ఉపలబ్ధము లగుచున్న గ్రంథములు. ఆచార్య జీవితచరిత్రకు ఏమాత్రమైన ఉపకరించగలవి మాత్రమే కాని వీటిని సమగ్రముగా పరిశీలించినచో ఇవి ఎంతవరకు ప్రామాణికములో తెలియగలదు.

చిద్విలాసుని శంకరవిజయవిలాస మొకటి ఉన్నది. కాంచీమఠమునకు 27వ అధిపతియైన ఒకచిద్విలాసయతి (క్రీ. శ. 564-577) గలడు. తర్వాత 48వ అధిపతిగా అద్వైతానందబోధ అనబడు చిద్విలాసుడు (1166-1200) ఉండెను. ముద్రితశంకరవిజయవిలాసమున గ్రంథకర్త తను పీఠాధిపతి నని చెప్పుకొనలేదు. నాలుగు ఆమ్నాయమఠముల ప్రసక్తే ఇచట గలదు. కాంచీసర్వజ్ఞపీఠమును శంకరు డధిరోహించె నని, బదరికాశ్రమములోని దత్తాత్రేయగుహ నుంచి శంకరుడు కైలాసమున కేగెనని ఇచట కలదు.

నారదుడు బ్రహ్మను, బ్రహ్మ శివుని అర్థించగా భూలోకమున జన్మించుటకు శివు డంగీకరించెను. శంకరుడు వైశాఖ మాసమున, ఆర్ద్రానక్షత్రమున మధ్యాహ్నవేళ జన్మించెను. ఐదవ యేట తండ్రి స్వయముగా ఉపనయనము

8. సుహలుని విద్యాభిధానచింతామణి.
9. సర్వజ్ఞాత్మ వ్రాసిన సర్వజ్ఞవిలాసము.
10. భవభూతి రచించిన మహాపురుషవిలాసము.
11. జయదేవుని భక్తికల్పలతిక.
12. అద్వైతానందుని శాంతివివరణము.
13. అద్వైతానందుని గురుప్రదీపము.
14. శ్రీహర్షుని శివశక్తిసిద్ధి.
15. శ్రీహర్షుని స్థైర్యవిచారణప్రకరణము.
16. కల్హణుని రాజతరంగిణి.
17. శంకరానందుని బృహదారణ్యకోపనిషద్దీపిక.

నైషధీయమున గల శ్లోకములో యాగ శబ్దమును యోగ శబ్దముగా పఠించి, ఇందు యోగలింగప్రసక్తి గలదని అందురు. కాని నైషధీయవ్యాఖ్యాత లందరును యాగ శబ్దమునే వ్యాఖ్యానించుటచే యోగలింగప్రసక్తి ఇచట లేదు.

మొదటి 43 గ్రంథములలోను 19, 21, 22, 42, 43 పుస్తకముల విషయమున, సద్గురుసంతానపరిమళ విషయమున మనకు గ్రంథకర్త లెవరో తెలియదు. అప్రసిద్ధమైనవి లేక సందేహాస్పదమైనవి, మనకు తెలియనివి 11, 12, 13, 15, 34, 40, 41 అను సంఖ్యలు గలవి. వీటి కోవకే చెందినవి రెండవ జాబితాలోని 2, 3, 6, 7, 8 సంఖ్యలు

గలవి. అనుపలబ్ధ గ్రంథములు, ప్రసిద్ధపురుషుల పేర్లతో ప్రచురింపబడినవి. మొదటి జాబితాలోని 1, 2, 9 సంఖ్యలు గలవి, రెండవజాబితాలోని 4, 9, 10, 11, 12, 13, 14, 15 సంఖ్యలతో నున్నవి. మొదటిజాబితాలో 2 నుంచి 10, 17, 18, 20, 28, 30 నుంచి 33, 39 సంఖ్యలు గల గ్రంథములే మనకు ఉపలబ్ధము లగుచున్న గ్రంథములు. ఆచార్య జీవితచరిత్రకు ఏమాత్రమైన ఉపకరించగలవి మాత్రమే కాని వీటిని సమగ్రముగా పరిశీలించినచో ఇవి ఎంతవరకు ప్రామాణికములో తెలియగలదు.

చిద్విలాసుని శంకరవిజయవిలాస మొకటి ఉన్నది. కాంచీమఠమునకు 27వ అధిపతియైన ఒకచిద్విలాసయతి (క్రీ. శ; 564-577) గలడు. తర్వాత 48వ అధిపతిగా అద్వైతానందబోధ అనబడు చిద్విలాసుడు (1166-1200) ఉండెను. ముద్రితశంకరవిజయవిలాసమున గ్రంథకర్త తను పీఠాధిపతి నని చెప్పుకొనలేదు. నాలుగు ఆమ్నాయమఠముల ప్రసక్తి ఇచట గలదు. కాంచీసర్వజ్ఞపీఠమును శంకరు డధిరోహించె నని, బదరికాశ్రమములోని దత్తాత్రేయగుహ నుంచి శంకరుడు కైలాసమున కేగెనని ఇచట కలదు.

నారదుడు బ్రహ్మను, బ్రహ్మ శివుని అర్థించగా భూలోకమున జన్మించుటకు శివు డంగీకరించెను. శంకరుడు వైశాఖ మాసమున, ఆర్ద్రానక్షత్రమున మధ్యాహ్నవేళ జన్మించెను. ఐదవ యేట తండ్రి స్వయముగా ఉపనయనము

చేసెను. వివాహము చేయ వలెనని సంకల్పించు ఏర్పాట్లు చేయుచుండగా తండ్రి మరణించె నని ఏడవ అధ్యాయమున కలదు. ఈ విషయము నితర శంకరవిజయములు తెల్పక పోవుటయేగాక, ఉపనయనాత్పూర్వమే శంకరునకు పితృ వియోగము కల్గె ననుచున్నవి.

గోవిందభగవత్పాదుడు బదరీవనమున ఉండగా శంకరు డాయనను కలసికొనె నని, సన్న్యాసదీక్ష నొసగి ప్రస్థానత్రయభాష్యములకు ప్రేరణ చేసెనని తొమ్మిదవ అధ్యాయమున గలదు. ప్రయాగలో హస్తామలకుడు శిష్యు డాయెను. కాశీలో వ్యాసు డీయన నాశీర్వదించి పదు నారేండ్లిచ్చెనని పదునాలుగవ అధ్యాయమున గలదు. రుద్రా నగరమున కుమారిలుని కలసి, అతడు చెప్పుటచే మండనుని జయించ దలచి కాశ్మీరమున కేగి, అచట మండనుని జయించె నని పదునేడు, పదునెనిమిది అధ్యాయముల కథ. తర్వాతి రెండు అధ్యాయములలో పరకాయప్రవేశగాథ ఉన్నది. స్వల్పభేదములతో ఇదే కథ ఇతర స్థలములందు కూడ కన్పించును.

అనంతానందగిరి ఒక శంకరవిజయమును వ్రాసెను. ఇది ఆనందగిరి విరచితముగా ప్రసిద్ధి కెక్కినది. మొదటి ముప్పదిమూడు ప్రకరణముల గద్యలో రచయిత పేరు అనంతానందగిరి అని, మిగిలిన నలుబదియొక్క ప్రకరణ ముల గద్యలో గ్రంథకర్త ఆనందగిరి అని ఉన్నది. లేఖకుల

ప్రమాదములతో నిండిన దగుటచే ఈ పొరబాటు దొర్లిన దని చెప్ప వీలులేదు. ఈ గ్రంథమున నిష్పాక్షిక చరిత్ర కలదనుటకు వీలులేదు. శంకరభాష్యములపై టీకలను వ్రాసిన ఆనందగిరికి ఆనందజ్ఞాను డను పేరున్నది. ఈయన శ్రీ శుద్ధానంద భగవత్పూజ్యపాదశిష్యుడు. న్యాయ రత్న దీపావళీ వ్యాఖ్యలో తాను కళింగ దేశపు మహారాజగు నృసింహుడు నిర్మించిన ఆశ్రమమున ఈ వ్యాఖ్యను వ్రాసి నట్లు చెప్పికొనినాడు. ఆనందగిరి గురువగు శుద్ధానందుడే చిత్సుఖుని గురువు కూడ. వీరిరువురు క్రీ.శ. 1200 ప్రాంతము వారు. కాని అనంతానందగిరి యగు ఆనందగిరి పదునాల్గవ శతాబ్దము తర్వాతివాడే గాని పూర్వుడు కాడు. అనంతా నందగిరి వ్రాసిన శంకరవిజయము పదకొండవ ప్రకరణమున భారతీతీర్థుని అధికరణమాలలో కన్పించు శ్లోకము ఉదహరించ బడినది.

ఈ శంకరవిజయమున గల కొన్ని శ్లోకములు మాధవీయ శంకరవిజయమున కలవు. ముఖ్యముగా మండ నుని ఇంటికి పోవు సందర్భమున చెప్పబడిన శ్లోకములు గను నార్హములు. ఈ రెంటికి మూలగ్రంథము వేరే గలదని చెప్పుటకు అవకాశములు చాల గలవు.

అనేక శంకరవిజయములలో శంకరుని నిర్యాణ స్థలము హిమాలయములలో నిర్దేశింపబడినది. కాని ఇచటి 63వ ప్రకరణమున శంకరుడు శృంగేరీవిద్యాపీఠమున పండ్రెండు సంవత్సరము లుండి, తర్వాత ఆ పీఠమునకు

సురేశ్వరుని అధిపతిగా నియమించినట్లు ఉన్నది. పిమ్మట శంకరుడు కంచికి వచ్చి స్థిరపడె నని, అచటనే నిర్యాణ మందెనని చెప్పబడినది. కంచిలో శంకరుడు తన కొరకు పీఠమును నిర్మించు కొనె నని స్పష్టముగా పల్కిన గ్రంథమిది. కాని దీనిలోని ఈ పంక్తులను గమనింపవలెను.

> అనంతానందగిరిరహం అప్రతిహతాజ్ఞస్య భగవతః శిష్యః స్వగురోరవతార ప్రయోజనం వర్ణయామి, సంత్యత్రమమ పరమగురోః"

అని మొదటి ప్రకరణమున గలదు. శంకర భగవత్పాదుల శిష్యుడ నని, తన గురువుగారి అవతారకథను రచింపనుంటి నని పలికి, వెంటనే ఆగురువుగారిని పరమగురువుగా చెప్పినాడు. ఇంతకు మించిన విస్తారము ఇంకొకటి ఉండదని అనుకొనవచ్చును.

ఇక గ్రంథములోని విషయములను గమనింతము. సర్వజ్ఞునకు కామాక్షికి కలిగిన పుత్రిక విశిష్ట. ఈమె విశ్వజిత్ అనువానిని పెండ్లి యాడెను. సంతానమునకై అరణ్యములో తపస్సును భర్త చేయగా, ఆమె చిదంబరమున పూజ నారంభించెను. వారికి చిదంబరమున జన్మించినవాడు శంకరుడు. శంకరవిజయగ్రంథాలలో ఒకటి కేరళలోని శశల గ్రామమును, మిగిలినవి కాలటిని శంకరుని జన్మస్థాన మని చెప్పగా, అనంతానందగిరి మాత్రము చిదంబర మని పల్కుట విచిత్రమే. మూడవ యేట చౌలము, ఐదవ యేట మౌంజీబంధనము, ఎనిమిదిన సన్యాసము చెప్పినారు.

శంకరుని కాలమున శైవులు, రౌద్రులు, ఉగ్రులు, భట్టులు, జంగములు, పాశుపతులు అను ఆరు విధముల శైవు లున్నారని చెప్పుటయే గాక, లింగాంకితభుజములు గలవారి ప్రసక్తి ఉన్నది. ఈ లింగాయతులు అర్వాచీనులు. వీరి ప్రసక్తి ఎనిమిదవ శతాబ్దమున కూడ కన్పించదు. నాల్గవ ప్రకరణమున శైవమత నిబర్హణము కలదు. కాని ఐదవ ఆరాధ్యుల ప్రమేయ మున్నది. ఈ ప్రకరణమున "ప్రథమ శాఖా బ్రాహ్మణే శతపథే" అని ఉండుటలో ప్రథమశాఖా శబ్దమున ఆంధ్రదేశీయవ్యవహారము కన్పించుచున్నది. ఆరవ ప్రకరణమున "ఊర్ధ్వపుండ్ర శంఖచక్ర గదాపద్మాది చిహ్నిత స్తులసీమాలికా బద్ధగలః" అని చెప్పినప్పుడు శ్రీవైష్ణవుల తర్వాతనే శంకరుడు జన్మించినట్లు ద్యోతక మగును. ఇది చారిత్రక విషయముల నన్నింటిని విరోధించు నది. ముద్రాదిధారులగు వైష్ణవులు ఏడవ ప్రకరణమున, వైఖానసులు తొమ్మిదవ, కర్మవిహీన వైష్ణవము పదిలోను ప్రస్తావించబడినది.

అనంతానందగిరి ప్రస్తావించిన మతములు చాలా ఉన్నవి. వీటిని అన్నిటిని శంకరుడు ఖండించె నట! హైరణ్య గర్భ (11), అగ్ని (12), సౌర (13) మతములను, నాల్గు విధములగు గణపతిమతములను (15–18) ఖండించుట కలదు. ఇవి మాత్రమే గాక ఇంకను ముప్పది మూడు మతము లున్నవి. వీటిలో సౌగతులు (26), బౌద్ధులు (28), శూన్య వాదులు (36), క్షపణకులు (46) కలరు. మల్లారి, విష్వక్సేన,

మన్మథ, కుబేర, ఇంద్ర, యమ, వరుణ (29-35), వరాహ (37), గుణ, సాంఖ్య (39-40), చంద్ర, రాహు (44-45), శేషగరుడ, సిద్ధ, గంధర్వభూతవేతాల (48-51) మతముల నిరాకరణ ఉన్నది. చార్వాకమతము (25), లోకమతము (38) కూడ విమర్శింపబడినవి. దీనినిబట్టి అనంతానందగిరికి దార్శనికజ్ఞానము సరిగా లేదని స్పష్టము కాగలదు. సౌగత, బౌద్ధ, శూన్యవాద, క్షపణకమతములు విడివిడిగా ఎందుకు పేర్కొనబడవలసి వచ్చినదో తెలియదు. వీటిలో కొన్ని పర్యాయపదములని కూడ ఈ గ్రంథకర్తకు తెలియదు. సాంఖ్యమతమునకు గుణమతమునకు మధ్య ఎట్టి భేదమున్నదో వివేచింపలేదు. మల్లారి, విష్వక్సేన, కుబేర, ఇంద్ర, యమ, వరుణ, చంద్ర, రాహు, శేషగరుడాదుల మతములను అనుసరించినవారు కలరనుట సత్యదూరమే. లోకమత మేవిధముగా చార్వాకమో ఈ అనంతానందగిరికి తెలియదు. ఇట్టి గ్రంథకర్త తాను శ్రీ శంకరభగవత్పాదుల శిష్యుడనని చెప్పుకొనుట విశ్వసనీయము కాదు. కొందరు విమర్శకు లితడు మధ్వు డనినారు. మొత్తము మీద అనంతానందగిరి వ్రాసిన శంకరవిజయము ఎంతమాత్రము విశ్వసింపదగిన గ్రంథము కాదు. ఇతర శంకరవిజయములతో ఇది ఏకీభవించు సన్నివేశములను మాత్రమే మనము సమీక్షింపవచ్చును.

పురాణములలో శంకరాచార్యుని జీవితచరిత్ర కొంత కన్పించుచున్నది.

"ఇతి శ్రుత్వా వీరభద్రో రుద్రః సంహృష్టమానసః।
స్వాంశం దేహ త్సముత్పాద్య ద్విజగేహ మచోదయత్॥
విప్రభైరవద త్తస్య గేహం గత్వా స వై శివః।
తత్పుత్రో౽భూ త్కలౌ ఘోరే శంకరో నామ విశ్రుతః॥
స బాలశ్చ గుణీ వేత్తా బ్రహ్మచారి బభూవ హ।
కృత్వా శంకరభాష్యం చ శైవమార్గ మదర్శయత్॥"

అని భవిష్యపురాణమున శివాంశతో శంకరుడు జన్మించె నని, అతని తండ్రి భైరవదత్తు డని, తన రచనల ద్వారా శైవమార్గమును చూపె నని కలదు. శాంకరాద్వైతమును శైవమార్గ మనుట ఒక అసత్యవచనము. శంకరుని తండ్రి పేరు ఇతరగ్రంథములలో నున్నట్లు ఇచట ఇవ్వబడలేదు. శివగురు వను శబ్దము కూడ వాస్తవనామము గాదని, శంకరుని తండ్రి యగుటచే ఆయనకు శివగురు వను పౌరుష నామ మేర్పడె నని చెప్పవీలున్నది. ఇట్లే ఆర్యాంబ, సతి అను పేర్లు గల శంకరుని తల్లి యొక్క వాస్తవ నామము మనకు తెలియదు. దీనిని ఆసరా చేసికొని విశిష్టా విశ్వజిత్తుల కుమారుడని అనంతానందగిరి, భైరవదత్తుని పుత్రుడని భవిష్యపురాణము పలుక గల్గెనవి. ఇది ఊహాగానమే కాని అన్యము కాజాలదు.

మాధవీయశంకరవిజయ మొకటి యున్నది. మొట్ట మొదట ముద్రితమైన శంకరవిజయము లలో నిది యొకటి. దీనిని వ్రాసినవాడు మాధవు డని యుండుటచే, మాధ

వీయము లని విద్యారణ్యరచనలు కొన్ని ప్రచారములో నుండుటచే, ఇది విద్యారణ్యవిరచిత మని పలువురు భ్రమ పడిరి. అందుచేత ఈ గ్రంథమును గూర్చి కొంత వివేచించుట అవసరము. అనేక మాధవీయ రచనల వలెనే

"ప్రణమ్య పరమాత్మానం శ్రీవిద్యాతీర్థరూపిణమ్
ప్రాచీనశంకరజయే సారః సంగృహ్యతే స్ఫుటమ్"

అని ప్రారంభమునసే మాధవీయ మనబడు శంకరవిజయము లో కలదు. ప్రాచీన శంకరవిజయమున కిది సారము. ప్రతి సర్గ చివర-

"సంక్షేపశంకరజయే సర్గోఽయం ప్రథమోఽభవత్"

ఇత్యాది పంక్తు లున్నవి. మొదటి సర్గలో రెండవ శ్లోకమున "మదీయో లఘుసంగ్రహోఽస్మిన్" అని కలదు. ఇది సంక్షిప్త గ్రంథము. దీని మాతృక ఇతరుల రచన లేక రచనలు అని చెప్పుటకు ఆధారము లనేకము లున్నవి. మాధవీయ టీకాకారుడగు శ్రీ అచ్యుతపండితుడు క్రీ. శ. 1824 ప్రాంతమువాడు. ఈటీకలో ఒకచోట--

"ఏతత్కథాజాలం బృహచ్ఛంకరవిజయ ఏవ శ్రీమదానంద
జ్ఞానాభిధానానందగిరిరచితే ద్రష్టవ్య మితి దిక్"

అని వ్రాసినాడు. ఆనందగిరినే ఆనందజ్ఞాను డనినారు. ఈయన బృహచ్ఛంకరవిజయమును వ్రాసెనని, అది అచ్యుత పండితునకు లభ్యమైన గ్రంథమని తెలియుచున్నది. ఇతనికి

ముందు క్రీ. త. 1799 ప్రాంతమువాడగు ధనపతిసూరి డిండిమ మను వ్యాఖ్యను రచించినాడు. ఇతని టీకలో కూడ

"ఇతి ప్రాచీనవిజయోక్తేః"

ఇత్యాది వచనము లున్నవి. ఆనందగిరి యనబడు ఆనంద జ్ఞాని రచించిన శంకరవిజయము అముద్రితము. ప్రస్తుతము లభించు ఆనందగిరి శంకరవిజయము అనంతానందగిరి వ్రాత.

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు 1921 డిసెంబరు 17న ఆంధ్రపత్రికలో ఈమాధవీయశంకరవిజయమును మాధవుడు వ్రాయలేదని, పందొమ్మిదవ శతాబ్దపు భట్ట శ్రీనారాయణశాస్త్రి ప్రభృతులు వ్యాసాచలీయ శంకరవిజయము నాధారముగా చేసికొని రచించిరని అనినారు. తర్వాత ఒక వారమునకు ఇది 19వ శతాబ్దపు రచన కాజాలదని సరిదిద్దు కొనినారు. 1799వ సంవత్సరమునకే ప్రచారములో నున్న మాధవీయ శంకరవిజయము అంతకు కనీస మొక ఏబది సంవత్సరముల పూర్వమే రచింపబడి యుండవలెను గనుక ఇది 1750కి తర్వాత వచ్చిన గ్రంథమని చెప్ప వీలు పడదు.

శ్రీ సదానందవ్యాస విరచితమైన శంకరవిజయ సారమున 17వ అధ్యాయములో 68 వ శ్లోకమున ఈ గ్రంథ రచనాకాలము 1836 విక్రమ సంవత్సర మని చెప్పబడినది. ఇది క్రీ. త. 1779 కి సరిపోవును. ఇది కూడ ప్రాచీన శంకరవిజయమునకు సంక్షేపరూప మగు గ్రంథమే. పదు

నెన్మిదవ శతాబ్దములో సంక్షేపశంకరవిజయములు బయలు దేరిన వని చెప్ప వీలగు నని భావము. మాధవ, సదానందులు దాదాపు ఒకే శతాబ్దమున ఒకే విధముగు రచనలను గావించి రనుటకు మనకు కొన్ని ఇతర ఆధారము లున్నవి.

ఈమాధవీయ శంకరవిజయమున శ్రీవిద్యారణ్యుని సహజశైలి కన్పించదు. ఈ గ్రంథకర్త తనను 'నవకాళిదాసు'అని పిలుచుకొనినాడు.

"ప్రౌఢోఽయం నవకాళిదాసకవితాసంతాన సంతానకో
దద్యా దద్య సముద్యతః సుమనసా మామోదపారంపరీమ్" ॥

....

"వాగేషా నవకాళిదాసవిదుషో దోషోజ్ఝితా దుష్కవి
వ్రాతై ర్నిష్కరుణైః క్రియేత వికృతా ధేను స్తురుష్కై రివ" ॥

విద్యారణ్యు డీరీతిగా తన ప్రతిభను చాటుకొనలేదు. నవకాళిదాస బిరుదమును విద్యారణ్యుడు ధరించినట్లు ఎచ్చటను కన్పించదు. భాగవతచంపువును నవకాళిదాసు అని పిలువబడు మాధవభట్టు రచించెను. శ్రీవిద్యారణ్యులు వ్రాసి రని చెప్పు గ్రంథముల జాబితాలో దీని ప్రసక్తి లేదు. ఈ మాధవీయంలో వ్యాసాచలకవి ప్రసక్తి ఉన్నది.

"నేత్రా యత్రోల్లసతి భగవత్పాదసంజ్ఞో మహేశః
శాంతి ర్యత్ర ప్రకటతి రసః శేషవా నుజ్జ్వలాద్యైః।

యత్రావిద్యాక్షతి రపి ఫలం తస్య కావస్య కర్తా
ధన్యో వ్యాసాచలక వర స్తత్కృతిజ్ఞాశ్చ ధన్యాః॥ 17

ఈ వ్యాసాచల శబ్దము పురుషనామముగా కన్పించుటచే లాక్షణికార్థముతో విద్యారణ్యపరముగా వ్యాఖ్య చేయుట అనుచితము. వ్యాసాచలుడు పదిహేనవ శతాబ్దాంతమున కాంచీమఠమును అలంకరించిన 54 వ మఠాధిపతి (1498-1507) అని చెప్పవచ్చును. గోవిందనాథాదు లితనిని పీఠాధిపతిగా ప్రస్తుతించక, కవిగానే పేర్కొనినారు. డిండిమటీకాకారుడు మాధవుడే విద్యారణ్యు డని అనుటయే గాక, ఇతనికే వ్యాసాచలు డను పేరున్న దనినాడు. వ్యాసాచలు డను కవి వ్రాసిన శంకరవిజయమును ఆధారముగా చేసికొని తాను ఈ కావ్యమును వ్రాయుచుంటి నని మాధవుడు నొక్కి చెప్పుచున్నప్పుడు అతని మాటలను వేరొకరీతిగా వ్యాఖ్య చేయ వీలు లేదు. రామభద్రదీక్షితుని పతంజలిచరిత నుంచి 16 శ్లోకములు, రాజచూడామణి దీక్షితుని శంకరాభ్యుదయమునుంచి 145 శ్లోకములు, వ్యాసాచలునినుంచి 509 శ్లోకములు మాధవుని గ్రంథమున భద్రపరుపబడినవి. రామభద్ర దీక్షితుడు శాహాజీ రాజు (క్రీ. త. 1684-1712) కాలము క్రీ. త. 1704 లో నిర్యాణ మందిన ఆత్మబోధయతి తన 'సుషమా'లో ప్రస్తుతించినసంక్షేప శంకరవిజయము మాధవునిది కాజాలదు. కాని, సుషమా రచయితకు కుంభకోణ మఠముతో సంబంధములేకపోయినచో, అప్పుడాతడు మాధవీయమునే ప్రస్తుతించి యుండుటకు వీలున్నది. రాజచూడా

మణి దీక్షితుడు తన తంత్రశిఖామణిని క్రీ. శ. 1637 లో రచించెను. మాధవీయ మనగా విద్యారణ్యకృత మని భ్రమ కల్గించుటచే వ్యాసాచలుని శంకరవిజయములోని శ్లోకములను కొన్నిటిని లేఖకులు అందులోనుంచి తీసివైచిరి. ప్రచురణ కర్తలు కొందరు వ్యాసాచలీయ శంకరవిజయమును సపరించి ప్రకటించిరి. వ్యాసాచలుడే మహాదేవేంద్రసరస్వతి అను పేరుతో కుంభకోణమఠమునకు అధిపతి (1498-1507)ఐనచో మాధవీయ శంకరవిజయము 1507 తర్వాత 1750 కి ముందు రచింపబడియుండవలెను. విద్యారణ్యుని తర్వాత ఒక శతాబ్దము గడచిన యనంతరమే వ్యాసాచలీయ శంకరవిజయము వచ్చినది.

మండనుడు, విశ్వరూపుడు భిన్నవ్యక్తులని, విశ్వరూపుడు మగధవాసి అని వ్యాసాచలుడు. ఈ మండన విశ్వరూపుల మధ్య గల భేదమునే కాశీలక్ష్మణశాస్త్రి తన గురువంశకావ్యమున ప్రస్తుతించెను. వ్యాసాచలీయము మాధవున కేరీతిగా ఉపకరించినది ఈ క్రింద పట్టిక తెలుపగలదు.

వ్యాసాచలీయ శంకరవిజయం	మాధవీయ శంకరవిజయం	పతంజలి చరిత	శంకరాభ్యుదయం
.2 నుంచి 42	2.6 నుంచి 46		
.1,3-30	49-65,71-75,84		
.9-77	3,10-77		
	5-87	8.18	
	90-95,98-101,	19,62-70	
. 9-61,63,64	68-80,105,106		
1.123-125,127-184	4,2,3,60-67		
	6.54,55,57-59	8.45,46,60-62	
	59-61		1.62-64
	15,68-71		2.15-19
.87-91	1-5		
	7.15-17,29,30,46,47		2.1,3,4,7
	55,59,61,63,65		10-13,20-22

వ్యాసాచలీయ శ కరవిజయం	మాధవీయ శంకరవిజయం	పతంజలి చరిత	శంకరాభ్యుదయం
	67-70,104-107		24-26,29,33
	109,110,116-118,120		35-39,41-44
1-76,80-82,85-6	23-28,39,40,44,57,58		
,5,9-31,35-36	64,66,72,79-100,		
	114;115		
	7.1		
	8.66,132;133		2.48-50
-87,91-95,	45-48,61-65,67-		
101	69,72,73		
	9.75-86,90		4.34-45,47,48
2,63,66,67	69,70, 05,106		
	10.75	2.51	
04	76		

వ్యాసాచలీయ శంకరవిజయం	మాధవీయం శంకరవిజయం	పతంజలి చరిత	శంకరాభ్యుదయం
1-27	77-103		
.70,71	17.18		
	11.20,21,14,43		4.64-66,69-77,
			79-81
	45-52,71-73		3.40,43,46
	12.82 39,89,1-37		4.1,2,6,7
			14-33,50-62
84-88,95,96	70-74,84-85		
.2-4,11-29	40-42,44-58,60		
	59,61,62		
	13.21,49,50,67		2.53-60
	69,71-73		
28-30,37-54	2-4,6-14,40-48		

వ్యాసాచలీయ శంకరవిజయం	మాధవీయం శంకరవిజయం	పతంలి చరిత	శంకరాభ్యుదయం
7.53_71	51_61,64_68,70		
	14.29,39_41		3.2,5_7,15
	45_47,149_156		16,19_38
	159_162,166_168		
	170_174		
4.92,95,96,99,	14,30,35,42,48_50		
101_103			
7.72_97	1_26		
7,98_101	28,56_58		
8.3_10,19,20,36_41	62_71,74_79		
8.42_70,74_93	80_90,92_105		
	107_110,114_133		
9.29_33	14.138_142		

వ్యాసాచలీయ శంకరవిజయం	మాధవీయం శంకరవిజయం	పతంజలి చరిత	శంకరాభ్యుదయం
39-41,38,42- .9	16,17,19,23,		
	27-32,37-38		
52,54-61,83	44;60-67,74		
	16.3,28,29		3.39,41-42
	82,91,92		7.65,68,69
).1-3,5-12,17	4-15		
..93-95,98,100-103	18-26		
..30-55	55-60,62-81		
..79-82	84-87		
..113-122	1-3,11-17		

వ్యాసాచలీయ శంకరవిజయము లోని శ్లోకములను వదలివేసినచో మాధవీయ శంకరవిజయమునకు నిలువ నీడ కన్పించదు. మాధవీయ శంకరవిజయము యొక్క వ్రాత ప్రతి ఒకటి మద్రాసు హస్తలిఖిత పుస్తక భాండాగారమున ఉన్నది. తెలుగు లిపిలో ఉన్న ఈపుస్తకమున--

వ్యాసాచల ప్రముఖ పూర్వక పండిత
శ్మశ్రుకృత్సంభృతోచ్చతర కావ్యతరో సుగూఢాత్.

అని కలదని 1954 లో మద్రాసు రాజకీయ పుస్తకాలయము వారు ప్రచురించిన వ్యాసాచలీయ పీఠికలో చెప్పినారు. పండితుడు, కవి అగు వ్యాసాచలుడు రచించిన శంకర విజయము మాధవున కాధారభూతమైన గ్రంథము.

ఆత్మబోధయతి వ్రాసిన సుషమా టీకలో ఉదహరింప బడిన శ్లోకములు మాధవీయమున (6.25-49,51-52) కలవు. ఇవి వ్యాసాచలీయమున గూడ కలవు గాని, మాధవీయము లోని 6.27వ శ్లోకము వ్యాసాచలుని కావ్యమున నేడు కన్పించదు.

కాంచీమఠమునకధిపతి యగు సర్వజ్ఞసదాశివబోధ యతి (1523-39) పుణ్యశ్లోకమంజరి నిచ్చె నందురు. ఇందు ప్రతి ఆచార్యుని జననము, సన్న్యాసగ్రహణము, పీఠాభిషిక్త దినము, నిర్యాణకాలము గలవు. తర్వాతి పీఠాధిపతి యని చెప్పబడు పరమశివేంద్రుని శిష్యుడు సదాశివబ్రహ్మేంద్ర

యతి 86 ఆర్యావృత్తములలో గురురత్నమాలను రచించె నందురు. సదాశివబ్రహ్మ మహాతపఃసంపన్నుడు. కాని, ఈయనకు ఏమతముతో సంబంధముండెనో చెప్పుట కష్టము.

శ్రీ సదాశివబ్రహ్మేంద్రుడు గురురత్నమాలను రచించెను. దీనిపై సుషమా అను వ్యాఖ్యను శ్రీ ఆత్మబోధేంద్ర యతి వ్రాసెను. శ్రీ సదాశివబ్రహ్మేంద్రుని సమాధి దక్షిణ దేశమున నెరూర్ గ్రామమున ఉన్నది. ఇచట పూజాపునస్కారములు చేయు బ్రాహ్మణకుటుంబ మొకటి గలదు. తిరుపతిజిల్లాలోని ఈగ్రామము పూర్వము మైసూరు మహారాజుపాలనలో ఉన్నది. సదాశివబ్రహ్మేంద్రుడు ఆంధ్ర దేశపు బ్రాహ్మణవంశమున మదురలో జన్మించెను. తండ్రి సోమనాథావధాని, తల్లి పార్వతి, పూర్వాశ్రమమున ఈయన పేరు శివరామకృష్ణుడు. పరమశివేంద్రుని వద్ద ఈయన సన్న్యాసము పుచ్చుకొని సదాశివేంద్రు డాయెను. పరమశివేంద్రుని శిష్యుడు శ్రీసదాశివ బ్రహ్మేంద్రుడు. ఆత్మబోధేంద్రుని ఆజ్ఞానుసారము గురురత్నమాలను వ్రాసె నని చెప్పుదురు.

"పరమశివేంద్ర శ్రీగురుశిష్యేణేత్థం సదాశివేంద్రేణ
రచితేయ మాత్మవిద్యావిలాసనామ్నీ కృతిః పూర్ణా"

అని ఆత్మవిద్యావిలాసము చివరన చెప్పికొనినాడు. "పరమశివేంద్రార్యపాదుకాం నౌమి" అని, "శ్రీగురుపరమశివేంద్రాదేశవశోద్భూత దివ్యమహిమా౽హం" అని వ్రాసికొన్నాడు.

"పరమశివేంద్రం భజేఽహ మన్త్రశాంతం" అని, "శ్రీమత్పరమ శివేంద్రం శ్రీదేశికానాం వయం ముదా" అనియు నవమణిమాలలో అనినాడు.

"త మహం పరమశివేంద్రం వందే గురు మఖిలతంత్ర జీవాతుమ్" అని సిద్ధాంతకల్పవల్లిలో అనినాడు. ఈస్థలములలో "ఇంద్ర" శబ్దమొక్కటి మాత్రమే కలదు. తన గురువును కూడ ఇంద్రశబ్దముతోనే వ్యవహరించెను.

సదాశివబ్రహ్మ వాగ్గేయకారకులలో ఎన్నిక గన్నవాడు. శృంగేరీపీఠాధిపతి యగు శ్రీనృసింహభారతీస్వామి సదాశివేంద్రస్తుతి చేసినాడు.

ఆత్మబోధయతి కాంచీమఠమున అరువదియవ పీఠాధిపతియని చెప్పబడు ఆత్మప్రకాశేంద్రసరస్వతీశిష్యుడని అందురు. ఆత్మప్రకాశేంద్రుని నిర్యాణము 1704లో జరిగెను. పదునెనిమిదవ శతాబ్దారంభమున రచింపబడిన ఈ గ్రంథములలో కొన్ని క్రొత్త విషయము లున్నవి. శంకరుడు కైలాసమున కేగి, శివుని స్తుతించి, శివుని వద్దనుంచి ఐదు స్ఫటికలింగములను, సౌందర్యలహరిని, శివరహస్యమును తెచ్చెనని ఈ గ్రంథములలో కలదు. ఇది అపూర్వవిషయమే. కాంచీలో సిద్ధిపొందెనని చెప్పు శివరహస్యమును గూడ కైలాసమునుంచి తెచ్చుట గుర్తింపదగిన విషయము. కాశ్మీరమున మండనుని శంకరు డోడించెను. శృంగేరీపీఠమున పృథ్వీధరుని అధిపతిగా నియమించెను కాశ్మీరమున కొందరు మగధలో ఇతరులు

మండనుని ఉంచిరి. శృంగేరిలో పృథ్వీధరుడు అధిపతి ఆయె ననుట అనేక గ్రంథములకు, విరుద్ధముగా కన్పించుచున్నది. పృథ్వీధరు డెవ్వరో కూడ ఈ శంకరవిజయాది గ్రంథములు తెలుపుటలేదు.

కాంచీనగరమును స్థిరనివాసముగా చేసికొని, ఇచట కామాక్షిని శాంతమూర్తిని గావించె నట.

> ప్రకృతిం చ గుహాశ్రయాం మహోగ్రాం
> స్వకృతే చక్రవరే ప్రవేశ్య యోగే।
> అకృతాశ్రితసౌమ్యమూర్తి మార్యాం
> సుకృతం నః స చినోతు శంకరార్యః॥

అని గురురత్నమాలికలో కలదు. శ్రీశంకరుడే అచటి శ్రీచక్రమును నిర్మించె నందురు.

కేరళీయ శంకరచరిత్రమును పదునేడవ శతాబ్దము తర్వాత గోవిందనాథుడు వ్రాసెను. ఇది తొమ్మిది అధ్యాయముల గ్రంథము. శంకరుని ఐదవ యేట తండ్రి మరణించెను. ఆపైన ఉపనయనము జరిగెను. శంకరుడు సంస్కృతసాహిత్యాధ్యయనము గావించెను. పదునారవ యేట కాశీగమనము ఆయెనట! ఆయన నలుగురు శిష్యులలో ముగ్గురు కేరళీయు లని, పద్మపాదుని ఊరు అలత్తూర గ్రామ మని కలదు. శంకరుడు కంచిలో సర్వజ్ఞపీఠము నెక్కి తర్వాత రామేశ్వరమున కేగి, చివరకు వృషాచలమునకు వచ్చెను. ఇది దక్షిణకైలాసము. ఇచట శివలింగమును

పూజించి, త్రికాలమున ప్రదక్షిణము గావించి, కృష్ణ భార్గవులకు ప్రణామము చేసి, విష్ణువును ధ్యానించుచు పరమానందమున లీన మయ్యె నని గోవిందుని కథ. త్రిచూరున గల మందిరమున ఆచార్యుని సమాధి కలదని, త్రిచూరు సమీపమున గల ఒక బ్రాహ్మణవంశము నేటికి గూడా తమది మండనమిశ్ర (సురేశ్వర) వంశ మని చెప్పుకొందు రని వీరి కథనము. కాంచీమఠమువారు కాంచీనగరమున కేరళీయులు కేరళదేశమున శంకరుల నిర్యాణస్థలమును చూపుట విచిత్రవిషయమే.

శ్రీ సదానందవ్యాసుడు శంకరదిగ్విజయసారమును రచించెను. కాశీమణికర్ణికాఘాట్ వద్ద క్రీ. శ. 1797 లో ఈయన ఒక శివమందిరమును నిర్మించెను. శంకరదిగ్విజయసారమును 1780 లో వ్రాసెను. విషయములను పర్యాలోచించగా సంక్షేపశంకరవిజయములు పదునెనిమిదవ శతాబ్దమున బాగా విజృంభించినట్లు స్పష్ట మగుచున్నది. సదానందుని గ్రంథమున ఇతరులలో కన్పించు విషయములే కలవు.

పింగళి గోపాలశాస్త్రి రచించిన గురుపరంపరా చరిత్రలో నాలుగే ఆమ్నాయమఠము లని, కాశ్మీరమున సర్వజ్ఞపీఠారోహణము జరిగె నని, నిర్యాణస్థలము కేదార ప్రాంత మని కలదు.

శృంగేరీమఠమున ఆస్థానవిద్వాంసుడుగా ఉన్న శ్రీ కాశీ లక్ష్మణశాస్త్రి 1735 ప్రాంతమున గురువంశకావ్య

మును రచించెను. గోవిందభగవత్పాదుని వద్ద అధ్యయనము చేసిన తర్వాత బదరిలో వ్యాసుని కలసికొనకమునుపే శంకరుడు విష్ణుసహస్రనామమును, గీత, దశోపనిషత్తులు, బ్రహ్మసూత్రములు, సనత్సుజాతీయము అను వాటిపై భాష్యములను రచించె నని ఇచట కలదు. మగధలోని విశ్వరూపునితో శాస్త్రార్థమునకు పోవుచున్న శంకరునకు దారిలో పూర్వమీమాంసా నిష్ణాత యగు మండనుడు తటస్థపడె నని, ఆ మండనునకు ఆచార్యుడు అద్వైతము నుపదేశించె నని చెప్పబడినది. విశ్వరూపుడు సురేశ్వరు డాయెను. మధ్యార్జునమున అద్వైతమే తత్త్వ మని అశరీరవాణి మూడు తడసలు పలికెను. శ్రీవాప్యస్త్రమను నగరమున హస్తామలకుడు శిష్యు డాయెను. ఆచార్యునకు భగందరవ్యాధి వచ్చినప్పుడు శుశ్రూష చేసినవాడు తోటకాచార్యుడు. అశ్వినుల ద్వారా ఈ జబ్బు నయమైన దట. కాశీలో ఉన్నప్పుడు శంకరుడు ఐదు మఠములను స్థాపించెను. కాశ్మీరమున సర్వజ్ఞపీఠారోహణమునకు ముందు శారదాదేవితో శాస్త్రార్థము, పరకాయ ప్రవేశము, శారద ఓడిపోయి శృంగేరి వచ్చుట చెప్పబడినవి. శృంగేరిలో గల చంద్రమౌళీశ్వర లింగము రేవణామహర్షి ఇచ్చినదట.

శృంగేరిపీఠమున సురేశ్వరుని అధిపతిగా నియమించెను. కాంచీనగరమున కేగి, శివకాంచిని విష్ణుకాంచిని నిర్మించి కామాక్షిని ప్రతిష్ఠించి చివరకు బదరికాశ్రమమును చేరెను. సిద్ధేశ్వరీ దర్శనమునకై నేపాలదేశమున కేగెను. హిమాలయ

ములలోని దత్తాత్రేయాశ్రమమున దండకమండలులను వదలివేసెను. పదునెనిమిదవ శతాబ్దారంభమున శ్రీ శృంగేరి పీఠాధిపతులు అంగీకరించిన విషయముల నన్నిటిని పొందు పరచినది గురువంశకావ్య మగుటచే, దీనికి భిన్నముగా కన్పించు సన్నివేశములను వివరించు శంకరవిజయము లేవియు ఆ పీఠాధిపతులకు ప్రామాణికములు గావని నిశ్చయింప వచ్చును. ఇంతేగాక పరకాయ ప్రవేశాది గాథలను వారు అంగీకరించినట్లున్నది.

శ్రీ శంకరభగవత్పాదుల కాలమున శాక్త, పాశుపత, క్షపణక, కాపాలిక, వైష్ణవాదులు ప్రబలియున్నారని మాధవీయ శంకరవిజయము.

శాక్తైః పాశుపతైరపి క్షపణకైః కాపాలికైర్వైష్ణవై-
రప్యన్యైరఖిలైః ఖలైః ఖలు ఖిలం దుర్వాదిభిర్వైదికమ్॥

కాపాలికుల ముఖ్యస్థానము శ్రీశైలము. తాంత్రికమార్గము, శాక్తము శంకరుని నాటికే ఉన్నదని అంగీకరించుటకు వీలున్నది, కాని

భాట్టే నయే గురుమతే కణభుఙ్మతాదే,
ప్రశ్నం చకార తవయస్య మతిం బుభుత్సుః.

అని మాధవీయమున (2.25) శివగురువుయొక్క విద్యాభ్యాస విషయములో చెప్పబడినది. శివగురువే భాట్ట, ప్రాభాకర మీమాంసలను చదివియున్నచో శంకరుడు కుమారిలభట్టును కలసికొనుట కష్టసాధ్యమే.

వరమపి విదితం భాట్టఘటార్థతత్త్వమ్.

అని (4-20) కూడ మాధవీయమున గలదు.

వైష్ణవాగమము లగు పాంచరాత్ర గ్రంథములతో శంకరు నకు పరిచయ మున్నది. కాని, ఇతర వైష్ణవశాఖలతో ఆయనకు పరిచయము కన్పించదు. రాత్ర మనగా జ్ఞాన మని నారదపాంచరాత్రము. పరమతత్త్వము, ముక్తి, భుక్తి, యోగము, సంసారము అను ఐదింటిని నిరూపించునది పాంచ రాత్రము. ఈ పాంచరాత్రసంహితలలో గల జ్ఞాన, యోగ, క్రియా, చర్యఅను నాల్గింటిని కలిపి చతుర్వ్యూహ మందురు. శంకరు డీ పాంచరాత్రము నెరుగునే కాని శంకరవిజయము లలో చెప్పబడిన ఇతర వైష్ణవముల నేమాత్రము ఎరుగడు.

పాశుపతమతమును స్థాపించిన నకులీశుడు గుజరాత్ లోని కారబడ్ స్థానమునకు చెందినవాడు. క్రీ.శ. 105 ప్రాంతమువాడగు నీతడు శివుని మొదటి అవతారమందురు. ఈ మతమున కార్య, కారణ, యోగ, విధి దుఃఖాంతములను ఐదు పదార్థము లున్నవి. పాశుపత మత ఖండనము నామాధ వీయము (6-74) వివరించినది. ఇంతేగాక శంకరుని సమకాలి కులలో కొన్ని చిత్రమైన పేర్లను శంకరవిజయములు పేర్కొ నినవి.

భాస్కరాభినవగుప్త పురోగాన్
నీలకంఠ గురుమండన ముఖ్యాన్।
పండితా నథ విజిత్య జగత్యాం
ఖ్యాపయాద్వయమతే పరతత్త్వమ్॥

అని శివుడు శంకరునకు చెప్పినట్లు మాధవీయమున (6.50) కలదు భేదాభేదవాది యగు భాస్కరుడు శంకరుని తర్వాత వాచస్పతి (క్రీ. త. 840) కి ముందు వచ్చినాడు. తర్వాత రెండు శతాబ్దములకు వచ్చినవాడు అభినవగుప్తుడు. వాదమున ఓడిన అభినవుడు ఆభిచారిక ప్రయోగముచేసి భగందర వ్యాధిని తెచ్చెననుట సత్యదూరము.

పరాభవం పీడిత పుండరీకాః,
ప్రపేదిరే భాస్కర, గుప్త,
మిశ్రమురారి విద్యేంద్ర గురుప్రధానాః.

అనిమాధవీయము (6.82). మురారి మిశ్రుడు మీమాంసలో మూడవమార్గమును లేవదీసినవాడు. కుమారిల, ప్రభాకరుల తర్వాత చాల సంవత్సరములకు వచ్చిన మీమాంసకుడా మురారి. ఈ రీతిగా చారిత్రక విషయములనే తారుమారు చేసిన శంకరవిజయములు మనకు పూర్తిగా ప్రమాణగ్రంథములు కాజాలవు. శంకరుని వంటి జీవన్ముక్తుని విషయమున ఏ యే సన్నివేశములను సరిగా గ్రహింపవచ్చునో వివేచించి శంకరుని జీవితచరిత్రను తెలిసికొనవలెను.

2. అవతార సమయము

కాంచీమఠమువారి లెక్క ప్రకారము శ్రీ శంకర భగవత్పాదులు క్రీ. పూ. 509 లో జన్మించిరి. వీరు ఆచార్య శంకరులు ఐదుతడవలు జన్మించి రని అందురు. ఆద్యశంకరులు క్రీ. పూ. 509 లో పుట్టిరి. ద్వితీయశంకరులు క్రీ. త. 29 నుండి 69 వరకు ఉండిరి. వీరు కామకోటిమఠమును అధిష్ఠించిన తొమ్మిదవ జగద్గురువులు. పదునారవ మఠాధిపతి యగు తృతీయశంకరులు క్రీ. త. 329 నుండి 367 వరకు గల ఉజ్జ్వలశంకరులు. ఇరువదవ పీఠాధిపతి యగు నాల్గవ శంకరులు మూకశంకరులు. వీరు క్రీ. త. 398 నుండి 437 వరకు ఉండిరి. ముప్పది యెనిమిదవ ఆచార్యు లగు ఐదవ శంకరులను, అభినవ శంకరు లందురు. వీరు క్రీ. త. 788 నుండి 840 వరకు గలరు. ప్రస్థానత్రయభాష్యకర్త యగు శంకరుడు క్రీస్తుపూర్వము 509 లో జన్మించె ననుట యుక్తియుతము కాజాలదు. శంకరు డుదహరించిన దార్శనికులు క్రీ. త. రెండు మూడు శతాబ్దములలోనివారు.

కల్పాదిమే మహాదేవిసహస్ర ద్వితయాత్పరమ్.

అని శివరహస్యము (9-16-8), దీనికి "త్రితయాత్" అను పాఠాంతరమున్నది. క్రీ. పూ. 1000 లోగాని, 100 లోగా, శంకరుడు జన్మించె ననుట అసత్యమే. ఉపవర్ష, శబరని భర్తృప్రపంచ, బ్రహ్మదత్త, ద్రవిడాచార్య, వృత్తికార, గౌడపాదులు శ్రీ భగవత్పాదుల రచనలలో ప్రస్తుతింపబడిరి. సాంఖ్యకారికులు, దిఙ్నాగుని ఆలంబన పరీక్ష ఉదహ

రించబడినవి. కుమారిల, మండన, ప్రభాకర, ధర్మకీర్తి మొదలగువారి స్మరణ ఎచ్చటను కన్పింపదు. పంచపాదికలో—

అతః స ఏవ మహాయానికః పక్షః సమర్థితః.

అని కన్పించుటచే, శంకరుని కాలమునకు మాధ్యమిక బౌద్ధము పోయి, యోగాచారమతము ప్రబలియున్నదని తెలియుచున్నది. మైత్రేయ, అసంగ, వసుబంధు, దిఙ్నాగులు ప్రధాన యోగాచార దార్శనికులు. వీరు క్రీస్తుశకారంభము తర్వాతనే తమ తమ రచనలను గావించిరి.

స్రుఘ్న, పాటలీపుత్ర నగరములను శంకరుడు పేర్కొనెను. సూత్రభాష్యము **2.1.18** లో కన్పించు స్రుఘ్ననగరము క్రీ. త. 756 లో వరదలో పోయినది. వేదాంతసూత్రము **4.3.5** పై గల భాష్యమున బలవర్మ, జయసింహ, కృష్ణగుప్తులు పేర్కొనబడిరి. **2.1.18** పైన, ఛాందోగ్యభాష్యమున (**3.19.1**) పూర్ణవర్మ కన్పించును. ఛాందోగ్య (**2.23.1**) భాష్యములో పూర్ణవర్మకు రాజవర్మకు మధ్య గల తారతమ్యము చెప్పబడినది. సింహవర్మ బలవర్మల సాదృశ్యము **2.4.1** లో పేర్కొనబడెను. **4.3.5** లో బలవర్మ వద్దకు పోయి, ఆపై జయసింహునివద్దకు, తర్వాత కృష్ణగుప్తునివద్దకు పోయినవానిని గూర్చి ప్రస్తుతించెను. యువాన్ చ్వాంగ్ (**630-645**) తన రచనలో పూర్ణవర్మ అను రాజును ప్రస్తుతించినాడు. ఆరవ శతాబ్ది

మున నితడు పశ్చిమ మగధరాజ్యమునకు రాజు. ఐదవ శతాబ్దమున ఒక పూర్ణవర్మ కలడు. మూడు, ఐదు, ఆరు శతాబ్దములలో ముగ్గురు సింహావర్మలు కలరు. హర్షుని సమకాలికు డగు భాస్కరవర్మ పూర్వీకు డొక బలవర్మ 500 ప్రాంతమున జయసింహుడు, 550 లో కృష్ణగుప్తుడు కలరు.

వర్షే వ్యతీతేషు శతేషు షట్సు
తిష్యేవ తీర్ణో భువి శంకరార్యః.

అని సౌభాగ్యచంద్రోదయమున భాస్కరరాయలు పల్కినపుడు శంకరుని సమయము ఏదో శకమున 600 వ సంవత్సరము. ఇది శాలివాహనశకమైనచో క్రీ.శ. 678 లో శంకరుడు జన్మించెననవలెను. క్రీ.శ. 756కు ముందే శంకరుని జననమైయుండవలెను. బ్రహ్మసూత్రము 1. 2. 7 పైగల భాష్యమున అయోధ్యప్రభువును దేశప్రభువుగా ప్రస్తుతించెను. ఈపరిస్థితి 500 తర్వాత కన్పించదు. దీనినిబట్టి శంకరుడు 500 కు ముందే ఉండవలెను. సింహావర్మ, బలవర్మాదుల కాలమును సరిగా నిర్ధారణ చేయుట కష్టమగుటచే వీరుకూడ 500 కి ముందేగలరని ఎంచవలసియున్నది. మాలవ శకము 404 కు చెందిన మందసార శాసనములో జయవర్మ పుత్రుడు, నరవర్మతండ్రి అగు సింహావర్మకలడు. కాని సముద్రగుప్తుడు 335లో ఒక బలవర్మను ఓడించెను. విక్రమ సంవత్ 75 న పూర్ణవర్మ అను ఆభీరరాజొకడుండెను. ఈరీతిగా నున్న విషయముల

వలన వీరందరును ఒకేకాలమున ఉండిరని చెప్పుటకు వీలుపడదు.

గురురత్నమాలలోను, గురువంశకావ్యమున శంకరు డొక రాజసేనుని సమకాలికు డని కలదు. పల్లవ మహేంద్ర వర్మ (క్రీ.త. 600) తన మత్తవిలాస ప్రహసనమున ఒక రాజసేనుని స్మరించెను. కాని భాసుని రాజసింహుని వలె ఈ రాజసేనుడు మనకు చిక్కడు. ఇతని సమయము కూడ మనకు తెలియదు.

గౌతమబుద్ధుని నిర్యాణమైన అరువది యేండ్లకు శంకరుడు జన్మించెనని విన్సెంట్ అభిప్రాయము. క్రీ.పూ. 476 అని నిఖిలనాథరాయ్, క్రీ.పూ. 49 అని భాస్కరుడు పల్కిరి. క్రీ.త. 400 ప్రాంతమున జననమని ఇది చెరుమాన్ పెరుమాళ్ రాజ్యముచేయుచున్న కాలమని కేరళోత్పత్తిలో గలదు. ఇట్లే 500 అని, 650 - 740 అని, 788-820 అని పలువురు పలువిధముల భావించిరి. ఈ సమయములలో క్రీ.త. 788 లో శంకరుడు జన్మించె నను వాదము పాశ్చాత్యుల ఆమోదముద్ర పొందుటచే వారి అనుయాయులు కూడ దీనినే అంగీకరించుచువచ్చిరి.

కాంబోడియా (కాంభోజ) దేశపు రాజగు రెండవ జయవర్మ (878-887) యొక్క గురువు శ్రీశివసోముడు. ఈ శివసోముని గురువు "భగవాన్ శంకర" అని ఒక శిలాలేఖ.

కాని అనేకమంది సన్యాసులు శంకర శబ్దముతో వ్యవహరింప బడి యుండుటచే

యేనాధీతాని శాస్త్రాణి భగవచ్ఛంకరాహ్వయాత్।
నిఃశేష సూరి మూర్ధాలి మాలాలీఢాంఘ్రి పంకజాత్॥

అను ఆ శిలాలేఖ లోని శ్లోకము ప్రస్థానత్రయ భాష్యకర్త యగు శంకరునకు వర్తించదు. ప్రతి పీఠాధిపతిని శంకరాచార్యుడని పిలచు ఆచారము ప్రకారము శివసోముని గురువు వేరొక భగవచ్ఛంకరులు కావచ్చును.

సౌందర్యలహరి లో గల ద్రవిడశిశువు సంబందార్ అను భక్తుని సూచించు శబ్దమని, శివభుజంగస్తోత్రములోని "సుతద్రోహిణః" అను ప్రయోగము శిరుత్తొండర్ అని ప్రసిద్ధిచెందిన ఏడవశతాబ్దపు పరంజ్యోతిని సూచించునదని కొందరిమతము. కాని ఇతడు ఉపనిషద్భాష్యములలో అక్కడక్కడ ఉదహరించబడుచు, ఒకచోట 'అస్మదీయాశ్చ కేచన' అని శంకరునిచే ప్రస్తుతించబడిన ద్రవిడాచార్యుడు కావచ్చును. గౌడాచార్యునిలో గౌడశబ్దమువలె ఇచట ద్రవిడశబ్దము కూడ పౌరుషనామము కావచ్చును. లేనిచో ద్రవిడశిశువు శంకరుడే కావచ్చును.

గురువంశ కావ్యాదులలో శంకరుని సమకాలికుడుగా ప్రస్తుతించబడిన రాజశేఖరుడు క్రీ. శ. 798 నుంచి 834 వరకు గల భాస్కర రవివర్మ అని కొందరు. ఇట్లె కేరళీయు లనుసరించు కొల్లం శకము శంకరునితోనే ఆరంభమైన దని,

ఇది క్రీ. త. 825 నుంచి మొదలని వేరొక కొందరు. కాని, 700 ప్రాంతమున గల శాంతరక్షితుడు బృహదారణ్యక వార్తికమునే ప్రస్తుతించుటచే ఇంతకు కనీసము నూరు సంవత్సరముల ముందే శంకరుడు ఉండియుండవలెను. అష్టమ శతాబ్దాంతమున శంకరుడు జన్మించెననుటకు

> దుష్టాచారవినాశాయ ప్రాదుర్భూతో మహీతలే।
> స ఏవ శంకరాచార్యః సాక్షాత్ కైవల్యనాయకః॥
> నిధినాగేభ వహ్న్యబ్దే విభవే శంకరోదయః।
> అష్టవర్షే చతుర్వేదాన్ ద్వాదశే సర్వశాస్త్రకృత్॥
> షోడశే కృతవాన్ భాష్యం ద్వాత్రింశే మునిరభ్యగాత్।
> కల్యబ్దే చంద్రనేత్రాంక వహ్న్యబ్దే గుహాప్రవేశః।
> వైశాఖే పూర్ణిమాయాం తు శంకరః శివతామగాత్॥

అను శ్లోకములు చెప్పబడుచున్నవి. 3899 వ కలిసంవత్సరమునకు సరిపోవు క్రీ. త. 798 లో శంకరుడు జన్మించె నట. నవనాగము లను అంగీకరించక తప్పదు గనుక శంకరుడు ఇరువది రెండేండ్లే జీవించె నని ఈశ్లోకములలో ఉండవలెను. కాని శంకరుడు ముప్పదిరెండేండ్లు జీవించెనని కూడా చెప్పబడుటచే ఈశ్లోకములు విరుద్ధార్థములను కలిగియున్నవి. కలి 3889 కి సరిపోవు క్రీ. త. 788 లో శంకరుడు జన్మించె నని, కలి 3921 కి సరియగు క్రీ. త. 820 లో శంకరుని నిర్యాణమని ఈ శ్లోకములలో చెప్పబడ వలసిన భావమై యుండవచ్చును. ఇటువంటి శ్లోకములను అల్లుట అంత కష్టమైన

పని గాదు. రకరకాల సమయములను తెలుపు పలువిధముల శ్లోకములున్నవి.

ప్రాసూత తిష్య శరదామ తియాతి వత్యా
మేకాదశాధి కశతో న చ తుః సహస్ర్యామ్।
సంవత్సరే విభవనామ్ని శుభేముహూ ర్తే
రాధే సితే శివగురో ర్గృహిణీ దశమ్యామ్॥

అని శంకరమందారసౌరభమున నీలకంఠభట్టు. దీనిప్రకారము కలి 3889 కి సరిపోవు క్రీ. త. 788 లో శంకరుడు జన్మించె నని, అది విభవనామ సంవత్సరమున శుద్ధదశమి అని తెలియు చున్నది. 788 లోని పీఠాధిపతులు శంకరాచార్యనామ ముతో ప్రసిద్ధికెక్కియుండుటకు వీలున్నది. కాని ప్రస్థాన త్రయభాష్యకర్తను ఈసమయములకు చెందినవాడని చెప్పుట సాహసమాత్రము. ఇదేవిధముగా ఎవరికి తోచిన కాలమును వారు శ్లోకబద్ధముచేసి దేశము మీదకు వదలినారు.

ధర్మే ద్వావింశతి శకే సప్తశద్వి సహస్రకే।
అబ్దేన సర్వజితే జాతః సహి వైపంచిమేదినే॥

అని సదానందుని శంకరదిగ్విజయమున కలదు. కలి 2722 కు సరిపోవు క్రీ.పూ. 380 న సర్వజిత్ సంవత్సరమున శంకరుడు జన్మించెనని సదానందుడు. విభవ సంవత్సర మని ఒకరు, సర్వజిత్సంవత్సర మని ఇంకొకరు. క్రీ.పూ. 380 మాత్రము సర్వజిత్సంవత్సరము కాదు. "త్రిసహస్రకే" అను పాఠాం తరము నంగీకరించినచో శంకరుడు క్రీ. త. 620 లో వైశాఖ

శుద్ధ పంచమిన జన్మించె నని చెప్పవచ్చును. కాని ఇది కూడ సర్వజిత్సంవత్సరము కాదు, విభవసంవత్సరము కూడ కాదు. ఎవరికి నచ్చిన రీతిగా వారు శంకరుని జన్మకాలమును వివరించుటచే, ఇతరమార్గము ననుసరించి మనము కాలనిర్ణయము చేయుట అవసరము.

శారీరక భాష్యము పై "భామతి" అను టీకను వ్రాసిన వాచస్పతి తన "న్యాయసూచీ నిబంధము" న

న్యాయసూచీ నిబంధో ఽ యమకారి విదుషాంముదే।
శ్రీ వాచస్పతి మిశ్రేణ వస్వంక వసువత్సరే॥

అనినాడు. ఈ గ్రంథమును 898 వ సంవత్సరమున రచించినాడు. ఇది విక్రమసంవత్సరము గావున క్రీ.శ. 841 లో ఈ గ్రంథరచన ఐనది. చతుఃసూత్ర వ్యాఖ్యయగు "పంచపాదిక"పై భామతిలో తీవ్రవిమర్శ గలదని కల్పతరుకారుడు పలుచోట్ల చెప్పినాడు. కల్పతరువును వ్రాసిన అమలానందుడు పండ్రెండవ శతాబ్దివాడు. క్రీ.శ. 841 నాటికే పంచపాదిక బహుళ ప్రచారములో ఉన్నదని పంచపాదిక కన్న ముందే శారీరక భాష్యము రచింపబడి యుండవలెనని దీనివలన తేలుచున్నది గనుక వాచస్పతికిముందే కనీసము నూరుసంవత్సరముల ముందే శంకరుడు ఉండవలెను. శాంకర భాష్యముపై భాస్కరుడుగావించిన ఆక్షేపణల విమర్శకూడ భామతిలో ఉన్నది. పద్మపాదుడు శంకరుని శిష్యుడని, ఆయనే పంచపాదికను రచించెనని ప్రచారములోనున్నచో

వాచస్పతి మిశ్రుడు పంచపాదికను విమర్శించుటకు సాహసింపజాలడు. ఆచార్యునివద్ద అద్వైతము నభ్యసించి, ఆయన జీవించియున్న కాలముననే శిష్యులు భాష్యములపై వ్యాఖ్యలను వ్రాసియున్నచో వాచస్పతివంటి మహావిద్వాంసులు ఆచార్యుని అభిప్రాయములను విశదపరచిన పద్మపాదాదుల రచనలను త్రోసిపుచ్చుటకు యత్నింపజాలరు. శాంకరాద్వైతమున విభిన్నదృక్పథములు గలవని, ఆయన శిష్యులు ఒక్కొక్కరు ఒక్కొక్క దృక్పథమును వివరింప యత్నించిరని చెప్పికొనినచో వాచస్పతియొక్క విమర్శలు అర్థవంతములు కాగలవు. ఏదివిట్లున్నను వాచస్పతికంటె ఒక శతాబ్దము పూర్వమే శంకరుడు ఉండియుండవలెను. కనుక శంకరుని సమయము క్రీ.త. 740కి పూర్వమే కావలెను.

మహానుభావ సంప్రదాయమునకు చెందిన "దర్శన ప్రకాశ"మను గ్రంథము క్రీ. త. 1638 లో రచింపబడినది. దీనిలో అతిప్రాచీన మగు "శంకరపద్ధతి"అను గ్రంథము నుండి కొన్ని పంక్తులు ఉద్ధరించబడినవి. దీనిలో

> యుగ్మపయోధిరసామితశాకే రౌద్రకవత్సర ఊర్జక
> మాసే ....శంకరలోక మగా న్నిజదేహం హేమ
> గిరౌ ప్రవిహాయ హఠేన.

అని గలదు. 642 శతాబ్దమున (క్రీ. త. 720) శంకరుడు బ్రహ్మీభూతు డయ్యె నని ఉన్నది. కాని రసశబ్దమును పృథివీపరముగా చెప్పినచో ఈ నిర్యాణకాలము 142 శక

సంవత్సరము (క్రీ. త. 320) కాగలదు. క్రీ. త. 688 లో జన్మించి ముప్పదిరెండేండ్ల వరకు శంకరుడు జీవించె నను సంప్రదాయవచనమును మనము గమనించవలసియున్నది. క్రీ. త. 720 లో నిర్యాణమును పొందిన శంకరాచార్యు డొకడు ఉండియుండవచ్చును.

శృంగేరీమఠమున గల గురుపరంపరను అనుసరించి శంకరుడు పదునాల్గవ విక్రమాబ్దమున జన్మించెను. ఇది విక్రమసంవత్ ఐనచో క్రీ. పూ. 43 న శంకరజననము కాగలదు. దీనిని అంగీకరించని పండితులు ఈ గణన చాళుక్య వంశీయుడగు మొదటి విక్రమాదిత్యుని నుంచి అని అందురు. ఇతడు క్రీ. త. 654 లో రాజ్యాభిషిక్తు డగుటచే శంకరులు క్రీ. త. 6 8 లో జన్మించిరని చెప్పెదరు. ఈ విక్రమా దిత్యుడు క్రీ. త. 681 లో మరణించెను. విక్రమసంవత్ అతని మృతితో ప్రారంభమైనచో శంకరులు క్రీ.త. 695 లో జన్మించి రనవలెను. 688 కి 695 కు మధ్య భేదము స్వల్పమే, రాజేంద్రనాథఘోష్ శంకరవిజయములను క్రోడీకరించి, శంకరుల జన్మకుండలిని తయారుచేసిరి. దీనిని అనుసరించి క్రీ. త. 686 కు సరియగు వైశాఖశుక్లతృతీయ భగత్పాదుల జన్మదిన మని తేల్చిరి. కాని కొందరు పంచమిని, ఇతరులు దశమిని ఆచార్యుని జన్మతిథిగా చెప్పియున్నారు.

జనసేనుడు క్రీ.త. 783 ప్రాంతమువాడు. ఇతడు తన ఆదిపురాణమున అకలంక, విద్యానంద, ప్రభాచంద్రులను

ప్రస్తుతించినాడు. అకలంకుని శిష్యుడగు ప్రభాచంద్రుడు విద్యానందుని సంస్మరించినాడు. శ్లోకవార్తికమున కుమారిలుడు అకలంకుని విమర్శించినాడు. విద్యానందుడు కుమారిలుని విమర్శించినాడు. కుమారిల, అకలంక, విద్యానందులు సమకాలికులని తేలుచున్నది. ఈవిద్యానందుడు తన "అష్టసాహస్రీ" లో బృహదారణ్యక భాష్య వార్తికములోని పంక్తులను ఉదహరించినాడు. విద్యానందుడు సురేశ్వరుని, ధర్మకీర్తిని విమర్శించెను శాంతరక్షితు (700) విద్యానందుని విద్యానందశిష్యుడు ప్రభాచంద్రుడు శాంతరక్షితుని విమర్శించిరి. శాంతరక్షితుని బావమరదియగు పద్మసంభవుడు ధాన్యకటకము నుండి క్రీ.శ. 747 లో టిబెటు వెళ్ళి అచట 749 లో మొదటి బౌద్ధవిహారమును నిర్మించెను. కావున సురేశ్వర, ధర్మకీర్తులు క్రీ.శ. 650 తర్వాతివారుకారు.

శాంకరభాష్యములలో ప్రధానప్రతిపక్షులు సాంఖ్యులు విజ్ఞానవాది బౌద్ధులు. ప్రధానమల్ల నిబర్హణన్యాయము ననుసరించి, సూత్రభాష్యమున సాంఖ్యుల వాదములనే ఖండించెను. మాధ్యమికమతమును తర్కపాదములో ఒక్క వాక్యముతో వదల్చుకొనెను. శంకరుని సిద్ధాంతము మహాయాన బౌద్ధమతమునను సన్నిహితముగా కన్పించియుండుటచే వచ్చిన విమర్శలను అద్వైతులు పరీక్షింపవలసివచ్చినది. పద్మపాదుడు సహితము.

అతః స ఏవ మాహాయనికః పక్షః సమర్థితః స్యాత్.

అని ఆరంభించి, ఇది సరియైన ఆక్షేపము కాదని త్రోసివైచినాడు. వేదాంతసూత్రము 2.2.27 పై గల భాష్యమును సరిగా పరిశీలించితిమేని, శంకరుని కాలమున వైనాశికులు బాగా విజృంభించి యుండిరని తెలియగలదు. ఈ వైనాశికులు విజ్ఞానవాదము పైకివచ్చుటతో విజృంభించిరి. వసుబంధు, దిఙ్నాగులు ఉద్దండపండితులు. బౌద్ధుల తర్కశాస్త్రమును సుదృఢము గావించిన వారిలో భావవివేక, దిఙ్నాగ, బుద్ధపాలిత, చంద్రకీర్తులు కలరు. వీరందరు నాగార్జునకొండ, వెంగి, అమరావతి, శ్రీశైలములను కేంద్రములుగాచేసికొనిరి. దక్షిణదేశమున ఆంధ్రదేశమే వీరిప్రధానకేంద్రము. బౌద్ధులలో హీనయానికులకు ప్రధాన స్థానమైన కాంచీనగరము క్రమక్రమముగా మహాయానికులకుకూడా చోటిచ్చినది. ఇట్టి పరిస్థితిలో శంకరుని ప్రధానశత్రువు మీమాంసకుడుకాదు, నైయాయికుడుకాదు. ఈ వైనాశికుల ప్రాభవము ఆరవశతాబ్దమునుంచి బాగాక్షీణింపసాగెను. ఏడవ శతాబ్దారంభమున మనదేశమునకువచ్చిన యువాన్ చ్వాంగ్ ఈ పరిస్థితిని వివరించినాడు. శంకరుడు ఆరవశతాబ్దపు మధ్యభాగము తర్వాత వచ్చినచో ఆయన ఎదుర్కొనిన వైనాశికులెవరో తెలియదు. ఊహాపథమందలి శత్రువులను శంకరుడోడించలేదు.

వేదాంతసూత్రము 2.2.28 పైగల భాష్యమున "యదంతర్ జ్ఞేయరూపం తద్బహిర్వ దవభాసతే" అను పంక్తిని శంకరుడు ఉదహరించెను. ఇది దిఙ్నాగుని ఆలంబన

పరీక్షలోనిది. ఇదేపంక్తి తత్త్వసంగ్రహపంజికలో కన్పించుటచే శాంతరక్షిత, కమలశీలులకంటె తర్వాతనే శంకరుడు వచ్చెననికొందరు వాదించిరి. కాని తాత్పర్యటీకలో ఈ పంక్తి దిఙ్నాగునిదని స్పష్టముగా వాచస్పతి పలికినాడు. శంకరుడు దిఙ్నాగుని పేరును ప్రస్తుతించలేదు. ప్రత్యర్థి సమకాలికుడైనప్పుడో అతని పేరును ప్రస్తుతించకపోవుటయే మామూలుగా మనదర్శనగ్రంథములలో కన్పించుచున్న విషయము. విజ్ఞానవాద బౌద్ధముకంటె తనమతము విలక్షణమని శంకరుడు చూప ప్రయత్నించిన ప్రకరణమిది.

ఉపవర్షుడు, శబరుడు, వాత్స్యాయనుడు మాధ్యమిక వాదమును విమర్శించిరి. శంకర, కుమారిలులు మాధ్యమికుల జోలికి పోలేదు. వారు ఖండించినది విజ్ఞానవాదమును నాగార్జునుడు, శబరుడు, వాత్స్యాయనుడు సమకాలికులు. ఇదే కాలమునకు చెందిన గౌడపాదుడు తన దర్శనమును నాగార్జునుని వలె కారికలలో చెప్పెను. మాధ్యమికకారిక, పరమార్థసార మను ఆధారకారిక, మాండూక్యకారిక, సాంఖ్యకారిక అనునవి ఇంచుమించు ఒకే కాలమునకు చెందినవి. దిఙ్నాగుడు మొదలగువారిలో కన్పించు విజ్ఞానవాదము గౌడపాదునకు తెలియదు.

సాంఖ్యులు అద్వైతులుగను, మాధ్యమకులుగను పరిణమించుట గమనింపతగినవిషయము. మొదట సాంఖ్య దర్శనము నవలంబించిన గౌడపాదుడు అద్వైతిగా మారెను. భావవివేకుడు సాంఖ్యమతమును వదలి మాధ్యమకు

డాయెను. ఒకప్పుడు సాంఖ్యమతమున కనుగుణమైన వేదాంతసూత్రభాష్యము కాని, ఉపనిషద్భాష్యము కాని ఉండియుండవలెను. అప్పుడే శారీరకభాష్యమున గల సాంఖ్యపూర్వపక్షము అర్థవంతము కాగలదు. ఈపరిస్థితి మొదటి శతాబ్దమునుంచి నాల్గవశతాబ్దమువరకు గల కాలముననే ఉన్నట్లు తెలియుచున్నది.

బృహదారణ్యక భాష్యవార్తికమున సురేశ్వరుడు ధర్మకీర్తిని ప్రస్తుతించి అతని వాదములను ఖండించినాడు. శంకరుని ఉపదేశసాహస్రిలో 18వ అధ్యాయ మందలి **142** వ శ్లోకమున ధర్మకీర్తిదని చెప్పబడు

> అభిన్నోఽపి హి బుద్ధ్యాత్మా విపర్యాసిత దర్శనైః
> గ్రాహ్యగ్రాహక సంవిత్తి భేదవా నివ లక్ష్యతే॥

అను శ్లోకము కన్పించుచున్నది. ఈ శ్లోకము, శారీరకభాష్యమున **2. 2. 28** లో సూచింపబడిన శ్లోకము విజ్ఞానవాదమును ప్రతిపాదించునవి. కాని యోగాచార సౌత్రాంత్రిక మతములకు సమన్వయమును కూర్ప యత్నించినవాడు ధర్మకీర్తి. వేదాంతసూత్రము 2 2 **28** పై గల భాష్యమున

> **అత ఏవ సహోపలంభ నియమోఽపి ప్రత్యాయ**
> **విషయయో రుపాయోపేయ భావ హేతుకః ।**
> **నాభేద హేతుకః ఇత్యభ్యుపగంతవ్యం ॥**

అని గలదు. ధర్మకీర్తిదని

సహోపలంభా నియమా దభేదో నీలతద్ధియోః।
భేదశ్చ భ్రాంతి విజ్ఞానై ర్దృశ్యేతేం దా వివాద్వయే॥

అనుశ్లోక మున్నది. కాని, ఈ శ్లోకము యొక్క పూర్వార్థమే ప్రమాణవినిశ్చయమున, ఉత్తరార్థమే ప్రమాణవార్తికమున కన్పించుచున్నవి. ఏడవ శతాబ్దారంభమునకు చెందిన ధర్మకీర్తి ప్రాచీనుల కారికలలోని భాగములను తన కారికలలో స్వేచ్ఛగా వాడినాడు. ఈ కారిక వస్తుతః దిఙ్నాగునిదై యుండుటకు చాల అవకాశము గలదు గనుక శంకరున కంటె ముందే ధర్మకీర్తి గలడని వాదించుటకు వీలు లేదు.

బృహదారణ్యక భాష్యవార్తికమున సురేశ్వరుడు ధర్మకీర్తి యొక్క అన్యాపోహవాదమును విమర్శించుచు, తాను చెప్పిన త్రిలక్షణ హేతువునే తా నీసందర్భమున వదలివేసె ననినాడు—

అథాన్యాపోహవ ద్వస్తుగమ్యం గమక మేవ చ
వక్తవ్యం తత్ర త్రై(ం మాన మదృష్టా న త్రిరూపతా॥ (పుట 1521)

క్రీ. శ. 700 ప్రాంతము వాడగు శాంతరక్షితుడు తన తత్త్వసంగ్రహమున

అథావిభాగ మేవేదం బ్రహ్మతత్త్వం సదాస్థితమ్।
అవిద్యోపప్లవా ల్లోకే విచిత్రం త్వభిమన్యతే॥ (పుట 144)

అని చెప్పినాడు. శాంతరక్షితుని శిష్యుడగు కమలశీలుడు తత్త్వసంగ్రహమునకు పంజికను వ్రాసెను. ఈ శ్లోకమును పంజికలో వివరించుచు "యథావిశుద్ధమాకాశం..." "తథేద మమృతం..." అనుకారికలను బృహదారణ్యక వార్త్తికము నుండి ఉదహరించెను. దీనినిబట్టి సురేశ్వరుడు క్రీ.శ. 700 కు ముందే ఉన్నాడనక తప్పదు. సురేశ్వరున కన్న ముందు ధర్మకీర్త్తి గలడు.

దిఙ్నాగుని శిష్యుడు ధర్మకీర్త్తి యొక్క గురువు కుమారిలుని మేనల్లుడగు ధర్మకీర్త్తి త్రిమలయమున లేక తిరుమలయమున జన్మించెను. దీనికి సంస్కృతము శ్రీశైలమని శ్రీపర్వత మని అగును. లేనిచో ధర్మకీర్త్తిజనించినది తిరుమల అని చెప్పవచ్చును. తన వాదన్యాయమున ఉద్యోతకరుని, కుమారిలుని తీవ్రముగా విమర్శించెను. ప్రమాణవార్త్తికమున (2.326-7) అద్వైతమందలి అపరోక్షానుభూతిని విమర్శించి నాడు. శంకరునకు ముందు ఈ అపరోక్షానుభూతిని సరిగా ప్రతిపాదించినవారులేరు. ధర్మకీర్త్తి క్రీ.శ. 390 నుంచి 470 వరకుగల కాలమువాడని చెప్పనగును.

శంకరుడు, కుమారిలుడు విజ్ఞానవాదమును పూర్త్తిగా విమర్శించుట వలన ఈ విజ్ఞానవాదమును సౌత్రాంత్రిక వాద ముతో సమన్వయించినచో నది పటిష్ఠము కాగలదని ఎంచిన వాడు ధర్మకీర్త్తి. సౌత్రాంత్రికమతమున కుమారిలుని ప్రమాణ వాదమును చాలవరకు ఇమడ్చవచ్చును. ధర్మకీర్త్తి కుమా రిలుని విమర్శించగా, శంకరుడు ఈ ధర్మకీర్త్తినుంచి పంక్తుల

నుదహరించెనని వాదించినచో శంకరుడు కుమారిలుని కలసి కొనుటకువీలులేదని స్పష్టముగా చెప్పవలసివచ్చును. ఈ విష యమును మనము విస్మరింపతగదు.

మాండూక్యకారికలను, సాంఖ్యకారికావ్యాఖ్యను, శ్రీవిద్యాగ్రంథమునురచించిన గౌడపాదుడు చాలప్రాచీనుడు. నాల్గైదు శతాబ్దములకు చెందిన జ్ఞానవివేకుడు. గౌడ పాదుని గ్రంథములనుంచి వాక్యముల నుద్ధరించెను. సాంఖ్య కారికపై ఈయన వ్రాసిన టీకను 560 లో చీనాభాషలోనికి అనువదించిరి. గురురత్నమాలలో, గౌడపాదుడు పతంజలి భాష్యమును బాగుగా శిష్యులకు వివరించెడివాడని, ఈయన శిష్యులలో అపలోనియస్ అను గ్రీసుదేశీయుడు కలడని తెలియుచున్నది.

అభియుంజ దయార్చ్య పూజ్యపాదా
నపలూన్యాది నిషాక సిద్ధనేత్రాన్ ।
అథ గౌడపాదాన్ ఫణీశభాష్య
ప్రథమాచార్యక పండితాన్ ప్రపద్యే ॥

అను శ్లోకమున గల అపలూనియే అపలోనియస్ క్రీ. శ. 172 లో లెమ్నస్ అను ద్వీపమున జన్మించిన ఫిలోస్ట్రాటస్ అను పండితుడు అపలోనియస్ యొక్క జీవితచరిత్రను రచించెను. సెప్టిమస్ సెవెరస్ యొక్క భార్య యగు జూలియాడోమ్నా ఈయనను తన ఆస్థానమున నిలిపి ఆ జీవిత చరిత్ర వ్రాయమని చెప్పెను. చాలా ముదుసలి యైన

తర్వాత అపలోనియస్ మరణించె నని, ఆయన మరణించి దాదాపు నూరేండ్లు ఆయెనని చెప్పి అతనిని గూర్చి తాను సేకరించిన సమాచారము నామె ఫిలోస్ట్రాటస్‌కు ఇచ్చెను. అపలోనియస్ యొక్క శిష్యుడగు దామిస్ వ్రాసిన గ్రంథము, మాక్సిమస్ రచించిన గ్రంథము ఈయనకు తోడ్పడినవి. పైగా అపలోనియస్ ఏ యే ప్రదేశములలో నుండెనో వాటి నన్నిటిని దర్శించిన తర్వాత నే జీవితచరిత్రను వ్రాసెను. ఈ జీవితచరిత్ర మనకు చాల ఉపకరించునది. ఇందు గౌడపాదశబ్దము కన్పించకున్నను అప్పటికి వేదాంతమును భారతదేశ మేస్థితిలో నున్నది తెలియ గలదు.

క్రీస్తుశకారంభమున జన్మించిన అపలోనియస్ బాబిలన్‌లోని మత గురువులను, భారతదేశపు బ్రాహ్మణులను కలసికొని మాట్లాడెను. బ్రాహ్మణులని, హిర్కేనియనులని పిలువబడు భారతీయ ఋషులను సందర్శించవలె నని చిన్నప్పటినుంచి తలపోసెను. చివరకు కాకసస్ ద్వారా ప్రయాణము చేయుచు భారతదేశమును చేరెను. తక్షశిలలో డయొనీసియస్ అను దేవుని దర్శించెను. సింధునదీ ప్రాంతమును పాలించు రాజునకు ఇతనిని పరిచయముచేయు లేఖను వర్దనస్ ఇచ్చెను, అక్కడ సూర్యమందిరమును అపలోనియస్ దర్శించెను. సింధురాజు వేదాంతియని ఆయనకు గౌరవమర్యాదలు చేయవలెనని అపలోనియస్ నిశ్చయించెను. ఆ రాజుపేరు ఫ్రావతెస్. ఇతనికి గ్రీకుభాష బాగా తెలియునట. ఈరాజువద్ద భారతీయ దార్శనిక శాస్త్రవిషయములను అపలోనియస్ తెలసికొనెను. "మేము 18 వ యేట రావి నదిని దాటి

తూర్పునగల బ్రాహ్మణపండితులను దర్శింతుము. వారి ఆదేశానుసారము మేము ధర్మనముల పఠింతుము. ఈ పఠనకు యోగ్యతను నిర్ణయించు పరీక్షయొకటి ఉన్నది" అని ఆ రాజు చెప్పెనట.

ఈ ఋషులు రావి నదికి గంగానదికి మధ్యగల దేశమున వసింతురు. అచ్చట వయోవృద్ధుడు జ్ఞానవృద్ధుడు నగు ఇయార్చస్ అనుఋషికి సింధురాజు ఒకఉత్తరము వ్రాసి అపలోనియస్ చేతికొసగెను. ఇయార్చస్‌నే గురురత్నమాల అయార్చస్ అని పిలచినది. ఈయనే గౌడపాదుడు. "గురువగు అయార్చస్‌నకు, ఆయన సతీర్థులకు శిష్యుడగు ఫ్రౌవతెస్ ప్రణామములు చేసి వ్రాయునది. అందరికన్న వివేకవంతుడగు అపలోనియస్ మీ రింకను వివేకవంతులని తెలసికొని, మీ వద్ద విద్య నభ్యసించుటకు వచ్చుచున్నాడు" అని ఆ లేఖలోని విషయము. గంగామైదానమును చేరిన అపలోనియస్ "భారతీయులకు తమ రాజుకంటె ఈఋషులనిననే ఎక్కువ భయము, భక్తి ఉన్నవి. రాజ్యమునంతయు పాలించు రాజే ఈఋషులను సంప్రదించి వ్యవహరించునుగదా" అని తలపోసెను. కనుబొమలమధ్య అర్థచంద్రాకృతిగల తిలకమును ధరించిన బ్రాహ్మణు డీయన కెదురువచ్చెను. అచ్చటిప్రజల కందరకు గ్రీకుభాష తెలియునట. ఈ భారతీయుడు పేరుపెట్టి అపలోనియస్‌ను పిలచి, ఆయనను ఆశ్చర్యమున ముంచెను. "భూమిపై నివసించుచు భూమితో సంబంధము లేకుండా ఉండి, ప్రాకారాదులులేకయే సురక్షితజీవితములను గడపుచు

ధన మేమియు లేకపోయినను దేశమందలి ధనమున కంతకును అధిపతులై యుండి, దేశసంపదకై నిత్యము సూర్యుని ప్రార్థించు బ్రాహ్మణులను నే జూచితిని" అని ఈజిప్టు దేశీయులతో అపలోనియస్ అనినాడు.

ఋషులు ఆత్మజ్ఞానమును గూర్చి చర్చింతురని చెప్పినాడు. "మేము ఈజిప్టు దేశీయులకు నేర్పిన పునర్జన్మలను గూర్చిన వాదమును పిథగోరస్ వారివద్ద తెలసికొనెను" అని ఋషులనిరట. రాజును చంపిన భారతీయులను దేశమునుంచి వెడలగొట్టిరని అపవిత్రులైనవారు ఇథియోపియా చేరిరని వారివద్ద పలువురు తత్త్వాధ్యయనము గావించిరని పల్కినాడు.

గౌడపాదశబ్దము బిరుదనామము లేక పౌరుషనామము కావచ్చును. అయార్చ్యపూజ్యపాదుడు గ్రీకుల ధర్మతావాదమును చర్చించి త్రోసిపుచ్చెను. గ్రీకులు చతుర్భూతములనే అంగీకరించిరి. కాని అయార్చ్యని వద్ద పాంచభౌతిక వాదమును అపలోనియస్ గ్రహించెను. ఈ విశ్వమున అంతర్యామిగా ఆత్మ కలదు. ఈ విషయముల నన్నిటిని తెలిసికొనుచు అపలోనియస్ వారి వద్దనాల్గునెలలు గడిపెను. తర్వాతికాలమున స్వదేశమునకేగినను ప్రతిదినము మూడు సార్లు సూర్యోపాసన చేయుట ఆయన వదలలేదట.

ప్రథమ శతాబ్దముననే గౌడపాదుడునివసించెనని దీని వలన తెలియుచున్నది. ఈయన శిష్యుడు శంకరుని గురువైనచో శంకరుడు రెండవ శతాబ్దమునకు చెందినవాడని చెప్పవలెను. ఇది కుదరదు. ఒకప్పుడు గౌడపాదుడు సాంఖ్య

దార్శనికుడు. సాంఖ్యులు, మాధ్యమికులు కలసి యోగాచార వాదమును ఖండించిరి. ఇట్లే సాంఖ్యులు, అద్వైతులు కూడా యోగాచారమును తీవ్రముగా విమర్శించిరి. గౌడపాదుడు విమర్శించిన యోగాచారవాదము లంకావతారసూత్రము మొదలగు ప్రాచీన బౌద్ధగ్రంథములలో కన్పించునదేగాని, తర్వాతి కాలపుది మాత్రముకాదు.

గౌడాది శంకరాంతాశ్చ సప్తసంఖ్యా సమీరితాః

అని విద్యారణ్యుని శ్రీవిద్యార్ణవమున గలదు. గౌడపాద, పావక, పరాచార్య, సత్యనిధి; రామచంద్ర, గోవిందులైన తర్వాత శంకరుడు వచ్చెను. ఇట్లే శ్రీశుకునకు గౌడపాదునకుమధ్య చాలమంది ఆచార్యులు కలరని, శాంకర సంప్రదాయ ప్రవర్తకుడు కపిలమహర్షి అని, కపిలుని నుంచి గల ఆచార్యపరంపరలో 71 వ వాడు శంకరుడని, ఈశంకరుని శిష్యులు పదునాల్గురని, వీరందరు దేవీ ఉపాసకులని శ్రీవిద్యార్ణవమునగలదు. గౌడపాదునితర్వాత కనీసము 150 సంవత్సరములైన గడచిననే శంకరుని సమయము రాగలదు. గౌడపాదుని కాలమును వేరొకరీతిగా సాధింపవచ్చును. క్రీ.శ. 450 ప్రాంతమువాడగు భావవివేకుడు తన 'తర్కజ్వాల' లో నాలుగు మాండూక్య కారికలను ఉద్ధరించెను. సాంఖ్యము నుంచి మాధ్యమకము నాశ్రయించిన భావవివేకుడు తనమతమునకు వేదాంతమునకు భేదము స్వల్పమే అనినాడు. గౌడపాదుని మాండూక్యకారికలు 2.25, 4.54

లలో విజ్ఞానవాద విమర్శ ఉన్నది. 4.90 లో పూర్వ మీమాంసను 'అగ్రయాన' మనినాడు. మహాయాన శబ్దము మొట్టమొదట ప్రచారములోనికి వచ్చిన సమయముననే 'అగ్రయాన' శబ్దప్రయోగము సార్థకమగును. ఇది మొదటి శతాబ్దమునకే సరిపోగలదు.

గౌడపాదునకు శంకరునకు మధ్య ఐదుగురు ఆచార్యు లుండిరని 'శ్రీవిద్యార్ణవము'న గలదు. గౌడపాదుని తర్వాత కనీసము 150 ఏండ్లైనను గడచినపుడే శంకరుడు జన్మించి యుండవలెనని దీనినిబట్టి తెలియుచున్నది. ఇంతేగాక, ఆచార్యనామము కూడ కొంతవరకు ఈ సమస్యను క్లిష్టము చేసినది. పీఠాధిపతియైన ప్రతి అద్వైతాచార్యుని శంకరా చార్యుడని పిలుచుట పరిపాటి యగుటచే వార్తికకారుడగు సురేశ్వరుడు వేరొక శంకరుని శిష్యుడు కావచ్చును. శంకరు నకు సురేశ్వరునకు మధ్య చాలకాల మున్నది.

సురేశ్వరునివాదమున బింబప్రతిబింబవాదము అవ చ్ఛేదవాదము కూడ కన్పింపవు. బృహదారణ్యక శ్రుతి 5.1.17 పై గల భాష్యమునకు వార్తికమునకు విరోధము కలదు. సురేశ్వరుడు 263 నుంచి 278 వరకు గల శ్లోకము లలో సంపత్తిని వివేచించుచున్నాడు. బృహదారణ్యకమున 3.5 మరియు 4.5.15 వాక్యములు సన్న్యాసమునకు సంబంధించి నవి. వీటిపై గల వార్తికములు కూడ శాంకరభాష్యమునకు సమ్మతమైనవి కావు. 3.5 వాక్యము సురేశ్వరుని ప్రకారము

ఒక అర్థవాద మాత్రమే (శ్లో 165-6). ఇట్లే 1.4.9 పైన (శ్లో 1055-6, 1436-7), 1.5.16 పైన (శ్లో 279-281) గల భాష్యవార్తికములకు సమన్వయము కుదురుట కష్టము. భాష్యకారుని వాదమున కీరితిగా విరుద్ధమైన వ్యాఖ్య చేసిన సురేశ్వరుడు భగవత్పాదుల శిష్యు డనిగాని, భగవత్పాదుల ఆదేశానుసారము వార్తికములను రచించె నని గాని చెప్పుట యుక్తియుతము కాదు.

మండనుడే సన్యసించి సురేశ్వరు డాయె నని కొన్ని శంకరవిజయము లనినవి. కొన్నింట విశ్వరూపుడు సురేశ్వరు డాయె నని గలదు. శృంగేరీ ఆస్థానపండితుడగు లక్ష్మణ శాస్త్రి మండనుడు వేరు, విశ్వరూపుడు వేరు అని చెప్పినాడు. మండనుడు కుమారిలుని తర్వాతవాడు.

మండనునివాదమున అవిద్యకు జీవుడాశ్రయము. నైష్కర్మ్యసిద్ధి (157-162) లో దీనికి భిన్నమైన వాదమున్నది. మహావాక్యములద్వారా అపరోక్షానుభూతి కల్గునను సురేశ్వర సిద్ధాంతమును మండనుడు తిరస్కరించినాడు. నానాజీవవాదము మండనునిది. ఏకజీవవాదమును గ్రహించిన సురేశ్వరుడు అవిద్యాలేశమును తిరస్కరించెను. సురేశ్వర మండనులు ఒకరే ఐనచో వాచస్పతి మండనుని మాత్రమే ఏల అనుసరించవలసి వచ్చినది? పైగా కుమారిలుని విపరీతఖ్యాతి వాదమును గ్రహించినవాడు మండనుడు. శాబ్దజ్ఞానమును, పరోక్షజ్ఞానముగా స్వీకరించిన మండనునిలో నైయాయిక

మతము కొంత గలదు. బ్రహ్మసిద్ధిలో శారీరక భాష్య విమర్శగలదని శంఖపాణి వ్యాఖ్య తెలుపుచున్నది.

భావనా వివేకమున కుమారిలుని ఉదహరించుటయే గాక, కుమారిలుని పేరు ఎత్తకుండా విమర్శించినాడు. (పుట 22,23). స్ఫోటసిద్ధిలో కుమారిలుని తూలనాడినాడు. స్ఫోట వాదమును, శబ్దాద్వైతమును సగౌరవముగా స్వీకరించిన మండనుడు సరియగు అద్వైతసంప్రదాయమును చేబట్టలేదు. అనేక విషయములలో మండనుడు అనుసరించు వాచస్పతి స్ఫోటవాదమును ఖండించినాడు. శంకర, కుమారిలుల తరు వాత వచ్చినవాడు మండను డని నిశ్చయింపవచ్చును.

విశ్వరూపుడు సురేశ్వరు డాయె నని చాల శంకర విజయము లనినవి. యాజ్ఞవల్క్య సంహిత పై 'బాలక్రీడ' అను వ్యాఖ్యను విశ్వరూపుడు రచించెను. దీనిపైగల టీకలో

యత్ప్రసాదా దయం లోకో ధర్మ మార్గస్థితః సుఖీ ।
భవభూతి సురేశాఖ్యం విశ్వరూపం ప్రణమ్య తమ్ ॥

అని యతీశ్వర వేదాత్మ వ్రాసెను. భవభూతి, విశ్వరూపుడు, సురేశ్వరుడు ఒక వ్యక్తికి గల పేర్లని ఇతనిభావము. భవభూతికి ఉంవేకుడను పేరుగలదని, ఉంవేకుడే మండను డని ఒక అసంగతవాదముకలదు. ఉంవేకుడని పిలువబడు భవభూతి యశోవర్మ (క్రీ.శ. 725-752) కాలమువాడు. క్రీ.శ. 733 లో యశోవర్మను కాశ్మీరరాజగు లలితాదిత్యు డోడించెను. మండ నుని భావనావివేకమును వ్యాఖ్యానించిన ఉంవేకుడు మూల

మున గల మాటలకు పాఠాంతరములను అనేకపర్యాయములు చెప్పినాడు. కొన్ని వాక్యములకు ప్రకారాంతరముగా నానార్థముల నిచ్చినాడు. ఒకచోట (పుట) మండనునితో ఏకీభవించుటకు నిరాకరించెను.

వేదాంతసూత్రములు **2.2.22, 24** పై గల భాష్యమున గుణమతి వ్రాసిన అభిధర్మకోశవ్యాఖ్య నుండి పంక్తులు ఉదహరించబడినవి. గుణమతి దిఙ్నాగుని కన్న పూర్వుడు దిఙ్నాగుని తర్వాతివారు వ్రాసినగ్రంథముల నుండి శంకరుడు ఉదహరించినట్లు కన్పించదు.

కుమారిలుని తర్వాత శంకరుడు జన్మించినట్లు, మరణ దశలో నున్న కుమారిలుని శంకరుడు కలసికొనినట్లు శంకర విజయములు చెప్పుచున్నవి. పైగా కొన్ని గ్రంథములలో శంకరుని తండ్రియే భాట్ట, ప్రాభాకర మీమాంసలను పఠించినట్లున్నది. అందుచే శంకరునకు కుమారిలునితో ఎట్టి సంబంధము గలదో విచారించవలసి యున్నది.

ఉపదేశసాహస్రీ లో 18 వ అధ్యాయమున గల 139-141 శ్లోకములలోను, తైత్తిరీయోపనిషద్భాష్యము యొక్క ఉపోద్ఘాతమున కర్మమీమాంసమతము ప్రస్తుతింపబడినది. ఈమతము శ్లోకవార్తికమున (671 పేజీలో, శ్లోకం 110) గలదు. అంతకు ముందే ధర్మశాస్త్రములలోను, శాబర భాష్యమున కర్మమీమాంసావాద ముండుటచే శంకరుడు ప్రస్తుతించినది కుమారిలుని మతమే యనుట కుదరదు.

శంకరుడు కుమారిలుని రచనల నుంచి ఏమియు నుపహరించ లేదు. కుమారిలుడు స్రాంగ-సాన్‌గాంపో (629-698) అను రాజునకు సమకాలికు డని లామా తారానాథు డనినాడు. ధర్మకీర్తికి మేనమామ కుమారిలుడు గనుక ఇతని కాలము క్రీ. శ. 550 కి ముందే ఉండవలెను.

విరుద్ధోదాహరణ లేనిచోట ప్రతిజ్ఞావాక్యము నెట్లు సాధించవలెనో చర్చించుచు కుమారిలుడు తన శ్లోకవార్తిక మున భావవివేకుని మతమును (నిరాలంబవాదము 27, 38-39) ప్రస్తుతించెను. నిరాలంబ (121, 154-5), శూన్య (8, 9) వాదఖండములలో తన ప్రతిపక్షి సాంఖ్యమును పరిత్యజించిన వాడని అవహేళన చేసినాడు. శాంకరాద్వైతమును బాగుగా ఎరిగిన భావవివేకుని తర్వాత వచ్చినవాడు కుమారిలుడు.

శూన్య (8, 9), నిరాలంబ (129-131, 155) ఖండ ములలో అద్వైతమును, ఆకృతి (48) ఖండమున సత్తావాద మును కుమారిలుడు ప్రస్తుతించెను. రెండవ సూత్రముపై గల 143, 148 వ కారికలలో శూన్యవాదము, అద్వైతము తుల్యదర్శనము లని, ఈ రెంటిలో అద్వైతమే బాగా చెడ్డ దని భావించినాడు. అద్వైతమున గల సామాన్యము, ప్రమాణవ్యవస్థ, అవిద్య అనునవి తీవ్రముగా విమర్శింప బడినవి (1.1.4.113-6, నిరాలంబ 159). అవిద్యకు బ్రహ్మకు గల సంబంధము, స్వయంప్రకాశమగు చైతన్యస్వరూపము

వివేచింపబడినని (సంబంధాక్షేప పరిహార 82-86, ఆత్మ వాద 148-9)

శరీరము కంటె అతిరిక్తమైన ఆత్మ ఉన్నదని కుమారిలుడు నిర్ధారణ చేయవలసి యున్నది. నిత్యము, సర్వవ్యాపి అగు జీవుని స్థాపించి, నాస్తికాదుల మతములను తిరస్కరించుచు

ఆత్మాస్తితాం భాష్యకృదత్ర యుక్త్యా।
దృఢత్వ మేత ద్విషయప్రబోధః॥
ప్రయాతి వేదాంతనిషేవణేన॥

అనినాడు. ఇచట వేదాంతశబ్దమునకు శాంకరాద్వైతమను అర్థము చెప్పినచే ఈశ్లోకము అర్థవంతము కాగలదు. శంకరుని తర్వాత వచ్చినవాడు కుమారిలుడు.

దిఙ్నాగుని కాలమున గాని, దాని తర్వాత గాని శంకరు డున్నట్లు గ్రహించితిమి. దిఙ్నాగు డెప్పటివాడు? కుమారజీవుడు (383-413) దిఙ్నాగుని గురువగు వసుబంధుని జీవితచరిత్ర వ్రాసెను. తన కృష్ణచరిత లో

వర్ణితా అష్టగురవో దిఙ్నాగ ప్రతిపక్షిణః॥

అని సముద్రగుప్తు డనెను. తన ఆస్థానమున దిఙ్నాగుని ప్రత్యర్థులైన ఎనిమిదిమంది గురువు లున్నా రనినాడు. అప్పుడు దిఙ్నాగుని కాలము 300 నుంచి 380 వరకు కాగలదు. నాల్గవ శతాబ్దమున దిఙ్నాగు డుండినచో, శంకరుని కాలము

ఇంతకంటె ముందు కాజాలదు. కావున క్రీ. త. 350 కి 650 కి మధ్య గల కాలములో శంకరుని జనన మని చెప్పుటకు వీలున్నది.

దిఙ్నాగుని సమకాలికు లగు బుద్ధపాలిత వివేకులు విజ్ఞానవాదము తీవ్రముగా విమర్శించిరి. తన 'కరతలరత్నము'న అనిర్వచనీయతావాదమును, నిర్గుణాత్మను, అద్వితీయమైన ఆత్మను ప్రస్తుతించిన భావవివేకుడు క్రీ. త. 450 ప్రాంతమువాడు. దీనికి ఇంచుమించు దగ్గరలో శంకరుని జనన ముండవలెను. శాంకరాద్వైతముతో భావవివేకునకు బాగా పరిచయమున్నది గనుక క్రీ. త. 300 కు 400 కి మధ్య గల కాలమున శంకరుని జననము ఉండవలెను. విభవ, సర్వజిత్, నందన మొదలగు సంవత్సరము లని కొందరు ఇచ్చియుండుటచే క్రీ. త. 368 లో గాని, 387 లో గాని, 392 లో గాని శంకరుడు జన్మించెనని చెప్పవీలగుచున్నది. శంకరుడు ముప్పదిరెండుసంవత్సరములే జీవించియున్నచో క్రీ. త 400 గాని, 419 గాని, 424 గాని నిర్యాణకాలము కాగలదు.

కుమారిలుని మేనల్లుడు ధర్మకీర్తియే గాని మండనుడు కాడు. అప్పుడు కుమారిలునకు శంకరునితో సమావేశము జరిగియున్నచో కుమారిలుడు ధర్మకీర్తిని ఓడింపుమని చెప్పియుండుటకు వీలున్నది. కాని దిఙ్నాగుని కంటె చిన్న, కుమారిల ధర్మకీర్తుల కంటె పెద్ద అగు శంకరుడు వీరిని కలసికొని యుండకపోవచ్చునని కూడ మనము మరువరాదు.

గౌడపాదుని నుంచి ఈ దార్శనికుల సమయముల నీ క్రిందిరీతిగా చూపవచ్చును.

గౌడపాద	70-150
పావక	120-200
పరాచార్య	160-240
సత్యనిధి	210-290
రామచంద్ర	260-340
గోవింద	320-410
శంకర	392-424

శంకరుని కాలమునకు చెందిన ఇతర దార్శనికుల కాలమును ఇట్లు చూపవచ్చును.

దిఙ్నాగ	320-400
భావవివేక	360-440
కుమారిల	360-440
ధర్మకీర్తి	400-480
మండన	420-500

వార్తికకారుడగు సురేశ్వరుడు ధర్మకీర్తి యొక్క సమకాలికుడు కావచ్చును.

3. గోవిందుని శిష్యుడు

శ్రీ మచ్ఛంకర భగవత్పాదులు కేరళ దేశమున జన్మించిరని అనేక శంకరవిజయములు చెప్పుచున్నవి.

దేశేఽస్మిన్ విలసతి కాలటీతి నామ్నా।
గ్రామః కోఽప్యవనిసురైర్విభాసమానః ॥

అని గురువంశకావ్యమున (1.37) గలదు. కేరళలో గల కాలటి అను గ్రామమున ఆచార్యులవారు జన్మించిరి. బ్రాహ్మణులతో విరాజిల్లుచున్న అగ్రహారము కాలటి.

"అలకేవ పురీ యత్ర కాలటీతి ప్రతిశ్రుతా"

అని శంకరవిజయవిలాసము కాలటిని అలకాపురితో పోల్చినది. అని మాణిక్య విజయమున

తేషా ముత్పాటనార్థాయ సృజా మ్యాశు మదంశతః।
కేరళే శశలగ్రామే విప్రపత్న్యాం మహేశ్వరి ॥ (1.8.23)

అని కలదు. దీనికి అనుకరణ యగు శివరహస్యమున

కేరళేషు తదా విప్రం జనయామి మహేశ్వరి।
కేరళేషు శశలగ్రామే విప్రపత్న్యాం మదంశజః
భవిష్యతి మహాదేవి శంకరాఖ్యో ద్విజోత్తమః ॥

అనియున్నది. కేరళదేశమున శశల గ్రామముకలదని, అందొక బ్రాహ్మణునిఇంట శివాంశ సంభూతుడైన శంకరుడు జన్మించెనని శివరహస్య మాణిక్యవిజయములు చెప్పుచున్నవి. కాలటి అను గ్రామమే నేడుమనకు కన్పించునది.

పాన్నియూరను గ్రామమును కారణాంతరములవలన వదలి కొందరు నంబూద్రి బ్రాహ్మణులు కాలటిలో నివసింప సాగిరి. రాజశేఖరుడనురాజు కాలటి మొదలగు గ్రామములను నిర్మించెనని, వీటిలో అధిక సంఖ్యాకులు నంబూద్రి బ్రాహ్మణులే ఒకప్పు డుండెడివారని చెప్పుదురు. ప్రస్తుతము కాప్పిల్లి, తల్లైయాత్తుంపల్లి అను రెండువంశములకు చెందినవారే కన్పించెదరు.

కాలటి లో విద్యాధిరాజు అను బ్రాహ్మణుడొకడు గలడు. ఈయన కాప్పిల్లి వంశజుడు. సకలశాస్త్ర పారంగతుడైన విద్యాధిరాజు యొక్క కుమారుడు శివగురువు.

ద్విజో విద్యాధిరాజోఽభూత్ ఖ్యాతః కేరళదేశగః ।
గృహే తస్య భవత్పుత్రో నామ్నా శివగురుః స్మృతః ॥

అని గురుపరంపరాచరిత్రలో గలదు. శివగురువు యొక్క భార్య పేరు సతీదేవి అని కొన్ని గ్రంథములలోను, ఆర్యాంబ అని ఇతరత్ర చెప్పబడినది. వైక్యం అనుస్థలమునకు సమీపమున గల పాలూరు వంశము నుంచి వచ్చినది ఆర్యాంబ. శివగురువు ఆత్రేయ సగోత్రుడు.

ఆర్యాంబాశివగురువుల కెంతకాలమునకు సంతానము కలుగలేదు. కాలటి సమీపమున అనేక పుణ్యస్థలములున్నవి. ఉత్తరముగా ఒకమైలుదూరమున దుర్గామందిరము, శివాలయము గలవు. పూర్ణానదీతీరమున గల కాలటికి

దగ్గరలో వృషాచలము గలదు. శివగురు ఈ వృషాచలమున కేగి శుద్ధమానసముతో అనేక నియమములతో తపస్సు చేయ సాగెను.

తతః శివగురుః కాలే పుత్ర మిచ్ఛన్ గుణాకరమ్ ।
శంభు మారాధయామాస ధ్యాయ న్ననన్య మానసః ॥

అని గురుపరంపరాచరిత్ర చెప్పుచున్నది. సుపుత్రుడు కావలెనను కోరికతో శివుని ధ్యానించ మొదలిడెను. కొంతకాలమునకు శివుడు సంతసించి స్వప్నమున దర్శన మొసంగి, "నీకోరికను తెలుపుము" అనెను. పుత్రభిక్షను శివగురువు అర్థించెను.

పుత్రాం స్తే బహువయసో బహూన్ కిమజ్ఞాన్ ।
ఏకం వా లఘువయసం దదామి సూనుమ్ ॥
సర్వజ్ఞం తమితి శివేన పృచ్ఛ్యమాన ।
స్త్వ స్త్వేకః సకలని దిత్యు వాచ విప్రః ॥

అని గురువంశకావ్యమున గలదు. (1.51). "అజ్ఞులై చాల ఏండ్లు జీవించు అనేకపుత్రులు కావలెనా? లేక అల్పాయువు కలిగి సర్వజ్ఞుడైన ఒక్క కుమారుని కోరెదవా? అని శివుడు ప్రశ్నించెను. సర్వజ్ఞుడైన ఒక్క పుత్రుడే చాలునని శివగురువు కోరుకొనెను.

తర్వాత కొంతకాలమునకు శివగురువు యొక్క భార్య గర్భవతి ఆయెను.

దృష్ట్వా శివగురు ర్యజ్వా భార్యా భార్యాం చ గర్భిణీమ్।
వృషాచలేశం సతతం స్మర న్నేకాగ్రచేతసా॥

అని చిద్విలాసీయ శంకరవిజయమున గలదు. ఆ సమయమున ఏకాగ్రతతో వృషాచలేశ్వరుని శివగురువు ధ్యానించు చుండెను.

చతుర్భిః సహశిష్యైస్తు శంకరోఽవతరిష్యతి.

అని వాయు, భవిష్యోత్తరపురాణములు,

'చతుర్భిః సహశిష్యైశ్చ శంకరోఽవతరిష్యతి'

అని సౌరపురాణము. మహేశ్వరుడే శంకరుడను పేరుతో నల్గురు శిష్యులతో అవతరించె నని చెప్పుచున్నవి. గర్భవతి యగు ఆర్యాంబ శుభముహూర్తమున మగపిల్లవానినికనెను.

సాధ్వీ సా కిల నవమేఽథ మాసి పూర్ణే
సల్లగ్నేఽధిపశశిసంశ్రితే కులీరే
కేంద్రోచ్చై ర్గురుశనిభూమిసూనుసూర్యైః
ప్రాసోష్టామిత మహసం సుఖేన సూనుమ్.

అని గురువంశకావ్యము (1.59). కర్కాటకలగ్నమున, లగ్నమున చంద్రుడు, కేంద్రములలో ఉచ్చలో గురు, శని, రవి, కుజులుండగా శంకరుడు జన్మించెను. శుభకేంద్రమున గురువు, ఉచ్చలో మూడు గ్రహములు అప్పుడు కలవని గురుపరంపరాచరిత. రవి, కుజ, శనులు ఉచ్చలోను, గురుడు కేంద్రమున గలరని మాధవీయ శంకరవిజయమున గలదు. మూడుగ్రహములు ఉచ్చయందుండుట రాజయోగము. అందులో కర్కాటకలగ్నమునకు భాగ్యరాజ్యాధిపతులు

ఉచ్చరాశులలో నుండి పరస్పరదృష్టికలిగి యుండుట విశేష యోగము. సప్తమాష్టమాధిపతి యగు శని చతుర్థకేంద్రమున ఉచ్చలోనుండగా, దశమాధిపతి ఉచ్చలోనుండి దశమమున వీక్షించుట పరమహంస పారివ్రజ్య యోగములలో శ్రేష్ఠమైనది.

శంకరుని జన్మసంవత్సరము నందన అని, విభవ అని, సర్వజిత్ అని రకరకములుగా చెప్పినారు. జననమాసము వైశాఖ మనుటలో అందరు నేకీభవించుచున్నారు. జన్మతిథి పంచమి అని పలువురు, దశమి అని కొందరు. జన్మనక్షత్రము ఆర్ద్ర యగుటచే పంచమి తిథియే ప్రామాణికమైనది. కటపయాదిగణన ప్రకారము శకారమున కైదవ తిథి, కకారమునకు మొదటి పక్షము, రేఫకు రెండవమాసము రాగలవని, అందుచే శంకరశబ్దముననే వైశాఖ శుద్ధ పంచమి గలదని కొందరు చమత్కరించిరి.

వైశాఖ శుద్ధ దశమినాడు శంకరుడు జన్మించె నని పలుకు శంకరమందారసౌరభ మాయన జన్మసంవత్సరము కలి 3889 కి సరియగు విభవ సంవత్సర మనినది. ఇది క్రీ.శ. 788 కి సరిపోవును. కాని శంకరుని శిష్యు డనబడు సురేశ్వరుని వార్తికముల నుంచి కారికలను క్రీ. శ. 700 లో గల శాంతరక్షితుడు ప్రస్తావించుటచే శంకరమందారసౌరభమున గల తిథి శంకర భగవత్పాదులది కాజాలదు. జగద్గురు పరంపరాస్తోత్రమున, శంకరాభ్యుదయమున గూడ ఈ తిథినే కలి 3889 లో చెప్పుటచే, అది కూడ భగవత్పాదు

లను వర్తించదు. క్రీ. శ. 788 లో వేరొకశంకరాచార్యుడు జన్మించియుండవచ్చునే గాని ప్రస్థానత్రయభాష్యకర్త కాదని పూర్వమే నిశ్చయించితిమి.

శంకరుడు శివుని అవతారముగా భావింపబడుటచే శంకరుని తలిదండ్రులకు పౌరుషనామము లే మిగిలినవి. శంకరుని తండ్రి అగుటచే శివగురు వను పేరువచ్చినది. శివుని భార్య సతీదేవి యగుటచే శివగురువుయొక్క భార్యను సతీదేవి యని, ఆర్యాంబ యని వ్యవహరించిరి. శంకరుని కనిన తలిదండ్రు లగుటచే వారు చిరస్మరణీయులు.

మహాపురుషులు తమ అలౌకిక గుణములను ప్రారంభ దశలోనే వ్యక్తము చేయ నారంభింతురు. శ్రీశంకరులు రెండవయేటనే వ్రాయను, చదువను నేర్చిరని, మూడవ యేట కావ్యపఠనము మొదలిడి రని అందురు. శివగురువు తనకుమారునకు చూడాకర్మను మూడవయేట చేసెను.

'బ్రహ్మవర్చసుకామస్య కార్యం విప్రస్య పంచమే'

అను వచనానుసారము బ్రహావర్చస్సును కోరుకొనువానికి ఐదవయేట ఉపనయనము చేయవలెను. ఉపనయనము చేయ కుండగనే తండ్రి మరణించెనని కొందరు, ఉపనయనానంత రమే పితృవియోగము కలిగెనని ఇతరులు చెప్పుచున్నారు. రెండవ మతము చిద్విలాసకృత శంకరవిజయమున గలదు. మొదటి మతము బహుజనామోదమునందినది. "ఉపనీత మకృత్వైవ మమార మహితః పితా" అని ఆనందగిరి "ఉప

నీయ దివంగతే స్వతాతే" అని సదాశివబ్రహ్మ. మాధవుని ప్రకారము శంకరుని మూడవయేట తండ్రి మరణించెను.

వేదవేదాంగములను, సకలశాస్త్రములను గురుకులమున అభ్యసించి శ్రీశంకరులు స్వగృహమునకే తెంచిరి. అప్పటికి ఏడేండ్లు నిండినవి. ఆ వయస్సునకే స్వాధ్యాయాధ్యయనమును, వేదాంగములను, దర్శనములను, ధర్మశాస్త్రములను సమగ్రముగా పఠించి ఇంటికి వచ్చిన శంకరుడు, జీవన్ముక్తుడే.

ఒకనాటి భిక్షాసమయమున ఒక దరిద్ర బ్రాహ్మణి యొక్క గృహమునకు శంకరుడు వెళ్ళినాడని, ఇంటిలో ఏమియు లేకపోవుటచే ఈ బ్రహ్మతేజస్సుతో విరాజిల్లు బ్రహ్మచారికి ఏమియు ఇవ్వజాలక పోయినందుకు దుఃఖించినదై, చివర కామె ఉసిరికాయను మాత్రమే అర్పించినదని, అప్పుడు శంకరుడు "కనకధారాస్తుతి" గావించెనని, దానితో ఆమె ఇంట బంగారు ఉసిరికాయలు వర్షించెనని చెప్పుదురు. ఆమెవంశీయులను నేటికి కూడా స్వర్ణాత్తు మనైకల్ అని పిలతురట. శంకరుడా సమయమున లలితాస్తవము చేసెనని మాధవీయము (4.27) న గలదు. శంకరుని రచనలలో కన్పించు స్తోత్రములద్వారా ఆచార్య జీవిత చరిత్రను చాలవరకు అల్లుటకు వీలున్నది. ప్రాచీనులు కనకధారాస్తవము ననుసరించి ఆమలకభిక్షను కథగా చెప్పిరి. ఇతరులు వేరొకరీతిగా ఈ స్తుతిని వివరించిరి.

తండ్రి అస్వస్థుడుగా నున్నపుడు శంకరుడు దేవీపూజ గావించి, పాలను నివేదించెను. ఎంతసేపటికిని ఆపాలను దేవి త్రాగకపోవుటచే, దేవి తనపై కోపించి అసంతుష్టయైన దని విలపించసాగెనట! అప్పుడామె ప్రత్యక్షమై, శంకరుని తన ఒడిలో కూర్చునబెట్టుకొని ఆ పాలను త్రాగింపజేసెను. దానితో శంకరుడు సర్వవిద్యాసంపన్నుడాయెను. ఈ గాథను సౌందర్యలహరీ వ్యాఖ్యలో లక్ష్మీధరుడు సూచించెను. ఆచార్యుని సర్వజ్ఞత్వమును సాధించుట కీ కథ బాగుగనే యున్నది. కాని ఎంతమంది దీనిని విశ్వసింపగలరు?

ప్రతిదినము నదీస్నానమునకు శంకరుని తల్లి పోవుచుండెడిది. ఒకనాడామె నడువలేక మార్గమధ్యమున పడిపోయెను. ఈ నదీస్నానమున కామె పోజాలదని గ్రహించి, పూర్ణానదీ ప్రవాహమును తన యోగబలముచే తమ ఇంటి దగ్గరగా పోవునట్లు శంకరుడు మార్చెనని చెప్పుదురు. శంకరుడు ఆసమయమున అధ్యాపకుడుగా నుండెనని మాధవీయము (5.31,32) న గలదు. జన్మతః ఆచార్యుడైన శంకరుడు అధ్యాపకుడుగా నుండుటలో ఆశ్చర్యమేమియు లేదు. కాని అంత చిన్నవయసుననే అధ్యాపకుడుగా నుండుట నిజముగా ఆశ్చర్యకరము.

శంకరుని విద్వత్త, లోకోత్తరశక్తి కేరళరాజగు రాజశేఖరుడు విని, శంకరుని తన ప్రాసాదమునకు పిలిపించెను. కాని వైరాగ్యమార్గమునకు దిగుచున్న శంకరుడు రాజసభకు

పోలేదు. అప్పుడు రాజశేఖరుడే కాలటి వచ్చి, తాను వ్రాసిన మూడునాటకములను శంకరునకు వినిపించి ఆయన చేసిన విమర్శలను రాజు సహృదయతతో స్వీకరించెనని కూడ ఒక కథ యున్నది. ఈ కథ గురువంశకావ్యము లోనిది.

శంకరుని ఎనిమిదవ యేట నదీస్నానము చేయుచుండగా ఆయన కాలిని ఒక మొసలి పట్టుకొనెను. అప్పుడు శంకరుడు తల్లిని పిలచెను. తల్లి భగవత్ ప్రార్థన గావింపసాగెను. మొసలిమాత్రము తనపట్టు విడువలేదు. ఇంక మృత్యువు తప్పదని తల్లికి తెలియజెప్పి సన్యాస గ్రహణమునకు అనుమతి నొసంగుమని శంకరుడు తల్లిని ప్రార్థించెను. ఆమె అనుమతిని ఇవ్వగనే శంకరుడు ఆతురసన్యాసమును పుచ్చుకొని, "అభయంసర్వభూతేభ్యో మత్తః స్వాహా" అని ప్రేషోచ్చారణ చేసెను. దానితో మొసలి, సంసారము అనురెండును ఒకేసారి వదలిపోయినవి. తల్లికి ప్రణమిల్లి, ఆమె ఎప్పుడు స్మరించిన అప్పుడామె చెంతకు రాగలనని వాగ్దానముచేసి వెడలెనని వేరొకకథ. సన్యాసము పునర్జన్మవంటి దగుటచే ఒక అపమృత్యుదోషమున కది నివారకమైనది.

అద్వైత వేదాంతము ననుసరించు స్మార్తులు ఏ ఆశ్రమము నుంచి యైనను సన్యసింపవచ్చును.

'యదహరేవ విరజే త్తదహరేవ ప్రవ్రజేత్'

అని జాబాల శ్రుతి. ఏసమయమున విరాగము కలిగిన ఆసమయ ముననే ప్రవ్రజింపవలెను.

"బ్రహ్మచర్యాదేవ ప్రవ్రజేత్"

అని జాబాల శ్రుతి పల్కుటచే బ్రహ్మచర్యాశ్రమమునుండి కూడ సన్యాసాశ్రమమును గ్రహింప వీలున్నదని తెలియు చున్నది.

గృహీత స్తేన నక్రేణ పాదే సర్వవిదాంవరః
అన్యాశ్రమం గమిష్యామి యత్తదగ్రే భవత్యలమ్।
ఇతి నిశ్చిత్య మనసా సన్యాసం కర్తు ముత్సుకః॥

అని చిద్విలాసుడు తన శంకరవిజయమున చెప్పినాడు. ఆశ్ర మాంతరమును స్వీకరించినచో మొసలి నుంచి గల అపాయము నివర్తింపబడ గలదని శంకరుడు తలపోసెను.

నక్రోఽంబ మాం నయతి తీవ్రతను ర్బలాఢ్యః।
సన్యాసవేషకరణే మమజీవితం స్యాత్॥

అని వ్యాసాచలుడు. సన్యాసమును స్వీకరించిననే ప్రాణములు దక్క గలవని శంకరుడు తల్లితో పల్కెను. ప్రేషోచ్చారణ చేసి సన్యసించినను శంకరుడు గురువుదగ్గర సన్యాసదీక్షను గ్రహించి, ఉపదేశమును పొందవలసి యున్నది.

'సంన్యస్య శ్రవణం కుర్యాత్' అను వచనము ననుస రించి శ్రీ శంకరుడు సంన్యసించి గురువును వెదకసాగెను. నర్మదాతీరమందున్న ఓంకారనాథమున వసించుచున్న శ్రీ

గోవిందభగవత్పాదుని సమీపించెను. శ్రీ గోవిందభగవత్పాదుని ఆశ్రమము బదరిలో గలదని చిద్విలాసీయ శంకర విజయము, వ్యాఘ్రపురమున ఈ ఆశ్రమ మున్న దని ఆనందగిరి శంకరవిజయము చెప్పుచున్నవి. కాని, గోవిందుని ఆశ్రమము నర్మదాతీరముననే గలదని అనేకులు వచించిరి.

'గ్రామే వా యది వాఽరణ్యే పుణ్యా సర్వత్ర నర్మదా'

అని పద్మపురాణము నర్మదను పుణ్యప్రదమైన నదిగా కొనియాడినది. హిరణ్యరేత, పురూరవసుల తపఃప్రభావవశమున నర్మద భూలోకమునకు వచ్చినదనియు, అమరకంటకము మొదలుకొని నర్మదాసంగమము వరకు పదికోట్ల తీర్థములున్న వనియు పురాణవచనముల వలన తెలియుచున్నది. నర్మదా తీరమున గల ఓంకారేశ్వరుడు ద్వాదశజ్యోతిర్లింగములలో నొకడు.

"కావేరికా నర్మదయోః పవిత్రే సమాగమే సజ్జనతారణాయ।
సదైవ మాంధాతృపురే వసంత మోంకార మీశం శివ మేక మీడే॥"

అని ఓంకారేశ్వరుని స్తుతించిన శంకరుడు ప్రణవోపదేశమునకై ఓంకారేశ్వరుని సమీపమున గల గోవిందుని ఆశ్రమమున చేరుట తెలియును.

గోవిందుడే పతంజలి యని శంకరు డాయనను స్తుతించి నట్లు మాధవీయమున (5-94) గలదు. పతంజలిచరిత మొదలగు దాక్షిణాత్య గ్రంథములలో ఈ కథ లున్నవి.

గోవిందుని రచన లేవియు మనకు లభించుటలేదు. ఆయన రచించిన మహాగ్రంథమే శ్రీ శంకరభగవత్పాదులు.

శ్రీగోవింద భగవత్పాదునకు ప్రణమిల్లి "నన్ను శిష్యునిగా గ్రహింపుడు" అని శ్రీ శంకరులు అర్థించగా 'నీవెవరు ?' అని ఆయన ప్రశ్నించెను. అంత ఆచార్యులు తన స్వరూపము నీరీతిగా వివరించిరి.

శ్లో॥ నాహం దేహో నేన్ద్రియా ణ్యన్తరఙ్గః
నాహఙ్కారః ప్రాణవర్గో న బుద్ధిః।
దారాపత్య క్షేత్రవిత్తాదిదూరః
సాక్షీ నిత్యః ప్రత్యగాత్మా శివోఽహమ్॥

శ్లో॥ రజ్జ్వజ్ఞానాద్ భాతి రజ్జౌ యథాఽహిః
స్వాత్మాజ్ఞానా దాత్మనో జీవభావః।
ఆప్తోక్త్యాఽహిభ్రాన్తినాశే స రజ్జుః
జీవో నాహం దేశికోక్త్యా శివోఽహమ్॥

శ్లో॥ మత్తో నాన్యత్ కించి దత్రాస్తి విశ్వం
సత్యం బాహ్యం వస్తు మాయోపక్లప్తమ్।
ఆదర్శాన్తర్భాసమానస్య తుల్యం
మయ్యద్వైతే భాతి తస్మాచ్ఛివోఽహమ్॥

శ్లో॥ అభాతీదం విశ్వ మాత్మ న్యసత్యం
సత్యజ్ఞానానన్దరూపే విమోహాత్।
నిద్రామోహాత్ స్వప్నవత్ తన్న సత్యం
శుద్ధః పూర్ణో నిత్య ఏకః శివోఽహమ్॥

శ్లో॥ నాహం జాతో న ప్రవృద్ధో న నష్టో
దేహస్యోక్తాః ప్రాకృతాః సర్వధర్మాః।
కర్తృత్వాది శ్చిన్మయస్యాస్తి నాహం
కారస్యైవ హ్యాత్మనో మే శివో౽హమ్॥

శ్లో॥ నాహం దేహో జన్మమృత్యుః కుతో మే
నాహం ప్రాణో క్షుత్పిపాసా కుతో మే।
నాహం చిత్తం శోకమోహౌ కుతో మే
నాహం కర్తా బన్ధమోక్షౌ కుతో మే॥

తా॥ నేను దేహమును గాను. నేత్రాది ఇంద్రియములును నేను గాను; అంతరంగమును గాను; అహంకారమును గాను; ప్రాణాపానాది పంచ ప్రాణములు, బుద్ధియును నేను గాను; దారాపుత్ర క్షేత్ర విత్తాది రూపమును నేను గాను; సాక్షీభూతుడు, నిత్యుడు, ప్రత్యగాత్మస్వరూపుడు, శివుడు నగు ఆత్మస్వరూపమును నేను.

మసకచీకటియందు రజ్జు వను జ్ఞానము లేకపోవుటచే ఆ త్రాటియందు సర్పభ్రాన్తి కలుగును. ఆరీతిగనే, స్వాత్మా జ్ఞానము వలన జీవభావ మేర్పడుచున్నది. ఆప్తవాక్యోపదేశము వలన సర్పభ్రాంతి తొలగి అది రజ్జువే యను నిశ్చయ జ్ఞానము కలుగును. ఈవిధముగనే గురూపదేశాదుల వలన నేను జీవుడను కాననియు ప్రత్యగభిన్న శివస్వరూపుడననియు దెలిసికొంటిని.

నాకంటె భిన్నమగు మరియొండు ప్రపంచము లేదు. బాహ్యవస్తువు దర్పణమందు ప్రతిభాసించు రీతిగా సత్య

వస్తువు మాయాపిహితమై అద్వయ బ్రహ్మాత్మస్వరూపుడ నగు నాయందు వెలుగొందుచున్నది. అట్టిఅద్వయబ్రహ్మ నిష్ఠుడ నగు నేను శివస్వరూపుడను.

స్వప్నమున గన్పట్టు ప్రపంచము అసత్యమయ్యు అజ్ఞానముచే సత్య మనిపించును. అటులనే సత్యజ్ఞానానన్ద రూపుడనగు నాయందు మోహాతిశయము వలన ఈ విశ్వము భాసించుచున్నది. స్వప్నప్రపంచము వలె ఇదియు మిథ్యయే. నేను నిత్యుడను,శుద్ధబుద్ధ ముక్తస్వభావుడను, పరిచ్ఛేదములేని పూర్ణస్వరూపుడను, అద్వయుడను అగు శివస్వరూపుడను.

నేను జన్మ, వృద్ధి క్షయములు లేనివాడను. సర్వ శాస్త్రములు వీటిని ప్రకృతిజములైన దేహధర్మములని పేర్కొనుచున్నవి. చిన్మయస్వరూపుడనగు నాకు కర్తృత్వ భోక్తృత్వాది ధర్మములు లేవు; ఇవి అహంకారధర్మములు. కాన, నేను సచ్చిదాత్మకమగు శివస్వరూపమును.

నేను దేహమును గాను. కాన జన్మమరణములు నాకు ఎట్లు సంభవించును? ప్రాణమునుగాను. కావున క్షుత్పిపాసాదులు నాకెక్కడివి? నేను చిత్తమునుగాదు. కనుక శోక, మోహాది దూరుడను. నేను కర్తనుకాదు. అందుచే నాకు బంధమోక్షము లనుమాట యట్టిది? అని భావము.

దీని తర్వాత శ్రీ శంకరులు 'నిర్వాణషట్కమ్' చెప్పిరి. దీనినే 'ఆత్మషట్కమ్' అని యందురు.

శ్లో॥ మనోబుద్ధ్యహంకార చిత్తాని నాహం
న శ్రోత్రం న జిహ్వా న చ ఘ్రాణనేత్రమ్ ।
న చవ్యోమ భూమి ర్న తేజో న వాయు
శ్చిదానన్దరూపః శివోఽహమ్ శివోఽహమ్॥

శ్లో॥ అహం ప్రాణసజ్ఞో న వై పఞ్చవాయు
ర్న వా సప్తధాతు ర్న వా పఞ్చకోశః ।
న వాక్ పాణిపాదౌ న చోపస్థాయూ
చిదానన్దరూపః శివోఽహం శివోఽహమ్ ॥

శ్లో॥ న పుణ్యం న పాపం న సౌఖ్యం న దుఃఖం
న మన్త్రో న తీర్థం న వేదా న యజ్ఞాః ।
అహం భోజనం నైవ భోజ్యం న భోక్తా
చిదానన్దరూపః శివోఽహం శివోఽహమ్ ॥

శ్లో॥ న మే ద్వేషరాగౌ న సౌఖ్యం న దుఃఖం
మదో నైవ మే నైవ మాత్సర్య భావః
నాధర్మో న చార్థో న కామో న మోక్ష
శ్చిదానన్దరూపః శివోఽహం శివోఽహమ్ ॥

శ్లో॥ నమృత్యు ర్న శఙ్కా న మే జాతిభేదః
పితా నైవ మే నైవ మాతా న జన్మ ।
న బన్ధు ర్న మిత్రం గురు ర్నైవ శిష్య
శ్చిదానన్ద రూపః శివోఽహం శివోఽహమ్ ॥

శ్లో॥ అహం నిర్వికల్పో నిరాకారరూపో
విభుత్వాచ్చ సర్వత్ర సర్వేన్ద్రియాణామ్ ।

న వా బన్ధనం నైవ ముక్తిర్న బన్ధః
చిదానన్ద రూపః శివోఽహం శివోఽహమ్ ॥

తా॥ మనోబుద్ధి చిత్తాహంకారములను నేనుగాను. త్వక్-చక్షు-శ్రోత్ర - జిహ్వా ఘ్రాణేంద్రియములును నేనుకాను. పృథివ్యాది భూతములు సైతము నేనుకాను. ఏతద్విలక్షణమైన శివస్వరూపమును నేను, నేను శివస్వరూపుడనే.

నేను ప్రాణసంగము కలవాడను కాను. ప్రాణ అపానాది వాయుపంచకమును నేనుకాను. రక్త మాంసాది సప్త ధాతు సంఘాతమును నేనుకాను. అన్నమయ ప్రాణమయాది పంచకోశములు సైతము నేనుగాను. వాక్, పాణి, పాదములు పాయూపస్థలు నేనుకాను. చిదానన్దాత్మకు డయిన శివుడను నేను, శివస్వరూపుడను నేనే.

నేను పాపపుణ్యముల కతీతుడను, సుఖదుఃఖవిదూరుడను, నాకు మంత్రానుష్ఠానము లేదు, తీర్థసంసేవనమును లేదు, వేదాధ్యయనము యజ్ఞ యాగాది కర్మానుష్ఠానమును నాకు విహితములు గావు. నేను భోక్తను కాను, భోజ్యమును గాను; భోజనమును గాను. నేను చిదానందస్వరూపుడయి వెలుగొందు శివస్వరూపుడను; శివస్వరూపుడను నేనే.

నేను రాగద్వేష రహితుడను. లోభ మోహ మద మాత్సర్యాది దోషములు లేనివాడను. ధర్మ-అర్థ-కామ-మోక్షములు నాకులేవు. నేను కేవలచిదానందస్వరూపుడగు శివస్వరూపుడను, నేనే శివుడను.

మృత్యువు, భయము, బ్రాహ్మణ-క్షత్రియాది జాతి భేదము ఇవి యేవియును నాకు లేవు. బంధు-మిత్రులుగాని, గురుశిష్యులు గాని నాకు లేరు. నేను శుద్ధ బుద్ధ స్వరూప మయిన చిదానంద శివరూపమును, నేనే శివుడను.

నేను నిర్వికల్పుడను; సర్వగతుడ నగుటవలన నిరా కార స్వరూపుడను. జ్ఞానేంద్రియములు కర్మేంద్రియములు వీని సంబంధము నా కెంతమాత్రము లేదు. నాకు బంధము లేదు గాన మోక్షమును లేదు. సచ్చిదానందస్వరూపు డయిన శివుడను నేను, నేనే శివస్వరూపుడను అని సారాంశము.

తర్వాత శ్రీ ఆదిశంకరులు చెప్పినది నిర్వాణ దశకమ్. దీనినే 'దశశ్లోకీ' అందురు.

శ్లో॥ న భూమి ర్న తోయం న తేజో న వాయు
ర్న ఖం నేన్ద్రియం వా న తేషాం సమూహః
అనైకాన్తికత్వాత్ సుషుప్త్యేకసిద్ధ
స్తదేకోఽవశిష్టః శివః కేవలోఽహమ్॥

శ్లో॥ న వర్ణా న వర్ణాశ్రమాచారధర్మా
న మే ధారణాధ్యానయోగాదయోఽపి।
అనాత్మాశ్రయా దహం మమాధ్యాసహానాత్
తదేకోఽవశిష్టః శివః కేవలోఽహమ్॥

శ్లో॥ న మాతా పితా వా న దేవా న లోకా
న వేదా న యజ్ఞా న తీర్థం బ్రువన్తి।

సుషుప్తౌ నిరస్తాతి శూన్యాత్మకత్వాత్
తదేకోఽవశిష్టః శివః కేవలోఽహమ్ ॥

శ్లో॥ న సాంఖ్యం న శైవం న తత్ పాంచరాత్రం
న జైనం న మీమాంసకాదే ర్మతం వా
విశిష్టానుభూత్యా విశుద్ధాత్మకత్వాత్
తదేకోఽవశిష్టః శివః కేవలోఽహమ్॥

శ్లో॥ న చోర్ధ్వం న చాధో న చాన్త ర్న బాహ్యం
న మధ్యం న తిర్యఙ్. న పూర్వాపరా దిక్
వియద్వ్యాపకత్వా దఖండైకరూప
స్తదేకోఽవశిష్టః శివః కేవలోఽహమ్॥

శ్లో॥ న శుక్లం న కృష్ణం న రక్తం న పీతం
న కుబ్జం న పీనం న హ్రస్వం న దీర్ఘమ్,
అరూపం తథా జ్యోతిరాకారకత్వాత్
తదేకోఽవశిష్టః శివః కేవలోఽహమ్॥

శ్లో॥ న శాస్తా న శాస్త్రం న శిష్యో న శిక్షా
న చ త్వం న చాహం న చాయం ప్రపఞ్చః।
స్వరూపావబోధో వికల్పాసహిష్ణు
స్తదేకోఽవశిష్టః శివః కేవలోఽహమ్॥

శ్లో॥ నా జాగ్ర న్న మే స్వప్నకో వా సుషుప్తిః
న విశ్వో న తైజసః ప్రాజ్ఞకో వా।
అవిద్యాత్మకత్వాత్ త్రయాణాం తురీయ
స్తదేకోఽవశిష్టః శివః కేవలోఽహమ్॥

శ్లో॥ అపి వ్యాపకత్వాద్ హితత్వప్రయోగాత్
స్వతఃసిద్ధభావా దనన్యాశ్రయత్వాత్ ।
జగత్ తుచ్ఛ మేతత్ సమస్తం తదన్యత్
తదేకోఽవశిష్టః శివః కేవలోఽహమ్ ॥

శ్లో॥ న చైకం తదన్యద్ ద్వితీయం కుతః స్యాత్
న వా కేవలత్వం న చాకేవలత్వమ్ ।
న శూన్యం న చాశూన్య మద్వైతకత్వాత్
కథం సర్వవేదాన్తసిద్ధం బ్రవీమి ॥

తా॥ నేను, పృథివ్యప్-తేజోవాయు రాకాశములను కాను. ఏదేని యింద్రియము గాని, లేక ఇంద్రియసంఘాతము గాని కాను. ఇవి యన్నియు అనైకాంతికములు, అనగా బాధిత ములు, వ్యభిచార దోషదూషితములు, వినాశశీలములు. కాన నేను సుషుప్తికి ఏకైకసాక్షిగ సిద్ధుడ నగుచున్నాను. ద్వైతవస్తుజాత మంతయు బాధితము కాగా అద్వితీయమై అవశిష్టరూపమై భాసించునట్టి రూపమే నేను. అది సచ్చిదా నందాత్మకమగు శివస్వరూపము. అట్టి ఆనందమయ మగు కేవల శివస్వరూపము నేనే.

బ్రాహ్మణత్వ క్షత్రియత్వాది వర్ణములు గాని, తత్తదుచితములైన ఆశ్రమధర్మములు గాని, నాకు లేవు; తత్సంబంధు లయిన ఆచారములును లేవు. ధ్యాన ధారణాది యోగములును నాకు లేవు. అధ్యాస అనాత్మ యగు అవి ద్యకు ఆశ్రయము. ఆత్మజ్ఞానము వలన అవిద్యాపరికల్పిత మైన అధ్యాస తొలగిపోవుటచే ఏకైకము అద్వితీయము

అవశిష్టము నగు శివస్వరూపము నేనే అయియున్నాను. శుద్ధ కేవల శివస్వరూపుడనై యున్నవాడను నేనే.

"ప్రత్యగభిన్నమైన శుద్ధ ఆత్మస్వరూపమునకు తల్లి దండ్రులు లేరు; ఇంద్రాది దేవతలుగాని, స్వర్గాది లోకములు గాని లేవు; వేదములు గాని తద్విహిత యజ్ఞయాగాది కర్మలు గాని, పుణ్యతీర్థసంసేవనము గాని, లే వనుచు శ్రుతు లుద్ఘోషించు చున్నవి. సుషుప్తి యందు అతిశూన్యాత్మకత్వము నిరస్తమగుట వలన అద్వయ మగు చిదానంద స్వరూపమే అవశిష్ట మగుచున్నది. అట్టి కేవల శివస్వరూపము నేనే అయి యొప్పుచున్నాను.

'తత్త్వమసి' అను మహావాక్య ఘటిత 'తత్' పదము శుద్ధ పరబ్రహ్మను ప్రతిపాదించును. అట్టి అద్వయ ఆత్మ తత్త్వమును సాంఖ్య, శైవ, పాంచరాత్ర, జైన, మీమాంసాది మతములు ప్రతిపాదింప సమర్థములు కాజాలవు; కావున వానివాదములు యుక్తిసహములును గావు. మహావాక్య జన్యమగు శుద్ధ ఆత్మతత్త్వానుభూతి నిర్వికల్ప సమాధియందు విశిష్టమై అలరారుచుండును. ఆ అనుభూతి విశేషముచే అద్వయమగు శివస్వరూపమే అవశిష్టమగుచున్నది. అట్టి శివస్వరూపుడు నేనే యగుచున్నాను.

పైన, క్రింద, లోపల, బయట, మధ్య, అడ్డము, తూర్పు, పడమర మున్నగు దేశభేదములు నాకు లేవు. సమస్త ఆకాశము నంతట వ్యాపించి సర్వగతుడనై భాసిల్లుట వలన

శుద్ధ శివస్వరూపము నేనే. అద్వయ అఖండ చిదానందాత్మకమై ఏ శివస్వరూపము అవశిష్ట మగుచున్నదో ఆ శివస్వరూపము నేనే.

ఆ శుద్ధ నిర్గుణ నిరాకార ఆత్మతత్త్వమునకు శుక్ల కృష్ణ, రక్త, పీతాది వర్ణములు లేవు. ఆ పరబ్రహ్మను అణు వని గాని, మహత్ అని గాని చెప్పజాలము. అది దీర్ఘమును గాదు, హ్రస్వమును గాదు. అది అనిర్వచ నీయము అప్రమేయము నిరాకారము. ప్రమాణాంతరములచే అగోచరమై యొప్పారుచుండును. ఆపరంజ్యోతి యొక్క జ్యోతి చేతనే సూర్య చంద్రాదులు సైతము భాసమాను లగుచున్నారు. అట్టి జ్యోతిస్వరూపము అద్వయమై మిగిలి శివస్వరూపమున వెలుగొందుచుండును. తాదృశ కేవల శివస్వరూపుడను నేనే యగుచున్నాను.

ఈ రీతిగ ప్రత్యగభిన్న ఆత్మతత్త్వ మగు నాకు విహితమగు శాస్త్రమును లేదు, ఆ శాస్త్రము నుపదేశించునట్టి ఉపదేశకుడును లేడు. నాకెవరు శిష్యుడును లేడు, వాని కొరకుగు ఉపదేశమును లేదు. శ్రోత యగు నీవు లేవు, వక్త యగు నేను లేను. అనగా కర్తృత్వ భోక్తృత్వాది ధర్మములు గాని కర్తృ, కరణ, కర్మ, క్రియాదులు గాని నాకు లేవు. అద్వయమగు ఆత్మతత్త్వావగతి ఎట్టి వికల్పమును సహింపనేరదు. కావున, అట్టి నిర్ధర్మక నిర్వికల్పక శుద్ధ శివతత్త్వమే అవశిష్ట మగుచున్నది. ఆ కేవల శివస్వరూపు డను నేనే.

జాగ్రత్-స్వప్న-సుషుప్తు లను మూడు అవస్థలును నాకు లేవు. విశ్వ-తైజస-ప్రాజ్ఞులలో నేను ఏ ఒకరిని కాను. జాగ్రత్-స్వప్న-సుషుప్తు లను మూడు అవస్థలును అవిద్యచే నేర్పడినవి. కావున, అవిద్యాకల్పిత మగు ఈ అవస్థాత్రయము కంటె విలక్షణుడనై తురీయస్వరూపమున అవశిష్టుడనై విరాజిల్లునట్టి అద్వయ శివస్వరూపు డను నేనై యున్నాను. కేవల శివస్వరూపుడను నేనే.

అట్టి నిర్గుణ శుద్ధ పరమాత్మతత్త్వము సర్వవ్యాపకము; అది హితము నుపదేశించునట్టిది; అది ప్రమాణాంతర సాధ్యము కాక స్వతస్సిద్ధమై భాసించునట్టిది. దానికి మరియొండు ఆశ్రయము లేదు. అట్టి పరబ్రహ్మ కంటె భిన్నమై జగత్తంతయు తుచ్ఛము, మిథ్యాభూతము. ఏతద్ విలక్షణమై, సర్వవ్యాపకమై ఏ చిదానంద శివస్వరూపము అవశిష్టమై యుండునో తాదృశ శుద్ధ శివస్వరూపుడను నేనే.

అద్వయాత్మస్వరూపము ఏకత్వసంఖ్యా విశిష్టము కాదు. కావున ఆపరబ్రహ్మకంటె భిన్నమగు రెండవవస్తువు ఎటనుండివచ్చును? ఏకత్వ- అనేకత్వాది ధర్మములు ఆ నిర్గుణస్వరూపమునకు లేవు. అది అద్వయ మగుటచే శూన్యమని గాని, అశూన్య మని గాని, చెప్ప వలను పడదు. ఉపనిషత్ ప్రతిపాద్యము సర్వవేదాంత సిద్ధము నయిన ఆ నిర్గుణ నిరాకార ఆత్మతత్త్వమును గురించి వాక్కుతో ఏమని వర్ణింతును! ఎట్లు చెప్పగలను! అని తాత్పర్యము.

ఈ విధముగ ఆత్మస్వరూపమును చెప్పిన తరువాత శ్రీ శంకరులవారు 'నిర్వాణమఞ్జరీ' యను పేరుతో మరల ఆత్మస్వరూపమును ఈ రీతిగ వర్ణించిరి.

శ్లో॥ అహం నామరో న మర్త్యో న దైత్యో
న గంధర్వయక్షః పిశాచ ప్రభేదః ।
పుమాన్ నైవ న స్త్రీ తథా నైవ షణ్డః
ప్రకృష్టః ప్రకాశస్వరూపః శివోఽహమ్ ॥

శ్లో॥ అహం నైవ బాలో యువా నైవ వృద్ధో
న వర్ణీ న చ బ్రహ్మచారీ గృహస్థః ।
వనస్థోఽపి నాహం న సన్న్యస్తధర్మా
జగజ్జన్మనాశైకహేతుః శివోఽహమ్ ॥

శ్లో॥ అహం నైవ మేయ స్తిరోభూతమాయో
తథైవేక్షితుం మాం పృథ జ్ఞాస్త్యుపాయః ।
సమాశ్లిష్టకాయత్రయోఽప్యద్వితీయః
సదాఽతీన్ద్రియః సర్వరూపః శివోఽహమ్ ॥

శ్లో॥ అహం నైవ మన్తా న గన్తా న వక్తా
న కర్తా న భోక్తా న ముక్తాశ్రమస్థః ।
యథాఽహం మనోవృత్తిభేదస్వరూపః
తథా సర్వవృత్తిప్రదీపః శివోఽహమ్॥

శ్లో॥ న మే లోకయాత్రాప్రవాహప్రవృత్తిః
న మే బన్ధబుద్ధ్యా దురీహానివృత్తిః ।
ప్రవృత్తే ర్నివృత్తస్య చిత్తస్య వృత్తిః
యత స్త్వహం తత్స్వరూపః శివోఽహమ్॥

శ్లో॥ నిదానం యదజ్ఞానకార్యస్య కార్యం
వినా యస్య సత్త్వం స్తతో నైవ భాతి।
యదాద్యన్త మధ్యాన్తరాలాన్తరాల
ప్రకాశాత్మకం స్యాత్ తదేవాహమస్మి॥

శ్లో॥ యతోఽహం న బుద్ధి ర్న మే కార్యసిద్ధిః
యతో నాహ మఙ్గం న మే లిఙ్గభఙ్గమ్।
హృదాకాశవర్తీ గతాఙ్గత్రయార్తిః
సదా సచ్చిదానన్దమూర్తిః శివోఽహమ్॥

శ్లో॥ యదాసీ ద్విలాసా ద్వికారం జగత్ యద్
వికారాశ్రయం నాద్వితీయత్వతః స్యాత్।
మనోబుద్ధి చిత్తాహమాకారవృత్తిః
ప్రవృత్తి ర్యతః స్యాత్ తదేవాహ మస్మి॥

శ్లో॥ యదన్త ర్బహి ర్వ్యాపకం నిత్యశుద్ధం
యదేకం సదా సచ్చిదానన్దకన్దమ్।
యతః స్థూల సూక్ష్మప్రపంచస్య భానం
యత స్తత్ ప్రసూతి స్తదేవాహ మస్మి॥

శ్లో॥ యదర్కేన్దు విద్యుత్ ప్రభాజాలమాలా
విలాసాస్పదం యత్ స్వభేదాది శూన్యమ్।
సమస్తం జగద్యస్య పాదాత్మకం స్యా
ద్యతః శక్తిభానం తదేవాహ మస్మి॥

శ్లో॥ యతః కాలమృత్యు ర్బిభేతి ప్రకామం
యత శ్చిత్తబుద్ధీన్ద్రియాణాం విలాస॥

హరి బ్రహ్మ రుద్రేన్ద్ర చన్ద్రాదినామ
ప్రకాశో యతః స్యాత్ తదేవాహ మస్మి॥

శ్లో॥ యదాకాశవత్ సర్వగం శాన్తరూపం
పరంజ్యోతి రాకారశూన్యం వరేణ్యమ్।
యదాద్యన్తశూన్యం పరం శంకరాఖ్యం
యదన్తర్విభావ్యం తదేవాహ మస్మి॥

తా॥ నేను అమరుడైన దేవతను గాను; మరణధర్మి యైన మానవుడను గాను, దైత్యుడను గాను: గంధర్వ, యక్షః పిశాచ వర్గములో ఏ ఒక తరగతికి చెందినవాడను గాను; నేను స్త్రీ-పురుష భేదముచే చెప్పదగినవాడను గాను; తృతీయాప్రకృతిని గాను; సర్వోత్కృష్ట ప్రకాశస్వరూపు డగు శివుడను నేనే అయి ఉన్నాను.

నేను శరీరసంబంధు లగు బాల్య, యౌవన, వార్ధ కావస్థల కతీతుడను; బ్రాహ్మణ, క్షత్రియాది వర్ణభేదముచే నేను చెప్పబడజాలను; బ్రహ్మచర్య, గార్హస్థ్య, వానప్రస్థ సన్న్యాసాది ఆశ్రమధర్మములును నాకు లేవు; ఈ ప్రపంచము యొక్క సృష్టి-స్థితి-లయములకు ఏకైకకారణమైన శివ స్వరూపము నేనే.

నేను అప్రమేయ మగు చిదానందమూర్తిని; ప్రమాణాంతరములచే గోచరుడను గాను; నానుండి మాయ తిరోహిత మయినది; దృక్-దృశ్య-దర్శన-భేదములు లేనివాడ నగుటచే నన్ను దర్శించుటకు మరి యే యుపాయము లేదు; స్థూల

సూక్ష్మ కారణభేదముచే నొప్పారు శరీరత్రయముచే ఆచ్ఛాదితుడనై యున్నను నేను అద్వయాత్మస్వరూపుడనే; నేను సర్వదా అతీంద్రియుడను, నిఖిల చరాచరప్రపంచ స్వరూపుడనై భాసించుచుందును; సచ్చిదానందమూర్తి యగు శివ స్వరూపము నేనే.

నేను మననము చేయువాడనుగాను; గమనక్రియ కలవాడనుగాను; నేను వక్తను గాను; కర్తృత్వభోక్తృత్వములకు ఆశ్రయుడను గాను; జీవన్ముక్తుల ఆశ్రమమున ఉండువాడను గాను; నేను మనోవృత్తిభేదములతో వెలుగొందుచుందును; ఆవిధముగనే ఆ యా వృత్తులను భాసింపజేయువాడను గూడ నేనే. అట్టి నిర్గుణ నిష్క్రియ శివస్వరూపుడను నేనే.

లోకయాత్రాప్రవాహమందు నాకు ప్రవృత్తి లేదు; 'నేను బద్ధుడను' అను భావము నాకు లేదు; ఆ బంధభావమును నివర్తింప చేసికొను ప్రయత్నమును నాకు లేదు; నా చిత్తవృత్తులు నివృతములై విరతవ్యాపారులయినవి; ఆ చిత్తవృత్తులను ప్రకాశింపజేయునట్టి శివస్వరూపుడను నేనే.

అజ్ఞానసత్తయొక్క స్ఫురణము కార్యోత్పత్తి వలననే తెలియును; అజ్ఞానకార్యమగు సంసారస్ఫురణము నావలననే కలుగుచున్నది. ఆద్యంతములు, మధ్యాన్తరళములు వీనియొక్క హృదయము దేనివలన భాసించుచున్నదో ఆ స్వరూపమే నేను.

నేను బుద్ధిని కాను; కనుక కార్యసిద్ధి చింతయును నాకు లేదు; నేను అవయవమును కాను; కావున చిత్తభంగ మగు ను చింతయు నాకులేదు. నేను హృత్పుండరీకము నధిష్ఠించి యుండువాడను; కావున స్థూల, సూక్ష్మ కారణ భేదముచే జరగునట్టి శరీర త్రయము ఆర్తియును నాకులేదు. నేను సదా చిదేకరసమూర్తి సచ్చిదానంద స్వరూపుడగు శివుడనే అయి ఉన్నాను.

ఈ నిఖిల జగత్తు అవిద్యావిలాసవికారము. అది లేని యపుడు ఆత్మస్వరూపము అద్వయమగుటచేత వికారమైన ఈ జగత్తుకు అధిష్ఠానవస్తువు ఏదియు నుండదు; జగత్తు బ్రహ్మ యందు అధ్యస్తము కాని, బ్రహ్మయొక్క పరిణామము లేక వికారము గానికాదు. మనోబుద్ధి చిత్తాహంకారాదులు ఏ పరమ సత్త నుండి ప్రకాశితములగుచున్నవో ఆ శుద్ధ అద్వయ శివస్వరూపము నేనే.

త్రికాలములందు సర్వదా బాహ్యాంతరము లందంతట వ్యాపించి నిత్యము శుద్ధము అద్వయము నగు సత్ చిత్ ఆనందములకు ఏది మూలకందమో ఆ పరంజ్యోతిస్స్వరూపమును నేనే. స్థూల సూక్ష్మప్రపంచముల ఉత్పత్తికి ప్రకాశమునకును కారణమైనది ఏదియో ఆ శివస్వరూపము నేనే.

సూర్య-చంద్ర-విద్యుత్-ప్రభాజాలమునకు ఏది ఆస్పదమో ఏది స్వజాతీయ విజాతీయ స్వగత భేదశూన్యమో ఈ సమస్త విశ్వము దేనియొక్క చతుర్థాంశమో, ఏ చిత్స్వ

రూపము నుండి సమస్త శక్తియును భాసించుచున్నదో ఆ సచ్చిదానందస్వరూపము నేనే యగుచున్నాను.

దేనివలన కాలరూపమృత్యువు సైతము భయభీతమగునో, దేనివలన మనస్సు బుద్ధి చిత్తము ఇంద్రియాదులు వికాసమునొందుచున్నవో, హరి, హర, బ్రహ్మ ఇంద్ర చంద్రాది నామములు ప్రకాశము నందుచున్నవో ఆ చిదేకరసమూర్తియే నేను.

ఆకాశము వలె సర్వగతము, శాంతరూపము, పరంజ్యోతియు, నిరాకారము, వరణీయము, ఆద్యన్తశూన్యము, హృదయాంతరమున భావింపదగినదియు శ్రేష్టము నగు ఏ శంకరస్వరూపము కలదో ఆ పరమశివ రూపము నేనే యగుచున్నాను. అని తాత్పర్యము.

ఈ మార్గము ననుసరించి ఆచార్యులవారు 'నిర్గుణ మానసపూజా' విధానమును పల్కిరి.

శ్లో॥ ఆరాధయామి మణిసన్నిభ మాత్మలిఙ్గం
మాయాపురీహృదయపంకజసన్నివిష్టమ్।
శ్రద్ధానదీ విమలచిత్త జలాభిషేకైః
నిత్యం సమాధికుసుమై రపునర్భవాయ॥

శ్లో॥ అయ మేకోఽవశిష్టోఽస్మీ త్యేవ మావాహయే చ్ఛివమ్।
ఆసనం కల్పయేత్ పశ్చాత్ స్వప్రతిష్ఠాత్మచిన్తనమ్॥

శ్లో॥ పుణ్యపాపరజస్సంగో మమ నాస్తీతి వేదనమ్,
పాద్యం సమర్పయే ద్విద్వాన్ సర్వకల్మషనాశనమ్॥

శ్లో॥ అనాదికల్పవిధృత మూలాజ్ఞానజలాఞ్జలిమ్।
విసృజే దాత్మలిఙ్గస్య తదే వార్ఘ్యసమర్పణమ్॥

శ్లో॥ బ్రహ్మానన్దాబ్ధి కల్లోలకణ కోట్యంశలేశకమ్।
పిబ న్తీన్ద్రాదయ ఇతి ధ్యాన మాచమనం మతమ్॥

శ్లో॥ బ్రహ్మానన్దజలేనైవ లోకాః సర్వే పరిప్లుతాః
అచ్ఛేద్యోఽయ మితి ధ్యాన మభిషేచన మాత్మనః॥

శ్లో॥ నిరావరణచైతన్యం ప్రకాశోఽస్మీతి చిన్తనమ్ ।
ఆత్మలిఙ్గస్య సద్వస్త్ర మిత్యేవం చిన్తయే న్మునిః॥

శ్లో॥ త్రిగుణాత్మాఽశేషలోకమాలికాసూత్ర మస్మ్యహమ్।
ఇతి నిశ్చయ మేవాత్ర హ్యుపవీతం పరం మతమ్॥

శ్లో॥ అనేకవాసనామిశ్రప్రపంచోఽయం ధృతో మయా।
నాన్యే నేత్యనుసంధాన మాత్మన శ్చన్దనం భవేత్॥

శ్లో॥ రజస్సత్వతమోవృత్తిత్యాగరూపై స్తిలాక్షతైః।
ఆత్మలింగం యజే న్నిత్యం జీవన్ముక్తిప్రసిద్ధయే॥

శ్లో॥ ఈశ్వరో గురు రాత్మేతి భేదత్రయవివర్జితైః।
బిల్వపత్రై రద్వితీయై రాత్మలింగం యజే చ్ఛివమ్॥

శ్లో॥ సమస్తవాసనాత్యాగం ధూపం తస్య విచిన్తయేత్
జ్యోతిర్మయాత్మవిజ్ఞానం దీపం సందర్శయేద్ బుధః॥

శ్లో॥ నైవేద్య మాత్మలిఙ్గస్య బ్రహ్మాణ్డాఖ్యం మహోదనమ్।
పిబానన్దరసం స్వాదు మృత్యు రస్యోపసేచనమ్॥

శ్లో॥ అజ్ఞానోచ్ఛిష్టహస్తస్య క్షాలనం జ్ఞానవారిణా।
విశుద్ధ స్యాత్మలిఙ్గస్య హస్తప్రక్షాలనం భవేత్॥

శ్లో॥ రాగాదిగుణశూన్యస్య శివస్య పరమాత్మనః।
సరాగవిషయాభ్యాసత్యాగ స్తాంబూలచర్వణమ్॥

శ్లో॥ అజ్ఞానధ్వాన్తవిధ్వంసప్రచండ మతిభాస్కరమ్।
ఆత్మనో బ్రహ్మతాజ్ఞానం నీరాజన మిహాత్మనః॥

శ్లో॥ వివిధబ్రహ్మసందృష్టిమాలికాభి రలంకృతమ్।
పూర్ణానన్దాత్మతాదృష్టిం పుష్పాఞ్జలి మనుస్మరేత్॥

శ్లో॥ పరిభ్రమన్తి బ్రహ్మాణ్డసహస్రాణి మయీశ్వరే।
కూటస్థాచలరూపోఽహ మితి ధ్యానం ప్రదక్షిణమ్॥

శ్లో॥ విశ్వవన్ద్యోఽహ మేవాస్మి నాస్తి వన్ద్యో మదన్యతః।
ఇత్యాలోచన మేవాత్ర స్వాత్మలిఙ్గస్య వన్దనమ్॥

శ్లో॥ ఆత్మనః సత్క్రియా ప్రోక్తా కర్తవ్యాభావభావనా।
నామరూపవ్యతీతాత్మచిన్తనం నామకీర్తనమ్॥

శ్లో॥ శ్రవణం తస్య దేవస్య శ్రోతవ్యాభావచింతనమ్।
మననం త్వాత్మలిఙ్గస్య మన్తవ్యాభావచింతనమ్॥

శ్లో॥ ధ్యాతవ్యాభావవిజ్ఞానం నిదిధ్యాసన మాత్మనః
సమస్తభ్రాన్తివిక్షేపరాహిత్యే నాత్మనిష్ఠతా॥

శ్లో॥ సమాధి రాత్మనో నామ నాన్య చ్చిత్తస్య విభ్రమః।
తత్రైవ బ్రహ్మణి సదా చిత్తవిశ్రాన్తి రిష్యతే॥

శ్లో॥ ఏవం వేదాన్తకల్పోక్త స్వాత్మలిఙ్గప్రపూజనమ్।
కుర్వ న్నామరణం వాఽపి క్షణం వా సుసమాహితః॥

శ్లో॥ సర్వదుర్వాసనాజాలం పదపాంసు మివ త్యజేత్।
విధూయాజ్ఞానదుఃఖౌఘం మోక్షానన్ద సమశ్నుతే॥

తా॥ మాయాపురి యను హృదయపుండరీకమందు ఆత్మ లింగము మణిద్యుతులతో ప్రకాశించుచుండును. నేను పునరావృత్తిరహిత శాశ్వత బ్రహ్మపదవి నొందుటకై ఆ యాత్మ లింగమును శ్రద్ధానది యను విమల చిత్తజలాభిషేకములతోను సమాధి యను పుష్పములతోను నిత్యముఆరాధించుచున్నాను.

'నేనొక్కడనే అద్వయ మూర్తియై అవశిష్టుడ నగుచున్నా'నను భావముతో సచ్చిదానందశివస్వరూపము నావాహన చేయదగును. అటుపిమ్మట స్వస్వరూపప్రతిష్ఠ యను ఆత్మచింతనమును ఆసనముగా పరికల్పింప నగును.

'నేను పాప పుణ్య సంగము లేనివాడను' అను జ్ఞానముతో సర్వకల్మషవిదూరమైన భావమును పాద్యముగ ఆ పరమశివునకు జ్ఞాని సమర్పింప నగును.

అనాది సంచితమై యున్న మూలాజ్ఞానమును జలాంజలిగ చేసి యొసగ నగును. అదియే ఆత్మలింగమునకు అర్ఘ్యసమర్పణ మగును.

బ్రహ్మానంద మను సాగరతరంగకణము యొక్క కోట్యంశబిందులేశమును మాత్రమే ఇంద్రాదులు పాన మొనరించు చున్నా రను ధ్యానమే ఆ యాత్మలింగమునకు ఆచమన మగుము.

'బ్రహ్మానందజలము చే లోకము లన్నియు పరిప్లుతములై యున్నవి; ఈ బ్రహ్మవస్తువు సర్వగతము అచ్ఛేద్యము' అను భావనమే ఆత్మాభిషేచన మగును.

'నేను మాయావరణములేని శుద్ధ చిదానందస్వరూపుడను, ప్రకాశస్వరూపుడను' అను చిన్తనమే ఆత్మలింగమునకు సమర్పింప దగు సద్వస్త్ర మని మునిభావింపదగును.

'సత్త్వ, రజస్తమోగుణాత్మకమైన నిఖిలలోకజాలము యొక్క హార మందలి సూత్రము నేనే' యను నిశ్చయ జ్ఞానము ఆత్మలింగమున కర్పింపదగు యజ్ఞోపవీత మని భావింపనగును.

'అనేకవాసనా మిశ్రితమైన ఈ జగత్తు నాచే ధారణ చేయబడుచున్నది; అన్యులు మరెవరు దీనిని ధరించుటలేదు' అనునట్టి భావము ననుసంధానము చేయుటయే ఆత్మకు చందన లేప మని భావింప నగును.

సత్త్వ, రజస్తమోరూపమైన త్రిగుణ త్యాగ మను తిలలతోను, అక్షతలతోను జీవన్ముక్తిని పొందగోరు జ్ఞాని నిత్యము ఆత్మలింగము నర్పింప దగును.

ఈశ్వరుడు, గురువు, ఆత్మయను త్రిపుటి భేదత్యాగమే బిల్వదళ మని భావించి అట్టి అద్వితీయ బిల్వదళములచే శివ స్వరూపమగు ఆత్మలింగమును నిత్యము అర్పింపదగును.

సమస్తవాసనాత్యాగమే ఆ యాత్మలింగమున కాఘ్రాణింపచేయదగు ధూప మని భావింపదగును; అద్వయ బ్రహ్మాత్మ జ్ఞానము గల బుధుడు జ్యోతిర్మయ మగు ఆత్మ విజ్ఞానమను దీపమును ఆత్మలింగమునకు సమర్పింపదగును.

బ్రహ్మాండ మను అన్నమే ఈ యాత్మలింగమునకు నివేదింపదగు నైవేద్య మనియు, మృత్యువే వ్యంజన మనియు స్వాదుపూర్ణమైన బ్రహ్మానందరసమును పానీయ మనియు, భావించి నివేదింపదగును. 'స్వాదు ఆనందరసం పిబ' యనుచు ప్రత్యగభిన్న బ్రహ్మాత్మజ్ఞాననిష్ఠుని సంబోధించి బ్రహ్మానంద రసమును పానము చేయు మని యుపదేశింపబడినది.

అజ్ఞాన మను ఉచ్ఛిష్టముచే అపవిత్రమైన హస్తమును జ్ఞాన మను జలముచే క్షాళనము చేయుటయే విశుద్ధమైన ఆత్మలింగమునకు చేయదగు హస్తప్రక్షాళన మని భావింప నగును.

అనురాగముతో కూడిన విషయాభ్యాసమును త్యాగము చేయుటయే, రాగ-ద్వేషాది గుణశూన్యుడును, పరమాత్మస్వరూపుడునగు పరమశివునకు అర్పింపదగు తాంబూలచర్వణ మని భావింప నగును.

అజ్ఞానతిమిరమును విధ్వంస మొనర్చుటలో ప్రచండ భాస్కరు డనదగు జ్ఞానము, మరియు ప్రత్యగాత్మయందు బ్రహ్మభావము ఏది గలదో, దానిని ఆత్మలింగమునకు నీరాజనముగ సమర్పింపనగును.

వివిధవస్తుజాలమందు బ్రహ్మదర్శనమను హారముచే అలంకృతమైన పూర్ణానంద ఆత్మభావమును ఆత్మలింగమునకు పుష్పాంజలిగ భావింపనగును.

'పరమశివుడ నగు నాయందు సహస్రసంఖ్యాకములుగ బ్రహ్మాండములు పరిభ్రమించుచున్నవి; నేను, కూటస్థ అచల ఆత్మస్వరూపుడను' అను దృష్టియే ఆత్మలింగమునకు చేయు ప్రదక్షిణ మని ధ్యానింప నగును.

'నేను విశ్వవంద్యుడ నగు; ఆత్మస్వరూపు డను; నాకంటె వందనీయులు మరెవ్వరును లేరు' అను చింతనమే యిట, ఆత్మలింగమునకు చేయు నమస్కారముగ భావింప నగును.

'ఆత్మ నిష్క్రియుడుగాన ఆ బ్రహ్మపదార్థమున కెట్టి కర్తవ్యమును లేదు' అనుభావనయే ఆత్మలింగమునకు చేయు సత్కారము; నామ-రూప-రహితమైన ఆత్మచింతనమే నామ సంకీర్తనముగ భావన చేయనగును.

ఆత్మకంటె భిన్న మగున దేదియు శ్రోతవ్యము కాదను భావనయే ఆత్మలింగశ్రవణమనియు, ఆత్మాతిరిక్త మైన దేదియు మంతవ్యము కాదను చింతనమే ఆత్మలింగ మననము అనియు నిశ్చయింప నగును.

సమస్త భ్రాంతి విక్షేపములు తొలగి అద్వయ ఆత్మ నిష్ఠుడై ధ్యాతవ్య మగు వస్తువు ఆత్మాతిరిక్తమైనది ఏదియు లేదను జ్ఞానము కలిగియుండుటయే ఆత్మలింగ నిదిధ్యాస నముగ భావింపనగును.

చిత్తము విభ్రమము నొందక సదా బ్రహ్మ యందు నెలకొని యుండుటయే సమాధి యని పేర్కొనబడుచున్నది. సమాధినిష్ఠుడైనవాని చిత్తోపరమణము అద్వయ బ్రహ్మనిష్ఠ యందే కలుగునని చెప్ప నగును.

ఈ రీతిగ వేదాన్తకల్పమందు వివరింపడిన ఆత్మలింగ పూజనము సుసమాహితచిత్తుడై శరీరపతనాంతముగాని, లేక ఒక్క క్షణకాలము మాత్రమైనను చేయదగును.

ఈ విధముగ సమాహిత చిత్తుడై పూజ సల్పినవాని దుర్వాసన లన్నియు పాదధూళి వలె పరిత్యక్తము లగును; అజ్ఞానముచే కలుగు దుఃఖతతి విధ్వంసమై తుట్టతుదకు వానికి మోక్షానందము లభించు నని పైన వివరించిన నిర్గుణమానస పూజావిధానముయొక్క తాత్పర్యము.

తర్వాత ఆత్మజ్ఞాని ప్రాతఃకాలమున అనుదినము స్మరించవలసిన విషయము నీ రీతిగా ఆచార్యుడు వివరించెను.

శ్లో॥ ప్రాతః స్మరామి హృది సంస్ఫుర దాత్మతత్త్వం
సచ్చిత్సుఖం పరమహంసగతిం తురీయమ్ ।
యత్ స్వప్నజాగరసుషుప్తి మవైతి నిత్యం
తద్ బ్రహ్మ నిష్కల మహం న చ భూతసంఘః ॥

శ్లో॥ ప్రాత ర్భజామి మనసాం వచసా మగమ్యం
వాచో విభాన్తి నిఖిలా యదనుగ్రహేణ ।
యన్నేతి నేతి వచనై ర్నిగమా అవోచం
స్తం దేవదేవ మజ మచ్యుత మాహు రగ్ర్యమ్ ॥

శ్లో॥ ప్రాతర్నమామి తమసః పర మర్కవర్ణం
పూర్ణం సనాతనపదం పురుషోత్తమాఖ్యమ్ ।
యస్మి న్నిదం జగ దశేషమశేషమూర్తౌ
రజ్జ్వాం భుజంగమ ఇవ ప్రతిభాసితం వై ॥

శ్లో॥ శ్లోకత్రయ మిదంపుణ్యం లోకత్రయవిభూషణమ్।
ప్రాతఃకాలే పఠే ద్యస్తు స గచ్ఛే త్పరమంపదమ్ ॥

తా॥ నేను పాంచభౌతిక శరీరమునుగాను; జాగ్రత్-స్వప్న-సుషుప్తు లను అవస్థాత్రయమును ఏది నిత్యము పొందుచుండునో ఆ నిష్కల మగు బ్రహ్మపదార్థమును నేనే. అట్టి ఆత్మతత్త్వము హృదయాకాశమున వెలుగొందుచుండును; పరమహంసలకు గూడ ఆశ్రయణీయము తురీయము నగు ఆ సచ్చిదానందస్వరూపమును నేను అనుదినము ప్రాతఃకాల సమయమున ధ్యానించుచుందును.

ఆ బ్రహ్మపదార్థము మనోవాక్కుల కగోచరమైనది; ఆ పరతత్త్వముయొక్క అనుగ్రహము చేతనే సమస్త వాక్కులు ప్రకాశించుచున్నవి. శ్రుతులు 'నేతినేతి' యని ఆ పరతత్త్వమును వర్ణించుచు 'అజ, అచ్యుత ఆదిపురుష' శబ్దములతో కీర్తించుచున్నవి; అట్టి చిదేకరసమూర్తియగు పరబ్రహ్మను నిత్యము ప్రాతఃకాలమున భజించుచుందును.

నిఖిల జీవస్వరూపు డగు ఏ పరమాత్మయందు విశ్వమంతయు రజ్జువునందు సర్పమువలె భాసించుచున్నదో ఆ పరంజ్యోతి అజ్ఞానాంధకారమునకు పరమైనది; అది సూర్య

ప్రభాసదృశము, పూర్ణము పురుషోత్తమాఖ్యము సనాతన బ్రహ్మపదము అయి విరాజిల్లుచుండును. అట్టి బ్రహ్మపదమును ప్రాతఃకాలమున ప్రతిదినము నమస్కరించుచుందును.

లోకత్రయవిభూషణము, పుణ్యప్రదము నైన ఈ శ్లోకత్రయమును ప్రాతఃకాలమున సమాహితచిత్తులై ఎవరు పఠింతురో వారు పరమ ముక్తిపదము నొందుదురు-అని భావము.

తర్వాత, అచటగల శిష్యులడిగిన ప్రశ్నలకు శ్రీ శంకరులు చెప్పిన సమాధానములను 'ప్రశ్నోత్తరమాలికా' అను పేరుతో ఆచార్యులు మనకిచ్చిరి.

శ్లో॥ కః ఖలు నాలంక్రియతే దృష్టాదృష్టార్థసాధనపటీయాన్।
అనయా కంఠస్థితయా ప్రశ్నోత్తరరత్నమాలికయా ॥

శ్లో॥ భగవన్ కి ముపాదేయం గురువచనం హేయమపి చ
కి మకార్యమ్।
కో గురు రధిగతతత్త్వః శిష్యహితాయోద్యతః సతతమ్॥

శ్లో॥ త్వరితం కిం కర్తవ్యం సుధియా సంసారసన్తతిచ్ఛేదః।
కిం మోక్షతరో ర్బీజం సమ్యక్ జ్ఞానం క్రియాసిద్ధమ్ ॥

శ్లో॥ కః పథ్యతరో ధర్మః కః శుచి రిహయస్య మానసం
శుద్ధమ్।
కః పండితో వివేకీ కిం విష మవధీరణా గురుషు ॥

తా॥ * ఈ ప్రశ్నోత్తర రత్నమాలికను కంఠమాలగా ధరించినవారు అనగా, కంఠస్థము చేసినవారు దృష్టమగు ఐహిక ఫలమును సాధించుటలో దక్షులై విరాజిల్లుదురు. (ఇటనుంచి ప్రశ్నలన్నియు శిష్యవచనములనియు సమాధాన వాక్యములు గురువచనము లనియు గ్రహింపనగును.)

భగవన్, ఉపాదేయమైనది ఏది? గురువచనము; హేయమైన దేది? అసత్కార్యము, ఎవరు గురువు? శిష్య హితము కొరకు నిరంతరము ప్రయత్నించునట్టి ఆత్మతత్త్వజ్ఞుడైనవాడు గురువు అని గ్రహింప నగును.

బుద్ధిమంతునిచే వెంటనే నిర్వహింపబడదగు కర్తవ్యమేమి? సంసారప్రవాహమును విచ్ఛేద మొనర్చుట; మోక్షమనెడి వృక్షమునకు బీజమెద్ది? వారి వారికి విహితములైన వైదిక కర్మల ననుష్ఠించి చిత్తశుద్ధిద్వారమున పొందెడు శుద్ధాత్మజ్ఞానము.

మిక్కిలి పథ్యమగు వస్తువేది? ధర్మము; పవిత్రమైనవాడు ఎవడు? శుద్ధమైన అంతఃకరణము కలవాడు. పండితుడెవడు? ఆత్మానాత్మవివేకము కలవాడు. ఏది విషము. గురుతిరస్కారము.

శ్లో॥ కిం ససారే సారం బహుశోఽపి విచిన్త్యమాన మిదమేవ।
కిం మనుజేషు ఇష్టతమం స్వపరహితాయ ఉద్యతం జన్మ॥

---

* ఇందు మొత్తము 67 శ్లోకము లున్నవి; 4,5 శ్లోకముల తర్వాత తాత్పర్యమీయబడి మరల మూలశ్లోకము లివ్వబడుచున్నవి.

శ్లో॥ మదిరేవ మోహజనకః కః స్నేహః కే చ దస్యవో విషయాః ।
కా భవవల్లీ తృష్ణా కో వైరీ య స్త్వనుద్యోగః ॥

శ్లో॥ కస్మా ద్భయ మిహ మరణాత్ అంధాదపి కో విశిష్యతే।
రాగీ కః శూరో యో లలనాలోచనబాణై ర్న చ వ్యథితః॥

శ్లో॥ పాతుం కర్ణాంజలిభిః కి మమృత మివ యుజ్యతే సదుపదేశః ।
కిం గురుతయా మూలం యదేత దప్రార్థనం నామ ॥

శ్లో॥ కింగహనం స్త్రీచరితం క శ్చతురో యో న ఖండిత స్తేన।
కిం దుఃఖ మసంతోషం కిం లాఘవ మధమతో యాచ్ఞా॥

ఈ ప్రపంచములో సారభూతమైన వస్తువేది? ప్రాజ్ఞులనేకులు చింతన మొనర్చి నిర్ణయించినది. మనుష్యులలో ఇష్టతమమైనది ఏది? స్వ-పర-హితార్థము ఉద్యమశీలుడగువాని జన్మము.

మద్యము వలె మాదకమైనది ఏది? స్నేహము. ఈ ప్రపంచమున చోరులెవరు? భౌతికవిషయములు. భవవల్లి అనగా సంసారపాశ మేది? తృష్ణ. ఈ సంసారమున శత్రు వెవరు? పురుషప్రయత్నము చేయని సోమరి.

ఈ జగత్తునందు భయము కలిగించునదేది? మృత్యువు. జన్మాంధుని కంటె గ్రుడ్డి యెవరు? విషయరాగము కలవాడు. ఎవడు శూరుడుగ కీర్తింపబడును? కలకంఠి వాలుచూపులకు వెత చెందనివాడు.

అమృతము వలె కర్ణాంజలలచే పానయోగ్య మగునది ఏది? సదుపదేశము. గౌరవమునకు మూలమెద్ది? యాచింపకుండుట.

ఈ ప్రపంచమున గంభీర మగున దేది? స్త్రీచరితము. చతురు డెవడు? స్త్రీచరిత్రచే ఖండితమనస్కుడు కానివాడు; లేక స్త్రీలచే ఓటమి నొందనివాడు. దుఃఖదాయక మేది? అసంతృప్తి. మిక్కిలి అల్పభావము కలిగించునదేది? అధముని చెంత కేగి యాచించుట యని గ్రహింప నగును.

శ్లో॥ కిం జీవిత మనవద్యం కిం జాడ్యం పాఠతోఽ ప్యనభ్యాసః।
కో జాగర్తి వివేకీ కా నిద్రా మూఢతా జన్తోః ॥

శ్లో॥ నలినీదలగతజలవత్ తరలం కిం యౌవనం ధనంచాయుః।
కథయ పునః కే శశినః కిరణసమాః సజ్జనా ఏవ॥

శ్లో॥ కో నరకః పరవశతా కిం సౌఖ్యం స్వర్గసంగవిరతి ర్యా ।
కిం సాధ్యం భూతహితం ప్రియం చ కిం ప్రాణినా మసవః॥

శ్లో॥ కోఽనర్థఫలో మానః కా సుఖదా సాధుజనమైత్రీ ।
సర్వవ్యసనవినాశే కో దక్షః సర్వథా త్యాగీ ॥

శ్లో॥ కిం మరణం మూర్ఖత్వం కిం చానర్ఘం యదవసరేద త్తమ్ ।
ఆమరణం కిం శల్యం ప్రచ్ఛన్నం యత్కృతం పాపమ్ ॥

జీవిత మన నెయ్యది? దోషరహితమైన జీవనము. జాడ్య మని దేనిని యందురు? పఠించినను అభ్యాసము లేకపోవుటను జాడ్య మందురు. ఎవడు జాగరూకుడు? ఆత్మా

నాత్మవివేకము; సదసద్వివేకము కలవాడు. జీవునికి నిద్ర ఏది? మూఢత.

తామరాకు మీది జలబిందువు వలె చంచలమైనది ఏది? ధనము, యౌవనము, ఆయువు చంచలము లైనవి. శీతాంశు కిరణముల వలె నిర్మలమైన చరితము కలవారు ఎవరు? సజ్జనులే నిర్మలచారిత్రముతో నొప్పుచుందురు.

నరక మేది? పరాధీనత. సుఖ మెయ్యది? సర్వసంగ పరిత్యాగము. సాధింపదగినది ఏది? సర్వభూతకోటికి హితము చేయుట. సకల జీవతతికి ప్రియమైనది ఏది? ప్రాణములు ప్రియమైనవి.

అనర్థమగు ఫలము నిచ్చునది యేది? మానము. సుఖద మైనది ఏది? సాధు సజ్జన సాంగత్యము. సర్వవ్యసనములను పోగొట్టుకొను దక్షు లెవరు? సర్వస్వమును త్యాగ మొనర్చిన త్యాగధనులు.

మరణ మన నెద్ది? మూర్ఖత్వము. అనర్ఘమగు వస్తు వేది? సమయమునకు ఇవ్వబడిన దానము. అవసాన పర్యంతము శల్యము వలె బాధించున దేది? ప్రచ్ఛన్నముగ చేసిన పాపము.

శ్లో॥ కుత్ర విధేయో యత్నో విద్యాభ్యాసే సదౌషధే దానే।
అవధీరణా క్వ కార్యా ఖల పరయోషి త్పరధనేషు॥

శ్లో॥ కాఽహర్నిశ మనుచిన్త్యా సంసారసారతా న ప్రమదా।
కా ప్రేయసీ విధేయా కరుణా దీనేషు సజ్జనమైత్రీ॥

శ్లో॥ కంఠగతై రప్యసుభిః కస్య హ్యాత్మా న శక్యతే జేతుమ్।
మూర్ఖస్య శంకితస్య చ విషాదినో వా కృతఘ్న స్య॥

శ్లో॥ కః సాధుః సద్వృత్తః కం అధమ మాచక్షతే త్వసద్వృత్తమ్।
కేన జితం జగ దేతత్ సత్యతితిక్షావతా పుంసా॥

శ్లో॥ కస్మై నమాంసి దేవాః కుర్వన్తి దయాప్రధానాయ।
కస్మా దుద్వేగః స్యాత్ సంసారారణ్యతః సుధియః॥

ఏ విషయమున ప్రయత్నింపదగును? విద్యాభ్యాసము, మంచి ఔషధము, దానము - వీని విషయములో ప్రయత్నముసేయదగును. ఎవరియెడ అవజ్ఞ సేయదగును? దుష్టుడు, పరస్త్రీ, పరధనము వీనియెడ అవజ్ఞ చేయదగును.

రాత్రింబవళ్లు చింతింపదగిన దేది? సంసారమున సారభూతమగు తత్త్వ విషయక చింతనమే చేయదగును గాని, స్త్రీ విషయక చిన్తనము చేయదగదు. అత్యంతము ప్రియమైనదిగ భావింపదగినది యేది? దీనజనులయెడ కరుణ సజ్జన సాంగత్యము విహితముగ భావింపనగును.

ప్రాణములు కంఠగతము లైనను, ఎవరి చిత్తము జయింపశక్యము గాదు? మూర్ఖుడు, శంకాలువు, విషాదగ్రస్తుడు, కృతజ్ఞత లేనివాడు - వీరి చిత్తము జయింప నలవి గాదు.

సాధుజను డెవరు? సద్వర్తనము గలవాడు. ఎవరిని అధము డందురు? అసద్వర్తనము కలవాడు. ఎవ రీ విశ్వ

మును జయింప సమర్థు డగును? సత్యనిష్ఠుడు, సహనశీలము గలవాడు ఈ జగత్తును జయింప గల్గును.

దేవతాగణము ఎవరికి నమస్కరింతురు? దయాంతః కరణము కలవానికి నమస్కరింతురు. బుద్ధిమంతుడు దేనివలన ఉద్వేగము నొందును? సంసారమనెడి యరణ్యము వలన వ్యాకులచిత్తు డగును.

శ్లో॥ కస్య వశే ప్రాణిగణః సత్యప్రియభాషిణో వినీతస్య।
క్వ స్థాతవ్యం న్యాయ్యే పథి దృష్టాదృష్టలాభాయ ॥

శ్లో॥ కోఽన్ధో యోఽకార్యరతః కో బధిరో యో హితాని న శృణోతి।
కో మూకో యః కాలే ప్రియాణి వక్తుం న జానాతి॥

శ్లో॥ కిం దాన మనాకాంక్షం కిం మిత్రం యో నివారయతి పాపాత్ ।
కోఽలంకారః శీలం కి వాచాం మణ్డనం సత్యమ్ ॥

శ్లో॥ విద్యుద్విలసిత చపలం కిం దుర్జనసంగతి ర్యువతయశ్చ ।
కులశీల నిష్ప్రకంపాః కే కలికాలేఽపి సజ్జనా ఏవ ॥

శ్లో॥ చిన్తామణి రివ దుర్లభ మిహ కిం కథయామి తచ్చతు ర్భద్రమ్।
కిం తద్వద న్తి భూయో విధూతతమసో విశేషేణ ॥

తా॥ ప్రాణి సమూహము ఎవరి వశమగును? సత్యభాషణము ప్రియభాషణము చేయునట్టి వినయశీలుని వశమున నుందురు. దృష్టమగు అర్థలాభము కొరకు ప్రయత్నించువాడు ఎట్టి

మార్గమున నుండవలెను! న్యాయమగు మార్గము ననుసరింపవలెను.

గ్రుడ్డివాడెవడు? దుష్కార్యములందు నిమగ్నమైనవాడు. చెవిటివాడెవడు? హితవచనముల నాలకించనివాడు బధిరుడు. మూగవాడెవరు? తగిన సమయమున ప్రియములైన మాటలు చెప్పనివాడు మూకప్రాణియే యని భావింపవలయును.

దేనిని దానమందురు? నిష్కామనతో చేయుదానిని. ఎవడు మిత్రశబ్దవాచ్యుడు? పాపకృత్యముల నుండి మరల్చువాడే మిత్రశబ్దముచే పిలవదగినవాడు? మానవున కలంకారమేది? సచ్ఛీలము. మాటకు భూషణ మేది? సత్యభాషణము.

విద్యుల్లత వలె చంచల మైనది ఏది? దుష్టసాంగత్యము, యువతులు నని గ్రహింప నగును. కులశీలములందు బద్ధదృష్టిగల వారెవరు? కలికాలమందు సైతము సజ్జనులే కులశీల సంపన్నులు.

ఇహలోకమున చింతామణి వలె పొందశక్యము కానిదియేది? చతుర్భద్రము. విధూతాజ్ఞానతమస్కులైన జ్ఞానులు ఆచతుర్భద్రమును ఏమని వివరింతురు?

శ్లో॥ దానం ప్రియవాక్యసహితం జ్ఞాన మగర్వం క్షమాన్వితం శౌర్యమ్।
విత్తం త్యాగసమేతం దుర్లభ మేత చ్చతుర్భద్రమ్॥

శ్లో॥ కిం శోచ్యం కార్పణ్యం సతి విభవే కిం ప్రశస్త
మౌదార్యమ్।
కః పూజ్యో విద్వద్భిః స్వభావతః సర్వదా వినీతో యః॥

శ్లో॥ కః కులకమలదినేశః సతి గుణవిభవేఽపి యో నమ్రః
కస్య వశే జగదేతత్ ప్రియహితవచనస్య ధర్మనిరతస్య

శ్లో॥ విద్వన్మనోహరా కా సత్కవితా బోధనిరతా చ।
కం న స్పృశతి విపత్తిః ప్రబుద్ధవచనానువర్తినం
దాన్తమ్॥

శ్లో॥ కస్మై స్పృహయతి కమలా త్వనలసచిత్తాయ నీతివృత్తాయ।
త్యజతి చ కిం సహసా ద్విజగురుసురనిందాకరం చ
సాలస్యమ్॥

ప్రియవాక్యసహితమైన దానము, గర్వరహితమైన జ్ఞానము, క్షమాగుణముతోనొప్పారు శౌర్యము, త్యాగయుతమైన ధనము ఈ నాలుగును దుర్లభమైన 'చతుర్భద్రము'గా తెలియ నగును.

శోచనీయ మగు అవస్థ ఏది? వైభవసంపన్నుడయి యును కార్పణ్యముతో నుండుట. ప్రశంసనీయ మైనది ఏది? ఔదార్యము. విద్వాంసులకు పూజనీయు డెవరు? సహజముగ సదా వినీతుడైనవాడు పూజనీయుడు.

వంశ మను కమలమును వికసింపచేయునట్టి భాస్కరు డెవరు? గుణవైభవముతో సంపన్నుడయ్యు వినమ్రుడై వర్తించువాడు. ఈ ప్రపంచము ఎవరి వశమున నుండును?

ప్రియములు హితములు నైన మాటలు పల్కువాడు, ధర్మ నిష్ఠుడు నైనవాని వశమున ఈ లోక ముండును.

విద్వాంసుల మనసును హరించున దేది? సత్కవిత్వము, బోధనిరతి ఈ రెండును విద్వన్మనోహరములు. ఆపదలు ఎవనిని తాకకుండును? జ్ఞాను లగు మహాత్ముల వచనముల ననుసరించువానిని, ఇంద్రియనిగ్రహము కల ధీరుని ఆపదలుస్పృశింపజాలవు.

లక్ష్మీకటాక్షమునకు పాత్రు డెవడు? అలసభావ మెరుగని కార్యశూరుడు నీతిమంతుడును లక్ష్మీదేవతానుగ్రహమునకు పాత్రుడగును. హఠాత్తుగ లక్ష్మి ఎవరిని వదలిపెట్టును? బ్రాహ్మణనింద గురుతిరస్కారము, దేవతానింద చేయువానిని, సోమరిని లక్ష్మీదేవి వదలిపెట్టును అని భావము.

శ్లో॥ కేనాశోచ్యః పురుషఃప్రణతకలత్రేణ ధీరవిభవేన,
ఇహ భవనే కః శోచ్యః సత్యపి విభవే న యో దాతా॥

శ్లో॥ కుత్ర విధేయో వాసః సజ్జననికటేఽథవా కాశ్యామ్।
కః పరిహార్యో దేశః పిశునయుతో లుబ్ధభూపశ్చ॥

శ్లో॥ కిం లఘుతాయా మూలం ప్రాకృతపురుషేషు యా యాచ్ఞా
రామా దపి కః శూరః స్మరశరనిహతో న య శ్చలతి॥

శ్లో॥ కి మహర్నిశ మనుచింత్యం భగవచ్చరణం న సంసారః।
చక్షుష్మన్తోఽప్యన్ధాః కే స్యుః యే నాస్తికా మనుజాః॥

శ్లో॥ కః పంగు రిహ ప్రథితో ప్రజతి చ యో వార్ధకే తీర్థమ్,
కిం తీర్థ మపి చ ముఖ్యం చిత్తమలం య న్నివర్తయతి॥

తా॥ దుఃఖము నొందని పురుషుడెవరు ? అణకువ కల భార్య గలవాడును, స్థిరమగు సంపద గలవాడును దుఃఖమునొందడు. శోచనీయుడగు వ్యక్తి యెవరు ? వైభవసంపన్నుడయ్యు దాతృత్వము లేనివాడు శోచనీయుడు.

ఎచట నివసింపదగును ? సజ్జనసంనిధియందును లేక కాశిలోను నివసింపదగును. ఏదేశము పరిహరింప దగినది? పరనింద చేయునట్టి దుర్జను డుండు దేశము లుబ్ధుడగు రాజుచే పాలింపబడు దేశమును పరిహరింపదగినది.

చులకనయగుటకు మూల మేమి ? ప్రాకృత పురుషుల ముందు చేయి చాపి యాచించుట. రామచంద్రుని కంటె ఈ లోకమున శూరు డెవడు ? మన్మథబాణముల తాకిడికి చలింపని ధీరచిత్తుడు.

అహర్నిశము చింతనీయ మగు వస్తువేద్ది? పరమేశ్వర పాదపద్మయుగళము ధ్యానింప దగినది; సంసారము మాత్రము కాదు. నేత్రము లుండియు అంధులనదగు వారెవరు ? నాస్తికులు.

ఈ లోకమున కుంటివా డెవడు ? వార్ధకమున పుణ్య తీర్థసేవనమునకై పోవువాడు. ప్రధానమగు తీర్థమేది, చిత్త మాలిన్యమును పోగొట్టునట్టి ఆత్మతత్వజ్ఞానము.

శ్లో॥ కిం స్మర్తవ్యం పురుషైః హరినామ న యావనీ భాషా।
కో హి న వాచ్యః సుధియా పరదోషశ్చానృతం తద్వత్॥

శ్లో॥ కిం సంపాద్యం మనుజైః విద్యా విత్తం బలం యశః
పుణ్యమ్।
కః సర్వగుణవినాశీ లోభః శత్రుశ్చ కః కామః॥

శ్లో॥ కా చ సభా పరిహార్యా హీనా యా వృద్ధసచివేన।
ఇహ కుత్రావహితః స్యాత్ మనుజః కిల రాజసేవాయామ్॥

శ్లో॥ ప్రాణాదపి కో రమ్యః కులధర్మః సాధుసంగశ్చ।
కా సంరక్ష్యా కీర్తిః పతివ్రతా నైజబుద్ధిశ్చ॥

శ్లో॥ కా కల్పలతా లోకే సచ్ఛిష్యా యార్పితా విద్యా।
కో ఽక్షయవటవృక్షః స్యాత్ విధివత్ సత్పాత్ర
దత్తదానం యత్॥

తా॥ లోకమున మనుజులచే నిరంతరము స్మరింపబడదగిన దేది? హరినామము, కాని యవనభాష కాదు. బుద్ధిమంతులు పలుకదగనిది యేది? పరులదోషమును, అనృతమును పల్కరాదు.

మనుజులు సంపాదింపదగినది యేది? విద్యావిత్తములు, బలము, యశస్సు, పుణ్యము ఇవి సంపాదింపదగినవి. సకల సద్గుణములను నాశ మొనర్చున దేది? లోభము. ఈలోకమున శత్రు వెవరు, కామము అని యెరుగనగును.

పరిహరింపదగు సభ యేది? వృద్ధామాత్యుడు లేని సభ త్యజింప దగినది. మానవుడు సావధానుడై వర్తింపదగు విషయమేది? రాజసేవ.

ప్రాణము కంటె సుందరమైన వస్తువేది ? వంశాచారము, సజ్జనసాంగత్యము రమణీయమైనది. ఈ సంసారమున రక్షించుకొన దగినదేది ? కీర్తి, పతివ్రత, స్వబుద్ధి- ఇవి రక్షించుకొనదగినవి.

లోకమున కల్పలత వలె విరాజిల్లునదేది ? యోగ్యుడైన శిష్యున కొసగబడిన విద్య శోభించును. ఈ లోకమున అక్షయ వటవృక్ష సదృశమైనది ఏది ? విధివిధానముగా సత్పాత్రున కీయబడిన దానము.

శ్లో॥ కిం శాస్త్రం సర్వేషాం యుక్తి ర్మాతా చ కా ధేనుః।
కిం ను బలం యద్ధైర్యం కో మృత్యు ర్యదవధానరహి
తత్వమ్॥

శ్లో॥ కుత్ర విషం దుష్టజనే కి మిహాశౌచం భవే దృణం
నృణామ్।
కి మభయ మిహ వైరాగ్యం భయమపి కిం విత్తమేవ
సర్వేషామ్॥

శ్లో॥ కా దుర్లభా నృణాం హరిభక్తిః పాతకం చ కిం హింసా
కోహి భగవత్ప్రియః స్యా ద్యోఽన్యం నోద్వేజయే
దనుద్విగ్నః॥

శ్లో॥ కస్మాత్ సిద్ధి స్తపసో బుద్ధిః క్వ ను భూసురే కుతో బుద్ధిః।
వృద్ధోపసేవయా కే వృద్ధా యే ధర్మతత్త్వజ్ఞాః॥

శ్లో॥ సంభావితస్య మరణా దధికం కిం దుర్యశో భవతి।
లోకే సుఖీ భవేత్ కో ధనవాన్ ధనమపి కిం యత
శ్చేష్టమ్॥

తా॥ సర్వజనులకు శాస్త్ర మగున దేది? యుక్తి. మాతృ సదృశముగా పూజనీయ మగున దేది? గోవు. మానవునకు బల మేది? ధైర్యము. మృత్యు వనదగునది ఏది? సావ ధానముగ లేకుండుట.

విష మెచట ఉండును? ఖలజనులకు నిలువెల్లవిషము. అశౌచ మగున దేది? ఋణము. ఈ ప్రపంచమున అభయ మైనది ఏది? వైరాగ్యసంపద. సర్వజనులకు భయదాయక మైనది ఏది? ధనము.

ఈ విశ్వములో మనుష్యులకు దుర్లభమగు వస్తువేది? హరిభక్తి. పాప మని దేనిని అందురు? హింసయే పాపము. భగవంతుని ప్రేమకు పాత్రుడెవరు? ఇతరుల నుద్వేజితులను చేయక తాను ఉద్రేకము చెందక జీవనయాత్ర చేయువాడు.

దేనివలన సిద్ధి ప్రాప్తించును? తపస్సువలన. ఎవరిపై బుద్ధి నుంచదగును? భూసురుల మీద బుద్ధినుంచదగును. సద్బుద్ధి ఎట్లు ఉదయించును? వృద్ధజనమును సేవించుటవలన సద్బుద్ధి కలుగును. ఎవరు వృద్ధు లనబడుదురు? ధర్మతత్త్వజ్ఞులు.

పూజనీయుడగు వ్యక్తికి మరణముకంటె అధికమైన దేది? లోకనింద. ఈ లోకమున సుఖము బడయువాడు ఎవరు? ధనసంపన్నుడు. ధన మన నేమి? తానభిలషించిన వస్తువును పొందుటకై చేయు ప్రయత్నము ధన మనబడును.

శ్లో॥ సర్వసుఖానాం బీజం కిం పుణ్యం దుఃఖ మపి కుతః స్యాత్।
కస్య ఐశ్వర్యం యః కిల శంకర మారాధయేద్ భక్త్యా॥

శ్లో॥ కో వర్ధతే వినీతః కో వా హీయతే యో దృప్తః।
కో న ప్రత్యేతవ్యో బ్రూతే య శ్చానృతం శశ్వత్॥

శ్లో॥ కుత్రానృతే ప్యపాపం యచ్చోక్తం ధర్మరక్షార్థమ్।
కో ధర్మోఽభిమతో యః శిష్టానాం నిజకులీనానామ్॥

శ్లో॥ సాధుబలం కిం దైవం కః సాధుః సర్వదా తుష్టః।
దైవం కిం యత్సుకృతం కః సుకృతీ శ్లాఘ్యతే యః సద్భిః

శ్లో॥ గృహమేధినశ్చ కి మిత్రం భార్యా కో గృహీ చ యో యజతే
కో యజ్ఞో యః శ్రుత్యా విహితః శ్రేయస్కరో నృణామ్॥

తా॥ ఈ లోకమున సర్వసుఖములకు బీజ మేది? పుణ్య
కార్యాచరణము. దేనివలన దుఃఖము కలుగును? పా
కృత్యము వలన. ఎవరు ఐశ్వర్యసంపన్నులై ఉండును
పరశివుని భక్తితో ఆరాధించువాడు ఐశ్వర్యముతో
విరాజిల్లును.

ఎవరు జీవితములో అభివృద్ధి నొందును? వినయ
సంపన్నుడైనవాడు అభివృద్ధి సంపాదించును. ఎవడు నా
మొందును? గర్వితుడైనవాడు. విశ్వసింపదగినవాడు ఎవరు
సర్వదా అసత్యభాషణము చేయువాడు.

అనృతభాషణము ఏ సమయమున పాప మనిపించ
కొనదు? ధర్మరక్షార్థము అసత్యము చెప్పవలసిన సమయ
మున పాప మని తలచబడదు. ఏది ధర్మమని భావింపబడును

వంశపరంపరాగతమై శిష్టులచే నాదరింపబడినది ధర్మ మని చెప్పబడును.

సాధుజనులకు బల మేది? దైవము. సాధుజను లెవరు? నిత్యసంతుష్టులు. దైవమన నేమి? సుకృతము. సుకృతి యని ఎవనిని చెప్పెదురు? సజ్జనప్రశంసనీయమైన పవిత్రాచరణము కలవాడు.

గృహస్థులకు ఎవరు మిత్రము? భార్య. ఎవరు గృహస్థు అని చెప్పబడును? యజ్ఞయాగముల ననుష్ఠించినవాడు. ఏది యజ్ఞము? వేదవిహితమై మానవులకు శ్రేయోదాయక మైనది యజ్ఞ మనబడును.

శ్లో॥ కస్య క్రియా హి సఫలా యః పున రాచారవాన్ శిష్టః।
కః శిష్టో యః వేదప్రమాణవాన్ కో హతః క్రియాభ్రష్టః॥

శ్లో॥ కో ధన్యః సన్న్యాసీ కో మాన్యః పండితః సాధుః।
కః సేవ్యో యో దాతా యోఽర్థితృప్తి మాతనుతే॥

శ్లో॥ కిం భాగ్యం దేహవతా మారోగ్యం కః ఫలీ కృషికృత్।
కస్య న పాపం జగతః కః పూర్ణో యః ప్రజావాన్ స్యాత్॥

శ్లో॥ కిం దుష్కరం నరాణాం య న్మనసో నిగ్రహం సతతమ్।
కో బ్రహ్మచర్యవాన్ స్యాద్ య శ్చాస్ఖలితోర్ధ్వరేతస్కః॥

శ్లో॥ కా చ పరదేవతోక్తా చిచ్ఛక్తిః కో జగద్భర్తా।
సూర్యః సర్వేషాం కో జీవనహేతుః స పర్జన్యః॥

తా॥ ఎవరి క్రియలు సఫలము లగును? ఆచారవంతుడు శిష్టాచారసంపన్ను డగువాని కర్మాచరణములు సఫలము

లగును. శిష్టజను డెవరు? వేదమునే ప్రమాణముగ తలచు వాడు. ఎవడు నాశ మొందును? కర్మభ్రష్టుడై నవాడు నిహతు డగును.

ధన్యజీవి ఎవరు? సర్వకర్మ సంన్యాస మొనర్చిన యతీశ్వరుడు. పూజనీయు డెవరు? పండితుడు సాధువర్తనము కలవాడును మాన్యుడు. సేవింపదగినవా డెవరు? యాచక జనము ఏ వదాన్యుని వలన తృప్తి నొందునో అట్టిదాత సేవనీయుడు.

శరీరధారులగు మనుజులకు భాగ్యమేది? ఆరోగ్యము. ఎవరు జీవితములో సఫలుడగును? కర్షకుడు. ఎవడు పాప భాజనుడు కాడు? మంత్రజపముచేయువాడు. ఎవరు పూర్ణు డని భావింపబడును? సత్సంతానము కలవాడు సంపూర్ణమైన వ్యక్తిగా భావింపబడును.

మానవులకు దుష్కరమగు కార్య మేది? నిరంతర మనోనిగ్రహము. బ్రహ్మచారి ఎవరు? అస్ఖలిత ఊర్ధ్వరేతస్కుడై బ్రహ్మనిష్ఠ కలవాడు బ్రహ్మచారి.

పరదేవత ఎవరు? చిచ్ఛక్తి. ఈ సకల బ్రహ్మాండమునకు ప్రభువు ఎవరు? సూర్యుడు. సర్వప్రాణికోటికి జీవన హేతువెవరు? మేఘుడు.

శ్లో॥ కః శూరో యో భీతత్రాతా త్రాతా చ కః స గురుః ।
కో హి జగద్గురు రుక్తః శంభుః జ్ఞానం శివాదేవ ॥

శ్లో॥ ముక్తిం లభతే కస్మాద్ ముకుందభక్త్యా ముకుందః కః ।
యస్తారయే దవిద్యాం కా చా విద్యా యదాత్మనో ఽస్ఫూర్తిః॥

శ్లో॥ కస్య న శోకః యః స్యా దక్రోధః కిం సుఖం తుష్టిః ।
కో రాజా రంజనకృత్ కశ్చ శ్వా నీచసేవకో యః స్యాత్॥

శ్లో॥ కో మాయీ పరమేశః క ఇన్ద్రజాలాయతే పంచోఽయమ్॥
కః స్వప్ననిభో జాగ్రద్వ్యవహారః సత్యమపి చ కిం బ్రహ్మ

శ్లో॥ కిం మిథ్యా యద్విద్యా నాశ్యం తుచ్ఛం తు శశవిషాణాది।
కా చానిర్వచనీయా మాయా కిం కల్పితం ద్వైతమ్॥

తా॥ శూరు డెవడు ? భయభీతచిత్తులను కాపాడువాడు. మానవులకు రక్షకు డెవరు ? అజ్ఞానాంధకారమునుండి వెలుగు చూపునట్టి గురువు రక్షకుడు. ఎవరు జగద్గురువుగ కీర్తింప బడుచున్నాడు ? పరశివుడు. జ్ఞానోదయము ఎవరివలన కలుగును ? త్రిపురదాహకుడగు ఆ పరశివుని యనుగ్రహము వలననే జ్ఞానోదయ మగును.

దేనివలన మోక్షము లభించును ? ముకుందభక్తి వలన ముక్తి లభించును. ఎవరు ముకుంద నామముతో వ్యవహరింప బడుచున్నాడు ? అవిద్యాసాగరమును దాటించువాడే ముకుందుడు. అవిద్య యనగా ఏది ? ఆత్మప్రకాశమునకు ఆవరకమైనదాన్ని అవిద్య యందురు.

ఎవరు శోకసంతప్తుడు కాడు ? క్రోధమును జయించిన వాడు. ఏది సుఖము ? సంతుష్టి. రాజు ఎవరు ? ప్రజా

రంజనము చేయువాడు. శునకనామముతో ఎవరిని పిలువ నగును ? నీచజనసేవ చేయువానిని కుక్కయని పిలువనగును.

మాయావి ఎవగు , పరమేశ్వరుడు. ఇంద్రజాలసదృశ మైనది ఏది? ఈ మిథ్యాప్రపంచము. స్వప్నతుల్య మైనది ఏది ? జాగ్రత్ప్రపంచవ్యవహారము. సత్యవస్తువు ఏది ? బ్రహ్మపదార్థము.

దేనిని మిథ్య యందురు ? జ్ఞానము వలన నశించు దానిని మిథ్య యందురు. తుచ్ఛమగున దేది ? కుందేటి కొమ్ము. అనిర్వాచనీయ మైనది ఏది, మాయ. ఏది కల్పిత వస్తువు ? ద్వైతప్రపంచము.

శ్లో॥ కిం పారమార్థికం స్యా దద్వైతం చాజ్ఞతా కుతోఽనాదిః।
వపుశ్చ పోషకం కిం ప్రారబ్ధం చాన్నదాయి కం చాయుః॥

శ్లో॥ కో బ్రాహ్మణై రుపాస్యో గాయత్ర్యర్కాఽగ్ని గోచరః శంభుః।
గాయత్ర్యా మాదిత్యే చాగ్నౌ శంభౌ చ కిం ను తత్ తత్త్వమ్॥

శ్లో॥ ప్రత్యక్ష దేవతా కా మాతా పూజ్యో గురుశ్చ క స్తాతః।
కః సర్వదేవతాత్మా విద్యాకర్మాన్వితో బ్రాహ్మణః॥

శ్లో॥ కశ్చ కులక్షయహేతుః సంతాపః సజ్జనేషు యోఽకారి।
కేషా మమోఘవచనం యే చ పునః సత్య,మౌన, శమ శీలాః॥

శ్లో॥ కిం జన్మ విషయసంగః కి ముత్తరం జన్మ పుత్రః స్యాత్।
కోఽపరిహార్యో మృత్యుః కుత్ర పదం విన్యసే చ్చ
దృక్పూతే॥

తా॥ పరమార్థభూతమైన సత్యవస్తువేది? అద్వయ బ్రహ్మ తత్త్వము. అజ్ఞానము దేనివలన కలుగుచున్నది? ఆది యనాది. శరీరపోషక మగునదిఏది? ప్రారబ్ధకర్మ. అన్నము దేనిని ఇచ్చును? ఆయుర్దాయము నొసగును.

బ్రాహ్మణులు ఉపాసింపదగినది ఏది? గాయత్రి, అగ్ని భాస్కరుడు- వీని ఉపాసనాద్వారమున అద్వయ పరశివ తత్త్వము నుపాసింప నగును. గాయత్రి, అగ్ని, సూర్యుడు- వీరిలో ఏతత్త్వము కలదు? అదియే, పరమార్థభూతమైన ఆ బ్రహ్మతత్త్వము కలదు.

ఈ లోకమున ప్రత్యక్షదైవము ఎవరు? మాతృమూర్తి. పూజనీయుడు, గురువును ఎవరు? తండ్రి. సర్వ దేవతామూర్తి ఎవరు? జ్ఞానముచేతను కర్మానుష్ఠానము చేతను విరాజిల్లునట్టి బ్రాహ్మణుడు.

వంశక్షయకారణమైనది ఏది? సజ్జనుల హృదయమునకు కలిగించు దుఃఖము. ఎవరి మాట అమోఘమై ధర జెల్లును? సత్యము, మౌనము, దమము మున్నగు గుణములచే నొప్పారునట్టి సాధుపురుషుల వచనము తిరుగులేనిదై ధరిత్రిలో వెలు గొందును.

జన్మ మనగా ఏమి? విషయానురక్తి. మానవునకు మరు జన్మ ఏది? పుత్రుడు. పరిహరింపరానిది ఏది? మృత్యువు. మానవులు అడుగు ఎక్కడ ఉంచదగును?

కంటితో చక్కగా పరిశీలించి పవిత్రమైన స్థలమందు అడుగు ఉంచవలయును.

శ్లో॥ పాత్రం కి మన్నదానే క్షుధితం కో ఒర్చ్యో హి భగవదవతారః।
కశ్చ భగవాన్ మహేశః శంకరనారాయణాత్మకః॥

శ్లో॥ ఫల మపి భగవద్భక్త్యాః కిం తత్తల్లోకస్వరూపసాక్షాత్వమ్।
మోక్షశ్చ కో హి అవిద్యాస్తమయః కః సర్వవేదభూః
అథ చ ఓమ్॥

శ్లో॥ ఇత్యేషా కంఠస్థా ప్రశ్నోత్తరరత్నమాలికా యేషామ్।
తే ముక్తాభరణా ఇవ విమలా శ్చాభాంతి సత్సమాజేషు॥ *

తా॥ అన్నదానము ఎవరికి చేయనగును? ఆకలిబాధ గొన్న వానికి. అర్చింపదగినవాడు ఎవడు? భగవదవతారమూర్తి. భగవంతుడెవరు? హరి-హరాత్మకుడైన మహేశుడు.

భగవద్భక్తికి ఫలమేమి? సాలోక్య స్వారూప్యముల సాక్షాత్కారము నొందుట. మోక్షమనగా నేమి? అవిద్యా నాశముమోక్షము. సర్వవేదములకు ఉత్పత్తిస్థానమేది? 'అథ' మరియు, ప్రణవవాచకమగు ఓంకారమును సకలవేదములకు ఉత్పత్తిస్థానములు.

---

* ఇతి కంఠగతా విమలప్రశ్నోత్తరరత్నమాలికా యేషామ్।
తేఒముక్తాభరణా అపి విభాన్తి విద్వత్సమాజేషు॥-

అని పాఠాంతరము కన్పట్టుచున్నది.

ఈ ప్రశ్నోత్తరరూపమైన రత్నమాలికను కంఠము నందు దాల్చినవారు ముక్తాహారమును ధరించినవారివలె సాధుసమాజ మధ్యమున నిర్మలాంతఃకరణముతో విరాజిల్లు దురు.

ఈ వాదవివాదములను 'ప్రశ్నోత్తరమణిరత్నమాల' యను పేరుతో కూడ ఆచార్యులొసగిరి.

శ్లో॥ అపారసంసారసముద్రమధ్యే
నిమజ్జతో మే శరణం కిమస్తి।
గురో కృపాలో కృపయా వదైతద్
విశ్వేశపాదాంబుజ దీర్ఘనౌకా॥

శ్లో॥ బద్ధో హి కో యో విషయానురాగీ
కా వా విముక్తి ర్విషయే విరక్తిః।
కో వాఽస్తి ఘోరో నరకః స్వదేహః
తృష్ణాక్షయః స్వర్గదం కిమస్తి॥

శ్లో॥ సంసారహృత్ కః శ్రుతిజాత్మబోధః
కో మోక్షహేతుః సతతం స ఏవ।
ద్వారం కిమేకం నరకస్య నారీ
కా స్వర్గదా ప్రాణిభృతా మహింసా॥

తా॥ కృపాసముద్రుడు నగు గురుదేవా! అపారమైన భవ సాగరమున మునక లిడుచున్న నాకు శరణ్యమగున దేది? విశ్వేశ్వరచరణ కమలయుగళమే భవసాగరతరణమునకై ఆశ్రయణీయ మగు నౌక యని తెలిసికొనదగును.

సంసారబంధము కలవాడు ఎవడు? విషయసుఖము లందు అనురాగము కలవాడు. బంధవిముక్తి యనగా నేమి? విషయవైరాగ్యము. ఘోరమగు నరక మేది? శరీరము. స్వర్గఫలదాయి ఏది? తృష్ణాక్షయము.

సంసారబంధమును తొలగించున దేది? వేదచోదిత మైన ఆత్మబోధ. మోక్షహేతు వేది? నిరంతరము ఉపనిషత్ప్రతిపాదితమైన ఆత్మబోధయే మోక్షహేతువు.

నరకద్వారమేది? స్త్రీ. ప్రాణధారులకు స్వర్గ ప్రద మైనది ఏది? అహింస.

శ్లో॥ శేతే కస్తు సమాధినిష్ఠో
జాగర్తి కో వా సదసద్వివేకీ।
కే శత్రవః సంతి నిజేంద్రియాణి
తాన్యేవ మిత్రాణి జితాని యాని॥

శ్లో॥ కో వా దరిద్రో హి విశాలతృష్ణః
శ్రీమాంశ్చ కో యస్య సమస్తతోషః।
జీవన్మృతః కస్తు నిరుద్యమో యః
కో వాఽమృతః స్యాత్ సుఖదా నిరాశా॥

శ్లో॥ పాశో హి కో యో మమతాభిమానః
సమ్మోహయత్యేవ సురేవ కా స్త్రీ।
కో వా మహాంధో మదనాతురో యో
మృత్యుశ్చ కో వాఽపయశః స్వకీయమ్॥

తా॥ సుఖముగా ఎవరు నిద్రించును? సమాధినిష్ఠుడు. ఎవరు మేల్కొని యుండును? నిత్యానిత్యవస్తువివేకము గలవాడు. మానవులకు ఈ లోకమున శత్రువు లెవరు? తన ఇంద్రియములే శత్రువులు. మిత్రు లెవరు, వశీభూతములైన ఇంద్రియములే మిత్రములు.

దరిద్రుడనగా ఎవరు? నిరతిశయమైనతృష్ణ కలవాడు. లక్ష్మీసంపన్నుడెవడు, నిత్యసంతృప్తుడు. జీవన్మృతుడు ఎవరు? పురుషప్రయత్నము లేక జీవించువాడు. అమృతమనగా ఏది? ఆశ లేకుండుటయే, అమృతము వలె సుఖదమైనది.

పాశ మనగా నేది? మమకారముతో కూడిన యభిమానము. మద్యము వలె మాదకమై సంమోహితునిగా చేయునది ఏది? స్త్రీ. మహాంధుడెవడు? కామాతురుడు. దేనిని మృత్యువందురు? తనదైన అపయశమును మృత్యు వందురు.

శ్లో॥ కో వా గురు ర్యో హి హితోపదేష్టా
శిష్యస్తు కో యో గురుభక్త ఏవ।
కో దీర్ఘ రోగో భవ ఏవ సాధో
కి మౌషధం తస్య విచార ఏవ॥

శ్లో॥ కిం భూషణా ద్భూషణ మస్తి శీలం
తీర్థం పరం కిం స్వమనో విశుద్ధమ్।
కిమత్ర హేయం కనకం చ కాన్తా
శ్రావ్యం సదా కిం గురువేదవాక్యమ్॥

శ్లో॥ కే హేతవో బ్రహ్మగతేస్తు సంతి
సత్సంగతి ర్దానవిచారతోషాః।
కే సంతి సంతః అఖిలవీతరాగాః
అపాస్తమోహాః శివతత్త్వనిష్ఠాః॥

తా॥ గురువు ఎవరు? హితము నుపదేశించువాడు. ఎవరు శిష్యుడు? గురువు యందు భక్తి కలవాడే. దీర్ఘ రోగమేది? సాధో! సంసారమే ఒక దీర్ఘరోగము. సంసారరోగమునకు ఔషధ మేమి, ఆత్మ-అనాత్మ-విచారమే దివ్యఔషధము.

భూషణము కంటె అలంకారమైనది ఏది? సచ్ఛీలము. శ్రేష్ఠమైన తీర్థ మేది? నిర్మలమైన అంతకఃరణము. ఈ లోకమున హేయమైన వేవి? కాంతాకనకములు. సదా శ్రవణము చేయదగిన వేవి? గురువచనము, శ్రుతివచనము శ్రవణ యోగ్యములు.

బ్రహ్మవగతికి కారణములెవ్వి? సజ్జనసాంగత్యము, దానము, ఆత్మానాత్మవిచారము, సంతోషము బ్రహ్మవగతికి ఉపాయములు. సాధుపురుషు లెవరు? వీతరాగులు, మోహ రహితులు, శివతత్త్వనిష్ఠులు నైనవారు సాధుపురుషులు.

శ్లో॥ కో వా జ్వరః ప్రాణభృతాం చ చింతా
మూర్ఖోఽస్తి కో యస్తు వివేక హీనః।
కార్యా ప్రియా కా శివవిష్ణుభక్తిః
కిం జీవనం దోషవివర్జితం యత్॥

శ్లో॥ విద్యా హి కా బ్రహ్మగతిప్రదా యా
బోధో హి కో యస్తు విముక్తిహేతుః।
కో లాభః ఆత్మావగమో హి యో వై
జితం జగత్ కేన మనో హి యేన॥

శ్లో॥ శూరా న్మహాశూరతమోఽస్తి కో వా
మనోజబాణై ర్వ్యథితో న యస్తు।
ప్రాజ్ఞో హి ధీరశ్చ సమశ్చ కో వా
ప్రాప్తో న మోహం లలనా కటాక్షైః॥

ప్రాణధారులకు జ్వర మేది? చింత. మూర్ఖజను డెవడు? సదసద్వివేకము లేనివాడు. ప్రియమైన కార్యమేది? శివకేశవభక్తి ప్రియమైన కార్యము. జీవిత మేది? దోషవర్జిత మైనది.

ఏది విద్యయనబడును? బ్రహ్మావగతి కలిగించునదే విద్య. బోధ ఏది? సంసారబంధమునుండి విముక్తి నొందించునది. లాభమనగా ఏమి? ఆత్మావగతి. ఈ జగత్తును జయించిన వాడెవరు? మనోజయమును సాధించినవాడు.

ఎవరు శూరులలో శూరతముడుగా లెక్కింపబడును? మన్మథబాణముల తాకిడికి వ్యథ చెందనివాడు శూరతముడు. ఎవనిని ప్రాజ్ఞు డనియు,ధీరుడనియు, సమదృష్టి కలవాడనియు, నందురు? స్త్రీయొక్క క్రీగంటిచూపుల చేత మోహితుడు కాని వానిని ప్రాజ్ఞ,ధీర,సమదృక్ శబ్దములచే పిలుతురు.

శ్లో॥ విషా ద్విషం కిం విషయాః సమస్తా
దుఃఖీ సదా కో విషయానురాగీ।
ధన్యస్తు కో యస్తు పరోపకారీ
కః పూజనీయః శివతత్త్వనిష్ఠః॥

శ్లో॥ సర్వాస్వవస్థాస్వపి కిం న కార్యం
కిం వా విధేయం విదుషా ప్రయత్నాత్।
స్నేహశ్చ పాపం పఠనం చ ధర్మః
సంసారమూలం హి కి మ స్తి చింతా॥

శ్లో॥ విజ్ఞాత్ మహావిజ్ఞతమోఽస్తి కో వా
నార్యా పిశాచ్యా న చ వంచితో యః।
కా శృంఖలా ప్రాణభృతాం చ నారీ
దివ్యం వ్రతం కించ సమస్తదైన్యమ్॥

తా॥ విషము కంటె విషమైన దేది ? సమస్త విషయసుఖము. ఎల్లవేళల దుఃఖము నొందువాడెవడు ? విషయసుఖములందు అనురాగము కలవాడు. ధన్యజీవి యెవరు ? పరోపకార మొనర్చువాడు. పూజనీయు డెవరు ? శివతత్త్వమునందు గాఢమగు నిష్ఠ కలవాడు.

సర్వావస్థలయందును విద్వాంసుడు చేయకూడని కార్యము లేవి ? స్నేహము, పాపమును చేయదగని కార్యములు. విద్వాంసునకు విహితకార్యములేవి ; వేద-శాస్త్రాధ్యయనము, ధర్మానుష్ఠానమును విహితములగుకర్తవ్యములు.

విజ్ఞునికంటె విజ్ఞతము డెవరు ? నారీపిశాచవంచనకు లోను గానివాడు. ప్రాణులకు సంకెల వంటిది యేది? స్త్రీ. దివ్యమగు వ్రత మేది? సంపూర్ణదైన్యము.

శ్లో॥ జ్ఞాతుం న శక్యం చ కిమస్తి సర్వైః
యోషిన్మనో యచ్చరితం తదీయమ్।
కా దుస్త్యజా సర్వజనైః దురాశా
విద్యా విహీనః పశు రస్తి కో వా॥

శ్లో॥ వాసో న సంగః సహకైర్విధేయా
మూర్ఖైశ్చ నీచైశ్చ ఖలైశ్చ పాపైః,
ముముక్షూణాం కిం త్వరితం విధేయం
సత్సంగతిః నిర్మమతేశభక్తిః॥

శ్లో॥ లఘుత్వమూలం చ కి మర్థితైవ
గురుత్వమూలం యదయాచనం చ।
జాతో హి కో యస్య పునః న జన్మ
కో వాఽమృతో యస్య పునః న మృత్యుః ॥

తా॥ సర్వులచే ఎరుగబడజాలనిది యేది? స్త్రీ చిత్తము, స్త్రీ శీలమును ఎరుగ శక్యముకానివి. సర్వజనులచే త్యజింపబడ జాలనిది దేది? దురాశ; ఈ లోకములో పశుసమాను డెవడు? విద్యావిహీనుడు.

ఎవరితో కూడ నివసింప జనదు? మూర్ఖులు, నీచులు, దుష్టులు, పాపులు- వీరితో కూడి నివసింపరాదు. మోక్షేచ్ఛ

గలవారికి విహిత మైనది ఏది? సాధు-సజ్జన సాంగత్యము, మమతారాహిత్యము, ఈశ్వరభక్తి- ఇవి విహితములు.

లోకము దృష్టిలో చులకన యగుటకు కారణమేమి? అన్యులను యాచించుట. గౌరవమునకు కారణ మేమి? యాచింపకుండుటయే. ఎవనిని సార్థకజన్ము డందురు? పునర్జన్మ లేకుండునట్లుగా చేసికొనువానిని సార్థకజన్ముడందురు. ఎవనిని అమృతు డందురు? ఇక ముందు మృతినొందని వానిని అమృతుడందురు. జన్మ మరణములు లేకుండునట్లు నిస్సంగుడై సంచరించువాని పుట్టుకయే పుట్టుక.

శ్లో॥ మూకోఽస్తి కో వా బధిరశ్చ కో వా
వక్తుం న యుక్తం సమయే సమర్థమ్।
తథ్యం సుపథ్యం న శృణోతి వాక్యం
విశ్వాసపాత్రం న కిమస్తి నారీ॥

శ్లో॥ తత్త్వం కిమేకం శివ మద్వితీయం
కిముత్తమం సచ్చరితం యదస్తి।
త్యాజ్యం సుఖం కిం స్త్రియమేవ సమ్యక్
దేయం పరం కిం త్వభయ మేవ సదైవ॥

శ్లో॥ శత్రోర్మహాశత్రుతమోఽస్తి కో వా
కామ స్సకోపాఽనృతలోభతృష్ణః।
న పూర్యతే కో విషయైః స ఏవ
కిం దుఃఖమూలం మమతాభిధానమ్॥

తా॥ మూగవాడు, చెవిటివాడును ఎవరు? తగిన సమయములో యథార్థమును, హితమును చెప్పజాలనివాడు మూగ

వాడు; సత్యమును, హితవచనములను వినజాలనివాడు బధిరుడు. విశ్వాసపాత్రము కాని ప్రాణి యెవరు? స్త్రీ.

ఏకైక తత్త్వమేది? అద్వయశివతత్త్వము. ఉత్తమమైనదేది? సచ్ఛీలము. ఏ సుఖము సంపూర్ణముగ త్యజింపనగును? స్త్రీసుఖము. శ్రేష్ఠమగు దాన మెద్ది? సర్వదా సర్వభూతములకు అభయప్రదాన మొనర్చుట.

బాహ్యశత్రువు కంటె అధికుడగు శత్రువెవరు? కామ, క్రోధ, అనృత, లోభ, తృష్ణ లనునవి శత్రువులు. విషయభోగములచే సంతృప్తి నొందనివాడు ఎవరు? విషయసుఖానురక్తుడే. దుఃఖములకు మూల మేది? మమకారము.

శ్లో॥ కిం మండనం సాక్షరతా ముఖస్య
సత్యం చ కిం భూతహితం సదైవ।
కిం కర్మ కృత్వా న హి శోచనీయం
కామారికంసారి సమర్చనాఖ్యమ్॥

శ్లో॥ కస్యాస్తి నాశో మనసో హి మోక్షః
కః సర్వథా నాస్తి భయం విముక్తౌ।
శల్యం పరం కిం నిజమూర్ఖతైవ
కేకే హి ఉపాస్యా గురుదేవ వృద్ధాః॥

శ్లో॥ ఉపస్థితే ప్రాణహరే కృతాన్తే
కి మాశు కార్యం సుధియాప్రయత్నాత్।
వాక్కాయచిత్తైః సుఖదం యమఘ్నం
మురారి పాదాబ్జచిన్తనం చ॥

తా॥ ముఖమున కలంకారమేది? విద్య. సర్వదా భూత హితమగునది ఏది? సత్యము. ఏ కార్య మొనర్చి శోచింపజనదు? కామారి యగు శివుని పూజయు, కంసారి యగు శ్రీకృష్ణుని పూజయు శోచనీయము గాదు.

దేనికి నాశముండును? మనసుకు మోక్షము (నాశము) కలుగును. అన్నివిధముల ఎచట భయము లేదు? సర్వబంధ విముక్తియందు. మానవునికి శల్యమువంటిది ఏది? స్వీయ మూర్ఖత్వమే. ఎవరెవరు ఉపాసింపదగినవారు? గురువు, దేవతలు, వృద్ధులు నుపాస్యులు.

ప్రాణాపహర్త యగు యముడు ఎదుట నిలచినప్పుడు బుద్ధిమంతు డైనవాడు వెంటనే పూనికతో చేయదగు కార్య మేది? మనోవాక్కాయములతో సుఖప్రదము యమాంతకారియు నగు శ్రీహరి పాదాంబుజయుగళము ధ్యానింప నగును.

శ్లో॥ కే దస్యవ స్సన్తి కువాసనాఖ్యాః
క శోభతే యస్సదసి ప్రవిద్యః।
మాతేవ కా యా సుఖదా సువిద్యా
కి మేధతే దానవశాత్ సువిద్యా॥

శ్లో॥ కుతో హి భీతిశ్చ సదా విధేయా
లోకాపవాదాద్ భవకాననాచ్చ।
కో వాఽతిబంధుః పితరశ్చ కే వా
విపత్సహాయాః పరిపాలకా యే॥

శ్లో॥ బుద్ధ్వా న బోధ్యం పరిశిష్యతే కిం
శివప్రసాదాత్ సుఖబోధరూపమ్।
జ్ఞాతే చ కస్మిన్ విదితం జగత్ స్యాత్
సర్వాత్మకే బ్రహ్మణి పూర్ణరూపే॥

తా॥ చోరు లెవరు? దుష్టసంస్కారములు. సభలో ఎవరు శోభింతురు? మంచి విద్వాంసుడు. తల్లి వలె సుఖము నొసగునది ఏది? సువిద్య. దాన మొసంగుటచే వృద్ధి నొందున దేది? సువిద్య.

సదా దేని వలన భయము చెందనగును? లోకాపవాదము సంసార మను అరణ్యము వలన భీతి చెందనగును. అత్యంతము ఆత్మబంధువు ఎవరు? ఆపదలందు సాయపడువాడు. పితృసమాను లెవరు? పాలన-పోషణాదులను చేయువారు.

దేనిని తెలిసికొనినచో తెలిసికొనదగినది మరి యేది ఉండదు? పరమేశ్వరానుగ్రహము చేత సుఖస్వరూపమైన బ్రహ్మవస్తువును తెలిసికొనినచో మరి తెలిసికొనదగిన దేదియు మిగిలి యుండదు. దేనిని తెలిసికొనిన, సకలజగత్తు విదితమగును? పూర్ణము, సర్వాత్మకము నగు సచ్చిదానంద బ్రహ్మవస్తువును ఎరిగిన, జగమంతయు విదితమగును?

శ్లో॥ కిం దుర్లభం సద్గురు రస్తి లోకే
సత్సంగతిః బ్రహ్మవిచారణా చ
త్యాగో హి సర్వస్య శివాత్మబోధః
కో దుర్జయ స్సర్వజనై ర్మనోజః॥

శ్లో॥ పశోః పశుః కో న కరోతి ధర్మం
ప్రాచీనశాస్త్రేఽపి న చాత్మబోధః।
కిం త ద్విషం భాతి సుధోపమం స్త్రీ
కే శత్రవో మిత్రవ దాత్మజాద్యాః॥

శ్లో॥ విద్యుచ్చలం కిం ధన యౌవన-ఆయు
ర్దానం పరం కిం చ సుపాత్రదత్తమ్।
కంఠగతై రప్యసుభి ర్న కార్యం
కిం కిం విధేయం మలినం శివార్చా॥

శ్లో॥ అహర్నిశం కిం పరిచిన్తనీయం
సంసారమిథ్యాత్మ శివాత్మ తత్త్వమ్।
కిం కర్మ యత్ప్రీతికరం మురారేః
క్వాస్థా న కార్యా సతతం భవాబ్ధౌ॥

తా॥ ఈ లోకమున దుర్లభ మగునవి ఏవి? సద్గురువు, సత్సాంగత్యము, బ్రహ్మవిచారము దుర్లభములు. సర్వత్యాగ మనగా ఏమి? నేను పరశివుడను అను ఆత్మజ్ఞానము. సకల ప్రాణులకు జయింపశక్యము గానివాడు ఎవరు? మన్మథుడు.

పశువులలో పశువు ఎవరు? ధర్మాచరణము లేనివాడు ప్రాచీన శాస్త్రపఠనము వలన ఆత్మజ్ఞానము కలగనివాడును పశువు. విషమయ్యు అమృతసమానముగ అనిపించునది ఏది, స్త్రీ. లోకమున శత్రువులెవరు? మిత్రుల మాడ్కి తోచు భార్యాపుత్రాదులు.

మెరుపుతీగ వలె చంచలములేవి? ధన-యౌవన-ఆయుర్దాయములు. ఉత్తమ దాన మేది? సత్పాత్రదానము. ప్రాణములు కంఠగతములైనను చేయదగనిది యేది? దుష్టకార్యము. ప్రాణములు పోవు సమయమున చేయదగిన కార్య మేమి? పరశివారాధనము.

రాత్రింబవళ్లును, చింతనము చేయదగినది యేది? ప్రపంచమిథ్యాత్వము, జీవ-శివతత్త్వమును చింతింపదగినవి. కర్మ యనగా ఏమి? విష్ణుప్రీతికరమైన కార్యమే కర్మ యనిపించుకొనును. నిరంతరము దేనియందు శ్రద్ధ ఉంచదగదు? సంసారసముద్రమందు ఆస్థ ఉంచజనదు.

ఈ రీతిగా ప్రశ్నోత్తరమణిరత్నమాలను చెప్పిన తర్వాత శంకరుడు తన యనుభూతిని గురువునకు ఈ విధముగా తెలియజేసెను. ఇది 'కేవలోఽహమ్' అను పేరున లోకమున ప్రసిద్ధము.

శ్లో॥ విశోకఆనందమయో విపశ్చిత్
స్వయం కుతశ్చిత్ న బిభేతి కశ్చిత్।
నాన్యోఽస్తి పన్థా భవబంధముక్త్యై
వినా స్వతత్త్వావగమం సుసూక్ష్మకమ్॥

శ్లో॥ నిత్యం విభుం సర్వగతం సుసూక్ష్మం
అంతర్బహిశ్శూన్య మనన్య మాత్మనః।
విజ్ఞాయ సమ్యక్ నిజతత్త్వ మేతత్
పుమాన్ విపాప్మా విరజో విమృత్యుః॥

శ్లో॥ బ్రహ్మాభిత్వవిజ్ఞానం భవమోక్షస్య కారణమ్
యేనాద్వితీయ మానందం బ్రహ్మ సంపద్యతే బుధైః॥

శ్లో॥ బ్రహ్మభూతస్తు సంసృత్యై విద్వాన్ నావర్తతే పునః।
విజ్ఞాతవ్య మతః సమ్యగ్ బ్రహ్మాభిన్నత్వ మాత్మనః॥

శ్లో॥ యదిదం సకలం విశ్వం నానారూపం ప్రతీత
మజ్ఞానాత్।
తత్సర్వం బ్రహ్మైకం ప్రత్యక్షాశేషభావనాదోషమ్॥

శ్లో॥ మృత్కార్యభూతోఽపి మృదో న భిన్నః
కుంభోఽస్తి సర్వత్ర తు మృత్స్వరూపాత్।
న కుంభరూపం పృథగస్తి కుంభః
కుతో మృషా కల్పితనామమాత్రః॥

శ్లో॥ కేనాపి మృద్భిన్నతయా స్వరూపం
ఘటస్య సందర్శయితుం న శక్యతే।
అతో ఘటః కల్పిత ఏవ మోహాత్
మృదేవ సత్యం పరమార్థభూతమ్॥

శ్లో॥ సద్ బ్రహ్మ కార్యం సకలం సదేవ
తన్మాత్ర మేతత్ న తతోఽన్య దస్తి।
అస్తీతి యో వక్తి న తస్యమోహో
వినిర్గతో నిద్రితవత్ ప్రజల్పః॥

తా॥ శోకరహితుడును, ఆనందమయుడును అయిన విద్వాంసుడు తాను ఎన్నడును, ఎటనుండియు భయముచెందడు. అతి సూక్ష్మమైన ఆత్మతత్త్వావగతి దక్క; భవపాశబంధమునుండి విముక్తి నొసగజాలు మరియొక ఉపాయములేదు.

ఆత్మస్వరూపము నిత్యము, సర్వవ్యాపకము, సుసూక్ష్మము, అంతర్బహిశ్శూన్యము అయినది. అట్టి ఆత్మతత్త్వమును చక్కగా నెరిగిన విద్వాంసుడు రజోగుణమును వీడి మృత్యురహితు డగును.

బ్రహ్మాత్మైక్యవిజ్ఞానమే భవబంధమోక్షమునకు కారణము. ఈజ్ఞానము వలననే విద్వాంసులు అద్వితీయ ఆనంద స్వరూప మైన బ్రహ్మతత్త్వమును పొందుచున్నారు.

బ్రహ్మవేత్త అయినవాడు తిరిగి జనన-మరణరూప సంసారమును పొందడు కావున, జీవబ్రహ్మాభిన్నజ్ఞానమును చక్కగా తెలిసికొనదగును.

ఈ విశ్వము అజ్ఞానము వలన నానారూపములతో భాసించుచున్నది. అట్టి విశ్వమంతయు అద్వయ బ్రహ్మగాక మరియొకటి గానేరదు. భేదభావనాదోషముచే బ్రహ్మయే ఇట్లు ప్రత్యక్షమగుచున్నది.

మృత్కార్యములగు ఘటశరావాదులు మృత్తికంటె భిన్నములు గావు. మృద్భిన్నమైన ఘటము ఎన్నడును గానజాలము. కావున, ఘట మను నామము వాగారంభణము మాత్రమే; మృత్తునందు కల్పితమే యని ఎరుగనగును.

మృద్భిన్నమైన ఘటమును ఎవరును చూపజాలరు. కావున, అజ్ఞానముచే మృత్తిక యందు ఘటము కల్పితమగుచున్నది. ఘటము మిథ్య యనియు, మృత్తికయే పరమార్థభూతమైన సత్య మనియు తెలియనగును.

బ్రహ్మ సత్స్వరూపము. కార్యజాతమగు ఈ విశ్వ మంతయు సత్స్వరూపమే. సత్స్వరూపముకంటె భిన్నమైన కార్య మేదియును లేదు. బ్రహ్మకంటె భిన్నమగు వస్తువు కలదు అని చెప్పువాని మాట నిద్రించువాని ప్రలాపము వంటిదే యగును. అతడు మోహారూఢుడు కాలేదని తెలియ నగునని భావము.

తర్వాత తాను గ్రహించిన సంన్యాసాశ్రమమును శ్రీ శంకరులు ఈ రీతిగా ప్రస్తుతించిరి. దీనికే కౌపీనపంచక మ్మనియు, యతిపంచక మనియు పేర్లు కానవచ్చుచున్నవి.

శ్లో॥ వేదాంతవాక్యేషు సదా రమన్తో
భిక్షాన్నమాత్రేణ చ తుష్టిమన్తః।
అశోక మంతఃకరణే చరన్తః
కౌపీనవంతః ఖలు భాగ్యవన్తః॥

శ్లో॥ మూలం తరోః కేవల మాశ్రయంతః।
పాణిద్వయం భోక్తు మమంత్రయంతః।
కంథా మివ శ్రీమపి కుత్సయంతః
కౌపీనవంతః ఖలు భాగ్యవంతః

శ్లో॥ స్వానందభావే పరితుష్టిమంతః
సుశాంత సర్వేంద్రియ వృత్తిమంతః।
అహర్నిశంబ్రహ్మసుఖే రమంతః
కౌపీనవంతః ఖలు భాగ్యవంతః॥

శ్లో॥ దేహాదిభావం పరివర్తయన్తః
స్వాత్మాన మాత్మ న్యవలోకయంతః।
నాన్తం న మధ్యం న బహిః స్మరంతః
కౌపీనవంతః ఖలు భాగ్యవంతః॥

శ్లో॥ బ్రహ్మాక్షరం పావన ముచ్చరంతో
బ్రహ్మాహమస్మీతి విభావయంతః।
భిక్షాశినో దిక్షు పరిభ్రమంతః
కౌపీనవంతః ఖలు భాగ్యవంతః॥

తా॥ వేదాంతమహావాక్యతత్త్వమును, నిరంతరము భావన చేయువారును, భిక్షాటనమున లభ్యమైన అన్నముమాత్రమును భుజించి సంతృప్తినొందువారును, దుఃఖమును వీడి ఆనంద మయమగు అంతఃకరణమున సంచరణశీలురు నగు కౌపీనమును ధరించిన విరాగులు ధన్యజీవనులు

వృక్షమును ఆశ్రయముగాచేసికొనినట్టియు, కరతల భిక్షగైకొనునట్టియు, సంపదను పాత బొంతను వలె ఏవగించు కొనునట్టివారును అగు కౌపీనమును ధరించునట్టివిరాగులు ధన్యజీవనులు.

ఆత్మానందమునందు పరితృప్తులును సర్వేంద్రియ వ్యాపారపిరముచే జితేంద్రియులును, అహర్నిశము బ్రహ్మా నందసాగరమున క్రీడలు సలుపువారును, కౌపీనమును ధరించు నట్టి విరాగులు ధన్యజీవనులు.

దేహాత్మభానము లేనివారును, జీవబ్రహ్మైక్యాను భూతిగలవారును, వెలుపల, లోపల, మధ్యమును గల పరిచ్ఛిన్న వస్తువులను స్మరింపనివారును, కౌపీనమును ధరించు నట్టివిరాగులు ధన్యజీవనులు.

బ్రహ్మప్రతిపాదకమగు ఓంకారమును నిరంతరము ఉచ్చరించువారును, 'బ్రహ్మోహమస్మి' యని సదా భావన చేయువారును, భిక్షాశనులై నలుదిక్కుల సంచరించువారును, కౌపీనమును ధరించునట్టి విరాగులు ధన్యజీవనులు.

దీనిని విని గోవిందభగవత్పాదుడు శ్రీ శంకరునికి ప్రణవ సహితముగా దీక్ష నిచ్చెనందురు. గోవిందుని వద్ద రెండుసంవత్సరములు శంకరుడు నివసించెను. ఆ సమయమున ఒకసారి వర్షము ఏకధారగా ఐదుదినములు కురియసాగెను. గోవిందుని పర్ణశాలలోనికే నీరు ప్రవహింపసాగెను. అప్పుడు శంకరుడు కమండలువుతో ఆ నీటి నంతయు అరికట్టగలిగి నాడట. ఒకమట్టిపాత్రలో నదీజలము నంతయు నింపగలవాడే 'తన బ్రహ్మసూత్రములపై వ్యాఖ్య చేయుటకు సమర్థుడు అని పూర్వము వ్యాసుఁడని నాడట. గురువుయొక్క యాజ్ఞ ప్రకారము కాశిలోనున్న వ్యాసుని దర్శించ శ్రీ శంకరుడు బయలుదేరెను. అయినను శంకరుడు గురుస్మరణను వదలలేదు. గురుకృపాకటాక్షము వలననే తనకు అద్వైతావగతి కలదను విశ్వాసము గలవాడగుటచేత చక్కని శ్లోకములతో గురు స్తుతి చేసెను. దీనినే 'గుర్వష్టక' మందురు. శ్రీ శంకరుడు గురుస్మరణ నీ విధముగా గావించెను.

శ్లో॥ శరీరం సురూపం తథా దా కలత్రం
యశ శ్చారు చిత్రం ధనం మేరుతుల్యమ్।
మన శ్చే న్న లగ్నం గురో రంఘ్రిపద్మే
తతః కిం తతః కిం తతః కిం తతః కిమ్॥

శ్లో॥ కలత్రం ధనం పుత్రపౌత్రాది సర్వం
గృహం బాంధవాః సర్వ మేతద్ధి జాతమ్
మనశ్చే న్న లగ్నం గురో రంఘ్రిపద్మే
తతః కిం తతః కిం తతః కిం తతః కిమ్॥

శ్లో॥ షడంగాదివేదో ముఖే శాస్త్రవిద్యా
కవిత్వాది గద్యం సుపద్యం కరోతి।
మనశ్చే న్న లగ్నం గురో రంఘ్రిపద్మే
తతః కిం తతః కిం తతః కిం తతః కిమ్॥

శ్లో॥ విదేశేషు మాన్యః స్వదేశేషు ధన్యః
సదాచారవృత్తేషు మత్తో న చాన్యః।
మనశ్చే న్న లగ్నం గురో రంఘ్రిపద్మే
తతః కిం తతః కిం తతః కిం తతః కిమ్॥

శ్లో॥ క్షమామండలే భూపభూపాలబృందైః
సదా సేవితం యస్య పాదారవిందం।
మనశ్చే న్న లగ్నం గురో రంఘ్రిపద్మే
తతః కిం తతః కిం తతః కిం తతః కిమ్॥

శ్లో॥ యశో మే గతం దిక్షు దానప్రతాపాత్
జగద్వస్తు సర్వం కరే యత్ప్రసాదాత్।

మనశ్చే న్న లగ్నం గురో రంఘ్రిపద్మే
తతః కిం తతః కిం తతః కిం తతః కిమ్॥

శ్లో॥ న భోగో న యోగో న వాజిరాజా
న కాంతాసుఖే నైవ విత్తేషు చిత్తమ్।
మనశ్చే న్న లగ్నం గురో రంఘ్రిపద్మే॥
తతః కిం తతః కిం తతః కిం తతః కిమ్॥

శ్లో॥ అరణ్యే న వా స్వస్య గేహే న కార్యే
న దేహే మనో వర్తతే మే త్వనర్ఘ్యే
మనశ్చే న్న లగ్నం గురో రంఘ్రిపద్మే
తతః కిం తతః కిం తతః కిం తతః కిమ్॥

శ్లో॥ అనర్ఘ్యాణి రత్నాని భుక్తాని సమ్యక్
సమాలింగితా కామినీ యామినీషు।
మనశ్చే న్న లగ్నం గురో రంఘ్రిపద్మే
తతః కిం తతః కిం తతః కిం తతః కిమ్॥ *

శ్లో॥ గురో రష్టకం యః పఠేత్ పుణ్యదేహీ
యతి ర్భూపతి ర్బ్రహ్మచారీ చ గేహీ।
లభేత్ వాంఛితార్థం పరం బ్రహ్మసంజ్ఞః
గురో రుక్తవాక్యే మనో యస్య లగ్నమ్॥

తా॥ అందమైన శరీరము లావణ్యవతి యగు భార్య, మనసుకు ఆహ్లాదము నిచ్చు కీర్తి ఎంత వ్యయము చేసినను తరిగిపోని మేరు-సదృశ ధనము ఇవన్నియు నుండినను,

---

* ఇది అధికపాఠము.

గురుపాదపంకజములందు మనసు లగ్నము కాకుండిన, ఫల మేమి? 'తతః కిం' అనుచు నాలుగు పర్యాయములు చెప్పుటచే గురుచరణసరోజములందలి భక్తి దక్క మిగిలిన వన్నియును వ్యర్థమే యని గ్రహింపనగును.

భార్యాపుత్రాదులు, బంధుమిత్రాదులు, గృహ విత్తాదులు ఇవన్నియు లభించినను, గురుపాదపంకజములందు మనసు లగ్నము కాకుండిన, ఫలమేమి?

షడంగసహితములగు చతుర్వేదములు, శాస్త్రవిద్యలు కంఠస్థములైనను, గద్య-పద్యరచన చేయగల సమర్థుడైనను, గురుపాదపంకజములందు మనసు లగ్నము కాకుండిన ఫలమేమి?

దేశవిదేశములందు ధన్యత మాన్యత పొందగలిగినను, అందరికంటె సదాచారసంపన్నుడైనను, గురుపాదపంకజ ములందు, మనసు లగ్నముకాకుండిన, ఫలమేమి?

భూమండల మందలి రాజన్యులచేతను, సార్వభౌముల చేతను కొలువబడుచున్నను గురుపాదపంకజములందు మనసు లగ్నము కాకుండిన ఫలమేమి?

నలుదిక్కుల, దానవీరుడని ప్రసిద్ధిచెందినను, ఈ విశ్వ మందలి వస్తుజాత మంతయు లభించినను గురుపాద పంకజము లందు మనసు లగ్నముకాకుండిన ఫలమేమి?

భోగయోగములు రెండునులేవు. రథ, గజ, తురగాదులును లేవు, కాంతాసుఖమునందుగాని ధనమునందుగాని, కోరికలేదు. అయినను గురుపాదపంకజములందు మనసు లగ్నముకాకున్న, ఫలమేమి?

గృహస్థ, వానప్రస్థ ఆశ్రమములందు ఆసక్తి లేదు. శరీరవిషయమున మనసు వర్తించుటలేదు. అనర్ఘమైనదానిని పొందునభిలాషయు లేదు. అయినను గురుపాదపంకజములందు మనసు లగ్నముకాకుండిన ఫలమేమి?

అనర్ఘములగు రత్నములు లభించినను, రాత్రులందు కామినీసమాలింగనసుఖము పొందినను, గురుపాదపంకజములందు మనసు లగ్నము కాకుండిన, ఫలమేమి?

యతీశ్వరుడు, రాజు, బ్రహ్మచారి, గృహస్థు-వీరిలో ఎవరైననుసరియే గుర్వష్టకమును శ్రద్ధతో పఠించినవాడు పుణ్యపురుషుడే యగును. గురువు యొక్క వచనమందు ఎవని మనసు నిశ్చలముగ నుండునో, అతడు పరమవాంఛితార్థమైన అద్వయబ్రహ్మపగతిని పొందును.

ఈ గురువు గోవిందభగవత్పాదుడగుటచే, గురువును భగవానుడగు గోవిందునితో అభిన్నుడని భావించి భజగోవింద స్తోత్రమును గావించెను.

శ్లో॥ దినమపి సాయం ప్రాతః శిశిరవసంతౌ పునరాయాతః।
కాలః క్రీడతి గచ్ఛత్యాయుః తదపి న ముంచ
త్యాశావాయుః॥

శ్లో॥ భజ గోవిందం భజగోవిందం భజగోవిందం మూఢమతే।
ప్రాప్తే సన్నిహితే మరణే నహి నహి రక్షతి డుకృఞ్ కరణే॥

శ్లో॥ అగ్రే వహ్నిః పృష్ఠే భానూ రాత్రౌ చిబుకసమర్పితజానుః।
కరతలభిక్షా తరుతలవాస స్తదపి న ముంచ త్యాశాపాశః॥

తా॥ అహర్నిశలు, ప్రాతస్సాయంసమయములు, శిశిరవసంతములు, మరల మరలవచ్చుచు పోవుచుండును. కాలమో ఆటలాడుకొనుచున్నది. ఆయుర్దాయమో క్షీణించుచున్నది. కాని, ఆశ యను వాయువు పీడకున్నది. కావున, ఓ మూఢబుద్ధీ గోవిందుని భజింపుము. మృత్యు వాసన్నమైనప్పుడు, 'డుకృఞ్ కరణే' యను సూత్రము నిన్ను మృత్యువు నుండి కాపాడజాలదు, భగవంతుని సేవింపవలయును గాని, అన్య శాస్త్రాధ్యయనము చేసిన, జన్మమరణరూప భవసాగరము నుండి నిన్నుద్ధరించువారు ఎవరును ఉండ రని భావము.

ఓ మూఢుడా ఎదుట వహ్నిని, వెనుక సూర్యుని ఉంచుకొనినావు. రాత్రులందు మోకాలుమీద బుగ్గల నుంచి కాలము గడుపుచున్నావు. కరతలభిక్ష, తరుతలవాసము చేయుచున్నావు. అయినను, ఆశాపాశము నిన్ను పీడకున్నది.

శ్లో॥ యావ ద్విత్తోపార్జనశ క్త స్తావన్నిజపరివారో ర క్తః।
పశ్చా ద్ధావతి జర్జరదేహే వార్తాం పృచ్ఛతి కోఽపి న గేహే॥

శ్లో॥ జటిలో ముండీ లుంఛితకేశః కాషాయాంబరబహుకృతవేషః॥
పశ్యన్నపి న పశ్యతి మూఢః ఉదరనిమిత్తం
బహుకృతవేషః॥

శ్లో॥ భగవద్గీతా కించి దధీతా గంగాజలలవకణికా పీతా।
సకృదపి యస్య మురారిసమర్చా తస్య యమః కిం కురుతే
చర్చామ్॥

శ్లో॥ అంగం గలితం పలితం ముండం దశనవిహీన జాతం
తుండమ్
వృద్ధో యాతి గృహీత్వా దండం తదపి న ముంచ
త్యాశాపిండమ్।

శ్లో బాలస్తావత్ క్రీడాసక్తః తరుణస్తావత్ తరుణీసక్తః
వృద్ధస్తావత్ చింతామగ్నః పరేబ్రహ్మణి కోఽపి న లగ్నః॥

తా॥ ధనోపార్జనము చేయుటకు శక్తి యున్నంతవరకు కుటుంబములోనివారు ప్రేమను ప్రదర్శింతురు. తర్వాత శరీరము జరాగ్రస్తమై బలహీనమైనపుడు ఎవ్వరును నీ విషయమును అడుగరు. నీ క్షేమసమాచారములను విచారించువారు ఎవరును ఉండరని భావము.

జటిలైనను, శిరోముండనము గావించుకొన్నను, కేశములనూడ పెరుకొనినను కాషాయాంబరధారి యైనను ప్రయోజన మేమి? ఈ వేషములన్నియు ఉదరపోషణ నిమిత్తమై వేయబడిన వని గమనించియు గమనించనివానివలె ప్రవర్తించునట్టి మూఢుడవు నీవు.

భగవద్గీత యందలి కొంతభాగ మైనను పారాయణ మొనర్చిన వానిని పావన గంగానదీ జలకణ మైనను పాన మొనర్చిన వానిని, ఒక్కమారైనను మురారిచరణకమలముల నర్చించిన వానిని యముడేమిచేయగలడు?

శరీరావయవములు పట్టు తప్పినవి; తల నెరసినది; దంతము లూడి బోసి నోరైనది. ఈ స్థితిలో వృద్ధుడు దండమునూతగా గొని వృద్ధుడు తన జీవితమును వెళ్లబుచ్చుచుండును. కాని ఆశమాత్రము వానిని వీడుట లేదు.

బాలుడు ఆటపాటలందు మునిగి తేలుచుండును; యువకుడు కాంతాలోలుడై కాలము గడుపుచుండును; వృద్ధుడు చింతావ్యాకులచిత్తుడై పరితపించుచుండును. అయిన, పరబ్రహ్మమునందు మనసు లగ్నము చేయువా డెవడుండును? ఎవడు నుండడని భావము.

శ్లో॥ పునరపి జననం పునరపి మరణం పునరపి జననీజఠరే
శయనమ్।
ఇహ సంసారే ఖలు దుస్తారే కృపయాఽపారే పాహి
మురారే॥

శ్లో॥ పునరపి రజనీ పునరపి దివసః పునరపి పక్షః పునరపి
మాసః
పునరప్యయనం పునరపి వర్షం తదపి న ముంచ
త్యాశామర్షమ్॥

శ్లో॥ వయసి గతే కః కామవికారః శుష్కే నీరే కః కాసారః।
నష్టే ద్రవ్యే కః పరివారో జ్ఞాతే తత్త్వే క స్సంసారః॥

శ్లో॥ నారీ స్తనభరనాభినివేశం మిథ్యామాయామోహావేశమ్।
ఏత న్మాంసవసాదివికారం మనసి విచారయ వారం వారమ్॥

శ్లో॥ క స్త్వం కో౽హం కుత ఆయాతః కా మే జననీ కో మే
తాతః।

ఇతి పరిభావయ సర్వ మసారం విశ్వం త్యక్త్వా
స్వప్నవిచారమ్॥

తా॥ మాటిమాటికి జన్మమరణములతోను, మాతృగర్భమున ప్రవేశించుటతోను, కృంగిపోవుచున్నాను. జనన మరణ ప్రవాహరూపమైన ఈ భవసాగరము అపారము. కావున ఇది దుస్తారమైనది. హే మురారే దయతో నన్నీభవసాగరమును దాటింపుము.

రాత్రింబవళ్లు, పక్షములు, మాసములు అయనములు, సంవత్సరములు మరల మరల వచ్చుచు పోవుచున్నవి. అయినను ఆశమాత్రం నన్నువిడువకున్నది.

వయసు గడచిన, కామవికార మెక్కడ? జలశూన్యమైన, కాసార మెక్కడ? ధనము క్షయము పొందిన పరివారమెక్కడ యుండును? తత్త్వము తెలసినంతనే సంసార మెక్కడ మిగులును?

యువతీ స్తనభారముపైనను నిమగ్నమగు నాభిప్రదేశము పైనను చిత్తమునకలుగు అనురాగము మిథ్యామాయా

కల్పితమైన వ్యామోహమే; ఆ స్తనములు ఆనాభియు మాంసవసాదివికారమే యని అనవరతము మనస్సున విచారము చేయుము.

నీ వెవ్వరవు నే నెవ్వడను? ఎటనుండివచ్చితివి, నాకు తల్లియెవరు తండ్రియెవరు; ఈ రీతిగా పర్యాలోచనచేసి; స్వప్నదృశ్యమైన ఈ విశ్వమును పరిత్యజించి అంతయు నిస్సారమని భావన చేయుము.

శ్లో॥ గేయం గీతానామసహస్రం ధ్యేయం శ్రీపతిరూప
మజస్రమ్।
నేయం సజ్జనసంగే చిత్తం దేయం దీనజనాయ చ విత్తమ్॥

శ్లో॥ యావజ్జీవో నివసతి దేహే కుశలం తావత్ పృచ్ఛతి గేహే।
గతవతి వాయౌ దేహాపాయే భార్యా బిభ్యతి తస్మిన్ కాయే॥

శ్లో॥ సుఖతః క్రియతే రామాభోగః పశ్చాత్ హంత శరీరే రోగః।
యద్యపి లోకే మరణం శరణం తదపి న ముంచతి
పాపాచరణమ్॥

శ్లో॥ రథ్యాచర్పటవిరచితకంథః పుణ్యాపుణ్య వివర్జితపంథః।
నాహం న త్వం నాయం లోక స్తదపి కిమర్థం క్రియతే
శోకః॥

శ్లో॥ కురుతే గంగాసాగరగమనం వ్రత పరిపాలన మథవా
దానమ్।
జ్ఞానవిహీనే సర్వ మనేన ముక్తిః న భవతి జన్మశతేన॥

తా॥ భగవద్గీత, విష్ణుసహస్రనామము నీకు పఠనీయములు. శ్రీమన్నారాయణుని చరణయుగళమే నీవు ధ్యానింప

తగినది; సజ్జనసంగతి యందే నీకుమనస్సును లగ్నము చేయదగును; దీనజనులకు విత్తము ఈయదగును.

ఈ శరీరములో జీవుడు ఉండునంతవరకు గృహమున అందరు క్షేమము నరయుదురు. ప్రాణవాయువు దేహము నుండి నిష్క్రమించినప్పుడు ఆ శరీరమును జూచి భార్యకూడ భయము నొందును.

లోకమున ఆనందముగా కాంతాభోగము ననుభవించును. అయ్యో పాపం తర్వాత రోగగ్రస్తు డగుచున్నాడు. లోకమందు మరణమే శరణమైనను, పాపకార్యాచరణమును వదలుట లేదు.

చతుష్పథము (నాలుగుబజార్లుకలియుకూడలి) నందు పడియున్న గుడ్డపీలికలతో బొంత చేసి ధరింపుము. ధర్మాధర్మములులేని అనగా, నిర్ధర్మకమైన సత్యపథము నాశ్రయింపుము. నీవు, నేను, ఈ లోకము అనునవియే లేనప్పుడు శోక మెందులకు?

పవిత్రగంగాసాగరసంగమములో మునక లిడినను, వ్రతాదుల నాచరించినను, లేక దాన మొనర్చినను-తత్త్వజ్ఞానము లేనిచో ఇది యంతయు, నిష్ఫలము. నూరుజన్మ లెత్తినను, వానికి ముక్తి లభింపదు.

ఈ గోవిందస్తుతిని 'మోహముద్గర' మను పేరుతో కూడ చెప్పబడినది. దీనిని 'చర్పటపంజరికాస్తోత్రమ్' అనియు నందురు.

శ్లో॥ మూఢ జహీహి ధనాగమతృష్ణాం
కురు తనుబుద్ధే మనసి వితృష్ణామ్।
యల్లభసే నిజకర్మోపాత్తం
విత్తం తేన వినోదయ చిత్తమ్॥

శ్లో॥ కా తవ కాన్తా కస్తే పుత్రః
సంసారోఽయ మతీవ విచిత్రః।
కస్య త్వం వా కుత ఆయాత
స్తత్త్వం చిన్తయ తదిదం భ్రాతః॥

శ్లో॥ మా కురు ధనజనయౌవనగర్వం
హరతి నిమేషాత్ కాలః సర్వమ్।
మాయామయ మిద మఖిలం హిత్వా
బ్రహ్మపదం ప్రవిశ ఆశు విదిత్వా॥

శ్లో॥ నళినీదళగతజల మతితరలం
తద్వజ్జీవన మతిశయచపలమ్।
క్షణ మపి సజ్జనసంగతి రేకా
భవతి భవార్ణవతరణే నౌకా॥

తా॥ మూఢుడా! ధనాగమతృష్ణను వీడుము. మందబుద్ధీ! మనసున వైరాగ్యమును పదిలపరచుకొనుము. స్వప్రయత్నముచేత సంపాదించుకొను విత్తముతో చిత్తమును సంతోషపెట్టుము.

నీకు భార్య యెవరు? పుత్రు డెవరు? ఈ ప్రపంచము అతివిచిత్రమైనది. నీవు ఎవరికి సంబంధించినవాడవు?

ఎటనుండి ఇటకు వచ్చితివి? సోదరా! ఈ తత్త్వమును బాగుగా విచారింపుము.

ధనము, బంధుజనము, యౌవనము-వీనిని గురించి గర్వింపకుము. సర్వమును, మృత్యువు నిమిషములో హరించి వేయును. మాయాకార్యమగు ఈ సంసారమును త్యజించి తత్త్వము నెరిగి వెంటనే బ్రహ్మపదము నొందుము.

తామరాకుమీది జలకణము అతి తరలస్వభావము గలది. ఆ రీతిగానే, జీవితము అతిచంచలమైనది. సాధుసజ్జన సాంగత్యము ఒక్క క్షణకాలమైనను జేయుము. అది, భవ సాగరమును దాటుటలో నౌక వలె పనిచేయును.

శ్లో॥ యావజ్జననం తావన్మరణం
తావజ్జననీజఠరే శయనమ్।
ఇతి సంసారే స్ఫుటతరదోషః
కథ మిహ మానవ తవ సంతోషః॥

శ్లో॥ దినయామిన్యౌ సాయంప్రాతః
శిశిరవసంతౌ పునరాయాతః।
కాలః క్రీడతి గచ్ఛత్యాయు
స్తదపి న ముంచ త్యాశావాయుః॥

శ్లో॥ అంగం గలితం పలితం ముణ్డం
దంతవిహీనం జాతం తుండమ్।
కరధృత కంపిత శోభితదండం
తదపి న ముంచ త్యాశాభాండమ్॥

శ్లో॥ సురమందిర తరుతలవాసః
శయ్యా భూతల మజినం వాసః।
సర్వభోగ పరిగ్రహత్యాగః
కస్య సుఖం న కరోతి విరాగః॥

తా॥జన్మమున్నంతవరకు మరణము తప్పకయుండును. తర్వాత మరల మాతృగర్భవాసము ఉండును. ఇట్టి దోషము ప్రపంచకమున స్పష్టముగా కాన్పించుచుండగా, ఓమానవుడా! ఇట నీకెట్లు సంతోషముకల్గును,

అహర్నిశములు; ప్రాతస్సాయంవేళలు, శిశిరవసంత ఋతువులు మరల మరల వచ్చుచున్నవి; పోవుచున్నవి. కాలము ఆటలాడుచున్నది, ఆయువు క్షీణించుచున్నది; అయినను, ఆశమాత్రం వదలుటలేదు.

శరీరావయవము లన్నియు గలితములైనవి; కేశములు తెల్లబడుచున్నవి: దంతములూడి బోసి నోరైనది. శరీర కంపమువలన, చేతిలో నాధారముగ పుచ్చుకొనిన కర్రయు కంపించుచున్నది. అయినను, మానవుడు ఆశాభాండమును పరిత్యజింపలేకయున్నాడు.

దేవాలయ ప్రాంతమున ఉన్న వృక్షమూలమే నీ నివాసస్థానము. కటిక నేలపై నీ శయనము; కృష్ణాజినము నీ కట్టుపుట్టము; సర్వపరిగ్రహత్యాగము, భోగత్యాగము నీవ్రతము ఇట్టివైరాగ్యసంపద ఎవ్వరికి సుఖము నివ్వకుండును?

శ్లో॥ శత్రౌ మిత్రే పుత్రే బంధౌ
మా కురుయత్నం విగ్రహసంధౌ।
భవ సమచిత్తః సర్వత్ర త్వం
వాంఛ స్యచిరా ద్యది విష్ణుత్వమ్॥

శ్లో॥ అష్టకులాచలసప్తసముద్రాః
బ్రహ్మపురందరదినకరరుద్రాః
న త్వం నాహం నాయం లోక
స్తదపి కిమర్థం క్రియతే శోకః ?

శ్లో॥ త్వయి మయి చాన్యత్ర ఏకో విష్ణుః
వ్యర్థం కుప్యసి మయి అసహిష్ణుః।
సర్వస్మి న్నపి పశ్య ఆత్మానం
సర్వత్రోత్సృజ భేదజ్ఞానమ్॥

శ్లో॥ బాలస్తావత్ క్రీడాసక్తః
తరుణస్తావత్ తరుణీసక్తః।
వృద్ధస్తావత్ చిన్తామగ్నః
పరమే బ్రహ్మణి కోఽపి న లగ్నః॥

తా॥ శీఘ్రముగా నీవు విష్ణుపదమును పొందగోరినచో, శత్రుమిత్రుల యెడను, బంధుపుత్రాదులయెడను, సంధి విగ్రహముల యెడను ఉదాసీనుడవై యుండుము. సర్వభూతములయెడ సమచిత్తుడవు కమ్ము.

అష్టకులాచలములును, సప్తసాగరములును, బ్రహ్మేంద్ర సూర్యరుద్రులును, నీవును, నేనును, ఈ లోకములును సత్య

పరమావధులు గావు; నశ్వరములు; ఇక, యేల శోకింప వలయును?

నీయందు, నాయందు, అన్యవస్తుజాతము నందును విష్ణువు ఒక్కడే వ్యాపించియున్నాడు. అసహనశీలివై నాయందేల కోపము పూనెదవు? సర్వము విష్ణుమయము గాన, సర్వత్ర ఆత్మవస్తువునే దర్శింపుము, అన్నియెడల భేద దృష్టిని పరిత్యజింపుము.

బాలుడు క్రీడాసక్తుడై, తరుణవయస్కుడు కాంతాను రక్తుడై, వృద్ధుడు చింతానిమగ్నుడై కాలము గడుపును. ఎవరును, ఏస్థితియందును పరబ్రహ్మయుక్తచిత్తుడు కానరాడు.

శ్లో॥ అర్థ మనర్థం భావయ నిత్యం
నాస్తి తతః సుఖలేశః సత్యమ్।
పుత్రాదపి ధనభాజాం భీతిః
సరత్రైషా కథితా నీతిః॥

శ్లో॥ యావ ద్విత్తోపార్జనశక్త
స్తావన్నిజ పరివారో రక్తః।
తదను చ జరయా జర్జరదేహే
వార్తాం కోఽపి న పృచ్ఛతి గేహే॥

శ్లో॥ కామం క్రోధం లోభం మోహం
త్యక్త్వాఽత్మానం పశ్యతు కోఽహమ్।
ఆత్మజ్ఞాన విహీనా మూఢాః
తే పచ్యన్తే నరకనిగూఢాః॥

శ్లో॥ షోడశపజ్ఝటికాభి రశేషః
శిష్యాణాం కథితోఽభ్యుపదేశః।
యేషాం నైష కరోతి వివేకం
తేషాం కః కురుతా మతిరేకమ్॥

తా॥ ధనము సర్వానర్థములకు మూల మని, సదా భావింపుము; దానివలన సుఖలేశమైనను, లేదు. ఇది సత్యము. ధనవంతునకు పుత్రునివలన కూడ భయమే. అన్నియెడల ఈ నీతి చెప్పబడుచున్నది.

ధనమును సంపాదించు చున్నంతవరకు కుటుంబములోనివారందరును ప్రేమను ప్రదర్శించుచుందుగు. అటుపిమ్మట శరీరము జరాగ్రస్తమై జర్జరితము అయినంతనే నీ యోగక్షేమములను విచారించువారు ఎవరు నుండరు.

కామ, క్రోధ, లోభ, మోహములను పరిత్యజించి 'నేనెవ్వడను' అని ఆలోచన మొనరించి ఆత్మదర్శనము చేయుము. ఆత్మజ్ఞానోపలబ్ధి లేనివారు ఘోరమైన నరక యాతనల ననుభవించుచు క్రమ్గిపోవుదురు.

శిష్యుల ననుగ్రహించుబుద్ధితో 'షోడశపంఝటికా' శ్లోకములలో ఉపదేశము చేయబడినవి. దీనివలన వివేకము పొందనివారికి ఇంతకన్న నధికముగా ఎవరేమి చెప్పగలరు?

ఇచట కొన్ని అధికశ్లోకములు గలవు.

శ్లో॥ సత్సంగత్వే నిస్సంగత్వం నిస్సంగత్వే నిర్మోహత్వమ్।
నిర్మోహత్వే నిశ్చలతత్త్వం నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః॥

శ్లో॥ కా తే కాంతాధనచింతా వాతుల కిం తవ నాస్తి నియంతా।
యస్త్వాం హస్తే సుదృఢనిబంధం బోధయతి
ప్రభవాదివిరుద్ధమ్॥

శ్లో॥ యోగరతో వా భోగరతో వా సంగరతో వా సంగవిహీనః।
యస్య బ్రహ్మణి రమతే చిత్తం నందతి నందతి
నందత్యేవ॥

శ్లో॥ రథ్యాకర్పటవిరచితకంథః పుణ్యాపుణ్యవివర్జితపంథః।
యోగీ యోగనియోజితచిత్తో రమతే బాలోన్మత్తవదేవ॥

శ్లో॥ ప్రాణాయామప్రత్యాహారం నిత్యానిత్యవివేకవిచారమ్।
జాప్యసమేతసమాధివిధానం కుర్వవధానం
మహదవధానమ్॥

శ్లో॥ గురుచరణాంబుజనిర్భరభక్తః సంసారా దచిరాత్ భవ
ముక్తః।
సేంద్రియమానసనియమా దేవం ద్రక్ష్యసి నిజహృదయస్థం
దేవమ్॥

శ్లో॥ కా తే అష్టాదశదేశే చింతా వాతుల తవ నాస్తి నియంతా।
య స్త్వాం హస్తే సుదృఢనిబద్ధం బోధయతి ప్రభవాది
విరుద్ధమ్॥

శ్లో॥ ద్వాదశపంజరికామయ ఏషః శిష్యాణాం కథితో
హ్యుపదేశః।
యేషాం చిత్తే నైవ వివేకః తే పచంతే నరక మనేకమ్॥

తా॥ సాధుజనసాంగత్యమున నిస్సంగుడగును. నిస్సంగత్వము వలన నిర్మోహత్వము కలుగును. నిర్మోహత్వము వలన నిశ్చల

మైన అద్వయాత్మతత్త్వము కలుగును. నిశ్చలతత్త్వమునందు జీవన్ముక్తి లభించును.

పిచ్చివాడా! నీకు నిరతము కాంతాధనచింత యేల? నిన్ను నియమించువారెవరును లేరా? ఓయి! నిన్ను, నీవే స్వయముగా బంధించుకొనుచుంటివిగదా! జననమరణాదుల నరికట్టునట్లుగా నిన్ను మేల్కొలుపువారు ఎవరును లేరా?

యోగనిమగ్నుడైనను, భోగాసక్తుడైనను, సంగియైనను, నిస్సంగియైనను ఎవని మనస్సు బ్రహ్మయందు క్రీడ సలుపుచుండునో; అతడే ఆనందము ననుభవించును. ఇది ముమ్మాటికి నిశ్చయము.

కూడలియందు పడియున్న గుడ్డపీలికలతో బొంతను కుట్టుకొని ధరించువాడును, పుణ్యపాపవివర్జితమైన మార్గమున సంచరించువాడును, తన మనసును యోగమునందు నియోగించువాడును అగు యోగిబాలునివలె, ఉన్మత్తునివలెను ప్రవర్తించుచు సంచరించుచుండును.

ఓ మానవుడా! ప్రాణాయామప్రత్యాహారములను, నిత్యానిత్యవస్తువివేకమును, జపసహితమైన సమాధినిష్ఠను, ఏకాగ్రతను సావధానుడవై సంపాదించుకొనుము.

గురుచరణసరోజములందు దృఢమగు భక్తిని ఉంచి, వెంటనే సంసారబంధమునుండి ముక్తిని పొందుము. మనస్సును ఇంద్రియములను, వశమునందుంచుకొనిన, హృదయ పుండరీకాంతర్వర్తియగు దేవదేవుని దర్శింపగలవు.

ఓయి పిచ్చివాడా! నీమనస్సు అష్టాదశదేశములందు తిరుగాడుచున్నదేల? నీకు నియామకుడు ఎవరును లేరా, అహంకార మమకారములతో బంధించుకొనుచున్న నిన్ను జ్ఞానోపదేశముచే మేల్కొలుపువా రెవరు లేరా ?

ద్వాదశపంజరికా పూర్ణమైన ఈ యుపదేశము శిష్య సంగ్రహార్థము చేయబడినది. దీనివలన వివేకము నొందని వారు ఘోరమగు నరకయాతనల ననుభవింతురు.

ఈ రీతిగా చెప్పగలవాడు శంకరు డొక్కడే. 'పండితో మేధావీ' యను శ్రుతివాక్యమును ననుసరించి గురువును గూర్చి వెదకికొనుచు వచ్చి, ఉపదేశమును పొంది, అద్వైతతత్త్వమును గ్రహించి, గురువు యొక్క ఆశీస్సులతో దేశసంస్కృతిని, భావస్వాతంత్ర్యమును కాపాడుటకు శంకరుడు కాశీకి బయలుదేరెను.

4. కాశీనివాసము

"సర్వాణి పుణ్యతీర్థాని సేవ్యాన్యేవ ముముక్షుభిః" అని యనుటచే మోక్షమును కోరువారు పుణ్యతీర్థముల నన్నిటిని సేవించవలెను. "తీర్థీకుర్వంతి తీర్థాని" అని నారద భక్తిసూత్రము. తీర్థములు పవిత్రములు, పుణ్యస్థలములు, ఆధ్యాత్మికశక్తి కలవి. "స్వయం హి తీర్థాని పునంతి సంతః" అని శ్రీమద్భాగవతము.

వైదికవాఙ్మయమున, బౌద్ధమతమున ప్రసిద్ధిగన్నది కాశీనగరము. అయోధ్యారాజ్యమునకు మహాశ్మశానమైన కాశీనగరమును ముక్తిక్షేత్ర మని, శివపురి అనికూడ పిలతురు. ఇది త్రిపురారిరాజనగరి అని స్కాందపురాణము. కాశీలో ఉత్తరభాగము ఓంకారఖండము, దక్షిణము కేదార ఖండము, మధ్యభాగము విశ్వేశ్వరఖండము. ఇచటి విశ్వేశ్వరుని పునఃప్రతిష్ఠను, అన్నపూర్ణాలయమున శ్రీచక్రప్రతిష్ఠను శ్రీ శంకరభగవత్పాదులు గావించిరని సంప్రదాయము. తర్వాతికాలమున, శ్రీవిద్యారణ్యులు కాశీలో బస చేసిన చోటనే శృంగేరీమఠముయొక్క కాశీశాఖ నిర్మింపబడిన దందురు.

శంకరుడు వ్యాసదర్శనమును వాంఛించి, గురువుయొక్క ఆదేశానుసారము కాశికి వచ్చెను. కాశీలో అన్నపూర్ణావిశ్వనాథులను, గంగామతల్లిని దర్శించి కాశీనగరము నే పవిత్రము గావించిన శంకరుడు "శివాకారాం దేవీం హరిహర నిజావాసధరణీం" అని కాశిని, "శివా శాంతా హరిపద

యశోభూతి రతులా" అని గంగను, "శివం శాంతాకారం భవమృతిజరాశూన్య మమృతం" అని విశ్వనాథుని, "శివాం శంకరస్యార్థదేహాం విశుద్ధాం"అని అన్నపూర్ణను స్తుతించెను.

గంగాస్నానము చేసివచ్చుచున్న శంకరునకు దారిలో అంత్యజవేషధారియైన శివుడు తారసిల్లగా, అతనిని 'తొలగుడు, తొలగుడు అని శంకరుడు' అనెను. అప్పుడాతడు "నీవు అన్నమయమగు శరీరమునుండి శరీరమును దూరమొనర్ప గోరుచున్నావా? లేక చైతన్యమునుండి చైతన్యమును దూరమొనర్ప గోరుచుంటివా? గంగాజలమును, చండాలవాటికలోని జలాశయమున ప్రతిబింబించిన సూర్యునియందు భేదముందునా? నిస్తరంగ, సహజానంద బోధసముద్ర మగు ఆత్మయందు, 'ఇతడు చండాలుడు, ఇతడు విప్రుడు' అను భేదభ్రమ నీకెట్లుకలిగినది?" అని ప్రశ్నించెను. దానికి శంకరుడు చకితుడై 'ఇతడే విశ్వనాథు' డని గుర్తించి చెప్పిన సమాధానమే 'మనీషాపంచక' మని యందురు.

శ్లో॥ సత్యాచార్యస్య గమనే కదాచి న్ముక్తిదాయకమ్।
కాశీక్షేత్రం ప్రతి సహగౌర్యా మార్గే తు శంకరమ్॥

శ్లో॥ అంత్యవేషధరం దృష్ట్వా గచ్ఛ గచ్ఛేతి చాబ్రవీత్।
శంకరం సోఽపి చండాల స్తం పునః ప్రాహ శంకరమ్॥

శ్లో॥ అన్నమయా దన్నమయ మథవా చైతన్య మేవ చైతన్యాత్।
ద్విజవర దూరీకర్తుం వాంఛసి కిం బ్రూహి గచ్ఛ గచ్ఛేతి॥

శ్లో॥ కిం గంగాంబుని బింబితేఽంబరమణౌ చండాలవాటీపయః
పూరేచాంతర మస్తి కాంచనఘటీమృత్కుంభయో
ర్వాఽంబరే॥

శ్లో॥ ప్రత్యగ్వస్తుని నిస్తరంగ సహజానందావబోధాంబుధౌ।
విప్రోఽయం శ్వపచోఽయ మిత్యపి మహాన్ కోఽయం
విభేద భ్రమః॥

తా॥ సత్య ప్రతిష్ఠాపనాచార్యులైన శ్రీశంకరులు ముక్తిక్షేత్రమైన కాశీక్షేత్రమునకు బోవుచుండగా గౌరీసమేతుడై శంకరుడు కన్పించెను.

అంత్యజవేషమును ధరించిన శంకరునిగూర్చి 'దూరముగా పొండు, దూరముగాపొండు' అని శంకరుడనెను. అంత అంత్యజవేషధారియగు పరమశివుడు, శంకరుని ఈవిధముగా ప్రశ్నించెను.

హే విప్రవర్య! 'పొండు, పొండు' అనుచు, నీవు అన్నమయ శరీరమునుండి అన్నమయమగు శరీరమును దూరమొనర్పదలచుచున్నావా? లేక, చైతన్యమునుండి చైతన్యమును దూర మొనర్పగోరుచున్నావా?

గంగాజలములోను, చండాలవాటికయందలి జలాశయములోను ప్రతిబింబించునట్టి సూర్యునియందు ఏదైనా అంతర ముండునా? అటులనే, కాంచనఘటాకాశమునకు, మృద్ఘటాకాశమునకు, ఏమైన భేదముండునా?

నిస్తరంగము, సహజానందరూపము అయినట్టియు, జ్ఞానసాగరమైన ప్రత్యగాత్మయందు 'ఇతడు విప్రుడు, ఇతడు చండాలుడు' అను భేదవిభ్రమము నీ కెట్లు కలిగెను ?

శ్లో॥ జాగ్రత్స్వప్నసుషుప్తిషు స్ఫుటతరా యా సంవి
దుజ్జృంభతే।
యా బ్రహ్మాదిపిపీలికాంతతనుషు ప్రోతా జగత్సాక్షిణీ।
సైవాహం న చ దృశ్యవస్త్వితి దృఢప్రతిజ్ఞాఽపి
యస్యాస్తి చేత్
చండాలోఽస్తు స తు ద్విజోఽస్తు గురు రిత్యేషా
మనీషా మమ॥

శ్లో॥ బ్రహ్మైవాహ మిదం జగచ్చ సకలం చిన్మాత్రవిస్తారితం
సర్వం చైత దవిద్యయా త్రిగుణయాఽశేషం మయా
కల్పితమ్।
ఇత్థం యస్య దృఢా మతిః సుఖతరే నిత్యే పరే నిర్మలే
చండాలోఽస్తు స తు ద్విజోఽస్తు గురు రిత్యేషా మనీషా
మమ॥

శ్లో॥ శశ్వ న్నశ్వర మేవ విశ్వ మఖిలం నిశ్చిత్య వాచా గురో
ర్నిత్యం బ్రహ్మ నిరంతరం విమృశతా
నిర్వ్యాజశాంతాత్మనా।
భూతం భావి చ దుష్కృతం ప్రదహతా సంవిన్మయే
పావకే
ప్రారబ్ధాయ సమర్పితం స్వవపు రిత్యేషా మనీషా మమ॥

శ్లో॥ యా తిర్యఙ్నరదేవతాభి రహ మిత్యంతః స్ఫుటా గృహ్యతే
యద్భాసా హృదయాక్షదేహవిషయా భాన్తి స్వతోఽ
చేతనాః।
తాం భాస్యైః పిహితార్కమండలనిభాం స్ఫూర్తిం సదా
భావయన్
యోగీ నిర్వృతమానసో హి గురు రిత్యేషా మనీషా మమ॥

శ్లో॥ యత్సౌఖ్యాంబుధిలేశలేశత ఇమే శక్రాదయో నిర్వృతాః
యచ్చిత్తే నితరాం ప్రశాంతకలనే లబ్ధ్వా ముని ర్నిర్వృతః।
యస్మిన్నిత్యసుధాంబుధౌ గలితధీ ర్బ్రహ్మైవ న
బ్రహ్మవిద్
యః కశ్చిత్ స సురేంద్రవందితపదో నూనం మనీషా మమ॥

తా॥ అప్పుడు శంకరు డీవిధముగా ప్రత్యుత్తర మొసగెను. జాగ్రత్-స్వప్న-సుషుప్తి దశలందు ఏ చైతన్యము అత్యంతము స్ఫుటముగా ప్రకాశించుచున్నదో, ఏ పరమచేతన పిపీలికాది బ్రహ్మపర్యంతము శరీరము లన్నిటియందును సాక్షియై వెలుగొందుచున్నదో, నేను ఆ చైతన్యస్వరూపమునే; నేను జడమగు దృశ్యవస్తువుగాను- అను దృఢభావము కలవాడు చండాలు డయినను, ద్విజుడైనను, అతడు నాకు గురువు అని నా సుదృఢనిశ్చయము.

నేను బ్రహ్మను; ఈజగత్తు అంతయు కేవల చిన్మాత్రముచే విస్తరించు నట్టిది; ఈ సర్వమును త్రిగుణాత్మక మగు అవిద్య వలన నాయందు ఆధ్యస్తమై యున్నది- అను దృఢ విశ్వాసము ఎవనికి నిత్యము, పరము, శుద్ధము, సచ్చిదానంద

స్వరూపము నైన పరబ్రహ్మ యందు నిలచియుండునో, అతడు చండాలుడగుగాక, ద్విజుడగుగాక అతడు నాకు వందనీయుడే యని నా నిశ్చయము.

ఈ విశ్వమంతయు నశ్వర మను గురువుయొక్క వాక్యమును చక్కగా నిశ్చయించుకొని, నిర్వ్యాజము, శాంతమునగు చిత్తముతో నిత్యమగు బ్రహ్మతత్త్వమును నిరంతరముధ్యానించుచు, భూతకాలమున నేనొర్చినట్టియు, భవిష్యత్కాలమున నేనొర్చబోవునట్టియు వర్తమానకాలమున నే నొనర్చుచున్నట్టి దుష్కర్మలను, ఆగామి,సంచిత,ప్రారబ్ధరూపములైన కర్మలను దగ్ధ మొనర్చి అపహతపాప్మ నైతిని. ఇప్పుడు చిదగ్నియందు ప్రారబ్ధభోగరూపమైన ఈ శరీరమును హోమము చేయుచున్నాను. ఇదియే నా దృఢనిశ్చయము

మనుష్యులు, దేవతలు, తిర్యగ్జంతువులు-వీనిచేత, ఏది 'నేను' అని, అంతఃకరణమునందు స్పష్టంగా గ్రహింపబడుచున్నదో, అచేతనములయ్యు,శరీరేంద్రియాంతఃకరణ విషయములు దేనిచేత భాసించుచున్నవో, సూర్యప్రకాశముచే భాసించునట్టి మేఘముల చేత కప్పబడిన సూర్యమండల ప్రకాశము వలె స్వయంప్రకాశమాన మైనది యేది గలదో ఆ చైతన్య ప్రకాశమును అనవరతము ఏ యోగివర్యుడు భావన చేయుచుండునో, అతడే నా గురువు అని నా దృఢ నిశ్చయము.

ఏ ఆనందసాగర మందలి కణలేశమును పొంది, శక్రాది దేవతలు అమందానందము నొందుదురో, ముని తన నిస్తరంగ

చిత్తమందు దేనిని పొంది ఆనందించుచుండునో, శాశ్వతమైన ఆ సుధాసాగరమున ఎవని చిత్తము కరగిపోయినదో, అనగా, ఎవని మనసు విలయము చెందునో, అతడు బ్రహ్మయే గాని బ్రహ్మవేత్త గాడు. అట్టి యోగీశ్వరుని చరణయుగళమునకు దేవేంద్రుడు సహితము నమస్కరించు నని వాఙ్మ్మదృఢ విశ్వాసము.

ఈ సందర్భముననే ఆచార్యులు 'మాయాపంచకమ్'ను కూడ చెప్పిరి.

శ్లో॥ నిరుపమ నిత్య నిరంశకేఽప్యఖండే
మయి చితి సర్వవికల్పనాదిశూన్యే।
ఘటయతి జగదీశజీవభేదం
త్వఘటితఘటనాపటీయసీ మాయా॥

శ్లో॥ శ్రుతిశతనిగమాన్తశోధకా న
ప్యహహ ధనాదిదర్శనేన సద్యః।
కలుషయతి చతుష్పదా ద్యభిన్నాం
స్త్వఘటితఘటనాపటీయసీ మాయా॥

శ్లో॥ సుఖచి దఖండవిబోధ మద్వితీయం
వియదనలాదివినిర్మితే నియోజ్య।
భ్రమయతి భ్రమసాగరే నితాంతం
త్వఘటితఘటనాపటీయసీ మాయా॥

శ్లో। అపగతగుణజాతివర్ణభేదే
సుఖచితి విప్రవిదాద్యహంకృతిం చ।

స్ఫుటయతి సుతదారగేహం
త్వఘటితఘటనాపటీయసీ మాయా॥

శ్లో॥ విధి హర హరివిభేద మప్యఖండే
బత విరచయ్య బుధానపి ప్రకామమ్।
భ్రమయతి హరి హర భేదభావా
నఘటితఘటనాపటీయసీ మాయా॥

తా॥ నేను నిత్యుడను; నిరుపముడను; నిరంశకుడను; అఖండ స్వరూపుడను: జ్ఞానస్వరూపుడను. ఇట్టి సంకల్పవికల్పనాది శూన్యుడ నగు నాయందు మాయ జగత్తు, ఈశ్వరుడు, జీవుడు అను త్రిపుటీ భేదమును కలుగజేయుచున్నది. మాయ అఘటితమైన దానిని ఘటింపజేయుటలో పటీయసి గదా !

అనేకశతవేదవచనములు, ఉపనిషద్వాక్యములు తత్త్వ జ్ఞానము నుద్బోధించుచున్నవి. అయినను, మాయ ధనాదులను జూపి పశుతుల్యు లగు మానవుల మనస్సును కలుషిత మొనర్చుచున్నది. అది యెంతకైనను తగును. మాయ అఘటిత ఘటనాపటీయసి గదా ! ఆశ్చర్యము !

మాయ అఖండ సచ్చిదానంద బోధస్వరూపము, అద్వయము నైన ఆత్మను,ఆకాశాదిభూతపంచకముచే వినిర్మిత మైన భ్రమసాగరమున బడద్రోసి నిరంతరము పరిభ్రమింప జేయుచున్నది. అఘటితమైనదానిని ఘటింపజేయుటలో పటీయసి గదా ఈ మాయ!

గుణ-జాతి-భేదరహితము, ఆనందచిద్ఘనము నగు ఆత్మ యందు బ్రాహ్మణ-క్షత్రియాదిరూపమైన అహంకారమును, దారాపుత్రగృహాదులందు మోహమును జనింపజేయుచున్న దీమాయ. ఇది అఘటితఘటనాపటీయసి గదా!

అఖండమగు సచ్చిదానందస్వరూపమునందు బ్రహ్మ-విష్ణు-మహేశ్వరాది భేదమును కల్పించుచున్న దీమాయ. అది విద్వాంసులను సహితము శివ-విష్ణు భేదమతులనుగా నొనర్చి పరిభ్రమింపజేయుచున్నది. ఈమాయ అఘటిత ఘటనాపటీయసి గదా!

ఈ రీతిగా మనీషాపంచకమున అద్వైతతత్త్వము అనుభవైకవేద్య మగునట్లు వివరించుటయేగాక, తన నిశ్చితాభిప్రాయమును స్పష్టపరచెను. ఈ సమాధానమును విని, శివుడు శంకరునకు నిజ స్వరూపమును జూపి, భాష్యరచనను పూనుకొను మని ఆదేశించె నని చెప్పుదురు. పద్మపాదుడు "అగ్రణీః శిష్టాచారపరిపాలనే భగవాన్ భాష్యకారః" అనినాడు. మనీషాపంచకము శిష్టాచారమును త్రోసిపుచ్చునది కాదు.

కాశీ నగరమున శంకరుడు విశ్వనాథుని దర్శించి—

"సానంద మానందవనే వసంతం
ఆనందకందం హతపాపబృందమ్।
వారాణసీనాథ మనాథనాథం
శ్రీ విశ్వనాథం శరణం ప్రపద్యే॥"

అని స్తుతించెను. శ్రీ విశ్వనాథుడు అనాథనాథుడు. అతని దర్శనము సర్వపాపములను నశింపజేయునది. విశ్వనాథుని ధ్యానించుటలోనే ఆచార్యునకు అద్వితీయానందము లభించినది. కావుననే, 'శివోఽహమ్' అను మకుటము గల శ్లోకములు చెప్పకలిగెను. వీటిలో 'ఆత్మపంచక' మని, 'అద్వైతపంచక' మని 'నిర్వాణపంచక' మని పిలువబడు 'ఆత్మషట్క' మొకటి 'సాక్షి, నిత్యుడు, ప్రత్యగాత్మ అగు శివస్వరూపమును నేను' అని నొక్కి వక్కాణించుచు, గురూపదేశమువలన, నేను జీవుడను గాననియు, శివస్వరూపు డనే అనియు తెలిసికొంటిని' అని పల్కినాడు. సత్యవస్తువు మాయావృతమై అద్వైతరూపుడ నగు నాయందు ప్రకాశ మందుచున్నది గనుక, నేనే శివస్వరూపుడను.' ఈ ఆత్మ షట్కమున శివస్వరూపముతో అద్వితీయ తత్త్వమును అభిన్నముగా చిత్రించెను

ఇట్టి అనుభూతుల నొసగిన కాశిని శంకరుడు స్మరించుట మానలేదు. ఆచార్యరచనలలో 'కాశీపంచక' మని యొక రచన గలదు.

శ్లో॥ మనో నివృత్తిః పరమోపశాంతిః
సతీర్థవర్యా మణికర్ణికాఽత్ర।
జ్ఞానప్రవాహా విమలాదిగంగా
సా కాశికాఽహం నిజబోధరూపా॥

శ్లో॥ యస్యా మిదం కల్పిత మింద్రజాలం
చరాచరం భాతి మనోవిలాసమ్।

సచ్చిత్సుఖైకా పరమాత్మరూపా
సాకాశికాఽహం నిజబోధరూపా॥

శ్లో॥ కోశేషు పంచ స్వధిరాజమానా
బుద్ధి ర్భవానీ ప్రతిదేహగేహమ్।
సాక్షీ శివ స్సర్వగతోఽ న్తరాత్మా
సా కాశికాఽహం నిజబోధరూపా॥

శ్లో॥ కాశ్యాం హి కాశతే కాశీ కాశీ సర్వప్రకాశికా।
సా కాశీ విదితా యేన తేన ప్రాప్తా హి కాశికా॥

శ్లో॥ కాశీక్షేత్రం శరీరం త్రిభువనజననీ వ్యాపినీ జ్ఞానగంగా
భక్తిః శ్రద్ధా గయేయం నిజగురుచరణధ్యానయోగః ప్రయాగః।
విశ్వేశోఽయం తురీయః సకలజనమనఃసాక్షిభూతోఽ న్తరాత్మా
దేహే సర్వం మదీయే యది వసతి పున స్తీర్థ మన్యత్ కిమ స్తి॥

తా॥ మనోనివృత్తిపూర్వకమైన పరమశాంతియే తీర్థరాజమగు మణికర్ణిక. జ్ఞానప్రవాహమే నిర్మలమైన ఆదిగంగ. పరమశాంతి, జ్ఞానప్రవాహము ఇట కాశీక్షేత్రమును సృజించుచున్నవి. ఆత్మబోధస్వరూపుడ నగు నేనే కాశికాస్వరూపమున ఒప్పారుచుందును. ఇదియే బోధ.

మనోవిలాసము, ఇంద్రజాలము నగు కల్పితచరాచర ప్రపంచము దేనియందు విరాజిల్లుతున్నదో, సచ్చిదానంద

స్వరూపము, ఏకము, పరమాత్మస్వరూపము నగుచు ఏది వెలుగొందుచున్నదో అదియే కాశిక. అదియే నిజబోధ. తత్స్వరూపుడను నేనే.

ప్రాణమయాది కోశపంచకమునందు అభివ్యాప్తమై విరాజిల్లుచు ప్రతిదేహమును గృహముగా భావించునట్టి బుద్ధియే భవాని; ప్రత్యగాత్మయు, సర్వగతుడును, సాక్షియు నగువాడే శివుడు; తదుభయుల సమ్మేళనక్షేత్రమే కాశిక. కాశికాస్వరూపుడను నేనే.

కాశిక యందే కాశిక భాసించుచుండును. అనగా, అద్వయాత్మజ్ఞానము నందే కాశి వెలుగొందును. ఆత్మజ్ఞాన రూపమైన కాశిక సర్వమును ప్రకాశింపచేయునట్టిది. ఆత్మ జ్ఞానరూపమైన కాశికను ఎరిగినవాడే కాశికను పొందును.

ఈ శరీరమే కాశీక్షేత్రము. జ్ఞానగంగయే సర్వగత యగు త్రిభువనజనని; శ్రద్ధాభక్తులే గయ; నిజగురుచరణ ధ్యానయోగమే ప్రయాగ; తురీయుడు, ప్రత్యగాత్మ, సకల జనమనస్సాక్షియు విశ్వేశ్వరుడు; నా దేహమునందే ఇది యంతయు విలసిల్లుచుండగా, నాకు అన్యతీర్థములతో పని యేమి ?

ఈవిధముగా శంకరుడు కాశికను ఆత్మజ్ఞానపరముగా భావించి వివరించినాడు. కాశీనగరము ఆచార్యుని దృష్టిలో అద్వైతవిద్య కొక ప్రతీకగా కన్పించినది. ముముక్షువునకు

బహిర్ఖ్యాతముగా కాశి లేదు. జ్ఞానగోచరమగు ఆమ్నాయ ములలో కాశికి ప్రధానస్థానము ఇందుచేతనే కన్పించుచున్నది.

కాశిలో ఉండగా, శంకరునకు మహత్తరమైన అనుభూతులు కల్గిన వనుట నిర్వివాదము. అద్వైతసిద్ధాంతము అనుభూతమైనది. ఆ పరిస్థితిలో జీవన్ముక్తుని వలె "సామగాయన్నాస్తే" సామగానము చేయువాని భంగి భగవన్నుతి అనేకవిధములుగా చేయదొడంగెను. ఈ సమయమున ఆచార్యుడు చెప్పిన స్తోత్రములలో ముఖ్యమైనది జీవన్ముక్తానందలహరి.

శ్లో॥ పురే పౌరాన్ పశ్యన్ నవయువతినామాకృతిమయాన్
సువేషాన్ స్వర్ణాలంకరణకలితాన్ చిత్రసదృశాన్।
స్వయం సాక్షీ ద్రష్టేత్యపి చ కలయన్ తైస్సహర మయన్
మునిర్న వ్యామోహం భజతి గురుదీక్షా క్షతతమాః॥

తా॥ గురువు యొద్ద దీక్షను పొంది అజ్ఞానాంధకారమును వదలిన ముని నగరమందు సంచరించు యువతీజనము యొక్క ఆకృతులను చూచినను, సుందరవేషములను ధరించినట్టియు, స్వర్ణాభరణములతో నొప్పారునట్టియు చిత్తరువులను బోలు వారిని దర్శించినను తనను దాను సాక్షిమాత్రుడైన ద్రష్టగా నెరిగి వారితో క్రీడించుచున్నను, చలింపడు; వ్యామోహితుడు కాడు.

శ్లో॥ వనే వృక్షాన్ పశ్యన్ దలఫలభరాన్ నమ్రసుశిఖాన్
ఘనచ్ఛాయాచ్ఛన్నాన్ బహుల కలకూజ ద్విజగణాన్

భజన్ ఘస్రో రాత్రాదా వవనితలకల్పైకశయనో
ముని ర్న వ్యామోహం భజతి గురుదీక్షాక్షతతమాః॥

శ్లో॥ కదాచిత్ ప్రాసాదే క్వచిదపి చ సౌధేషు ధనినాం
కదా కాలే శైలే క్వచిదపి చ కూలేషు సరితామ్।
కుటీరే దాంతానాం మునిజనవరాణా మపి వసన్
ముని ర్న వ్యామోహం భజతి గురుదీక్షాక్షతతమాః॥

శ్లో॥ క్వచి ద్బాలైః స్సార్థం కరతలగతాలైః స్సహసితైః
క్వచి త్తారుణ్యాలంకృత వరవధూభి స్సహ రమన్।
క్వచి ద్వృద్ధై శ్చింతాకులితహృదయై శ్చాపి విలపన్
ముని ర్న వ్యామోహం భజతి గురుదీక్షాక్షతతమాః॥

తా॥ గురుదీక్షామహిమచే అజ్ఞాన మను ధ్వాంతమును పారద్రోలిన ముని ఫల-శాఖాభారముచే వినమ్రములు, శీతలచ్ఛాయాప్రదములు, మధురకలకూజనములతో నొప్పారుపక్షిబృందములతో విలసితములు నగు వనవృక్షములను చూచుచు, అహర్నిశములు ఆ వృక్షములనే తమయునికిపట్టుగా జేసికొని భూతలమునే శయ్యగా నేర్పరచుకొని వ్యామోహము చెందడు.

గురుదీక్షాప్రభావితుడగు ముని ఒకప్పుడు మేడమీదను, మరియొకప్పుడు ధనికుల ప్రాసాదములోను, ఒక సమయమున కొండలమీదను, మరియొక సమయమున నదీతటములందును, మరియొకప్పుడు దాంతశీలురగు మునిజనుల కుటీరములందును వసించుచు ఇంచుకైనను వ్యాకులచిత్తుడు కాడు.

ఒకప్పుడు చేతులలో ఆటబొమ్మల నిడుకొని చిరునవ్వు మందహాసములతో నొప్పారు బాలురతోను, మరియొకప్పుడు తారుణ్యముతో వెలుగొందు యువతీజనములతోను ఆనంద క్రీడలు సలుపుచున్నను, మరియొక సమయమున చింతలతో వ్యధచెందునట్టి వృద్ధులతో కూడి శోకించుచున్నను, గురు దీక్షామహిమచే అజ్ఞానధ్వాంతమును నాశ మొందించుకొనిన మునిపుంగవుడు వ్యామోహము చెందడు.

శ్లో॥ కదాచిత్ విద్వద్భి ర్వివిదిషుభి రత్యంతవిరతైః
కదాచిత్ కావ్యాలంకృతిరసరసాలైః కవివరైః।
కదాచిత్ సత్తర్కై రనుమతిపరై స్తార్కికవరైః
ముని ర్న ....

శ్లో॥ కదా ధ్యానాభ్యాసైః క్వచిదపి సపర్యావికసితైః
సుగంధై స్సత్పుష్పైః క్వచిదపి దలైరేవ విమలైః।
ప్రకుర్వన్ దేవస్య ప్రముదితమనాః సంస్తుతిపరో
ముని ర్న ....

శ్లో॥ శివాయా శ్శంభోర్వా క్వచిదపి చ విష్ణోరపి కదా
గణాధ్యక్షస్యాపి ప్రకటతపనస్యాపి చ కదా।
పఠన్ వై నామాలిం నయనరచితానందసలిలో
ముని ర్న ....

ఒకప్పుడు జ్ఞానసముపార్జనమునందు తత్పరులైన విద్వాంసులతోను, మరియొకప్పుడు కావ్యాలంకారరసరసాలములైన కవిశ్రేష్ఠులతోను, మరియొకప్పుడు అనుమాన ప్రమాణమే ప్రధానముగాగల గల సత్తర్కము చేయునట్టి

తార్కికశిరోమణులతోను వ్యవహరించునట్టి ముని గురుదీక్షా ప్రభావముచే అజ్ఞానమును బాసి వ్యామోహము చెందడు.

ఒకప్పుడు, ధ్యానాభ్యాసములతోను, మరొకప్పుడు, సపర్యకై వికసించిన సుగంధసురభిత పుష్పములతోను, మరొకవేళ, తులసీ బిల్వాది దళములతోను, భగవంతుని పూజాసంస్తుతులను జేయుచు ప్రముదితాంతరంగుడైన ముని ఎన్నడును వ్యామోహముచెందడు. గురుదీక్షా ప్రభావముచే ఆయనయొక్క అజ్ఞానతిమిరము నాశమొందినది.

ఆ మౌని కొన్నివేళల దుర్గానామసహస్రమును పఠించిన, మరి కొన్నిసమయములందు శివసహస్రనామపారాయణము చేయును. అటులనే ఒకప్పుడు గణపతి సహస్రనామమును, విష్ణుసహస్రనామమును పఠించిన, మరొకప్పుడు ఆనందాశ్రు నయనుడై ఆదిత్య సహస్రనామపారాయణ మొనర్చును. గురుదీక్షయొక్క మహిమాతిశయముచే అజ్ఞానధ్వాంతమును విడనాడిన మునిశ్రేష్ఠుడు ఎన్నడును వ్యామోహితుడు కాడు.

శ్లో॥ కదాచిత్ జాగ్రత్యాం విషయకిరణైః సంవ్యవహరన్
కదాచిత్ స్వప్నస్థానపి చ విషయానేవ చ భజన్।
కదాచిత్ సౌషుప్తం సుఖ మనుభవన్నేవ సతతం
ముని ర్న ....

శ్లో॥ కదా ప్యాశావాసాః క్వచిదపి చ దివ్యాంబరధరః
క్వచిత్ పంచాస్యోత్థాం త్వచ మపి దధానః కటితటే।

మనస్వీ నిశ్శంకః సుజనహృదయానందజనకో
ముని ర్న ....

శ్లో॥ కదాచిత్ స త్త్వస్థః క్వచిదపి రజోవృత్తిసుగత
స్తమోవృత్తిః క్వాపి త్రితయరహితః క్వాపి చ పునః।
కదాచిత్ సంసారీ శ్రుతిపదవిహారీ క్వచి దహో
ముని ర్న ....

గురూపదేశముచే అజ్ఞానమును పరిత్యజించిన మౌని ఒకప్పుడు జాగ్రదవస్థలో విషయసుఖములను బడయుచుండును. మరొకప్పుడు స్వప్నప్రపంచమందలి విషయములనే పొందుచుండును; వేరొకసమయమున సుషుప్తుడై సౌషుప్తసుఖమును సతతము అనుభవించుచుండును. అట్టి జ్ఞాని యగు మౌని ఎన్నడును వ్యామోహము నందడు.

మౌని యయినవాడు ఒకప్పుడు దిగంబరుడై యుండిన, మరొకప్పుడు దివ్యవస్త్రములను ధరించి యుండును. కొండొక సమయమున కటితటమున వ్యాఘ్రచర్మమును ధరించియు మనస్వియై, శంకారహితుడై, సహృదయజనుల కానందము కలుగచేయుచు వ్యామోహము చెందక వర్తించును.

జ్ఞాని యగు మౌని ఒకప్పుడు సత్త్వగుణమునందును, మరొకప్పుడు రజోగుణమునందును; ఇంకొకప్పుడు తమోగుణమునందును వర్తిలుచుండును: మరి కొన్ని వేళలందు త్రిగుణవర్జితుడై, త్రిగుణాతీతుడై సంచరించును. ఒకప్పుడు సంసారి, మరొకప్పుడు ఉపనిషన్మార్గవిహారి! అహో! ఆశ్చ

ర్యము ! ఇట్టి యోగీశ్వరుడగు మౌని ఎన్నడును వ్యామోహము చెందడు.

శ్లో॥ కదాచిత్ మౌనస్థః క్వచిదపి చ వాగ్వాదనిరతః
కదాచిత్ స్వానందే హసతి రభసా త్యక్తవచసా।
కదాచిత్ లోకానాం వ్యవహృతిసమాలోకనపరో
ముని ర్న ....

శ్లో॥ కదాచిత్ శక్తీనాం వికచముఖపద్మేషు కమలాన్
క్షిపం స్తాసాం క్వాపి స్వయమపి చ గృహ్ణాన్ స్వముఖతః।
త దద్వైతం రూపం నిజపరవిహీనం ప్రకటయన్
ముని ర్న ....

శ్లో॥ క్వచి చ్ఛైవై స్సార్థం క్వచిదపి చ శాక్తై స్సహ రమన్
కదా విష్ణో ర్భక్తైః క్వచిదపి చ సౌరై స్సహ వసన్।
కదా గాణాపత్యై ర్గతసకలభేదో ఽద్వయతయా
ముని ర్న ....

తా॥ గురూపదేశప్రభావితుడైన మౌని ఒకప్పుడు వాక్సంయమము బూని, మౌనియై యుండును; మరియొకప్పుడు సభలలో వాగ్వాదతత్పరుడై శాస్త్రచర్చలలో మునిగియుండును. కొన్ని సమయములలో ఆత్మానందమున మునిగి తొందరగా మాట్లాడుచు నవ్వుచుండును; మరొక సమయమున లోకవ్యవహారమును చూచుట యందు ఆసక్తి గలవాడై యుండును. కాని అట్టి మౌని ఎన్నడు వ్యామోహము చెందడు.

ముని, వికచపద్మానన లైన శక్తిదేవతలను కమలములతో పూజ సేయుచుండును, మరొకప్పుడు, ఆ పద్మములను గ్రహించి తన శిరస్సుపై నుంచుకొనుచు, గుణాతీతము, లింగాతీతము, జీవేశ్వరభేదశూన్యము (స్వపరభేదరహితము) నగు అద్వయాత్మతత్త్వమును ప్రకటించుచు, వ్యామోహము లేక యుండును.

జ్ఞానియైన ముని ఒకప్పుడు శైవులతోను, మరొకప్పుడు శాక్తేయులతోను ఇంకొకప్పుడు, వైష్ణవులతోను గాణాపత్యులతోడను సజాతీయ విజాతీయ స్వగత భేదశూన్యమైన అద్వయాత్మ భావముతో వినోదించుచు, వ్యామోహము నందక యుండును.

శ్లో॥ నిరాకారం క్వాపి క్వచిదపి చ సాకార మమలం
నిజం శైవం రూపం వివిధగుణభేదేన బహుధా।
కదాఽఽశ్చర్యం పశ్యన్ కిమిద మితి హృష్యన్నపి కదా
మునిర్న ....

శ్లో॥ కదా ద్వైతం పశ్య న్నిఖిల మపి సత్యం శివమయం
మహావాక్యార్థానా మవగతి సమభ్యాసవశతః।
గతద్వైతాభాసః శివశివ శివేత్యేవ విలపన్
మునిర్న ....

శ్లో॥ ఇమాం ముక్తావస్థాం పరమశివసంస్థాం గురుకృపా
సుధాపాంగావాప్యాం సహజసుఖవాప్యా మనుదినమ్।

ముహు ర్మజ్జన్ మజ్జన్ భజతి సుకృతీ చే న్నరవర
స్తదా యోగీ త్యాగీ కవిరితి వద న్తీహ కవయః॥

శ్లో॥ మౌనే మౌనీ గుణిని గుణవాన్ పండితే పండితశ్చ
దీనే దీనః సుఖిని సుఖవాన్ భోగిని ప్రాప్తభోగః।
మూర్ఖే మూర్ఖో యువతిషు యువా వాగ్మిని ప్రౌఢవాగ్మీ
ధన్యః కోఽపి త్రిభువనజయీ యోఽవధూతేఽవధూతః॥

ముని ఒకప్పుడు నిరాకారముగను, మరొకప్పుడు సాకారముగను, వివిధ గుణభేదములతో వెలుగొందు ఆత్మతత్త్వమును ఆశ్చర్యముగ చూచును; 'ఇదేమి' అని ఆనందించును. గురూపదేశ ప్రభావితుడును అపగతాజ్ఞానధ్వాంతుడు నగు ముని ఎన్నడును వ్యామోహము చెందడు.

జ్ఞానియగుమౌని ద్వైతసంసారమును దర్శించుచున్నను, అంతయు శివమయమని తలంచును. నిరంతరాభ్యాసము వలన మహావాక్యార్థము నవగత మొనర్చుకొని ద్వైతాభాస లేనివాడై 'శివాశివా' యని ఉచ్చరించుచు నిర్మోహుడై యుండును.

సుకృతాత్ముడైన మానవుడు సహజానందసరోవరమును, గురుకృప యను సుధ నొలికించునట్టి కటాక్షమును అగు సరోవరమునందు నిరంతరము మునక లిడుచు పరమశివస్వరూప మగు ఈ జీవన్ముక్తావస్థను పొందునో; అపుడు

వానిని పండితులు యోగి యనియు, త్యాగి యనియు కవి (కవిర్మనీషీ) యనియు కొనియాడుదురు.

ఏ సుకృతి మానులలో మానియై గుణవంతులలో గుణియై పండితులలో పండితుడై విరాజిల్లునో; ఏ త్యాగ శీలుడు దీనులలో దీనుడుగను, సుఖాత్ములలో సుఖిగాను, భోగులలో భోగిగాను వర్తిలుచుండునో, ఏ జ్ఞాని, మూర్ఖులలో మూర్ఖుడై, యువకులలో యువకుడై వక్తలలో ప్రౌఢ వాగ్మియై సంచరించుచుండునో, అట్టివ్యక్తి అవధూతలలో నవధూతయై వెలుగొందును. ఆ ధన్యజీవి త్రిభువనవిజయియై భాసించును.

ఈ విధముగ జీవన్ముక్తావస్థను వర్ణించినతర్వాత, శంకరుడు, దగ్గరచేరిన శిష్యులకు 'తత్త్వోపదేశ' మను పేర ఆత్మతత్త్వము నీవిధముగా బోధించెను.

శ్లో॥ తత్త్వంపదార్థశుద్ధ్యర్థం గురుః శిష్యం వచోఽబ్రవీత్।
వాక్యే తత్త్వమసీ త్యత్ర త్వం పదార్థం వివేచయ॥

శ్లో॥ న త్వ దేహోఽసి దృశ్యత్వా దుపజాత్యాదిమత్వతః।
భౌతికత్వా దశుద్ధత్వా దనిత్యత్వాత్ తథైవ చ॥

శ్లో॥ అదృశ్యో రూపహీన స్త్వం జాతిహీనోఽప్యభౌతికః।
శుద్ధనిత్యోఽసి దృగ్రూపో ఘటో యద్వత్ న దృగ్భవేత్॥

శ్లో॥ న భవా నింద్రియాణి యేషాం కరణత్వేన యా శ్రుతిః।
ప్రేరక స్త్వం పృథక్ తేభ్యో న కర్తా కరణం భవేత్॥

తా॥ గురువుశిష్యునితో ఇట్లనెను-'తత్, త్వం' పదముల అర్థనిశ్చయమునకై ముందుగా 'తత్త్వమసి' అను శ్రుతి యందలి 'త్వం' పదము యొక్క అర్థమును వివేచించి తెలిసికొనుము.

దేహము దృశ్యము, బ్రాహ్మణత్వ, క్షత్రియత్వాది జాతివిశిష్టము, పృథివ్యాది పంచభూతవినిర్మితము, అశుద్ధము, నశ్వరమును అయినది. కాన, దేహము నీవు కావు.

'త్వం' పదవాచ్యుడవగు నీవు రూపరహితుడవు; బ్రాహ్మణత్వాది జాతి నీకు లేదు; పాంచభౌతికమైన భూత సృష్టిలోనివాడవు కావు; నీవు నిత్యుడవు, శుద్ధుడవు; నీవు దృగ్రూపమగు ఘటము దృశ్యముగాని, దృగ్రూపముకాదు; అదేరీతిగ నీవు దృగ్రూపమైన జ్ఞానరూపుడవు.

శ్రుతి ఇంద్రియములను కరణము (పనిచేయునవి) లని, యుద్ఘోషించుచున్నది. కాన, నీవు ఇంద్రియములును కావు. నీవు వానికంటె, భిన్నుడవై; ఆ యింద్రియములను విషయ సుఖములకై ప్రేరేపింతువు. ప్రేరకుడు కర్త. కర్త ఎన్నడును కరణము గాడు.

శ్లో॥ నానైతాని ఏకరూప స్త్వం భిన్న స్తైభ్యః కుతః శృణు।
న చైకేంద్రియరూప స్త్వం సర్వత్రాహంప్రతీతః॥

శ్లో॥ న తేషాం సముదాయోఽసి తేషా మన్యతమస్య చ।
వినాశోఽప్యాత్మధీః తావదస్తి స్యాన్నైవ మన్యథా॥

శ్లో॥ ప్రత్యేక మపి తా న్యాత్మా నైవ తత్ర వయం శృణు।
నానాస్వామికదేశో௨యం సత్యేద్భిన్నమతాశ్రయః॥

శ్లో॥ నానాత్మాభిమంతం నైవ విరుద్ధవిషయత్వతః।
స్వామ్యైక్యే తు వ్యవస్థా స్యా దేకపార్థివదేశవత్॥

శ్లో॥ న మన స్త్వం న వా ప్రాణో జడత్వాదేవ చైతయోః।
గత మన్యత్ర మే చిత్త మిత్యన్యత్వానుభూతితః॥

తా॥ ఇంద్రియములలో, అనేకములు; నీవు ఏకరూపుడవు; నీవు ఆ ఇంద్రియములకంటె భిన్నుడవు. ఏలనన; అహంప్రతీతి అనగా; నేను అను స్ఫురణము సర్వత్ర కలుగుచున్నది; కాన, నీవు ఒకే ఇంద్రియము కాజాలవు.

నీవు ఇంద్రియసమాహారమునుగావు; వానిలో ఒక ఇంద్రియమును గావు. ఇంద్రియములు నశించినను, ఆత్మ ప్రత్యయము, అనగా 'నేను' అను బుద్ధి అనుస్యూతముగ ఉండును. లేనిచో, 'నేనుంటిని, నేనుసుఖముగ నిద్రించితిని' అను జ్ఞానము అసంభవము.

ఆ ఇంద్రియసంఘాతమున, ఏ ఒక్కటియును, నీవు గావు. ఇచట యుక్తి యేమనగా, వివిధాభిప్రాయములు గల యజమానులనేకులు ఈ శరీరమును పాలించుచున్నారు. వారి భిన్నాభిప్రాయముల ననుసరించిన ఈ శరీరవ్యవహారము జరుగ నేరదు. అది నశించును.

విరుద్ధవిషయావలంబను లగుటచే నానాత్మవాదము ఎవరికిని అభిమతము కాజాలదు. ఒకే ప్రభువుచే పాలింపబడు

దేశవ్యవస్థవలె ఏక స్వామికత్వము నాశ్రయించిన, ఈశరీర వ్యవస్థ చక్కగా జరుగును.

జడము లగుటచే మనస్సుగాని, ప్రాణముగాని నీవు కావు. ఏలయన, 'నా మనసు ఎచ్చటికో పోయినది' అని అనుభూతి కలుగుచున్నది. కాన, మనస్సు ఆత్మ కంటెభిన్నము.

శ్లో॥ క్షుత్తృడ్భ్యాం పీడితః ప్రాణో మమాయం చేతి భేదతః।
తయో ర్ద్రష్టా పృథక్ తాభ్యాం ఘటద్రష్టా ఘటా ద్యథా॥

శ్లో॥ సుప్తౌ లీనాఽస్తి యా బోధే సర్వం వ్యాప్నోతి దేహకమ్।
చిచ్ఛాయయా చ సంబద్ధా న స బుద్ధి ర్భవాన్ ద్విజ॥

శ్లో॥ నానారూపవతీ బోధే సుప్తౌ లీనాతి చంచలా।
యతో దృగేకరూప స్త్వం పృథక్ తస్య ప్రకాశకః॥

శ్లో॥ సుప్తౌ దేహద్యభావేఽపి సాక్షీ తేషాం భవాన్ యతః।
స్వానుభూతిస్వరూపత్వాత్ నాన్య స్తస్యాస్తి భాసకః॥

శ్లో॥ ప్రమాణం బోధయంతం తం బోధం మానేన యే జనాః।
బుభుత్సంతే త ఏధోభి ర్దగ్ధుం వాంఛంతి పావకమ్॥

తా॥ క్షుత్పిపాసార్దితుడగు ప్రాణి 'నా ప్రాణము ఆకలి దప్పులతో పీడింపబడినది' అని చెప్పుటచేత ఆత్మ ప్రాణము కంటె భిన్న మను జ్ఞానము కలుగు చున్నది. ఘటమును చూచువాడు ఘటము కంటె భిన్నుడయినరీతిగానే, దృశ్య మగు ప్రాణము కంటె ద్రష్ట యగు ఆత్మ భిన్నమైనది.

ఓ ద్విజుడా! బుద్ధి సుషుప్తిదశలో లీనమగును. జాగ్రదవస్థలో ఆ బుద్ధి మరల చేతనచ్ఛాయాసంబద్ధమై శరీరము నందంతటా అభివ్యాప్తమై యుండును. అట్టి బుద్ధి కూడా నీవు కావని తెలిసికొనుము.

సుషుప్తికాలమున ఆ బుద్ధి అనేక రూపములను ధరించుచు చంచలస్వభావముతో కారణశరీరమున లీనమై ఉండును. దృక్స్వరూపుడవైన నీవు అట్టి బుద్ధిని ప్రకాశింప చేయువాడవు. నీవు బుద్ధి కంటె భిన్నుడవై యొప్పుచుందువు. కాన, ఆత్మ కంటె బుద్ధి భిన్న మని గ్రహింపుము.

సుషుప్తిదశలో దేహేంద్రియ మనఃప్రాణాదులకు అభావము సంఘటిల్లును. అయినను, ద్రష్ట యగు నీవు కేవల సాక్షిభూతుడవై వర్తిలుచుందువు. అందుచేత నీవు ఆత్మానుభూతిస్వరూపుడవు. నీ కంటె తద్భాసకుడు మరియొకడు ఎవరుండును? దేహాదులకంటె భిన్నమై, వాటిని భాసింప జేయగలది ఆత్మయే యని గుర్తెరుంగనగును.

జ్ఞానమే ప్రమాణమును అవబోధిత మొనర్చుచున్నది. అట్టి బోధను-జ్ఞానమును-ప్రమాణముచేత ఎవరు తెలిసికొన గోరుదురో వారు కాష్ఠముతో అగ్నిని దహించుటకు ప్రయత్నము చేయునటువంటివారే యగుదురు.

శ్లో॥ విశ్వ మాత్మాఒనుభవతి తేనాసౌ నానుభూయతే।
విశ్వం ప్రకాశయ త్యాత్మా తేనాసౌ న ప్రకాశ్యతే॥

శ్లో॥ ఈదృశం తాదృశం నైతత్ న పరోక్షం సదేవ యత్।
తద్బ్రహ్మ త్వం న దేహాదిదృశ్యరూపోఽసి సర్వదృక్॥

శ్లో॥ ఇద న్తైనైవ యద్భాతి సర్వం తచ్చ విషిధ్యతే।
అవాచ్యత త్త్వ మనిదం న వేద్యం స్వప్రకాశతః॥

శ్లో॥ సత్యం జ్ఞాన మనంతం చ బ్రహ్మలక్షణ ముచ్యతే।
సత్యత్వాత్ జ్ఞానరూపత్వా దనంతత్వాత్ త్వమేవ హి॥

తా॥ ఆత్మకు విశ్వము అనుభూయమాన మగుచున్నది గాని, విశ్వముచే ఆత్మ అనుభవింపబడుటలేదు. ఆత్మయే విశ్వ ప్రకాశకము గాని, విశ్వము ఆత్మభాసకము గాదు.

బ్రహ్మ అనిర్వచనీయము. 'ఇట్టిది, అట్టిది' అని చెప్ప వీలు లేనిది; ఆ బ్రహ్మపదార్థము అపరోక్షమైనది; సత్స్వ రూపమే అది. తాదృశమైన బ్రహ్మవు నీవే; దేహాదిదృశ్య స్వరూపుడవు కావు. నీవు సర్వద్రష్టవు.

ఇదంతారూపమున (ఇది అది యను రూపములో) భాసించున దంతయు నిషేధింపబడుచున్నది. బ్రహ్మతత్త్వము అవాఙ్మానసగోచరము. అది వాక్కుచే వర్ణింపబడునది కాదు; ఇదం (ఇది) శబ్దముచే నభిహిత మగునది కాదు; స్వప్రకాశ స్వరూప మగుటచే బుద్ధివేద్యము గాదు.

"సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ" యని శ్రుతి బ్రహ్మ లక్షణమును చెప్పుచున్నది. సత్యత్వము, జ్ఞానరూపత్వము, అనంతత్వము-అను ఈ లక్షణముల వలన నీవే ఆ బ్రహ్మవు అని గ్రహింప నగును.

శ్లో॥ ఇతి దేహాద్యుపాధౌ స్యాత్ జీవ స్తస్య నియామకః।
ఈశ్వరః శక్త్యుపాధిత్వాత్ ద్వయో ర్బోధే స్వయంప్రభా॥

శ్లో॥ అపేక్షతేఽఖిలై ర్మానైః న య న్మాన మపేక్షతే।
వేదవాక్యం ప్రమాణం తద్బ్రహ్మతావగతౌ మతమ్॥

శ్లో॥ అతో హి తత్త్వమస్యాది వేదవాక్య ప్రమాణతః।
బ్రహ్మణోఽస్తి యయా యుక్త్యా సాఽస్మాభిః పరికీర్త్యతే॥

శ్లో॥ శోధితే త్వంపదార్థే హి తత్త్వమస్యాదిచింతితమ్।
సంభవే న్నాన్యథా తస్మా చ్ఛోధనం కృత మాదితః॥

శ్లో॥ దేహేంద్రియాదిధర్మాన్ యః స్వాత్మ న్యారోపయన్ మృషా।
కర్తృత్వా ద్యభిమానీ చ వాచ్యార్థః త్వంపదస్య సః॥

తా॥ దేహోపాధ్యవచ్ఛిన్నమగు బ్రహ్మ జీవశబ్దవాచ్యుడై తత్తదుపాధినియామకు డగుచున్నాడు; ఆ బ్రహ్మపదార్థమే శక్త్యుపాధ్యవచ్ఛిన్న మైనపుడు ఈశ్వరసంజ్ఞచే నొప్పుచుండును. ఉపాధులు రెండును తొలగిపోయి బోధ కలిగినప్పుడు స్వయంప్రకాశకము, శుద్ధమునగు బ్రహ్మ మొక్కటే మిగులును.

సకల ప్రమాణములును శ్రుతి నపేక్షించుచుండును; ఆశ్రుతికి ఏ ప్రమాణము యొక్క అపేక్ష లేదు. తాదృశ శ్రుతివచనమే బ్రహ్మావగతికి అభిప్రేతము, ప్రమాణభూతము నైనది.

కాన తత్త్వమస్యాది మహావాక్య ప్రమాణముల వలన బ్రహ్మాస్తిత్వమును, బ్రహ్మాసత్యత్వమును శ్రుతి ఏయుక్తితో ఉపదేశించినదో ఆ యుక్తినే ఈ ప్రసంగమున మేమును చెప్పుచున్నాము.

త్వంపదార్థము శోధితమై, సునిశ్చిత మైనప్పుడే, తత్త్వమస్యాది మహావాక్యచింతనము సంభవమగును; మరొకరీతిగా అసంభవము. కాన మొదట త్వంపదార్థశోధనము చేయుచున్నాము.

శరీరేంద్రియాది ధర్మములన్నియు మిథ్యాభూతములు. మృషాకల్పితములైన ఆ ధర్మములను ఎవడు ఆత్మయందు ఆరోపించుకొనుచు, కర్తృత్వ, భోక్తృత్వాదులయందు అభిమానము కలిగి యుండునో అతడే 'త్వః పదమునకు వాచ్యార్థమయినవాడు.

శ్లో॥ దేహేంద్రియాదిసాక్షీ య స్తేభ్యో భాతి విలక్షణః।
స్వయంబోధస్వరూపత్వాత్ లక్ష్యార్థ స్త్వంపదస్య సః॥

శ్లో॥ వేదాన్తవాక్యసంవేద్యవిశ్వాతీతాక్షరద్వయమ్।
విశుద్ధం యత్ స్వసంవేద్యం లక్ష్యార్థ స్తత్పదశ్య సః॥

శ్లో॥ సామానాధికరణ్యం హి పదయో స్తత్త్వయో ర్ద్వయోః।
సంబంధ స్తేన వేదాంతైః బ్రహ్మైక్యం ప్రతిపాద్యతే॥

శ్లో॥ భిన్నప్రవృత్తిహేతుత్వే పదయో రేకవస్తుని।
వృత్తిత్వం య త్తదేవైక్యం విభక్త్యంతకయో స్తయోః॥

శ్లో॥ సామానాధికరణ్యం తత్సంప్రదాయిభి రీరితమ్।
తథా పదార్థయోరేవ విశేషణవిశేష్యతా॥

తా॥ దేహేంద్రియాదులకు సాక్షిభూతుడై తద్విలక్షణుడును, స్వయంబోధస్వరూపుడు నయిన ఆత్మయే 'త్వం' పదమునకు లక్ష్యార్థ మయినవాడు.

వేదాంతమహావాక్యములచే సంవేద్యుడును, విశ్వాతీతుడును, అవినాశియు, అద్వయుడును, శుద్ధమును, స్వయంప్రకాశస్వరూపుడు నయిన ఏ ఆత్మ గలడో అతడే 'తత్' పదమునకు లక్ష్యార్థభూతుడు.

'తత్, త్వం'-ఈ రెండు పదములకు గల సంబంధమునకు సామానాధికరణ్యము చెప్పబడుటచేత ఉపనిషద్వాక్యములు జీవ-బ్రహ్మలకు ఐక్యమును ప్రతిపాదించు చున్నవి.

భిన్నరూపములు గలవయ్యు, సమానవిభక్తికములును, ఏకార్థప్రతిపాదకము లయిన రెండు పదముల సంబంధమునకు సంప్రదాయాభిజ్ఞులు సామానాధికరణ్యము చెప్పుదురు. ఆపదములయొక్క అర్థమునకే విశేషణ-విశేష్యతారూపసంబంధము చెప్పనగును.

శ్లో॥ అయం సః సోఽయ మితివత్ సంబంధో భవతి ద్వయోః।
ప్రత్యక్త్వం సద్వితీయత్వం పరోక్షత్వం చ పూర్ణతా॥

శ్లో॥ పరస్పర విరుద్ధం స్యాత్ తతో భవతి లక్షణా।
లక్ష్యలక్షణసంబంధః పదార్థప్రత్యగాత్మనోః॥

శ్లో॥ మానాంత రోపరాధాచ్చ ముఖ్యార్థ స్యాపరిగ్రహే।
ముఖ్యార్థ స్యావినాభూతే ప్రవృత్తి ర్లక్షణోచ్యతే॥

శ్లో॥ త్రివిధా లక్షణా జ్ఞేయా జహ త్యజహతీ తథా।
అన్యోభయాత్మికా జ్ఞేయా తత్రాద్యా నైవ సంభవేత్॥

తా॥ 'అయం సః'-వీడేవాడు, 'సః అయం'- వాడేవీడు అను స్థలములో ఒకదానికి ఒకటి విశేషణ-విశేష్యసంబంధముతో నుండును. అదేరీతిగా 'తత్ త్వం' అను పదములుకూడ ఒక దానికి మరొకటి విశేషణ విశేష్యసంబంధముతో నొప్పారు చుండును. కాని, 'తత్, త్వం' పదములకు గల ప్రత్యక్త్వ, సద్వితీయత్వ, పరోక్షత్వ, పూర్ణత్వములు పరస్పర విరుద్ధ ధర్మములు గలవి. కనుక, ఈ పదముల యొక్క అర్థనిర్ణయము నకై లక్షణను గ్రహింపవలెను. దీనిచే ప్రతిపాద్యవస్తువు నకును, ప్రత్యగాత్మకును లక్ష్యలక్షణసంబంధ మేర్పడును.

ప్రమాణాంతరావరోధమువలన ముఖ్యార్థము బాధిత మయినప్పుడు ముఖ్యార్థము యొక్క అవినాభావసంబంధమే లక్షణయనబడును.

లక్షణ 'జహత్ అజహత్ జహదజహత్' అని మూడు విధములు. ప్రస్తుతప్రసంగమున జహల్లక్షణ సంభ వించదు.

శ్లో॥ వాచ్యార్థ మఖిలం త్యక్త్వా వృత్తిః స్యాత్ యా తదన్వితే।
గంగాయాం ఘోష ఇతివత్ జహతీ లక్షణా హి సా॥

శ్లో॥ వాచ్యార్థ స్యైకదేశస్య ప్రకృతే త్యాగ ఇష్యతే।
జహతి సంభవే న్నైవ సంప్రదాయవిరోధతః॥

శ్లో॥ వాచ్యార్థ మపరిత్యజ్య వృత్తి రన్యార్థకే తు యా।
కథితేయ మజహతీ శోణోఽయం ధావతీతివత్॥

శ్లో॥ న సంభవతి సోఽప్యత్ర వాచ్యార్థోఽతివిరోధతః।
విరోధాంశపరిత్యాగో దృశ్యతే ప్రకృతే యథా॥

వాచ్యార్థము నంతటిని పరిత్యజించు వృత్తి ఏదైతే గలదో దానిని జహల్లక్షణ యందురు. 'గంగాయాం ఘోషః'-గంగలో గొల్లపల్లె-అను ప్రయోగము దీనికి ఉదాహరణము. గంగలో గొల్లపల్లె యుండుట అసంభవముగాన, లక్షణచే గంగాతీరము గ్రహింప నగును. 'తత్త్వమసి' అను స్థలమున జహల్లక్షణ కుదుర నేరదు.

'వాచ్యార్థముయొక్క ఏకదేశత్యాగము జహల్లక్షణ' యనునది సంప్రదాయవిరుద్ధము గాన, జహల్లక్షణ ప్రకృత విషయములో సంభవింపదు.

వాచ్యార్థపరిత్యాగము చేయకయే అన్యార్థక మగు వృత్తిని ఆశ్రయించుట అజహల్లక్షణ యని అందురు. 'శోణో ధావతి'-ఎఱ్ఱని గుఱ్ఱము పరుగిడు చున్నది. 'శోణ' శబ్దముయొక్క వాచ్యార్థమైన ఎఱ్ఱదనను పరిత్యజింపకయే అజహలక్షణచే ఎఱ్ఱ గుఱ్ఱము పరుగిడుచున్న దను అర్థము చెప్పికొన నగును. ఎఱ్ఱదనము పరుగిడుట అసంభవము.

ప్రకృతస్థలమున 'తత్త్వమసి' యను పట్ల, విరోధాంశ పరిత్యాగరూపమైన అజహల్లక్షణ చెప్ప నొప్పదు. 'తత్, త్వం' అను రెండు పదముల వాచ్యార్థము అత్యంతవిరుద్ధముగ నుండుటచే ఇట ఇది కుదరదు.

శ్లో॥ వాచ్యార్థ స్యైకదేశం చ పరిత్యజ్య ఏకదేశకమ్।
యా బోధయతి సా జ్ఞేయా తృతీయా భాగలక్షణా॥

శ్లో॥ సోఽయం విప్ర ఇదం వాక్యం బోధయ త్యాదిత స్తథా।
తత్కాలత్వవిశిష్టం చ తథైతత్ కాలసంయుతమ్॥

శ్లో॥ అత స్తయో ర్విరుద్ధం తత్తత్ కాలత్వాదిధర్మకమ్॥।
త్యక్త్వా వాక్యం యథా విప్రపిండం బోధయ తీరితమ్॥

శ్లో॥ తథైవ ప్రకృతే తత్త్వమసీత్యత్ర శ్రుతౌ శృణు।
ప్రత్యక్త్వాదీన్ పరిత్యజ్య జీవధర్మాన్ త్వమఃపదాత్॥

శ్లో॥ సర్వజ్ఞత్వపరోక్షాదీన్ పరిత్యజ్య తతః పదాత్।
శుద్ధం కూటస్థ మద్వైతం బోధయ త్యాదరాత్ పరమ్॥

వాచ్యార్థము యొక్క ఏకదేశమును పరిత్యజించి మరియొక భాగమును ఏది బోధించునో, దానిని మూడవదగు జహదజహల్లక్షణ యందురు.

'సోఽయం విప్రః'-'ఆ బ్రాహ్మణుడే యితడు'-అను స్థలమున జహదజహల్లక్షణ చెప్పనగును. 'సః' అను పదము పూర్వకాల వైశిష్ట్యమును, 'అయం' అను పదము ఏతత్కాలవైశిష్ట్యమును తెలుపును. నేను పూర్వకాలమందు చూచినవానినే ఈ కాలమున చూచుచున్నాను.

కనుక, 'సోఽయం విప్రః' అను వాక్యము విరుద్ధధర్మకము లయిన ఆ యా కాలములను పరిత్యజించి విప్రవ్యక్తినే బోధించుచున్నది.

అదే విధముగా, ప్రకృతమున, తత్త్వమసి' యను శ్రుతివిషయములో భాగలక్షణ యగు జహదజహల్లక్షణయా అర్థము చెప్పనగును. 'త్వం' అను పదమునకు జీవధర్మములగు ప్రత్యక్త్వాదులను పరిత్యజించియు, 'తత్' అను పదమునకు సర్వజ్ఞత్వ, పరోక్షత్వాది ధర్మములను పరిత్యజించియు శ్రుతి సాదరముగ శుద్ధము, కూటస్థము నగు అద్వయాత్మనే ప్రతిపాదించుచున్నది.

శ్లో॥ తత్త్వమయోః పదయో రైక్యమేవ తత్త్వమసీ త్యలమ్।
ఇత్థమైక్యావబోధేన సమ్యక్ జ్ఞానం దృఢం నయైః॥

శ్లో॥ అహం బ్రహ్మేతి విజ్ఞానం యస్య శోకం తర త్యసౌ।
ఆత్మా ప్రకాశమానోఽపి మహావాక్యై స్తథై రతా॥

శ్లో॥ తత్త్వయో ర్బోధ్యతేఽథాపి పౌర్వాపర్యానుసారతః।
తథాపి శక్యతే నైవ శ్రీగురోః కరుణాం వినా॥

శ్లో॥ అపరోక్షయితుం లోకా మూఢైః పండితమానిభిః,
అంతఃకరణసంశుద్ధౌ స్వయం జ్ఞానం ప్రకాశతే॥

శ్లో॥ వేదవాక్యై రతః కిం స్యా ద్గురుణేతి న సాంప్రతమ్।
ఆచార్యవాన్ పురుషో హి వేదేత్యేవం శ్రుతి ర్జగౌ॥

'తత్, త్వం' పదముల ఐక్యమునే 'తత్త్వమసి, యను శ్రుతి ప్రతిపాదించుచున్నది. ఈ రీతిగా, ఐక్యావబోధమును పొందిన తర్వాత యుక్తులచేత జ్ఞానము దృఢ మగును.

'తరతి శోకమాత్మవిత్' శ్రుతియొక్క ఆదేశాను సారము, 'అహంబ్రహ్మాస్మి, అను జ్ఞానము ఎవడు పొందునో అతడు శోకమును తరించును. ఆత్మస్వయంప్రకాశ మయ్యును ఉపనిషన్మహావాక్యములచేత పౌర్వాపర్యము ననుసరించి 'తత్,త్వం' పదములకు ఐక్యము బోధింపబడినది. అయినను, శ్రీగురువు యొక్క కరుణాకటాక్షము లేనిదే పండితమ్మన్యులును,అహంకారవిమూఢచిత్తులు నగువారికి అపరోక్షాత్మానుభవము కలుగనేరదు. దురితక్షయమై అంతఃకరణము పరిశుద్ధ మైనతర్వాత జ్ఞానము స్వయంగా భాసించును.

'వేదవాక్యముల వలననే జ్ఞానోపలబ్ధి యగును; గురువు వలన ప్రయోజన మేమి? యని భావింపరాదు. ఏలనన, 'ఆచార్యవాన్ పురుషో వేద' - "ఆచార్యుడుగల వ్యక్తియే తెలిసికొనును"- అని శ్రుతి యుద్బోధించుచున్నది.

శ్లో॥ అనాదా విహసంసారే బోధకో గురురేవ హి।
అతో బ్రహ్మాత్మవస్త్వైక్యం జ్ఞాత్వా దృశ్య మసత్తయా॥

శ్లో॥ అద్వైతే బ్రహ్మణి స్థేయం ప్రత్యగ్బ్రహ్మాత్మనా సదా।
తత్ప్రత్యక్షాత్ పరిజ్ఞాత మద్వైతబ్రహ్మ చిద్ఘనమ్॥

శ్లో॥ ప్రతిపాద్యం తదేవాత్ర వేదాంతైః న ద్వయం జడమ్।
సుఖరూపం చిద్ అద్వైతం దుఃఖరూప మసద్ జడమ్॥

శ్లో॥ వేదాంతై స్తద్ద్వయం సమ్యక్ నిర్ణీతం వస్తుతో నయాత్।
అద్వైత మేవ సత్యం త్వం విద్ధి ద్వైత మసత్ సదా॥

శ్లో॥ శుద్ధే కథ మశుద్ధః స్యా ద్దృశ్యం మాయామయం తతః।
శుక్తౌ రూప్యం మృషా యద్వత్ తథా విశ్వం పరాత్మని॥

తా॥ అనాదియగు ఈసంసారమున బోధింప సమర్థుడైనవాడు గురువొక్కడే. కావున, గురువు వలన జీవబ్రహ్మైక్యజ్ఞానము ను తెలిసికొని, దృశ్యము నంతయు మిథ్యారూపముగా భావించి, ప్రత్యగ్బ్రహ్మాత్మతో నిరంతరము అద్వైతబ్రహ్మ యందు నెలకొనియుండవలెను. అపరోక్ష ఆత్మసాక్షాత్కారమునందు చిదేకఘనమైన బ్రహ్మవస్తువు అవగత మగును.

అద్వయబ్రహ్మనే సర్వవేదాంతములు ప్రతిపాదించుచున్నవి; ద్వైతము, జడము నగుదానిని ఉపదేశించుటలేదు. చిద్ఘనమగు అద్వయబ్రహ్మ ఆనందస్వరూపము కాగా, మిథ్యారూపమైన జడజగత్తంతయు దుఃఖరూపము అని తెలియనగును.

వేదాన్తశాస్త్రములు చిత్స్వరూపమును, జడస్వరూపమును సయుక్తికముగా వివేచన మొనర్చి నిర్ణయించినవి. నీవు ఎల్లవేళల, అద్వైతమే సత్యమనియు, ద్వైతము మిథ్యాకల్పిత మనియు తెలిసికొని భావన చేయుము.

శుద్ధమగు వస్తువునందు అశుద్ధమగు పదార్థ మెట్లుండును. కాన, దృశ్యమగు ఈ జగత్తంతయు మాయామయము. శుక్తి యందు మిథ్యాకల్పిత రజతము భాసించి

నట్లు పరమాత్మయందు మృషాకల్పితమైన ఈ విశ్వము అవభాసించుచున్నది.

శ్లో॥ విద్యతే న స్వతః సత్త్వం నాసతః సత్త్వ మస్తి వా।
బాధ్యత్వాత్ నైవ సద్వైతం నాసత్ ప్రత్యక్షభానతః॥

శ్లో॥ సదసన్న విరుద్ధత్వా దతోఽనిర్వాచ్య మేవ తత్।
యః పూర్వం ఏక ఏవాసీత్ సృష్ట్వా పశ్చా దిదం జగత్॥

శ్లో॥ ప్రవిష్టో జీవరూపేణ స ఏవాత్మా భవాన్ పరః
సచ్చిదానంద ఏవ త్వం విస్మృత్యాత్మతయా పరమ్॥

శ్లో॥ జీవభావ మనుప్రాప్తః స ఏవాత్మాఽసి బోధతః।
అద్వయానందచిన్మాత్రః శుద్ధః సామ్రాజ్య మాగతః॥

శ్లో॥ కర్తృత్వాదీని యాన్యాసం స్త్వయి బ్రహ్మాద్వయే పరే।
తానీదానీం విచార్య త్వం కిం స్వరూపాణి వస్తుతః॥

తా॥ సహజముగానే ఈ జగమునకు నైజమగు సత్త్వము లేదు. అసద్వస్తువునకు సత్త్వము ఎట్లు ఘటిల్లును? బాధిత మగుచుండుట వలన ద్వైతము సత్యము కాదు. ప్రత్యక్ష గోచర మగుట వలన ద్వైతము కుందేటికొమ్ము వలె అసత్తును గాదు.

ప్రపంచకము సదసత్తునుగాదు. ఏలయన, ఆ సదసత్తులు విరుద్ధధర్మములుగలవి. కాన, ఈ జగత్తు అనిర్వాచ్య మని చెప్పవలయును. 'తత్సృష్ట్వా తదేవాను ప్రావిశత్' అను శ్రుత్యనుసారము ఏ పరమాత్మ పూర్వము ఒకే ఒకడై

యుండెనో, అతడే పిమ్మట ఈ విశ్వమును సృజించి, తాను జీవరూపమున అందు ప్రవేశించెను. నీవు ఆ పరమాత్మవే యని తెలిసికొనుము. నీవా సచ్చిదానందస్వరూపుడవే; కాని దీనినిపూర్తిగా విస్మరించి జీవభావమును పొందితివి. జ్ఞానోపలబ్ధి వలన నీవు అద్వయానంద చిన్మాత్రుడును, శుద్ధుడును, బ్రహ్మానందసామ్రాజ్యము నధిష్ఠించిన పరమాత్మవు నగుదువు.

అద్వయ పరబ్రహ్మస్వరూపుడవైన నీయందు జీవభావముచే సంక్రమించిన కర్తృత్వ, భోక్తృత్వాది ధర్మము లెవిగలవో వాస్తవమునకు, వాని స్వరూపము ఏమో, చక్కగా విచారించిచూడుము.

శ్లో॥ అత్రైవ శ్రుణు వృత్తాంత మపూర్వం శ్రుతిభాషితమ్।
కశ్చిత్ గాంధారదేశీయో మహారత్నవిభూషితః॥

శ్లో॥ సగృహే స్వాంగణే సుప్తః ప్రమత్తస్సన్ కదాచన।
రాత్రౌ చౌర స్సమాగత్య భూషణానాం ప్రలోభతః॥

శ్లో॥ బద్ధ్వా దేశాంతరం చౌరై ర్నీత స్సన్ గహనే వనే।
భూషణా న్యపహృత్యాపి బద్ధాక్షకరపాదకః॥

శ్లో॥ నిక్షిప్తో విపినేఽతీవ కుశ కంటక వృశ్చికైః।
వ్యాల వ్యాఘ్రాదిభిశ్చైవ సంకులే తరుసంకటే॥

శ్లో॥ వ్యాలాదిదుష్టసత్త్వేభ్యో మహారణ్యే భయాతురః।
శిలాకంటక దర్భాద్యైః దేహస్య ప్రతికూలకైః॥

శ్లో॥ క్రియమాణే విలుఠనే విశీర్ణాంగోఽసమర్థకః।
క్షుత్తృషాఽఽతప వాత్యాగ్న్యాదిభి స్తప్తోఽతితాపకైః॥

శ్లో॥ బంధముక్తౌ తథా దేశప్రాప్త్యావేన సుదుఃఖధీః।
దదృశే కంచి దాక్రోశన్ నైకం తత్రైవ తన్నివాస్॥

ఈ సందర్భమున శ్రుతి వర్ణించి చెప్పిన అపూర్వ వృత్తాంతము నొకదానిని చెప్పెదను; వినుము. 'గాంధారదేశ వాసి యగు నొకడు వివిధరత్నాభరణముల నలంకరించికొని, తన గృహప్రాంగణమున ఒడలు మరచి నిద్రించుచుండెను. రాత్రిసమయమున దొంగలు వచ్చి ఆభరణము లందలి ప్రలోభముచే వానిని బంధించి, దేశాంతరమునకు గొనిపోయిరి. వానియాభరణముల నపహరించి, వానికండ్లను, కాలు-సేతులను బంధించి కుశకంటకాకీర్ణము, సర్ప, వృశ్చిక, వ్యాఘ్రాది సంకులము తరుసంకటము నగు నిబిడారణ్యమధ్యమున బారవైచిపోయిరి. అతడు, ఆ యరణ్యమున సర్ప, వ్యాఘ్రాది దుష్టప్రాణులవలన భయాతురుడై శరీర బాధాహేతువులైన శిలా, కంటక, దర్భాదులపై శయనించుటచే, విశీర్ణాంగుడై, బలహీనుడయ్యెను. అత్యంత తాపహేతువులైన క్షుత్పిపాసలతోను, ఎండ, గాలి, అగ్ని మున్నగువానిచేతను బాధనొందుచుండెను. అతడు బంధవిముక్తుడై స్వదేశమునకు పోవునిచ్ఛతో అత్యంతము దుఃఖించుచున్నవాడై ఉచ్చైస్వరమున ఆక్రోశింపసాగెను. కాని, అతని రోదనము వినువా రెవరును అచట లేకపోయిరి.

శ్లో॥ తథా రాగాదిభి ర్వైరైః శత్రుభిః దుఃఖదాయిభిః।
చోరైః దేహాభిమానాద్యైః స్వానంద ధనహారిభిః॥

శ్లో॥ బ్రహ్మానందప్రమత్తః స్వాజ్ఞాననిద్రావశీకృతః।
బద్ధ స్త్వం బంధనై ర్భోగతృష్ణాజ్వరాదిభి ర్దృఢమ్॥

శ్లో॥ అద్వయానందరూపాత్ త్వాం ప్రచ్యావ్యాతీవ ధూర్తకైః।
దూరానీతోఽసి దేహేషు సంసారారణ్యభూమిషు॥

శ్లో॥ సర్వదుఃఖనిదానేషు శరీరాదిత్రయేషు చ।
నానాయోనిషు కరాంధవాసనానిర్మితాసు చ॥

శ్లో॥ ప్రవేశితోఽసి సృష్టోఽసి బద్ధః స్వానందదృష్టితః।
అనాదికాల మారభ్య దుఃఖం చానుభవన్ సదా॥

శ్లో॥ జన్మ-మృత్యు-జరాదోష-నరకాది పరంపరామ్।
నిరంతరం విషణ్ణోఽనుభవన్ అత్యంతశోకవాన్॥

శ్లో॥ అవిద్యాభూతబంధస్య నివృత్తౌ దుఃఖదస్య చ।
స్వరూపానందసంప్రాప్తౌ సత్త్వోపాయం న లబ్ధవాన్॥

అదేవిధముగా, దుఃఖకారకులైన రాగ, ద్వేషాది శత్రువర్గముచేతను, దేహాభిమానాది చోరులచేతను నీ ఆత్మానంద మపహరింపబడినది. నైజమగు అజ్ఞాననిద్రకు వశీభూతుడవై బ్రహ్మానంద విషయములో ప్రమత్తుడవైతివి. భోగ తృష్ణ, జ్వరాది బంధనములచే దృఢముగా బంధింపబడితివి. నిన్ను, అద్వయానందరూపమునుండి పతితునిజేసి, రాగద్వేషాదులు, సంసార మను మహారణ్యభూములకు, దేహ మను దూరప్రాంతమునకు తీసుకొనివచ్చినవి. స్థూల, సూక్ష్మ,

కారణశరీరములు సర్వదుఃఖములకు ఆకరములు. ఈశరీర త్రయమునందును, పూర్వజన్మకృత కర్మలననుసరించియు, సంస్కారవిశేషము ననుసరించియు నిర్మింపబడిన నానాయోనులందును, నీవు ప్రవేశించినవాడవైతివి. ఆనందలోభముచే బద్ధుడవై నిన్ను నీవు స్మృష్టమొనర్చుకొంటివి. అనాదినుండియు సర్వదా, దుఃఖముల ననుభవించుచు, జన్మ, మృత్యు, జరా, నరకాది పరంపరను నిరంతరముపొందుచు విషణ్ణుడవై అత్యంతము శోక మనుభవించుచున్నావు. దుఃఖప్రదమగు అవిద్యాబంధముయొక్క నివృత్తికి, స్వరూపానందప్రాప్తికిని తగు ఉపాయమును తెలిసికొనజాలకపోతివి.

శ్లో॥ యథా గాంధారదేశీయః చిరందైవా ద్దయాలుభిః।
కైశ్చిత్ పాంథైః పరిప్రాప్తైః ముక్తదృష్ట్యాదిబంధనః॥

శ్లో॥ స స్వపై రుపదిష్టశ్చ పండితో నిశ్చితాత్మకః।
గ్రామా ద్గ్రామాంతరం గచ్ఛన్ మేధావీ మార్గతత్పరః॥

శ్లో॥ గత్వా గాంధారదేశం సస్వగృహం ప్రాప్య పూర్వవత్।
బాంధవైస్సంపరిష్వక్తః సుఖీ భూత్వా స్థితోఽభవత్॥

శ్లో॥ త్వమప్యేవ మనేకేషు దుఃఖదాయిషు జన్మసు।
భ్రాంతో దైవా చ్ఛుభే మార్గే జాతశ్రద్ధః సుకర్మకృత్॥

శ్లో॥ వర్ణాశ్రమాచారపరోఽవాప్తపుణ్యామహోదయః।
ఈశ్వరానుగ్రహాల్లబ్ధో బ్రహ్మవిద్గురుసత్తమః॥

శ్లో॥ విధివత్ కృతసన్న్యాసో వివేకాదియుత స్సుధీః।
ప్రాప్తో బ్రహ్మోపదేశోఽద్య వైరాగ్యాభ్యాసతః పరమ్॥

శ్లో॥ పండిత స్తత్ర మేధావీ యుక్త్యా వస్తు విచారయన్।
నిదిధ్యాసనసంపన్నః ప్రాప్తో హి త్వం పరం పదమ్॥

ఆ గాంధారదేశవాసి చిరకాలము ఆ యరణ్యమున పడియుండెను. అదృష్టవశమున కొందరు దయాశీలురగు పాంథు లా మార్గమున బోవుచు వానిని జూచి బంధవిముక్తుని గావించిరి. స్వస్థచిత్తులగు ఆ పాంథులచే ఉపదేశింపబడి పండితుడు, మేధావి, నిశ్చితమతి, మార్గతత్పరుడు నగుచు, ఒక గ్రామమునుండి మరి యొక గ్రామమునకు ప్రయాణము చేయుచు, గాంధారదేశము నందలి స్వగృహమునకు చేరెను. అట్లు చేరి పూర్వము వలెనె బంధుజనసమాయుక్తుడై సుఖముగా నుండెను. ఆ రీతిగానే, నీవును దుఃఖప్రదములగు అనేక జన్మ లందుచు, భ్రాంతుడవై యుంటివి. దైవానుకూల్యముచే సన్మార్గము నందు శ్రద్ధామతివై, వైదిక కర్మానుష్ఠానము చేసియు, వర్ణాశ్రమాచార నిష్ఠుడవై, పుణ్యసంపాదన మొనరించి మహోన్నతి నందితివి. అంత ఈశ్వరానుగ్రహము వలన వైదికవిధానముగా సంన్యసించిన వాడును, నిత్యానిత్యవస్తువివేకము గలవాడును, బుద్ధిమంతుడును, బ్రహ్మవేత్తయు నగు గురువును జేరితివి. ఆ గురువు వలన నేడు బ్రహ్మోపదేశము నందితివి. అత్యంతము వైరాగ్యమును సాధన చేయుట వలన, పండితుడవు, మేధావి, యుక్తిసహముగ బ్రహ్మవస్తు విచారము సల్పినవాడవగుచు నిదిధ్యాససంపన్నుడవై పరమపదమునుపొందినవాడవైతివి.

శ్లో॥ అతో బ్రహ్మాత్మవిజ్ఞాన ముపదిష్టం యథావిధిః।
మయాఽఽచార్యేణ తే ధీర! సమ్యక్ తత్ర
ప్రయత్నవాన్॥

శ్లో॥ భూత్వా విముక్తబంధ స్త్వం భిన్నద్వైతాత్మసంశయః।
నిర్ద్వంద్వో నిస్పృహో భూత్వా విచరస్వ యథాసుఖమ్॥

శ్లో॥ వస్తుతో నిష్ప్రపంచోఽసి నిత్యముక్తః స్వభావతః।
న తే బంధవిమోక్షౌ స్తః కల్పితౌ తే యత స్త్వయి॥

శ్లో॥ న నిరోధో నచోత్పత్తిః న బద్ధో న చ సాధకః।
న ముముక్షుః న వై ముక్త ఇత్యేషా పరమార్థతా॥

శ్లో॥ శ్రుతిసిద్ధాంతసారోఽయం తథైవ త్వం స్వయా ధియా।
సంవిచార్య విదిధ్యాస్య నిర్విజానందాత్మకం పరమ్॥

శ్లో॥ సాక్షాత్కృత్వాఽపరిచ్ఛిన్నాద్వైతబ్రహ్మాక్షరం స్వయమ్।
జీవన్నేవ వినిర్ముక్తో విశ్రాంత శ్శాంతి మాశ్రయ॥

తా॥ కనుక, యథాశాస్త్రముగ బ్రహ్మాత్మవిజ్ఞానము ఆచార్యుడనగు నాచే ఉపదేశింపబడినది; ఓధీరచిత్తుడా! నీవిక బ్రహ్మాత్మవిజ్ఞానవిషయమున ప్రయత్నశీలివై బంధముక్తుడవు కమ్ము. ద్వైతాత్మసంశయవిదూరుడవు కమ్ము. సుఖదుఃఖాది ద్వంద్వరహితుడవై నిష్కాముడవై సుఖముగ సంచరించుము.

యథార్థమునకు నీవు నిష్ప్రపంచుడవు; స్వాభావికముగ నీవు నిత్యముక్తుడవు; నీయందు కల్పితము లగుటంజేసి నీకు బంధము గాని, మోక్షముగాని, లేవు.

నిరోధములేదు, ఉత్పత్తి లేదు; బద్ధుడును లేడు; సాధకుడును లేడు: ముముక్షువును లేడు; ముక్తుడును లేడు. ఇదియే పరమార్థభూతమైన తత్త్వము.

ఇది ఉపనిషత్సిద్ధాంతసారము. నీవు స్వబుద్ధితో చక్కగా విచారించి ఉత్కృష్టమైన ఆత్మానందస్వరూపము యొక్క నిదిధ్యాసన మొనర్చి స్వయముగా అపరిచ్ఛిన్నము, అవినాశియు నగు అద్వైతబ్రహ్మానుభూతిని అపరోక్షముగా బొంది జీవన్ముక్తుడవై విశ్రాంతిని బొందుము; శాంతిని ఆశ్రయించుము.

శ్లో॥ విచారణీయా వేదాంతాః వందనీయో గురుస్సదా।
గురూణాం వచనం పథ్యం దర్శనం సేవనం నృణామ్॥

శ్లో॥ గురుర్బ్రహ్మ స్వయం సాక్షాత్ సేవ్యో వంద్యో ముముక్షుభిః।
నోద్వేజనీయ ఏవాయం కృతజ్ఞేన వివేకినా॥

శ్లో॥ యావదాయు స్త్వయా వంద్యో వేదాన్తో గురు రీశ్వరః।
మనసా కర్మణా వాచా శ్రుతి రేవైష నిశ్చయః॥

శ్లో॥ భావాద్వైతం సదా కుర్యాత్ క్రియాద్వైతం న కర్హిచిత్।
అద్వైతం త్రిషు లోకేషు నాద్వైతం గురుణా సహ॥

శ్లో॥ ఇత్యేవం బోధితో బ్రహ్మమృతబోధాత్మనా ద్విజః।
గురుణా భాష్యకారేణ మండనాఖ్య కవి ర్మహాన్॥

తా॥ సదా వేదాంతమహావాక్యములు విచారణీయములు; గురువు వందనీయుడు; మానవులకు గురువచనశ్రవణము, గురుదర్శనస్పర్శనాదులు హితకార్యము లని గ్రహింపుము.

గురువే సాక్షాద్బ్రహ్మ; ముముక్షుజనులకు గురువు వందనీయుడు, సేవనీయుడు, కృతజ్ఞుడు వివేకియు నయినవాడు ఎన్నడును గురువునకు ఉద్వేగము కలిగింపరాదు.

ఆయువున్నంతవరకు, మనసా, వాచా, కర్మణా పరమేశ్వరస్వరూపుడగు గురువు వందనీయుడు. ఇది, శ్రుతి సిద్ధాంతము.

హృదయమున సదా భావాద్వైతమును కలిగియుండుము; కర్మానుష్ఠానసమయమున అద్వైతబుద్ధి నుంచరాదు; ముల్లోకములందు ఎందైనను, అద్వైతభావమే గ్రహణీయ మగును కాని, గురువు యెడ అద్వైతభావము చూపజనదు.

ఈ విధముగా, బ్రహ్మామృతబోధస్వరూపుడును, భాష్యకర్తయు నగు ఆచార్యశంకరుడు బ్రాహ్మణుడును, పండితుడును, మహాత్ముడు నగు మండనమిశ్రునకు తత్త్వోపదేశము చేసెను.

ఈ సందర్భములో 'ధనాష్టకమ్' అను పేరుతో వేరొక ఉపదేశము కన్పట్టుచున్నది.

శ్లో॥ తద్ జ్ఞానం ప్రశమకరం య దింద్రియాణాం
తద్ జ్ఞేయం యదుపనిషత్ సునిశ్చితమ్।
తే ధన్యా భువి పరమార్థనిశ్చితేహాః
శేషాస్తు భ్రమనిలయే పరిభ్రమంతి॥

శ్లో॥ ఆదౌ విజిత్య విషయాన్ మదమోహరాగ
ద్వేషాదిశత్రుగణ మాహృతయోగరాజ్యాః।
జ్ఞాత్వా మతం సమనుభూయ పరాత్మవిద్యా
కాన్తాసుఖం వనగృహే విచరంతి ధన్యాః॥

శ్లో॥ త్యక్త్వా గృహే రతి మధోగతిహేతుభూతా
మాత్మేచ్ఛ యౌపనిషదర్థరసం పిబంన్తః।
వీతస్పృహా విషయభోగపదే విరక్తా
ధన్యా శ్చరంతి విజనేషు విరక్తసంగాః॥

తా॥ ఇంద్రియములను విషయసుఖములనుండి ప్రశమింప జేయునదే జ్ఞానము. ఉపనిషత్తులచే సునిశ్చితమైన అర్థమే-అద్వయతత్త్వమే-జ్ఞేయమగు విషయము. పరమార్థమైన బ్రహ్మతత్త్వమును నిర్ణయింప బూనుకొనువారే ధన్యజీవులు. మిగిలినవారందరు భ్రాంతి యను సుడిగుండమున బడి పరిభ్రమించువారే యగుదురు.

ఆ సుకృతాత్ములు మొదట విషయములను, మదము, మోహము, రాగము, ద్వేషము మున్నగు శత్రుగణమును నిర్జించి అభిమతవస్తువు నెరిగి, పరాత్మవిద్య యను కాంతా సుఖ మనుభవించుచు అరణ్యమున సంచరించు చుందురు.

వారు గృహమందు పతనహేతువైన విషయోపరాగ మును పరిత్యజించి, ఆత్మేచ్ఛతో ఉపనిషదర్థమగు బ్రహ్మానంద రసమును గ్రోలుచు నిస్సంగులై విషయభోగములందు విరా

గము కలవారై విజనప్రదేశములందు సంచరించుచున్నవారే ధన్యజీవనులు.

శ్లో॥ త్యక్త్వామమాహ మితి బంధకరే పదే ద్వే
మానావమానసదృశాః సమదర్శినశ్చ।
కర్తార మన్య మవగమ్య తదర్పితాని
కుర్వంతి కర్మపరిపాక ఫలాని ధన్యాః॥

శ్లో॥ త్యక్త్వైషణాత్రయ మవేక్షిత మోక్షమార్గా
భైక్ష్యామృతేన పరికల్పితదేహయాత్రాః।
జ్యోతిః పరాత్పరతరం పరమాత్మసంజ్ఞం
ధన్యా ద్విజా రహసి హృద్యవలోకయన్తి॥

శ్లో॥ నాసన్ న సన్ న సదసన్ న మహాన్ న చాణు
న స్త్రీ పుమాన్ న చ నపుంసకమేవ బీజమ్।
యై ర్బ్రహ్మ తత్సమనుపాసిత మేక చిత్తైః
ధన్యా విరేజు రితరే భవపాశ బద్ధాః॥

ధన్యజీవనులు 'మమ, అహం'-'నాది,నేను' అనునవి రెండును బంధహేతువులుగా భావించి పరిత్యజింతురు; మానావమానములను సమదృష్టితో వీక్షింతురు; అంతటా, బ్రహ్మనే దర్శించుచుందురు; ఈశ్వరునే కర్తగా భావించి; ఈశ్వరార్పణబుద్ధితో పురాకృత కర్మపరిణామ రూపము లైన కర్మల నాచరించుచుందురు.

వారు ఏషణాత్రయమును వదలి, మోక్షమార్గమును కనుగొని, భిక్షాటనముచే దేహయాత్రను సాగించుచు,

ఏకాంతప్రదేశములో స్థిరచిత్తులై హృత్పుండరీకమందు పరంజ్యోతిస్స్వరూపుడగు పరమాత్మను దర్శించుచుందురు.

ఆ పరతత్త్వము సత్తయు గాదు; అసత్తయు గాదు; సదసత్స్వరూపమును గాదు; అణుమహత్తులు రెండునుగాదు; స్త్రీ-పుం-నపుంసకమూర్తియును గాదు; అది సర్వకారణము; తాదృశబ్రహ్మవస్తువును ఎవరు ఏకాగ్రచిత్తముతో ఉపాసించుచుందురో వారు ధన్యజీవనులై విరాజిల్లుచుందురు. మిగిలినవారందరు భవపాశబద్ధులే యని గ్రహింపనగును.

శ్లో॥ అజ్ఞానపంకపరిమగ్న మపేతసారం
దుఃఖాలయం మరణజన్మజరావసక్తమ్।
సంసారబంధన మనిత్య మవేక్ష్య ధన్యా
జ్ఞానాసినా తదవశీర్య వినిశ్చయన్తి॥

శ్లో॥ శాన్తై రనన్యమతిభి ర్మధురస్వభావైః
ఏకత్వనిశ్చితమనోభి రపేతమోహైః।
సాకం వనేషు విజితాత్మపదస్వరూపం
శాస్త్రేషు సమ్యగనిశం విమృశంతి ధన్యాః॥

శ్లో॥ అహిమివ జనయోగం సర్వదా వర్జయేద్ యః
కుణపమివ సునారీం త్యక్తుకామో విరాగీ।
విషమివ విషయాన్ యో మన్యమానో దురంతాన్
జయతి పరమహంసో ముక్తిభావం సమేతి॥

శ్లో॥ సంపూర్ణం జగదేవ నందనవనం సర్వేఽపి కల్పద్రుమాః
గాంగం వారి సమస్తవారినివహాః పుణ్యాః సమస్తాః క్రియాః।

వాచః ప్రాకృతసంస్కృతాః శ్రుతిగిరో వారాణసీ మేదినీ
సర్వావస్థితి రస్య వస్తువిషయా దృష్టే పరబ్రహ్మణి॥

తా॥ ధన్యజీవనులు ఈ సంసారమును, అజ్ఞానపంకమునందు నిమగ్న మయినదిగను, సారహితముగను, దుఃఖమునకు ఆకర మైనదిగను, జన్మ, మరణ, జరాపర్యవసాయిగను, బంధ స్వరూపముగను, అనిత్యమైనదిగను, భావించి, జ్ఞానఖడ్గముతో దానిని ఛేదించి యదార్థతత్త్వమును, చక్కగా నిర్ణయించు కొందురు.

శాంతచిత్తులు, ఏకాగ్రమతులు, మధురస్వభావులు, బ్రహ్మాత్మైక్య విషయమున సునిశ్చితమతులు, మోహరహితులు నగు మహాత్ములతో గూడి అరణ్యమధ్యమున శాస్త్రము లందు చక్కగా నిర్ధారణచేయబడిన ఆత్మస్వరూపమును నిరంతరము విమర్శించునట్టి యోగులు ధన్యులు.

వారు జనసంగమును సర్పమును వలె తలచి పరిత్యజింతురు; సుందరమగుయువతిని శవమునువలె జూచి విరాగముతో విముఖులగుదురు. దురంతములైన సాంసారిక విషయములను విషసదృశముగా తలచుదురు. ఈవిధముగా జీవన్ముక్తిని పొందిన పరమహంసలకు జయమగుగాక!

ఆత్మతత్త్వావగతి పొందిన వానికి ఈ విశ్వమంతయు నందనవనముగాను, వృక్షములన్నియు కల్పతరువులుగాను, దోచును. జలమంతయు పవిత్రగంగోదకముగాను, కార్యము లన్నియు పుణ్యక్రియలుగాను గన్పట్టును. ప్రాకృత, సంస్కృత

భాషాపదము లన్నియు శ్రుతివచనములుగాను, ధరణి యంతయు వారాణసిగాను భాసించును. ఇట్టిజ్ఞాని ఏ పరిస్థితిలో నున్నను అద్వయబ్రహ్మముననే వెలయుచుండును.

ఈ విధముగా తత్త్వోపదేశమొనర్చిన తరువాత జ్ఞాని యొక్క నిరంజనస్థితిని శ్రీశంకరులు ఈ విధముగా వర్ణించిరి. దీనికి 'నిరంజనాష్టకమ్' అని లోకవ్యవహారము గలదు.

శ్లో॥ స్థానం న మానం నచ నాదబిందు
రూపం న రేఖా న చ ధాతు వర్ణమ్।
ద్రష్టా న దృశ్యం శ్రవణం న శ్రావ్యం
తస్మై నమో బ్రహ్మనిరంజనాయ॥

శ్లో॥ వేదో న శాస్త్రం న చ శౌచసంధ్యే
మంత్రో న జాప్యం న చ ధానధేయమ్।
హోమో న యజ్ఞో నచ దేవపూజా
తస్మై నమో బ్రహ్మనిరంజనాయ॥

శ్లో॥ వృక్షో న మూలం న చ బీజమూలం
శాఖా న పత్రం న చ వల్లిపల్లవమ్।
పుష్పం న గంధో న ఫలం న ఛాయా
తస్మై నమో బ్రహ్మనిరంజనాయ॥

శ్లో॥ అధో న చోర్ధ్వం న శివో న శక్తిః
పుమాన్ న నారీ న చ లింగమూర్తిః।
బ్రహ్మ న విష్ణు ర్నచ దేవరుద్ర
స్తస్మై నమో బ్రహ్మనిరంజనాయ॥

శ్లో॥ అఖండఖండం న చ దండదండ్యం
కాలోఽపి జీవో న గురు ర్న శిష్యః।
గ్రహా న తారా న చ మేఘమాలా
తస్మైనమో బ్రహ్మనిరంజనాయ॥

శ్లో॥ శ్వేతం న పీతం న చ రక్తరేతో
హైమం న రౌప్యం న చ వర్ణవర్ణమ్।
చంద్రార్కవహ్ని రుదయో న చాస్తం
తస్మై నమో బ్రహ్మనిరంజనాయ॥

శ్లో॥ స్వర్గే న మర్త్యే నగరే న సత్రే
జాతే రతీతం న చ భేదభిన్నమ్।
నాహం న తత్త్వం న పృథక్ పృథక్త్వాత్
తస్మై నమో బ్రహ్మనిరంజనాయ॥

శ్లో॥ గంభీరధీరం న ఘనం న శూన్యం
సంసారసారం న చ పాపపుణ్యమ్।
వ్యక్తం న చావ్యక్త మభేదభిన్నం
తస్మై నమో బ్రహ్మ నిరంజనాయ॥

తా॥ అద్వయబ్రహ్మకు స్థాన, పరిమాణములు లేవు; నాద బిందువులు రూపరేఖలు లేవు: అది ధాతువర్ణరహితమైనది; దృక్, దృశ్యములును, శ్రవణ-శ్రావ్యములును కాదు. అట్టి నిరంజనపరబ్రహ్మకు నమస్కారము.

ఆ నిరంజనబ్రహ్మ వేదశాస్త్రములును గాదు, శౌచ సంధ్యలును గాదు, మంత్రజపములును గాదు; ఆధార-ఆధేయములును గాదు; హోమయజ్ఞములు, దేవపూజయును

గాదు. ఈ విధముగా విరాజిల్లునట్టి నిరంజనపరబ్రహ్మకు నమస్కారము.

అది వృక్షమునుగాదు; కాండము కాదు; బీజమును గాదు; శాఖాపత్రములు, వల్లీపల్లవములును గాదు, పుష్పము గాదు, గంధముకాదు; ఫలమునుకాదు, ఛాయయును గాదు. అట్టి నిరంజనపరబ్రహ్మకు నమస్కారము.

ఊర్ధ్వాధోదేశములునుగాక, శివశక్తులుగాక, స్త్రీపుం మూర్తి లింగమూర్తియును గాక, బ్రహ్మ, విష్ణు, రుద్రాది దేవతలును గాక విలసిల్లునట్టి నిరంజన పరబ్రహ్మకు నమస్కారము.

అది ఖండాఖండస్వరూపమునుగాదు; దండ, దండనీయ రూప మది కాదు, కాలము, జీవుడునుగాదు; గురుశిష్యులు గ్రహనక్షత్రములును అదికాదు. మేఘమాలయు కాదు: అట్టి నిరంజన పరబ్రహ్మకు నమోవాకములు

శ్వేత, పీతవర్ణములు గాక, శుక్లశోణితములును గాక, సువర్ణ, రజతములునుగాక, చాతుర్వర్ణ్యముగాక, సూర్య చంద్రాగ్నులును గాక, వారి ఉదయాస్తమయములును గాక విరాజిల్లుచున్నట్టి, నిరంజనపరబ్రహ్మకు నమస్కారములు.

స్వర్గమర్త్యములును అదికాదు; నగర సత్రములును కాదు; జాతిభేదమునుగాదు; అహంతత్త్వములును పృథక్ తత్త్వములునుగాదు; అట్టినిరంజన పరబ్రహ్మకు నమస్కారము.

అది ధీరము గంభీరమునుగాదు; శూన్యమునుగాదు; ఘనమునుగాదు; సంసారమును గాదు; దానిసారమును గాదు; పాపపుణ్యములును గాదు; వ్యక్తావ్యక్తములుగాక, అభేద భిన్నత్వములును గాక వెలుగొందెడి నిరంజన పరబ్రహ్మకు నమస్కారము.

లక్ష్మీమాధవుల పుత్రు డగు విష్ణుశర్మ అహోబల క్షేత్ర నివాసి. ఇతడు నృసింహోపాసకుడు, కాశ్యపగోత్రుడు. ఈయన ఋగ్వేది యని కొందరు, సామవేది యని ఇతరులు చెప్పుదురు. తీర్థములు, క్షేత్రములు, ఆశ్రమములు ఇతనికి ప్రేమాస్పదములు. అందుచే నితనిని పద్మపాదు డను పేరుతో పశ్చిమామ్నాయ మఠమున నెలకొల్పినపుడు,అంకిత నామములు తీర్థ, ఆశ్రమ శబ్దములతో వచ్చినవి. ఈయన ఆశ్రమనామము సనందనుడు. విష్ణుశర్మ కాశీలో శంకరుని పండ్రెండవయేట శిష్యుడై ఆశ్రమము స్వీకరించెను.

శంకరుని వద్ద అనేకమంది శిష్యులుగా జేరినట్లు మనకు శంకరవిజయముల ద్వారా తెలియుచున్నది. పద్మపాద, హస్తామలక, సమిత్పాణి, చిద్విలాస, విజ్ఞానకంద, విష్ణుగుప్త, శుద్ధకీర్తి, భానుమరీచి, కృష్ణదర్శన, బుద్ధివృద్ధి, విరించిపాద, శుద్ధానందగిరి అను శిష్యులు శంకరుని సేవించి రని మాధవీయ శంకరవిజయవ్యాఖ్య యగు డిండిమమున, ఆనందగిరి శంకరవిజయమున కలదు. వీటిలో కొన్ని కల్పితనామము లని

స్పష్టమే. కొన్ని వాస్తవమైన నామములే. ఇంతమంది శిష్యులున్నను ఆచార్యుని ముఖ్యశిష్యులు నలుగురే.

శిష్యులకు సన్యాస మొసగి వారి ప్రవర్తనను నిర్దేశించెను.

ఈ సమయమునకు చెందినదే 'బ్రహ్మజ్ఞానావలీమాలా' యని చెప్పుదురు.

శ్లో॥ సకృచ్ఛ్రవణమాత్రేణ బ్రహ్మజ్ఞానం యతో భవేత్।
జ్ఞానావలీమాలా సర్వేషాం ముక్తిసిద్ధయే॥

శ్లో॥ అసంగోఽహ మసంగోఽహమసంగోఽహం పునఃపునః।
సచ్చిదానందరూపోఽహ మహ మేవాహ మవ్యయః॥

శ్లో॥ నిత్యశుద్ధవిముక్తోహం నిరాకారోఽహ మక్షరః।
భూమానందరూపోఽహ మహ మేవాహ మవ్యయః॥

శ్లో॥ నిత్యోఽహం నిరవద్యోఽహం నిరాకారోఽహ మక్షరః।
పరమానందరూపోఽహ మహ మేవాహ మవ్యయః॥

తా॥ సర్వజనుల ముక్తిసిద్ధికై ఒక్కమారు శ్రవణము చేసిన మాత్రమున బ్రహ్మజ్ఞానోపలబ్ధిని కలుగజేయు 'బ్రహ్మజ్ఞానావలీమాల' యను గ్రంథము చెప్పబడుచున్నది.

'నేను అసంగుడను; ముమ్మాటికి నిస్సంగుడను' అని పునఃపునః భావన చేయనగును. అవినాశి యగు సచ్చిదానంద స్వరూపుడను నేనే, నేనేయని మననము చేయవలయును.

నేను నిత్యశుద్ధుడను; బంధవిముక్తుడను; నిరాకారుడను; అక్షరుడను: అవ్యయుడను; పరమానందస్వరూపుడను నేను, నేనేయనుచు నిరంతరము మననము చేయనగును;

నేను నిత్యుడను; దోషరహితుడను; నిరాకారుడను; అక్షరుడు నగు పరమానందస్వరూపుడును నేనే.

శ్లో॥ శుద్ధచైతన్యరూపోఽహ మాత్మారామోఽహమేవ చ।
అఖండానందరూపోఽహ మహ మేవాహ మవ్యయః॥

శ్లో॥ స్వయంప్రకాశరూపోఽహం చిన్మయోఽహం
పరోఽస్మ్యహమ్।
అద్వైతానందరూపోఽహ మహ మేవాహ మవ్యయః॥

శ్లో॥ ప్రత్యక్ చైతన్యరూపోఽహం శాంతోఽహం ప్రకృతేః
పరః।
శాశ్వతానందరూపోఽహ మహ మేవాహ మవ్యయః॥

శ్లో॥ తత్త్వాతీతః పరాత్మాఽహం మధ్యాతీతః పరః శివః।
మాయాతీతః పరంజ్యోతి రహ మేవాహ మవ్యయః॥

శ్లో॥ నామరూపవ్యతీతోఽహం చిదాకారోఽహ మచ్యుతః।
సుఖప్రకాశరూపోఽహ మహ మేవాహ మవ్యయః॥

తా॥ నేను శుద్ధచైతన్యరూపుడను; నేనే ఆత్మారాముడను అవినాశియగు అఖండానందరూపుడను నేనుః నేనే యని అనవరతము మననము చేయనగును.

స్వయంప్రకాశ స్వరూపముతో నొప్పారు వాడను, చిద్రూపుడను, పరమాత్మయు నేను, అవ్యయుడగు అద్వ యానందరూపుడను నేనే.

నేను ప్రత్యక్ చైతన్యముతో విలసిల్లుచుందును; శాంత చిత్తుడను, ప్రకృతికంటె పరమైనవాడను నేను. అవినాశియగు శాశ్వతానందస్వరూపముతో వెలుగొందు వాడను నేనే.

చతుర్వింశతి తత్త్వముల కతీతుడను; పరమాత్మను; మధ్యావస్థ కతీతుడను; పరమశివుడను నేను, మాయాతీతు డను, పరంజ్యోతిరూపుడను నేను; అద్వయుడను నేనే.

నేను నామరూపరహితుడను; చిత్స్వరూపుడను, అచ్యు తుడను, అనగా నాశములేనివాడను; ఆనందస్వరూపుడను, ప్రకాశస్వరూపుడను నేను; నేనే అవ్యయ పురుషుడను.

శ్లో॥ మాయాతత్కార్యదేహాది ర్మమ నాస్త్యేవ సర్వదా।
స్వప్రకాశైకరూపోఽహ మహ మేవాహ మవ్యయః॥

శ్లో॥ గుణత్రయవ్యతీతోఽహం బ్రహ్మాదీనాం చ సాక్ష్యహమ్।
అనంతానందరూపోఽహ మహ మేవాహ మవ్యయః॥

శ్లో॥ అంతర్యామిస్వరూపోఽహం కూటస్థస్సర్వగోఽస్మ్యహమ్।
పరమానందరూపోఽహ మహమేవాహ మవ్యయః॥

శ్లో॥ ద్వంద్వాదిసాక్షిరూపోఽహ మచలోఽహం సనాతనః।
సర్వసాక్షిస్వరూపోఽహ మహమేవాహ మవ్యయః॥

శ్లో॥ నిష్కలోఽహం నిష్క్రియోఽహం సర్వాత్మా చ సనాతనః।
అక్షర స్వరూప శ్చాహ మహమేవాహ మవ్యయః॥

నేను మాయాతీతుడను; మాయాకార్యములగు దేహాదులును నాకెన్నడును లేనేలేవు. నేను అనవరతము స్వప్రకాశైకరూపుడను; అవినాశియగువాడను నేనే.

నేను గుణత్రయాతీతుడను; బ్రహ్మ, విష్ణు, మహేశ్వరాదులకు గూడ సాక్షిభూతుడను, అవినాశియు, అనంతానందస్వరూపుడను నేనే.

నేను అంతర్యామి స్వరూపుడను; కూటస్థుడు,- సర్వగతుడనైనవాడు నేనే యగుచున్నాను. పరమానందరూపుడను, అవ్యయుడను, నేనే యని అనిశము భావన చేయుచుండవలెను.

నేను శీతోష్ణ, సుఖదుఃఖాది ద్వంద్వాలకు సాక్షిభూతుడను అచలుడను, సనాతనుడు నగు వాడను నేను; సర్వసాక్షిస్వరూపుడను నేను; నేనే అవ్యయుడను.

నిష్కలుడు, నిష్క్రియుడు, సర్వాత్మస్వరూపుడు సనాతనుడగు అక్షరస్వరూపుడను నేను. అవ్యయుడను నేనే.

శ్లో॥ ప్రజ్ఞానఘన ఏవాహం విజ్ఞానఘన ఏవ చ।
అకర్తాఽహ మభోక్తాఽహ మహమేవాహ మవ్యయః॥

శ్లో॥ నిరాధారస్వరూపోఽహం సర్వాధారోఽహమేవ చ।
ఆప్తకామస్వరూపోఽహ మహమేవాహ మవ్యయః॥

శ్లో॥ తాపత్రయవిముక్తోఽహం దేహత్రయవిలక్షణః।
అవస్థాత్రయసాక్ష్యస్మి చాహమహమేవాహ మవ్యయః॥

శ్లో॥ దృగ్దృశ్యౌ ద్వౌ పదార్థౌ స్తః పరస్పరవిలక్షణః।
దృగ్ బ్రహ్మ దృశ్యా మాయేతి సర్వవేదాంత డిండిమః॥

శ్లో॥ అహం సాక్షీతి యో విద్యాత్ వివిచ్యైవ పునఃపునః।
స ఏవ ముక్తో విద్వాన్ స ఇతి వేదాంత డిండిమః॥

తా॥ ప్రజ్ఞానఘనుడను, విజ్ఞానఘనుడను నేనే. నేను అకర్తను అభోక్తను. అవినాశి యయినవాడను నేనే.

నేను నిరాధారస్వరూపుడను. సర్వమునకు ఆధారమైనవాడను నేనే. నేను ఆప్తకాముడను. అవినాశి యగువాడను నేనే.

ఆధిభౌతిక, ఆధిదైవిక, ఆధ్యాత్మికతాపత్రయవిముక్తుడను నేను. స్థూల, సూక్ష్మ, కారణరూపమైన దేహత్రయముకంటె విలక్షణుడను. జాగ్రత్స్వప్నసుషుప్తు లనెడు అవస్థాత్రయమునకు సాక్షిభూతుడను నేను. అవ్యయుడను నేనే.

పరస్పరవిలక్షణములైన దృక్ దృశ్యము లను రెండు పదార్థములు గలవు. దృక్ బ్రహ్మయనియు, దృశ్యము మాయయనియు సర్వవేదాంతము ఉద్ఘోషించుచున్నవి.

దేహేంద్రియాదులనుండి ఆత్మవివేచన చేసి అనవరతము 'నేను సాక్షిస్వరూపుడను' అని యెవడు తెలిసికొనునో అతడే విద్వాంసుడు; అతడే ముక్తుడు అని, వేదాంతడిండిమము ఉద్ఘోషించుచున్నది.

శ్లో॥ ఘటకుడ్యాదికం సర్వం మృత్తికామాత్ర మేవ హి।
తద్వత్ బ్రహ్మ జగత్సర్వ మితి వేదాంతడిండిమః॥

శ్లో॥ బ్రహ్మ సత్యం జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నాపరః॥
ఇద మేవ తు సచ్ఛాస్త్ర మితి వేదాంత డిండిమః॥

శ్లో॥ అంతర్జ్యోతిః బహిర్జ్యోతిః ప్రత్యగ్జ్యోతిః పరాత్పరః।
జ్యోతిర్జ్యోతిః స్వయంజ్యోతిః ఆత్మజ్యోతిఃశివో౽స్మ్యహమ్॥

ఘటకుడ్యాదులు మృణ్మాత్రమే కదా! అదేరీతిగ, ఈ జగత్తంతయు బ్రహ్మస్వరూపమే యని వేదాంతడిండిమము ఉద్ఘోషించుచున్నది.

బ్రహ్మసత్యము జగత్తుమిథ్య; జీవుడు బ్రహ్మయేగాని అన్యుడుకాడు. ఇదియే శాస్త్రమని వేదాంతడిండిమ ముచ్చైస్స్వరముతో ఘోషించుచున్నది.

అంతర్జ్యోతి బహిర్జ్యోతి, ప్రత్యగ్జ్యోతి యగు పరాత్పరుడను నేనే. జ్యోతిషాంజ్యోతియు, అన్యనిరపేక్షకమైన స్వయంజ్యోతియు, ఆత్మజ్యోతియు నగు శివస్వరూపుడను నేనే యగుచున్నాను.

శంకరుడు దీనితర్వాత సునిశ్చితజ్ఞాన ప్రాప్తికై 'బ్రహ్మానుచింతనమ్' అను పేరుతో శిష్యులకుపదేశము చేసెను. దీనికి 'ఆత్మానుచింతనమ్' అనునామముగూడ గలదు.

శ్లో॥ అహ మేవ పరంబ్రహ్మ వాసుదేవాఖ్య మవ్యయమ్।
ఇతి స్యా న్నిశ్చితో ముక్తో బద్ధ ఏవాన్యథా భవేత్॥

శ్లో॥ అహమేవ పరం బ్రహ్మ నిశ్చితం చిత్త చింత్యతామ్।
చిద్రూపత్వా దసంగత్వా దబాధ్యత్వాత్ ప్రయత్నతః॥

శ్లో॥ అహమేవ పరంబ్రహ్మ నచాహం బ్రహ్మణః పృథక్।
ఇత్యేవం సముపాసీతబ్రాహ్మణో బ్రహ్మణి స్థితః॥

శ్లో॥ సర్వోపాధివినిర్ముక్తం చైతన్యం చ నిరంతరమ్।
తద్బ్రహ్మాహ మితి జ్ఞాత్వా కథం వర్ణాశ్రమీ భవేత్॥

'అవ్యయము, వాసుదేవనామముగబరగు పరబ్రహ్మను నేనే'-అనునిశ్చయబుద్ధి గలవాడు సంసారబంధవిముక్తుడగును. ఇట్లు కాదేని, బద్ధుడే యగును.

ఓ చిత్తమా! చిద్రూపుడను, నిస్సంగుడను, త్రికాలాబాధ్యుడను అగుట వలన 'నేనే పరబ్రహ్మను' అని పూనికతో చింతనము చేయుము.

'నేనే పరమాత్మను; నేనుబ్రహ్మకంటె భిన్నుడను గాను' అని, బ్రాహ్మణుడైనవాడు బ్రహ్మయందు చిత్తము నిలిపి ఉపాసింపవలెను.

'సర్వోపాధిరహితము, సర్వదా చిద్రూపము నగు బ్రహ్మను నేనే యని తెలిసికొనినతర్వాత, వర్ణాశ్రమధర్మములు గలవాడెట్లగును?

శ్లో॥ అహం బ్రహ్మస్మి యో వేద స సర్వం భవతి త్విదమ్।
నాభూత్యా ఈశతే దేవాః తేషా మాత్మా భవేద్ధి సః॥

శ్లో॥ అన్యోఽసావహమన్యోస్మీ త్యుపాస్తే యోఽన్య
దేవతామ్।
న స వేద నరో బ్రహ్మ స దేవానాం యథా పశుః॥

శ్లో॥ అహమాత్మా న చాన్యోస్మి బ్రహ్మైవాహం న శోకభాక్।
సచ్చిదానంద రూపోఽహం నిత్యముక్తస్వభావవాన్॥

శ్లో॥ ఆత్మానం సతతం బ్రహ్మ సంభావ్య విహరంతి యే।
న తేషాం దుష్కృతం కించిత్ దుష్కృతోత్థా న చాపదః,

శ్లో॥ ఆత్మానం సతతం బ్రహ్మ సంభావ్యవిహరేత్ సుఖమ్।
క్షణం బ్రహ్మహ మస్మీతి యః కుర్యా దాత్మచింతనమ్॥
తన్మహాపాతకం హంతి తమ స్సూర్యోదయో యథా॥

తా॥ 'అహం బ్రహ్మాస్మి' యని ఎవడు తెలిసికొనునో, అతడు ఈ జగత్తంతయు తానేయగును. అతడు దేవతలకు గూడ ఆత్మ స్వరూపు డగుటంజేసి, దేవత లతనికి భృత్యులై వర్తింతురు; ఎట్టి బాధలను కలిగింపజాలరు.

'ఉపాస్యమగు దేవతకంటె తానన్యుడనని, ఎవడు అన్యదేవతోపాసన మొనర్చునో, అతడు బ్రహ్మస్వరూపము నెరుగడు. దేవతలముందు పశుతుల్యుడగును. అనగా, యజ్ఞ యాగాది కర్మానుష్ఠాన మొనర్చుచు దేవతాభోగోపకరణము గానే యుండును.

నేను ఆత్మస్వరూపుడను; దేహేంద్రియమనః ప్రాణా దులలో నేనెవరను గాను, బ్రహ్మనే నేను; నాకెట్టిశోకమును

లేను; నిత్యముక్తస్వభావము గల సచ్చిదానంద స్వరూపు డను నేను.

ఎవరు ప్రత్యగాత్మను సర్వదా బ్రహ్మగా భావన చేయుచు సంచరించుదురో వారికి పాపలేశమైనను ఉండదు; పాపఫలితములును వారు పొందరు.

ఎవరు సతతము, ఆత్మను బ్రహ్మగా భావించుచు సుఖముగా విహరింతురో ఎవరు క్షణకాలమైనను, 'అహం బ్రహ్మాస్మి' యని ఆత్మచింతన మొనర్తురో, సూర్యోదయము అంధకారమును పటాపంచలు చేసినట్లు, వారు పాతకములను నాశ మొనర్చుదురు. బ్రహ్మానుచింతనపరులు సర్వపాప విదూరు లగుదురని భావము.

శ్లో॥ అజ్ఞానా ద్బ్రహ్మణో జాత మాకాశం బుద్బుదోపమమ్।
ఆకాశాద్వాయు రుత్పన్నో వాయో స్తేజ స్తతః పయః।
అద్భ్యశ్చ పృథివీ జాతా తతో వ్రీహియవాదికమ్॥

శ్లో॥ పృథివ్యప్సు పయోవహ్నౌ వహ్ని ర్వాయౌ నభస్యసౌ।
నభోఽవ్యాకృతే తచ్చ శుద్ధే శుద్ధోఽస్మ్యహం హరిః॥

శ్లో॥ అహం విష్ణు రహం విష్ణు రహం విష్ణురహంహరిః।
కర్తృభోక్త్రాదికం సర్వం త దవిద్యోత్థమేవ చ॥

శ్లో॥ అచ్యుతోఽహ మనంతోఽహం గోవిందోఽహ
మహం హరిః।
ఆనందోఽహ మశేషోఽహ మజోఽహ మమృతోఽ
స్మ్యహమ్॥

తా॥ అజ్ఞానము వలన బ్రహ్మనుండి బుద్బుదోపమమైన ఆకాశము, ఆకాశము నుండి వాయువు, వాయువునుండి అగ్ని, అగ్నినుండి జలము, జలమునుండి పృథివి, పృథివి నుండి వ్రీహి, యవాది ధాన్యములు పుట్టినవి.

పృథివి జలమునందును, జలము తేజస్సునందును, తేజస్సువాయువునందును, వాయువు ఆకాశమందును, ఆకాశము అవ్యాకృతము నందును, అనగా, మాయ యందును, మాయ శుద్ధబ్రహ్మము నందును వెలయుచుండును. నేనా శుద్ధపరబ్రహ్మస్వరూపుడగు హరినై వెలుగొందుచున్నాను.

నేను విష్ణురూపుడను; ముమ్మాటికి నేను హరిరూపుడను; నాయందు గన్పట్టు కర్తృత్వ, భోక్తృత్వాది ధర్మములన్నియు అవిద్యావిలసితములు.

నే నచ్యుతుడను; అనంతుడను; గోవిందుడను; హరిస్వరూపుడను. నే నానందస్వరూపుడను; అశేషుడను; అజుడను; అమృతస్వరూపుడను.

శ్లో॥ నిత్యోఽహం నిర్వికల్పోఽహం నిరాకారోఽహ మవ్యయః।
సచ్చిదానందరూపోఽహం పంచకోశాతిగోఽస్మ్యహమ్॥

శ్లో॥ అకర్తాహ మభోక్తాహ మసంగః పరమేశ్వరః।
సదా మత్సన్నిధానేన చేష్టతే సర్వ మింద్రియమ్॥

శ్లో॥ ఆదిమధ్యాంతముక్తోఽహం న బద్ధోఽహం కదాచన।
స్వభావనిర్మల శ్శుద్ధః స ఏవాహం న సంశయః॥

శ్లో॥ బ్రహ్మైవాహం న సంసారి ముక్తోఽహ మితి భావయేత్।
అశక్నువాన్ భావయితుం వాక్య మేతత్ సదాఽభ్యసేత్॥

శ్లో॥ యదభ్యాసేన తద్భావో భవేత్ భ్రమరకీటవత్।
అత్రాపహాయ సందేహ మభ్యసేత్ కృతనిశ్చయః॥

తా॥ నేను నిత్యుడను, నిర్వికల్పుడను, నిరాకారుడను, అవ్యయుడను; ప్రాణమయాది పంచకోశముల కతీతుడైన సచ్చిదానందరూపుడను నేను.

అకర్తయు, అభోక్తయు, అసంగుడు నగు పరమేశ్వరుడను నేను. నా సంనిధానము చేతనే సర్వేంద్రియములును వ్యవహారముల నొనర్చుచున్నవి.

ఆదిమధ్యాంతశూన్యుడను నేను. నే నెన్నడును బద్ధుడను గాను. నేను సహజముగా నిర్మలుడను, శుద్ధుడ నయి విరాజిల్లుదును. ఈ కథనములో ఎట్టి సంశయమును లేదు. ఇది నిశ్చయము.

'నేను పరబ్రహ్మమునే; సంసారిని గాను, ముక్తుడను' అని భావింపనగును. ఈ విధముగా భావన చేయజాలనివారు ఈ వాక్యమును సదా అభ్యాసము చేయవలయును. ధ్యానము చేయనగు నని భావము.

శ్లో॥ ధ్యానయోగేన మాసైకా ద్బ్రహ్మహత్యాం వ్యపోహతి।
సంవత్సరం సదభ్యాసాత్ సిద్ధ్యష్టక మవాప్నుయాత్॥

శ్లో॥ యావజ్జీవం సదభ్యాసాత్ జీవన్ముక్తో భవే ద్యతిః।
నాహం దేహో న చ ప్రాణో నేంద్రియాణి తథైవ చ॥

శ్లో॥ న మనో౾హం న బుద్ధిశ్చ నైవ చిత్త మహంకృతిః।
నాహం పృథ్వీ న సలిలం న చ వహ్ని స్తథా౾నిలః॥

శ్లో॥ న చాకాశో న శబ్దశ్చ న చ స్పర్శ స్తథా రసః
నాహం గంధో న రూపం చ న మాయా౾హం న
సంసృతిః॥

శ్లో॥ సర్వదా సాక్షిరూపత్వాత్ శివ ఏవాస్మి కేవలః।
మయ్యేవ సకలం జాత మయి సర్వం ప్రతిష్ఠితమ్॥

తా॥ ఈ విధముగా ధ్యానయోగమునందు రూఢుడైనవాడు బ్రహ్మహత్యాపాతకమును గూడ తొలగించుకొనగలడు. ఇట్లు సంవత్సరకాలము చక్కగ అభ్యసించిన యెడల అణిమాది అష్టసిద్ధులు పొందగలడు.

జీవితపర్యంతము సదభ్యాసము చేసినచో యతి ముక్తుడగును. నేను దేహమును గాను; ప్రాణములును, ఇంద్రియములును గాను.

నేను మనో బుద్ధి చిత్తాహంకారములును గాను. పృథివ్యప్-తేజో వాయు రాకాశములును గాను.

నేను శబ్ద స్పర్శ రస గంధ రూపములును గాను. నేను మాయావిష్టుడను గాను; సంసారమును గాను.

సర్వసాక్షిరూపుడ నగుటచేత నేను కేవలశివస్వరూపుడనే. నాయందే సర్వము సృష్టమై నాయందే ప్రతిష్ఠితమై యున్నది.

శ్లో॥ మయి సర్వం లయం యాతి తద్బ్రహ్మాస్మ్యహ
మద్వయమ్।
సర్వజ్ఞోఽహ మనంతోఽహం సర్వేశ స్సర్వశక్తిమాన్॥

శ్లో॥ ఆనంద స్సత్యబోధోఽహ మితి బ్రహ్మానుచింతనమ్।
అయం ప్రపంచో మిథ్యైవ సత్యం బ్రహ్మాహ
మవ్యయమ్॥

శ్లో॥ అత్ర ప్రమాణం వేదాంతా గురవోఽనుభవ స్తథా।
బ్రహ్మైవాహం న సంసారీ న చాహం బ్రహ్మణః పృథక్॥

శ్లో॥ నాహం దేహో న మే దేహః కేవలోఽహం సనాతనః।
ఏకమేవాద్వితీయం వై బ్రహ్మణో నేహ కించన॥

శ్లో॥ హృదయకమలమధ్యే దీపవ ద్వేదసారం
ప్రణవమయ మతర్క్యం యోగిభి ర్ధ్యానగమ్యమ్।
హరిగురుశివయోగం సర్వభూతస్థ మేకం
సకృదపి మనసా వై చింతయే ద్యః స ముక్తః॥

తా॥ నాయందే సర్వము లయముచెందుచున్నది. ఆ అద్వయ బ్రహ్మను నేనే. నేను సర్వజ్ఞుడను, అనంతుడను, సర్వేశ్వరుడను, సర్వశక్తిమంతుడను.

'నేను ఆనందస్వరూపుడను; సత్యబోధస్వరూపుడను' అని నిరంతరము బ్రహ్మానుచింతనము చేయదగును. ఈ జగత్తు మిథ్యయే. అవినాశి, సత్యస్వరూపము నగు బ్రహ్మను నేనే

ఈ విషయమున ఉపనిషత్తత్త్వములగు వేదాంతములును, గురువచనమును, స్వానుభవమును ప్రమాణములనుగా

ఎరుగనగును. నేను బ్రహ్మమనే సంసారిని గాను. నేను బ్రహ్మ కంటె భిన్నుడను గాను.

నేను దేహమను గాను; నాకు దేహము లేదు. నేను కేవలుడను; సనాతనుడను. ఈ జగత్తులో ఒకే అద్వయ బ్రహ్మ కంటె భిన్నమైన అన్యవస్తువు ఏదియును లేదు.

హృత్పుండరీకమధ్యమున దీపకళికవలె ప్రకాశించునదియు, వేదసారభూతమైనదియు, ప్రణవమయము, అతర్క్యమైనదియు, యోగులు చేత ధ్యానమందు పొందబడదగినదియు, హరి-గురు-శివాత్మక మైనదియు, సర్వభూతస్థమైనదియు నగు ఏ సత్యవస్తువు గలదో, ఆ అద్వయ ఆత్మతత్త్వమును ఎవరు ఒక్కమారైనను మనసుతో చింతించునో, అతడు జీవన్ముక్తుడగును.

అహోబలక్షేత్రనివాసి, మాధవుని పుత్రుడు నగు విష్ణుశర్మ భగవత్పాదుల మొదటి శిష్యుడు. ఈయన సంన్యసించి సనందను డాయె నని చిద్విలాసీయ శంకరవిజయము. ఈసనందనునిపై భగవత్పాదులవారికి ఎక్కువ వాత్సల్యమున్నదని ఇతనిపై ఇతరశిష్యులు అసూయపడిరి. ఒకనాడు ఆచార్యులవారు గంగానదికి ఇవతలవైపున,సనందను డవతల వైపున ఉండిరి. గురువుగారి కేక విని సనందనుడు త్వరగా రాదలచెను. గంగానది మహావేగముతో పూర్ణస్రవంతితో పరువెత్తుచున్నది. సంసారసాగరమునే దాటింపగల సమర్థత ఉన్న గురువుగారు ఈ గంగాప్రవాహమును దాటింపలేరా

అని తలచి, గురువును ధ్యానించి, గంగానదిలోనికి దిగెను. అప్పుడు గంగాదేవి సనందనుడు పాదముపెట్టబోవుచోట పద్మమునుంచి, ఆయన ఆ పద్మములపై పాదములిడి గురువును సుఖముగా చేరునట్లు చేసెనట. అప్పుడాయనకు పద్మపాదుడను పేరు వచ్చెనని, ఇతరశిష్యులు తాము చూపిన అసూయకు సిగ్గుపడిరని చెప్పుదురు. పద్మపాదునకు గల గురుభక్తి, శంకరుని గుర్వష్టకముతో తులతూగునది.

కాశీలో ఉన్న సమయముననే శంకరుడు గ్రంథరచన కుపక్రమించె నందురు.

శ్లో॥ భాష్యాణ్యథాకురుత తత్ర సహస్రనామ
గీతా దశోపనిషదాం విశదార్థకాని।
వ్యాసోక్తసూత్రనివహస్య సనత్సుజాత
వాచాం యతీశ ఉపదేశసహస్రికాం చ॥

శ్లో॥ సౌందర్యపూర్వలహరీ మకరోత్ ప్రపంచసారం
మునిః స సుభగోదయపద్ధతిం చ।
స్తోత్రాణి లోకమహితాఖిలదేవతానాం
నానావిధార్థ గుణరీతివిచిత్రితాని.

అని గురువంశకావ్యము (2.25,26) బదరికాశ్రమమును చేరకముందే శంకరుడు రచించిన గ్రంథములను పేర్కొనినది. విష్ణుసహస్రనామభాష్యము, దశోపనిషద్భాష్యములు, గీతాభాష్యము, బ్రహ్మసూత్రభాష్యము, సనత్సుజాతీయభాష్యము

ఉపదేశసాహస్రి, సౌందర్యలహరి, ప్రపంచసారము, సుభగోదయపద్ధతి స్తోత్రములు శంకరుని రచన లనిరి.

విశ్వనాథుడే భగవత్పాదులను బ్రహ్మసూత్రభాష్యమును రచింపుమని ఆదేశించినట్లు కొన్ని గ్రంథములు తెలుపుచున్నవి.

శ్లో॥ అన్యథా వేదవాక్యాని వ్యాఖ్యాతాని కుబుద్ధిభిః
న సర్వజ్ఞం వినా తేషాం సూత్రాణాం స ప్రకాశకః॥

శ్లో॥ అతస్త్వం సర్వశక్తిత్వా త్సర్వజ్ఞత్వాచ్చ భో మునే।
యథాశ్రుతీనాం సర్వాసాం పరబ్రహ్మణి నిష్ఠతా॥

శ్లో॥ తథాఽద్వైతపరం భాష్యం కురుష్వాభినివేశతః।
శ్రుతిసూత్రేతిహాసానాం వ్యాఖ్యా నిర్మాయ యత్నతః॥
సంప్రదాయవిదాం మార్గః ప్రకాశ్య స్తేఽధునా యతే॥

అని ఒక శంకరవిజయము. "విపరీతార్థములతో వేదవాక్యముల నితరులు వ్యాఖ్యానించిరి. సర్వజ్ఞుడైనవాడే వేదాంతసూత్రములను వివరింపగలడు. నీవు సర్వశక్తి సంపన్నుడవు, సర్వజ్ఞుడవు నగుమునివి. శ్రుతివాక్యములకు బ్రహ్మపరత్వమును చెప్పి, అద్వైతమును ప్రతిపాదించు భాష్యమును రచింపుము. అప్పుడు సంప్రదాయసంమతమగు మార్గముప్రకాశింపగలదు" అనివిశ్వనాథుడనెను. భాష్యాదులను శంకరుడు కాశిలో రచింపలేదనుటకే ఆధారము లున్నవి. గురువుయొక్క ఆదేశానుసారము వ్యాసుని దర్శించుటకు శంకరుడు కాశీ కేతెంచెను.

వ్యాసదర్శన మైనతర్వాతనే భాష్యరచనకు మెరుగులు దిద్దబడ గలవు. కాశిలో పాఠప్రవచనములు చేయుచు, శిష్యజనము నకు దీక్షనొసగుచుండెను.

ఆచార్యుడు శిష్యులకు మొదట సదాచారమును గూర్చి ఈరీతిగా ఉపదేశించిరి.

శ్లో॥ సచ్చిదానందకందాయ జగదంకురహేతవే।
సదోదితాయ పూర్ణాయ నమోఽనంతాయ విష్ణవే॥

శ్లో॥ సర్వవేదాంతసిద్ధాంతగ్రథితం నిర్మలం శివమ్।
సదాచారం ప్రవక్ష్యామి యోగినాం జ్ఞానసిద్ధయే॥

శ్లో॥ ప్రాతర్భజామి దేవస్య సవితు ర్భర్గ ఆత్మనః।
వరేణ్యం తద్ధియో యోనః చిదానందే ప్రచోదయాత్॥

శ్లో॥ అన్వయవ్యతిరేకాభ్యాం జాగ్రత్స్వప్నసుషుప్తిషు।
యదేకం కేవలం జ్ఞానం తదేవాస్మి పరం బృహత్॥

శ్లో॥ జ్ఞానాజ్ఞానవిలాసోఽయం జ్ఞానాత్ జ్ఞానే వినశ్యతి।
జ్ఞానాజ్ఞానే పరిత్యజ్య జ్ఞాన మేవావ శిష్యతే॥

తా॥ సచ్చిదానందకందుడును, జగదంకురమునకు హేతు భూతుడును, సర్వదా ఉదయించియే యుండువాడును, పూర్ణ పురుషుడును, అనంతుడును అగు విష్ణుమూర్తికి నమస్కారము.

సర్వవేదాంత సిద్ధాంతప్రతిపాదితమును, నిర్మలమును, మంగళకరమునగు సదాచారమును యోగుల జ్ఞానసిద్ధి కొరకు చెప్పబోవుచున్నాను.

మన బుద్ధివృత్తులను సచ్చిదానందపరబ్రహ్మము నందు ప్రేరేపించునట్టివాడును, ప్రకాశశీలుడును, జగత్ప్రసూతియు నగు ఆత్మయొక్క శ్రేష్ఠమైన తేజస్సును ప్రాతఃకాలమున, నిత్యము స్మరించుచున్నను.

జాగ్రత్-స్వప్న-సుషు ప్తులందు అన్వయ వ్యతిరేకములతో ఏకమాత్రమైన యేజ్ఞానము విలసిల్లుచుండునో, 'బృహత్' శబ్దముచే చెప్పబడు ఆ కేవలాత్మస్వరూపుడనే నేనయి యుంటిని.

జ్ఞానాజ్ఞానముల విలాసము విచిత్రమైనది. తత్త్వజ్ఞానము వలన విషయజ్ఞానము ఉపశమింపగా, జ్ఞానము, అజ్ఞానము-రెండును పరిత్యజింపబడగా, అద్వయబ్రహ్మయే అవశిష్టమగును.

శ్లో॥ అత్యంతమలినో దేహో దేహీ చాత్యంత విర లః।
అసంగోఽహ మితి జ్ఞాత్వా శౌచ మేతత్ ప్ర క్షతే॥

శ్లో॥ మన్మనో మీనవ న్నిత్యం క్రీడ త్యానందవా ।
సుస్నాత స్తేన పూతాత్మా సమ్యగ్విజ్ఞానవా

శ్లో॥ అథాఘమర్షణం కుర్యాత్ ప్రాణాపానిరో
మనఃపూర్ణే సమాధాయ మగ్నకుంభం యథ ॥

శ్లో॥ లయవిక్షేపయో స్సంధౌ మన స్తత్ర నిరామి
స సంధిస్సాధితో యేన స ముక్తో నాత్ర స

శ్లో॥ సర్వత్ర ప్రాణినాం దేహే జపో భవతి స
హంసః సోఽహ మితి జ్ఞాత్వా సర్వబంధైః ్యతే॥

వ్యాసదర్శన మైనతర్వాతనే భాష్యరచనకు మెరుగులు దిద్దబడ గలవు. కాశిలో పాఠప్రవచనములు చేయుచు, శిష్యజనము నకు దీక్షనొసగుచుండెను.

ఆచార్యుడు శిష్యులకు మొదట సదాచారమును గూర్చి ఈరీతిగా ఉపదేశించిరి.

శ్లో॥ సచ్చిదానందకందాయ జగదంకురహేతవే।
సదోదితాయ పూర్ణాయ నమోఽనంతాయ విష్ణవే॥

శ్లో॥ సర్వవేదాంతసిద్ధాంతగ్రథితం నిర్మలం శివమ్।
సదాచారం ప్రవక్ష్యామి యోగినాం జ్ఞానసిద్ధయే॥

శ్లో॥ ప్రాతర్భజామి దేవస్య సవితు ర్భర్గ ఆత్మనః।
వరేణ్యం తద్ధియో యోనః చిదానందే ప్రచోదయాత్॥

శ్లో॥ అన్వయవ్యతిరేకాభ్యాం జాగ్రత్స్వప్నసుషుప్తిషు।
యదేకం కేవలం జ్ఞానం తదేవాస్మి పరం బృహత్॥

శ్లో॥ జ్ఞానాజ్ఞానవిలాసోఽయం జ్ఞానాత్ జ్ఞానే వినశ్యతి।
జ్ఞానాజ్ఞానే పరిత్యజ్య జ్ఞాన మేవావ శిష్యతే॥

తా॥ సచ్చిదానందకందుడును, జగదంకురమునకు హేతుభూతుడును, సర్వదా ఉదయించియే యుండువాడును, పూర్ణపురుషుడును, అనంతుడును అగు విష్ణుమూర్తికి నమస్కారము.

సర్వవేదాంత సిద్ధాంతప్రతిపాదితమును, నిర్మలమును, మంగళకరమునగు సదాచారమును యోగుల జ్ఞానసిద్ధి కొరకు చెప్పబోవుచున్నాను.

మన బుద్ధివృత్తులను సచ్చిదానందపరబ్రహ్మము నందు ప్రేరేపించునట్టివాడును, ప్రకాశశీలుడును, జగత్ప్రసూతియు నగు ఆత్మయొక్క శ్రేష్ఠమైన తేజస్సును ప్రాతఃకాలమున, నిత్యము స్మరించుచుందును.

జాగ్రత్-స్వప్న-సుషుప్తులందు అన్వయ వ్యతిరేకములతో ఏకమాత్రమైన యేజ్ఞానము విలసిల్లుచుండునో, 'బృహత్' శబ్దముచే చెప్పబడు ఆ కేవలాత్మస్వరూపుడనే నేనయి యుంటిని.

జ్ఞానాజ్ఞానముల విలాసము విచిత్రమైనది. తత్త్వజ్ఞానము వలన విషయజ్ఞానము ఉపశమింపగా, జ్ఞానము, అజ్ఞానము- రెండును పరిత్యజింపబడగా, అద్వయబ్రహ్మయే అవశిష్టమగును.

శ్లో॥ అత్యంతమలినో దేహో దేహీ చాత్యంత నిర్మలః।
అసంగోఽహ మితి జ్ఞాత్వా శౌచ మేతత్ ప్రచక్షతే॥

శ్లో॥ మన్మనో మీనవ న్నిత్యం క్రీడ త్యానందవారిధౌ।
సుస్నాత స్తేన పూతాత్మా సమ్యగ్విజ్ఞానవారిణా॥

శ్లో॥ అథాఘమర్షణం కుర్యాత్ ప్రాణాపానవిరోధతః।
మనః పూర్ణే సమాధాయ మగ్నకుంభం యథాఽర్ణవే॥

శ్లో॥ లయవిక్షేపయో స్సంధౌ మన స్తత్ర నిరామిషమ్।
స సంధిస్సాధితో యేన స ముక్తో నాత్ర సంశయః॥

శ్లో॥ సర్వత్ర ప్రాణినాం దేహే జపో భవతి సర్వదా।
హంసః సోఽహ మితి జ్ఞాత్వా సర్వబంధైః ప్రముచ్యతే॥

తా॥ దేహము మిగుల మాలినమైనది. కాని, దేహి అత్యంత నిర్మలుడు. నేను అసంగుడను; నాకు శరీరసంగము లేదని తెలిసికొనుటయే శౌచ మని చెప్పబడును.

నా మనస్సు మీనము వలె ఆనందాబ్ధిలో అహర్నిశము క్రీడించుచుండును. ఆ జ్ఞానోదకములో సుస్నాతుడనై పూతాత్ముడ నైతిని అను భావనయే స్నానమని చెప్పబడును.

సాగరమందు ఘటమును ముంచినరీతిగ ప్రాణాపానాదులను నిరోధించి, మనస్సును పూర్ణానందసాగరమున సమాధీనమొనర్చుటయే అఘమర్షణస్నానముచేయనగును.

ధ్యానసమయమున నిద్రలో కలుగు లయవిక్షేపములకు మధ్యగనుండు ఏ సంధికాలము గలదో, అచట మనస్సు విషయశూన్య మగును. ఎవడు ఈ సంధికాలస్థితిని సాధించునో వానికి ముక్తిలభించుననుటలో ఎట్టి సందియములేదు.

సర్వదా ప్రాణుల శరీరములో సర్వత్ర 'హంస' జపము జరుగుచుండును. అదియే 'సోఽహం' అనుజ్ఞానము ఎవడు పొందునో అతడు సర్వబంధవిముక్తు డగును.

శ్లో॥ తర్పణం స్వసుఖేనైవ స్వేంద్రియాణాం ప్రతర్పణమ్।
మనసా మన ఆలోక్య స్వయ మాత్మా ప్రకాశతే॥

శ్లో॥ ఆత్మని స్వప్రకాశాగ్నౌ చిత్త మేకాహుతిం క్షిపేత్।
అగ్నిహోత్రీ స విజ్ఞేయశ్చ ఇతరా నామధారకాః॥

శ్లో॥ దేహో దేవాలయః ప్రోక్తో దేహీ దేవో నిరంజనః।
అర్చిత స్సర్వభావేన స్వానుభూత్యా విరాజతే॥

శ్లో॥ మౌనం స్వాధ్యయనం ధ్యానం ధ్యేయబ్రహ్మానుచింతనమ్।
జ్ఞానేనేతి తయో స్సమ్యక్ నిషేధా త్తత్త్వదర్శనమ్॥
శ్లో॥ అతీతానాగతం కించిన్న స్మరామి న చింతయే।
రాగద్వేషం వినా ప్రాప్తం భుంజా మ్యన్నం శుభాశుభమ్॥

తా॥ ఆత్మానందము చేతనే ఇంద్రియములకు తృప్తిని గూర్చుటయే తర్పణ మని భావింప నగును. మనస్సుతో మనస్సును దర్శించుచు ఆత్మ స్వయముగ వెలుగొందు చుండును.

స్వప్రకాశమగు ఆత్మాగ్నియందు చిత్తము అనెడి ఒక్క ఆహుతిని సమర్పింపనగును. ఆ విధముగ చిత్తము నాహుతి చేసిన ధీగుడే 'అగ్నిహోత్రి' యని సార్థకనామ డగును. మిగిలినవారందరు పేరుకు మాత్రమే అగ్నిహోత్రు లుగ తలచబడుదురు.

దేహమే ఒక దేవాలయము; నిరంజనుడగు ఆత్మయే అందుండు దేవుడు అని గుర్తింపనగును. ఆ బ్రహ్మాత్మ సర్వభావములచే నర్చితుడై స్వానుభూతితో విరాజిల్లుచుండును.

మౌనమే స్వాధ్యాయాధ్యయనము అనియు, ధ్యేయ బ్రహ్మానుచింతనమే ధ్యాన మనియు భావింపనగును. జ్ఞానము చేత స్వాధ్యయన, ధ్యానములను పూర్తిగ, నిషేధించుట వలన తత్త్వదర్శన మగును

అతీతవిషయమును స్మరింపను; అనాగతవిషయమును గూర్చి చింతింపను. రాగద్వేషముల కతీతుడనై యథా ప్రాప్తములైన శుభాశుభములను అనుభవించుచున్నాను.

శ్లో॥ హఠాభ్యాసో హి సన్న్యాసో నైవ కాషాయవాససా।
నాహం దేహోఽహమాత్మేతి నిశ్చయో న్యాసలక్షణమ్॥

శ్లో॥ అభయం సర్వభూతానాం దాన మాహుర్మనీషిణః।
నిజానందే స్పృహా నేచ్ఛా వైరాగ్యస్యావధిర్మతః॥

శ్లో॥ వేదాంతశ్రవణం కుర్యాత్ మననం చోపపత్తిభిః।
యోగేనాభ్యసనం నిత్యం తతో దర్శన మాత్మనః॥

శ్లో॥ శబ్దశక్తే రచింత్యత్వాత్ శబ్దాదేవ అపరోక్షధీః।
ప్రసుప్తః పురుషో యద్వత్ శబ్దేనైవ అవబుద్ధ్యతే॥

శ్లో॥ ఆత్మానాత్మవివేకేన జ్ఞానం భవతి నిశ్చలమ్।
గురుణా బోధిత శ్శిష్యః శబ్దబ్రహ్మాతివర్తతే॥

తా॥ హఠయోగాభ్యాసము వలనగాని, కాషాయాంబరములను ధరించినంతమాత్రమునగాని, సంన్యాసము లభింపదు. 'నేను దేహమును గాను, నేనాత్మస్వరూపుడను'—అను నిశ్చయమే సంన్యాస మనబడును.

సర్వప్రాణికోటికి అభయము నొసగుటయే దాన మని విద్వాంసు లందురు. ఆత్మానందమునందు స్పృహ కలిగి యుండుట, సాంసారికవిషయము లందు ఇచ్ఛ లేకుండుటయే వైరాగ్యము యొక్క పరమావధి యని గ్రహింపనగును.

నిరంతరము వేదాంతశ్రవణము చేయుచు తగిన ఉపపత్తులతో దానిని మననము చేయుచుండవలెను. యోగాసనాసీనుడై మననము చేసిన తత్త్వమును నిదిధ్యాసన మొనర్చవలయును. అట్లు చేసిన తర్వాత ఆత్మదర్శన మగును.

శబ్దము యొక్క శక్తి తర్కింపరానిది. అందుచే దానివలన, అపరోక్షజ్ఞానము కలుగుచున్నది. అనగా శ్రవణ మననాదులవలన, అపరోక్షాత్మజ్ఞానము కలుగునని భావము. నిద్రించుచున్న వ్యక్తి శబ్దము చేతనే మేల్కాంచినట్లు అజ్ఞాన నిద్రామూఢుడైన వ్యక్తియు తత్త్వమస్యాది వాక్యశ్రవణము చేత అవబోధితు డగును.

ఆత్మానాత్మవివేకము వలన నిశ్చలజ్ఞానము లభించును. గురువువలన చక్కగా నుపదిష్టుడైన శిష్యుడు శబ్దబ్రహ్మ సాక్షాత్కారము నొందును.

శ్లో॥ న త్వం దేహో నేంద్రియాణి న ప్రాణో న మనో న ధీః।
వికారిత్వా ద్వినాశిత్వాత్ దృశ్యత్వాచ్చ ఘటో యథా॥

శ్లో॥ విశుద్ధం కేవలం జ్ఞానం నిర్విశేషం నిరంజనమ్।
యదేకం పరమానందం తత్త్వమస్యద్వయం పరమ్॥

శ్లో॥ శబ్దస్యాద్యంతయో స్సిద్ధం మనసోఽపి తథైవ చ।
మధ్యే సాక్షితయా నిత్యం తదేవ త్వం భ్రమం జహి॥

శ్లో॥ స్థూలవైరాజయో రైక్యం సూక్ష్మహైరణ్యగర్భయోః।
అజ్ఞానమాయయో రైక్యం ప్రత్యగ్విజ్ఞానపూర్ణయోః॥

శ్లో॥ చిన్మాత్రైకరసే విష్ణౌ బ్రహ్మాత్మైక్యస్వరూపకే।
భ్రమ ఏవ జగజ్జాతం రజ్జ్వాం సర్పభ్రమో యథా॥

తా॥ దృశ్య మగుటవలన ఘటము నీవు కావు అదేరీతిగ, దేహేంద్రియమనఃప్రాణములు బుద్ధియును దృశ్యములు,

వికారవినాశస్వభావములును అగుటచేత అవినాశియు, ఆత్మ స్వరూపుడవైన నీవు కావు.

విశుద్ధము, కేవలము, నిర్విశేషము నిరంజనము నగు అద్వయజ్ఞాన మేది కలదో పరమానందస్వరూపమగు ఆ పర తత్త్వము నీవే యగుచున్నావు.

వాఙ్మనస్సులకు ఆద్యంతములందు వెలయుచు, మధ్యన గూడ సాక్షియై ఏది విలసిల్లుచున్నదో, ఆ నిత్యస్వరూపుడవు నీవే; కాన, దేహభ్రమను పరిత్యజింపుము.

స్థూలశరీరమునకును, విరాట్ స్వరూపమునకును ఐక్యమును గ్రహింపుము. సూక్ష్మశరీరమునకును, హిరణ్యగర్భునకును ఏకత్వమును దర్శింపుము. అటులనే, అజ్ఞానమునకును, మాయకును, ప్రత్యక్-పరాక్ తత్త్వములకును ఐక్యమును తెలిసికొనుము;

చిన్మాత్రుడును, జీవబ్రహ్మైక్యస్వరూపుడును, వ్యాపనశీలుడునగు పరమాత్మయందు, రజ్జువునందు సర్పభ్రాంతివలె జగత్తు యొక్క భ్రమ కలుగుచున్నది.

శ్లో॥ తార్కికాణాం తు జీవేశౌ వాచ్యౌ వేతౌ విదు ర్బుధాః।
లక్ష్యౌ చ సాంఖ్యయోగాభ్యాం వేదాంతై రైక్యతా తయోః॥

శ్లో॥ కార్యకారణవాచ్యాంశౌ జీవేశౌ యౌ జహచ్చ తౌ।
అజహచ్చ తయోర్లక్ష్యౌ చిదంశా వేకరూపిణౌ॥

శ్లో॥ కర్మశాస్త్రే కుతో జ్ఞానం తర్కే నైవాస్తి నిశ్చయః।
సాంఖ్యయోగౌ భిదాపన్నౌ శాబ్దికా శ్శబ్దతత్పరాః॥

శ్లో॥ అన్యే పాషండిన స్సర్వే జ్ఞానవార్తాసుదుర్లభాః।
ఏకం వేదాంతవిజ్ఞానం స్వానుభూత్యా విరాజతే॥

తా॥ 'తత్త్వమసి' అను శ్రుతియొక్క వాచ్యార్థములైన జీవేశ్వరులనే తార్కికులు గ్రహించుచున్నారు. సాంఖ్యులకు యోగులకును, లక్ష్యార్థమే అభిమతము. వేదాంతదర్శనము జీవేశ్వరుల ఐక్యమును ప్రతిపాదించుచున్నది.

'తత్త్వమసి' యను ఉపనిషద్వాక్యము జహల్లక్షణయా వాచ్యార్థమైన జీవేశ్వరుల యొక్క కార్యకారణాంశను పరిత్యజించియు, అజహల్లక్షణచేత, ఈ అంశద్వయమును పరిత్యజించకయు, జహదజహల్లక్షణచేత అద్వయమగు బ్రహ్మనే ప్రతిపాదించుచున్నది.

కర్మకాండప్రతిపాదకమైన పూర్వమీమాంసాశాస్త్రమందు జ్ఞానమునకు తావే లేదు. తర్కశాస్త్రమున జ్ఞానస్వరూపనిశ్చయమే లేదు. యోగసాంఖ్యములు రెండును ద్వైతమును ప్రతిపాదించును. వైయాకరణులు శబ్దస్వరూపవిచారమునందే ఆసక్తులగుచున్నారు.

మిగిలినవారందరును జీవాత్మస్వరూపజ్ఞానముతో పరిచయము లేని పాషండులు. ఉపనిషత్తులచే ప్రతిపాదింపబడిన వేదాంతవిజ్ఞానమొక్కటే ఆత్మానుభవముతో వెలుగొందుచున్నది.

శ్లో॥ అహం మమేత్యయం బంధో మమాహం నేతి ముక్తతా।
బంధమోక్షౌ గుణై ర్భాతః గుణాః ప్రకృతిసంభవాః॥

శ్లో॥ జ్ఞాన మేకం సదా భాతి సర్వావస్థాసు నిర్మలమ్।
మందభాగ్యా న జానంతి స్వరూపం కేవలం బృహత్॥

శ్లో॥ సంకల్పసాక్షి యద్ జ్ఞానం సర్వలోకైకజీవనమ్।
తదేవాస్మీతి యో వేద స ముక్తో నాత్ర సంశయః॥

శ్లో॥ ప్రమాతా చ ప్రమాణం చ ప్రమేయం ప్రమితి స్తథా।
యస్య భాసాఽవభాసంతే మానం జ్ఞానాయ తస్య కిమ్॥

శ్లో॥ అర్థాకారా భవే ద్వృత్తిః ఫలేనార్థం ప్రకాశతే।
అర్థజ్ఞానం విజానాతి స ఏవార్థః ప్రకాశతే॥

తా॥ 'నేను, నాది' యను భావమే బంధము. అహంతా-మమతాభిమానములు లేకుండుటయే మోక్షము. బంధము, మోక్షము-రెండును సత్త్వ-రజ-స్తమోగుణముల వలన కలుగుచున్నవి. ఈ గుణములు ప్రకృతిసంభవములు.

నిర్మలమగు జ్ఞానమే సదా సర్వావస్థలందు భాసించు చున్నది. మందభాగ్యులైన జనులు స్వస్వరూపమగు బ్రహ్మ నెరుగకున్నారు.

సర్వసంకల్పములకు సాక్షిభూతుడును, నిఖిలలోకము నకు ఏకైక జీవనమునగు ఏ జ్ఞానము కలదో, ఆ జ్ఞానస్వరూప మను నేనేయని, ఎవడు తెలిసికొనునో, అతడు ముక్తు డను టలో సంశయ మేమియు లేదు.

ప్రమాత, ప్రమాణము, ప్రమేయము, ప్రమితి ఇవన్నియు, దేని ప్రకాశముచే భాసించుచున్నవో అట్టిదాని జ్ఞానమునకు ప్రమాణము యొక్క ఆవశ్యకత యేమి గలదు?

అంతఃకరణవృత్తి విషయాకారము నొందును; అపుడది ప్రమితి ఫల మగుచున్నది. దీనివలన, విషయప్రకాశనము జరుగును. ప్రమాత ఏ విషయజ్ఞానమును తెలిసికొనుచున్నాడో ఆ విషయమే భాసించుచున్నది.

శ్లో॥ వృత్తివ్యాప్యత్వ మేవాస్తు ఫలవ్యాప్తిః కథం భవేత్।
స్వప్రకాశస్వరూపత్వాత్ సిద్ధత్వాచ్చ చిదాత్మనః॥

శ్లో॥ చిత్తం చైతన్యమాత్రేణ సంయోగాత్ చేతనా భవేత్।
అర్థా దర్థాంతరే వృత్తిః గంతుం చలతి చాంతరే॥

శ్లో॥ నిరాధారా నిర్వికారా యా దశా సోన్మనీ స్మృతా।
చిత్తం చిదితి జానీయాత్ తకారరహితం యదా॥

శ్లో॥ తకారో విషయాధ్యాసో జపారాగో యథా మణౌ।
జ్ఞేయవస్తుపరిత్యాగాత్ జ్ఞానం తిష్ఠతి కేవలమ్॥

శ్లో॥ త్రిపుటీ క్షీణతా మేతి బ్రహ్మనిర్వాణ మృచ్ఛతి।
మనోమాత్ర మిదం సర్వం తన్మనో జ్ఞానమాత్రకమ్॥

తా॥ చిదాత్మ స్వప్రకాశస్వరూపము సిద్ధవస్తువు నగుటచేత ఆత్మకు వృత్తివ్యాప్యత్వ ముండిన ఉండుగాక; ఫలవ్యాప్యత్వ మెట్లు సంభవించును?

చిత్తమునకు చైతన్యసంయోగమాత్రముచేతనే చైతన్యము కలుగుచున్నది. చిత్తవృత్తి విషయమునుండి విషయాంతరమునకు బోవుసమయమున మధ్యభాగమందు కూడ చైతన్యము దానిననుసరించుచు విరాజిల్లును.

నిరాధారము నిర్వికారము నగు స్థితిని 'ఉన్మనీస్థితి' యందురు. చిత్తము 'త' కార రహితమైనప్పుడు 'చిత్' అగునని తెలిసికొన నగును.

చిత్తమందలి 'త' కారమే విషయాధ్యాస. ఇది స్ఫటికమణి యందు ప్రతిఫలించిన జపాకుసుమము యొక్క అరుణరాగము వంటిది. అది వాస్తవికమైనది కాదు. జ్ఞేయ వస్తువును పరిత్యజించిన, కేవలజ్ఞానమే మిగులును.

జ్ఞాత, జ్ఞానము, జ్ఞేయము-అను త్రిపుటి క్షయ మొందినచో, బ్రహ్మనిర్వాణము లభించును. దృశ్యప్రపంచమైన ఈ సర్వము మనోవిలాసమే. పరిశుద్ధమైన ఆ మనస్సు జ్ఞానపర్యవసాయి.

శ్లో॥ అజ్ఞానం భ్రమ ఇత్యాహు ర్విజ్ఞానం పరమంపదమ్।
అజ్ఞానం చాన్యధాజ్ఞానం మాయా మేతాం వదంతి తే॥

శ్లో॥ ఈశ్వరం మాయినం విద్యాత్ మాయాతీతం నిరంజనమ్।
సదానందే చిదాకాశే మాయా మేఘః తటిన్మనః॥

శ్లో॥ అహంతా గగ్గనం తత్ర ధారాసారా హి వృత్తయః।
మహా మోహాంధకారేఽస్మిన్ దేవో వర్షతి లీలయా॥

శ్లో॥ తస్యా వృష్టే ర్విరామాయ ప్రబోధైకసమీరణః।
జ్ఞానం దృగ్దృశ్యయోర్భావం విజ్ఞానం దృశ్యశూన్యతా॥

శ్లో॥ ఏకమేవాద్వయం బ్రహ్మ నేహ నానాస్తి కించన।
క్షేత్రక్షేత్రజ్ఞయోః జ్ఞానం తద్‌జ్ఞానం జ్ఞాన ముచ్యతే॥

తా॥ అజ్ఞాన మనగా భ్రమ, విజ్ఞాన మనగా పరమపద మని అందురు. అన్యథాజ్ఞానమే అజ్ఞానము, జ్ఞానాభావము కాదు. దీనినే మాయ అందురు.

ఈశ్వరుని మాయాశబల మూర్తిగను, నిరంజన పరబ్రహ్మను మాయాతీతునిగను తెలియనగును. సదానంద స్వరూపమైన చిదాకాశమందు, మాయ మేఘముగను, మనస్సును విద్యుల్లతగను ఎరుగునది.

అహంతయే మేఘగర్జన కాగా, మనోవృత్తులు ధారాపాతముగ పడుచున్నవి. ఇట్టి మహామోహాంధకారము నందు భగవానుడు లీలగా, వర్షించుచుండును.

ఈ వర్షమును నిరోధింపగలది ప్రబోధ మను వాయువు మాత్రమే. ఆ ప్రబోధము జ్ఞానము విజ్ఞానమని రెండు తెరగుల బరగును. దృక్-దృశ్యభేదమును గ్రహించుట జ్ఞాన మనబడును. దృశ్యముదూరమై తెలివి ఒక్కటే మిగిలియుండుట విజ్ఞాన మనబడును.

ఏకము అద్వితీయమగు బ్రహ్మయే యున్నది; నానా విధమగునది ఏదియు నిట లేదనుచు శ్రుతి యుద్ఘోషించు

చున్నది. క్షేత్ర-క్షేత్రజ్ఞుల జ్ఞానమే జ్ఞానమని స్మృతివచనము వలన తెలియుచున్నది.

శ్లో॥ విజ్ఞానం చోభయో రైక్యం క్షేత్రజ్ఞపరమాత్మనోః।
పరోక్షం శాస్త్రజం జ్ఞానం విజ్ఞానం చాత్మదర్శనమ్॥

శ్లో॥ ఆత్మనో బ్రహ్మణ స్సమ్యక్ ఉపాధిద్వయవర్జితమ్।
తమర్థవిషయం జ్ఞానం విజ్ఞానం తత్పదాశ్రయమ్॥

శ్లో॥ పదయో రైక్యబోధస్తు జ్ఞానవిజ్ఞాన సంజ్ఞితమ్।
ఆత్మానాత్మవివేకస్య జ్ఞానమాహు ర్మనీషిణః॥

శ్లో॥ అజ్ఞానం చాన్యథా లోకే విజ్ఞానం తన్మయం జగత్।
అన్వయవ్యతిరేకాభ్యాం సర్వత్రైకం ప్రపశ్యతి॥

శ్లో॥ యత్తత్ వృత్తిజం జ్ఞానం విజ్ఞానం జ్ఞానమాత్రకమ్।
అజ్ఞానధ్వంసకం జ్ఞానం విజ్ఞానం చోభయాత్మకమ్॥

తా॥ క్షేత్రజ్ఞుడు పరమాత్మ-వీరియొక్క ఐక్యజ్ఞానమే విజ్ఞానము; శాస్త్రజన్యమైన జ్ఞానము పరోక్షజ్ఞానము, ఆత్మ దర్శనవిజ్ఞానము అపరోక్షజ్ఞాన మని తెలియనగును.

ఉపాధిద్వయవర్జితములైన ఆత్మబ్రహ్మల యొక్క 'త్వం' పదార్థవిషయమును జ్ఞాన మనియు, 'తత్' పదార్థ విషయమును విజ్ఞాన మనియు నందురు.

'తత్-త్వం' పదములయొక్క సమాహారజ్ఞానము జ్ఞాన, విజ్ఞాన సంజ్ఞచే నభిహిత మగును. ఆత్మానాత్మవివేక మును విద్వాంసులు జ్ఞాన మందురు.

ఈ లోకమున, అన్యథాజ్ఞానమే అజ్ఞానసంజ్ఞతో చెప్పబడుచున్నది. విజ్ఞానము ప్రాప్తించినచో, జగత్తు బ్రహ్మమయ మగును. అన్వయ, వ్యతిరేకములచేత సర్వత్ర ఏకాత్మదర్శనమే చేయనగును.

జ్ఞానము అంతఃకరణవృత్తిజన్య మయినచో, కేవల జ్ఞానమాత్రమైనది విజ్ఞానము. జ్ఞానము అజ్ఞానమును నివర్తింప చేసిన, విజ్ఞానము ఉభయాత్మకమై ఒప్పారును.

శ్లో॥ జ్ఞానవిజ్ఞాననిష్ఠోఽయం తత్సద్బ్రహ్మణి చార్పణమ్।
భోక్తా సత్త్వగుణ శ్శుద్ధో భోగానాం సాధనం రజః॥

శ్లో॥ భోగ్యం తమోగుణం ప్రాహు రాత్మా చైషాం ప్రకాశకః।
బ్రహ్మధ్యయనసంయుక్తో బ్రహ్మచర్యరత స్సదా॥

శ్లో॥ సర్వం బ్రహ్మేతి యో వేద బ్రహ్మచారీ స ఉచ్యతే।
గృహస్థో గుణమధ్యస్థః శరీరం గృహ ముచ్యతే॥

శ్లో॥ గుణాః కుర్వంతి కర్మాణి నాహం కర్తేతి బుద్ధిమాన్।
కి ముగ్రై శ్చ తపోభిశ్చ యస్య జ్ఞానమయం తపః॥

శ్లో॥ హర్షామర్షవినిర్ముక్తో వానప్రస్థః స ఉచ్యతే।
స యతి ర్యో గృహాతీతః శరీరం గృహముచ్యతే॥

శ్లో॥ సదాచార మిమం నిత్యం యోఽనుసందధతే జనః।
సంసారసాగరాత్ శీఘ్రం స ముక్తో నాత్ర సంశయః॥

తా॥ సద్రూపమైన బ్రహ్మవస్తు వేది కలదో దానియందు సమర్పణము చేయుటయే, జ్ఞాన విజ్ఞాననిష్ఠ. భోక్త శుద్ధసత్త్వ

గుణ ప్రధాను డయిన, భోగసాధనము రజోగుణప్రధానము. భోగ్యవస్తుజాత మంతయు తమోగుణ ప్రధానము. ఆత్మ ఈ మూడింటిని ప్రకాశింపజేయునట్టిది.

స్వాధ్యాయాధ్యయన తత్పరుడై, బ్రహ్మచర్యవ్రత దీక్షా ధారియై సర్వము బ్రహ్మయని, ఎవడు తెలిసికొనునో, అతడు బ్రహ్మచారియని చెప్పబడును. గుణమయమగు శరీర మును గృహమందురు. అట్టి గృహమున నివసించువాడు గృహస్థు యనబడును.

'గుణములే క్రియాకలాపముల నొనర్చుచున్నవి; నేను కర్తనుగాను'-అని భావించెడివాడే బుద్ధిమంతుడు. ఈవిధమైన జ్ఞానమయతపము చేయు బుద్ధిమంతునికి కాయక్లేశాదిరూప మైన ఉగ్రతపశ్చర్యతో పని యేమి?

హర్షామర్షములు లేనివాడే వానప్రస్థుడని చెప్ప బడును. దేహమే గృహమని చెప్పబడుచున్నదిగాన, గృహా తీతుడే అనగా, శరీరాభిమానరహితుడే యతి యని చెప్ప బడును.

ఎవడు అహరహము ఈ సదాచారము ననుసంధానము చేయుచుండునో, అతడు శీఘ్రముగా భవసాగరమునుండి ముక్తుడగు ననుటలో సందియములేదు.

ఈవిధముగా, శిష్యులకు సదాచారము నుపదేశించిన తరువాత శంకరుడు 'సాధనపంచకమ్' అను ఉపదేశ పంచకమును చెప్పిరి.

శ్లో॥ వేదో నిత్య మధీయతాం తదుదితం కర్మ స్వనుష్ఠీయతాం
తేనేశస్య విధీయతా మపచితిః కామ్యే మతి స్త్యజ్యతామ్।
పాపౌఘః పరిధూయతాం భవసుఖే దోషోఽనుసంధీయతాం
ఆత్మేచ్ఛా వ్యవసీయతాం నిజగృహా త్తూర్ణం వినిర్గమ్యతామ్॥

తా॥ నిత్యము వేదాధ్యయనము చేయుము; వేదప్రతిపాదిత కర్మలను చక్కగా అనుష్ఠింపుము; ఆ కర్మాచరణము చేతనే ఈశ్వరార్చన మొనర్చుము; కామ్యకర్మలందు బుద్ధిని విడనాడుము; పాపములను పరిహరించుకొనుము; సంసారమునందు లభించు సుఖములందలి దోషము ననుసంధానము చేయుము; ఆత్మజ్ఞానమును బడయ నిచ్ఛను పెంపొందించుకొనుము; స్వగృహమును వెంటనే విడచి వెళ్లుము.

శ్లో॥ సంగ స్సత్సు విధీయతాం భగవతో
భక్తిః దృఢాఽఽధీయతాం
శాంత్యాదిః పరిచీయతాం దృఢతరం
కర్మ ఆశు సంత్యజ్యతామ్।
సద్విద్వా నుపసర్ప్యతాం ప్రతిదినం
తత్పాదుకా సేవ్యతాం
బ్రహ్మైకాక్షర మర్థ్యతాం శ్రుతిశిరో
వాక్యం సమాకర్ణ్యతామ్॥

తా॥ సాధుసజ్జనసాంగత్యము చేయుము; పరమేశ్వరునియెడ దృఢభక్తి కలవాడవై యుండుము; శాంతి, దాంతి మున్నగు గుణములను సముపార్జించుము; కామ్యములు, నిషిద్ధములు

నగు కర్మలను పరిత్యజింపుము; సద్విద్వాంసుల నుపాసింపుము; ప్రతిదినము వారి పాదుకలను సేవింపుము: బ్రహ్మప్రతిపాదకము, ఏకాక్షరమునగు ప్రణవమంత్రమును యాచింపుము; ఉపనిషద్వాక్యశ్రవణము చేయుము.

శ్లో॥ వాక్యార్థశ్చ విచార్యతాం శ్రుతిశిరః
పక్ష స్సమాశ్రీయతాం
దుస్తర్కా త్సువిరమ్యతాం శ్రుతిమత
స్తర్కోఽనుసంధీయతామ్।
బ్రహ్మైవాస్మి విభావ్యతా మహరహః
గర్వః పరిత్యజ్యతాం
దేహేఽహంమతి రుజ్ఝ్యతాం బుధజనై
ర్వాదః పరిత్యజ్యతామ్॥

తా॥ వేదాంత మహావాక్యార్థవిచారము చేయుము; వేదాంతపక్షమును సమాశ్రయింపుము; దుస్తర్కమును, వీడుము; శ్రుతిసంమతమైన తర్కము ననుసంధానము చేయుము; అహరహము 'బ్రహ్మైవాస్మి' అని భావన చేయుము; గర్వమును పరిత్యజింపుము; దేహమునందు అహంబుద్ధిని, అనగా, నేను దేహమను అను భావమును వదలుము, బుధజనులతో వాదన సేయకుము.

శ్లో॥ క్షుద్వ్యాధిశ్చ చికిత్స్యతాం ప్రతిదినం
భిక్షౌషధం భుజ్యతాం
స్వాద్వన్నం న తు యాచ్యతాం విధివశాత్
ప్రాప్తేన సంతుష్యతామ్।

శీతోష్ణాది విసహ్యతాం న తు వృథా
వాక్యం సముచ్చార్యతాం
ఔదాసీన్య మభీప్స్యతాం జనకృపా
నైష్ఠుర్య ముత్సృజ్యతామ్॥

తా॥ క్షుత్తు అను రోగమునకు చికిత్స చేయుము; ప్రత్యహము భిక్షాన్నమును ఔషధముగా సేవింపుము; రుచికరమగు ఆహారమును యాచింపకుము; విధివశమున ప్రాప్తమైన దానితో సంతుష్టినందుము; శీతోష్ణాది ద్వంద్వములను సహించుము; వ్యర్థముగా మాటలాడకుము; తాటస్థ్యమును వహింపుము; జనుల కృపయెడ నైష్ఠుర్యమును విడనాడుము.

శ్లో॥ ఏకాంతే సుఖ మాస్యతాం పరతరే
చేత స్సమాధీయతాం
పూర్ణాత్మా సుసమీక్ష్యతాం జగదిదం
తద్బాధితం దృశ్యతామ్।
ప్రాక్కర్మ ప్రవిలాప్యతాం చితిబలాత్
నాప్యుత్తరైః శ్లిష్యతాం
ప్రారబ్ధ స్త్విహ భుజ్యతాం అథ పర
బ్రహ్మాత్మనా స్థీయతామ్॥

తా॥ విజనప్రదేశమందు సుఖముగ నాసీనుడవు కమ్ము; పరబ్రహ్మయందు చిత్తమును చక్కగా నుంచుము; ఈ జగత్తును పూర్ణమైన ఆత్మస్వరూపముగా దర్శించుము; ఈ జగత్తును బాధితమైనదిగా, అనగా, నశ్వరముగా భావింపుము; పూర్వకర్మను క్షయమొనర్చుకొనుము; జ్ఞానబలమువలన ఆగామి

కర్మలయందు అనురక్తుడవు కాకుము; ప్రారబ్ధకర్మఫలమును ఇట అనుభవింపుము; అనంతరము బ్రహ్మాత్మయందు స్థిరముగా నుండుము.

శ్లో॥ యః శ్లోకపంచక మిదం పఠతే మనుష్యః
సంచింతయ త్యనుదినం స్థిరతా ముపేత్య।
తస్యాశు సంసృతిదవానల తీవ్రఘోర
తాపః ప్రశాంతి ముపయాతి చిత్తేః ప్రసాదాత్॥

తా॥ ఏ మనుష్యుడు ప్రతిదినము ఈ శ్లోకపంచకమును పఠించునో, తదర్థమును స్థిరచిత్తుడై చక్కగా మననము చేయునో వానికి సంసార మను దావానలము యొక్క తీవ్ర ఘోరతాపము నుండి సచ్చిదానందస్వరూపుడగు పరమేశ్వరుని యనుగ్రహవిశేషము వలన శాంతి లభించును.

5. అద్వైత విజయము

సనందనాది శిష్యులతో శ్రీశంకరులు కాశీనుంచి హరిద్వారము చేరిరి. అచట కొన్ని దినము లుండి, హృషీకేశమున కేగిరి. హరిద్వారమున భగవత్పాదులు వసించి రని చెప్పు స్థలముననే శృంగేరీమఠమువారు తమమఠము నొకదానిని నిర్మించిరి. హరిద్వారమున అనేక దేవతామూర్తులను ఆచార్యులవారే పునఃప్రతిష్ఠ జేయవలసి వచ్చినదట. అచటి నుంచి బదరికాశ్రమమునకు పోయి అనేకఋషులను దర్శించిరి. ఇచటి నారాయణుని మూర్తి అలకనందానదిలో పడిపోయిన దని విని, ఆ నదినుంచి విగ్రహమును బయటకు తెచ్చి, ప్రతిష్ఠించిరి. ఈ విగ్రహమునకు పూజాదికము చేయుటకు నంబూద్రిబ్రాహ్మణుని ఒకనిని నియమించిరి. నేటిదాకా అచ్చటి పూజారి కేరళవాసియగు నంబూద్రి బ్రాహ్మణుడే. బదరీనారాయణుడు శంకరునిచే పునఃప్రతిష్ఠితుడైనాడు. ఆ విగ్రహమే నేడుకూడా మనకు కన్పించునది.

బదరికాశ్రమము పావనమైనది, తపఃసంపన్నమైనది. బదరిలోని వ్యాసాశ్రమమున కొంతకాలము నివసించి అక్కడ మరల అధ్యయనము చేసి, శంకరుడు భాష్యరచనకు పూనుకొనె నని సంప్రదాయము. ఆపై మరల కాశీ వచ్చి, శిష్యులకు ఉపదేశము చేయ నారంభించిరి. ఈ సమయమున కన్పించు సన్నివేశమును

శ్లో॥ చిత్రం వటతరోర్మూలే వృద్ధాః శిష్యా గురు ర్యువా
గురోస్తు మౌనం వ్యాఖ్యానం శిష్యాస్తు ఛిన్నసంశయాః॥

అను శ్లోకము వర్ణించునది అని చెప్పుదురు. వ్యాసదర్శనము కల్గినను, లేకున్నను, ఆచార్యుడు వ్యాసాశ్రమమున నివసించి, ఆ ప్రశాంతవాతావరణమున ప్రస్థానత్రయభాష్యాదులను రచించెను. తిరిగి వచ్చునప్పు డాచార్యుడు తనవెంట ఈ భాష్యములను తెచ్చెను. వీటిని పాఠము చెప్పుటతో మూల గ్రంథము నిర్దుష్టము, సులభమునై అనేకుల నప్పటినుంచి ఆకర్షించుచు వచ్చినది.

బదరికాశ్రమమునుండి కేదారనాథము చేరిరి. అక్కడ మిక్కుటమగు చలి యుండుటచే, యోగదృష్టితో ఎచట ఉష్ణోదకము గలదో కనుగొని రని, అదే నేడు తప్తకుండ మని పిలువబడు స్థలమని చెప్పుదురు.

బాలోఽప్యయం ప్రతిదినం సలిలేఽతిశీతే
స్నాతీతి జాతకరుణో జగదీశ ఏవ
ఉష్ణీచకార సలిలం ....

అని గురువంశకావ్యము (2.28) ఈ సన్నివేశమును వివరించినది. ఇచటినుంచి గంగోత్రిని జేరి, ఆపై ఉత్తరకాశిని ప్రవేశించిరి. తర్వాత మరల కొద్దిదినములకు కాశీనగరమును చేరిరి.

ఒకనాడు మణికర్ణికాఘాట్ వద్ద శ్రీ శంకరుని వృద్ధ బ్రాహ్మణు డొకడు కలిసి "తదనంతరప్రతిపత్తౌ రంహతి సంపరిష్వక్తః ప్రశ్ననిరూపణాభ్యామ్" (3.2.2) అను వేదాంతసూత్రమును వివరింపు మని కోరెను. ఆపై వారిరు

వరకు ఎనిమిది దినముల వరకు వాదము జరిగెను. ఎవరును తమ తమ సిద్ధాంతములను వదలుకొనలేదు. అప్పుడు పద్మ పాదుడు ఆ వృద్ధ బ్రాహ్మణుని వ్యాసునిగా గుర్తించి వ్యాస శంకరులను స్తుతించెను. శ్రీశంకరులు కూడ వ్యాసుని స్తుతించి రనియు, సంతుష్టుడైన వ్యాసుడు

శ్లో॥ అష్టౌ వయాంసి విధినా తవ వత్స దత్తా
న్యన్యాని చాష్ట భవతా సుధియాఽఽర్జితాని
భూయోఽపి షోడశ భవంతు భవాజ్ఞయా తే
భూయాచ్చ భాష్య మిద మారవిచంద్రతారమ్॥

అని ఆశీర్వదించె నని ఒక కథ. ఈ శ్లోకము వ్యాసాచలీయ మున, మాధవీయమున కూడ గలదు. వస్తుతః, ఎనిమిదేండ్లే ఆయుర్దాయము గలిగిన శంకరుడు, తన తపస్సు ద్వారా ఇంకొక ఎనిమిదేండ్లు సంపాదించెను. భాష్యరచనల వలన మరొక పదునారుసంవత్సరములు లభించినవి. పదునారవ సంవత్సరము వచ్చునప్పటికి భాష్యరచన ఐనది. వ్యాసుని ప్రార్థనకు బ్రహ్మదేవుడు

శ్లో॥ స్వచ్ఛందం విహర త్వేషః స్వీయభాష్యం ప్రచారయన్।
శివ న్నిచ్ఛానుసారేణ కైలాసం యాతు తత్పరమ్॥

అని పల్కె నని చిద్విలాసీయమున గలదు. స్వచ్ఛందమరణ మును బ్రహ్మదేవుడే ప్రసాదించె నట వస్తుతః శంకరునకు గల ఆయుర్దాయము పదునారు సంవత్సరము లని

శ్లో॥ శరదోఽష్ట పున స్తథాష్ట తే
తనయస్యాస్య తథా వ్యసౌ పునః
నివసిష్యతి కారణాంతరా
ద్భువనేఽస్మిన్ దశ షట్చ వత్సరాన్॥

అని మాధవీయ శంకరవిజయమున (5.48) కూడ కలదు.

శంకరుడు ముప్పదిరెండు సంవత్సరములే జీవించెనని శంకరవిజయగ్రంథములు చెప్పుచున్నవి.

'ద్వాత్రింశ త్పరమాయు స్తే శీఘ్రం కైలాస మానస' అని శివరహస్యమున గలదు. ముప్పదిరెండేండ్లు లభించినట్లు అని నవ కాళిదాసు వ్రాసిన మాధవీయ మన బడు శంకరవిజయమున గలదు. మాణిక్యవిజయము కూడ ఈ ఆయుర్దాయమునే చెప్పినది.

వీటికి భిన్నముగా నందగిరి ప్రభృతులు పలికిరి.

శ్లో॥ స ఏవ శంకరాచార్యః సాక్షాత్ కైలాసనాయకః
యావ దిచ్ఛాబ్ధ ముర్వ్యాం హి స్థిత్వా పశ్చా ద్గమిష్యతి॥

అని బ్రహ్మ శంకరునకు స్వచ్ఛందమరణము నొసగెనని, 53 వ ప్రకరణమున చెప్పి, తర్వాత ప్రకరణములో

శ్లో॥ ఇతి బ్రాహ్మవచః శ్రుత్వా వ్యాసః కాశీకృతాలయః
కరేణానీయ గంగాంబు జీవత్వం శరదాంశతమ్।
ఇత్యుక్త్వా ప్రోక్షయామాస శంకరాచార్య ముత్తమమ్॥

అని ఆనందగిరి వ్రాసినాడు. బ్రహ్మ స్వచ్ఛందమరణము నొసగినను, వ్యాసుడు నూరేండ్ల ఆయుర్దాయమునే ఇచ్చెనట. ముప్పది రెండేండ్లే ఆచార్యుడు జీవించెనని చెప్పుట ఈ ఆనంద గిరికి కుదరదు.

ప్రయాగ పుణ్యక్షేత్రములలో నొకటి. శంకరుడు ప్రయాగ వచ్చి కుమారిలభట్టును కలసికొనె నను కథను తర్వాతివారు అల్లిరి. కుమారిలభట్టు యొక్క ఆదేశము ననుసరించి ఆయన శిష్యుడగు మండనునితో శంకరుడు శాస్త్రార్థము చేసెనని ఈ కథకు అనుబంధ మున్నది. కుమారిలుడు గొప్ప విద్వాంసుడు. ధర్మశాస్త్రవేత్త, మీమాంసకుడు, సంఘ సంస్కర్త. వైదికమతమును ముఖ్యముగా కర్మకాండను, గట్టి పునాదులపై నిలబెట్టగలిగెను.

శాబరభాష్యముపై వార్తికములను వ్రాసిన కుమారిలభట్టు అస్సాం ప్రాంతము వాడని కొందరనినారు. లామాతారానాథు డితని ద్రావిడదేశ మనినాడు. మండన మిశ్రుని మేనమామ అని మిథిలావాసుల కథ. ప్రయాగలో జన్మించినవాడని వేరొక కొందరు. ఆనందగిరి ఈయనది ఉదగ్దేశ మనినాడు. "వార్తికకారమిశ్ర" నామముతో నితనిని శాలికనాథుడు ఉల్లేఖించెను. ఆంధ్రదేశములో ఉత్తర దిక్కున గల 'జయమంగళ' గ్రామము నుంచి కుమారిలుడు వచ్చెనని జైనులు పల్కిరి. ఈ వాదమునకే ఎక్కువ ఆధారములు కూడ గలవు. త్రిమలయ గ్రామ మనగా శ్రీశైలము

కాని, శ్రీపర్వతము కాని తిరుమల కాని కావచ్చును. త్రిమల యమున కుమారిలుని మేనల్లుడు ధర్మకీర్తి గలడు. కుమారిలుని శాస్త్రార్థమున ధర్మకీర్తి ఓడించెనని అప్పుడాయన బౌద్ధుడాయెనని తారానాథుని కథనము. కుమారిలుడు బౌద్ధవేషముతో బౌద్ధుల తర్కమును చక్కగా పఠించినట్లు చెప్పుదురు. బౌద్ధతర్కమును పూర్తిగా స్వాధీనము చేసికొనిన కుమారిలుడు ధర్మకీర్తి చేతిలో ఓడిపోవుట అసంభవము. తనమేనల్లుడగు ధర్మకీర్తికి శ్లోకవార్తికాదులను పాఠము చెప్పినవాడు కుమారిలుడు. అందువలననే, ధర్మకీర్తి తన 'వాదన్యాయము' మొదలగు గ్రంథములలో కుమారిలుని వార్తికములను పూర్తిగా ఉదహరించి చర్చించినాడు.

ఈ కుమారిలుని మేనల్లుడు ధర్మకీర్తి అని తెలిసికొనక మండనుని ఆయన మేనల్లునిగా శంకరవిజయములలో చిత్రించిరి. కుమారిలుని స్ఫోటఖండనను మనస్సులో నుంచుకొని

'దుర్విదగ్ధైరవక్షిప్తే దర్శనే పదదర్శినామ్'

అని తనస్ఫోటసిద్ధిని మండనుడు మొదలిడెను. దుర్విదగ్ధ శబ్దము కుమారిలుని వర్ణించుటకు చెప్పబడినది. ఇట్లు కుమారిలుని తూలనాడిన మండనుడు కుమారిలుని శిష్యుడు గాని, మేనల్లుడు కాని కాజాలడు.

కుమారిలుని శిష్యులలో ప్రభాకర, మండన, ఉంవేకులు గలరని కొందరనిరి. కాని గురువంశ కావ్యమున

శ్లో॥ శిష్యో మమాస్తి మగధేషు స విశ్వరూపో।
భూమౌ ప్రసిద్ధసుగుణోఽఖిలశాస్త్రవేత్తా
తస్యాంగనా వసతి చోభయభారతీతి....

అని కుమారిలు డనినట్లున్నది. కుమారిలుని శిష్యుడు విశ్వరూపుడు అని ఇచట గలదు. ఈ విశ్వరూపుని భార్య ఉభయభారతి. ఉభయవేదాంతమనినట్లు ఉభయభారతి అను శబ్దము విచిత్రమైనదే.

కుమారిలుని మాటలను స్మరించుకొనుచు విశ్వరూపుని కలసికొనవలె నని శంకరుడు పోవుచుండగా

శ్లో॥ వాక్యం తదీయ మనుమత్య తతః ప్రయాంతం
యోగీంద్ర మైక్షత స మండనమిశ్రవిద్వాన్॥

అని గురువంశకావ్యమున (2.47) కలదు. మండనమిశ్రుడు వెంట రాగా శంకరుడు విశ్వరూపుని కలిసికొనుటకు పోయెను. దారిలో శంకరుడు మండనునకు వేదాంతబోధ గావించెను. గురువంశకావ్యకర్త దృష్టిలో మండనుడు వేరు, విశ్వరూపుడు వేరు. మండనశబ్దమును ఒక బిరుదముగా గ్రహించవలె నను సూచన కలదు. ఐనను శంకరుడు బ్రహ్మసిద్ధికారు డగు మండనుని కలియలేదని స్పష్టముగా చెప్పవచ్చును.

సంక్షేపశారీరక వ్యాఖ్యాత మండనుని సిద్ధాంతమును ఖండించుచు, సురేశ్వరుని భావములను నిలబెట్టెను. నైష్కర్మ్యసిద్ధి పై గల ఒక టీకలో అపరోక్షజ్ఞానమును చర్చించు సంద

ర్భమున మండన, వాచస్పతుల వాదముల ఖండన కలదు. మండనుడు జ్ఞానకర్మసముచ్చయవాది. ఈ వాదమును శంకరుడే తీవ్రముగా ఖండించెను. శంకరసురేశ్వరు లంగీకరించని స్ఫోటవాదమును మండనుడు ప్రత్యేకముగా సమర్థింప ప్రయత్నించెను. ప్రకాశాత్మయతి మండనుని వాదమును, సురేశ్వరుని వాదమును విడివిడిగా విమర్శించెను. ఆనందబోధ విరచితమైన న్యాయమకరందమున మండన, సురేశ్వరులు భిన్న వ్యక్తులుగానే గ్రహింపబడినారు.

మండనుని నివాసస్థలము మాహిష్మతి అనినారు. నర్మదా తీరమున మాహిష్మతీ నగరము కలదని, దాని ప్రస్తుత నామము చోలీమహేశ్వర మని అందురు. ఇచట రాజరాజేశ్వరీ మందిరమున్నది. ఈ నగరమునకు తూర్పుగా నర్మదకు మహిష్మతి లేక మహేశ్వరి అనబడు ఉపనది ఉన్నది. ఈ నదికి ఇరువైపుల కాలేశ్వర, జ్వాలేశ్వరాలయము లున్నవి. మహేశ్వరనగరమునకు పశ్చిమమున మతంగఋషి యొక్క ఆశ్రమ మున్నది. సమీపమున భర్తృహరి గుహ కలదు.

మండనుని మహిష్మతి విదర్భలో గలదని మాధవీయమున, మగధలో నని వ్యాసాచలీయమున, కాశ్మీరము లో నని చిద్విలాసీయమున నున్నది. మండనుడే విశ్వరూపుడని (7,114) ఉంవేకుడని (7.116) మాధవుడు. వీరిలో నెవ్వరికిని సరియైన చారిత్ర్యక విషయములు తెలియవని, భౌగోళికజ్ఞానము లేనే లేదని బట్టి స్పష్టమగుచున్నది.

హిమమిత్రుని కుమారుడు మండను డని నవకాళిదాసు వ్రాసిన శంకరవిజయము. మండనుడు కుమారిలుని మేనల్లు డని ఆనందగిరి శంకరవిజయము. మాహిష్మతీ నగరమును ప్రవేశించి మండనుని గృహమెక్కడ? అని ప్రశ్నించిన శంక రునకు ప్రత్యుత్తరముగా

శ్లో॥ స్వతః ప్రమాణం పరతః ప్రమాణం
కీరాంగనా యత్ర గిరం గిరంతి।
ద్వారస్థ నీడాంతర సంనిరుద్ధా
జానీహి తన్మండన పండితౌకః॥

ఇత్యాది శ్లోకములు చెప్పబడినవి. ఈ శ్లోకములు ఎట్టి మార్పు లును లేక ఆనందగిరిలోను (56), నవకాళిదాసగు మాధవుని శంకరవిజయములోను ఉన్నవి. వీటికన్నిటికి మూలము వ్యాసా చలీయ శంకరవిజయము కాని చిద్విలాసీయ శంకరవిజయము కాని కావచ్చును. అనూచానముగావచ్చుచున్న గాథలను మండనునిపరముగా సమన్వయించిన రచన బయలుదేరగనే వాటి అసలు స్వరూపమే మరుగుపడిపోయినది. దీనితోబాటు ఆగాథలను చెప్పుశ్లోకములు అందరి సొత్తుగా భావించి, ప్రతి రచయిత నిర్మోహమాటముగా వాటిని గ్రహించెను. కొందరు తమ పాండిత్యమును, కవిత్వమును ప్రదర్శించుటకు వీటిని ఉపయోగించుకొనిరి.

మండను డప్పుడు శ్రాద్ధకర్మలో నుండెను. భోక్తలుగా వ్యాసుడు, జైమిని వచ్చిరట. జ్ఞానకాండ విరోధి యగు మండ నుడు తలుపుల నన్నింటిని బంధించుటచే శంకరుడు ఇంటి

కప్పులో నుంచి దూరి (8.13,14) మండనుని సమీపమున కూర్చొనెను. క్రోధముతో ఊగిపోవు మండనునికి, కాషాయ వస్త్రధారి యగు శంకరునకు కొంత వితండవాదము జరిగెను. శ్రాద్ధకర్మను శాంతముగా జరుపవలెనని, యతిని ఆదరపూర్వకముగా సత్కరించి భిక్ష జరుపవలెనని భోక్తలు చెప్పగా, అప్పుడు శాంతించి శంకరుని భిక్షకు ఆహ్వానించెను. కాని, శంకరుడు తాను శాస్త్రార్థరూపమగు భిక్షనే గ్రహింతు ననెను. మండను డందులకు అంగీకరించగా మండనుని భార్య యగు ఉభయభారతి (సరసవాణి) మధ్యవర్తిగా ఉండవలసివచ్చెను. ఓడినవాడు గెలచినవాని మతమును అవలంబించవలె ననికూడ వారంగీకరించిరి. శ్రాద్ధానంతరము శాస్త్రార్థము ప్రారంభమాయెను. అప్పుడు ఇద్దరి మెడలలోను పూలమాలలను వేసి, ఎవరిమాల ముందువాడునో వారు ఓడినట్లే భావించవలె నని ఉభయభారతి పల్కినది. అనేకదినములు జరిగిన ఈ వాదము ఒకనాడాగిపోయినది. మండనుని మెడలోని మాల వాడినది. ఆయనకు సంన్యాసము తప్పనిసరి ఆయెను. అంతకు ముందు శంకరుని భిక్షకు మండనుని వైశ్వదేవమునకు ఆహ్వానించుచున్న ఉభయభారతి ఆనాడు ఇద్దరిని భిక్షకే పిలచినది.

మండనుడు సన్యాసాశ్రమము గ్రహింపసంసిద్ధుడయ్యెను. కాని, ఉభయభారతి అందులకు అంగీకరించలేదు. శంకరుడు గెలువవలసినది ఒక్క మండనునిమాత్రమే కాదు. ఆయన అర్ధాంగిని కూడ ఓడింపక తప్పదు. కావున శంకరుడు స్త్రీతో శాస్త్రార్థము చేయవలసి వచ్చినది. కాని, ఆయన అంగీకరించలేదు.

అప్పుడు శారదాదేవి ఆయనతో పూర్వకాలమున యాజ్ఞవల్క్యుడు మైత్రేయితోను, గార్గితోను శాస్త్రార్థము చేసెను గనుక, నీవు కూడ నాతో శాస్త్రార్థము చేయవచ్చు నన్నదట! యాజ్ఞవల్క్యుడు దార్శనికవిషయములపై వివాదించినాడు. ఇప్పుడు ఉభయభారతి చర్చింపనెంచినది తత్త్వశాస్త్రము కాదు, కామశాస్త్రము. దీనికై శంకరు డొకనెల గడువు కోరుట, పరకాయప్రవేశము చేయుట, అమరుకశతకమును చెప్పుట మొదలగు అపభ్రంశవిషయములు కల్పింపబడినవి. గురువంశకావ్య మీవిషయమును ఇచట ప్రస్తుతించలేదు. మండనుడు ఓడిపోయిన వెంటనే ఇద్దరిని భిక్షకు పిలచి ఆమె అంతర్ధానమైనది (2.54) అని గురువంశకావ్యమున ఉన్నది.

శంకరుడు సర్వజ్ఞుడని శంకరవిజయకర్త లందరు నంగీకరించిన విషయమే. శంకరుడు జీవన్ముక్తుడని ఆయన భాష్యములే స్పష్టీకరించుచున్నవి. ఏకవిజ్ఞానము ద్వారా సర్వవిజ్ఞానము కల్గునని ప్రమాణీకరించిన శ్రుతి, ఏకవిజ్ఞానమునకు బ్రహ్మజ్ఞానమే అర్థ మనినది. అట్టిసందర్భమున శాస్త్రార్థములో కామశాస్త్ర మేల వచ్చినది? ఒకవేళ వచ్చినచో శంకరుడు పరకాయప్రవేశము చేయదగునా?

పరకాయప్రవేశమును సాధించుటకు "బంధకారణశైథిల్యా త్ప్రచారసంవేదనాచ్చ చిత్తస్య పరశరీరావేశః" అను యోగసూత్రమును (3.18) ఉదహరింతురు. చిత్తమునకు పరశరీరావేశమును చెప్పునపుడు ఇది మృతశరీరము కాజాలదు. పరశరీరము ప్రాణవంతమైనపుడే ఇతరుని

చిత్తము శరీరమును ఆవేశించి, తన కభిప్రేతమగు రీతిగా దానిని ప్రవర్తింపజేయగలదు. కాని, పౌరాణికగాథలలో పరకాయప్రవేశమును తెలుపు సన్నివేశములు కన్పించ గలవు. సౌభరి ఏబది శరీరములతో ఏబది కన్యలతో ఒకే సారి విహరించె నను పౌరాణిక గాథ సూత్రభాష్యమున (4.4.11) ఉదహరించబడినది. "అనేక శరీరం సృష్ట్వా తేషు ప్రవిశతి" అని 4.4.15,16 సూత్రములపై గల భాష్యములో చెప్పబడినది. 3.3.32 సూత్రమును వివరించుచు శంకరుడు పరశరీరావేశమును, మరల స్వశరీరమును ప్రవేశించుటను ప్రస్తుతించెను. బహుశః ఈవాక్యములు తర్వాతి శంకర విజయములలో గాథలకు ఆధారభూతమై యుండవచ్చును.

వాదమున ఉభయభారతి ఓడిపోయినదట. ఆమె ఓటమియే ఆమెకు శాపవిమోచనము. దుర్వాసుని జూచి నవ్వినందుకు సరస్వతి మర్త్యలోకమున జన్మించవలెనని, శంకరుడు మానవజన్మ ఎత్తి ఆమెకు శాపవిమోచన మొసగ గలడని దుర్వాసు డనినట్లు శివరహస్యమున గలదు. శాప విమోచనము కాగానే నిజస్వరూపమున బ్రహ్మలోకమునకు పోవసాగెను. అప్పుడు శంకరు డామెను వనదుర్గామంత్ర ముతో బంధించి, లోకోపకారమునకై భూలోకమున కల్పాం తముదాక ఉండిపొమ్మని కోరినాడట. ఆమె అట్లే అని, ఒక నియమమును విధించెను. శంకరుడు ముందుపోవుచుండగా, అదృశ్యరూపమున ఆమె వెనక వచ్చుచుండును. మార్గమధ్య మున శంకరుడు వెనుదిరిగిచూచినచో ఆమె అచటనే నిలచి

పోవును. శంకరు డందుల కంగీకరించెను. ఆమె నూపుర ధ్వనులను వినుచు శంకరుడు ముందుపోవుచుండెను. శృంగేరీ ప్రాంతమును చేరగనే ఆ నూపురధ్వని వినిపించకపోవుటచే వెనుదిరిగి చూచెను. దానితో శారదాదేవి శృంగేరిలోనే నిలచిపోవలసివచ్చినది. ఈ గాథ మాధవీయాదులలో కలదు. కానిశృంగేరీమఠమును ఆచార్యుడు తన ఇరువదియైదవయేట నాల్గవమఠముగా స్థాపించె నని సంప్రదాయ మగుటచే శారదాదేవిని కాశ్మీరమునుంచి తెచ్చెనను గాథలో సత్యము కలదు గనుక గురువంశకావ్యమును ఈ సందర్భమున గమనించుట అవసరము. శంకరుడు కాశ్మీరమున సర్వజ్ఞపీఠమును ఎక్కబోవుచుండగా ఒక అశరీరవాణి

శ్లో॥ దద్యాః పరీక్షా మఖిలాసు విద్యా।
స్వారోహ పీఠం పరధాతునేతి॥

అనినది (3.26). ఆమెతో వాదము చేసి గెలువగల్గిననే సర్వజ్ఞపీఠము నధిరోహింపవచ్చును. అన్ని శాస్త్రములలో ఓడి, చివరకు

దేవీ పప్రచ్ఛ వాత్స్యాయనశాస్త్ర ఏతమ్ (3.27)

కామశాస్త్రిపరీక్షకు శంకరుడు కొంత వ్యవధి కోరెను. తర్వాత పరకాయ ప్రవేశము, అమరుకశతకరచన, మరల శాస్త్రార్థము అందులో ఆమె ఓడుట జరిగెను. అప్పుడామె సంతసించి, వరమును కోరుకొను మనగా

శ్లో॥ యాచే సహైవాంబ మయాగమంతే।
శ్రీ ఋష్యశృంగాశ్రమ ఇత్యగాదేత్॥ (3.30)

ఆమె అట్లే శంకరుని వెంట ఋష్యశృంగాశ్రమమునకు వచ్చినది. అక్కడామెను ప్రతిష్ఠించి, అర్చించి చివరకు

శ్లో॥ సురేశ్వరాచార్య సరస్వతీం త్వం
సంపూజయ న్నాస్వచిరాదిహేతి (3.34)

అని గురువంశకావ్యమున గలదు. సురేశ్వరుని శృంగేరీపీఠమున నిల్పి, శారదాదేవిని అర్చించుమని శంకరుడాదేశించెను. గురువంశకావ్యమున గూడ పరకాయప్రవేశాదికము గలదు గనుక ఈ గాథను కనీసము 1735 నుంచి ఐనా శృంగేరీపీఠాధిపతులు ప్రామాణికముగా అంగీకరించినట్లున్నది.

శంకరుడు తన జీవితయాత్రను సాగించినకాలమున ప్రజల చిత్తవృత్తులు విచిత్రముగా నుండెడివి. ఒక వ్యక్తి తన యోగశక్తిని చూపినచో ప్రజ లతనివైపునకు ఆకర్షింపబడుచుండిరి. జైన, బౌద్ధాదులు అనేకభ్రమలను సృష్టించి ప్రజలను లోబరచుకొనిరి. జైన, బౌద్ధ, మీమాంసక, శాక్త, భైరవ, గాణాపత్యాది ధర్మములలో ఏది నిర్దుష్టమైనదో ప్రజలు తెలిసికొనజాలకపోయిరి. అట్టి సమయమున వారికి సరియైన మార్గమును జూపుట చాల అవసరము. శంకరుడు తన యోగశక్తిని జూపి, ప్రజల నాకర్షించి, వారిని సత్యమార్గమున నిలుప యత్నించెను. యోగ

శక్తితో పరకాయప్రవేశము చేయ వీలున్నది. పైగా శంకరుడు సర్వజ్ఞుడైనను కామశాస్త్రమున వాదము చేసినచో అతడు సరియైన బ్రహ్మచారి కాడను అపవాదులు రావచ్చును గనుక శంకరుడు పరకాయప్రవేశము చేసె నని చెప్పుటకు వీలున్నదని శ్రీ జగద్గురు శ్రీ శృంగేరీ పీఠాధిపతులగు శ్రీమదభినవవిద్యాతీర్థస్వాములవారి అభిప్రాయము.

ద్వారకాపీఠమున శృంగేరీ పీఠమునకు కూడ గల శక్తి శారద. చిన్మాత్ర యగు శారద బ్రహ్మయొక్క భార్య అని సంప్రదాయము.

శ్లో॥ జానామి త్వాం దేవి దేవస్య ధాతుః
భార్యా మిష్టా మష్టమూర్తేః సగర్భ్యామ్।
వాచామాద్యాం దేవతాం విశ్వగుప్త్యై
చిన్మాత్రా మస్యా స్తలక్ష్మ్యాదిరూపామ్॥

శ్లో॥ తస్మా దస్మత్కల్పితే ష్వర్చ్యమానా
స్థానేషు త్వం శారదాఖ్యా దిశంతి।
ఇష్టా నర్థా న్నృష్యశృంగాదికేషు
క్షేత్రే ష్వాస్స్వాప్త సత్సంనిధానా॥

అని మాధవీయము (10.70,71) న కలదు. కామాక్షిని శాంభవీ అనికూడా లలితాసహస్రనామము చెప్పినది. "అష్ట మూర్తేః సగర్భ్యాం" అని శారదను మాధవుడు వర్ణించెను. శివుని సహోదరి శారద యగుటచే శారదాకామాక్షీ దేవతలను సేవ్యసేవకభావముతో వర్ణించుట అనుచితము.

కాశీనుంచి తిరిగివచ్చి శంకరుడు అద్వైతమే తత్త్వమని నిశ్చయింపగలిగి అద్వైతవిజయమును చాటెను. మొదటిసారి గావించిన భారతదేశయాత్ర అద్వైతమే సత్యమని గ్రహించుటకు చేయబడినది. అద్వైతమును సుప్రతిష్ఠితము గావించుటకు శంకరుడు రెండవసారి భారతదేశయాత్ర చేసెను.

శంకరుడు తన తల్లికి అవసానకాల మాసన్నమైనదని గ్రహించి కాలటి చేరెను. తల్లియొక్క ఆజ్ఞను అనుసరించి ఆమెకు వేదాంతతత్త్వము నుపదేశించెను. తల్లివద్దనే శంకరుడు శివస్తుతి, విష్ణుస్తుతి చేసె నందురు. శివభుజంగ స్తోత్రము విష్ణుభుజంగస్తోత్రముఆ సమయమున శంకరుడు చేసిన స్తోత్రము లని తల్లికి సంతోషము కూర్చవలె నని ఆమె ఆజ్ఞానుసారమీస్తుతులు చెప్పబడిన వని అందురు.

ఆర్యాంబకు తుది ఘడియలు దగ్గరపడినవెంటనే శంకరుడు ఆమెను సమీపించ గలిగెను. కాని, ఆమె అప్పుడు మరణించినచో శంకరుని కర్తవ్యమేమి? తల్లికి అంత్యక్రియ లను శంకరుడే గావించెనని ఒక కథ. అంతే కాదు. సన్న్యాసి మాతృకర్మ చేయుటకు వచ్చుటచే ఇతర బ్రాహ్మణు లెవ్వ రును సహకరించలేదని, శంకరుడు వారిని శపించె నని అభూత కల్పన కలదు. ఆ బ్రాహ్మణులు వారి వంశజులు వేదబహిష్కృతులు కాగలరని వారి ఇండ్లలో యతులకు భిక్ష పనికి రాదని, వాళ్ళ ఇండ్ల ఆవరణలోనే శ్మశానవాటిక లుండ గలవని శాపము. ఇట్టి నంబూద్రిబ్రాహ్మణు లిప్పుడు

కన్పించుటచే, వారి ప్రస్తుతపరిస్థితికి కారణముగా శంకరుని, శాపమును సృష్టించి యుండవచ్చును.

శ్లో॥ భవేద్దేశోఽపి యతినాం వా నయోగ్యో న జాయతామ్।
అథవా యదిహాయాతః పతిత స్సంభవిష్యతి॥

శ్లో॥ అతఃపరం వేదబహిష్కృతా స్తే।
ద్విజా యతీనాం న భవేచ్ఛ భిక్షా॥

అని చిద్విలాసీయ, వ్యాసాచలీయ శంకరవిజయములలో నున్నది. కాని శంకరుడు కోపతాపములకు లోబడి శపించ గలడా? అను సందేహము రాకపోదు.

ఈ సమయమున కేరళరాజగు రాజశేఖరుడు శంకరుని కలిసికొని తానిదివరకు వ్రాసిన మూడు నాటకములు అగ్ని దగ్ధములైన వని చెప్పి వాపోయినాడు! అప్పుడు శంకరుడు తానీవర కొకసారి వాటిని వినియుండుటచే ఆ రాజశేఖరునకు మూడు నాటకములను వినిపించ గల్గెనట! దానితో మరల నాతడు తన మూడు నాటకములను వ్రాసికొనె నట. ఈ రాజశేఖరుడెవరో మనకు తెలియదు.

మాతృవియోగానంతరము శంకరుడు దేశయాత్రను ప్రారంభించెను. కాళహస్తి, కాంచి, పుండరీకపురము (చిదంబరము), శ్రీరంగము, రామేశ్వరము, ధనుష్కోటి, వృషాచలము అను ప్రదేశములను శంకరుడు దర్శించె నని కేరళీయశంకరవిజయమున గలదు. బదరి, ప్రయాగ, గయ, కాశి, రుద్రపురి, కాశ్మీరము, విభాండకవనము (శృంగేరి),

కాంచి, వెంకటాచలము, కాళహస్తి, శ్రీరంగము, చిదంబరము, మధ్యార్జునము, రామేశ్వరము, వక్రతుండపురము, మధుర, అనంతశయనము, సుబ్రహ్మణ్యము, గోకర్ణము, శ్రీశైలము, జ్వాలాముఖి, నృసింహాశ్రమము, పూరి, ఉజ్జయిని, ద్వారక, అను ప్రదేశములను శంకరుడు దర్శించె నని చిద్విలాసీయ శంకరవిజయము చెప్పినది.

కావేరీ దక్షిణతీరమున, తంజావూరు జిల్లాలోని మధ్యార్జునము చేరి అచట మహాలింగేశ్వరదర్శనము చేసెను. తర్వాత రామేశ్వరమునను దర్శించెను. రామేశ్వరమున శ్రీరాముడు ప్రతిష్ఠించిన శివలింగ మున్నది. శంకరుడచటకు పోయిన సన్నివేశమును

శ్లో॥ రామేశ్వరం రామకృతప్రతిష్ఠం
కామేశ్వరీభూషిత వామభాగమ్।
మహేంద్రనీలోజ్జ్వలదత్కిరీటం
భీమేశ్వరం త్వామిహ పూజయామి॥

అని మాధవీయము వర్ణించినది. రామేశ్వరములోని శివలింగమును

శ్లో॥ శ్రీతామ్రపర్ణీజలరాశియోగే
నిబధ్య సేతుం నిశి బిల్వపత్రైః।
శ్రీరామచంద్రేణ సమర్పితం తం
రామేశ్వరాఖ్యం సతతం నమామి॥

అని శంకరుడు స్తుతించెను. శ్రీరాము డర్చించిన శివలింగ మును పూజించెను.

తీర్థయాత్రలతోబాటు ఆలయాదులలోని పూజాకల్పాదులను సంస్కరించుచు శంకరు డేగెను. అనంతశయనము, సుబ్రహ్మణ్యము, గాణాపత్య గ్రామము భవానీపురము, ఉజ్జయినీ, సత్యతదరణము, వరుణపురి, మాధవార్ధపురము, ఇంద్ర ప్రస్థము, యమప్రస్థము, ప్రయాగ, కేదారము, కురుక్షేత్రము, బదరి, అయోధ్య, గయ, గంగాసాగరము, జగన్నాథము, శ్రీశైలము, రుద్రపురి, విద్యాలయము, శృంగేరి, నృసింహవిభూతిస్థలము, శ్రీరంగము, మధ్యార్జునము, వెంకటగిరి, కాంచి అను ప్రదేశముల నొసగునది అనంతానందగిరి వ్రాసిన శంకర విజయము. దీనిలో ఊహాలోకములోని నగరములు కూడా ఉన్నవి. ఇందు భవతీరము, కాశీ, ప్రయాగ, మాహిష్మతి, శృంగేరి, గోకర్ణము, మూకాంబికాక్షేత్రము, శ్రీవాలి, కేరళ, రామేశ్వరము, కాంచి, వెంకటాచలము, కర్నాటదేశము, విదర్భ, ద్వారక, కామరూపము, విదేహ అంగ వంగ గౌడ దేశములు గంగాతీరము, కాశ్మీరము, బదరి, కేదారము అను ప్రదేశములను గూర్చి మాధవీయము పల్కినది.

శంకరుడు గురువాయూరు చేరి అచటి ఆలయములోని పూజాపద్ధతిని సంస్కరించెను. తర్వాత కర్నాటదేశములోని పవిత్ర తీర్థస్థానమగు శ్రీ ధర్మస్థలమును ప్రవేశించి, అచట శ్రీమంజునాథేశ్వరలింగమును ప్రతిష్ఠించెను. తర్వాత తంజా

పూరు జిల్లాలో గల మధ్యార్జునమున కేగి అచట కొద్దిదినములు గడపెను. భవానీనగరమును ప్రవేశించి అచటి శాక్తమును సంస్కరించెను. శ్రీరంగసమీపమున గల శ్రీ జంబుకేశ్వరుని జలతత్త్వలింగమును పూజించెను. జగన్మాత యగు అఖిలాండేశ్వరి యొక్క ఉగ్రత్వమును శ్రీచక్రప్రతిష్ఠతో శాంతముగావించి, గణేశునిగూడ ప్రతిష్ఠించెను. తర్వాత శంకరునకు దారిలో కాంచీనగరము తటస్థపడెను. అప్పటికి తమకు కల్గిన ప్రౌఢానుభూతి నీరీతిగా వివరించిరి.

శ్లో॥ ప్రౌఢ ప్రౌఢ నిజానుభూతి గలిత
ద్వైతేంద్రజాలో గురు
ర్గాఢం గూఢ మఘౌఘ దుష్టకు ధియాం
స్పష్టం సుధీశాలినామ్ ।
స్వాంతే సమ్య గిహానుభూత మపి
సచ్ఛిష్యావబోధాయ తత్
సత్యం సంస్మృతవాన్ సమస్త జగతాం
నైజం నిజాలోకనాత్॥

శ్లో॥ ద్వైతం మయ్యఖిలం సముత్థిత మిదం
మిథ్యా మనఃకల్పితం
తోయం తోయవివర్జితే మరుతలే
భ్రాంత్యైవ సిద్ధం న హి।
యద్యేవం ఖలు దృశ్య మేత దఖిలం
నాహం న వా తన్మమ
ప్రౌఢానందచిదేకసన్మయ వపుః
శుద్ధోఽస్మ్యఖండోఽస్మ్యహమ్॥

తా॥ ఆత్మానుభూతి అతి నిగూఢమైనది. పాపౌఘముచే కలుషితమైన చిత్తము గలవారికి అది నిగూఢమై ఎరుగ శక్యముకానిదై యుండును. అట్టి ప్రౌఢానుభూతి అనుభూతపూర్వమైనప్పటికి నిజానుభూతి చేత ద్వైత మను ఇంద్రజాలమును పటాపంచలు చేసిన ఆచార్యుడు సచ్ఛిష్యుల అవబోధ నిమిత్తము లోకము లన్నిటికి పారమార్థికమైన సత్య మేది గలదో, దానిని ఆత్మావలోకనముచే సంస్మరించుచున్నాడు.

మనఃకల్పితము, మిథ్యయు, ద్వైతము నగు ఈసమస్త విశ్వము నాయందు ఆవిర్భూతమైనది. జలరహితమైన మరుభూములలో భ్రాంతితో జలమున్నదని పరువెత్తినను, ఉదకము లభించునా? దృశ్యమగు ఇది యంతయు నేనుకాను, అది నాదియును కాదు. నేను శుద్ధము అఖండమునగు ప్రౌఢసచ్చిదానందమయమూర్తినై వెలుగొందుచున్నాను.

శ్లో॥ దేహో నాహ మచేతనోఽయ మనిశం
కుడ్యాదివత్ నిశ్చితో
నాహం ప్రాణమయోఽపి వా దృతిధృతో
వాయు ర్యథా నిశ్చితః।
సోఽహం నాపి మనోమయః కపిచలః
కార్పణ్యదుష్టో న వా
బుద్ధి ర్బుద్ధకువృత్తికేవ కుహనా
నాజ్ఞాన మంధం తమః॥

శ్లో॥ నాహం ఖాదిరపి స్ఫుటం మృగజల
భ్రాజ త్ప్రయస్పామ్యత
స్తేభ్యో నిత్యవిలక్షణోఽఖిల దృశిః
సౌరప్రకాశో యథా।
దృశ్యై స్సంగవివర్జితో గగనవత్
సంపూర్ణరూపోఽస్మ్యహం
వస్తుస్థిత్యనురోధత స్త్వహ మిదం
వీచ్యాది సింధు ర్యథా॥

తా॥ కుడ్యాదులవలె అచేతనమగు దేహమును గానను ట నిశ్చయము. కమ్మరివాని కొలిమితిత్తివలె వాయుపూరితమైన ప్రాణమయకోశమును గాదనుమాట ముమ్మాటికిని నిశ్చితవిషయము. వానరము వలె చంచలమును, కార్పణ్యాదోషదూషితము నయిన మనోమయకోశమును గాను. మేలోర్వనివాని కుత్సితవృత్తిగల బుద్ధివలె కుహనావ్యాపారము గల విజ్ఞానమయకోశమును గాను. అంధతమస్సువంటి అజ్ఞానమును– ఆనందమయకోశమును గాను. ఈవిధముగ నేను ప్రాణమయాది పంచకోశాతీతుడనై వర్తిలుదును.

మరుభూములందు, ప్రకాశించెడు ఉదకసామ్యము వలన నేను ఆకాశాది భూతపంచకమును గానను ట స్పష్టము. సూర్యప్రకాశముచేత ప్రకాశించునట్టి ఘటాదుల కంటె సూర్యుడు విలక్షణుడైనట్లు, ఆకాశాదిభూతపంచకమును ప్రకాశింపజేయుచు, వానికంటె వేరుగనున్నాను. నేను ఆకాశము వలె దృశ్యవస్తుసంగము లేనివాడను. సంపూర్ణస్వరూపముతో ఒప్పారునట్టివాడను. వస్తుస్థితినిబట్టి చూచిన ఈ

జగత్తంతయు సముద్రమున తరంగాదులవలె నాయందు అధ్యస్తమై భాసిలుచున్నది.

శ్లో॥ నిర్ద్వైతోఽస్మ్యహ మస్మి నిర్మల చిదా
కాశోఽస్మి పూర్ణోఽస్మ్యహం
నిర్దేహోఽస్మి నిరింద్రియోఽస్మి నిర్మలచిదా
కాశోఽస్మి పూర్ణోఽస్మ్యహమ్।
నిర్ముక్తాశుభమానసోఽస్మి విగల
ద్విజ్ఞానకోశోఽస్మ్యహం
నిర్మాయోఽస్మి నిరంతరోఽస్మి విపులా
కాశోస్మి నిత్యోస్మ్యహమ్॥

శ్లో॥ మత్తోన్యత్ న హి కించిదస్తి యది చి
ద్భాస్యం తతస్తన్మృషా
గుంజావహ్నివదేవ సర్వకలనా
ధిష్ఠాన భూతోఽస్మ్యహమ్।
సర్వస్యాపి దృగస్మ్యహం సమరస
శ్శాంతోఽస్మ్యపాపోఽస్మ్యహం
పూర్ణోఽస్మి ద్వయవర్జితోఽస్మి విపులా
కాశోస్మి నిత్యోఽస్మ్యహమ్॥

తా॥ నేను ద్వైతరహితుడను; నిర్మలచిదాకాశరూపుడను, పూర్ణుడను; దేహేంద్రియాదిరహితుడను, ప్రాణాపానాది పంచప్రాణాతీతుడను. అశుభమనోరహితుడను; విజ్ఞానకోశ రహితుడను; మాయారహితుడను: అంతరాయశూన్యుడను; విపులప్రౌఢప్రకాశస్వరూపుడనై వెలయుచున్నను.

నాకంటె భిన్న మగున దేదియు లేదు; ఒకవేళ యుండినచో, అది చిదాభాస్య మగుటచేత గురువిందగింజ యందలి అగ్ని భ్రమ వలె మృషయే. సమస్తకల్పనలకు అధిష్ఠానసత్తను నేనే. సర్వద్రష్టయు నేనే. సమరసస్వరూపుడను; శాంతుడను; పాపరహితుడను నేనే. నేను పూర్ణుడను; ద్వైతరహితుడను, అనంతాకాశస్వరూపుడను, నిత్యుడనై వెలుగొందుచుందును.

శ్లో॥ మయ్యస్మిన్ పరమార్థకే శ్రుతిశిరోవేద్యే స్వతో భాసనే
కా వా విప్రతిపత్తిః ఏతదఖిలం భాత్యేవ యత్సన్నిధేః।
సౌరాలోకవశాత్ ప్రతీత మఖిలం పశ్యన్ న తస్మిన్ జనః
సందిగ్ధో౽స్త్యత ఏవ కేవలశివః కో౽పి ప్రకాశో౽స్మ్యహమ్॥

శ్లో॥ నిత్యస్ఫూర్తిమయో౽స్మి నిర్మల
సదాకాశో౽స్మి శాంతో౽స్మ్యహం
నిత్యానందమయో౽స్మి నిర్గతమహా
మోహాంధకారో౽స్మ్యహమ్।
విజాతం పరమార్థతత్త్వ మఖిలం
నైజం నిరస్తాశుభం
ముక్తప్రాప్య మపాస్తభేదకలనా
కైవల్యసంజ్ఞో౽స్మ్యహమ్॥

తా॥ ఏ చైతన్యసాన్నిధ్యము వలన ఈ ప్రపంచ మంతయు భాసించుచున్నదో ఆ వేదవేద్యుడను, స్వయంప్రకాశన శీలుడను, పరమార్థభూతుడనైన నాయందు విరుద్ధజ్ఞాన మెట్లుండును? సూర్యప్రకాశము వలన సర్వము భాసించు చుండగా, ఆ వెలుగునందు సంశయ మెవరికి కలుగును? నేను పరశివుడను; ఒకానొక విలక్షణమైన ప్రకాశస్వరూపు డనై తేజరిల్లుచుందును.

నేను నిత్యస్ఫురణము గలవాడను; నిర్మలసదాకాశ స్వరూపుడను; శాంతుడను; మహామోహాంధకారవిదూరుడ నగు నిత్యానందమయస్వరూపుడను. అశుభసంపర్కము లేని పరమార్థభూతమైన నా నిజస్వరూపమును తెలిసికొన్న వాడను. ఇది జీవన్ముక్తుడు పొందదగినస్థితి. పరాహతభేద లేశముచే నొప్పారు కైవల్యమూర్తిని నేను.

శ్లో॥ స్వాప్నద్వైతవదేవ జాగ్రతమపి
ద్వైతం మనోమాత్రకం
మిథ్యేత్యేవ విహాయ సచ్చిదమలం
స్వాంతైకరూపోఽస్మ్యహమ్।
యద్వా వేద్య మశేష మేతదనిశం
మద్రూప మేవేత్యపి
జ్ఞాత్వా త్యక్తమరున్మహోదధిరివ
ప్రౌఢో గభీరోఽస్మ్యహమ్॥

శ్లో॥ గంతవ్యం కిమిహాస్తి సర్వపరి
పూర్ణస్యా ప్యఖండాకృతేః
కర్తవ్యం కిమిహాస్తి నిష్క్రియతనో
ర్మోక్షైకరూపస్య మే।
నిర్ద్వైతస్య న హేయ మన్యదపి వా
నో వాఽప్యుపేయాంతరం
శాంతోఽద్యాస్మి విముక్తతోయవిమలో
మేఘో యథా నిర్మలః॥

తా॥ స్వప్నప్రపంచ మంతయు మనోమాత్రకల్పనమే అదేరీతిగ, జాగ్రద్దశయందలి ద్వైతప్రపంచము గూడ మనఃకల్పితమే. కావున, దీనిని మిథ్యగా తలచి పరిత్యజించిన వాడనై విమలసచ్చిదానందమగు స్వస్వరూపమునందే అవస్థితుడనై యుందును. అటుల కానిచో, ఈ వేద్య ప్రపంచ మంతయు నా స్వరూపమే యని నిరంతరము భావించి వాయుశూన్యమైన మహాసాగరము వలె ప్రౌఢ గంభీరుడనై వెలయుదును.

సర్వవస్తువులందు పరిపూర్ణుడనై అఖండాకృతినై అంతట వ్యాపించియున్నట్టి నాకు గంతవ్యమైన స్థాన మేమి యుండును? నిష్క్రియుడను, మోక్షైకరూపుడను అగు నాకు చేయదగిన కర్తవ్య మేమి యుండును? ద్వైత రహితుడనగు నాకు హేయ మనునదిగాని, ఉపాదేయ మను నదిగాని లేదు. వర్షించిన మేఘము వలె నిర్మలుడనై, శాంతుడనై యున్నాను.

శ్లో॥ కింను ప్రాప్త మితః పురా కిమధునా
లబ్ధం విచారాదినా
యస్మాత్ తత్సుఖరూపమేవ సతతం
జాజ్వల్యమానోఽస్మ్యహమ్।
కింవాఽపేక్ష్య మిహాపి మయ్యతితరాం
మిథ్యావిచారాదికం
ద్వైతాద్వైతవివర్జితే సమరసే
మౌనం పరం సమ్మతమ్॥

శ్లో॥ శ్రోతవ్యం చ కిమస్తి పూర్ణసుదృశో
మిథ్యాపరోక్షస్య మే
మంతవ్యం చ న మేఽస్తి కించిదపి వా
నిస్సంశయజ్యోతిషః।
ధ్యాతృధ్యేయవిభేదహానివపుషో
న ధ్యేయ మస్త్యేవ మే
సర్వాత్మైకమహారసస్య సతతం
నో వా సమాధి ర్మమ॥

తా॥ ఇంతకు పూర్వము గాని, వర్తమానమున గాని, విచారాదులవలన నేను పొందినది లేదు. నేను సుఖస్వరూపుడను, నిరంతరము ప్రకాశించువాడను; ద్వైతాద్వైతవివర్జితుడను, సమరసుడను అగు నాకు అపేక్షింపదగిన దేదియును లేదు; విచారాదిక మంతయు మిథ్యయే. కాన నాకు మౌనమే అత్యంతము అభిప్రేతము.

నేను పరిపూర్ణ ద్రష్టను; బ్రహ్మాభిన్నమైనదానిని మిథ్యగా తలచువాడను. అట్టినాకు శ్రోతవ్యమగు విషయ మేమి యుండును? నిశ్చితప్రకాశస్వరూపుడనైన నాకు మన నీయ విషయమేమి గలదు? ధ్యానము, ధ్యాత, ధ్యేయము అను త్రిపుటిని నాశ మొందించిన నాకు ధ్యేయమగు వస్తు వేది యుండును? సర్వాత్మకము ఏకరసస్వరూపము నగు నాకు సమాధియును లేదు.

శ్లో॥ ఆత్మానాత్మవివేచనాఽపి మమ నో
విద్వత్కృతా రోచతే
అనాత్మా నాస్తి యదస్తి గోచరవపుః
కోవా వివేక్తుంక్షమీ।
మిథ్యావాదవిచారచింతన మహో
కుర్వం త్యదృష్టాత్మకాః
భ్రాంతా ఏవ న పారగా దృఢధియః
తూష్ణీం శిలావత్ స్థితాః॥

శ్లో॥ వస్తుస్థిత్యనురోధత స్త్వహ మహో
కశ్చిత్ పదార్థో న చా
ప్యేవం కోఽపి విభామి సంతతదృశీ
వాఙ్మానసాగోచరః।
నిష్పాపోఽస్మి అభయోఽస్మ్యహం
విగతదుశ్శంకాకలంకోఽస్మ్యహం
సంక్రాంతానుసమానశీతలమహః
ప్రౌఢప్రకాశోఽస్మ్యహమ్॥

విద్వాంసు లొనర్చిన ఆత్మానాత్మవివేకవిచారము గూడ నాకు ఇష్టమైనది కాదు. ఈ ప్రపంచములో అనాత్మ యగువస్తువేదియు లేదు. ఉన్నది ఆత్మపదార్థమే. దానిని వివేచింప నెవరికి శక్యము. ఎవరైతే ఆత్మదర్శనము చేయ జాలరో వారే మిథ్యావాదము, చింతనము చేయుదురు. వారు భ్రాంతచిత్తులే గాని, పారంగతులు కారు. దృఢ మనస్కులు అచలులై మౌనము బూని యుందురు.

వస్తుస్థితిని బట్టి పరిశీలించినచో 'నేను' అను పదార్థమే భాసింపదు. కాని, నేను సర్వదా దృక్స్వరూపుడను, అవాఙ్మానసగోచరుడను; పాపరహితుడను, అభయస్వరూపుడను, దుశ్శంకాకళంకము లేనివాడను, ప్రౌఢప్రకాశముచే వెలుగొందుచున్నవాడనైనను, అనుపమాన-శాంత-శీతల-తేజస్సుతో భాసించునట్టివాడను.

శ్లో॥ యో౽హం పూర్వమితః ప్రశాంతకలనా
శుద్ధో౽స్మి బుద్ధో౽స్మ్యహం
యస్మాన్మత్త ఇదం సముత్థిత మభూ
దేతన్మయా ధార్యతే।
మయ్యేవ ప్రలయం ప్రయాతి విరధి
ష్ఠానాయ తస్మై సదా
సత్యానందచిదాత్మకాయ విపుల
ప్రజ్ఞాయ మహ్యం నమః॥

శ్లో॥ సత్తాచిత్సుఖరూపమస్తి సతతం
నాహం చ న త్వం మృషా
నేదం నాపి జగత్ ప్రదృష్ట మఖిలం
నాస్తీతి జానీహి భో।
యత్ ప్రోక్తం కరుణావశాత్ త్వయి మయా
తత్సత్య మేతత్ స్ఫుటం
శ్రద్ధత్స్వ అనఘ శుద్ధబుద్ధి రసి చే
త్తన్మాత్రాస్తు తే న సంశయః॥

శ్లో॥ స్వారస్యైకసుబోధచారుమనసే
ప్రౌఢానుభూతి స్త్వియం
దాతవ్యా న తు మోహముగ్ధకుధియే
దుష్టాంతరంగాయ చ।
యేయం రమ్యవిదర్భితోత్తమశిరః
ప్రాప్తా చకాస్తి స్వయం
సా చే న్మర్కటహస్తదేశపతితే
కిం రాజతే కేతకీ॥

ఇంతకుముందే నాయందు భేదజ్ఞానము నశించినది. అందుచే నేను శుద్ధమగు బోధస్వరూపమునైతిని. అట్టి నాయందు ఈ జగత్తు సృష్టి, స్థితి లయముల నొందుచున్నది. నిరధిష్ఠానరూపము, విపులప్రజ్ఞావిభాసితము, సచ్చిదానంద స్వరూపము నైన నాకు-పరమాత్మకు-నమస్కారము.

నేను సతతము సచ్చిదానందస్వరూపుడనే. 'నేను,నీవు' అను భేదము వట్టిమిథ్య. ఓయి! ఈ దృశ్యజగత్తు కూడ లేదని

తెలిసికొనుము. నీ యందు కరుణతో నేను చెప్పినది సత్యమనుట సుస్పష్టము. ఓ అనఘాత్మా! నాపలుకులను శ్రద్ధాళువై విశ్వసింపుము. నీబుద్ధి పవిత్రమైనచో లేశమాత్రమైనను సంశయింపబనిలేదు.

స్వారస్యము ననుభవింప యోగ్యత గల ఉత్తమ మనస్కునకే ఈ ప్రౌఢానుభూతి ఉపదేశింపదగును. మోహాంధ కలుషిత చిత్తము గలవానికి దుష్టాంతరంగము కలవానికి ఇది చెప్పదగదు. కేతకీపుష్పము రామణీయకదృష్టిగల సరస హృదయుల శిరముననే అలంకారమై, శోభిల్లునుగాని, వానర హస్తమున బడినచో అది రాజిల్లక పోగా, నాశమొందును.

6. కాంచీనివాసము

"నగరేషు కాంచీ" అని కులార్ణవతంత్ర మనినది. అయోధ్య, మధుర, మాయ (హరిద్వారం), కాశి, కాంచి అవంతిక, (ఉజ్జయినీ), ద్వారక అనునవి సప్తమోక్ష పురములు. దక్షిణదేశమున గల మోక్షపురము కాంచి. రుద్ర కన్నన్ అను సంగం కాలపు అరవకవి ప్రతిదినము ఏదో ఒక ఆలయమున ఉత్సవములు జరుగు నగరము కాంచి అనివర్ణించినాడు. సంగంకాలపు కవు లీనగరమును ప్రాచీన నగర మను అర్థము కల మూదూర్ అను పేరుతో పిలచిరి. కాంచీ ఘటికాస్థానమున ఒకప్పుడు ఆరువేలపండితులు కలరని ఒక శాసనమువలన తెలియుచున్నది. అనంతమగు వైదుష్యము కల నగరము కాంచి అని ఏడవశతాబ్దమున అచటకు వచ్చిన తిరునవుక్కరుసు నయనార్ అనినాడు. ఈయన తర్వాత వచ్చిన శైవుడు సుందరమూర్తి. జగత్తునంతను పోషించగల మహాతల్లి కామకోట్టమున ఉన్నదని సుందరమూర్తి అనినాడు. కాంచీ కామకోట్టమందిరమున గల శ్రీశాస్త ఆశీర్వచనము వలన కరికాళచోళుడు దేశములను జయించ గలిగె నను భావము గల పద్యమును కలిత్తొడై వ్యాఖ్యలో నచినర్క్కినియర్ చెప్పినాడు. కాంచీ సత్యవ్రతక్షేత్రము.

కంచిలోని తీర్థము యొక్క పశ్చిమతీరమున ముక్తి మంటపమున్నది. శంకరు డీవూరు వచ్చినప్పు డా మంటపమున వసించెనందురు. శంకరుని విగ్రహమును వ్యాసపూజను చేయు దినమున ఈ మంటపమునకు తీసికొనిపోదురు. ఇచట

మండన మిశ్ర అగ్రహార మను భాగము కలదట. కేరళలో గూడ ఒక మండనమిశ్ర అగ్రహారమున్నదందురు. మండన శబ్దము బిరుదమై నవు డట్టి అగ్రహారము లనేకము లుండ వీలున్నది. శంకరుడు మండనుని కలసికొనుట అసంభవ మని చెప్పితిమి. సర్వవేదాంతసిద్ధాంతసారసంగ్రహము (పుట 295) నుంచి శంకరుని గీతాభాష్యము (13.13) నుంచి బ్రహ్మసిద్ధిలో (పుట 26) ఉదహరించినాడు. నైష్కర్మ్యసిద్ధి (పుట 38) లో సురేశ్వరుడు

> ఏవ ముపసంహృతే కేచిత్ స్వసంప్రదాయబలావ
> ష్టంభాదాహుః ....

అని బ్రహ్మసిద్ధి (పుట35,)లోని వాదమును ప్రస్తావించినాడు. తనే పూర్వాశ్రమమున మండనుడైనచో "కేచిత్" అను ప్రయోగము కుదరదు. బృహదారణ్యకవార్తికము (పుట 1852, శ్లో. 796-7) లో

> అన్యేతు పండితంమన్యాః సంప్రదాయానుసారతః

అని బ్రహ్మసిద్ధి (పుట 154) లోని వాదమును విమర్శించినాడు. ఇట్టికారణముల వలన మండనుడు వేరు, సురేశ్వరుడు వేరు అని నిశ్చయింపక తప్పదు. కావున మండన మిశ్రాగ్రహార మున్నదని చెప్పుటచే శాంకర మఠ మచట కలదని యెంచుట ప్రామాదికమే కాగలదు.

కాంచీ నగర మతిప్రాచీనమైనది. బౌద్ధులకు ఒక ముఖ్య కేంద్రముగా పరిణమిల్లిన కాంచీనగరము వైదికులకు గూడ పుణ్యస్థలమే.

శ్లో॥ ఏక స్తత్ర కృతో ధర్మో వర్ధతే హి సహస్రశః।
తత్రైవ హి హరి ర్దృష్టో బ్రహ్మణా పరమేష్ఠినా॥
హయమేధేన యజ్ఞేన విను మభ్యర్చతా పురా
యత్ర కాంచీతి విఖ్యాతా పురీ పుణ్యవివర్ధినీ .... ॥

అని కాంచీ మాహాత్మ్యమున గలదు.

శ్లో॥ నేత్రద్వయం మహే స్య కాశీ కాంచి పురీద్వయమ్।
విఖ్యాతం వైష్ణవం క్షేత్రం శివసాంనిధ్యకారకమ్॥
కాంచీక్షేత్రే పురా ధాతా సర్వలోకపితామహః।
శ్రీదేవీదర్శనార్థాయ తప స్తేపే సుదుష్కరమ్।
ప్రాదురాస పురో లక్ష్మీః పద్మహ స్తపురస్సరా॥
పద్మాసనే చ తిష్ఠంతీ విష్ణునా జిష్ణునా సహ।
సర్వశృంగారవేషాఢ్యా సర్వాభరణభూషితా॥

అని బ్రహ్మాండపురాణములోని లలితోపాఖ్యానమున గలదు. అశ్వమేధయాగము గావించి విష్ణువును పూజించుచున్న బ్రహ్మకు కాంచీనగరమున విష్ణుదర్శనమైనదట. ఈశ్వరునకు కాశి, కాంచి అను రెండు నగరములు రెండు కన్నులు. వైష్ణవక్షేత్రము శివసాంనిధ్యకారకము నగు కాంచీనగరమున దేవీదర్శనము నభిలషించి బ్రహ్మ తపస్సు చేయగా లక్ష్మీదేవి దర్శన మాయనకు కలిగెనట.

పురాణములలోను, ఇతిహాసమున, శాక్తాదితంత్రముల యందు ప్రసిద్ధి గనిన కాంచీనగరమును శంకరుడు తప్పక దర్శించియుండవచ్చు నని చెప్పనగును. శంకరుడు రామేశ్వరమునుంచి తిరిగివచ్చుచు కాంచీనగరమును చేరెను.

శ్లో॥ అభిపూజ స తత్ర రామనాథం
సహ పాండ్యైః స్వవశే విధాయ చోళాన్
ద్రవిడాంశ్చ తతో జగామ కాంచీం
నగరీం హస్తిగిరేః నితంబకాంచీమ్॥
సురధామ స తత్ర కారయిత్వా
పరవిద్యాచరణానుసారి చిత్రమ్
అపవార్య చ తాంత్రికా నతానీత్
భగవత్యాః శ్రోతిసంమతాం సపర్యామ్

అని మాధవీయ శంకరవిజయము (15.4,5) న గలదు. రామేశ్వరము నుంచి పాండ్య చోళ దేశములను చూచుకొనుచు శంకరుడు కాంచీనగరమును ప్రవేశించెను. తాంత్రికాదులను పూర్తిగానిర్మూలించి అచ్చట దేవీపూజను శ్రుతిసంమతముగా పరిష్కరించె నని శంకరవిజయము లన్నియు చెప్పుచున్నవి.

శంకరుడు నాలుగుపీఠములను ప్రతిష్ఠించి, అచ్చట తన నల్గురు శిష్యులను ఉంచె నని, తర్వాత కాంచీనగరమును జేరి తనకై ప్రత్యేకముగా నొక పీఠము నచట ప్రతిష్ఠించె నని కొందరు పల్కుదురు. శాంకరమఠము లన్నియు పవిత్రమైనవే అనియు, శాంకరమతానుయాయి యగు పరివ్రాజకుడు పూజ్యు డనియు గుర్తుంచుకొనవలెను.

తత్రైవ పరమగురుః ద్వాదశాబ్దకాలం విద్యాపీఠే స్థిత్వా బహుశిష్యేభ్యః శుద్ధాద్వైతవిద్యాయాః సమ్యగుపదేశం కృత్వా తదనంతరం పద్మపాదాఖ్యం కంచిచ్ఛిష్యం పీఠాధ్యక్షం కృత్వా భోగనామక లింగం తస్మిన్ పీఠే నిక్షిప్య స్వయం నిశ్చక్రామ. తస్మాదహోబిలాఖ్యం నృసింహావిర్భావస్థలం ప్రాప్య .... వేంకటగిరిం ప్రాప .... తస్మాత్కాంచీనగరం ప్రావిశత్ .... తత్ర శివకాంచీతి పట్టణం నిర్మాయ తత్ప్రాక్ బ్రహ్మకృత యజ్ఞకుండావిర్భూతవిష్ణుం వరదరాజనామానం సమాశ్రిత్య తత్ర విష్ణుకాంచీతి ప్రసిద్ధం పట్టణం నిర్మాయ .... పరమగురుః సుఖ మాస"

అని ఆనందగిరి శంకరవిజయము (63 వ ప్రకరణం) నకలదు. విద్యాపీఠమగు శృంగేరిలో శంకరుడు పంద్రెండేండ్లు నివసించి, శిష్యుల కనేకులకు అద్వైతమును బోధించి, అచ్చట పద్మపాదుని అధిపతిగావించి, ఆ పీఠమున భోగ మను పేరుగల శివలింగమును ప్రతిష్ఠించి, తర్వాత అహోబిలమును, వెంకటగిరిని దర్శించి చివరకు కాంచీనగరమును ప్రవేశించెను. శివకాంచి, విష్ణుకాంచి నగరములను నిర్మించి, కాంచీనగరమున నిలచిపోయె నని అనంతానందగిరి యగు ఆనందగిరి వ్రాసిన శంకరవిజయములోని కథ.

నవకాళిదాసు విరచితమై మాధవీయ మనబడు శంకరవిజయమున శంకరుడు కాంచీనగరమును పవిత్రము చేసినట్లున్నది. ఈ గ్రంథపు టీకాకారుడు శంకరుడు ఇచట ఒకమాసమే ఉండె నని నాడు. గురుపరంపరా చరిత్రలో

శ్లో॥ "రామనాథం యయౌ తత్ర సమభ్యర్చ్య తతో మునిః।
చోళద్రావిడ పాండ్యాంశ్చ జిత్వా కాంచీం తతోఽజయత్।
వేంకటాద్రిం విజిత్యాసౌ కర్నాటకభువం యయౌ"॥

అని కలదు. రామేశ్వరమున శివుని పూజించి, చోళ, ద్రావిడ పాండ్యదేశములలోని పండితులను గెలచి, తర్వాత కాంచీ నగరమున పండితుల నోడించెను. ఆపైన వెంకటాద్రిలో విజయమంది, చివరకు కర్నాట దేశమున కేగెనని గురు పరంపరా చరిత్రలో గలదు. కాంచీనగరమును శంకరుడు ప్రవేశించెను. అచట తపస్సిద్ధిని పొందె నని చెప్పుచు "(కాంచ్యాం) తపఃసిద్ధి మవాప్యదండీ" అని శివరహస్యము పల్కినది.

శంకరుడు కాంచీ పురమున సర్వజ్ఞ పీఠమును అధిరోహించె నని చిద్విలాసీయ శంకరవిజయమున

"సర్వజ్ఞపీఠం సంస్థానం విజిత్య ద్వైతవాదినః"

అని కలదు. కాంచీనగరమున సర్వజ్ఞపీఠము గలదని చిద్విలాసుడు పలుకగా, దాదాపు మిగిలిన శంకరవిజయము లన్నియు కాశ్మీరమున సర్వజ్ఞపీఠము గలదని చెప్పుచున్నవి.

శివకాంచిని విష్ణుకాంచిని సరిగా నిర్మించి, కామాక్షీ ప్రతిష్ఠచేసి, అచటనే శైవాది షణ్మతములను పరిశుద్ధరూపమున స్థాపించి, శంకరుడు బదరీవనమున కేగెనని గురువంశ కావ్యము (**3.35-37**). శంకరునకు ముందే కామాక్షీ విగ్రహ మొకటి ప్రతిష్ఠింపబడియున్నదని, ఏకారణముచేతనో అపవిత్ర

మైన కామాక్షిని శంకరుడు సురల ప్రతిష్ఠింపవలసివచ్చినదని వీటివలన తేలుచున్నది.

"కాంచీ శ్రీచక్రరాజాఖ్య యంత్రస్థాపనదీక్షితః"

అని శంకరాష్టోత్తరశత నామావళిలో ఒక పంక్తి. కామాక్షీ దేవి యొక్క ఉగ్రత్వమును శాంతపరచుటకు ఇతర స్థలము లలో వలె ఇచట గూడ శంకరుడు శ్రీ చక్రమును ప్రతిష్ఠిం చెను. పరాశక్తిని "పంచాశత్ పీఠమండితా" అని శ్రీదేవీ భాగవతము వర్ణించినది.

అతి ప్రాచీనకాలము నుంచి కాంచీనగరమున ప్రధాన శాక్తపీఠ మొకటి గలదని భారతీయసంప్రదాయము. కామ కోటి యను శక్తిపీఠము శంకరునకు ముందే అచట గలదు. "కామకోష్ణీం పురీం కాంచీం" అని భాగవతమున దశమ స్కంధమున 79 వ అధ్యాయమున కలదు. శృంగారరస సంపూర్ణమైన జాలంధరపీఠము వలె కామకళావిలసిత మగు కామకోటిపీఠము కూడా చాల పురాతనమైనది. కామాక్షిని 'కామదాయినీ' అని సహస్రనామములలో ప్రస్తుతించుట జరిగినది.

తంత్రములలో మహాదేవుని కటిదేశముగా కాంచి వర్ణించబడినది. మహాదేవు డష్టమూర్తియైనను భారతావని అంతయు శివుని దేహముగా భావన చేసిన ప్రాచీన ఋషులు కాంచీనగరపు ప్రాముఖ్యతను గుర్తించిరి. ఈ ప్రముఖ స్థలములలో శివునితోబాటు శక్తి గూడ కలదని, శివశక్తుల

కనన్యత్వము గలదను భారతీయ సంప్రదాయము శంకరుని రచనలలో కూడ వివరింపబడినది. కాంచీనగరమున 'దేవ గర్భా' అను శక్తిపీఠము కలదని తంత్రచూడామణి. శివ కాంచిలోని కాళీమందిరమే ఈ పీఠము కావచ్చును.

"కాంచీదేశే చ కంకాలో భైరవో రురునామకః।
దేవతా దేవగర్భాఖ్యా నితంబః కాలమాధవే"

అని తంత్రచూడామణి. శివచరిత్ర, దాక్షాయణీతంత్ర, యోగినీహృదయతంత్ర, త్రిపురారహస్యమాహాత్మ్యఖండ ములలో చెప్పబడిన శక్తిపీఠములలో కాంచీ కామాక్షి ఉల్లేఖింపబడినది:

శక్తియొక్క నాభి పడిన స్థలమే కామకోటిపీఠ మందురు. ఉత్కళదేశములో యజపురము దగ్గర విరజాని దేవి మందిర మున్నది. ఇదే నాభిపీఠ మనుచు—

శ్లో॥ ఉత్కళే నాభిదేశస్తు విరజాక్షేత్ర ముచ్యతే।
విమలా సా మహాదేవీ జగన్నాథస్తు భైరవః॥

అని తంత్రచూడామణి చెప్పుచున్నది. ఇచటనే "ఐ" అను వర్ణ ముత్పన్న మైనదట. విరజాదేవి మందిరము కన్న అతి ప్రాచీనము, ప్రసిద్ధమునైన శక్తిపీఠము కామకోటిపీఠ మని ఇతర గ్రంథముల ద్వారా మనకు తెలియవచ్చుచున్నది.

లలితాసహస్రనామములలో పరాశక్తిని 'కామకోటికా' అనినారు. కంచిలోని కామాక్షి రుద్రశక్తి యని, నిర్గుణమై గుహలో నున్నదని పల్కుచు

శ్లో॥ త్రిధా గుణాత్మికా నైవ నిర్గుణా చాత్ర దృశ్యతే।
దిదృక్షతాం మునీనాం తు స్వాత్మానందైక గోచరః॥

అని శంకరవిజయవిలాసము (25.10) అనినది!

అష్టాదశ శక్తిపీఠములలో జలంధర్ న గల జ్వాలాముఖి కామరూపమున గల కామాఖ్య, కంచిలో గల కామకోటి పీఠములు ముఖ్యమైనవి.

"తేషు చాష్టాదశ శ్రేష్ఠా న్యేషు పీఠత్రయం వరమ్।
తత్ర యే కామరాజాఖ్యం ప్రథమం హి. ప్రశస్యతే॥

తత్పీఠే వాగ్భవం కూటం హయగ్రీవేణ పూజితమ్।
జాలన్ధ్రాఖ్యం ద్వితీయం తు మధ్యకూటం మనోభవమ్॥

భృగుణాభ్యర్చితం పీఠం జ్వాలాముఖ్యంతు తద్విదుః।
ఓడ్యాణాఖ్యం తృతీయం తు పరాబీజస్వరూపకమ్॥

తత్పీఠం కామరూపేఽస్తి వ్యాసే నోపాసితం సదా।
ఏవం పీఠత్రయం శ్రేష్ఠం సర్వపీఠోత్తమోత్తమమ్॥

ప్రాగుక్తం కామరాజాఖ్యం కాంచీక్షేత్రే హి వర్తతే।
తత్పీఠం తు కామరాజ్యం కామకోటీతి విశ్రుతమ్"॥

అని మార్కండేయ పురాణములో కామకోటి ప్రసంగమున గలదు. కామరాజ పీఠమున వాగ్భవకూటమని ఇది హయగ్రీవునిచే పూజింపబడినదని పల్కిరి. జాలంధరమగు జ్వాలాముఖీ పీఠము మధ్యకూటమని, ఇది భృగుమహర్షిచే పూజింపబడినదని అనిరి. పరాబీజ స్వరూపకమైన ఓడ్యాణపీఠము కామ

రూపమున గలదని, దీనిని వ్యాసుడు పూజించె నని చెప్పిరి. ఈ మూటిలోను ఉత్తమోత్తమమైనది కాంచీ క్షేత్రమున గల కామరాజపీఠ మగు కామకోటి అని మార్కండేయ పురాణము ప్రశంసించినది.

ఓడ్యాణపీఠము కామరూపమున గలదు. బిందుమండల వాసిని యగు పరాశక్తిని ఓడ్యాణపీఠనిలయ. శృంగారరస సంపూర్ణమైన శక్తి జాలంధరపీఠమునగలదు. ఓడ్యాణ్య పీఠము ధాన్యకటకప్రాంతమున గల వజ్రయాన బౌద్ధులది. మార్కండేయపురాణము దీనిని కామరూపమున నెట్లు వేసినదో తెలియదు. బౌద్ధులలో వచ్చిన వజ్రయానికులు తాంత్రికులు. వారుకూడ శక్తిని ఉపాసించిన వారగుటచే కామకోటి పీఠ మొకప్పుడు బౌద్ధులదని చెప్పవచ్చును.

శ్లో॥ కామానాం వర్ధతాత్పర్యాత్తతోఽకోటి గుణసంఖ్యయా।
కామకోటీతి విఖ్యాతం కామకోష్ఠధరాతలమ్॥

శ్లో॥ అథ కామస్తృతీయోర్థః పురుషార్థేషు విశ్రుతః।
తత్పరస్తాచ్ఛ్రుతో మోక్షః కోటిశబ్దేన శబ్దితః।
కామకోటిః శ్రుతో మోక్షః పురుషార్థచతుర్థకః"॥

అనిమార్కండేయ పురాణమున గలదు. కామకోటి యనగా కామము తర్వాత వచ్చు మోక్షమను పురుషార్థమనియు, అందుచే కామకోటి పీఠము మోక్షపీఠమనియు, మార్కండేయ పురాణము చమత్కరించినది.

అనాదికాలమునుంచి కాంచీ నగరమున శక్తి పీఠమున్నది. దేవీ భాగవతాదులలో కాంచీ నగరము ఏబదియొక శక్తిపీఠములలో ఒకటి అని చెప్పబడినది. సతీదేవి యొక్క కంకాళ మిచటపడెనని, ఈ శక్తిపీఠమును దేవగర్భమని అందురని తంత్రచూడామణి. శివకాంచిలోని కాళీమందిరమే దేవగర్భాపీఠము. శక్తి యొక్క నాభి పడిన స్థలము కామకోటి పీఠమని, ఇచట 'ఐ' కార ముత్పన్నమైనదని కొన్ని గ్రంథములు చెప్పుచున్నవి. లలితాత్రిశతిలో శక్తిని 'కామకోటి నిలయా' అని కీర్తించినారు. కామకోటి శబ్దమునకు శ్రీచక్రము అని అర్థము చెప్పుటచే శంకరులకు ముందే ఇచట శక్తిపీఠము కలదని శ్రీచక్రము కూడ ప్రతిష్ఠితమై యున్నదని చెప్పవచ్చును. శంకరు డిట శ్రీచక్రమును ప్రతిష్ఠించి కామాక్షిని శాంతమూర్తిని గావించెనని పల్కునపుడు శంకరుడు శ్రీచక్రమునకు జీర్ణోద్ధారము గావించె నని చెప్పవలెను. ఛాత్రాది నిలయము మఠ మని అమరకోశము. బ్రహ్మపురాణమున

శ్లో॥ బ్రహ్మఘోషో భవేద్యత్ర యత్ర బ్రహ్మశ్రమిస్థితిః।
దేవప్రదానకం వేశ్మ మఠ ఇత్య భి ధీయతే"॥

అనికలదు. పీఠమున ఉండునది దేవత. మఠమున ఆచార్యు డుండును. కామకోటిపీఠమున కామాక్షి ఉన్నది. అందుకే మఠామ్నాయమున మఠ, పీఠశబ్దములను వేర్వేరుగా వాడినారు. తను నివసించుటకు యోగ్యమైన మఠమును శంకరుడు కాంచీనగరమున నిర్మించి, తన సిద్ధాంతమును ప్రతిపాదింప గల్గిన శిష్యుడగు సురేశ్వరుని పిలచి, ఆయనకు యోగ మను

పేరుగల శివలింగము నొసంగి కామకోటి పీఠమున ఆయనను ఉండవలసిన దని ఆదేశించె నని ఆనందగిరి శంకరవిజయము. కాని, పీఠమున దేవత యే ఉండును గనుక అచటి ఆచార్యుని మఠాధిపతి అని వ్యవహరించవలెను. ఆనందగిరికి మఠపీఠ శబ్దముల అర్థములు తెలియవు.

మార్కండేయసంహితలో కాంచీ మఠాధిపతిగా సురేశ్వరుని శంకరుడు నియమించె నని కలదని అందురు.

శ్లో॥ కాంచ్యాం శ్రీకామకోటీతు యోగలింగ మనుత్తమమ్।
ప్రతిష్ఠాప్య సురేశార్యం పూజార్థం యుయుజే గురుః॥

అని మార్కండేయసంహితలో నున్నదట.

"సురేశ్వర మాహూయ యోగనామక లింగం పూజయ ఇతి తస్మై దత్త్వా త్వ మత్ర కామకోటిపీఠ మధివస ఇత్యావస్థాప్య"

అని ఆనందగిరి శంకరవిజయము. లభ్యమగు మార్కండేయ పురాణమున పై పంక్తులు లేవు. మార్కండేయసంహితలో ఉన్నవనిన పంక్తుల ద్వారా కాంచీనగరమున యోగలింగ ప్రతిష్ఠ జరిగెనని కాంచీమఠాధిపతిగా సురేశ్వరుడు నియమింపబడెనని తెలియుచున్నది.

శృంగేరీమఠమున విశ్వరూపుడు గాని పృథ్వీధరుడుగాని పీఠాధిపతిగా ఉండెను. అధిపతి ప్రార్థనలను పాటించి కామకోటిఅధిపతి యగు సురేశ్వరుడు కొంతకాలము శృంగేరిలో ఉండెనని ఒకవాదమున్నది. కాని, శంకరవిజయములలో

ఎక్కువ గ్రంథములు శృంగేరిలో సురేశ్వరుని చూపుచున్నవి. ఐనను,

శ్లో॥ శ్రీకామకోటిబిరుదే వ్యదథా త్స్వపీఠే।
గు ప్తం స్వశిష్యతిలకేన సురేశ్వరేణ॥

అని వ్యాసాచలీయశంకరవిజయమున కలదందురు. సురేశ్వరుడు కామకోటి పీఠమున నున్నచో కాంచీమఠమునకు యజుర్వేద ముండవలెను.

శ్లో॥ తతః కాంచీపురం గత్వా సర్వజ్ఞో మునిపుంగవః।
సర్వజ్ఞపీఠ మారోఢుం ఐచ్ఛ త్తత్ర విరాజితమ్॥

అని గోవిందనాథుని శంకరార్య చరిత్రలోను,

శ్లో॥ శ్రీమద్వరదరాజస్య నమస్యాయై నియుజ్య చ।
సర్వజ్ఞపీఠ ఆరోఢుం ఉత్సేహే దేశికోత్తమః॥

అని చిద్విలాసీయ శంకరవిజయము (25.45-46) లోను కన్పించుటచే కాంచీనగరమున సర్వజ్ఞపీఠ ముండె నని, దీనిని శంకరు డధిష్ఠించె నని చెప్పుదురు. దేశములో సర్వజ్ఞపీఠ మెచట గలదో మున్ముందు విచారింతము.

శంకరుడు కాంచీనగరమునకు రెండవసారి వచ్చెననుచు

శ్లో॥ తతో యతికులాచార్యః సశిష్యః శాస్త్రవిత్తమః।
భూమిం ప్రదక్షిణీకృత్య భూయః కాంచీపురం గతః॥

అని కేరళీయశంకరచరిత్ర (9.1) చెప్పుచున్నది. ఇదే విషయమును కొన్ని ఇతర గ్రంథములు కూడ వివరించుచున్నవి.

శంకరు డెందుల కీరీతిగా రావలసి వచ్చెను? "పునరాప్రవజత్స కాంచీపురం పురవరం" అని వ్యాసాచలీయ శంకరవిజయము (7.102) కూడ పల్కినది గనుక కాంచిపీఠము శంకరునిచే ప్రతిష్ఠింపబడినదని, అది తనకై నిర్మింపబడినదని చెప్పుట కింకొక హేతు వందురు.

శ్రీ శంకరభగవత్పాదులు స్థాపించిన మఠము లన్నిటి లోను శివలింగ ప్రతిష్ఠ కన్పించుచున్నది. అవిచ్ఛిన్నరూపమున నాటినుండి నేటివరకు ఈ శివలింగముల పూజ జరుగుచునే యున్నది. శంకరవిజయగ్రంథములలో ఈ శివలింగములను గూర్చి పూర్తి వివరములు కన్పించవు. కాని శివరహస్యమున ఈ వివరము లీయడినవి. శివరహస్యమున గల శ్లోకములు యోగ, భోగ, వర, ముక్తి, మోక్ష లింగములను వర్ణించున వని కొందరు. అప్పు డాచార్యపాదులు ఐదు పీఠములను స్థాపించినట్లు నిశ్చిత మగును. శివజప పూజాదుల ద్వారా యోగ, భోగ, వర, ముక్తి, మోక్షఫలములు రాగలవని మాత్రమే ఈ శ్లోకముల తాత్పర్య మని చెప్పినచో నాల్గు పీఠములే ఆచార్యస్థాపితము లని తేలగలదు. శివరహస్యశ్లోక ములు ఐదు శివలింగములను గూర్చి స్పష్టముగా చెప్పు చున్నవి. ఇవి శ్రీభగవత్ పాదులకు కాశిలో లభించినవని కొందరు పల్కిరి. కాని, శంకరుని మహిమాతిశయములను వర్ణించుచుంటి మని భావించువారు వేరొక గాథను పల్కు చున్నారు.

శ్లో॥ గత్వా కైలాసశైలం జగదఖిలగురుః
శంకరాచార్య యోగీ
దృష్ట్వా సాంబం శివం తం స్వయ మితి సుచిరం
చింతయన్నంతరంగే।
లబ్ధ్వా పంచాత్మలింగా న్యమల తరశుభా
లింగితాన్యంగభాజాం
భూత్యై సౌందర్యసారం హిమగిరి దుహితుః
ప్రాపయన్ గామయాసీత్"॥

అని మార్కండేయ సంహితలో 72 వ ఖండమున ఏడవ పరిస్పందమున కలదట. ఇది మనకు లభించు గ్రంథముకాదు. శంకరుడు కైలాసమున కేగి, అచట శివుని దగ్గరనుంచి ఐదు ఆత్మలింగములను తెచ్చినాడట. ఈగాథను శివరహస్యము, మాణిక్యవిజయము భిన్నరీతులలో చిత్రించినవి.

కాశీలో విశ్వేశ్వరలింగము నుంచి పరమేశ్వరుడు బయటకు వచ్చి

"ఏతత్ ప్రతిగృహాణ త్వం పంచలింగం సుపూజయ" (42)

అని శంకరునితో చెప్పి, ఐదు లింగముల నిచ్చినట్లు, నాల్గింటిని నాలుగు ఆమ్నాయమఠములలో నుంచి, ఐదవదానిని చిదంబరమున ప్రతిష్ఠించినట్లు శివరహస్యమున కలదు. మాణిక్యవిజయమున (శ్లో 50)

"ఏత త్ప్రతిగృహాణ త్వం లింగపంచక మర్చయ"

అని ఉన్నది. ఈశివరహస్యము 18 పురాణములలోనిది కాదు. ఇది జైగీశఋషి రచితము. దీనిలో హరదత్తాచార్యుడు; అప్పయ్యదీక్షితుడు ప్రస్తుతించబడినారు. మాణిక్యవిజయము నుంచి శివరహస్యము గాని, లేక శివరహస్యము నుంచి మాణిక్యవిజయము గాని శ్లోకములను సంగ్రహించెను.

శ్లో॥ తద్యోగ, భోగ, వర, ముక్తి, సుమోక్షయోగ
లింగార్చనాప్రాప్తజయః సకామమ్।
త్వాపై విజిత్య తరసాఽక్షతశాస్త్రజాలైః
మిశ్రాన్ స కాంచ్యా మథ సిద్ధిమాప॥

యోగలింగమును కంచిలోను, భోగలింగమును శృంగేరి యందు, మోక్షలింగమును చిదంబరమున, నేపాలమున వర లింగమును, కేదారమున ముక్తిలింగమును ప్రతిష్ఠించి రందురు. చివరి మాటలకు "తతో నైజ మవాప లోకం", "తతో లోక మవాప శైవం", "స కాంచ్యా మథ సిద్ధి మవాప శైవం", అను పాఠాంతరము లున్నవి. కాంచీ నగరమున సిద్ధిని పొందెను. అను అర్థమును గ్రహించి శంకరుని నిర్యాణము కాంచీలో జరిగె నని, ఆయన సమాధి కామాక్షిఆలయమున గలదని, ఆ సమాధిపై ఆయన విగ్రహ మునే ప్రతిష్ఠించి రని చెప్పెదురు.

'మిశ్ర' శబ్దము గౌడులను నిర్దేశించునది కాదు. సంస్కృతనాటకములలో ఈ పదమును పండితుడనే అర్థము ననే వాడిరి. దాక్షిణాత్యుడగు పార్థసారథిని మిశ్రపదముచే

వ్యవహరించుచున్నాము. ఔత్తరాహికులలో పార్థసారథి అను శబ్దము కన్పించదు. పండితులను కాంచీనగరమున శంకరుడు జయించెను. తర్వాత ఆయనకు సిద్ధిలభించె నని గలదు గనుక; 'సిద్ధి' అను శబ్దమునకు గల అర్థమును తెలిసి కొనవలెను. సిద్ధి అనగా, తపస్సిద్ధి అని మనోరథసిద్ధి అని అర్థములు కలవు. అతీంద్రియశక్తి సిద్ధించిన స్థలము కాంచీ నగరము. అష్టసిద్ధు లున్నవి. క్రియాసిద్ధి కలదు. అనేక ప్రకారములుగా సిద్ధిశబ్దప్రయోగము లున్నవి. పైగా

> శ్లో॥ అద్వైతభాష్య ముపకల్ప్య దిశో విజిత్య
> కాంచీపురే స్థితి మవాప స శంకరార్యః॥

అని రామభద్రదీక్షితుని పతంజలిచరిత్రలో నుండుటచే 'స్థితి' అనుటకు బదులు సిద్ధి అని శివరహస్యము వాడియుండ వచ్చును.

> శ్లో॥ కామేశ్వరీ మర్చయన్ బ్రహ్మానంద।
> మవిందిత త్రిజగతాం క్షేమంకరః శంకరః॥

అని రాజచూడామణిదీక్షితుని శంకరాభ్యుదయమున కలదు. బ్రహ్మానందమును పొందె ననగా మరణించె నని కాదు. జీవన్ముక్తుడగు శంకరుడు కామేశ్వరిని పూజించువేళ అప రోక్షానుభూతి కలిగి, బ్రహ్మానందము ననుభవించెడివాడని భావము. ఇంతేగాక, తర్వాతి శ్లోకము

> శ్లో॥ కాంచ్యాం తపస్సిద్ధి మవాప్య దండీ
> చండీశరూపో జగ దాక లయ్య।

బ్రహ్మైక్యవిద్యాం రచయన్ స భాష్యం
శారీరకన్నామ జగాద మోదాత్॥ (48)

అని శివరహస్యము. మాణిక్యవిజయమున

శ్లో॥ కాంచ్యాం తపస్సిద్ధి మవాప్య దండీ
చండీశ్వరాత్మార్థితమిశ్రజైనాన్।
విజిత్య భాష్యే వివృతిం చ కాంక్ష
న్నఖండయన్ మండన మాత్మవాదే॥ (54)

అని గలదు. వీటినిబట్టి శంకరునకు కాంచీనగరమున తపస్సిద్ధి లభించె నను అర్థమురాగలదు తర్వాత శంకరుడు కాశికి పోయి వ్యాసుని దర్శించుట, మండనునితో వాదము, పరకాయ ప్రవేశము, మొదలైనవి చెప్పి

శ్లో॥ "వాణీం స జిత్వైవ తు తాం మఠే స్వే।
శృంగేరికాఖ్యే ప్రణివేశ్య తుష్టః॥" (50)

అని శివరహస్య మనినది. 47 వ శ్లోకముననే శంకరుని నిర్యాణమును చెప్పినచో 50 వ శ్లోకమున శృంగేరీగమనము కుదరదు. పైగా

శ్లో॥ కాశ్మీర మాసాద్య స శారదా యా
స్సర్వజ్ఞపీఠం పద మారు రుక్షన్ ? (52)

అని శివరహస్యమున, మాణిక్యవిజయమున (శ్లో 58) ఉన్నది. శృంగేరీ నుంచి మరల శంకరుడు కాశ్మీరమునకేగి అచట సర్వజ్ఞపీఠము నధిరోహించెనని శివరహస్యమే తెలుపుట గమనింపదగిన విషయము.

"తతో బదర్యాశ్రమ మాపదండీ" (54)

బదర్యాశ్రమమును చేరి, నారాయణుని ధ్యానించిన తర్వాత అచటికి

శ్లో॥ "తస్థా కైలాసదేశాద్వృషభశ్చ దేవాః ।
తమేత్య సంస్తుత్య యదాయుష స్తే
కాలోఽగమ త్త్వం వృషభేఽధిరోహ" (55)

ఇది మాణిక్యవిజయమున (శ్లో 61) గలదు. కైలాసమునుంచి దేవతలు వృషభముతో వచ్చి, శంకరుని కలసికొని, ఆయన ఆయుర్దాయము పూర్తియైనదిగనుక వృషభము నధిరోహింపుమని కోరిరట. శివరహస్యమాణిక్యవిజయములు ఒకదానినుంచి ఇంకొకటి శ్లోకములను సంగ్రహించినను ఈ రెంటిలోను శంకరుడు వృషభము నెక్కి కైలాసమున కేగినట్లే ఉన్నది.

శ్లో॥ ఇతి నిశ్చిత్య మనసా శ్రీమాన్ శంకరదేశికః।
మతే శ్రీశారదాభిఖ్యే సర్వజ్ఞం న్యదధా న్మునిమ్ ॥

శ్లో॥ సురేశ్వరం వృత్తికృత మంతికస్థం సదాఽఽదరాత్ ।
సమం సంస్థాప్య త స్మై స్వం వక్తుం భాష్యంసమన్వశాత్

శ్లో॥ స్వశిష్యపారంపర్యేణ లింగం స్వం యోగనామకమ్।
సేవయైనం కామకోటిపీఠే సార్ధం వసేతి చ ॥

శ్లో॥ ఇత్యాజ్ఞాం సంప్రదాయాస్మై త్యక్తపీఠ మఠస్పృహః।
కామాక్ష్యా నికటే జాతు సన్నివిశ్య జగద్గురుః॥

శ్లో॥ దేహిభి ర్దుర్భజం భేజే దేహంతంత్రైవ సంత్యజన్। ....
అద్యాపి మూర్తిచైతన్యమివ తత్రైవ తిష్ఠతి"॥

అని కేరళీయ శంకరవిజయమున కలదందురు. కాని ప్రస్తుతము లభించుచున్న కేరళీయ శంకరవిజయమున శంకరుని నిర్యాణస్థలము వృషాచలేశ్వరాలయ మని గలదు. ఈ శ్లోకములలో శృంగేరిలో సుర్వేరు డధిపతి ఆయెనని, శంకరుడు కాంచీనగరమున నిర్యాణించె నని చెప్పబడినది.

శ్లో॥ సర్వజ్ఞపీఠ మధిరుహ్య చ తత్ర కాంచ్యాం।
విద్వద్వరార్చితపదో యతిసార్వభౌమో।
దేవ్యాః పురః వరతరే పురుషే విలిల్యే॥

అని చిత్సుఖుని బృహచ్ఛంకరవిజయమున కలదందురు. ఇది కూడ మనకు లభించని గ్రంథములోనిదే. కాంచీనగరమున సర్వజ్ఞ పీఠము నధిరోహించి, కామాక్షీదేవి ఎదుట నిర్యాణ మందెనని ఈ శ్లోకముల తాత్పర్యము.

శ్లో॥ "కాంచ్యాం విముచ్య వపురాదృత మిచ్ఛయైవ
స్వస్యైవ ధామ్ని పరమే స్వత ఏవ లిల్యే"

అను శ్లోకము వ్యాసాచలీయ శంకరవిజయమున కన్పించదు.

శంకరుడు ప్రతిష్ఠించిన నాలుగు పీఠములు ఆ ప్రదేశములలోనే అప్పటినుంచి నేటివరకు ఉన్నవి. పీఠమున శక్తి యుండును గనుక పీఠమును కదల్చుటకు వీలు లేదు. కాంచీ నగరమున యతీశ్వరులు ద్వైత, విశిష్టాద్వైతాచార్యులతో అనేకవాదవివాదములలో పాల్గొని యుండవలెను. యాదవ ప్రకాశ, రామానుజాదులు కాంచీనగరమున ఉండిరి. కాని, వారు కాంచీలోని అద్వైతులతో శాస్త్రార్థము చేసినట్లు

చెప్పబడలేదు. ఆంధ్రపూర్ణ డను వైష్ణవుడు తన సుకృతి దీపికలో

"రామానుజాచార్యకృతం భాష్యం నిర్జరసంమతం కర్తుం తత్ శృంగశైలేంద్రీ శంకరాచార్యనిర్మితపీఠే వాణీమయే విద్వత్సంఘమధ్యే న్యచిక్షిపత్. వహంతీ శారదా భాష్యం రామానుజకృతం ముదా—అహో రామానుజాచార్యత్వమర్హసి యతీశ్వర ..."

అని వ్రాసినాడు. రామానుజుడు తన భాష్యమును దేవతలకు సంమతమైనట్లు చూపదలచి శృంగేరికి పోయి అచట శంకర పీఠమున గల విద్వాంసుల యొద్ద ఉంచెనట! అప్పుడు ఆ శ్రీభాష్యమును చేత బూని శారదాదేవి ఆయనను పొగడెనట. ఇది కల్పితగాథ.

దూరదేశముల నుంచి సహితము ప్రజలు కాంచి కేతెంచి విద్యాభ్యాసము గరపెడివారు. హీనయాన బౌద్ధ మతమున కిది ముఖ్యమైన వ్యాఖ్యానకేంద్రము. క్రీ. త రెండవ శతాబ్దమునకు చెందిన మణిమేఖలై ప్రకారము కాంచీనగరమున ఆనాటికే బుద్ధవిహార మొకటి గలదు. కాంచీనగరపు జ్యోతిపాలుని అభ్యర్థనను అనుసరించి బుద్ధ ఘోషుడు తన మనోరథపూరణిని వ్రాసెను. ధ్యానమార్గ ప్రవర్తకుడగు బోధిధర్మ కాంచీరాజ కుమారుడు. కాంచీ రాజు బుద్ధఘోష, బుద్ధదత్తులను గౌరవించెను. ధమ్మ పాలుని జన్మస్థలము కాంచీనగరము. కాంచీపురమున నూటి కంటె ఎక్కువ బుద్ధవిహారము లున్నవని, వీటిలో పదివేల

బౌద్ధభిక్షువు లున్నారని, ఇచట 80 దేవమందిరములు కలవని, ఈ మందిరములలో ఎక్కువగా దిగంబరులవే కలవని ఏడవ శతాబ్దారంభమున ఇచటకు వచ్చిన యువాన్‌చ్వాంగ్ వ్రాసెను. అప్పటికే బౌద్ధ, జైన, శైవాలయము లిచట విరాజిల్లినవి.

కామాక్షీ ఆలయమునకు అరమైలులోపుగా ఐదు బుద్ధవిగ్రహములు లభించినవి. ఏడడుగుల పది అంగుళముల ఎత్తుగా ఉన్న బుద్ధ విగ్రహము ఒకటి కామాక్షీమందిరము లోపలి ప్రాకారమున దొరకినది. ఇది ఏడవ శతాబ్దారంభము నాటిదని పురాతత్త్వవిభాగపరిశోధకుల సిద్ధాంతము. కాంచీపురములోని ఒక భాగమును బుద్ధకంచి అనెడివారు. మందిరములో గల విగ్రహము ఒకప్పుడు ప్రాముఖ్యము కలిగియున్న మూర్తి కావలెను. లేనిచో ఆ విగ్రహమును కాపాడదలచినవారు దానిని బయటనుంచి లోనికి తెచ్చి యుండవలెను. కాని, ఇంతటి పెద్దవిగ్రహమును బయటినుండి తెచ్చుట అసంభవము కనుక పురాతత్త్వపరిశోధకులీప్రదేశమున నొక బుద్ధమందిర ముండెడిదని, స్త్రీమూర్తి తారాదేవి అని అభిప్రాయపడిరి. అప్పుడు శంకరునదని చెప్పబడు విగ్రహము బుద్ధునిదే ఐ యుండవలెనని వీరి తాత్పర్యము.

మూడున్నర అడుగుల ఎత్తుగా యోగముద్రలో నున్న బుద్ధవిగ్రహ మొకటి రెండవప్రాకారమున లభించినది. ఐదున్నర అడుగుల ఎత్తుగా యోగముద్రలో నున్న ఒక

బుద్ధవిగ్రహము కామాక్షీమందిరమునకు గల తోటలో దొరకినది. మిగిలిన రెండు విగ్రహములు విష్ణుకాంచిలో లభించినవి. కామాక్షీమందిరమున బయట ప్రాకారములో గల ధ్వజస్తంభము దగ్గర మండపమున్నది. ఈ మండప స్తంభములపై బుద్ధుని మూర్తులు, తారాదేవి ఆకృతులు చెక్కబడినవి. ఈ ఆవరణ అంతియు ఒకనాడు బౌద్ధుల విగ్రహములతో, పూజాపురస్కారములతో విరాజిల్లినది.

కామాక్షీమందిరమున శంకరునిదని చెప్పబడు విగ్రహమును పోలిన బుద్ధవిగ్రహము లనేకములు శిథిలావస్థలో ముక్కలు ముక్కలుగా విరిగినవి బయట ప్రాకారమున కుత్తరపువైపున ఉన్నవి. ఇవి పద్మాసనములో నున్న బుద్ధుని మూర్తులు. బృహత్సంహితలోను, మానసారమున చెప్పబడిన బుద్ధవిగ్రహలక్షణము లీవిగ్రహములకు సరిపోవు చున్నవి. శంకరుని విగ్రహమైనచో యోగపద్మాసనస్థితి ఉండునే గాని పద్మాసనస్థితికాదు.

శంకరునకు నలుగురే శిష్యులు. బుద్ధుని మొదటి శిష్యులు ఐదుగురు. బుద్ధుడు గయకు వెళ్ళినపుడు ఈ ఐదుగురు సార్నాథ్ చేరిరి. అప్పుడు బుద్ధుడు ఆరవ శిష్యుని తీసికొనెను. అప్పటినుంచి ఈ ఆర్గురు బుద్ధునివెంట ఉండెడివారు. ఈ ఆర్గురు కామాక్షీమందిరములోని బుద్ధదేవుని విగ్రహమునకు క్రిందగా చెక్కబడి ఉన్నారు. ఈ ఆర్గురి వస్త్రధారణ కూడ వైదిక సన్యాసుల వలె ఉండదు. ఈమూర్తులకు తర్వా

తివారు మార్పులు తెచ్చి నల్లురి శిష్యుల చేతులలోనే దండ ముల నేర్పరచిరి. ఇవి అర్వాచీనులు కల్పించిన వని పురాతత్త్వశాఖ వారి నిర్ణయము.

కామాక్షీమందిరమున జైనుల మాన స్తంభము కూడ ఉన్నది. ఈ స్తంభమునకు పై భాగమున బ్రహ్మయక్షుని మూర్తి కలదు. జైనమతమున యక్షులు, అంబిక, పద్మావతి అను యక్షిణులు ఉన్నారు. కామాక్షీమందిర మండలి మాన స్తంభమునగల యక్షిణి అంబిక. కాంచీసమీపమున గల పక్షితీర్థ మనబడు జినకాంచిలో చంద్రప్రభామందిరమున్నది. ఈ మందిరములోని వర్ధమానుని విగ్రహమును కామాక్షీ మందిరమునుంచి 1922 లో తెచ్చినారు. అచట గల ధర్మదేవి అనబడు అంబికావిగ్రహము కూడ ఇక్కడనుంచి పదమూడవ శతాబ్దమున తీసికొనిపోబడినదే. ధర్మదేవినే బంగారు కామాక్షి అని పిలచిరి. బంగారు కామాక్షి అని స్వచ్ఛమైన తెలుగుపేరుతో వ్యవహరింపబడు విగ్రహము నొకదానిని కుంభకోణములో గలదని చూపుదురు. ఐతే శంకరుడు ఏ కామాక్షిని పునః పవిత్రితము గావించెను?

నేటి కామాక్షీమందిరసమీపమున ఆదిపీఠపరమేశ్వరీ మందిర మని పిలువబడు మందిర మున్నది. ఇదే ప్రాచీన కాలపు శక్తిపీఠము. దీనినే శంకరు డుద్ధరించెను. ఈ శక్తి పీఠమున గల దేవగర్భను బౌద్ధజైనాదులు అపవిత్రముచేయుటచే శంకరు డామెను మరల పూజకు యోగ్యమగునట్లు చేయవలసి వచ్చెను. మూలవిగ్రహ మగు కామాక్షీసమీప

మున గల గర్భగృహమున గాక, తర్వాతి అర్ధగర్భగృహ
మున శ్రీచక్రమున్నది. పూజాపాఠములు జరుగు ప్రదేశ
మున శ్రీచక్ర ముండుట ఆగమానుసారి యగు స్థితి కాదు.
పదునారవశతాబ్దమున వెల్లూరును పాలించు లింగప్పనాయ
కుని కాలమున యాగాదిపుణ్యకర్మలు చేసిన శ్రీనరసింహా
ధ్వరి గలడు. ఆయన కామాక్షీమందిరమున శ్రీచక్రప్రతిష్ఠ
గావించె నని 1954_55 లోని 349 వ శిలాశాసనము వలన
తెలియుచున్నది. అంతకుముందు శ్రీశంకరులు ప్రతిష్ఠ చేసిన
శ్రీచక్రము వేరొకచోట ఉండవచ్చును. దాని పరిశోధకులు
అన్వేషించినచో బహుశః ఆదిపీఠపరమేశ్వరీ మందిరమున
నెక్కడైనను కన్పించ వీలున్నది. అంతేగాని, కామాక్షి
ఆలయములోని శ్రీచక్రమును శంకరుడు వేయలేదు.
కామాక్షీమందిరమున పూర్వ పశ్చిమ ద్వారసమీపమున
గల మూర్తికూడ శంకరునిది కాదు. "ఇది కామాక్షీశ్వర
భారతీశ్రీపాదంగళు" ది అని శిలాలేఖ తెలుపుచున్నది. ఇక్కే
వరదరాజాలయమున మనకు చూపు ప్రతిమలు వ్యాస
శంకరులవి కావు. ఒకటి శంకరదాసుది, రెండవది వైష్ణవ
గురువుది.

గురువుగారి అనుమతి పొంది పద్మపాదుడు తీర్థయాత్ర
లకు బయలుదేరెను. కాళహస్తి, కాంచి. కల్లాల, పుండరీక
పుర, శివగంగాది స్థలములను దర్శించి రామేశ్వరమునకు
బయలుదేరెను. దారిలో తన పూర్వాశ్రమపు మేనమామ
ఇంట కొంతకాలము గడపెను. అచటనే తను వ్రాసిన శారీరక

భాష్యటీకను ఉంచి తీర్థాటనమునకు మరల బయలుదేరెను. మేనమామ ఆ టీకను చదివి, ఇది ప్రచారమునకు వచ్చినచో కర్మమీమాంసకు ఆటంకము వాటిల్లు నని యెంచి తన గృహమునకే నిప్పు అంటించెనట. దానితో పద్మపాదుని టీక తగుల బడినది. పద్మపాదుడు తీర్థయాత్రలై తిరిగివచ్చి, ఈ సంగతి తెలిసి విపరీతమగు దుఃఖమున మునిగెను. గురుదర్శనము చేసి కొనగా, శంకరుడు తాను మొదట వినిన టీకాభాగమును పద్మపాదునకు చెప్పెనని, అది పద్మపాదుడు వ్రాసికొనెనని, అదే పంచపాదిక అను అసంపూర్ణటీక అని ఒక కథ చెప్పుదురు. కాని శంకరుడు స్మరించిన టీక ఐదుపాదముల మీదదైతే మనకు ఐదుసూత్రముల మీది టీకకూడ లభించదు. నాలుగు సూత్రములపైన గల టీకనే 'పంచపాదిక' అని వ్యవహరించు చున్నాము.

7. దిగ్విజయము

శ్రీశైలమున కేతెంచి, భ్రమరాంబా మల్లికార్జునుల నర్చించుచు శంకరులు కొంత కాల మట నుండిరి. ఇచటనే శివానందలహరి, భ్రమరాంబాష్టకము చెప్పబడినది. శ్రీ శంకరులు భ్రమరాంబికను ఈ విధముగా స్తుతించిరి.

శ్లో॥ చాంచల్యారుణలోచనాంచిత కృపాం చంద్రార్కచూడామణిం
చారుస్మేరముఖాం చరాచరజగత్సంరక్షణీం తత్పదామ్।
చంచచ్చంపకనాసికాగ్ర విలసన్ముక్తామణీరంజితాం
శ్రీశైలస్థలవాసినీం భగవతీం శ్రీమాతరం భావయే॥

తా॥ చాంచల్యము వలన ఎఱ్ఱబారిన నేత్రములలో ఒప్పుచున్న కృపారసముగలదియు, చంద్రార్కులను శిరోభూషణములుగా ధరించినదియు, సుందరమందహాసముతో ఒప్పారు ముఖము కలదియు, చరాచరజగత్తును సంరక్షించునదియు, 'తత్త్వమసి' యందలి 'తత్' పదమునకు లక్ష్యార్థ మైనదియు; వికసించుచున్న సంపెంగపువ్వు వంటి నాసిక యొక్క అగ్రభాగమున ముక్తామణులతో విరాజిల్లునదియు, శ్రీశైలస్థలవాసిని, భగవతి, శ్రీమాతయు నగు భ్రమరాంబికను భావన చేయుదును.

శ్లో॥ కస్తూరీతిలకాంచితేందువిలసత్ ప్రోద్భాసిఫాలస్థలీం
కర్పూరద్రవమిశ్రచూర్ణ ఖదిరామోదోల్లసద్వీటికామ్।
లీలాపాంగతరంగితై రధికృపాసారై ర్నతానందినీం
శ్రీశైలస్థలవాసినీం భగవతీం శ్రీమాతరం భావయే॥

తా॥ శ్రీశైలస్థలవాసిని యగు భ్రమరాంబికాదేవియొక్క ఫాలభాగము కస్తూరీతిలకాంచితమై చంద్రునివలె భాసించు నట్టిది; ఆమె కర్పూరరసముతో మిశ్రితమైనసున్నము కవిరి (కాచు) యొక్క సువాసనను గుబాళింపజేయు తాంబూల చర్వణము చేయును; చంచలములైన క్రీగంటిచూపులందు తరంగితములైన కృపావర్షధారలతో వినీతులయిన భక్త జనము నానందింప జేయునట్టిది. తాదృశమహిమాన్వితయైన శ్రీమాతను మనసా భావింతును.

శ్లో॥ రాజన్మత్తమరాళమందగమనాం రాజీవపత్రేక్షణాం
రాజీవప్రభవాదిదేవమకుటైః రాజత్పదాంభోరుహామ్।
రాజీవాయతపత్రమండితకుచాం రాజాధిరాజేశ్వరీం
శ్రీశైలస్థలవాసినీం భగవతీం శ్రీమాతరం భావయే॥

తా॥ రాజహంసవలె మందగమనము కలదియు, పద్మదళాయి తాక్షియు, బ్రహ్మాదిదేవతలయొక్క మకుటకాంతులతో విభ్రాజితమైన చరణాంబుజ యుగళముతో నొప్పారునదియు, పద్మ పత్రాలంకృతమైన కుచాభోగము కలదియు, రాజాధిరాజేశ్వరి శ్రీశైల స్థలవాసిని, భగవతి, శ్రీమాతయు నగు భ్రమరాం బికను మనమున భావింతును.

శ్లో॥ షట్తారాగణదీపికాం శివసతీం షడ్వైరివర్గాపహాం
షట్చక్రాంతరసంస్థితాం వరసుధాం షడ్యోగినీ వేష్టితామ్,
షట్చక్రాంచిత పాదుకాంచితపదాం షడ్భావగాం షోడశీం
శ్రీశైలస్థలవాసినీం భగవతీం శ్రీమాతరం భావయే॥

తా॥ ఆ పరాదేవి ఓంకారపట్కము యొక్క ప్రాంగణమున ప్రకాశించు దివ్వె: (దేవీమంత్రమందలి ఓంకారములు ఆరు) ఆమె శివసతి; కామక్రోధాది అరిషడ్వర్గమును పరాభూత మొనర్చునట్టిది; ఆమె మూలాధారాది షట్చక్రాంతర మందు వసించునట్టిది; అమృతరసమును గురియునట్టిది: కాకిన్యాది యోగినీపరివేష్టితయై విరాజిల్లునట్టిది; షట్చక్రాంచితములైన పాదుకలయందు శోభిల్లుచున్న పాదయుగళముతో మందమందముగా అడుగులు వేయునది; షడ్భావముల నడపునది; షోడశాక్షరీమంత్రాత్మిక. అట్టి మహిమాసంపన్నయు, శ్రీశైలస్థలవాసిని, భగవతి, శ్రీమాతయునగు భ్రమరాంబికను మనసా ధ్యానింతును.

శ్లో॥ శ్రీనాథాదృతపాలితత్రిభువనాం శ్రీచక్రసంచారిణీం
గానాసక్త మనోజయౌవన లసద్గంధర్వకన్యాదృతామ్।
దీనానా మతివేలభాగ్యజననీం దివ్యాంబరాలంకృతాం
శ్రీశైలస్థలవాసినీం భగవతీం శ్రీమాతరం భావయే॥

తా॥ భ్రమరాంబిక శ్రీహరిచే పూజ లందుకొనుచు భువనత్రయమును పాలించుచు శ్రీ చక్రమునందు సంచరించుచుండును. మన్మథయౌవనోద్భాసితలును, గానాసక్తలు నైన గంధర్వకన్యలచే సమాదరింపబడుచుండును. దీనజనులకు అపారమైన భాగ్యము నొసగుచుండును. దివ్యాంబరములతో అలంకృతయై విరాజిల్లుచుండును. అట్టి శ్రీశైలస్థలవాసిని; షడ్గుణైశ్వర్యసంపన్న యగు భగవతి శ్రీమాతయు నగు భ్రమరాంబికను నిండుహృదయముతో భావింతును.

శ్లో॥ లావణ్యాధిక భూషితాంగతిలకాం లాక్షాలసద్రాగిణీం
సేవాఽఽయాత సమస్తదేవవనితాం సీమంతభూషాన్వితామ్।
భావోల్లాసవశీకృత ప్రియతమాం భండాసురచ్ఛేదినీం
శ్రీశైలస్థలవాసినీం భగవతీం శ్రీమాతరం భావయే॥

తా॥ఆ పరమేశ్వరియొక్క అంగలతిక లావణ్యాధిక్యముచే ప్రకాశించుచుండును. లాక్షారుణిమతో నొప్పారునట్టి దాతల్లి. ఆమె సేవ యొనర్చుటకై దేవ వనితాగణమంతయు నేతెంచును. ఆమె తన భావోల్లాసముచేత ప్రియతముడైన మల్లిఖార్జున దేవుని మనసు రంజింపజేసి వశీకృతునిగా జేసికొనును. భండాసురుని చెనకాడిన దామె. అట్టి శ్రీశైలనిలయను,భగవతిని, శ్రీమాతను అనన్యచిత్తముతో ధ్యానింతును.

శ్లో॥ ధన్యాం సోమవిభావనీయచరితాం ధారాధరశ్యామలాం
మున్యారాధన మేదినీం సుమహతాం ముక్తిప్రదానవ్రతామ్।
కన్యాపూజనసుప్రసన్నహృదయాం కాంచీలసన్మధ్యమాం
శ్రీశైలస్థలవాసినీం భగవతీం శ్రీమాతరం భావయే॥

ఆ భగవతి ధన్యచరిత; చంద్రునిచే విభావనీయమైన చరితము గలది; నీలాంబుదశ్యామల; మునులు చేయు ఆరాధనయందు ఆసక్తి గలది; మహాత్ములకు ముక్తిప్రదానమొనర్చు వ్రతము గలది; కన్యాపూజనమందు సుప్రసన్న హృదయ; ఆమె నడుము ఒడ్డాణముతో వెలుగొందుచుండును; అట్టి శ్రీశైలవాసిని, భగవతి, శ్రీమాతయు నగు భ్రమరాంబికను మనసా ధ్యానింతును.

శ్లో॥ కర్పూరాగరుకుంకుమాంకితకుచాం కర్పూరవర్ణాన్వితాం
కృష్టోత్కృష్టసుకృష్టకర్మదహనాం కామేశ్వరీం కామినీమ్।
కామాక్షీం కరుణారసార్ద్రహృదయాం కల్పాంతరస్థాయినీం
శ్రీశైలస్థలవాసినీం భగవతీం శ్రీమాతరం భావయే॥

తా॥ భగవతి కర్పూరము, అగురువు, కుంకుమ యొక్క మైపూత గల కుచాభోగము గలది; కర్పూరమువంటి ధవళ చ్ఛాయ గలది; కృష్టములు, ఉత్కృష్టములు, సుకృష్టములను త్రివిధకర్మలను దగ్ధమొనర్చునట్టిది; కామేశ్వరి; కామిని; కామాక్షి; కరుణారసార్ద్రహృదయ; కల్పాంతము వరకు నిశ్చలయై, నిర్వికారయై ఉండునట్టి తల్లి; అట్టి శ్రీశైలాధివాసిని, భగవతి శ్రీమాతయు నగు భ్రమరాంబికను నేను భావింతును.

శ్లో॥ గాయత్రీం గరుడధ్వజాం గగనగాం గంధర్వగానప్రియాం
గంభీరాం గజగామినీం గిరిసుతాం గంధాక్షతాలంకృతామ్।
గంగాగౌతమగర్గసన్నుతపదాం గాం గౌతమీం గోమతీం
శ్రీశైలస్థలవాసినీం భగవతీం శ్రీమాతరం భావయే॥

తా॥ ఆ పరాదేవతయే గాయత్రి; గరుడధ్వజ; ఆకాశమందంతట వ్యాప్తయై యున్నది; గంధర్వగానప్రియ; గాంభీర్యగుణసంపన్న; గజగామిని; పర్వతరాజపుత్రి; గంధాక్షతాలంకృత; గంగా గౌతమ గర్గాదులచే స్తవనీయచరణ సరోజములు గలది; ఆమె గోరూపిణి; గౌతమి, గోమతియు ఆమెయే. అట్టి శ్రీశైలస్థలవాసినిని, భగవతిని, శ్రీమాతయు

నగు భ్రమరాంబికనుభక్తినిర్భర హృదయముతో భావింతును.
శ్రీశంకరులు మల్లికార్జునదేవుని నీవిధముగ స్తుతించిరి.

శ్లో॥ శ్రీశైలశృంగే వివిధప్రసంగే
శేషాద్రిశృంగేఽపి సదా వసంతమ్।
త మర్జునం మల్లికపూర్వ మేనం
నమామి సంసారసముద్రసేతుమ్॥"

సంసారమను సముద్రమునకు సేతువువంటివాడీమహాదేవు డని కొనియాడెను.

శ్రీశైలప్రాంతమున కాపాలికులు ఒకప్పుడు విజృంభించినట్లు మనకు ఇతరాధారముల వలన తెలియుచున్నది. ఒకనాడు కాపాలికు డొకడు శంకరుని వద్ద చేరి వేదాంత పఠనము గావించెను. కొంతకాలమైనతర్వాత, అతడు గురువు నుద్దేశించి "నామనోవాంఛితమగు భైరవారాధన సఫలము కావలెననిన, యతి యొక్క శిరస్సు, హోమము చేయవలసియున్నది; మీకు శరీరాభిమానము లేదు గాన, మీ శిరస్సును ఇవ్వ ప్రార్థన"-అనెను. అప్పుడు "నాశిష్యులు నాచెంత లేని సమయమున, నీవు కోరినవిధముగానే నాశిరమును తీసికొనుము"అని శ్రీశంకరులనిరి. అట్టి సమయమాసన్నమాయెను. అకాపాలికుడు తన కర్తవ్యమును నెరవేర్చదలచెను. ఎచటనో యున్న పద్మపాదున కీ విషయము తెలిసినది. వెంటనే అతడు నృసింహస్వామిని తనపై నావాహన చేసికొనెను. నృసింహస్వామి పూనకముతో ఆ ప్రదేశమునకు వచ్చిన పద్మపాదుడు

ఆ కాపాలికుని తనగోళ్ళతో చీల్చి చంపెను. ధ్యానముద్ర నుంచి బయటకు వచ్చిన శంకరులు తన శిష్యుని ఆవహించిన నృసింహస్వరూపమును "పాలయ కృపాలయ నరసింహ నరసింహ" యను శ్లోకములతో స్తుతించిరట.

శ్రీశైలమున భ్రమరాంబను స్తుతించి, అర్చన, మొనర్చి, ఆ ప్రాంతమున గల పండితులను శాస్త్రార్థములో పరాజితులను జేసి, మరల దేశాటనమునకు బయలుదేరెను. మార్గమధ్యమున, శంకరునకు 'శ్రీబలి' యను గ్రామము తటస్థపడెను.

ఈ గ్రామమున ప్రభాకరు డను బ్రాహ్మణు డొకడు గలడు. ఆయన పేరు భాస్కరుడని కొందరందురు. కర్మమీమాంసానిష్ణాతుడు, నిష్ఠానిపుణుడు, ఐశ్వర్యశాలి అగు ప్రభాకరునకు పిచ్చివానివలె ప్రవర్తించు పుత్రుడు కలడు. పదమూడేండ్ల కుమారునితో శంకరుని వద్దకు వచ్చి పిల్లవానిని ఆచార్యున కప్పగించెను. "నీవెవరవు?" అని శంకరుడా పిల్లవానిని ప్రశ్నించగా,

శ్లో॥ "నాహం జడః కింతు జడః ప్రవర్తతే
మత్సంవిధానేన న సందిహే గురో।
షడూర్మి షడ్భావ వికారవర్జితం
సదైకతానం పర మస్మి తత్పదమ్"॥

అని ప్రత్యుత్తర మిచ్చెనని మాధవీయమున గలదు. తను అవికారి యగు పరబ్రహ్మస్వరూపమని అతని సమా

ధానమును వినగనే, శంకరుడు తండ్రితో "ఈపిల్లవాడు నావద్ద ఉండుటకే తగినవాడు కావున అతనిని నాదగ్గర వదలి వేయుడు" అని పలికెను. తండ్రి అట్లేచేసెను. ఇతనికి ఆశ్రమ మిచ్చి వేదాంతబోధ గావించెను. వేదాంత మీాయనకు అర చేతిలోని ఉసిరికవంటిదగుటచే ఈయనకును హస్తామలకు డనిరి. ఆత్మతత్త్వము నీయన పండ్రెండు శ్లోకములలో చెప్పినాడు.

ఈ సందర్భమున ఆచార్యులవారు చెప్పిన హస్తామలకము గమనింపదగినది. దీనిపైగల హస్తామలకీయ భాష్యమును శంకరులు రచించి రని చెప్పుదురు. తన శిష్యుని రచనపై ఆచార్యుడు భాష్యము వ్రాయడని గాని, వ్రాయలేడని గాని, అనజాలము. కాని వ్రాసినాడా అను సందేహము మాత్రము వదలుట కష్టము. హస్తామలకుని నామాంతరము పృథ్వీధవాచార్యు డని ద్వారకాపీఠమందలి గ్రంథముల వలన జగన్నాథపీఠములోని పుస్తకముల వలన తెలియుచున్నది. మృతశిశువును గూర్చి తల్లి విలపించుచుండగా, దానిని మాన్ప దలచి, ఒక సిద్ధపురుషు డామృతకళేబరమును ప్రవేశించె నని, పుత్రుడు బ్రతికినా డను ఆనందము తల్లికి కల్గెనని, కాని అతడు జడత్వము దాల్చి యుండుటచే పిశాచగ్రస్తుడని భావించి శంకరుని వద్దకు తెచ్చిరనియు ఆసిద్ధపురుషుడే హస్తామలకు డాయెననియు చెప్పుదురు.

శ్లో॥ కస్త్వం శిశో కస్య కుతోఽసి గంతా
కిం నామ తే త్వం కుత ఆగతోఽసి।

ఏతద్ వద త్వం మమ సుప్రసిద్ధం
మత్ప్రీతయే ప్రీతివివర్ధనోఽసి॥

శ్లో॥ నాహం మనుష్యో న చ దేవయక్షా
న బ్రాహ్మణక్షత్రియవైశ్యశూద్రాః।
న బ్రహ్మచారీ న గృహీ వనస్థో
భిక్షుర్నచాహం నిజబోధరూపః॥

తా॥ ఓ బాలుడా! నీవెవరవు? ఎవరివాడవు? ఎక్కడకు బోవువాడవు? నీ పేరేమి? నీ వెటనుండి వచ్చితివి? నాకు దీనిని స్పష్టముగా చెప్పి నా ఆనందమును పెంపొందింపుము.

నేను మనుష్యుడను గాను; దేవ యక్షులలో నెవడను గాను; బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రవర్ణములలో ఏ వర్ణమునకును చెందినవాడను గాను. నేను బ్రహ్మచారిని గాను, గృహస్థును గాను, వానప్రస్థుడను గాను, సంన్యాసిని గాను. నేనీవిధముగా వర్ణాశ్రమధర్మాతీతుడను; నేను నిజ బోధస్వరూపుడను.

శ్లో॥ నిమిత్తం మనశ్చక్షురాదిప్రవృత్తౌ
నిరస్తాఖిలోపాధి రాకాశకల్పః।
రవి ర్లోకచేష్టానిమిత్తం యథా యః
స నిత్యోపలబ్ధిస్వరూపోఽహ మాత్మా॥

శ్లో॥ య మగ్న్యుష్ణవ న్నిత్యబోధస్వరూపం
మనశ్చక్షురాదీ న్యబోధాత్మకాని।
ప్రవర్తంత ఆశ్రిత్య నిష్కంప మేకం
స నిత్యోపలబ్ధిస్వరూపోఽహ మాత్మా॥

శ్లో॥ ముఖాభాసకో దర్పణే దృశ్యమానో
ముఖత్వాత్ పృథక్త్వేన నైవాస్తి వస్తు।
చిదాభాసకో ధీషు జీవోఽపి తద్వత్
స నిత్యోపలబ్ధిస్వరూపోఽహ మాత్మా॥

తా॥ సూర్యుడు లోకయాత్రానిమిత్తము సాయపడురీతిగ, సర్వోపాధివిముక్తుడును, ఆకాశమువలె సర్వవ్యాపియును, మనస్సు, చక్షురాదీంద్రియముల ప్రవృత్తికి నిమిత్తమాత్రుడునై తోడ్పడుచు విలసిల్లునట్టి నిత్యము అనుభూతి స్వరూపమైన ఆత్మను నేను.

అగ్నికి వేడిమి సహజ మయినట్లు, స్వాభావికముగ నిజబోధస్వరూప మేది కలదో, నిష్కంపము, ఏకము నగు దేని నాశ్రయించి, జడములయిన మనశ్చక్షురాదీంద్రియములు స్వకార్యములందు ప్రవర్తించుచున్నవో ఆ నిత్యోపలబ్ధిస్వరూపమైన ఆత్మను నేనే.

ముఖమును ప్రతిబింబించునట్టి దర్పణమందలి ముఖము దృశ్యమానమైన ముఖము కంటె భిన్నము కానిరీతిగ, చిదాభాసకుడైన జీవుడును ఆత్మకంటె వేరు కాడు. అట్టి నిజోపలబ్ధిస్వరూపమగు ఆత్మను నేనే అయి యున్నాను.

శ్లో॥ యథా దర్పణాభావ ఆభాసహానౌ
ముఖం విద్యతే కల్పనాహీన మేకమ్।
తథా ధీవియోగే నిరాభాసకో యః
స నిత్యోపలబ్ధిస్వరూపోఽహ మాత్మా॥

శ్లో॥ మనశ్చక్షురాదే ర్వియుక్త స్స్వయం యో
మనశ్చక్షురాదే ర్మనశ్చక్షురాదిః।
మనశ్చక్షురాదే రగమ్యస్వరూపః
స నిత్యోపలబ్ధిస్వరూపోఽహ మాత్మా॥

శ్లో॥ య ఏకో విభాతి స్వత శ్శుద్ధచేతాః
ప్రకాశస్వరూపోఽపి నానేవ ధీషు।
శరావోదకస్థో యథా భానురేకః
స నిత్యోపలబ్ధిస్వరూపోఽహ మాత్మా॥

తా॥ అద్దము లేనప్పుడు ప్రతిబింబ ముండదు; కల్పనాహీన మైన ముఖమొక్కటియే యుండును. అటులనే, బుద్ధి విలీన మైనపుడు ద్వైతకల్పన ముండదు. నిరాభాసకమైన దేదిగలదో, ఆ నిత్యోపలబ్ధిస్వరూపమగు ఆత్మయే నేను.

ఏ ఆత్మతత్త్వము మనస్సు, చక్షువు మున్నగు ఇంద్రియములు లేనిదయ్యు, మనస్సునకు మనస్సు, చక్షువుకు చక్షువునై మనశ్చక్షురాది యింద్రియముల కగమ్యమై వెలయుచున్నదో; ఆ నిత్యోపలబ్ధిస్వరూపమగు ఆత్మను నేనే.

ఏ ఆత్మతత్త్వము స్వయంప్రకాశస్వరూపమై, ఏకమై, శుద్ధచైతన్యస్వరూపమై వెలుగొందుచున్నదైనను, విభిన్నజల కుంభములలో ప్రకాశించు సూర్యుడు విభిన్నముగా దోచునట్లు అది విభిన్నములగు బుద్ధ్యుపాధులందు అనేకములుగా గన్పట్టును. అట్టి నిత్యోపలబ్ధిస్వరూపమగు ఆత్మను నేనే.

శ్లో॥ యథాఽనేకచక్షుః ప్రకాశో రవి ర్న
క్రమేణ ప్రకాశీ కరోతి ప్రకాశ్యమ్।
అనేకా ధియో య స్తదేక ప్రబోధః
స నిత్యోపలబ్ధిస్వరూపోఽహ మాత్మా॥

శ్లో॥ వివస్వత్ ప్రభాతం యథారూపమక్షం
ప్రగృహ్ణాతి నాభాతమేవం వివస్వాన్।
యదాభాత ఆభాసయ త్యక్షమేకః
స నిత్యోపలబ్ధి స్వరూపోఽహ మాత్మా॥

శ్లో॥ యథా సూర్య ఏకోఽప్స్వనేక శ్చలాసు
స్థిరాస్వపి అనన్యగ్విభావ్యస్వరూపః।
చలాసు ప్రభిన్నాసు ధీష్వేమ మేకః
స నిత్యోపలబ్ధిస్వరూపోఽహ మాత్మా॥

తా॥ సూర్యుడు అనేక నేత్రములను క్రమముగా గాక, ఏక కాలముననే ప్రకాశింపజేయు రీతిగా, ఆత్మ ఏకమయ్యు అనేకములగు బుద్ధులను ఒకేమారు ప్రకాశింపజేయుచున్నది. అట్టి నిత్యోపలబ్ధిస్వరూపమగు ఆత్మనే నేను.

రవిప్రకాశితములైన వస్తువులనే చక్షురింద్రియము తెలిసికొనుచున్నది గాని, సూర్యప్రకాశితము గాని వస్తువులను గ్రహించుటలేదు. ఆ సూర్యుడును ఏ సచ్చిదాత్మ ప్రకాశముచేత నేత్రాది ఇంద్రియములను ప్రకాశింపజేయునో, అట్టి నిత్యోపలబ్ధిస్వరూపమగు ఆత్మనే నేను.

సూర్యుడు తా నొక్కడే యయ్యు; కదలుచున్న నీటిలో అనేకములుగా తోచును. అదే రీతిగ, తానొక్కడే యయ్యు, చంచలములగు బుద్ధులలో అనేకములుగా భాసించు నట్టి ఏ నిత్యోపలబ్ధిస్వరూపము గలదో ఆ ఆత్మను నేనే.

శ్లో॥ ఘనచ్ఛన్నదృష్టి ర్ఘనచ్ఛన్న మర్కం
యథా నిష్ప్రభం మన్యతే చాతిమూఢః।
తథా బద్ధవద్భాతి యో మూఢదృష్టేః
స నిత్యోపలబ్ధిస్వరూపోఽహ మాత్మా॥

శ్లో॥ సమస్తేషు వస్తుషు అనుస్యూత మేకం
సమస్తాని వస్తూని య న్న స్పృశంతి।
వియద్వ త్సదా శుద్ధ మచ్ఛస్వరూపం
స నిత్యోపలబ్ధిస్వరూపోఽహ మాత్మా॥

శ్లో॥ ఉపాధౌ యథా భేదతా సన్మణీనాం
తథా భేదతా బుద్ధిభేదేషు తేఽపి।
యథా చంద్రికాణాం జలే చంచలత్వం
తథా చంచలత్వం తవాపీహ విష్ణో॥

తా॥ మూఢచిత్తుడు మేఘములచే తనకండ్లు ఆచ్ఛన్నముకాగా సూర్యుడే మేఘాచ్ఛన్నుడైనాడని తలచును. అదేరీతిగా, అజ్ఞాని దృష్టిలో ఆత్మ బద్ధుడుగా కనిపించును గాని, వాస్తవమునకు ఆత్మ నిత్యబోధస్వరూపుడు. అట్టి నిత్యోపలబ్ధి స్వరూపమగు ఆత్మనే నేను.

ఆత్మవస్తువు సర్వపదార్థములందు అనుస్యూతముగా వెలసియు, తత్పదార్థముల సంగము లేక, ఆకాశము వలె, శుద్ధ నిర్మలస్వరూపమై ఏది వెలుగొందుచుండునో, ఆ నిత్యోపలబ్ధిస్వరూపమైన ఆత్మనే నేనై యున్నాను.

శుద్ధస్ఫటికమణియందు ఉపాధిభేదముచేత అనగా జపాకుసుమాది సాన్నిహిత్యభేదము చేత దానివర్ణమునందు భేదము కన్పించురీతిగా, హేవిష్ణో! నిత్య, శుద్ధ, ముక్తస్వభావుడవగు నీయందు బుద్ధిభేదముచేత భేదము కల్పింపబడుచున్నది. తరంగిత జలమందు చంద్రకిరణములయొక్క చంచలత్వము కన్పించునట్లుగా, బుద్ధిస్థమైన చాంచల్యము నీయందు కల్పింప బడుచున్నది.

తర్వాత శంకరుడు మూకాంబికాక్షేత్రమున జగన్మాత యగు మూకాంబికను దర్శించి, సౌందర్యలహరీ స్తోత్రమును రచించెను. అటుపిమ్మట, వినాయకక్షేత్ర మగు తుండపురిని దర్శించి, గణేశ పంచరత్నమును చెప్పెను.

శ్లో॥ ముదా కరాత్తమోదకం సదా విముక్తిసాధకం
కలాధరావతంసకం విలాసిలోకరక్షకమ్।
అనాయకైకనాయకం వినాశితేభదైత్యకం
నతాఽశుభాఽఽశునాశకం నమామి తం వినాయకం॥

తా॥ శ్రీవినాయకుడు రెండుచేతులతో ఆనందముగా మోదకములను గ్రహించియుండును; భక్తజనులకు మోక్షసామ్రాజ్యమును సాధించిపెట్టును. చంద్రుని శిరోభూషణముగ ధరిం

చును; అతడులోకరక్షకుడు; అనాథులకు ఏకైక నాయకుడు; గజాసురసంహర్త; వినీతులగు భక్తజనుల అశుభములను శీఘ్రముగ, బోనార్చును; అట్టి వినాయక దేవుని నమస్కరింతును.

శ్లో॥ నతేతరాతిభీకరం నవోదితార్కభాస్వరం
నమత్సురారినిర్జరం నతాధికాఽఽపదుద్ధరమ్।
సురేశ్వరం నిధీశ్వరం గజేశ్వరం గణేశ్వరం
మహేశ్వరం త మాశ్రయే పరాత్పరం నిరంతరమ్॥

తా॥ అవినీతులపట్ల మిక్కిలి భీకరమైనవాడును, సద్యోదిత భాస్కరునివలె ప్రకాశించువాడును, వినీతులైన రాక్షసుల తోను, దేవతలతోను, పరివేష్టితుడును, వినమ్రులై ఆశ్రయించిన భక్తులయొక్క ఆపదలను నాశమొందించువాడును, దేవదేవుడును, నిధీశ్వరుడును, గజేశ్వరుడును, ప్రమథగణాధిపతియును, మహేశ్వరుడును, పరాత్పరుడు నగు ఆ విఘ్నహర్తను నిరంతర మాశ్రయింతును.

శ్లో॥ సమస్తలోకశంకరం నిరస్తదైత్యకుంజరం
దరేతరోదరం వరం వరేభవక్త్ర మక్షరమ్।
కృపాకరం క్షమాకరం ముదాకరం యశస్కరం
మనస్కరం నమస్కృతాం నమస్కరోమి భాస్వరమ్॥

తా॥ సమస్తలోకములకు మంగళకరుడు, రాక్షససంహర్త పెద్ద బొజ్జ కలవాడు; గజాననుడు, అక్షరుడు; కృపాళువు; క్షమాశీలి, ఆనందమయుడు, కీర్తిప్రదాత, తనను నమస్క

రించువారలకు సద్బుద్ధి నొసగువాడు, స్వయంప్రకాశ స్వరూపుడు నగు వినాయకునికి నమస్కరింతును.

శ్లో॥ అకించనార్తిమార్జనం చిరంతనోక్తిభాజనం
పురారిపూర్వనందనం సురారిగర్వచర్వణమ్।
ప్రపంచనాశభీషణం ధనంజయాదిభూషణం
కపోలదానవారిణం భజే పురాణవారణమ్॥

తా॥ దరిద్రులబాధను పరిమార్జనము చేయువాడును, సనాతనములైన వేదవాదములకు భాజనమైనవాడును, త్రిపురాసురసంహర్త యగు శివుని జ్యేష్ఠపుత్రుడును, రాక్షసగర్వాపహారియును, ప్రళయకాలమున భీషణుడును, అగ్న్యాదిదేవతలకు భూషణమైన వాడును, కపోలములనుండి మదజలము స్రవించుచున్న సనాతనగజమును, (అనగా గజాస్యుని) సేవింతును.

శ్లో॥ నితాంతకాంతదంతకాంతి మంతకాంతకాత్మజం
అచింత్యరూప మంతహీన మంతరాయకృంతనమ్।
హృదంతరే నిరంతరం వసంతమేవ యోగినాం
త మేకదంతమేవ తు విచింతయామి సంతతమ్॥

తా॥ అతిసుందరమైన దంతద్యుతితో నొప్పువాడును, కాలాంతకుడైన శివుని కుమారుడును, అచింత్యమైనరూపము గలవాడును, నాశములేనివాడును, విఘ్నహర్తయును, నిరంతరము యోగీశ్వరుల హృదంతరాళమున వసించియే యున్నవాడును అగు ఆ ఏకదంతుని సతతము ధ్యానించుదును.

శ్లో॥ మహాగణేశపంచరత్న మాదరేణ యోఽన్వహం
ప్రజల్పతి ప్రభాతకే హృది స్మరన్ గణేశ్వరమ్।
అరోగతా మదోషతాం సుసాహితీం సుపుత్రతాం
సమాహితాయు రష్టభూతి మభ్యుపైతి సోఽచిరాత్॥

తా॥ ఈమహాగణేశపంచరత్న మను స్తోత్రమును గణాధిపతిని హృదయమున స్మరించుచు ఎవడు ప్రత్యహము ప్రభాతసమయమున పఠించునో అతడు వెంటనే ఆరోగ్యమును, నిర్దోషత్వమును, మంచిసాహితీ సంపదను, యోగ్యసంతానమును కలిగి దీర్ఘాయువై అణిమాది అష్టైశ్వర్యమును పొందును.

శ్రీ శంకరులు 'గణేశభుజంగ స్తవ' మను పేర, మరియొక స్తవమును చెప్పినట్లుగా కానవచ్చుచున్నది.

శ్లో॥ రణత్క్షుద్రఘంటానినాదాభిరామం
చలత్తాండవోద్దండవత్పద్మతాలమ్।
లసత్తుందిలాంగో పరి వ్యాలహారం
గణాధీశ మీశానసూనుం తమీడే॥

తా॥ మ్రోగుచున్న చిరుగజ్జెల సవ్వడులచే అభిరాముడు; ఉద్ధత తాండవనృత్య మొనర్చుసమయమున, తాలానుగుణమైన పాదపద్మగతి గలవాడు; పెద్దబొజ్జపై సర్పహారములతో నొప్పారువాడు, ఈశానసూనుడు నగు గణాధిపతిని స్తుతింతును.

శ్లో॥ ధ్వనిధ్వంసివీణాలయోల్లాసివక్త్రం
స్ఫురచ్ఛుండదండోల్లసద్బీజపూరమ్।

గలద్గండసౌగంధ్యలోలాలిమాలం
గణాధీశ మీశానసూనుం తమీడే॥

తా॥ వీణానాద మాగినప్పుడు ఆ నాదమందలి లయచేత వికసించిన ముఖము గలవాడును, బాగుగా ప్రకాశించుచున్న తుండమునందు జామపండుతో నొప్పారువాడును, మదజలమును స్రవించునట్టి కపోలములందలి పరిమలమందు ఆసక్తములై యున్న తుమ్మెదల బారులతో విలసిల్లువాడును, ఈశానసూనుడు నగు గణాధీశుని స్తుతింతును.

శ్లో॥ ప్రకాశజ్జపారక్తరత్నప్రసూన
ప్రవాలప్రభాతారుణజ్యోతిరేకమ్।
ప్రలంబోదరం వక్రతుండైకదంతం
గణాధీశ మీశానసూనుం తమీడే॥

తా॥ ప్రకాశించుచున్న జపాకుసుమమువలె భాసించువాడును, ఎఱ్ఱమాణిక్యమును బోలు ప్రసూనమువలె వెలుగొందువాడును, చివురుటాకువలె విలసిల్లునట్టివాడును, ఉషఃకాలమందు నుదయించు అరుణునివలె తేజరిల్లునట్టి జ్యోతిస్స్వరూపుడును, లంబోదరుడును, వక్రతుండుడును, ఏకదంతుడును, ఈశానసూనుడు నగు గణాధీశుని స్తుతింతును.

శ్లో॥ విచిత్రస్ఫురద్రత్నమాలాకిరీటం
కిరీటోజ్జ్వలచ్చంద్రరేఖావిభూషమ్।
విభూషైకభూషం భవధ్వంసహేతుం
గణాధీశ మీశానసూనుం తమీడే॥

తా॥ చిత్రవిచిత్రముగా దోచునట్టి రత్నహారములతో నలంకృతమైన మకుటము గలవాడును, ఆ కిరీటమందు మనోహారి యగు చంద్రకళను ఆభూషణముగా ధరించినవాడును, అలంకారముల కలంకారప్రాయమైనవాడును, సంసారదుఃఖములకు నాశహేతువు నైనవాడును, ఈశానసూనుడును అగు గణాధిపతిని స్తుతింతును.

శ్లో॥ ఉదంచద్భుజావల్లరీదృశ్యమూలో
చ్చలద్భ్రూలతావిభ్రమభ్రాజదక్షమ్।
మరుత్సుందరీచామరైస్సేవ్యమానం
గణాధీశ మీశాన సూనుం తమీడే॥

తా॥ అందమైన బాహుమూలములు గలవాడును, కదలుచున్న కనుబొమలతో ప్రకాశించుచున్న నేత్రములు గలవాడును, మరుత్సుందరీ గణముచేత వింజామరలతో, వీవనలు వీయబడువాడును, ఈశానసూనుడు నగు గణాధిపతిని స్తుతింతును.

శ్లో॥ స్ఫురన్నిష్ఠురాలోలపింగాక్షితారం
కృపాకోమలోదారలీలావతారమ్।
కలాబిందుగం గీయతే యోగివర్యై
ర్గణాధీశ మీశానసూనుం తమీడే॥

తా॥ ప్రకాశముతో కఠినముగ దిరుగునట్టి పింగాక్షముల కనీనికలు కలవాడును, దయతో నుదారము, కోమలము నగు లీలావతారమూర్తియు నైనవాడును, కళాబిందుగతునిగా

యోగీశ్వరులచే ప్రస్తుతింపబడువాడును, ఈశానసూనుడు నగు గణాధిపతిని స్తుతింతును.

శ్లో॥ య మేకాక్షరం నిర్మలం నిర్వికల్పం
గుణాతీత మానంద మాకారశూన్యమ్।
పరంపార మోంకార మామ్నాయగర్భం
వదంతి ప్రగల్భం పురాణం తమీడే॥

తా॥ ఏకాక్షరమును, నిర్మలమును నిర్వికల్పమును, గుణాతీతమును, ఆనందమయమును, రూపరహితమును, వేదగర్భయును, సంసారసాగరమునకు సుదూరమున నున్నదియును అగు ఏ ఓంకారముగలదో, ఆ ప్రణవమూర్తియును, సనాతనుడును, ప్రగల్భుడు నగు గణాధిపతిని స్తుతింతును.

శ్లో॥ చిదానందసాంద్రాయ శాంతాయ తుభ్యం
నమో విశ్వకర్త్రే చ హర్త్రే చ తుభ్యమ్।
నమోఽనంతలీలాయ కైవల్యభాసే
నమో విశ్వబీజ ప్రసీద ఈశసూనో॥

తా॥ ఓ విశ్వబీజా! చిదానంద సాంద్రుడవును, శాంతస్వరూపుడవును అగు నీకు నమస్కారము. జగత్స్రష్ట; జగత్సంహర్తయు నగు నీకు నమోవాకము. అనంతలీలావిలసితుడవును, కైవల్యమున భాసమానుడవు నగు నీకు వందనము. హే ఈశసూనో! నాయందు ప్రసన్నుడ వగుము

శ్లో॥ ఇమం సుస్తవం ప్రాతరుత్థాయ భక్త్యా
పఠేద్యస్తు మర్త్యో లభేత్ సర్వకామాన్।
గణేశప్రసాదేన సిద్ధ్యంతి వాచో
గణేశే విభౌ దుర్లభం కిం ప్రసన్నే॥

తా॥ ఈగణపతి స్తవమును ప్రాతఃకాలమున మేల్కాంచి,ఎవడు చదువునో వాని మనోరథము లన్నియు సఫలము లగును. గణాధిపతి యొక్క అనుగ్రహము వలన వానికి వాచోసంసిద్ధి కలుగును. సర్వలోకాధీశుడగు ఆ గణాధిపతి ప్రసన్నుడైన దుర్లభమైనది ఏమి యుండును ?

ఈ విధముగా గణేశ స్తవము చేసినపిమ్మట శంకరుడు మధురకు పయనమయ్యెను. అచట, మీనాక్షీపంచరత్నస్తోత్రమును కావించెను,

శ్లో॥ ఉద్యద్భానుసహస్రకోటిసదృశాం కేయూరహారోజ్జ్వలాం
బింబోష్ఠీం స్మితదంతపంక్తిరుచిరాం పీతాంబరాలంకృతామ్।
విష్ణుబ్రహ్మసురేంద్రసేవితపదాం తత్త్వస్వరూపాం శివాం
మీనాక్షీం ప్రణతోఽస్మి సంతత మహం కారుణ్యవారాంనిధిమ్॥

తా॥ సహస్రకోటిసంఖ్యాకములైన ఉదయించుచున్న సూర్యుల కాంతికి సమానమైనదియు, కేయూరాదిహారములతో ప్రకాశించునదియు, బింబోష్ఠియు, చిరునవ్వువంటి స్వచ్ఛమగు దంతపఙ్క్తితో సురుచిరమైనదియు, పీతాంబరాలంకృతయు, బ్రహ్మ, విష్ణు, మహేంద్రాది దేవతలచే సేవింపబడు పాదాంభోరుహయుగళముతో నొప్పారునదియు,

తత్త్వస్వరూపిణియు, మంగళస్వరూపిణియు, దయాంభోనిధియు నగు మీనాక్షీదేవికి నేను సతతము ప్రణతుల నర్పింతును.

శ్లో॥ ముక్తాహారలసత్కిరీటరుచిరాం పూర్ణేందువక్త్రప్రభాం
శింజన్నూపురకింకిణీమణిధరాం పద్మప్రభాభాసురామ్।
సర్వాభీష్టఫలప్రదాం గిరిసుతాం వాణీరమాసేవితాం
మీనాక్షీం ప్రణతోఽస్మి సంతత మహం కారుణ్యవారాంనిధిమ్॥

తా॥ ముక్తాహారములతో ప్రకాశించు కిరీటము వలన సుందరముగా భాసించునదియు, పూర్ణేందుప్రభాసదృశమైన కాంతితో ఒప్పారునట్టి ముఖము కలదియు, మణిమయములైన కింకణులతో కూడిన నూపురములు గలదియు, పద్మశోభాసదృశభాసురయు, సకలమనోరథముల నీడేర్చునదియు, పర్వతరాజపుత్రియు, లక్ష్మీసరస్వతీసంసేవితయు, దయాంభోనిధియునగు మీనాక్షీదేవికి నేను సతతము ప్రణతుల నర్పింతును.

శ్లో॥ శ్రీవిద్యాం శివవామభాగనిలయాం హ్రీంకారమంత్రోజ్జ్వలాం
శ్రీచక్రాంకితబిందుమధ్యవసతిం శ్రీమత్సభానాయకీమ్।
శ్రీమత్ షణ్ముఖవిఘ్నరాజజననీం శ్రీమజ్జగన్మోహినీం
మీనాక్షీం ప్రణతోఽస్మి సంతత మహం కారుణ్యవారాంనిధిమ్॥

తా॥ ఆ తల్లి శ్రీవిద్యారూపిణి; ఆమె, శివవామభాగనిలయ, హ్రీంకారప్రధానమైన మంత్రరాజమునందు వెలుగొందునది శ్రీచక్రాంకితబిందు మధ్యస్థ; శ్రీయుక్తములైన సభలయందు

ఆమె నాయిక; గణాధిప, షణ్ముఖుల కామె జనని; జగన్మో హిని అట్టిదయాంభోనిధి యగు మీనాక్షీదేవికి నేను సతతము ప్రణతుల నర్పింతును.

శ్లో॥ శ్రీమత్సుందరనాయకీం భయహరాం జ్ఞానప్రదాం నిర్మలాం
శ్యామాభాం కమలాసనార్చితపదాం నారాయణస్యానుజామ్।
వీణావేణుమృదంగవాద్యరసికాం నానావిధాడంబరాం
మీనాక్షీం ప్రణతోఽస్మి సంతత మహంకారుణ్యవారాంనిధిమ్॥

తా॥ ఆ తల్లి సుందరేశ్వరునియిల్లాలు; సర్వభయహారిణి; జ్ఞానప్రదాయిని; నిర్మలస్వరూపిణి; శ్యామలకాంతికలిత; ఆమె చరణసరోజయుగళము కమలాసనార్చితము; శ్రీమన్నారాయణ భగిని, వీణావేణుమృదంగాది వాద్యములందు రసికురాలు, నానావిధవైభవాడంబరవిలసిత; అట్టి దయాంభోనిధి యగు మీనాక్షీదేవికి నేను సతతము ప్రణతుల నర్పింతును.

శ్లో॥ నానాయోగిమునీంద్రహృన్నివసతిం నానార్థసిద్ధిప్రదాం
నానాపుణ్యవిరాజితాంఘ్రియుగళాం నారాయణేనార్చితామ్।
నాదబ్రహ్మమయీం పరాత్పరతరాం నానార్థతత్త్వాత్మికాం
మీనాక్షీం ప్రణతోఽస్మి సంతత మహం కారుణ్యవారాంనిధిమ్॥

తా॥ అనేకయోగివర్యుల హృదయములలో నివసించునదియు, నానావిధములయిన అర్థములను-తరణోపాయములను - సిద్ధింపచేయునదియు, నానావిధములగు పుణ్యవిశేషములచేవిరాజిల్లుచున్న పాదసరోజయుగళము గలదియు, శ్రీమన్నారాయణునిచే సేవలందుకొనునదియు, శబ్దబ్రహ్మస్వరూపిణియు, పర

మైన మహాతత్త్వముకంటె పరమైనదియు, నానార్థతత్త్వా త్మికయు, దయాపయోనిధియు నగు మీనాక్షీదేవికి ప్రణతు లర్పింతును.

ఈ విధముగ, మీనాక్షీపంచరత్నముచే పరాదేవిని స్తుతించి తనివి చెందక, శంకరుడు మరల 'మీనాక్షీస్తోత్ర' మను పేర ఆ దేవి యొక్క గుణగానము చేసెను.

శ్లో॥ శ్రీవిద్యే। శివవామభాగనిలయే। శ్రీరాజరాజార్చితే।
శ్రీనాథాదిగురుస్వరూపవిభవే। చింతామణీపీఠికే।
శ్రీవాణీగిరిజానుతాంఘ్రికమలే। శ్రీశాంభవి। శ్రీశివే।
మధ్యాహ్నే మలయధ్వజాధిపసుతే। మాం పాహి మీనాంబికే।

తా॥ మీనములవంటి కనులుగల ఓతల్లీ! నీవు శ్రీవిద్యారూపిణివి; శివుని వామార్ధభాగమున వెలయుదానవు; ధనాధిపతి యగు కుబేరునిచే అర్చించబడినదానవు; శ్రీనాథాది గురుత్రయము యొక్క స్వరూపమైన భవముతో నొప్పారుదానవు; చింతామణి పీఠస్థవు; లక్ష్మి, సరస్వతీ, పార్వతులచేత సేవింపబడు పాద యుగళము గలదానవు; నీవు శంభుని పత్నివి; శివస్వరూపిణివి; మధ్యాహ్నసమయమున, మలయధ్వజమహారాజునకు పుత్రి కవై జన్మించినదానవు; తల్లీ! నన్ను రక్షింపుము.

శ్లో॥ చక్రస్థేఽచపలే। చరాచరజగన్నాథే। జగత్పూజితే।
ఆర్తాళీవరదే। నతాఽభయకరే వక్షోజభారాన్వితే।
విద్యే। వేదకలాపమౌళివిదితే। విద్యుల్లతావిగ్రహే।
మాతః। పూర్ణసుధారసార్ద్రహృదయే మాం పాహి
మీనాంబికే।

తా॥ మీనములవంటి కనులు గల ఓ తల్లీ! నీవు శ్రీచక్రస్థవై వెలుగొందుదానవు; అవినాశివి; చరాచరజగత్తును శాసించుదానవు; నిఖిలలోకపూజితవు; ఆపన్నులకు వరముల నొసగుదానవు; వినీతులకభయప్రదాత్రివి; స్తనభారానతవు; విద్యాస్వరూపిణివి; ఉపనిషద్వేద్యవు; విద్యుల్లతవంటి శరీరము గలదానవు; పూర్ణామృతరసముచే ఆర్ద్రమైన హృదయము గల ఓ తల్లీ! నన్ను రక్షింపుము.

శ్లో॥ కోటీరాంగదరత్నకుండలధరే కోదండబాణాంచితే।
కోకాకారకుచద్వయోపరి లసత్ప్రాలంబహారాంచితే।
శింజన్నూపురపాదసారసమణిశ్రీపాదుకాలంకృతే।
మద్దారిద్ర్యభుజంగగారుడఖగే। మాం పాహి మీనాంబికే।

తా॥ మీనములవంటి కనులు గల ఓ తల్లీ! నీవు, కిరీటమును, కేయూరమును, మణికుండలములను ధరించి యుందువు; కోదండము, బాణములతో, విలసిల్లుచుందువు; చక్రవాకసదృశమైన కుచయుగళముపై వ్రేలాడుచున్న హారములతో ముగ్ధమోహనమూర్తివై వెలయుచుందువు; భవచరణాంభోజయుగళము, ధ్వనులు చేయు నూపురములతోను, మణిమయము లగు పాదుకలతోను అలంకృతమై ఒప్పుచున్న దానవు; ఓ తల్లీ! నీవు నా దారిద్ర్య మను భుజంగము పట్ల గరుడస్వరూపిణివై వెలయుదానవు; హే మాతః మాంపాహి.

శ్లో॥ బ్రహ్మేశాచ్యుతగీయమానచరితే ప్రేతాసనాంతస్థితే
పాశోదంకుశచాపబాణకలితే బాలేందుచూడాంచితే।

బాలే బాలకురంగనయనే బాలార్కకోట్యుజ్జ్వలే
మన్త్రారాధితదైవతే మునినుతే మాం పాహి మీనాంబికే॥

తా॥ మీనములవంటి కనులు గల ఓ దేవీ! బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులచే గానము చేయబడిన చరితము గలదానవు; బ్రహ్మ, విష్ణు, రుద్ర, ఈశ్వర, సదాశివు లనెడు ప్రేతాసనముల మధ్యన ఆసీనవై యున్నదానవు; పాశ, అంకుశ, చాప, బాణాది ఆయుధములచే నొప్పారుదానవు; బాలేందు మూర్తిని చూడామణిగా ధరించినదానవు; బాలాస్వరూపిణివి; మృగశాబకముల వలె చంచలము లగు చూపులు గలదానవు; ఆనందదాయకములగు వివిధముద్రలచే నారాధింపబడుదానవు; మునిస్తుతవు నీవు. నన్ను రక్షింపుము తల్లీ.

శ్లో॥ గంధర్వామర యక్షపన్నగనుతే! గంగాధరాలింగితే
గాయత్రీ గరుడాసనే కమలజే సుశ్యామలే సుస్థితే!
ఖాతీతే! ఖలదారుపావకశిఖే ఖద్యోతకోట్యుజ్జ్వలే!
మంత్రారాధితదైవతే మునినుతే మాంపాహి మీనాంబికే॥

తా॥ మీనములవంటి కనులు గల ఓ తల్లీ! గంధర్వ, అమర, యక్ష, పన్నగాదులచే స్తుతింపబడుదానవు; శివుని కౌగిలియందుండున్నదానవు, గాయత్రీస్వరూపిణివి; గరుడాసనవు; పద్మసంభవవు; శ్యామలకాంతికలితవు; యోగ్యమైన స్థానము గలదానవు; ఆకాశాతీతవు; దుర్మార్గు లనెడి దారుఖండముల పాలిటి జ్వాలాశిఖవు; కోటిసూర్యప్రభాకలితవు; మంత్రారాధిత దేవతవు; మునిగణస్తవనీయవు, ఓ తల్లీ నన్నురక్షింపుము.

శ్లో॥ నాదే నారదతుంబురాదివినుతే నాదాంతనాదాత్మికే
నిత్యే నీలలతాత్మికే నిరుపమే నీవారశూకోపమే।
కాంతే కామకళే కదంబనిలయే కామేశ్వరాంకస్థితే
మద్విద్యే మదభీష్టకల్పలతికే మాం పాహి మీనాంబికే॥

తా॥ మీనములవంటి కనులుగల ఓ తల్లీ! నీవు నాదస్వరూపిణివి; నారద తుంబురాది గాయకశిరోరత్నములచే నీవు స్తుతింపబడుదువు; నాద, అనునాద స్వరూపములతో విరాజిల్లుదానవు; శాశ్వతవు; నీలలతాత్మికవు; నిరుపమవు; నీవారశూకము (నివ్వెరధాన్యపుసన్నని నూగు)వలె సూక్ష్మమైన దానవు; మనోహరమైనదానవు; కామకళారూపిణివి; కామేశ్వరాంకపీఠిపై విరాజితవు; నా విద్య నీకంటె (అనన్యమైనది;) నా మనోరథముల నీడేర్చు కల్పలతికవు; ఓ తల్లీ నన్ను రక్షింపుము.

శ్లో॥ వీణానాదనిమీలితార్ధనయనే విస్రస్తచూళీధరే
తాంబూలారుణపల్లవాధరయుతే తాటంకహారాన్వితే।
శ్యామే చంద్రకళావతంసకలితే కస్తూరికాఫాలికే
పూర్ణే! పూర్ణకళాభిరామవదనే! మాం పాహి మీనాంబికే ।

తా॥ మీనములవంటి కనులు గల ఓ తల్లీ! మధురవీణానాదశ్రవణముచే అర్ధనిమీలితములయిన కనులతో నొప్పారుదువు, కొంచెము జారిన కేశచూడముతో విలసిల్లుదువు; తాంబూలచర్వణముచే ఎఱ్ఱవారిన చిగురుటాకులవంటి పెదవులతో వెలయుదానవు; చెవులకమ్మలతోను, హారములతోను, విరాజిలుదానవు; శ్యామలకాంతికలితవు, శిరమున

చంద్రకళతో శోభిల్లుదానవు; నీ ఫాలభాగమున కస్తూరి తిలకము సౌందర్యదాయకమై మనోహరముగా నుండును; పూర్ణమైన స్వరూపముతో విలసిల్లుచుందువు. షోడశకళలచే నభిరామమైన చంద్రునివంటి వదనముతో నొప్పారుచుందువు. ఓ తల్లీ! నన్ను రక్షింపుము.

శ్లో॥ శబ్దబ్రహ్మమయీ చరాచరమయీ జ్యోతిర్మయీ వాఙ్మయీ
నిత్యానందమయీ నిరంజనమయీ తత్త్వన్మయీ చిన్మయీ।
తత్త్వాతీతమయీ పరాత్పరమయీ మాయామయీ శ్రీమయీ
సర్వైశ్వర్యమయీ సదాశివమయీ మాం పాహి మీనాంబికే॥

తా॥ మీనములవంటి కనుల గల ఓ తల్లీ! నీవు శబ్దబ్రహ్మ స్వరూపిణివి; చర-అచర-జగద్రూపిణివి; జ్యోతిర్మయివి; వాగ్రూపిణివి; నిత్యానంద, నిరంజనమయివి; 'తత్, త్వం' పదములకు లక్ష్యార్థమైనదానవు. జ్ఞానరూపిణివి, చతుర్వింశతి తత్త్వముల కతీతవు; పరమైన అవ్యక్తము కంటె పరమైన బ్రహ్మరూపిణివి; అవ్యక్తమాయారూపిణివి; శ్రీబీజమైన దానవు; సర్వైశ్వర్యవిలసితవు; సదాశివమయివి; ఏతద్గుణ సంపన్నవగు ఓ తల్లీ! మాం పాహి.

ఈ రీతిగ భక్తినిర్భరహృదయముతో మీనాక్షీదేవిని స్తుతించి, తర్వాత అనంతశయనమును దర్శించి, క్రమముగా నాసిక చేరెను. ఇచ్చట త్ర్యంబకేశ్వరుని పూజించెను. ద్వాదశలింగస్తోత్రములో త్ర్యంబకేశ్వర, సోమనాథుల స్తవమున్నది. పూనా దగ్గర గల భీమశంకరలింగము, ఎల్లోరా

శ్లో॥ నాదే నారదతుంబురాదివినుతే నాదాంతనాదాత్మికే
నిత్యే నీలలతాత్మికే నిరుపమే నీవారశూకోపమే।
కాంతే కామకళే కదంబనిలయే కామేశ్వరాంకస్థితే
మద్విద్యే మదభీష్టకల్పలతికే మాం పాహి మీనాంబికే॥

తా॥ మీనములవంటి కనులుగల ఓ తల్లీ! నీవు నాదస్వరూపిణివి; నారద తుంబురాది గాయకశిరోరత్నములచే నీవు స్తుతింపబడుదువు; నాద, అనునాద స్వరూపములతో విరాజిల్లుదానవు; శాశ్వతవు; నీలలతాత్మికవు; నిరుపమవు; నీవారశూకము (నివ్వెరధాన్యపుసన్నని నూగు) వలె సూక్ష్మమైనదానవు; మనోహరమైనదానవు; కామకళారూపిణివి; కామేశ్వరాంకపీఠిపై విరాజితవు; నా విద్య నీకంటె (అనన్యమైనది;) నా మనోరథముల నీడేర్చు కల్పలతికవు; ఓ తల్లీ నన్ను రక్షింపుము.

శ్లో॥ వీణానాదనిమీలితార్ధనయనే విస్రస్తచూళీధరే
తాంబూలారుణపల్లవాధరయుతే తాటంకహారాన్వితే।
శ్యామే చంద్రకళావతంసకలితే కస్తూరికాఫాలికే
పూర్ణే! పూర్ణకళాభిరామవదనే! మాం పాహి మీనాంబికే ।

తా॥ మీనములవంటి కనులు గల ఓ తల్లీ! మధురవీణానాదశ్రవణముచే అర్ధనిమీలితములయిన కనులతో నొప్పారుదువు, కొంచెము జారిన కేశచూడముతో విలసిల్లుదువు; తాంబూలచర్వణముచే ఎర్రవారిన చిగురుటాకులవంటి పెదవులతో వెలయుదానవు; చెవులకమ్మలతోను, హారములతోను, విరాజిలుదానవు; శ్యామలకాంతికలితవు, శిరమున

చంద్రకళతో శోభిల్లుదానవు; నీ ఫాలభాగమున కస్తూరీ తిలకము సౌందర్యదాయకమై మనోహరముగా నుండును; పూర్ణమైన స్వరూపముతో విలసిల్లుచుందువు. షోడశకళలచే నభిరామమైన చంద్రునివంటి వదనముతో నొప్పారుచుందువు. ఓ తల్లీ ! నన్ను రక్షింపుము.

శ్లో॥ శబ్దబ్రహ్మమయీ చరాచరమయీ జ్యోతిర్మయీ వాఙ్మయీ
నిత్యానందమయీ నిరంజనమయీ తత్త్వన్మయీ చిన్మయీ।
తత్త్వాతీతమయీ పరాత్పరమయీ మాయామయీ శ్రీమయీ
సర్వైశ్వర్యమయీ సదాశివమయీ మాం పాహి మీనాంబికే॥

తా॥ మీనములవంటి కనుల గల ఓ తల్లీ ! నీవు శబ్దబ్రహ్మ స్వరూపిణివి; చర-అచర-జగద్రూపిణివి; జ్యోతిర్మయివి; వాగ్రూపిణివి; నిత్యానంద, నిరంజనమయివి; 'తత్, త్వం' పదములకు లక్ష్యార్థమైనదానవు. జ్ఞానరూపిణివి, చతుర్వింశతి తత్త్వముల కతీతవు; పరమైన అవ్యక్తము కంటె పరమైన బ్రహ్మరూపిణివి; అవ్యక్తమాయారూపిణివి; శ్రీబీజమైన దానవు; సర్వైశ్వర్యవిలసితవు; సదాశివమయివి; ఏతద్గుణ సంపన్నవగు ఓ తల్లీ ! మాం పాహి.

ఈ రీతిగ భక్తినిర్భరహృదయముతో మీనాక్షీదేవిని స్తుతించి, తర్వాత అనంతశయనమును దర్శించి, క్రమముగా నాసిక చేరెను. ఇచ్చట త్ర్యంబకేశ్వరుని పూజించెను. ద్వాదశలింగస్తోత్రములో త్ర్యంబకేశ్వర, సోమనాథుల స్తవమున్నది. పూనా దగ్గర గల భీమశంకరలింగము, ఎల్లోరా

గుహాల దగ్గరున్న ధిషణేశ్వరలింగము, వైద్యనాథలింగము శంకరునిచే పూజింపబడి స్తుతింపబడినవి.

శ్లో॥ "పూర్వోత్తరే పారలికాభిధానే
సదాశివం తం గిరిజాసమేతమ్।
సురాసురారాధిత పాదపద్మం
శ్రీవైద్యనాథం సతతం నమామి॥"

అనివైద్యనాథ లింగమును,

శ్లో॥ " యోఢాకినీ శాకిని కాసమాజే
నిషేవ్యమాణః పిశితాశనైశ్చ।
సదైవ భీమాది పద ప్రసిద్ధం
తం శంకరం భక్తహితం నమామి॥"

అనిభీమశంకర లింగమును,

శ్లో॥ "సింహాద్రిపార్శ్వేఽపి తటే రమంతం
గోదావరీతీరపవిత్రదేశే।
యద్దర్శనాత్పాతకజాతనాశః
ప్రజాయతే త్ర్యంబక మీశమీడే॥"

అని త్ర్యంబకేశ్వరుని,

శ్లో॥ "ఏలాపురీ రమ్యశివాలయేఽస్మిన్
సముల్లసంతం త్రినగద్వరేణ్యమ్।
వందే మహోదారతరస్వభావం
సదాశివం తం ధిషణేశ్వరాఖ్యమ్"॥

అని ధిషణేశ్వరుని స్తుతించెను.

వరుసగా, ఈ పవిత్రశివాలయములను దర్శించుచు, దారిలో ఇతర దార్శనికుల నోడించుచు శంకరుడు సౌరాష్ట్ర దేశమును ప్రవేశించెను. ఇచట సోమనాథాలయము పేరెన్నిక గన్నది. ఆదేవాలయమును దర్శించి,

శ్లో॥ సౌరాష్ట్రదేశే వసుధాఽవకాశే
జ్యోతిర్మయం చంద్రకలాఽవతంసమ్।
భక్తిప్రదానాయ కృతావతారం
తం సోమనాథం శరణంప్రపద్యే"॥

అని సోమనాథుని స్తుతించి, ద్వారకనుచేరెను.

మోక్షక్షేత్రములలో ద్వారక ఒకటి. గోమతీద్వారక శ్రీకృష్ణుని ముఖ్యపట్టణము. గోమతీ తీరమున శ్రీశంకరుని జ్ఞానమందిర మున్నది. ఇచట 2333 శివలింగములు, 2200 సాల గ్రామములు, 76 జగద్గురువుల మూర్తులు ప్రతిష్ఠింపబడినవి. శంకరుడు జీర్ణమైన కృష్ణమందిరమును ఉద్ధరించి, ఆమందిర ప్రాంగణమున పశ్చిమామ్నాయమగుకాళికాపీఠమును ప్రతిష్ఠించి, ద్వారకా శారదాపీఠమును కూడ నెలకొల్పెను. ద్వారకకే అతి ప్రాచీననామము కుశస్థలి అని కలదు. ద్వారకలో మొట్ట మొదటి మఠమును శంకరుడు నిర్మించి పీఠదేవతలను ప్రతిష్ఠించెను.

శ్లో॥ ప్రథమః పశ్చిమామ్నాయః శారదామఠ ఉచ్యతే।
కీటవారః సంప్రదాయ స్తస్య తీర్థాశ్రమౌ శుభౌ॥

శ్లో॥ ద్వారకాఖ్యం హి క్షేత్రం స్యా ద్దేవః సిద్ధేశ్వరః స్మృతః।
భద్రకాళీ తు దేవీ స్యాత్ హస్తామలక దేశికః॥

శ్లో॥ గోమతీతీర్థ మమలం బ్రహ్మచారీ స్వరూపకః।
సామవేదస్య వక్తా చ తత్ర ధర్మం సమాచరేత్॥

అని మఠామ్నాయసేతువున గలదు. భారతదేశమునకు పశ్చిమభాగమున శారదామఠము నెలకొల్పబడినది. ఇచట కీటవార మను సంప్రదాయము ప్రవర్తితమైనది. ఈ పీఠ సన్యాసులను 'తీర్థ'శబ్దముతోను, 'ఆశ్రమ'శబ్దముతోను వ్యవహరింతురు. ఇవి వారి అంకితనామములు. ఈ మఠమునకు క్షేత్రము ద్వారక. పీఠదేవత సిద్ధేశ్వరుడు, పీఠశక్తి భద్రకాళి. ఇచట గల మొట్టమొదటి ఆచార్యుడు హస్తామలకుడు. కాని విశ్వరూపు డని కొందరు, పద్మపాదు డని ఇతరులు అనిరి.

"హస్తామలకనామానం తదధ్యక్షం తతాన సః"

అని చిద్విలాసీయ శంకరవిజయము. ద్వారకా మఠమున హస్తామలకుని అధిపతిగా నియమించె నని గురువంశకావ్యము (3.61). శంకరుని పదునెనిమిదవ యేట మాఘ శుద్ధ సప్తమినా డీపీఠము ప్రతిష్ఠింపబడెను.

శంకరుడు పదునారవ యేట భాష్యాదులను పూర్తి గావించి, తల్లివద్దకు పోయి, పదునెనిమిదవ యేట ద్వారకకు వచ్చినచో, శృంగేరిలో ఎక్కువ కాలము నిలువలేదని

కాంచీనగరమున కూడ ఎక్కువ కాల ముండలేదని స్పష్టము. తర్వాత శృంగేరికి వచ్చియుండవచ్చును.

ద్వారకామఠమునకు తీర్థము గోమతి. ఇచటి బ్రహ్మచారిని స్వరూపు డందురు. ఈ మఠము సామవేదమునకు చెందినది. పద్మపాదుడు సామవేది యని ప్రాయోవాదము.

ద్వారక నుంచి ఉజ్జయినీ నగరమును శంకరుడు ప్రవేశించెను.

శ్లో॥ "మహాకాళేశ మాసాద్య సంపూజ్యాథ షడాననమ్।
మహాచండీం భగవతీం పరిపూజ్యాతిభక్తితః॥"

అని చిద్విలాసీయమున గలదు. ఉజ్జయినిలో మహాకాళ నాథుని, మహాచండిని పూజించి:

శ్లో॥ "అవంతికాయాం విహితావతారం
ముక్తిప్రదానాయ చ సజ్జనానామ్।
అకాలమృత్యోః పరిరక్షణార్థం
వందే మహాకాళ మహం సురేశమ్"॥

అని మహాకాళనాథుని స్తుతించెను. ఇచట గల మంగళ నాథుడు షడాననుడు మాత్రము కాదు. ఉజ్జయినీ నగరమున శాక్తులను వైదికమార్గమునకు మరల్చెను.

నర్మదాతీరమున ఓంకారనాథుడు అమరేశ్వరలింగ రూపమున గలడు. శంకరుడు ప్రముఖ శివలింగములున్న పవిత్రస్థలముల నన్నిటిని దర్శించెను. ఈ శివాలయముల

కనుబంధములుగా విద్వత్సభ లుండెడివి. పాఠప్రవచనములలో నిట్టి స్థలముల యందు గల పండితులను శంకరుడు కలసికొని వారితో వాదములను జరిపి అద్వైతమును ప్రచారము చేయ సాగెను. దీనితోబాటు ఆ యా ప్రదేశములలో గల జైన, బౌద్ధ పండితప్రకాండులను గూడ వాదములలో నోడించి, వైదికమత స్థాపనకు తీవ్రమైన కృషిని చేసి కృతార్థు డాయెను. నైమిష, పాంచాలదేశములను చూచుకొనుచు, అయోధ్యప్రాంతమున గల దారుకావన మందలి నాగేశ లింగమును దర్శించి,

శ్లో॥ "ఆమర్దసంజ్ఞే నగరే చ రమ్యే
విభూషితాంగం వివిధైశ్చ భోగైః।
సద్భక్తిముక్తిప్రద మీశ మేకం
శ్రీనాగనాథం శరణం ప్రపద్యే॥"

అని స్తుతించెను. తర్వాత శంకరుడు కామరూపమును చేరెను. మూడు ప్రధానశక్తిక్షేత్రములలో నొకటి కామరూపమున గలదు.

శ్లో॥ "కామేశ్వరీం చ కామాఖ్యాం కామరూప నివాసినీమ్।
తప్తకాంచనసంకాశాం తాం నమామి సురేశ్వరీమ్"॥

అని స్తుతించెను.

సురేశ్వరియగు కామేశ్వరిని ఇచట 'కామాఖ్య' అని వ్యవహరింతురు. ఈ శక్తిస్వరూపిణిని గూర్చి పలుకు సంద ర్భమున

"యత్రసాక్షా ద్భగవతీ స్వయమేవ వ్యవస్థితా"

అని పల్కిరి. పరాశక్తియే స్వయముగా కామాఖ్యరూపమున నిచట గలదట.

"తేషు శ్రేష్ఠతమః పీఠః కామరూపో మహామతే"

అని దేవీ పురాణమున కామరూపమున గల దేవీపీఠము శ్రేష్ఠతమ మైనదని చెప్పబడినది. దేవీభాగవతమున సప్తమ స్కంథములో 38వ అధ్యాయమున కామరూపక్షేత్రము మహాక్షేత్రమని చెప్పబడినది. కామాఖ్యయే కామాక్షి. ఈ కామాఖ్యను పూజించి, అచటి పూజావిధానమును శంకరుడు సంస్కరించెను.

వృషదేవ వర్మ నేపాలరాజ్యమును పాలించుచున్నప్పుడు శంకరుడు నేపాలమును ప్రవేశించెను. అచటబౌద్ధుల నోడించి, వైదికాచార సంమతమగు పూజాకల్పమును పశుపతి నాథాలయమున నెలకొల్పెను. ఈ ఆలయమున కనతి దూరమున శంకరుని మూర్తి, దత్తాత్రేయవిగ్రహము ఉన్నవి. వీటికి నిత్యపూజ కలదు. నేపాలవంశావళి ప్రకారము శంకరుని అనుగ్రహవశమున వృషదేవునకు పుత్రుడు కల్గెనని, అతనిపేరు శంకరదేవవర్మ అని పెట్టబడెనని తెలియుచున్నది.

'ప్రపంచసార' మను తంత్రగ్రంథమును శారదాస్తుతితో శంకరు డారంభించెను. ఈ గ్రంథమును శంకరుడు కాశ్మీరమున రచించెనని, కాశ్మీరమున కధిష్ఠానదేవత శారద యగుటచే శారదాస్తుతి మొదట గలదని ప్రపంచసారవివరణ వ్యాఖ్య యగు 'ప్రయోగక్రమదీపిక'లో చెప్పబడినది.

ప్రాచీనకాలమున కాశ్మీరము విద్యాసంపన్న మగుటచే "కాశ్మీరే సరస్వతీ కీర్త్యతే, బదరికాశ్రమే వేదఘోషః శ్రూయతే"అనినారు, కాశ్మీరదేశమును శారదామండల మని శారదాపీఠమని పిలచినారు. కాశ్మీరులలిపి శారదాలిపి, కాశ్మీరమునకు ఉత్తరభాగమున 'శారదీ' అనునగర మొకటి ఉండెడిది. దీనిసమీపముననే గంగా, మధుమతీ, సరస్వతీ మొదలగు నదులసంగమస్థల మున్నది. ఈ స్థలమున శారదా మందిరము కలదని రాజతరంగిణి వలన తెలియవచ్చుచున్నది. శారదాదేవి వస్తుతః, కాశ్మీరమున ప్రతిష్ఠింపబడినది. ఇట్టి శారదా ప్రతిష్ఠలు కనీసము రెండైనను అచట ఉండెడివని చెప్పవీలున్నది.

శ్రీ సరస్వతీరహస్యోపనిషత్ లో "నమస్తే శారదా దేవి కాశ్మీరపురవాసిని, త్వా మహం ప్రార్థయే నిత్యం విద్యాదానం చ దేహి మే" అని కలదు. కాశ్మీరమున నివసించు శారదాదేవిని విద్యాదానము చేయు మని ప్రార్థించుట సమంజసమే.

కాశ్మీరమున శ్రీనగరములో శంకరాచార్య పర్వత మొకటి ఉన్నది. దీనిని గోపాద్రి అనికూడ అందురు. దీనిపై ఈశ్వరాలయ మున్నది. ఇతనిని జ్యేష్ఠేశ్వరు డని, జ్యేష్ఠరుద్రు డని పిలచెడివారు. ఈ మందిరము గోపాదిత్యు డను రాజు నిర్మించె నని కల్హణుడు. ఈ రాజు నేడు 'గుప్కార్'అని పిలువబడు అగ్రహారమును పండితప్రకాండుల కిచ్చినాడు. ఈ విద్వాంసులతో శాస్త్రార్థముచేసి గెలుపొందినవాడే

సర్వజ్ఞుడు కాగలడని యెంచెడివారు. సర్వజ్ఞపీఠ మీపర్వత ముపై గలదు. దానిని నేడు 'తఖ్త్-ఇ-సులైమాన్' అని పిలతురు. 'తఖ్త్' అనగా, పీఠము. 'సులైమాన్' అనగా సర్వజ్ఞు డనబడిన సాలమన్. శంకరాచార్యపర్వతముపై గల ఈ మందిరమును అశోకుని పుత్రుడగు జలౌకుడు (క్రీ. పూ. 220) నిర్మించె నని గాథ. ఈ పర్వతము దిగువన శంకర మఠ మున్నది. ఈ స్థానమును దుర్గానాగమందిర మని కూడ పిలతురు.

కాశ్మీరమున సర్వజ్ఞపీఠము గలదని అనేక శంకర విజయములు చెప్పుచున్నవి. కల్హణుడు సర్వజ్ఞపీఠమును స్మరింపలేదు. రాజతరంగిణిని క్రీ. శ. 1150 ప్రాంతమున రచించిన కల్హణుడు సర్వజ్ఞపీఠమును గూర్చి చెప్పకపోవుటచే కాశ్మీరముతో ఈ పీఠమునకు ఎట్టి సంబంధము లేదందురు. ఐతే కల్హణుడు శంకరాచార్యునిగూర్చి ప్రస్తావించలేదు గదా! అని అనవచ్చును. శంకరుడు కాశ్మీర దేశస్థుడు కాడని, సర్వజ్ఞపీఠము అనాదికాలమునుంచి కాశ్మీరమున గలదని, ఈ విమర్శకులే చెప్పుచున్నా రని మనము విస్మరింపరాదు. పైగా, కల్హణుని కాలమునకు సర్వజ్ఞపీఠము సంగతి విస్మృతమై యుండవచ్చును. పాండిత్యమునకు ముఖ్యకేంద్ర మానాటికి కాశ్మీరమునుంచి కాశీనగరమునకు తరలినది.

శంకరాచార్య పర్వతముపై గల వేదిక చతురస్రముగా నుండును. దీనిమధ్య శ్రీచక్రము ఉండెడిది. ఈ వేదికను అధి

రోహించి శ్రీచక్రపూజను గావించిన పండితుడు సర్వజ్ఞుడని భావింపబడెడివాడు. ఆనాడు శ్రీచక్ర మున్నస్థానమున అదే చోట నేడు దాదాపు ఐదు అడుగుల ఎత్తు గల బ్రహ్మాండమైన శివలింగము ప్రతిష్ఠింపబడి యున్నది. కల్హణుని కాలమునకు ఆశ్రీచక్రవిషయము విస్మృత మగుటచే అతడు సర్వజ్ఞపీఠమునుగూర్చి ప్రస్తావించలేదు.

రాజతరంగిణిప్రకారము క్రీ.త. 222లో రాజ్యమునకు వచ్చిన రణాదిత్యుడు మూడువదంల యేండ్లు పాలించెను. ఈ మూడువందల యేండ్లలో జరిగిన సన్నివేశములు కల్హణునకు సరిగా లభించలేదని భావము. ఈ కాలమున కాశ్మీరమునకు మహాసిద్ధుడు వచ్చెనట. అతనిపేరు బ్రహ్మ.

శ్లో॥ "సా బ్రహ్మప్రతిమం సిద్ధం దేవీ బ్రహ్మ విదాంవరమ్।
అకారయ త్తముద్దిశ్య పరార్ధ్యం బ్రహ్మ మండపమ్"॥

అని కల్హణుడు (3.459). బ్రహ్మవేత్తలలో శ్రేష్ఠుడు, బ్రహ్మసదృశుడు నగు ఈ సిద్ధపురుషునికై రణాదిత్యునిరాణి బ్రహ్మమండపమును నిర్మించెనట! పాశుపతులకు ఒక మఠమును (3.460) ఈ రాజదంపతులు నిర్మించిరి. క్రీ.త. 522 లో రాజ్యమునకువచ్చిన విక్రమాదిత్యునివద్ద బ్రహ్మ, గులూనులను మంత్రులు గలరని, వీరు వరుసగా బ్రహ్మమఠమును, ఒక విహారమును నిర్మించిరని తెలియుచున్నది. (3.475-6). "బ్రహ్మవిదాంవరమ్" అను ప్రయోగము శంకరునకేచెల్ల గలదు. క్రీ.త. 522కు పూర్వమే ఆ బ్రహ్మవేత్త కాశ్మీరమునకు

వచ్చుట అతని కొరకు బ్రహ్మమండపమును నిర్మించుట జరిగినవి. కల్హణుని కాలమునకు ఈ విషయములను ప్రజలు మరచి పోయి యుందురు.

శంకరుడు సర్వజ్ఞపీఠమును సమీపించెను. అప్పటికి దక్షిణ దేశమునుంచి విద్వాంసులెవరును రాకపోవుటచే దక్షిణ ద్వారము మూతబడియుండె నని, శంకరుడు దక్షిణద్వారమును తెరిపించి విద్వాంసులతో శాస్త్రార్థము గావించి గెలుపొందె నని, అప్పుడాయన సర్వజ్ఞపీఠము నధిరోహించెనని సదానందవ్యాసాచల, మాధవులు వ్రాసిన శంకరవిజయముల లోను, శివరహస్యమున గలదు. నేడు ఈ పర్వతమును అధిరోహించువారు దక్షిణమునుండియే నడక ప్రారంభింతురు.

కల్హణునకు తెలియకుండగనే సర్వజ్ఞపీఠప్రశంస కొంత రాజతరంగిణిలోనికి వచ్చినది.

శ్లో॥ "విజయేశ్వర నందీశక్షేత్ర జ్యేష్ఠేశపూజనే।
తస్య సత్యగిరో రాజ్ఞః ప్రతిజ్ఞా సర్వదాఽభవత॥"

అని రాజతరంగిణి (1.113) అశోకుని కుమారుడగు జలౌకుడు సత్యసంధుడు. నందీశక్షేత్రమున గల విజయేశ్వర జ్యేష్ఠేశుని పూజ చేతునని జలౌకుడు ప్రతిజ్ఞ బూనెను. శివజ్యేష్ఠేశుడని, జ్యేష్ఠేశ్వరుడని, జ్యేష్ఠరుద్రుడని శివుడు కాశ్మీరమున పూజింపబడెడివాడు. హరిముకుటమువద్ద గల నందీశక్షేత్రమున త్రిపురేశ్వరమున, శ్రీనగరసమీపమున, జ్యేష్ఠరుద్రుని ఆలయములు ఉండెడివి. త్రిపురేశాద్రినిష్ఠ

జ్యేష్ఠేశ్వరుడు 5.123 లో ప్రస్తుతింపబడెను. భూతేశ్వరము వద్ద ఒక జ్యేష్ఠరుద్రుడు గలడని 4.190 లో పలికెను.

శ్లో॥ "స్వయంభూః ప్రకటీభూయ పూజాం స్వీకురుతే స్వయమ్।
జ్యేష్ఠరుద్రో వసిష్ఠస్య యస్య వా బాలకేశ్వరః"॥

అని 8.2430 లో గలదు. బాలకేశ్వరలింగము స్వయంభూలింగము. ఇది జ్యేష్ఠరుద్రరూపమున వసిష్ఠునినుంచి పూజ నందుకొనును. స్వయంభూలింగ మనగా స్వతఃసిద్ధముగా వచ్చినదేగాని, శిల్పులు మలచినది గాదు.

శ్లో॥ "ప్రతిష్ఠాం జ్యేష్ఠరుద్రస్య శ్రీనగర్యాం వితన్వతా।
తేన నందీశసంస్పర్ధానం మేనే సోదరం వినా"॥

అని కల్హణుడు (1.124). శ్రీనగరి వద్ద జ్యేష్ఠరుద్రాలయమును నిర్మించుచు, ఇచట సరస్సులేనిదే ఇది నందీశక్షేత్రమునకు సరిపోదని జలౌకుడు గుర్తించెను.

శ్లో॥ "జ్యేష్ఠేశ్వరం ప్రతిష్ఠాప్య గోపాద్రా వార్యదేశజాః।
గోపాగ్రహారాన్ కృతినా యేన స్వీకారితా ద్విజాః॥"

అని కల్హణుడు (1.341) గోపాద్రిపై జ్యేష్ఠేశ్వరుని ప్రతిష్ఠించి, ఆర్యదేశజులగు బ్రాహ్మణులకు గోపాగ్రహారములను గోపాదిత్యు డొసగెను.

ఈ గోపాద్రినే శంకరాచార్యపర్వత మని నేడు వ్యవహరింతురు. దీనినే 'తఖ్త్-ఇ-సులైమాన్' అని అందురు. ఇది శ్రీనగరమున తూర్పుభాగమునకలదు. వేరొక గోపాద్రి

నేడు 'గుప్కార్' అను పేరుతో ఈ కొండదగ్గరే ఉన్నది. జ్యేష్ఠా అనగా పార్వతి అని, ఆమెను దైత్యుల బారినుండి కాపాడి, పెండ్లి చేసికొని జ్యేష్ఠేశు డాయెనని జ్యేష్ఠామాహాత్మ్యమున గలదు. వైశాఖ బహుళ పంచమి శ్రీపంచమి. ఈ దినమున జ్యేష్ఠరుద్రాఖ్య పర్వతమునకు యాత్రికులు పోవుదురు. జ్యేష్ఠరుద్రునకు దగ్గర గల పర్వతమే జ్యేష్ఠేశ పర్వత మని, జ్యేష్ఠేశుడే శంకరు డగుటచే శంకరగిరి అని పిలువబడినది. దీనినే తఖ్త్-ఇ-సులైమాన్ అని తర్వాత పిలచిరి. ఇదే గోపాద్రి. ఈ కొండకు తూర్పుగా ఒక మైలు దూరమున గల జ్యేఠేర్ లో జ్యేష్ఠేశలింగమునకు పూజలు నేటిదాకా కూడా జరుగుచున్నవి.

జ్యేష్ఠేశ్వరలింగము గల పర్వతముననే సర్వజ్ఞపీఠము గలదు. దీనిప్రక్కన గల గ్రామములో ఆర్యదేశమున జన్మించిన బ్రాహ్మణులను గోపాదిత్యుడు నివసింపజేసె నని కల్హణుడు. ఈ బ్రాహ్మణులు గొప్ప విద్వాంసులు. వీరిని గెలచినవాడు సర్వజ్ఞపీఠ మగు గోపాద్రి నధిరోహించి జ్యేష్ఠేశ్వరునకు అభిషేకము చేయగల సమర్థుడు. శంకరుడు వీరిని గెలచిన మహాసిద్ధుడు.

సర్వజ్ఞపీఠము వంటిది కాంచీనగరమున ఉండియుండ వచ్చును, బౌద్ధాదులు స్వాధీనము చేసికొనిన శాక్తపీఠమును శంకరుడు స్వాధీనపరచుకొని, శక్తికి పునఃప్రతిష్ఠ చేసెను. 'సర్వజ్ఞ' శబ్దమునకు కామశాస్త్రాదులతో కూడిన సకల విద్యలను అభ్యసించినవాడని అర్థము చెప్పుట ప్రామాదికము.

సర్వజ్ఞుఁ డనగా బ్రహ్మైవగతి గల బ్రహ్మజ్ఞాని అను అర్థము చెప్పుట ఉపనిషత్తులకు సమ్మతమైన అర్థము. సర్వజ్ఞపీఠము నధిరోహించ గల వ్యక్తి బ్రహ్మజ్ఞుడు కావలెను. అంతకు ముందున్న వృత్తికారుడు, బ్రహ్మదండి, భర్తృప్రపంచ, ద్రమిడాచార్యాదులు శంకరునకు కాంచీనగరమున తటస్థపడి రని, వారి నందరను శంకరుడోడించి, వారిచే తన భాష్యములను ప్రామాణికగ్రంథములుగా అంగీరింపజేసెనని,అందుచే పండితలోకము శంకరుని సర్వజ్ఞుడని కొనియాడె నని చెప్పుట సమంజసము.

కాశ్మీరపండితుల నుద్దేశించి, ఆచార్యుడు 'అనాత్మశ్రీవిగర్హణప్రకరణము'ను చెప్పెను.

శ్లో॥ లబ్ధా విద్యా రాజమాన్యా తతః కిం
ప్రాప్తా సంపత్ ప్రాభవాఢ్యా తతః కిమ్।
భుక్తా నారీ సుందరాంగీ తతః కిం
యేన స్వాత్మా నైవ సాక్షాత్కృతోఽభూత్॥

శ్లో॥ కేయూరాద్యైర్భూషితో వా తతః కిం
కౌశేయాద్యైరావృతో వా తతః కిమ్।
తృప్తోమిష్టాన్నాదినా వా తతః కిం
యేన స్వాత్మా నైవ సాక్షాత్కృతోఽభూత్॥

శ్లో॥ దృష్టా నానాచారుదేశా స్తతః కిం
పుష్టాశ్చేష్టా బంధువర్గా స్తతః కిమ్।

నష్టం దారిద్ర్యాదిదుఃఖం తతః కిం
యేన స్వాత్మా నైవ సాక్షాత్కృతోఽభూత్॥

తా॥ రాజగౌరవమును సంపాదింపగల విద్య లభించినను, ప్రాభవోపేతమైన సంపద కలిగినను, సౌందర్యవతియగు కాంతతోడి భోగము అనుభూతమైనను, ఫలమేమి? ఆత్మసాక్షాత్కారము కలుగనివానికి ఇవన్నియు నిష్ఫలములే.

కేయూరాది భూషణములతో నొప్పారు చున్నను, పీతాంబరధారియైనను, మృష్టాన్నాదులతో తృప్తినొందినను, ఆత్మసాక్షాత్కారము కలుగనివానికి ఇవన్నియు నిష్ఫలములే.

సుందరములగు దేశములను చూచినను, ఇష్టబంధు వర్గమును పోషించినను, దారిద్ర్యాదిదుఃఖములు లేక సుఖముగా నున్నను, ఆత్మసాక్షాత్కారము కలుగనివానికి ఇవన్నియు నిష్ఫలములే.

శ్లో॥ స్నాతం తీర్థే జహ్నుజాదౌ తతః కిం
దానం దత్తం ద్వ్యష్టసంఖ్యం తతః కిమ్।
జప్తా మంత్రాః కోటిశో వా తతః కిం
యేన స్వాత్మా నైవ సాక్షాత్కృతోఽభూత్ ॥

శ్లో॥ గోత్రం సమ్యగ్భూషితం వా తతః కిం
గాత్రం భస్మాచ్ఛాదితం వా తతః కిమ్।
రుద్రాక్షాదిః సుధృతో వా తతః కిం
యేన స్వాత్మా నైవ సాక్షాత్కృతోఽభూత్॥

శ్లో॥ అన్నై ర్విప్రా స్తర్పితా వా తతః కిం
యజ్ఞైర్దేవా స్తోషితా వా తతః కిమ్।
కీర్త్యా వ్యాప్తాః సర్వలోకా స్తతః కిం
యేన స్వాత్మా నైవ సాక్షాత్కృతోఽభూత్ ॥

తా॥ గంగాయమునాది తీర్థముల స్నాతుడైనను, షోడశమహా దానములొనర్చినను, కోటిసంఖ్యాకముగా జపాదుల నొనర్చినను, ఆత్మసాక్షాత్కారము కలుగనివానికి ఇవన్నియు నిష్ఫలములే.

వంశమున కలంకారభూతుడయినను, భస్మాచ్ఛాదిత శరీరుడయ్యును, రుద్రాక్షాదిధారణ మొనర్చినను, ఆత్మసాక్షాత్కారము కలుగనివానికి ఇవన్నియు నిష్ఫలములే.

భోజనాదులచే విప్రులను సంతుష్టపరచినను, యజ్ఞయాగాదులు చేసి దేవతలకు హవిర్దాన మొసగినను, దిగ్దిగంతముల వరకు, కీర్తిని వ్యాపింపజేసినను, ఆత్మసాక్షాత్కారము కలుగనివానికి ఇవన్నియు నిష్ఫలములే.

శ్లో॥ కాయః క్లిష్టశ్చోపవాసై స్తతః కిం
లబ్ధాః పుత్రాః స్వీయపత్న్యా స్తతః కిమ్।
ప్రాణాయామ స్సాధితో వా తతః కిం
యేన స్వాత్మా నైవ సాక్షాత్కృతోఽభూత్॥

శ్లో॥ యుద్ధే శత్రు ర్నిర్జితో వా తతః కిం
భూయో మిత్రైః పూరితో వా తతః కిమ్।

యోగైః ప్రాప్తాః సిద్ధయో వా తతః కిం
యేన స్వాత్మా నైవ సాక్షాత్కృతోఽభూత్॥

శ్లో॥ అబ్ధిః పద్భ్యాం లంఘితో వా తతః కిం
వాయుః కుంభే స్థాపితో వా తతః కిమ్।
మేరుః పాణా వుద్ధృతో వా తతః కిం
యేన స్వాత్మా నైవ సాక్షాత్కృతోఽభూత్॥

తా॥ ఉపవాసాదులచే శరీరమును కృశింపజేసికొనినను, తన భార్యయందు పుత్రులను బడసినను, ప్రాణాయామమును సాధించినను, ఆత్మసాక్షాత్కారము కలుగనివానికి ఇవన్నియు నిష్ఫలములే.

యుద్ధములో శత్రువులను నిర్జించినను, మిత్రపరివేష్టితుడై యున్నను, యోగాభ్యాసము చేసి అణిమాదిసిద్ధులు సంపాదించినను, ఆత్మసాక్షాత్కారము కలుగనివానికి ఇవన్నియు నిష్ఫలములే.

పాదములతో సముద్రలంఘనము చేసినను, కుంభక ప్రాణాయామముచేత వాయునియమ మొనర్చినను. మేరు పర్వతమును లీలగా చేతితో నెత్తినను, ఆత్మసాక్షాత్కారము కలుగనివానికి ఇవన్నియు నిష్ఫలములే.

శ్లో॥ క్ష్వేళః పీతో దుగ్ధవద్ వా తతః కిం
వహ్నిర్జగ్ధో లాజవద్ వా తతః కిమ్।
ప్రాప్తశ్చారః పక్షివత్ ఖే తతః కిం
యేన స్వాత్మా నైవ సాక్షాత్కృతోఽభూత్॥

శ్లో॥ బద్ధా సమ్యక్ పావకాద్యా స్తతః కిం
సాక్షాద్విద్ధా లోహవర్యా స్తతః కిమ్।
లబ్ధో నిక్షేపోఽంజనాద్యై స్తతః కిం
యేన స్వాత్మా నైవ సాక్షాత్కృతోఽభూత్॥

శ్లో॥ భూపేంద్రత్వం ప్రాప్త ముర్వ్యాం తతః కిం
దేవేంద్రత్వం సంభృతం వా తతః కిమ్।
మునీంద్రత్వం చోపలబ్ధం తతః కిం
యేన స్వాత్మా నైవ సాక్షాత్కృతోఽభూత్॥

తా॥ విషమును పాలవలె త్రాగగలిగినను, అగ్నిని పేలమువలె భక్షణముచేయగలిగినను, పక్షివలె ఆకాశమున సంచరింపగల్గినను, ఆత్మసాక్షాత్కారము కలుగనివానికి ఇవన్నియు నిష్ఫలములే.

అగ్న్యాదులను వశపరచుకొనినను, లోహాదులను శకలములుగ చేయగలిగినను, అంజనాదులవలన నిధి నిక్షేపములను పొందకలిగినను, ఆత్మసాక్షాత్కారము కలుగనివానికి ఇవన్నియు నిష్ఫలములే.

ఈ భూలోకమున చక్రవర్తిత్వము సంపాదించినను, స్వర్గమున దేవేంద్రపదము నధిష్ఠించినను, అరణ్యమున తపమాచరించి మునీంద్రత్వము చేబట్టినను, ఆత్మసాక్షాత్కారము కలుగనివానికి ఇవన్నియు నిష్ఫలములే.

శ్లో॥ మంత్రైః సర్వః స్తంభితో వా తతః కిం
బాణైః లక్ష్యో భేదితో వా తతః కిమ్।

కాలజ్ఞానం చాపి లబ్ధం తతః కిం
యేన స్వాత్మా నైవ సాక్షాత్కృతోఽభూత్॥

శ్లో॥ కామాతంకః ఖండితో వా తతః కిం
కోపావేశః కుంఠితో వా తతః కిమ్।
లోభాశ్లేషో వర్జితో వా తతః కిమ్
యేన స్వాత్మా నైవ సాక్షాత్కృతోఽభూత్॥

శ్లో॥ మోహధ్వాంతః పేషితో వా తతః కిం
జాతో భూమౌ నిర్మదో వా తతః కిమ్।
మాత్సర్యార్తిః మీలితా వా తతః కిం
యేన స్వాత్మా నైవ సాక్షాత్కృతోఽభూత్ ॥

తా॥ మంత్రబలముచే సర్వమును స్తంభింప జేయవచ్చును; బాణములచే లక్ష్యమును భేదింపవచ్చును. కాలజ్ఞానమును సంపాదింపవచ్చును. ఆత్మసాక్షాత్కారము కలుగనివానికి ఇవన్నియు నిష్ఫలములే.

కామావేశమును ప్రశమితమొనర్చినను, కోపావేశము కుంఠితమైనను, లోభమును పరిత్యజించినను, ఆత్మసాక్షాత్కారము కలుగనివానికి ఇవన్నియు నిష్ఫలములే.

మోహధ్వాంతము దూరమైనను, ఈ లోకమున మదము లేనివాడయినను, మాత్సర్యబాధ ప్రశమితమైనను, ఆత్మసాక్షాత్కారము కలుగనివానికి ఇవి నిష్ఫలములే.

శ్లో॥ ధాతుర్లోకః సాధితో వా తతః కిం
విష్ణోర్లోకో వీక్షితో వా తతః కిమ్।

శంభోర్లోకః శాసితో వా తతః కిం
యేన స్వాత్మా నైవ సాక్షత్కృతో౽భూత్॥

శ్లో॥ యస్యేదం హృదయో సమ్య గనాత్మ శ్రీవిగర్హణమ్।
సదోదేతి స ఏవ ఆత్మసాక్షాత్కారస్య భాజనమ్॥

శ్లో॥ అన్యే తు మాయిక జగద్భ్రాంతి మోహమోహితాః।
న తేషాం జాయతే క్వాపి స్వాత్మసాక్షత్కృతిః భువి ॥

తా॥ బ్రహ్మలోకమును సాధించినను, విష్ణులోకమును దర్శించినను, శివలోకముపై నధికారము చేసినను, ఆత్మసాక్షాత్కారము కలుగనివానికి ఇవన్నియు నిష్ఫలములే.

ఎవడు తన హృదయమందు చక్కగా అనాత్మశ్రీ నింద అనుదినము చేయునో, అతడే ఆత్మసాక్షాత్కారమునకు పాత్రుడగును.

ఈవిధముగా చేయజాలనివారు మాయావిలసితమైన జగద్భ్రాంతియొక్క వ్యామోహముచే విమోహితచిత్తులే అని ఎరుగనగును. అట్టివారలకు ఈ జగత్తులో ఎన్నడును, ఆత్మసాక్షాత్కారము కలుగనేరదు.

ఈరీతిగా శ్రీశంకరుడు అనాత్మవిగర్హణము చేసిన తరువాత, ఈ యాత్మను పూజింపగలమా? యను ప్రశ్నకు సమాధానముగా 'ఆత్మపూజా' అను పేరుతో పదునాలుగు శ్లోకములు పల్కిరి.

శ్లో॥ అఖండే సచ్చిదానందే నిర్వికల్పైకరూపిణి।
స్థితేఽద్వితీయభావేఽస్మిన్ కథం పూజా విధీయతే॥

శ్లో॥ పూర్ణస్యావాహనం కుత్ర సర్వాధారస్య చాసనమ్।
స్వచ్ఛస్య పాద్య మర్ఘ్యం చ శుద్ధస్య ఆచమనం కుతః॥

శ్లో॥ నిర్మలస్య కుతః స్నానం వస్త్రం విశ్వోదరస్య చ।
అగోత్రస్య త్వవర్ణస్య కుతః తస్యోపవీతకమ్॥

శ్లో॥ నిర్లేపస్య కుతో గంధః పుష్పం నిర్వాసనస్య చ।
నిర్విశేషస్య కా భూషా కోఽలంకారో నిరాకృతేః॥

శ్లో॥ నిరంజనస్య కిం ధూపైః దీపైర్వా సర్వసాక్షిణః।
నిజానందైకతృప్తస్య నైవేద్యం కిం భవే దిహ॥

తా॥ ఆత్మవస్తువు అఖండము, సచ్చిదానందము నిర్వికల్పము, ఏకము, అద్వితీయము గదా! అట్టి అద్వితీయ తత్త్వమును పూజించు టెట్లు?

పూర్ణమగు తత్త్వమును ఆహ్వానించు టెట్లు? సర్వాధారమైన ఆ బ్రహ్మతత్త్వమునకు ఆసనము ఎక్కడ వేయనగును? ఆ నిర్మలమైనదానికి అర్ఘ్యపాద్యము లేల? శుద్ధతత్త్వమునకు ఆచమన మెందుకు?

నిర్మలమైన బ్రహ్మమునకు స్నానమెందుకు? ఆ బ్రహ్మాండభాండోదరునకు వస్త్ర మెట్లు సమర్పింపనగును? గోత్రము వర్ణములేని ఆనిర్గుణతత్త్వమునకు యజ్ఞోపవీతమేల?

నిర్లేపమగు ఆ యంసగతత్త్వమునకు గంధలేప మేల? వాసనారహితునకు పుష్పమేల? నిర్విశేష తత్త్వమునకు

భూషణమెద్ది? రూపరహితమైన చిన్మయతత్త్వమునకు అలంకార మెట్లు చేయ నగును?

నిరంజనమగు బ్రహ్మపదార్థమునకు ధూపముతో బని యేమి? సర్వసాక్షి యయినదానికి దీపమేల? నిజానందతృప్తమగు ఆత్మకు ఈ లోకమున నైవేద్య మేమి యుండును?

శ్లో॥ విశ్వానందయితు స్తస్య కిం తాంబూలం ప్రకల్ప్యతే।
స్వయం ప్రకాశచిద్రూపో యోఽసా వర్కాదిభాసకః॥

శ్లో॥ ప్రదక్షిణా హ్యనంతస్య హ్యద్వయస్య కుతో నతిః ।
వేదవాక్యైకవేద్యస్య కుతః స్తోత్రం విధీయతే ॥

శ్లో॥ స్వయంప్రకాశమానస్య కుతో నీరాజనం విభోః ।
అంతర్బహిశ్చపూర్ణస్య కథ ముద్వాసనం భవేత్॥

శ్లో॥ ఏవ మేవ పరాపూజా సర్వావస్థాసు సర్వదా ।
ఏకబుద్ధ్యా తు దేవేశే విధేయా బ్రహ్మవిత్తమైః॥

శ్లో॥ దేహో దేవాలయః ప్రోక్తో జీవో దేవ స్సదాశివః।
త్యజే దజ్ఞాననిర్మాల్యం సోఽహంభావేన పూజయేత్॥

తా॥ స్వయంప్రకాశచిద్రూపమైనది ఆత్మతత్త్వము. అది సూర్యచంద్రాదులను భాసింపజేయునట్టిది; సమస్తవిశ్వమునకు ఆనందమును చేకూర్చునట్టిది; అట్టి ఆనందస్వరూపమునకు తాంబూల మేమి యొసగనగును?

అనంతమగు ఆత్మవస్తువునకు ప్రదక్షిణము ఎట్లు చేయనగును? అద్వయాత్మకు నమస్కార మెట్లు ఆచరింప

నగును? ఉపనిషద్వేద్యమగు బ్రహ్మతత్త్వమును దేనిచే స్తుతింపనగును?

సర్వవ్యాపకుడును, స్వయంప్రకాశమానమగు ఆత్మకు నీరాజన మేల? లోపల, బయట, అంతట నిండియున్న వస్తువునకు ఉద్వాసన మెట్లు విధింపనగును?

ఈ విధముగా, సదా, సర్వావస్థలందును; బ్రహ్మవేత్తలలో శ్రేష్ఠులగువారు ఏకాగ్రచిత్తముతో పరమాత్మ యొక్క పరాపూజ చేయనగును.

శరీరము దేవాలయ మనియు, జీవుడు సదాశివుడయిన దేవు డనియు, చెప్పబడును. అజ్ఞాన మను నిర్మాల్యమును విసర్జించి 'సోఽహం' భావముతో పూజింపనగును.

శ్లో॥ తుభ్యం మహ్య మనంతాయ మహ్యం తుభ్యం శివాత్మనే।
నమో దేవాదిదేవాయ వరాయ పరమాత్మనే॥

శ్లో॥ యోగీ దేహాభిమానీ స్యా ద్భోగీ కర్మణి తత్పరః।
జ్ఞానీ మోక్షాభిలాషీ చ తత్త్వజ్ఞో నాభిమానితా॥

శ్లో॥ కిం కరోమి క్వ గచ్ఛామి కిం గృహ్ణామి త్యజామి కిమ్।
ఆత్మనా పూరితం సర్వం మహాకల్పాంబునా యథా॥

శ్లో॥ ఆత్మా త్వం గిరిజా మతిః సహచరాః ప్రాణా శ్శరీరం గృహం
పూజా తే వివిధోపభోగరచనా నిద్రా సమాధిస్థితిః।
సంచారస్తు పదోః ప్రదక్షిణవిధిః స్తోత్రాణి సర్వా గిరో
యద్యత్కర్మ కరోమి తత్తదఖిలం శంభో తవారాధనమ్॥

తా॥ నీవు, నేను మన మిరువురము అనంతస్వరూపులము; శివాత్మకులము. అద్వయానంతస్వరూపుడైన దేవదేవునకు, సర్వోత్కృష్టుడైన పరమాత్మకు నమస్కారము.

యోగి దేహాభిమానము, భోగి కర్మాభిమానము, జ్ఞాని మోక్షాభిమానము కలిగియుండును. కాని తత్త్వజ్ఞునియందు నిరభిమానత కానవగును.

మహాప్రళయసమయమున బ్రహ్మాండ మంతయు జలపూర్ణమైయుండురీతిగా, ఆత్మ అంతటా వ్యాపించియున్నది. ఏమిచేయుదును? ఎక్కడకు వెళ్లుదును? దేనిని గ్రహింపను? దేనిని పరిత్యజింతును?

నీవే ఆత్మవు; బుద్ధియే, పార్వతి; ప్రాణములే, సహచరులు; శరీరమే, గృహము; వివిధోపభోగరచనయే; నీపూజ, నిద్రయే, సమాధిస్థితి; పాదసంచారమే, ప్రదక్షిణవిధి; వాక్కులన్నియు, స్తోత్రములే. హే శంభో! నేను ఏయే కర్మ చేయుదునో అదియంతయు, నీ ఆరాధనమే.

ఆత్మపూజావిధాన ముపదేశించిన తర్వాత ఆత్మజ్ఞానము లక్ష్య మగుటచే ఆచార్యులవారు 'ఆత్మబోధ' అను పేరుతో ఈ శ్లోకములను వారికి ఉపదేశించిరి.

శ్లో॥ తపోభిః క్షీణపాపానాం శాంతానాం వీతరాగిణామ్।
ముముక్షూణా మపేక్ష్యోఽయ మాత్మబోధో విధీయతే ॥

శ్లో॥ బోధోఽన్యసాధనేభ్యో హి సాక్షాన్మోక్షైకసాధనమ్।
పాకస్య వహ్నివత్ జ్ఞానం వినా మోక్షో న సిద్ధ్యతి॥

శ్లో॥ అవిరోధితయా కర్మ నావిద్యాం వినివర్తయేత్।
విద్యాఽవిద్యాం నిహంత్యేవ తేజ స్తిమిరసంఘవత్॥

శ్లో॥ పరిచ్ఛిన్న ఇవాజ్ఞానాత్ తన్నాశే సతి కేవలః।
స్వయంప్రకాశతే హ్యాత్మా మేఘాపాయేఽంశుమానివ॥

తా॥ వివిధములయిన తపస్సు లొనర్చి పాపములను పోగొట్టు కొనినవారును, శాంతచిత్తులును, వీతరాగులును అగు ముముక్షువుల నుద్దేశించి, ఈ ఆత్మబోధ ఉపదేశింపబడు చున్నది.

అన్యసాధనములకంటె జ్ఞానము సాక్షాత్తుగ మోక్ష సాధనము. వహ్ని లేకుండా వంట జరుగదు. అదేరీతిగ, జ్ఞానము లేకుండా, మోక్షము లభించదు.

కర్మ అవిద్యకు విరోధి కాదు. అందుచే కర్మను నివర్తింప చేయజాలదు. ప్రకాశము అంధకారసమూహమును పారద్రోలునట్లు విద్యయే అవిద్యను రూపు మాపును.

అజ్ఞానము వలన ఆత్మ పరిచ్ఛిన్నమైనదానివలె అని పించుచున్నది. అజ్ఞానము నశించినంతనే అపరిచ్ఛిన్నమైన కేవలాత్మ భాసించును. మేఘములు తొలగిపోయినంతనే, భాస్కరుడు ప్రకాశించు రీతిగ, ఆత్మ స్వయముగ ప్రకాశించును.

శ్లో॥ అజ్ఞానకలుషం జీవం జ్ఞానాభ్యాసా ద్వినిర్మలమ్।
కృత్వా జ్ఞానం స్వయం నశ్యేత్ జలం కతకరేణువత్॥

శ్లో॥ సంసారః స్వప్నతుల్యో హి రాగద్వేషాదిసంకులః।
స్వకాలే సత్యవద్భాతి ప్రబోధేఽసత్యవద్భవేత్॥

శ్లో॥ తావత్సత్యం జగద్భాతి శుక్తికారజతం యథా।
యావ న్న జ్ఞాయతే బ్రహ్మ సర్వాధిష్ఠాన మద్వయమ్॥

శ్లో॥ ఉపాదానేఽఖిలాధారే జగంతి పరమేశ్వరే।
సర్గస్థితిలయాన్ యాంతి బుద్బుదానీవ వారిణి॥

శ్లో॥ సచ్చిదాత్మ న్యనుస్యూతే నిత్యే విష్ణౌ వికల్పితాః।
వ్యక్తయో వివిధా స్సర్వా హాటకే కటకాదివత్॥

తా॥ చిల్లగింజగంధము జలము యొక్క మాలిన్యమును పరిహరించి ఆ జలములోనే కలసిపోవును. అదేరీతిగ జ్ఞానము, అజ్ఞానముచే కలుషితుడైన జీవుని నిర్మల మొనర్చి, తాను విలీనమగును.

ఈ ప్రపంచము స్వప్నతుల్యము; రాగద్వేషాదులతో నిండియుండును; చూచుచున్నంతకాలమిది సత్యముగనే అవభాసించును; జ్ఞానోదయ మయినంతనే మిథ్యయే యగును.

బ్రహ్మ, సర్వాధిష్ఠానము, అద్వయము అని తెలియనంతవరకు శుక్తిక యందు రజతబుద్ధివలె ఈజగత్తు సత్యవస్తువుగనే కన్పట్టును. బ్రహ్మావగతి కలిగినంతనే జగన్మిథ్యాత్వము వెల్లడి యగును.

ఉపాదానకారణము, అఖిలాధారభూతుడు నగు పరమేశ్వరునియందు ఈ జగములన్నియు, నీటియందలి బుడగలవలె సృష్టి, స్థితి, లయములను పొందుచున్నవి.

సకల చరాచరజగత్తునం దనుస్యూతమును,సచ్చిదాత్మ స్వరూపమును, నిత్యమును సర్వవ్యాపకము నగు పరమాత్మ యందు సువర్ణమున కటకాది ఆభరణములు కల్పితమైనట్లు, వివిధ వ్యక్తులు కల్పింపబడుచున్నారు.

శ్లో॥ యథాఽఽకాశో హృషీకేశో నానోపాధిగతో విభుః।
తద్భేదాత్ భిన్నవద్భాతి తన్నాశే కేవలో భవేత్॥

శ్లో॥ నానోపాధివశాదేవ జాతినా మాశ్రమాదయః।
ఆత్మ న్యారోపితా స్తోయే రసవర్ణాదిభేదవత్॥

శ్లో॥ పంచీకృతమహాభూతసంభవం కర్మ సంచితమ్।
శరీరం సుఖదుఃఖానాం భోగాయతన ముచ్యతే॥

శ్లో॥ పంచప్రాణ మనోబుద్ధి దశేంద్రియసమన్వితమ్।
అపంచీకృతభూతోత్థం సూక్ష్మాంగం భోగసాధనమ్॥

శ్లో॥ అనాద్యవిద్యాఽనిర్వాచ్యా కారణోపాధి రుచ్యతే।
ఉపాధిత్రితయా దన్యమాత్మాన మవధారయేత్॥

తా॥ హృషీకేశుడు (ఆత్మ) ఆకాశము వలె సర్వవ్యాపి, ఘట, మఠాది భేదముచే ఆకాశము భిన్నముగ గన్పట్టును; ఘట, మఠాదినాశన మయినంతనే అది అఖండమై స్ఫురించును. అదేరీతిగ సర్వవ్యాపి యగు పరమాత్మయు, ఉపాధిగత భేదము వలన భిన్నముగ గన్పడినను, ఉపాధులు నశించినంతనే అపరిచ్ఛిన్నమగు కేవలాద్వయాత్మస్వరూపము భాసించును.

జలమునకు సహజముగ రుచిగాని, రంగు గాని లేదు. కాని, ఉపాధిభేదముచేత దాని యందు రసము, వర్ణము కన్పించును. అదేవిధముగ, అనేకోపాధుల భేదము వలననే జాతి, నామము, ఆశ్రమాదులు ఆత్మ యం దారోపింపబడు చున్నవి.

పంచీకృతములైన మహాభూతములవలన నేర్పడునదియును, కర్మసంచితము నగు ఈ శరీరము సుఖదుఃఖములకు 'భోగాయతన'మని చెప్పబడుచున్నది.

పంచప్రాణములు, మనోబుద్ధులు, దశేంద్రియములు, అనగా, పంచజ్ఞానేంద్రియములు, పంచకర్మేంద్రియములు, వీనితో కూడినదియును, అపంచీకృత, పంచమహాభూతములచే నేర్పడిన సూక్ష్మశరీరము భోగసాధన మని చెప్పబడును. అనాదియు, అనిర్వాచనీయయు నగు అవిద్యయే, కారణోపాధి యని చెప్పబడుచున్నది. ఆత్మను స్థూల, సూక్ష్మ, కారణోపాధుల కతీతమైనదిగ నవధారణము చేయనగును.

శ్లో॥ పంచకోశాదియోగేన తత్తన్మయ ఇవ స్థితః।
శుద్ధాత్మా నీలవస్త్రాదియోగేన స్ఫటికో యథా॥

శ్లో॥ వపుస్తుషాదిభిః కోశైర్యుక్తం యుక్త్యవఘాతతః।
ఆత్మాన మాంతరం శుద్ధం వివించ్యాత్ తండులం యథా॥

శ్లో॥ సదా సర్వగతోఽప్యాత్మా న సర్వత్రావభాసతే।
బుద్ధావేవావభాసతే స్వచ్ఛేషు ప్రతిబింబవత్॥

శ్లో॥ దేహేంద్రియ మనోబుద్ధి ప్రకృతిభ్యో విలక్షణమ్।
తద్వృత్తిసాక్షిణం విద్యా దాత్మానం రాజవత్ సదా॥

శ్లో॥ వ్యాపృతే ష్వింద్రియే ష్వాత్మా వ్యాపారీ వాఽవివేకినా।
దృశ్యతేఽభ్రేషు ధావత్సు ధావన్నివ యథా శశీ॥

తా॥ స్ఫటికమణి నీల, లోహితవస్తుసంయోగముచేత ఆ యా వర్ణములతో గన్పట్టును. అటులనే, శుద్ధమగు ఆత్మయు, పంచకోశాదిసంయోగము వలన తత్తన్మయముగా భాసించు చున్నది.

ధాన్యమును దంచి, బియ్యమును పొట్టునుండి వేరు చేసినట్లు, హృత్పుండరీకాంతర్వర్తియగు నిర్మలాత్మస్వరూప మును స్థూల, సూక్ష్మ, కారణశరీరముల నుండి యుక్తులతో చక్కగా విచారము సల్పి వేరుపరచనగును.

విశుద్ధములగు దర్పణములందు మాత్రమే ముఖము ప్రతిబింబించును. అదేవిధముగ, ఆత్మ సర్వగతుడయ్యు, నిర్మల మగు బుద్ధియందు మాత్రమే అవభాసించును; అన్ని స్థలములందు గోచరించదు.

శరీరము, ఇంద్రియములు, మనస్సు, బుద్ధి, ప్రకృతి వీనికంటె ఆత్మ విలక్షణ మైనది. కాని, దానిని తద్వృత్తి సాక్షిగ, తెలిసికొనదగును.

మేఘములు పరుగిడుచుండుటను జూచి, జనులు చంద్రుడు పరుగిడుచున్నా డందురు. అటులనే, ఇంద్రియ

ములు తమ తమ పనులను నిర్వర్తించుచుండగా అవివేకులు ఆత్మయే వ్యవహారము చేయుచున్నదని భావింతురు.

శ్లో॥ ఆత్మచైతన్య మాశ్రిత్య దేహేంద్రియమనోధియః।
స్వకీయార్థేషు వర్తంతే సూర్యాలోకం యథా జనాః॥

శ్లో॥ దేహేంద్రియగుణాన్ కర్మా ణ్యమలే సచ్చిదాత్మని।
అధ్యస్యతేఽవివేకేన గగనే నీలతాదివత్॥

శ్లో॥ అజ్ఞానా న్మానసోపాధేః కర్తృత్వాదీని చాత్మని।
కల్ప్యతేఽంబుగతే చంద్రే చలనాది ర్యథాంభసః ॥

శ్లో॥ రాగేచ్ఛాసుఖదుఃఖాని బుద్ధౌ సత్యాం ప్రవర్తతే।
సుషుప్తౌ నాస్తి తన్నాశే తస్మా ద్బుద్ధేస్తు నాత్మనః॥

శ్లో॥ ప్రకాశోఽర్కస్య తోయస్య శైత్య మగ్నేర్యథోష్ణతా।
స్వభావః సచ్చిదానందనిత్యనిర్మలతాఽఽత్మనః॥

తా॥ సూర్యప్రకాశము నాశ్రయించియే జనులు తమ తమ వ్యాపారములను, సాగించుచున్న రీతిగా, దేహేంద్రియ మనోబుద్ధులు ఆత్మచైతన్యము నాశ్రయించి స్వకార్యము లందు ప్రవర్తించుచున్నవి.

వివేకహీనులు ఆకాశమునందు నీలిమాదివర్ణములను ఆరోపింతురు. అదేవిధముగ, అజ్ఞానమువలన దేహేంద్రియాదుల గుణకర్మలను నిర్మలమగు సచ్చిదాత్మ యందు ఆరోపింతురు.

జలగతమైన చలనాదులు నీటియందు ప్రతిఫలించు చంద్రుని యందు ఆరోపింపబడు చందమున; అజ్ఞానముచే

మానసోపాధియొక్క కర్తృత్వ, భోక్తృత్వాదులు ఆత్మ యందు అధ్యస్తమొనర్పబడుచున్నవి.

బుద్ధి యొక్క అస్తిత్వము చేతనే రాగ-ఇచ్ఛా-సుఖ-దుఃఖములు కలుగుచున్నవి. సుషుప్తియందు బుద్ధి యొక్క ఉనికి యుండకపోవుటచేత రాగేచ్ఛాదులులేవు. అందుచేత, రాగేచ్ఛాదులు, సుఖదుఃఖాదులు బుద్ధిధర్మములుగాని, ఆత్మ గుణములు కావని ఎరుగనగును.

సూర్యునికి ప్రకాశము, జలమునకు శైత్యము, అగ్నికి ఉష్ణత స్వాభావికధర్మము లయినట్లు సత్, చిత్, ఆనంద ములు, నిత్యత్వ, నిర్మలత్వములు ఆత్మకు స్వాభావికములు.

శ్లో॥ ఆత్మన స్సచ్చిదంశశ్చ బుద్ధేర్వృత్తి రితి ద్వయమ్।
సంయోజ్య చావివేకేన జానామీతి ప్రవర్తతే॥

శ్లో॥ ఆత్మనో విక్రియా నాస్తి బుద్ధే ర్బోధో న జాత్వపి।
జీవః సర్వ మలం జ్ఞాత్వా జ్ఞాతా ద్రష్టేతి ముహ్యతి॥

శ్లో॥ రజ్జుసర్పవదాత్మానం జీవో జ్ఞాత్వా భయం వహేత్।
నాహం జీవః పరాత్మేతి జ్ఞానం చే న్నిర్భయో భవేత్॥

శ్లో॥ ఆత్మాఽవభాసయ త్యేకో బుద్ధ్యాదీ నీంద్రియాణి చ।
దీపో ఘటాదివత్ స్వాత్మా జడై స్తైః నావభాస్యతే॥

శ్లో॥ స్వబోధే నాన్యబోధేచ్ఛా బోధరూపతయాఽఽత్మనః।
న దీప స్యాన్యదీపేచ్ఛా తథా స్వాత్మా ప్రకాశతే॥

తా॥ ఆత్మయొక్క సచ్చిదంశ, బుద్ధియొక్కవృత్తి - ఈ రెంటిని సయోజనము చేసి, 'నేనెరుగుదు' నని జనులు అవివేకముతో ప్రవర్తించుచున్నారు.

ఆత్మ విక్రియారహితము; బుద్ధి బోధశూన్యము. కాని, జీవుడు 'సర్వము తెలిసికొంటి' నను మిథ్యాజ్ఞానముతో, తాను, జ్ఞాత, ద్రష్ట యని భావించి, వ్యామోహము చెందుచున్నాడు.

రజ్జువు నందు సర్పభ్రాంతి కలుగుట వలన, భయభీతుల మయినట్లు ఆత్మయందు జీవభావము కల్పించుకొనుట చేత భయము కలుగుచున్నది. 'నేను జీవుడను గాను; అసంగుడగు పరమాత్మను' అను జ్ఞానము కలిగినచో భయరహితు డగును.

దీపము ఘటపటాదులను ప్రకాశింపజేయునట్లు, సచ్చిదాత్మ బుద్ధ్యాదులయిన ఇంద్రియములను ప్రకాశింపచేయుచుండును. జడములగు ఆ బుద్ధ్యాదుల వలన, ఆత్మ అవభాసితమగుట లేదు.

ఆత్మ జ్ఞానరూపము. అందువలన, ఆత్మబోధకై జ్ఞానాంతరాపేక్ష యుండదు. దీపప్రకాశమునకు అన్యప్రకాశము అపేక్షితము కానియట్లు స్వయంప్రకాశమైన ఆత్మకు మరియొక ప్రకాశము ఆవశ్యకము గాదు.

శ్లో॥ నిషిధ్య నిఖిలోపాధీన్ నేతి నేతీతి వాక్యతః।
విద్యా దైక్యం మహావాక్యైః జీవాత్మపరమాత్మనోః॥

శ్లో॥ అవిద్యకం శరీరాదిదృశ్యం, బుద్బుదవత్ క్షరమ్।
ఏతద్విలక్షణం విద్యా దహం బ్రహ్మేతి నిర్మలమ్॥

శ్లో॥ దేహాన్యత్వాత్ న మే జన్మజరాకార్శ్యలయాదయః।
శబ్దాదివిషయైస్సంగో న నిరింద్రియతా న చ॥

శ్లో॥ అమనస్త్వాత్ న మే దుఃఖరాగద్వేషభయాదయః।
అప్రాణో హ్యమనాః శుభ్ర ఇత్యాదిశ్రుతిశాసనాత్॥

శ్లో॥ నిర్గుణో నిష్క్రియో నిత్యో నిర్వికల్పో నిరంజనః।
నిర్వికారో నిరాకారో నిత్యముక్తోఽస్మి నిర్మలః॥

తా॥ సమస్త ఉపాధులను అనగా, దేహేంద్రియ మనః ప్రాణాదులను 'నేతి నేతి' వాక్యముల వలన నిషేధించి, 'తత్త్వమసి' మున్నగు మహావాక్యములచేత జీవాత్మపరమాత్మలకు ఐక్యము నెరుంగ నగును.

దృశ్యములగు శరీరేంద్రియాదులు అవిద్యాకల్పితములగుట వలన, బుద్బుదములవలె నశ్వరములని యెరుగునది. నేను వీనికంటె విలక్షణము నిర్మలము నగు బ్రహ్మమును అని గ్రహింపనగును.

నేను దేహవిలక్షణుడను; కాన, నాకు జన్మ, జరా, కార్శ్య (కృశించిపోవుట) మరణాదులు లేవు; నేను ఇంద్రియాతీతుడను కనుక, నాయందు శబ్దస్పర్శ రూపాది విషయసంగము లేదు.

నేను మనస్సుకంటె విలక్షణమైనవాడ నగుటంజేసి రాగద్వేషములు, దుఃఖభయాదులు నాకు లేవు. 'అప్రాణో

వ్యామనాః శుభ్రః' అనుచు ఆత్మ మనఃప్రాణములకంటె విలక్షణము, నిర్మలము అని శ్రుతియుద్ఘోషించుచున్నది.

నేను నిర్గుణుడను; నిష్క్రియుడను; నిత్యుడను; నిర్వికల్పుడను; నిరంజనుడను; నిర్వికారుడను; నిరాకారుడను; నిత్యముక్తుడను; నిర్మలుడను.

శ్లో॥ అహమాకాశవత్ సర్వబహిరంతర్గతో౽చ్యుతః।
సదా సర్వసమః శుద్ధో నిస్సంగో నిర్మలో౽చలః॥

శ్లో॥ నిత్యశుద్ధవిముక్తైక మఖండానంద మద్వయమ్।
సత్యం జ్ఞాన మనంతం యత్ పరం బ్రహ్మాహ మేవచ॥

శ్లో॥ ఏవం నిరంతరకృతా బ్రహ్మైవాస్మీతి వాసనా।
హర త్యవిద్యావిక్షేపాన్ రోగానివ రసాయనమ్॥

శ్లో॥ వివిక్తదేశ ఆసీనో విరాగో విజితేంద్రియః।
భావయే దేక మాత్మానం తం అనంత మనన్యధా॥

శ్లో॥ ఆత్మన్యేవ అఖిలం దృశ్యం ప్రవిలాప్య ధియా సుధీః।
భావయే దేక మాత్మానం నిర్మలాకాశవత్ సదా॥

తా॥ నేను ఆకాశము వలె బయట, లోపల, అంతట వ్యాపించి యున్న అచ్యుతుడను; సదా సర్వసముడను; పరిశుద్ధుడను; నిస్సంగుడను; నిర్మలుడను; అచలస్వరూపుడను అయి యున్నవాడను.

నేను నిత్య శుద్ధ బుద్ధ ముక్తస్వభావుడను; ఏకము అఖండము ఆనందము నగు అద్వయాత్మస్వరూపమును;

'సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ' యనుచు శ్రుతిచే ప్రతిపాదింప బడిన బ్రహ్మస్వరూపుడను నేనే.

ఈ రీతిగా 'బ్రహ్మైవాస్మి' యని నిరంతరము భావన చేయుచుండుట వలన ఒక సంస్కారము కలుగును. అది రోగములను నివర్తింపజేయు రసాయనము వలె అవిద్యా కల్పితములైన విక్షేపములను పోగొట్టును.

విరాగి, విజితేంద్రియుడు నైనవాడు విజనప్రదేశమున గూరుచుండి అనన్యభావముతో ఆ అద్వితీయమగు ఆత్మ తత్త్వమును నిరంతరము భావన చేయనగును.

బుద్ధిమంతుడు బుద్ధిబలముచే దృశ్యప్రపంచము నంతయు ఆత్మయందు ప్రవిలాపన మొనర్చి, నిర్మలాకాశము వలె శుద్ధమైన ఆత్మతత్త్వమునునిరంతరముభావనచేయనగును.

శ్లో॥ రూపవర్ణాదికం సర్వం విహాయ పరమార్థవిత్।
పరిపూర్ణచిదానందస్వరూపే ణావతిష్ఠతే॥

శ్లో॥ జ్ఞాతృజ్ఞానజ్ఞేయభేదః పరాత్మని న విద్యతే,
చిదానందస్వరూపత్వాత్ దీప్యతే స్వయమేవ హి॥

శ్లో॥ ఏవ మాత్మాఽరణౌ ధ్యానమథనే సతతం కృతే,
ఉదితావ గతిజ్వాలా సర్వాజ్ఞానేంధనం దహేత్॥

శ్లో॥ అరుణేనైవ బోధేన పూర్వం తత్తిమిరే హృతే।
తత ఆవిర్భవే దాత్మా స్వయ మేవాంశుమానివ॥

శ్లో॥ ఆత్మా తు సతతం ప్రాప్తోఽప్య ప్రాప్తవ దవిద్యయా।
తన్నాశే ప్రాప్తవద్భాతి స్వకంఠాభరణం యథా॥

తా॥ పరమార్థమైన బ్రహ్మతత్త్వము నెరిగినవాడు రూప వర్ణాదికమును పరిత్యజించి; పరిపూర్ణమగు చిదానంద స్వరూపమున నెలకొనియుండును.

జ్ఞాత, జ్ఞేయము-జ్ఞానము అను త్రిపుటీభేదము పరమాత్మ యందు లేదు. ఆ పరమాత్మ చిదానందస్వరూపు డగుటచే స్వయంప్రకాశమై యొప్పారుచుండును.

ఈ విధముగ, ఆత్మ యను అరణియందు నిరంతరము ధ్యానమథనము చేసినచో, జ్ఞానాగ్నిశిఖ ఉద్భవించి అజ్ఞాన రూపములైన ఇంధనముల నన్నిటిని దగ్ధ మొనర్చును.

అరుణోదయ మైనంతనే చీకటులు తొలగిపోవును. తర్వాత స్వయంప్రకాశనశీలు డగు భాస్కరు డావిర్భ వించును. అదేవిధముగా, జ్ఞానావగతి కలుగగానే అజ్ఞాన తిమిరములు మటుమాయమగును; స్వయంప్రకాశస్వరూపు డగు ఆత్మ యావిర్భవించును.

మెడలోని సువర్ణహారము వలె ఆత్మ ఎల్లవేళల ప్రాప్త మయియేయుండును, కంఠహారము తనవద్దనే యున్నదను జ్ఞానము లేక పోయినదను భ్రాంతితో వెదకికొందురు; చివరకు దానిని తమయొద్దనే గలదని గుర్తింతురు. అదే విధముగా అజ్ఞానము వలన ఆత్మ అప్రాప్తమయినట్లు భాసించును. కాని అవిద్యానాశ మయినంతనే ఆత్మోపలబ్ధి కలిగినట్లు తోచును.

శ్లో॥ స్థాణౌ పురుషవ ద్భ్రాంత్యా కృతా బ్రహ్మణి జీవతా।
జీవస్య తాత్త్వికే రూపే తస్మిన్ దృష్టే నివర్తతే॥

శ్లో॥ తత్త్వస్వరూపానుభవా దుత్పన్నజ్ఞాన మంజసా।
అహంమమేతి నా త్మానం బాధతే దిగ్భ్రమాదివత్॥

శ్లో॥ సమ్యగ్విజ్ఞానవాన్ యోగీ స్వాత్మన్యేవాఖిలం జగత్।
ఏకం చ సర్వ మాత్మాన మీక్షతే జ్ఞానచక్షుషా ॥

శ్లో॥ ఆత్మైవేదం జగత్సర్వ మాత్మనోఽన్యత్ న విద్యతే।
మృదా యద్వత్ ఘటాదీని స్వాత్మానం సర్వ మీక్షతే॥

శ్లో॥ జీవన్ముక్తస్తు తద్విద్వాన్ పూర్వోపాధిగుణాం స్త్యజేత్।
సచ్చిదానందరూపత్వం భవే ద్భ్రమరకీటవత్॥

తా॥ దూరమునందున్న స్థాణువునందు భ్రాంతి వలన పురుషబుద్ధి కలుగునట్లు బ్రహ్మయందు జీవభావము చేయబడుచున్నది. జీవుని తాత్త్వికరూప మగు ఆత్మను దర్శించిన జీవభావము అపాస్తమగును.

దిగ్భాగము నిర్ణయమైనంతనే దిగ్భ్రమ తొలగిపోవును. అటులనే, తత్త్వస్వరూపావగతి వలన జ్ఞానోదయమైనచో 'అహం, మమ' అను జీవభావము దూరమగును. అది ఆత్మను బాధింపజాలదు.

సమ్యగ్విజ్ఞానము కలిగిన యోగి జ్ఞానచక్షుస్సుతో స్వాత్మయందే నిఖిలప్రపంచమును, అద్వయాత్మను దర్శించును.

ఈ ప్రపంచ మంతయు ఆత్మస్వరూపమే; ఆత్మభిన్నమైనదేదియు లేదు. ఘటశరావాదులు మృద్భిన్నము కానటుల సర్వము ఆత్మస్వరూపముగనే యోగి వీక్షించును.

జీవన్ముక్తుడగు బ్రహ్మవేత్త పూర్వోపాధిగుణముల నన్నిటిని పరిత్యజించి, భ్రమరకీటన్యాయమున సచ్చిదానంద రూపత్వమును పొందనగును.

శ్లో॥ తీర్త్వా మోహార్ణవం హత్వా రాగద్వేషాదిరాక్షసాన్।
యోగీ శాంతిసమాయుక్తో హ్యాత్మారామో విరాజతే॥

శ్లో॥ బాహ్యానిత్యసుఖాసక్తిం హిత్వాఽఽత్మసుఖనిర్వృతేః।
ఘటస్థదీపవత్ స్వస్థం స్వాత్మన్యేవ ప్రకాశతే॥

శ్లో॥ ఉపాధిస్థోఽపి తద్ధర్మైః విర్లిప్తో వ్యోమవ న్మునిః।
సర్వవిత్ మూఢవత్ తిష్ఠే దసక్తో వాయువత్ చరేత్॥

శ్లో॥ ఉపాధివిలయా ద్విష్ణౌ నిర్విశేషం విశే న్మునిః।
జలే జలం వియద్వ్యోమ్ని తేజ స్తేజసి వా యథా॥

శ్లో॥ యల్లాభాత్ నాపరో లాభో యత్సుఖాత్ నాపరం సుఖమ్।
యద్జ్ఞానాత్ నాపరం జ్ఞానం తద్బ్రహ్మే త్యవధారయేత్॥

తా॥ యోగి మోహార్ణవమును తరించి, రాగద్వేషములను రాక్షసులను సంహరించి, శాంతిసమాయుక్తుడు; ఆత్మారాముడునై విరాజిల్లును.

బాహ్యములు, అనిత్యములు నగు సుఖములయం దనురాగము విసర్జించి, ఆత్మసుఖనిర్వృతి నందిన యోగి వర్యుడు తనయందు తానే ఘటమందలి దీపము వలె ప్రకాశించుచుండును.

ఉపాధిని ధరించియున్నను, యోగి తద్ధర్మములచే స్పృశింపబడక ఆకాశము వలె నిర్లిప్తుడై యుండును. సర్వజ్ఞుడయ్యు, మూఢునివలె ఉండును; అనాసక్తుడై వాయువు వలె సంచరించును.

జలము జలమునందును, ఆకాశము ఆకాశమునందును, తేజస్సు తేజస్సునందును ప్రవేశించురీతిగా, ఉపాధివినిర్ముక్తుడగు ముని సర్వవ్యాపకమగు పరబ్రహ్మయందు నిర్విశేషముగా ఐక్యమందును.

దేనిని పొందుటకంటె ఉత్తమమైన లాభము లేదో, ఏ సుఖము కంటె ఉత్కృష్టమైన సుఖము లేదో, దేని యొక్క జ్ఞానము కంటె అధికమగు జ్ఞానము లేదో, అదియే బ్రహ్మ యని నిశ్చయముగ మనసున నిలుపుకొన నగును.

శ్లో॥ యద్దృష్ట్వా నాపరం దృశ్యం యద్భూత్వా న పునర్భవః।
యద్ జ్ఞాత్వా నాపరం జ్ఞేయం తద్బ్రహ్మే త్యవధారయేత్॥

శ్లో॥ తిర్యగూర్ధ్వ మధఃపూర్ణం సచ్చిదానంద మద్వయమ్।
అనంతం నిత్యమేకం యత్ తద్బ్రహ్మే త్యవధారయేత్॥

శ్లో॥ అతద్వ్యావృత్తిరూపేణ వేదాంతైః లక్ష్యతేఽద్వయమ్,
అఖండానందమేకం యత్ తద్బ్రహ్మే త్యవధారయేత్॥

శ్లో॥ అఖండానందరూపస్య తస్యానందలవాశ్రితాః।
బ్రహ్మాద్యా స్తారతమ్యేన భవం త్యానందినోఽఖిలాః॥

శ్లో॥ తద్యుక్త మఖిలం వస్తు వ్యవహార స్త త్సదన్వితః।
తస్మా త్సర్వగతం బ్రహ్మ క్షీరే సర్పిరివాఖిలే॥

తా॥ దేనిని జూచిన, మరిదృశ్యమైనది లేదో; ఏది అయిన, మరి పునర్జన్మ యుండదో, దేనిని తెలిసికొనిన మరి తెలిసికొన దగినది లేదో, అదియే బ్రహ్మ యని మనమున నిశ్చయముగా ధారణచేయుము.

వంకరగను, ఊర్ధ్వముగను, క్రిందుగను నిండి సచ్చిదానందస్వరూపము, అద్వయము, అనంతము, నిత్యము, ఏకమునై ఏది వెలుగొందుచున్నదో అదియే బ్రహ్మ యని మనసులో దృఢముగా, అవధారణ చేయుము.

ఏ అద్వయాత్మ అతద్వ్యావృత్తిగా, అనగా, 'నేతి నేతి' యని వేదాంతవాక్యములచే ప్రతిపాదింపబడుచున్నదో, ఏకము, అఖండానందస్వరూపము నగు ఏతత్త్వము గలదో, అదియే బ్రహ్మపదార్థ మని, హృదయమున పదిలపరచుకొన నగును.

అఖండానందస్వరూపమైన బ్రహ్మయొక్క ఆనంద లేశము నాధారముగ గొనియే: హిరణ్యగర్భాది సకలజీవులు లోకవ్యవహారము చేయుచున్నారు. తరతమ భేదముచే సకల జీవకోటి ఆనంద మనుభవించుచున్నది.

ఈలోకమున వస్తుజాత మంతయు, బ్రహ్మచైతన్య యుక్తమై, తదన్వితమైనప్పుడే వ్యవహార యోగ్య మగుచున్నది. కావున, క్షీరమునందు ఘృతము వలె బ్రహ్మ సర్వగతమై విరాజమాన మగుచున్నది.

శ్లో॥ అణు మస్థూల మహ్రస్వ మదీర్ఘ మజ మవ్యయమ్।
అరూపగుణాఖ్యం తద్బ్రహ్మే త్యవధారయేత్॥

శ్లో॥ యద్భాసా భాస్యతేఽర్కాదిః భాస్యైః యత్తు న భాస్యతే।
యేన సర్వమిదం భాతి తద్బ్రహ్మే త్యవధారయేత్॥

శ్లో॥ స్వయ మంతర్బహిర్వ్యాప్య భాసయ న్నిఖిలం జగత్।
బ్రహ్మ ప్రకాశతే వహ్నిప్రతప్తాయసపిండవత్॥

శ్లో॥ జగద్విలక్షణం బ్రహ్మ బ్రహ్మణోఽన్య న్న కించన।
బ్రహ్మాన్య ద్భాసతే మిథ్యా యథా మరుమరీచికా॥

శ్లో॥ దృశ్యతే శ్రూయతే యత్త ద్బ్రహ్మణోఽన్యత్ న విద్యతే।
తత్త్వజ్ఞానాచ్చ తద్బ్రహ్మ సచ్చిదానంద మద్వయమ్॥

తా॥ 'అణోరణీయా న్మహతో మహీయాన్' అనుచు శ్రుతి బ్రహ్మస్వరూపమును వర్ణించినది. బ్రహ్మ అణువును గాదు, స్థూలమును గాదు; హ్రస్వమును గాదు, దీర్ఘమును గాదు; అది జన్మలేనిది; నాశరహితము; రూప, గుణ, వర్ణరహిత మైనది యేది గలదో, అదియే బ్రహ్మ యని మనమున, నిశ్చితముగా భావింప నగును.

దేనిని సూర్యచంద్రాదులు భాసింపజేయ జాలరో, దేనిచే వారు ప్రకాశింతురో, దేని ప్రకాశముచే ఈ సకల ప్రపంచము ప్రకాశించుచున్నదో, అదియే బ్రహ్మ యని దృఢముగా హృదయమున ధారణ చేయుము.

అగ్నిచే కాల్చబడిన లోహపిండమున, వహ్ని సర్వత్ర వ్యాపించి ప్రకాశింపజేయుచందమున, బ్రహ్మ బాహ్యాంతరములం దంతట వ్యాపించి నిఖిలప్రపంచమును ప్రకాశింపజేయుచు, స్వయంప్రకాశమానమై భాసించుచుండును.

బ్రహ్మవస్తువు జగత్తు కంటె విలక్షణమైనది. బ్రహ్మభిన్నమైన వస్తువు మరేదియు లేదు. బ్రహ్మాభిన్నమైన వస్తువు భాసించుచున్నట్లు కనిపించిన, అది మరుమరీచికవలె మిథ్యయే.

'యత్కించ జగత్సర్వం దృశ్యతే శ్రూయతేఽపి వా' దృశ్యమానము, శ్రూయమాణ మగు జగత్తు అంతయు బ్రహ్మాభిన్నమైనది కాదనుచు శ్రుతి యుద్బోధించుచున్నది. తత్త్వజ్ఞానావగతి కలిగిన, ఆ సర్వమును, అద్వయము, సచ్చిదానందస్వరూపము నగు బ్రహ్మయే యగును.

శ్లో॥ సర్వగం సచ్చిదాత్మానం జ్ఞానచక్షుః నిరీక్ష్యతే।
అజ్ఞానచక్షు ర్నేక్ష్యతే భాసంతం భాను మంధవత్॥

శ్లో॥ శ్రవణాదిభి రుద్దీప్తో జ్ఞానాగ్నిపరితాపితః।
జీవ స్సర్వమలాన్ముక్తః సువర్ణవత్ ద్యోతతే స్వయమ్॥

శ్లో॥ హృదాకాశోదితో హి ఆత్మా బోధభాను స్తమోఽపహృత్।
సర్వవ్యాపీ సర్వధారీ భాతి సర్వం ప్రకాశతే॥

శ్లో॥ దిగ్దేశకాలా ద్యనపేక్ష్య సర్వగం
శీతాదిహృన్నిత్యసుఖం నిరంజనమ్।
య స్స్వాత్మతీర్థం భజతే వినిష్క్రియః
స సర్వవి త్సర్వగతోఽమృతో భవేత్॥

జ్ఞాననేత్రములు గలవాడు సర్వగతమైన సచ్చిదాత్మ స్వరూపమును దర్శింపగలుగును. అంధుడు ప్రకాశించుచున్న సూర్యుని చూడజాలని విధముగా, అజ్ఞానచక్షుష్కులు ఆ యాత్మస్వరూపమును వీక్షింపజాలరు.

వేదాంతవాక్యశ్రవణ, మననాదుల వలన నుద్దీపితుడై జ్ఞానాగ్నిచే ప్రజ్వరిల్లి, సర్వపాపవినిర్ముక్తుడైన జీవుడు తప్త సువర్ణముభంగి స్వయంప్రకాశముచే వెలుగొందును.

అజ్ఞానతిమిరమును పారద్రోలు జ్ఞానభాస్కరుడై ఆత్మ హృదయాకాశమున ఉదయించి, సర్వగతుడు సర్వాధారుడు నగుచు సర్వమును ప్రకాశింపజేయును.

దిగ్దేశకాలాదులచే నపరిచ్ఛిన్నము, సర్వగతము, శీతోష్ణాది ద్వంద్వాపహారి, నిత్యసుఖస్వరూపము, నిరంజనము నగు ఆత్మతీర్థమును ఎవడు కర్తృత్వ భోక్తృత్వాది క్రియారహితుడై సేవించునో, అతడు సర్వజ్ఞుడై సర్వగతుడై అమృతస్వరూపు డగును.

ఈ రీతిగ, ఆత్మబోధస్వరూపమును చెప్పిన తర్వాత అద్వైతతత్త్వమునకు సంక్షేపరూపమున నీ క్రింది శ్లోకము నాచార్యులు చెప్పిరి.

శ్లో॥ కింజ్యోతి స్తవ భానుమా నహని మే రాత్రౌ ప్రదీపాదికం
స్యాదేవం రవిదీపదర్శనవిధౌ కిం జ్యోతి రాఖ్యా హి మే।

చక్షు స్తస్య నిమీలనాదిసమయే కిం ధీః ధియోదర్శనే
కిం తత్ర అహ మతో భవాన్ పరమకం జ్యోతి స్తదస్మి
ప్రభో॥

గురుశిష్యసంవాద రూపమున ఇందాత్మ స్వరూపము వివరింపబడినది. వత్సా! వస్తుప్రకాశక మగు జ్యోతి ఏది? పగటియందు సూర్యుడు; రాత్రిసమయమున ప్రదీపచంద్రాదులు. అయినచో, సూర్యప్రదీపాదులను తెలిసికొను జ్యోతి యేది? నేత్రము. నేత్రనిమీలన సమయమున జ్యోతి ఏది? బుద్ధి. ఈబుద్ధిని చూచునట్టి జ్యోతి ఏది? నేను. అనగా; ఆత్మ ప్రకాశము. కావున, ఆచార్యుడా! మీరు నేను, మన మిరువురము పరంజ్యోతిస్వరూపమైన ఆత్మయే యని భావింతును.

కాశ్మీరము నుంచి శంకరుడు ప్రసిద్ధ పుణ్యక్షేత్ర మగు బదరికాశ్రమమును మరల ప్రవేశించెను.

శ్లో॥ "అన్యత్ర మరణాన్ముక్తిః స్వధర్మ విధిపూర్వకాత్।
బదరీదర్శనా దేవ ముక్తిః పుంసాం కరే స్థితా"॥

అని మహాభారతమున గలదు. స్వధర్మాచరణ గావించు వ్యక్తికి ఇతరప్రదేశములలో మరణించినతర్వాతనే ముక్తి కలుగును. కాని, బదరీదర్శనము చేయుటతో అట్టి వ్యక్తి జీవన్ముక్తు డగునని సంప్రదాయము.

శ్లో॥ యత్ర నారాయణో దేవః పరమాత్మా సనాతనః।
తత్ర కృత్స్నం జగత్సర్వం తీర్థా న్యాయతనానిచ॥

శ్లో॥ తత్పుణ్యం పరమం బ్రహ్మ తత్తీర్థం తత్తపోవనమ్।
తత్పరం పరమం దేవం భూతానాం పరమేశ్వరమ్॥

శ్లో॥ శాశ్వతం పరమం చైవ ధాతారం పరమం పదమ్।
యం విదిత్వా నశోచంతి విద్వాంసః శాస్త్రదృష్టయః॥

అని వనపర్వమున గలదు. నారాయణు డున్న బదరిలో సమస్త ప్రపంచము తీర్థక్షేత్రములు ఉన్నవట. బ్రహ్మదర్శనకు తోడ్పడు తపోవనమచట గలదు. ఆధ్యాత్మిక మనన నిదిధ్యాసలకు బాగుగా ఉపకరించు బదరికాక్షేత్రమున శాస్త్ర దృష్టి గలవారలకు శాశ్వత మగు పరమపదము లభించగలదు.

శ్లో॥ శ్రీ బదర్యాశ్రమం పుణ్యం యత్ర యత్ర స్థితః స్మరేత్॥
సయాతి వైష్ణవం స్థానం పునరావృత్తి వర్జితః॥

అని వరాహపురాణము (141.67) చెప్పినది. పునర్జన్మలేని వైష్ణవస్థానము నొసగగల శక్తిసామర్థ్యములు ఈ క్షేత్రమున గలవు.

పూర్వ మొకసారి తపస్సునకు భాష్యరచనలకు శంకరుడు బదరికాశ్రమమున కొంతకాల ముండెను. రెండవసారి అద్వైతవ్యాప్తికి, అద్వైతపోషణకు మరల రావలసి వచ్చినది. బదరీనారాయణ మందిరసమీపమున శంకరుడు జ్యోతిర్మఠమును స్థాపించెను. ఇచటనే పూర్ణగిరి (పున్నాగిరి) పీఠమునుకూడ ప్రతిష్ఠించెను. జ్యోతీశ్వరుడగు మహాదేవుని మందిరముకూడ కలదు. శారదానదీతీరము నేపాల రాజ్యాంతర్గత మగు పూర్ణగిరి అను పర్వతమున్నది. ఈ పర్వతమును దేవీ

స్వరూపముగా భావింతురు.గిరి అనబడు త్రోటకాచార్యునిఈ మఠమునకు అధిపతినిగా శంకరుడు నియమించెను. ఈ సందర్భమున

శ్లో॥ తృతీయస్తూ త్తరామ్నాయో జ్యోతిర్నామ మఠోభవేత్।
ఆనందవారో విజ్ఞేయః సంప్రదాయో ఽస్య సిద్ధిదః॥

శ్లో॥ పదాని తస్యా ఖ్యాతాని గిరి పర్వత సాగరాః।
బదరికాశ్రమః క్షేత్రః దేవో నారాయణః స్మృతః॥

శ్లో॥ పూర్ణగిరీ చ దేవీ స్యా దాచార్య స్త్రోటకః స్మృతః।
తీర్థం త్వలకనందాఖ్యం ఆనందో బ్రహ్మచార్యభూత్ ॥
తస్య వేదో హ్యథర్వాఖ్య స్తత్రధర్మం సమాచరేత్॥

అను శ్లోకములు మఠామ్నాయ సేతువున గలవు. శంకరుని ఇరువదిమూడవయేట పుష్యపూర్ణిమనాడీ పీఠము ప్రతిష్ఠింపబడెను. ఏడేండ్లతర్వాత మరల వచ్చి జ్యోతిర్మఠమును నెలకొల్పెను. ఇదిభారతదేశమున ఉత్తరభాగముననున్నది. దీనిని శ్రీ మఠమని కూడ పిలతురు. సిద్ధినొసగగల శక్తితోగూడిన ఈసంప్రదాయము పేరు ఆనందవారము. ఈసంప్రదాయము వారికి క్షేత్రము బదరికాశ్రమము. దేవత నారాయణుడు, దేవి పూర్ణగిరి, మొదటి ఆచార్యుడు త్రోటకుడు. వీరికి తీర్థము అలకనంద. బ్రహ్మచారి పేరి నందుడు. అథర్వవేద సంప్రదాయమును కాపాడున దీ మఠము. ఈపీఠసన్యాసుల అంకిత నామములుగా గిరి, పర్వత, సాగరములు చెప్పబడినవి. ఆతరాత

శ్లో॥ హిమాద్రి పార్శ్వే ఽపి తటేరమంతం
సంపూజ్యమానం సతతం మునీంద్రైః।
సురాసురై ర్యక్షమహోరగాద్యైః
కేదారసంజ్ఞం శివ మీశమీడే॥

అని కేదారేశ్వరుని స్తుతించెను.

బదరీనాథుని మూర్తిని టిబెట్‌నుంచి భారతదేశమునకు శంకరుడు తెచ్చెనని ప్రతీతి. టిబెట్‌లో ఆమూర్తి ఉన్నచోటును ఆదిబదరీ అందురు. జ్యోతిర్మఠమునకు ఆరు మైళ్ళ దూరమున తపోవన మున్నది. ఇచట తప్తకుండము కలదు. ఈతపోవనమునకు మూడుమైళ్ళదూరమున విష్ణు మందిర మున్నది. ఈప్రదేశమున భగవానునిమూర్తి సగము వరకే కన్పించును. మిగిలినభాగము ముమ్ముందు పూర్తి కాగలదు గనుక ఈస్థలమును భవిష్యబదరీ అందురు. జ్యోతిర్మఠమున నృసింహ మందిర మున్నది. నృసింహమూర్తి యొక్క ఒక బుజము సన్నగా ఉండును. ఎప్పుడాబుజము విగ్రహమునుంచి ఊడిపడునో అప్పుడు నరనారాయణపర్వతము అడ్డురాగలదని, బదరీనాథమార్గము శాశ్వతముగా మూతపడిపోవునని కథ ఒకటి. అప్పుడు భక్తులు భవిష్యబదరీయాత్ర చేయగలరు. శంకరుడు కేదారమును దర్శించి, గంగోత్రిని చేరెను. సత్యయుగమున ఉపమన్యుడు శంకరుని గూర్చి తపస్సును కేదారమున చేసెనని పురాణవచనము. ద్వాపరమున పాండవు లిచటికి వచ్చిరి. మహిషరూపమును శంకరుడు ధరించినపుడు ఆయన విభిన్నాంగములు ఐదుస్థలము

లలో ప్రతిష్ఠితములైనవని, ఇవి పంచకేదారము లని చెప్పు దురు. కేదారనాథమున వీపు, నేపాలదేశమందలి పశుపతి నాథునిపై శిరస్సు గలది మొదటి కేదారము. నాభిని కల్గిన మదమహేశ్వరము రెండవది. బాహువును కలిగియున్న తుంగనాథము మూడవది. ముఖమున్న రుద్రనాథము నాల్గ వది. జటలతోనున్న కల్పేశ్వరము ఐదవది. కేదారమునగల మందిరముయొక్క జీర్ణోద్ధారమును శంకరుడు గావించె నందురు. ఇచటగల ఉషీమఠమున లలితామందిరము కలదు. కాళీమఠమునగల మందిరములో మహాకాళీ, మహాలక్ష్మి, మహాసరస్వతు లున్నారు. శాకంభరీదేవిని, స్వయంభూ మూర్తిని శంకరుడే ప్రతిష్ఠించె నందురు. భీమా, భ్రామరీ, శతాక్షీ అను మూర్తులను కూడ ప్రతిష్ఠించెను.

తర్వాత శంకరుడు ఆర్యావర్తమున కేతెంచి తూర్పు తీరమునగల పండితులను గెలచి, అద్వైత విజయఘోషను వినిపించి, ఉత్కళదేశమున గల జగన్నాథాలయమును దర్శిం చెను. జగన్నాథపురమున పూర్వము నీలాచలపర్వతము, నీలమాధవమూర్తి ఉండెడివి. ఇప్పు డాపర్వతము లేకున్నను ఆ క్షేత్రమును నీలాచలమని, నీలాద్రిధామ మని అందురు. జగన్నాథ మందిరశిఖరమున గల చక్రమును నీలచక్రమందురు. నేటిజగన్నాథాలయము పదకొండవ శతాబ్దమున పునరుద్ధ రింపబడినది. ఈ ఆలయమునగల త్రిమూర్తులు జగన్నాథ, బలరామ, సుభద్రలు. ఈక్షేత్రమును జగన్నాథపురి, శ్రీక్షే త్రము, శంఖక్షేత్రము, పురుషోత్తమపురి, అని వ్యవహ

రింతురు. ఇచట గల విమలాదేవి మందిరము శక్తిపీఠము. శంకరు డీప్రదేశమున గోవర్ధనపీఠమును నెలకొల్పెను. ఇట పద్మపాదుని అధిపతిగా నియమించెనని గురువంశకావ్యము (3.59-60). శంకరుని ఇరువదినాల్గవయేట వైశాఖశుద్ధ దశమినా డీపీఠము ప్రతిష్ఠింపబడెను.

శ్లో॥ పూర్వామ్నాయో ద్వితీయః స్యాద్గోవర్ధన మఠఃస్మృతః।
భోగవారః సంప్రదాయో వనారణ్యే పదేస్మృతే॥

శ్లో॥ పురుషోత్తమంతు క్షేత్రం స్యా జ్జగన్నాథోఽస్య దేవతా।
విమలాఖ్యాహి దేవీస్యా దాచార్యః పద్మపాదకః॥

శ్లో॥ తీర్థం మహోదధిః ప్రోక్తం బ్రహ్మచారీ ప్రకాశకః।
ఋగాహ్వాయ స్తస్య వేద స్తత్ర ధర్మం సమాచరేత్॥

అని మఠామ్నాయసేతువున గలదు. భారతదేశమున తూర్పు భాగమున గోవర్ధనమఠము ప్రతిష్ఠింప బడినది. భోగవార సంప్రదాయమైన ఈమఠమున సన్యాసుల అంకితనామములు వన, ఆరణ్య శబ్దములు. ఈమఠమునకు క్షేత్రము పురుషోత్తమము, దేవత జగన్నాథుడు, దేవి విమల. మొదటి ఆచార్యుడు పద్మపాదుడు. ఇచట తీర్థము మహాసముద్రము. బ్రహ్మచారి, పేరు ప్రకాశకుడు. ఈమఠము ఋగ్వేదమును పోషించునది. జ్యోతిర్మఠ స్థాపన ఐన వెంటనే గోవర్ధన మఠమును ప్రతిష్ఠించి, జగన్నాథాష్టకముతో దేవుని స్తుతించి శంకరుడు దక్షిణ భారతమున కేతెంచెను.

శ్లో॥ కదాచిత్ కాళిందీతటవిపిన సంగీతక రవో
ముదాఽఽభీరీనారీవదన కమలాస్వాదమధుపః।
రమాశంభుబ్రహ్మాఽమరపతిగణేశార్చితపదో
జగన్నాథః స్వామీ నయనపథగామీ భవతు మే॥

తా॥ పరమాత్మ ఒకప్పుడు లీలామానుషవిగ్రహుడై కాళిందీ పులిన మందు విరాజిల్లు విపినమధ్యమున సంగీతరసానంద సాగరమున నోలలాడుచుండును; మరొకప్పుడు సానందముగ ఆభీరయువతీ ముఖాంభోజ మకరందపాన మొనర్చునట్టి మత్త భృంగమై విరాజమానుడయి యుండును; మరికొన్ని వేళలందు లక్ష్మి, బ్రహ్మ, రుద్ర, ఇంద్ర, గణేశాది దేవతాగణముచే సమర్చితపాదాంభురుహుడై తేజరిల్లుచుండును. అట్టి జగన్నాథుడు, స్వామియు, నగు పరమాత్మ సర్వదా నా నయనపథ ములం దుండుగాక!

శ్లో॥ భుజే సవ్యే వేణుం శిరసి శిఖిపింఛం కటితటే
దుకూలం నేత్రాంతే సహచరకటాక్షం విదధతే।
సదా శ్రీమ ద్బృందావనవసతిలీలాపరిచయో
జగన్నాథః స్వామీ నయనపథగామీ భవతు మే॥

తా॥ జగములకు ప్రభువైన ఆ దేవదేవుడు సవ్యహస్తమున వేణువును, మౌళియందు శిఖిపింఛమును, కటిప్రదేశమున పీతాంబరమును ధరించి, నేత్రాంతములతో చెంతనున్న గోప గోపికాబృందముపై క్రీగంటిచూపులను ప్రసరింపజేయుచు, విభ్రాజితతేజస్కుడై వరలుచుండును. శోభావిలసిత మైన బృందావనమును ఆయన తన లీలావిహారభూమిగ జేసికొని

విహరించుచుండును. అట్టి జగన్నాథుడు, స్వామియు నగు పరమాత్మ సర్వదా నా నయన పథము లందుండుగాక!

శ్లో॥ మహాంభోధే స్తీరే కనకరుచిరే నీలశిఖరే
వసన్ ప్రాసాదాంత స్సహజబలభద్రేణ బలినా।
సుభద్రామధ్యస్థః సకలసుర సేవావసరదో
జగన్నాథః స్వామీ నయనపథగామీ భవతు మే॥

తా॥ ఆ జగదేకారాధ్యుడు సముద్రతీరమున సువర్ణకాంతిచ్ఛటలతో నొప్పారు నీలాద్రిశిఖరముపై మహాబలియు, సహజన్ముడు నగు బలరామునితో గూడి ప్రాసాదాంతమున నధివసించుచు, సహోదరి యగు సుభద్రాదేవిని మధ్య నిడుకొని, సకలదేవతారాధ్యుడై వెలుగొందుచుండును. అట్టి జగన్నాథుడు, స్వామియు నగు పరమాత్మ సర్వదా నా నయన పథములందుండుగాక !

శ్లో॥ కథాపారావారః సజలజలదశ్రేణిరుచిరో
రమావాణీరామస్ఫురదమలపద్మేక్షణముఖైః।
సురేంద్రై రారాధ్యః శ్రుతిగణశిఖాగీతచరితో
జగన్నాథః స్వామీ నయనపథగామీ భవతు మే॥

తా॥ ఆ పరమాత్మ యొక్క చరితము అపారసాగరగభీరము. ఆయన మూర్తి సజల జలదపంక్తుల కాంతిస్ఫురణముతో నొప్పారుచు అనంతత్వ, అమేయత్వాది గుణములను ద్యోతనము చేయునట్టిది. లక్ష్మీసరస్వతులతో నభిరాము డాజగన్నాథుడు. చక్కగా వికసించిన పద్మములను బోలు నేత్ర

ములతో విలసిల్లు ముఖములతో నొప్పారునట్టి సురేంద్రులచే నారాధితుడా జగన్మోహనమూర్తి. శ్రుతిశిరస్సీమంతముక్తా మణులయిన ఉపనిషన్మహావాక్యములచే గీయమానచరితుడు ఆ పరమాత్మ. అట్టి జగన్నాథుడు, స్వామియు నగు పరమాత్మ సర్వదా నా నయనపథములం దుండుగాక!

శ్లో॥ రథారూఢో గచ్ఛన్ పథి మిలితభూదేవపటలైః
స్తుతిప్రాదుర్భావం ప్రతిపద ముపాకర్ణ్య సదయః।
దయాసింధు ర్బంధు స్సకలజగతాం సింధుసుతయా
జగన్నాథః స్వామీ నయనపథగామీ భవతు మే॥

తా॥ దయాంభోనిధి, సకలలోకబంధువునగు ఆ పరమేశ్వరుడు రథోత్సవసమయమున, భూసురసంఘములు మార్గమునందు చేయు వేద స్తుతిని ప్రతిపద మాకర్ణించుచు దయాంతరంగుడై సింధుకన్యయగు లక్ష్మీదేవితో కూడి రథారూఢుడై విరాజిల్లుచుండును. అట్టి జగన్నాథుడు, స్వామియు నగు పరమాత్మ సర్వదా నా నయనపథములం దుండుగాక!

శ్లో॥ పరబ్రహ్మాపీడః కువలయదళోత్ఫుల్లనయనో
నివాసీ నీలాద్రౌ నిహితచరణోఽనంతశిరసి।
రసానందో రాధాసరసవపురాలింగనసుఖో
జగన్నాథః స్వామీ నయనపథగామీ భవతు మే॥

తా॥ పరబ్రహ్మ శిరోభూషణముగా దాల్చిన రత్న మా జగన్నాథుడు; వికసితోత్పల నయనాభిరాముడాయన; నీలాద్రిశిఖరమాయన నివాసస్థలము; ఆయనపదములు అనంతుని (కాళిందీయఫణి)

శిరముపై నర్తించుచుండును; బ్రహ్మానందరసమూర్తి ఆ పరమాత్మ; రాధికా శరీరాలింగన సుఖానుభవ తన్మయమూర్తి ఆ పరబ్రహ్మ. అట్టి జగన్నాథుడు, స్వామియు నగు పరమాత్మ సర్వదా నా నయనపథములం దుండుగాక!

శ్లో॥ న వై ప్రార్థ్యం రాజ్యం న చ కనకతాం భోగవిభవం
న యాచేఽహం రమ్యాం నిఖిలజనకామ్యాం వరవధూమ్,
సదా కాలే కాలే ప్రమథపతినా గీతచరితో
జగన్నాథః స్వామీ నయనపథగామీ భవతు మే॥

తా॥ హే అనాథనాథా! నేను రాజ్యమునుగాని, సువర్ణాద్యాభరణములను గాని, భోగభాగ్యములను గాని, కాంక్షించను. సమస్తజనులచే నభిలషింపదగినట్టియు, సౌందర్యవతియు, ఉత్తమశీలసంపన్నయు నగు స్త్రీని యాచింపను. ప్రమథనాథుడగు పరశివునిచే నిరంతరము త్రికాలములందు గీయమాన చరితము గల జగన్నాథుడు, స్వామియు నగు పరమాత్మ నా నయనపథములం దుండుగాక !

శ్లో॥ హర త్వం సంసారం ద్రుతతర మసారం సురపతే ।
హర త్వం పాపానాం వితతి మపరాం యాదవపతే ।
అహో ! దీనానాథం నిహిత మచలం నిశ్చితపదం
జగన్నాథః స్వామీ నయనపథగామీ భవతు మే॥

తా॥ హే సురపతే ! నిస్సారము, శోకసంకులము నగు ఈ భవసాగరమునుండి వెంటనే కడతేర్పుము. హే యాదవపతే ! నా పాపసందోహమును పటాపంచలు చేసి నన్నుద్ధ

రింపుము. అహో ! హేదీననాథ ! దీనుడ నగు నా మనము నిశ్చితము, నిత్యము నగు నీ కైవల్యపదమునందే నిశ్చలమై నిరూఢమై యున్నది. జగన్నాథుడు, స్వామియు నగు పరమాత్మ నా నయనపథములం దుండుగాక !

తుంగభద్రాతీర మందలి శృంగగిరిపై విభాండకముని నివసించెడివాడు. ఆయన పూజించిన శివలింగము ఆయనదని చెప్పబడు సమాధిమీద ఉన్నది. దీనినే మలహానికరేశ్వర లింగమని నేడందురు. విభాండకుని పుత్రుడు ఋష్యశృంగుడుకూడ ఇచటనే వసించెడివాడు. ఋష్యశృంగుని పుణ్యపాదము లెచట ఉండగలవో అచట సరియైన వర్షములు కురియగలవని, ఆదేశము సుభిక్షము కాగలదని రోమపాదుడు వినెను. తనరాజ్యమున అనావృష్టి ఉండుటచే రోమపాదుడు ఋష్యశృంగుని ఆహ్వానించెను. ఆయన రాజ్యమును ప్రవేశింపగనే వర్షములు కురియసాగెను. అప్పుడు తన కుమార్తె యగు శాంతాదేవిని, ఆయన కిచ్చి వివాహము చేసెను. తర్వాత భార్యతోకూడి అయోధ్యకేగి, దశరథుని పుత్రకామేష్టిని నిర్విఘ్నముగా పూర్తిచేయించి, తిరిగి శృంగగిరికి వచ్చినాడు.

శృంగగిరి పర్వతమునకు ప్రాచీననామము వరాహపర్వతము. ఈకొండనుంచి తుంగ, భద్ర, నేత్రవతి,వారాహి అను నదులు బయలుదేరుచున్నవి. ప్రాచీనకాలమున విభాండకాశ్రమమున్నచోట నేటి శృంగేరీ క్షేత్ర మున్నది. వరాహ

పర్వతమున బయలుదేరునది వారాహి. వరాహపర్వతమున కధిష్ఠాన దేవత ఆదివరాహుడు.

శంకరు డిచట ఆశ్చర్యకర మగు ఘటనలను చూచి నాడట! సాయంత్రపు సూర్యుడు భయంకర మగు వేడిని కలుగజేయు చుండెను. అప్పు డొక కృష్ణసర్పము గొడుగువలె పడగవిప్పి ఒక కప్పను రక్షించుచుండెను. ఆస్థలము నేటికిని "కప్పెశంకర"మని ప్రసిద్ధి చెందియున్నది. ఈ సన్నివేశము లకు గుర్తుగా ఆచోట ఒక శివలింగమును ప్రతిష్ఠించి రని, అదే నే డక్కడ కన్పించు శివలింగమని చెప్పుదురు. ఇట్టి మహత్తర శక్తిసంపదగల ప్రదేశము ప్రశాంత వాతావరణ ముతో నుండుటచే విద్యావ్యాసంగమునకు, తపస్సునకు చాల ఉచితమగు స్థలమగుచున్నది. అద్వైతమును సుప్రతిష్ఠితము గావించి, ప్రచారము చేయుటకు ప్రశాంత పరిస్థితు లిచట గలవు గనుక శృంగేరీమఠమును వ్యాఖ్యానసింహాసన మని నారు. అనేక మఠములకు ఇచటనుంచి యతీశ్వరులు వెడలిరి.

శ్రీచక్రమును నిర్మించి, దానిపై శారదాదేవిని శంక రుడే ప్రతిష్ఠించెను. సర్వవేదాంతార్థ ప్రకాశిని, బ్రహ్మ విద్యాస్వరూపిణి, అగు శ్రీశారదాదేవి అనేక పేర్లతో ప్రసిద్ధిచెందినది. ఈ శారదాపీఠము ద్వారకలోని శారదా పీఠము ఒకటిగావు. శృంగేరిలోని శారద సర్వజ్ఞపీఠమున పూర్వము ప్రతిష్ఠితమై యున్న శారద. ద్వారకలోని శారద విద్యాస్వరూపిణి. ఆమ్నాయోపనిషత్తు ననుసరించి శృంగేరి

పీఠమున గల శక్తిని కామాక్షి అని పిలువవలెను. కాని ఇచటి శక్తిని శారద అని వ్యవహరింతురు. శృంగేరీ శారదా మఠమున నేటిదాకాకూడ కామేశ్వర విగ్రహమునకు, కామేశ్వరీమూర్తికి పూజలు జరుగుచున్నవి. ఇవి ఇచటి ముఖ్యమూర్తులు. కామాక్షియే కామేశ్వరి యని, వాగ్దేవి యని కొన్నిచోట్ల చెప్పబడినది, "గంధమాదన పర్వతముపై కామాక్షీరూపమున పరాశక్తి కలద"ని దేవీభాగవత, మత్స్య పురాణము లన్నవి. రామేశ్వరమునకు ప్రాచీననామము గంధమాదనము.

శృంగేరీ మఠమునకు తుంగానది తీర్థనది. స్థలము శృంగేరి, క్షేత్రము రామేశ్వరము, శక్తి శారద, దేవత మల హానికరేశ్వరుడు, వరాహమూర్తి. శృంగేరీ మఠమున కధిపతిగా సురేశ్వరుడు నియమింపబడెను.

శ్లో॥ శ్రీ చంద్రమౌలీశ్వర లింగమస్మై
సద్రత్నగర్భం గణనాయకంచ।
స విశ్వరూపాయ సుసిద్ధదత్తం
దత్త్వా న్యగాదీ చ్చిర మర్చయేతి॥

అని గురువంశకావ్యము (3.33) చెప్పుచున్నది. సుసిద్ధుడగు గోవింద భగవత్పాదు డొసగిన చంద్రమౌళీశ్వర లింగమును, రత్నగర్భగణాధిపతిని శంకరుడు సురేశ్వరున కిచ్చెను.

శంకరుని ఇరువదియైదవయేట పుష్యపూర్ణిమ నాడీపీఠము ప్రతిష్ఠింపబడెను. నాలుగుపీఠములలో నిది చివరది.

శంకరుని ఆయుర్దాయము ముప్పది రెండు సంవత్సరములే అని చెప్పుటచే, శృంగేరీపీఠ ప్రతిష్ఠతర్వాత శంకరు డేడేండ్లే జీవించెను. కనుక ఇచట పండ్రెండేండ్లుండె ననుట అబద్ధము.

కాళికాపీఠమని, శారదాపీఠమని పిలువబడిన ద్వారకా మఠమునగల శక్తి భద్రకాళి. బదరీ పీఠమునగల శక్తి పూర్ణగిరి. జగన్నాథపీఠమున వృషలాశక్తి ఉన్నది. శృంగేరిలో ఉన్నది శారద. కాని ఆమ్నాయోపనిషత్తును అనుసరించి శృంగేరిలో గల శక్తి కామాక్షి. ధాన్యకటక ప్రాంతమున బయలుదేరిన వజ్రయాన బౌద్ధము తాంత్రిక ప్రధానము. ఓడ్యాణ మనబడిన వజ్రయానమున కురుకుల్లా, తారా, చాముండీ. ఛిన్నమస్తా, వాశులీ, ఉగ్రతారా, కాళీ, భద్రకాళి మున్నగు శక్తిస్వరూపములు కన్పించుచున్నవి. సాధనమాల అను బౌద్ధ గ్రంథమున తారాదేవి స్తవము కలదు. ఇందులో తార, ఉమ, పద్మావతి, వేదమాత అనునవి పర్యాయపదములుగా వాడబడినవి. మంజుశ్రీయొక్క పరిణామములే బాలా, భువనేశ్వరీ శబ్దములుగా కన్పించ సాగినవి. శాంకరపీఠములలో కూడ శక్తి ఉండుట గమనింపదగినది. హేవజ్రతంత్రమున ఏడవ పటలములో

శ్లో॥ పీఠం జాలంధరం ఖ్యాతం ఓడియానం తథైవచ।
పీఠం పూర్ణగిరిం చైవ కామ రూపం తథైవచ॥

అని ఉన్నది. జాలంధర, ఓడియాన, పూర్ణగిరి, కామరూప పీఠములు చెప్పబడినవి. బదరిలో శంకరుడు నిర్మించిన జ్యోతిర్మఠములోని శక్తి పూర్ణగిరి. లలితాసహస్రనామస్తోత్రమున

శ్లో॥ శృంగార రససంపూర్ణా జయా జాలంధరస్థితా।
ఓడ్యాణపీఠ నిలయా బిందుమండలవాసినీ॥

అని కలదు. జాలంధరపీఠమున, ఓడ్యాణపీఠమున గల పరాశక్తి లలిత. బౌద్ధులు చెప్పిన శక్తియొక్క రూపములు వైదికమతానుయాయులు పల్కిన వాటికంటె విలక్షణములు కావని తేలుచున్నది. శంకరుడు ప్రపంచ సారతంత్రమను గ్రంథమును రచించెను గనుకనే ఆయా ప్రదేశములలో శ్రీచక్రప్రతిష్ఠలు చేసెనని శంకర విజయములు చెప్పసాగినవి.

బౌద్ధుల పీఠములు నాలుగు. జాలంధర, ఓడియాన పూర్ణగిరి, కామరూపము లని వీటిపేర్లు. బౌద్ధులీపీఠములను నాలుగు దిక్కులలో స్థాపించిరి. బౌద్ధుల నోడించిన శంకరుడు గూడ నాలుగుదిక్కులలో నాలుగు పీఠములనే ప్రతిష్ఠించెననుటకు బౌద్ధులు చనిన మార్గ మున్నది. జాలంధరపీఠమును వదలివేసి, కాశ్మీర సర్వజ్ఞపీఠమును వశబరచుకొని, శృంగేరిలో శారదాదేవిని ప్రతిష్ఠించెను. పూర్ణగిరిని అట్లే ఉంచి జ్యోతిర్మఠమును నెలకొల్పెను. ఓడియాన పీఠము అనవసరమగుటచే, బౌద్ధాక్రాంతమైన జగన్నాథమున నొకపీఠమును నిల్పెను. కామరూపపీఠము జ్యోతిర్మఠములో నంతర్భాగమైనది.

బౌద్ధులు కాంచి, ధాన్యకటకము, పూరి, నాలంద, వలభి అను ప్రదేశములను తమ ప్రధాన విహారములకే గాక, అధ్యయనమునకు కూడ ఏర్పాటుచేసికొనిరి. ఇవి విద్యాలయములు. మహాయాన వజ్రయానములలోవలె శంకరుడుగూడ తను స్థాపించిన మఠములను వ్యాఖ్యాన సింహాసనములుగా రూపొందింప జేసినాడు. ప్రధాన బౌద్ధకేంద్రము లున్నస్థలములలో గాని, వాటికి సమీపమునగాని శంకరుడు తనమఠములను ఏర్పరచెను. అందువలననే ఒకరిది పూర్ణగిరిపీఠమైనచో, ఇంకొకరి పీఠమున పూర్ణగిరి అను శక్తి ఉన్నది.

కంచి గొప్ప బౌద్ధకేంద్రమేగాక ఇచటినుంచి తయారైన ఆచార్యులు నాలందా విక్రమశీల మొదలగు విశ్వవిద్యాలయములలో అధ్యాపకులుగా చేసిరి. కంచిలోని బౌద్ధులే చీనా, కొరియా, జపాన్‌లకు కూడ పోయి మత ప్రచారము గావించిరి. ఇచటి ధర్మపాలుడు నాలందాలో అధ్యాపకుడు. మాగధ రాకుమారుడగు ధ్యానభద్రుడు, కాంచి రాకుమార్తె కొరియాదేశమున బౌద్ధమత ప్రచారము గావించిరి.

ఉత్తరమున లుంబిని, బోధగయ, సార్నాథ్, కుశీనర, శ్రావస్తి సాంకాశ్య, రాజగృహ, వైశాలి, సాంచి, నాలంద, కాశ్మీరములు బౌద్ధకేంద్రములుగా ఖ్యాతి గన్నవి. బౌద్ధుల పూర్ణగిరిని స్వాధీనము చేసికొని బదరిలో జ్యోతిర్మఠమును నెలకొల్పి అచట పూర్ణగిరి అను శక్తిని ప్రతిష్ఠినవాడుంచి

శంకరుడు. సార్నాథ్‌కు ప్రతిగా కాశీవిశ్వనాథుడు పునరుద్ధరింప బడెను. కాశ్మీరమున శంకరాచార్యగిరి వెలసినది. అచటి సర్వజ్ఞ పీఠారోహణము బౌద్ధుల పరాజయమునకు సూచకము. దక్షిణమున కాంచీనగరమున శివ, విష్ణువుల ప్రతిష్ఠలను జరిపి, అచటి శక్తిని పునరుద్ధరించి, వైదిక మతమునకు దృఢతరమైన పునాదులను వేసినాడు.

పశ్చిమమున జునాగఢ, ధాంక్, సిద్ధసార, తెలలాజా, సానాహా, వలభి, భుజ, కొండనె, అజంట, నాశిక్, జున్నార్ కార్లె, కన్హేరీలు గొప్పబౌద్ధకేంద్రములు. నాసిక్ సమీపమునగల త్ర్యంబకేశ్వరుని,అజంటా సమీపముననున్న ధిషణేశ్వరలింగమును, వలభి ప్రాంతమునగల సోమనాథుని శంకరుడు స్తుతించెను. ఈ బౌద్ధకేంద్రముల కన్నింటికి మధ్యబిందువు వంటిదగు ద్వారక పౌరాణిక ఖ్యాతి నంది యుండుటచే శంకరుడిచట శారదా పీఠమును నెలకొల్పెను.

దక్షిణ దేశమున నాగార్జునకొండ, ధాన్యకటకము, శ్రీశైలము, తిరుమలకాంచి అనునవి ముఖ్యమగు బౌద్ధకేంద్రములు. శ్రీశైలమునకు శంకరుడు పోయి అచటిభ్రమరాంబను స్తుతించినట్లు శంకరవిజయము లన్నియు చెప్పుచున్నవి. కాంచీనగరము బౌద్ధుల కెట్టిస్థానమో తెలసికొనినాము. శంకరుడిచట కామాక్షీశక్తిని పునఃప్రతిష్ఠ గావించి శ్రీచక్రమును ప్రతిష్ఠించెనని కొందరు చెప్పుచున్నారు. శృంగేరితో బౌద్ధుల కెట్టి సంబంధమును కనింపదు. కాని విద్యాంసులను, యతులను

తయారుచేయుటకు కావలసిన వాతావరణముగల పుణ్య స్థలము శృంగేరి. ఒకవిధముగా దక్షిణదేశమున కంతకు శృంగేరి ఒక కేంద్రమువంటిది.

శృంగేరీపీఠమున శంకరుడు గావించిన శారదాప్రతిష్ఠను గూర్చి శంకరవిజయములు కొన్నికథల నల్లినవి.

శ్లో॥ దుర్వాస శాపతో భూమౌ జాతాం వాణీం విజిత్యతామ్॥ 39

శ్లో॥ అగస్త్య చరితే దేశే తుంగాతీరే సునిర్మలే।
పుణ్యక్షేత్రే ద్విజవరస్థాపయిత్వా సుపూజయ॥ 40

శ్లో॥ యత్రాస్తే ఋష్యశృంగస్య మహర్షే రాశ్రమోమహాన్।
కలావపి తతో ఽద్వైత మార్గః ఖ్యాతో భవిష్యతి॥ 41

అని శివరహస్యమున నవమాంశలో పదునారవఅధ్యాయమున కలదు. ఇవేశ్లోకములు మాణిక్యవిజయమున (47-49) కూడ కలవు. వాణి దుర్వాసుని శాపమువలన భూలోకమున జన్మించినది. ఆమెను జయించి అగస్త్యుడు నడచిన దేశముద్వారా తుంగభద్రాతీరము వరకు తీసికొనిపోయి అచట ఋష్యశృంగుని ఆశ్రమమున నిలపి పూజింపవలెనని శంకరునకు ఆదేశము ఇవ్వబడినది.

వాణియే మండనుని భార్యగా జన్మించెనని, ఆమెపేరు ఉభయభారతి లేక సరసవాణి అని, శంకర మండనుల వాదములో ఆమెయే మధ్యవర్తిగా ఉండెనని, చివరకు ఆమెతో శంకరుడు కామశాస్త్రమున వాదించి గెలచెనని శంకరవిజయములు పల్కుచున్నవి.

శృంగపురసమీపే తుంగభద్రాతీరే చక్రం నిర్మాయ తదగ్రే సరస వాణీం నిధాయ ఏవమాకల్పం స్థిరా భవ. మదాశ్రమే ఇత్యాజ్ఞాప్య నిజ మఠం కృత్వా తత్ర విద్యాపీఠనిర్మాణం కృత్వా భారతీ సంప్రదాయం నిజశిష్యం చకార

అని ఆనందగిరి 62 వ ప్రకరణమున చెప్పినాడు. ఈమె ఓడి మాయమగుచుండగా శంకరుడామెను వనదుర్గామంత్రముతో బంధించి శ్రీచక్రమున ప్రతిష్ఠించి కల్పాంతము దాక తన ఆశ్రమమున ఉండునట్లు మఠమును విద్యాపీఠమును శంకరుడు నిర్మించెనట.

శృంగేరిలోని శారదాప్రతిష్ఠవిషయమై గురువంశ కావ్యము చెప్పుకథలో కొంతసత్యమున్నది. శంకరుడు కాశ్మీర మున సర్వజ్ఞపీఠము నధిరోహించ బోవుసమయమున ఒక అశరీరవాణి తనతో వాదముచేసి గెలచిన తర్వాతనే పీఠా రోహణము చేయుమని పల్కినది (3.26). అన్ని శాస్త్రము లలోను ఓడినతర్వాత దేవత కామశాస్త్రమున ప్రశ్నించినదట (3.27). ఆమెవాదమున ఓడిపోయి వరమును కోరుకొమ్మనగా

శ్లో॥ యాచే స హైవాంబ మయాగమంతే।
శ్రీ ఋష్యశృంగాశ్రమ ఇత్యగాదీత్॥ (3.30).

తనవెంట ఋష్యశృంగాశ్రమమునకు రమ్మని ఆతల్లిని ప్రార్థిం చెను. అప్పుడామె అంగీకరించెనని గురువంశ కావ్యము శార దను కాశ్మీరమునుంచి తెచ్చినట్లుచెప్పుచున్నది.

శ్లో॥ ఆలోక్య శారదాం దేవీం యత్ర సంప్రాప్యతే క్షణాత్।
తరంగిణీ మధుమతీ వాణీచ కవిసేవితా॥

అని రాజతరంగిణిలో (1.37) గలదు. శారదాదేవిని దర్శించ బోవునపుడు మధుమతి, సరస్వతి అను నదులు తటస్థపడగలవు. కిషన్ గంగలోయలో '74°.15' రేఖాంశమున, '34°.48' అక్షాంశముపై శర్ది అను ఊరు గలదు. శారదాస్థానము అచటి కొండపై గలదు. దాని దిగువన కిషన్‌గంగ, మధుమతి నదుల కలయిక ఉన్నది. కొయ్యతో చేసిన విగ్రహ మిచట గలదని అల్బెరూనీ వ్రాసినాడు. ఈశారదాస్థానము కాశ్మీరపు ఉత్తర సరిహద్దున గలదని దేశవ్యవస్థ చెప్పుచున్నది.

శర్ది గ్రామమునకు అభిముఖముగా సరస్వతి అనబడిన 'కనకతోరి' నది గలదు. అల్బెరునీ ప్రకారము దారునిర్మితమైన శారదా విగ్రహమును దర్శించెను. ఆ విగ్రహమును పూజించుటకు అనేక యాత్రికులు పోవుచుండెడివారు. ప్రతి నెల శుద్ధఅష్టమి నాడీఆలయము కంపించుచుండునని అబుల్ ఫజల్ వ్రాసెను. ఈమెను దర్శించువారు పశువును బలిఈయవలెనని శారదామాహాత్మ్య గ్రంథము తెల్పుచున్నది. అనగా ఈమె శక్తిస్వరూపము.

ప్రాచీనకాలమున ఘోష యనబడిన నగరమే నేటి గుష్. ఇది హామల్ అని పిలువబడుచున్న శ్యామలా పరగణమునకు దగ్గరగా కలదు. గుష్ గ్రామమున కామిల్ నదీతీరమున గల రంగవాటినుంచి పోయి, తేజవనమును చేరి,

తర్వాత శారదామందిరమును చేరవచ్చును. భాద్రపదశుద్ధ చతుర్థినాడు బయలుదేరి, అష్టమికి ఇచటకు యాత్రికులు వత్తురు. దగ్గరనే గణేశఘాటి అనబడు గణేశగిరి ఉన్నది.

మధుమతీ నదీతీరమున ఎత్తైన ప్రదేశమున శారదా మందిరము కలదు. మందిరమున ఏడడుగుల పొడవు, ఆరడుగులవెడల్పుగలరాయి పరచబడి యుండును. దీని క్రిందనొక కుండము గలదని, ఇందు శాండిల్యునకు శారద దర్శన మిచ్చెనని చెప్పుదురు.

పరకాయప్రవేశాది గాథను మనము అంగీకరించినను, అంగీకరించకున్నను, శారదాదేవిని కాశ్మీరము లోని శారదా స్థానమునుంచి శంకరుడు తెచ్చెనని చెప్పవచ్చును. దారువుతో నిర్మింపబడిన విగ్రహము నొకదానిని శారదాస్థానమునుంచి, కాశ్మీరపు ఉత్తర సరిహద్దునుంచి, శంకరుడు భక్తిపూర్వకముగా, వాత్సల్యపూర్వకముగా శృంగేరికి తెచ్చెను. కృష్ణగంగ, మధుమతీ సరస్వతీ నదుల కూడలివద్ద గల శారదను తనతపోశక్తితో ఆకర్షించి ఋష్యశృంగాశ్రమమునుపవిత్రము చేయుటచే శృంగేరిలోని శారదాపీఠమునగల శక్తి అనాది సిద్ధము. కాశ్మీరమున గల శారదాస్థానము వద్ద సరస్వతినది కలదు. దీనిని 'కనకతోరి' అని నేడు అందురు. బహుశః శంకరుడు చేసిన కనకధారా స్తుతి ఈ నదిని గురించి కావచ్చును. ఈ నదీప్రవాహమున బంగారము దొరకెడిదని కల్హణుడనుటచే ఈనదిని ఉద్దేశించియే శంకరుడు స్తోత్రము చేసెనను

పీలున్నది. చిద్విలాసీయ శంకరవిజయవిలాసమున శృంగేరీ పీఠమును గూర్చి ఈ శ్లోకములు చెప్పబడినవి.

శ్లో॥ అంగం హరేః పులకభూషణ మాశ్రయంతీ
భృంగాంగనేవ ముకుళాభరణం తమాలమ్।
అంగీకృతాఖిల విభూతి రపాంగలీలా
మాంగల్యదాఽస్తు మమ మంగళదేవతాయాః॥

తా॥ శ్రీహరియురము పులకాంచితమై మొగ్గలు తొడిగిన తమాలవృక్షము వలె నొప్పారుచుండును. అట్టియెడ సకలవిభవాన్వితయైన శ్రీమహాలక్ష్మియొక్క అపాంగరేఖ భృంగాంగన వోలె ఆ దేవదేవుని యురము నాశ్రయించి తిరుగాడుచుండును. మంగళదేవతారూపిణియైన జగన్మాతయొక్క అట్టి కడగంటి చూపు నాకు సదామంగళమును ప్రసాదించుగాక!

శ్లో॥ ముగ్ధాముహు ర్విదధతీ వదనే మురారేః
ప్రేమత్రపాప్రణిహితాని గతాగతాని।
మాలాదృశో ర్మధుకరీవ మహోత్పలే యా
సా మే శ్రియం దిశతు సాగరసంభవాయాః॥

తా॥ శ్రీహరి వదనము వికసితపద్మనిభమై యొప్పారుచుండ సింధుకన్య యగు శ్రీమహాలక్ష్మియొక్క దృక్ శ్రేణి మధుకరాంగన వలె విరాజితమై యుండును. ఆ తల్లి ప్రేమ ముగ్ధయై మాటిమాటికి హరివదనాంభోరుహమును వీక్షింప నపాంగప్రసారమున కుద్యుక్త యగుచుండగా, త్రపావనతయై వెనుకకు మరలుచున్నదా యను దృష్టి. ప్రేమత్రపాప్రణిహిత

మైన ఆ తల్లి యొక్క యపాంగవీక్షణము నాకు సిరులను ప్రసాదించుగాక !

శ్లో॥ విశ్వామరేంద్రపదవిభ్రమదానదక్ష
మానందహేతు రధికం మురవిద్విషోఽపి।
ఈష న్నిషీదతు మయి క్షణ మీక్షణార్ధ
మిందీవరోదరసహోదర మిందిరాయాః॥

తా॥ సకలదేవతాసంఘమునకు పదవుల నొసగుటలో దక్షత కలదియు, మురారియగు శ్రీహరికి అధికానందసంధాయికయు, కాంతియందు నల్లకలువల తోబుట్టువు నగు శ్రీమహాలక్ష్మి యొక్క అర్ధనిమీలిత వీక్షణము నాయందు కొంచెము ప్రసరించుగాక !

శ్లో॥ ఆమీలితాక్ష మధిగమ్య ముదా ముకుంద
మానందకంద మనిమేష మనంగతంత్రమ్।
ఆకేకరస్థిత కనీనికపక్ష్మనేత్రం
భూత్యై భవే న్మమ భుజంగశయాంగనాయాః॥

తా॥ ఆ జగజ్జనని ఆనందనిమీలితాక్షుడైన ముకుందుని దెస ఆనందకందమై, నిర్నిమేషమై, మన్మథభావస్ఫోరకము నైన దృష్టితో వీక్షించుచుండును. ఆ శేషశయనుని యిల్లాలు ఆకేకరస్థితమై, అనగా అర్ధనిమీలితమై యున్న కనీనికల తోను, పక్ష్మములతోను ఒప్పారునట్టి నేత్రములతో విరాజ మానయై యుండును. అట్టి తల్లి యొక్క కడగంటిచూపు నాకు ఐశ్వర్యప్రదాయిని యగుగాక !

శ్లో॥ బాహ్వాంతరే మధుజిత శ్శ్రితకౌస్తుభే యా
హారావళీవ హరినీలమయీ విభాతి।
కామప్రదా భగవతోఽపి కటాక్షమాలా
కల్యాణ మావహతు మే కమలాలయాయాః॥

తా॥ మధుసూదనుడగు శ్రీమహావిష్ణువు యొక్క యురః స్థలమునందు కౌస్తుభమణి కాంతులీనుచు ఒప్పారుచుండును. భగవంతుని కోర్కెలను గూడ నీడేర్పగల శ్రీదేవి క్రీగంటి చూపు ఇంద్రనీల మణిగ్రథితహారము వలె కౌస్తుభమణి ప్రోల్లసితమైన శ్రీహరి యురమున లగ్నమై తేజరిల్లుచుండును. అట్టి కమలాలయ యగు శ్రీమహాలక్ష్మియొక్క కరుణాకటాక్షము నాకు కళ్యాణమును కలుగజేయునుగాక!

శ్లో॥ కాలాంబుదాళిలలితో రసి కైటభారేః
ధారాధరే స్ఫురతి యా తటిదంగనేవ।
మాతు స్సమస్త జగతాం మహనీయమూర్తిః
భద్రాణి మే దిశతు భార్గవనందనాయాః॥

తా॥ కైటభాసురసంహర్త యగు శ్రీహరి యురము కాలాంబుదశ్యామమై, లలితమై విలసిల్లుచుండును. శ్రీమహాలక్ష్మి శ్రీహరి హృదయమునందు నీలజలదము మధ్య, విద్యుల్లేఖ వలె మెఱుపు లీనుచు ప్రకాశించుచుండును. అఖిల జగన్మాత యొక్క మూర్తి మహనీయమైనట్టిది. అట్టి భార్గవనందన యొక్క మహిమాన్వితమైనమూర్తి నాకు భద్రముల నొసగుగాక!

శ్లో॥ ప్రాప్తం పదం ప్రథమతః ఖలు యత్ప్రభావాత్
మాంగల్యభాజి మధుమాథిని మన్మథేన।
మయ్యాపతే త్తదిహ మంథర మీక్షణార్థం
మందాలసం చ మకరాలయకన్యకాయాః॥

తా॥ శ్రీదేవి యొక్క అరమోడ్పుకన్ను యొక్క ప్రభావము వలననే, మన్మథుడు మొట్టమొదటగా మంగళమూర్తి యగు మధుసూదనుని జీవితమునందు ప్రవేశించెను. సాగర కన్యక యగు శ్రీమహాలక్ష్మియొక్క ఆ మందాలసమైన అర మోడ్పుకన్ను నాయందు ప్రసరించుగాక !

శ్లో॥ దద్యా ద్దయానుపవనో ద్రవిణాంబుధారా
మస్మిన్నకించనవిహంగశిశౌ విషణ్ణే।
దుష్కర్మఘర్మ మపనీయ చిరాయ దూరం
నారాయణప్రణయినీ నయనాంబువాహః॥

తా॥ చాతకకిశోరము గ్రీష్మాతపముచేవడిలి విషణ్ణతతో దీనమై వర్షాజలమునకై అంగలార్చుసమయమున అనుకూలపవనములు వీచి, మేఘములు వర్షించి, యా బాలవిహగమున కానందము కలిగించును. అదే తీరుగ, దుష్కర్మాచరణము వలన జనించిన దారిద్ర్య ఘర్మతాపముచేత పరితప్తుడనై విషణ్ణత నొంది యుంటిని. హే నారాయణప్రియే! కృపారసపూర్ణములైన నీ కటాక్షములను ప్రసరింపజేసి, ద్రవిణధారలచే దుష్కర్మ ఫలమైన నా దారిద్ర్యఘర్మము నుపశమింపజేయుము.

శ్లో॥ ఇష్టాఽనిశిష్టమతయోఽపి యయా దయార్ద్ర
దృష్ట్యా త్రివిష్టపపదం సులభం లభంతే।
దృష్టిః ప్రహృష్టకమలోదరదీప్తి రిష్టాం
పుష్టిం కృషీష్ట మమ పుష్కరవిష్టరాయాః॥

తా॥ కమలాసన యగు లక్ష్మీదేవి యొక్క కృపాకటాక్షము వలన, దుష్టమతులు సహితము ఇష్టులై అనాయాసముగ త్రివిష్టపపదము నధిష్ఠింతురు. ఆ తల్లి యొక్క దృష్టి ప్రహృష్టాంభోరుహదీప్తి నధఃకరించునట్టిది. అట్టి కృపావీక్షణము నా కిష్టమైన పుష్టి నొసగుగాక!

శ్లో॥ గీర్దేవతేతి గరుడధ్వజసుందరీతి
శాకంభరీతి శశిశేఖరవల్లభేతి।
సృష్టిస్థితిప్రళయకేళిషు సంస్థితాయై
తస్యై నమ స్త్రిభువనైకగురో స్తరుణ్యై॥

తా॥ త్రిభువనగురువైన శ్రీమన్నారాయణుని ప్రియాంగనయే, వాణీ, లక్ష్మీ, శాంకరీ, శాకంభరీ నామములతో బరగుచు, సృష్టి, స్థితి, లయకర్త్రియై వెలుగొందుచుండును. తాదృశ మహిమాన్విత యగు జగజ్జననికి నమోవాకములు.

శ్లో॥ శ్రుత్యై నమోఽస్తు శుభకర్మఫలప్రసూత్యై
రత్యై నమోఽస్తు రమణీయగుణార్ణవాయై।
శక్త్యై నమోఽస్తు శతపత్రనికేతనాయై
పుష్ట్యై నమోస్తు పురుషోత్తమ వల్లభాయై॥

తా॥ పుణ్యకర్మఫలప్రదాత్రి యగు శ్రుతిమాతకు నమస్కారము. మనోజ్ఞగుణార్ణవస్వరూపిణి యగు రతీదేవికి నమోవాకము. శతపత్రకమలాలయ యగు శక్తిదేవికి కైమోడ్పులు. పురుషోత్తమ ప్రియాంగన యగు పుష్టి దేవికి ప్రణామము.

శ్లో॥ నమోఽస్తు నాళీకనిభాననాయై
నమోఽస్తు దుగ్ధోదధిజన్మభూమ్యై।
నమోఽస్తు సోమామృతసోదరాయై
నమోఽస్తు నారాయణ వల్లభాయై॥

తా॥ అంభోజానన యగు లక్ష్మీదేవికి నమస్సులు. క్షీరసాగర కన్య యగు శ్రీదేవికి నమోవాకములు. చంద్రునికి అమృతమునకు తోబుట్టువైన శ్రీమాతకు ప్రణామములు. శ్రీమన్నారాయణ ప్రియాంగన యగు జగన్మాతకు నమస్కారములు.

శ్లో॥ సంపత్కరాణి సకలేంద్రియ నందనాని
సామ్రాజ్యదానవిభవాని సరోరుహాక్షి।
త్వద్వందనాని దురితాహరణోద్యతాని
మామేవ మాత రనిశం కలయంతు మాన్యే॥

తా॥ అంభోజనేత్ర యగు ఓ తల్లీ! నీకొనర్చు వందనములు సంపత్ప్రదములు; సకలేంద్రియముల కానందదాయకములు; సామ్రాజ్యవైభవప్రదానక్షమములు; సర్వదురితాపహారణ సమర్థములు. మాన్యచరితవగు ఓ జననీ! నేననిశము తాదృశ నమస్కారక్రియలు నీ కొనర్తునుగాక!

శ్లో॥ యత్కటాక్ష సముపాసనావిధిః
సేవకస్య సకలార్థసంపదః।
సంతనోతి వచనాంగమానసైః
త్వాం మురారిహృదయేశ్వరీం భజే॥

తా॥ హే మురారిహృదయేశ్వరీ! తల్లీ! ఎవడు మనో వాక్కాయములతో నీ కరుణాకటాక్షమును సముపాసించునో, అట్టి సేవకునికి సకలార్థసంపదల నొసగుదువు. కావున; ఓ జగజ్జననీ! నిన్ను నేను త్రికరణశుద్ధిగా సేవింతును.

శ్లో॥ సరసిజనిలయే। సరోజహస్తే।
ధవళతమాంశుకగంధమాల్యశోభే।
భగవతి। హరివల్లభే। మనోజ్ఞే।
త్రిభువనభూతికరి। ప్రసీద మహ్యామ్॥

తా॥ జగజ్జననీ! నీవు కమలవాసినివి; సరోజశోభితహస్తవు నీవు. ధౌతాంశుకము, గంధమాల్యాదులతో విరాజిల్లునట్టి దానవు. భగవతీ! హరిప్రియే! మనోజ్ఞమూర్తీ! త్రిభువన సంపత్కరీ! నన్ననుగ్రహింపుము.

శ్లో॥ దిగ్హస్తిభిః కనకకుంభముఖావసృష్ట
స్వర్వాహినీవిమలచారుజలప్లుతాంగీమ్।
ప్రాతర్నమామి జగతాం జననీ మశేష
లోకాధినాథగృహిణీ మమృతాబ్ధిపుత్రీమ్॥

తా॥ క్షీరసాగరకన్య యగు లక్ష్మీదేవిని దిగ్గజములు విమల స్వర్గంగాజలములను కనకకుంభములచే నుద్ధరించి అభిషేచ

నము చేయుచుండును. నిఖిలలోకాధినాథుడగు హరికి ఇల్లాలైన ఆ జగన్మాతను నిత్యము ప్రాతఃకాలమున నమస్కరింతును.

శ్లో॥ కమలే ! కమలాక్షవల్లభే ! త్వం
కరుణాపూరతరంగితై రపాంగైః।
అవలోకయ మా మకించనానాం
ప్రథమం పాత్ర మ కృత్రిమం దయాయాః॥

తా॥ కమలే ! కమలాక్షవల్లభే ! జననీ ! కరుణాపూరతరంగితము లైన అపాంగములతో నీ అవ్యాజదయకు పాత్రులైన దరిద్రులలో ప్రథమునిగా నన్నవలోకించుము.

శ్లో॥ స్తువంతి యే స్తుతిభి రమూభి రన్వహం
త్రయీమయీం త్రిభువనమాతరం రమామ్।
గుణాధికా గురుతరభాగ్యభాజినో
భవంతి తే భువి బుధభావితాశయాః॥

తా॥ ఎవరు ఈస్తోత్రములతో అనుదినము త్రయీస్వరూపిణి, త్రిభువనజననియు నగు లక్ష్మీదేవిని స్తుతింతురో; వారు ఈ భువియందు అధికగుణసంపన్నులు, మహావైభవోపేతులు, పండితజనప్రశంసాపాత్రములైన ఆశయములు గలవారునై వెలుగొందుదురు.

శ్లో॥ శ్రీమఠం తత్ర నిర్మాయ విద్యాపీఠ మచీక్లపత్।
చతురేకం వావదోకం సురేశాచార్య మగ్రిమమ్॥

శ్లో॥ బ్రహ్మవిద్యా వరిష్ఠంతం తత్పీఠే వినివేశ్యస్యః।
ఆజిజ్ఞపత సురేశార్య మిత్థం దేశికపుంగవః॥
శ్లో॥ యస్త్వద్వైత మతే స్థిత్వా భారతీ పీఠనిందకః।
సయాతి నరకం ఘోరం యావ దాభూతసంప్లవమ్॥

శ్లో ఆసేతు హిమవచ్ఛైలం సదాచారాన్ విచారయ।
యత్ర స్థలతియః కోవా విప్రస్తం శిక్షయాధికమ్॥

శ్లో॥ సంప్రదాయాన్ దశైవైతాన్ శిష్యే ష్వార్గచయ స్వతః।
తీర్థాశ్రమ వనారణ్య గిరి పర్వతసాగరాః॥

శ్లో॥ సరస్వతీ భారతీ చ పురీ త్యేతే దశైవహి।
శివాత్ క్రమాత్ సమాయాత చంద్రమౌళీశ్వరంపరమ్॥

శ్లో॥ రత్నగర్భ గణపతిం పూజయేతి దదౌముదా।
కారయామాస తేనైవ స్వీయభాష్యార్థ వార్తికమ్॥

శ్లో॥ సవిధేనివ సన్నేవ శరదో నవ చైవహి।
వాగ్దేవ్యాః పూజనం కుర్వన్ అవసత్తేన తన్మతే।
మలహానికరం దేవం ప్రత్యహం పూజయన్ సుధీః॥

శృంగేరిలోని శ్రీమఠము విద్యాపీఠమునకు చెందినది. తన నల్గురిశిష్యులలో నొకడైన సురేశ్వరుడు బ్రహ్మవిద్యా వరిష్ఠు డగుటచే ఆయనను ఆపీఠమున నియోగించెను. అద్వైత మతము నంగీకరించుచు, ఎవరైతే భారతీ పీఠమును నిందించునో అతనికి ఘోరనరకమే సంప్రాప్తించును. శృంగేరీ పీఠమే భారతీపీఠము. ఇతరపీఠ సన్యాసులు భారతీ అను అంకితనామమును తీసికొనజాలరు. ఈపీఠమున నియమింపబడిన

సురేశ్వరుడు యావద్భారతదేశమున సదాచారమును విచారించి, ధర్మపరిపాలన జరుగునట్లు చూడవలెనని శంకరుని ఆదేశము. సన్యాసులలో పది సంప్రదాయములు గలవని, వాటి అన్నింటిని వ్యవస్థ చేయవలసినదని సురేశ్వరునితో పల్కెను. శివునినుంచి సంప్రాప్తమై వచ్చుచున్న చంద్రమౌళీశ్వరుని, రత్నగర్భ గణపతిని పూజించవలసినదని ఆదేశించెను. సురేశ్వరుని వార్తిక రచనకు నియోగించి, ఆచార్యు డచటనే తొమ్మిదేండ్లు నివసించెను. పదునాలుగేండ్లు నివసించెనను పాఠాంతరము కలదుగాని, ఇరువది నాల్గవయేట శృంగేరీ మఠమునునిర్మించినచో ఆచార్యు డిచట తొమ్మిది సంవత్సరములే ఉండ వీలున్నది.

శృంగేరినుంచి చివరి సారిగా శంకరుడు బదరికాశ్రమమును చేరెను.

శ్లో॥ శ్రీగురుః శంకరాచార్యః కరుణాసాగరో హరః ।
ఇత్థం కలియుగే శుద్ధా ద్వైతం సంస్థాప్య యత్నతః॥

శ్లో॥ సన్యాసధర్మ మమలం యోగినా మపి దుర్లభమ్।
ఉపదిశ్య సురేశాది స్వశిష్యాణాం మహాదరాత్॥

శ్లో॥ సూత్ర గీతో పనిషదాం భాష్యాణి సుమహా న్యపి।
అష్టాత్రింశ ద్వర్ష ముర్వ్యాం స్థిత్వాఽఽగా ద్గిరిశాలయమ్॥

అని బ్రహ్మాండపురాణ సారమగు శ్రీమాణిక్యవిజయమున కలదు. కరుణాసాగరు డగు శంకరాచార్యుడు కష్టించి శుద్ధాద్వైతమును నెలకొల్పి నిర్మలమైన సన్యాసధర్మమును స్వశిష్యు

లగు సురేశ్వరాదులకు ఉపదేశించెను. తర్వాతవారికి ప్రస్థాన త్రయ భాష్యాదులను పాఠము చెప్పి ముప్పదిసంవత్సరములు జీవించి కైలాసమున కేగెనట. రెండు సంవత్సరములను తగ్గించాడీరచయిత. శంకరుడు మరల బదరికాశ్రమము చేరె ననుటకు.

> శ్లో॥ బదర్యాగమనం పశ్చా తత్రైకం మఠ నిర్మితమ్।
> తోటకాచార్య నామ నం శిష్యం సంస్థాప్య యత్నతః॥

> శ్లో॥ తత్రైవ సుచిరం స్థిత్వా దత్తాత్రేయస్య దర్శనమ్
> భాష్యార్థబోధ తుష్టస్య విష్ణోః సాక్షాత్కృతిః తతః।
> దత్తాత్రేయ గుహాద్వారాత్ కైలాస గమనం గురోః॥

అని చిద్విలాసుని శంకరవిజయవిలాసము చెప్పిన పంక్తులు, ఇతరగ్రంథములు ఆధారములు. కాని తన నిర్యాణమునకు ముందు జ్యోతిర్మఠమును నిర్మించెనని ఈపంక్తులలో గలదు. ఇది సంప్రదాయమునకు భిన్నము. బదరికాశ్రమమును శంకరుడు చేరి, దత్తాత్రేయుని దర్శించెనని, భాష్యార్థ బోధనల వలన తుష్టుడైన విష్ణువు ఆచార్యునకు సాక్షాత్కరించెనని, దత్తాత్రేయ గుహాద్వారమును శంకరుడు ప్రవేశించి కైలాస మునకేగెనని చిద్విలాసుని వచనము.

> శ్లో॥ ఆరుహ్యోక్షాణ మగ్ర్యం సన్ నైజం ధామ పరంయయౌ।
> బ్రహ్మాదీన్ హర్షయన్దేవాన్ కైలాస స్థాంచ పార్వతీమ్॥

> శ్లో॥ ఇతి పశుపతి రీశో భూతలే స్వేచ్ఛయాసౌ।
> శ్రుతి శిఖరగిరాం సన్నిర్ణయార్థే ఒజనిష్ట॥

శ్రుతి మత యతి చర్యాం సంవిధాయాశ్రమాంత్యే
పునరపి నిజలోకం స్వేచ్ఛయా ఽఽగాత్స్వధామ॥

అని సదానందుని శంకరవిజయమున గలదు. శివుని వృషభము నధిరోహించి శంకరుడు తననిజ గృహమగు కైలాసమున కేగెను. శ్రుతిశిఖరములగు ఉపనిషత్తుల సరియైన అర్థమును నిర్ణయించుటకు జన్మించిన శంకరుడు శ్రుతి సంమతమగు యతి ప్రవృత్తినిగూడ విధించి కైలాసమున కేగెను.

శ్లో॥ ప్రవివేశ గుహాద్వారం దత్తాజ్ఞాం జనసంతతేః।
క్రమా జ్జగామ కైలాసం ప్రమథైః పరివేష్టితమ్॥

అని చిద్విలాసీయము. దత్తాత్రేయ గుహాను ప్రవేశించి శంకరు డదృశ్యుడాయెను.

శంకరుడు హిమాలయపర్వతములలో బదరీ కేదార ప్రాంతమున బ్రహ్మీభూతుడాయెననిచిద్విలాసీయస.దానందీయ వ్యాసాచలీయ, మాధవీయశంకర విజయములు చెప్పుచున్నవి గురుపరంపరాచరిత్ర, శివరహస్యము,బ్రహ్మాండపురాణసార మగు మాణిక్యవిజయము, మహానుభావ సంప్రదాయమునకు చెందిన శంకరపద్ధతి కూడ ఇదే విషయమును తెల్పుచున్నవి. కేదారనాథ మందిరమునకు వెనుక 150 గజములదూరమున ఏబది లేక అరువది అడుగుల చతుష్కోణ వేదిక ఉన్నది. దీని మధ్యగా పంద్రెండు అడుగుల చతురముననున్న రేకు కప్పబడి ఉండును. ఇదే శంకరుని సమాధి అని చూపుదురు.

8. మఠామ్నాయము

మఠామ్నాయమును, మహానుశాసనమును శంకరుడే రచించెనందురు. మఠామ్నాయమున ఆచార్యపీఠముల నియమములు, పద్ధతి, సంప్రదాయము, అంకితనామము, వేదము, మహావాక్యము, దేవత, తీర్థము, క్షేత్రము మొదలైనవి చెప్పబడినవి. పీఠాధిపతుల వ్యావహారిక వ్యవస్థ మహానుశాసనమున నిర్దేశింపబడినది. ఈరెంటిని విద్యారణ్యుడే రచించెనను సంప్రదాయముకూడ ఉన్నది. చిత్సుఖునిచే వ్రాయబడిన మఠామ్నాయ మొకటి ఉన్నది. తత్త్వప్రదీపికా కారుడగు చిత్సుఖుడు వేరు, ఇతడు వేరు. అర్వాచీను డగు చిత్సుఖుడు వ్రాసిన మఠామ్నాయమును కొందరు ప్రామాణికమని యెంతురు.

పశ్చిమామ్నాయ ద్వారకామఠమునకు శ్రీబ్రహ్మస్వరూపాచార్యుని తర్వాత చిత్సుఖాచార్యు డొకడు పీఠాధిపతి ఆయెను. పూర్వాశ్రమమున ఈయనపేరు విష్ణుశర్మ. ఈయన ఒక బృహచ్ఛంకరవిజయమును వ్రాసెనని అందురు. ఇది పూర్వాచార్య సత్పథమని, శంకరాచార్య సత్పథమని, సురేశ్వరాచార్య సత్పథమని మూడు భాగములలో నున్నదని, వీటిలో రెండవభాగమే నేడు లభించుచున్న గ్రంథమని అందురు. ఈ చిత్సుఖుడు శంకరుని మిత్రుడని, సమకాలికుడనిచెప్పుట భ్రమమాత్మకము.

ఆమ్నాయమఠములనుగూర్చి శంకరుడే చెప్పెననుటకు ప్రబల మగు ఆధారములు లేవు. మహానుశాసనమును

మాత్రము శంకరుడు రచించలేదనుటకు కొంత ఆధారము కన్పించగలదు.

శ్లో॥ మఠా శ్చత్వార ఆచార్యా శ్చత్వార శ్చ ధురం ధరాః।
సంప్రదాయా శ్చ చత్వార ఏషాధర్మ వ్యవస్థితిః॥

శ్లో॥ చాతుర్వర్ణ్యం యథా యోగం వాఙ్మనః కాయకర్మభిః।
గురోః పీఠం సమర్చేత విభాగానుక్రమేణవై॥

శ్లో॥ ధరా మాలంబ్య రాజానః ప్రజాభ్యః కరభాగినః।
కృతాధికారా ఆచార్యో ధర్మత స్తద్వదేవహి॥

శ్లో॥ అస్మ త్పీఠే సమారూఢః పరివ్రా డు క్తలక్షణః।
అహ మేవేతి విజ్ఞేయో యస్య దేవ ఇతి శ్రుతేః॥

అని మఠామ్నాయసేతువున గలదు. శంకరుడు స్థాపించిన మఠములు నాలుగు. ఈనాల్గింటికి ధురంధరులగు నల్గురు ఆచార్యులను నియమించెను. కావున శాంకరసన్యాసుల విషయమున నాలుగే సంప్రదాయము లున్నవి. ఇది ధర్మవ్యవస్థితి. నాల్గు వర్ణములవారు వారివారి అవకాశముల ననుసరించి, ఆయాభాగములలోగల గురువుయొక్క పీఠమును వాక్కాయకర్మలతో పూజించవలెను. ప్రభువులకు ప్రజల నుంచి పన్నులు వసూలుచేయు అధికారమున్నట్లే మఠాధిపతులకుకూడ ధర్మశాస్త్రానుసార మట్టి అధికారమే గలదు. శాంకరీపీఠము నధిష్ఠించు పరివ్రాజకుడు శంకరభగవత్పాదునకన్న భిన్నుడుకాడు.

శ్లో॥ వారాణసీం యోగివరోఽధిగమ్య
భుజై రివ శ్రీహరిరేష శిష్యైః।

సహాత్మనా పంచ మఠానమీషాం
ప్రకల్ప్యతస్థౌ కతిచి ద్దినాని॥

అని గురువంశకావ్యమున ఉన్నది (3.23). నలుగురు శిష్యులతో కాశిలో ఉన్న శంకరుడు తనతో కలిపి ఐదుగురకు ఐదు మఠములను నెలకొల్పి, అచట కొంతకాల ముండెను. ఈ ఐదుగురు విశ్రాంతి తీసికొనుటకు, తపస్సు చేసికొనుటకు కాశిలోనే నిర్మించిన ఐదు మఠములని ఒకవ్యాఖ్య. ఇదే సర్గలో; 59 వ శ్లోకము నుంచి నాలుగు ఆమ్నాయ మఠముల ప్రసక్తి మాత్రమే కన్పించుచున్నది.

శ్లో॥ యూయం చతుర్దిక్షు మఠేషు లింగై
స్సాకం వసం త్వితృ్యపదిశ్య హర్షాత్॥

అని శివరహస్యము గూడ నాల్గుమఠములనే శంకరుడు స్థాపించెనని, ఈ నాల్గింటికి తన నల్గురుశిష్యులను అధిపతులనుగా నియమించెనని చెప్పుచున్నది. చిద్విలాసీయ శంకరవిజయము, గురుపంపరాచరిత, యతిధర్మనిర్ణయము అనునవి శంకరుడు నాలుగు దిక్కులలోను నాలుగు మఠములను స్థాపించినట్లు చెప్పుచున్నవి. ప్రతి మఠమునకు వేదము, మహావాక్యము, సంప్రదాయము, బ్రహ్మచారి, యోగపట్టము మొదలగునవి చెప్పబడినవి. ఈ నాలుగు మఠములు నాలుగు ఆమ్నాయ మఠములు.

ఆమ్నాయములు ఏడు. ఇవిపూర్వ, దక్షిణ, పశ్చిమ, ఉత్తర, ఊర్ధ్వ, స్వాత్మ, నిష్కలామ్నాయములు. చివరి

మూడు జ్ఞానగోచరము లగుటచే వీటిని జ్ఞానామ్నాయము లందురు. దృష్టిగోచరము లైనవి మిగిలిన నాలుగు ఆమ్నాయములు. ఇవి నాలుగు వేదములను ఆశ్రయించుకొనినవి.

వేదములు నాలుగు. జీవబ్రహ్మైక్యమును బోధించు వాక్యములను మహావాక్యము లందురు. ఒక్కొక్క వేదము నుంచి ఒక్కొక్క మహావాక్య ముద్ధరించబడినది. ఋగ్వేదమునుండి "ప్రజ్ఞానం బ్రహ్మ", యజుర్వేదమునుండి "అహం బ్రహ్మాస్మి", సామవేదమునుండి "తత్త్వమసి", అథర్వవేదము నుండి "అయమాత్మా బ్రహ్మ" అను వాక్యములు మహావాక్యములు.

'అథమహావాక్యాని చత్వారి'

అని శుకరహస్యోపనిషత్ చెప్పుచున్నది.

'ప్రజ్ఞానం బ్రహ్మ చేత్యాది మహావాక్య చతుష్టయం'

అని శివతత్త్వసుధానిధిలో గలదు. కావున ఆచార్యనిర్మిత దృగ్గోచర మఠములు నాలుగే రాగలవు.

సంప్రదాయములు నాలుగు. కీట, భోగ; ఆనంద, భూరి నామములు గలవివి. సన్న్యాస క్రమమున నాలుగు రకములు ధర్మశాస్త్రములలో కన్పించుచున్నను, పరమహంస సన్న్యాసక్రమమును అనుసరించువారే నేడు కన్పించుచున్నారు.

యోగపట్ట మనగా సన్న్యాసాశ్రమమున పెట్టబడుచున్న పేరుయొక్క చివరిభాగము. ఈ అంకితనామములు పది

ఉన్నవి. తీర్థ, ఆశ్రమ, వన, అరణ్య, గిరి, పర్వత, సాగర, సరస్వతీ, భారతీ, పురి అనునవి. మఠామ్నాయమున ధర్మ శాస్త్రాదులలోను ఈ పదిపేర్లే కన్పించుచున్నవి.

మఠామ్నాయము పశ్చిమతీరమునగల ద్వారకామఠ ముతో ప్రారంభమగుచున్నది. ఈ మఠము శంకరునిచే మొట్ట మొదట ప్రతిష్ఠింపబడినది. ద్వారక నాథుని సమక్షమున మొదటి శారదామఠము బయలుదేరినది.

శ్లో॥ ప్రథమః పశ్చిమామ్నాయః శారదా మఠ ఉచ్యతే।
కీటవారః సంప్రదాయ స్తస్య తీర్థాశ్రమౌ శుభౌ॥ 1

శ్లో॥ ద్వారకాఖ్యం హి క్షేత్రం స్యా ద్దేవః సిద్ధేశ్వరః స్మృతః
భద్రకాళీ తు దేవీస్యాత్ హస్తామలక దేశికః॥ 2

శ్లో॥ గోమతీ తీర్థ మమలం బ్రహ్మచారీ స్వరూపకః।
సామవేదస్య వక్తా చ తత్ర ధర్మం సమాచరేత్॥ 3

శ్లో॥ జీవాత్మ పరమా త్మైక్య బోధో యత్ర భవిష్యతి।
తత్త్వమసి మహావాక్యం గోత్రోఽవ్యగత ఉచ్యతే॥ 4

శ్లో॥ సింధు సౌవీర సౌరాష్ట్రమహారాష్ట్రా స్తథాంతరాః।
దేశాః పశ్చిమ దిక్ స్థా యే శారదామఠభాగినః॥ 5

ఈ శారదామఠమున గల సంప్రదాయము కీటవారము. ఈ మఠసన్యాసుల పేర్లచివర తీర్థశబ్దముగాని ఆశ్రమశబ్దముగాని ఉండును. ఈ మఠమునకు క్షేత్రము ద్వారక. పీఠదేవత సిద్ధేశ్వరుడు. పీఠమున గలశక్తి భద్రకాళి. మొదటిఆచార్యుడు

హస్తామలకుడు. ఈమఠముకు తీర్థము గోమతి. బ్రహ్మచారి స్వరూపుడనబడును. అతడు సామవేదమును అధ్యయనము చేయును. తర్వాత ఆశ్రమమును గ్రహించి ధర్మము నాచరించవలెను. జీవబ్రహ్మలకు ఐక్యమును ప్రతిపాదించు "తత్త్వమసి" అను ఛాందోగ్యవాక్య మీ మఠమునకు గల మహావాక్యము. వీరిది అవిగత గోత్రము. సింధు, సౌవీర, సౌరాష్ట్ర, మహారాష్ట్ర దేశములు, వీనిమధ్యగా పశ్చిమమున నున్న ప్రాంతము ఈ మఠమునకు లోబడియుండును.

శ్లో॥ త్రివేణీ సంగమే తీర్థే తత్త్వమస్యాది లక్షణే।
స్నాయా తత్త్వార్థ భావేన తీర్థనామ్నా స ఉచ్యతే॥ 6

శ్లో॥ ఆశ్రమగ్రహణే ప్రౌఢ ఆశాపాశ వివర్జితః।
యాతాయాత వినిర్ముక్త ఏష ఆశ్రమ ఉచ్యతే॥ 7

శ్లో॥ కీటాదయో విశేషేణ వార్యంతే జీవజంతవః।
భూతానుకంపయా నిత్యం కీటవారః స ఉచ్యతే॥ 8

శ్లో॥ స్వస్వరూపం విజానాతి స్వధర్మ పరిపాలకః।
స్వానందే క్రీడతో నిత్యం స్వరూపో వటురుచ్యతే॥ 9

"తత్త్వమసి" అనునది త్రివేణీసంగమమను పుణ్యతీర్థము ఈ తీర్థమును గ్రహించువాడే తీర్థు డను పేరుతో వ్యవహారింపబడును. సన్యాసాశ్రమగ్రహణ నిపుణుడు, ఆశాపాశ వివర్జితుడు, పునర్జననమరణ ములనుంచి ముక్తి పొందినవాడు అగువాడే ఆశ్రమ శబ్దముతో పిలువబడును. భూతదయతో ఎవడు నిత్యము కీటాదులను హింసింపకుండునో అతడు టకీ

వార సంప్రదాయమునకు చెందిన వాడని చెప్పవలెను. స్వస్వరూపము నెరిగి,స్వధర్మమును పాలించుచుస్వానందమున క్రీడించుటచే ఈ ఆశ్రమమునగల బ్రహ్మచారిని స్వరూప నామముతో పిలతురు.

రెండవది పూర్వామ్నాయమునకు చెందిన మఠము.

శ్లో॥ పూర్వామ్నాయో ద్వితీయః స్యా ద్గోవర్ధన మఠఃస్మృతః।
భోగవారఃసంప్రదాయో వనారణ్యే పదే స్మృతే॥ 10

శ్లో॥ పురుషోత్తమం తు క్షేత్రం స్యా జ్జగన్నాథో ఽస్య దేవతా।
విమలాఖ్యాహి దేవీ స్యా దాచార్యః పద్మపాదకః॥ 11

శ్లో॥ తీర్థం మహోదధిః ప్రోక్తం బ్రహ్మచారీ ప్రకాశకః।
మహావాక్యం చ తత్ర స్యాత్ ప్రజ్ఞానం బ్రహ్మచోచ్యతే।
ఋగ్వేద పఠనం చైవ కాశ్యపో గోత్ర ముచ్యతే॥ 12

శ్లో॥ అంగవంగ కళింగా శ్చ మగధోత్కల బర్బరాః।
గోవర్ధన మఠాధీన దేశాః ప్రాచీ వ్యవస్థితాః॥ 13

తూర్పునగల ఆమ్నాయమఠము గోవర్ధనమఠము. ఈ మఠసంప్రదాయము భోగవారము. ఇందలి సన్యాసులను వన, అరణ్య పదములతో వ్యవహరించవలెను. ఇచట క్షేత్రము పురుషోత్తమము. పీఠదేవత జగన్నాథుడు. పీఠశక్తి విమల. ఇచటి మొదటి ఆచార్యుడు పద్మపాదుడు. ఈమఠమునకు తీర్థము మహోదధి. ఇచటి బ్రహ్మచారి పేరు ప్రకాశకుడు. "ప్రజ్ఞానం బ్రహ్మ" అను మహావాక్య మీమఠమునకు చెందినది. ఇచటఋగ్వేదము పఠనీయము. వీరిగోత్రము కాశ్యపము.

ఈ మఠముయొక్క అధీనములోని దేశములు అంగ, వంగ, కళింగదేశములు.

శ్లో॥ సురమ్యే నిర్జనే స్థానే వనే వాసం కరోతి యః।
ఆశాబంధ వినిర్ముక్తో వన నామా స ఉచ్యతే॥ 14

శ్లో॥ అరణ్యే సంస్థితే నిత్య మానందే నందనే వనే।
త్యక్త్వా సర్వ మిదం విశ్వ మారణ్యః పరికీర్త్యతే॥ 15

శ్లో॥ భోగో విషయ ఇత్యుక్తో వార్యతే యేన జీవినామ్।
సంప్రదాయో యతీనాం చ భోగవారః స ఉచ్యతే॥ 16

శ్లో॥ స్వయంజ్యోతి ర్విజానాతి యోగ యుక్తి విశారద.।
తత్త్వజ్ఞాన ప్రకాశేన తేన ప్రోక్తః ప్రకాశకః॥ 17

అందమైన నిర్జన వనస్థానమున నివసించు వాడును, ఆశాబంధములు లేనివాడును అగు వ్యక్తియే వనశబ్దముతో వ్యవహరింప బడును. ఆనందనందన వనమను అరణ్యమున వెలయు వాడును, ఈ విశ్వారణ్యము నంతటిని త్యజించిన వాడును అగు పురుషుడే అరణ్యశబ్దముతో పిలువ బడదగినవాడు. భోగమనగా విషయములు. జీవులను ఎవరు విషయములనుండి వారింతురో ఆయతుల సంప్రదాయము భోగవారము. స్వయం జ్యోతి నెరిగినవాడును, యోగ యుక్తి విశారదుడును, తత్త్వ జ్ఞాన ప్రకాశకుడును అగు బ్రహ్మచారిని ప్రకాశకు డందురు.

మూడవది ఉత్తరామ్నాయ మఠము. ఇది పవిత్రమైన హిమాలయములలో ప్రతిష్ఠింపబడిన పీఠము.

శ్లో॥ తృతీయ స్తూత్తరామ్నాయో జ్యోతిర్నామ మఠో భవేత్।
శ్రీమఠ శ్చేతి వాతస్య నామాంతర ముదీరితమ్॥ 18

శ్లో॥ ఆనందవారో విజ్ఞేయః సంప్రదాయో౽స్య సిద్ధిదః।
పదాని తస్య ఖ్యాతాని గిరి పర్వతసాగరాః॥ 19

శ్లో॥ బదరికాశ్రమః క్షేత్రః దేవో నారాయణః స్మృతః।
పూర్ణగిరి చ దేవీ స్యాదాచార్య స్త్రోటకః స్మృతః॥ 20

శ్లో॥ తీర్థం త్వలకనందాఖ్యం ఆనందో బ్రహ్మచార్యభూత్।
అయమాత్మా బ్రహ్మచేతి మహావాక్య ముదాహృతమ్॥
అథర్వవేద వక్తా చ భృగ్వాఖ్యో గోత్ర ముచ్యతే। 21

శ్లో॥ కురు కాశ్మీర కాంభోజ పాంచాలాది విభాగతః।
జ్యోతిర్మఠ వశాదేశా ఉదీచీ దిగవస్థితాః॥ 22

తా॥ ఉత్తరామ్నాయ మఠమును జ్యోతిర్మఠమని, శ్రీమఠ మనికూడ పిలతురు. సిద్ధి నొసగగల శక్తితో కూడిన ఈ సంప్రదాయమును ఆనందవార మందురు. ఇచటి సన్యాసులను గిరి పర్వత, సాగర శబ్దములతో వ్యవహరింతురు. ఈ సంప్రదాయమువారికి క్షేత్రము బదరికాశ్రమము. పీఠదేవత నారాయణుడు. పీఠశక్తి పూర్ణగిరి. మొదటి ఆచార్యుడు త్రోటకుడు. ఈమఠమునకు గల తీర్థము అలకనంద. ఇచటి బ్రహ్మచారి పేరు ఆనందుడు. "అయమాత్మా బ్రహ్మ" అనునది వీరికిగల మహావాక్యము. ఇదట అథర్వవేదము పఠనీయము. వీరిది భృగుగోత్రము. కురు, కాశ్మీర, కాంభోజ, పాంచాలాది దేశము లీమఠము యొక్క అధీనములోనివి.

శ్లో॥ వాసోగిరి వనే నిత్యం గీతాధ్యయన తత్పరః।
గంభీరాచల బుద్ధిశ్చ గిరినామా స ఉచ్యతే॥ 23

శ్లో॥ వసన్ పర్వత మూలేషు ప్రౌఢం జ్ఞానం బిభర్తియః।
సారాసారం విజానాతి పర్వతః పరికీర్త్యతే॥ 24

శ్లో॥ తత్త్వసాగర గంభీరో జ్ఞానరత్న పరిగ్రహః।
మర్యాదాం నవై లంఘేత సాగరః పరికీర్త్యతే॥ 25

శ్లో॥ ఆనందోహి విలాస శ్చ వార్యతే యేన జీవినామ్।
సంప్రదాయో యతీనాం చ నందవార్య స ఉచ్యతే॥ 26

శ్లో॥ సత్యంజ్ఞాన మనంతం యో నిత్యంధ్యాయతే తత్త్వవిత్।
స్వానందే రమతే నిత్యం ఆనందః పరికీర్తితః॥ 27

తా॥ గిరి వన వాసియు, గీతాధ్యయన తత్పరుడును, గంభీరము స్థిరము నైన బుద్ధి గలవాడు నగు సన్యాసిని గిరి అనుపేరుతో వ్యవహరింతురు. పర్వతమూల ప్రదేశములలో నివసించుచు, పరిపక్వ జ్ఞానముతో నుండి,సారాసారముల నెరుగువాడు నగు సన్యాసిని పర్వత శబ్దముతో పిలతురు. తత్త్వసాగర గంభీరుడు, జ్ఞానరత్న శోభితుడు. శాస్త్రమర్యాద నుల్లంఘింపని వాడును అగు సన్యాసిని సాగరశబ్దముతో వ్యవహరింతురు. ఆనందము విషయవిలాసముల ద్వారా వచ్చునది. వీటినుండి మానవుని నివారించు సంప్రదాయము ఆనందవారము. తత్త్వజ్ఞుడై సత్యజ్ఞానానంత స్వరూప మగు బ్రహ్మమును నిత్యము ధ్యానించుచు, ఎల్లప్పుడు స్వానందముననే క్రీడించు ఈబ్రహ్మచారిని ఆనందు డందురు.

నాల్గవది దక్షిణామ్నాయ మఠమగు శృంగేరీమఠము. దీనివిషయమై రెండుపాఠములు కన్పించుచున్నవి. మొదటిది-

శ్లో॥ తురీయో దక్షిణస్యాం చ శృంగేర్యాం శారదామఠః।
మలహానికరం లింగం విభాండక సుపూజితమ్॥

శ్లో॥ యత్రాస్తే ఋష్యశృంగస్య మహర్షే రాశ్రమోమహాన్।
వరాహో దేవతా తత్ర రామక్షేత్ర ముదాహృతమ్॥

శ్లో॥ తీర్థంచ తుంగభద్రాఖ్యం శక్తిః శ్రీశారదేతిచ।
ఆచార్య స్తత్ర చైతన్య బ్రహ్మచారీతి విశ్రుతః॥

శ్లో॥ వార్తికాది బ్రహ్మవిద్యా కర్తా యో మునిపూజితః।
సురేశ్వరాచార్య ఇతి సాక్షాద్ బ్రహ్మవతారకః॥

శ్లో॥ సరస్వతీ పురీ చేతి భారత్యారణ్య తీర్థకౌ।
గిర్యాశ్రమ ముఖాని స్యుః సర్వనామాని సర్వదా॥

శ్లో॥ సంప్రదాయో భూరివారో యజుర్వేద ఉదాహృతః।
అహంబ్రహ్మాస్మీతి తత్ర మహావాక్య ముదీరితమ్॥

తా॥ అని శృంగేరీ మఠము వారి మఠామ్నాయసేతువులో గల పాఠము. శృంగేరీలో గల శారదామఠము నాల్గవ ఆమ్నాయమఠము. ఋష్యశృంగమహర్షి యొక్క ఆశ్రమమున, విభాండకముని పూజించిన మలహానికర మను శివలింగము గల ప్రదేశమున శృంగేరీమఠ మున్నది. పీఠదేవత వరాహుడు. ఈ మఠమునకు క్షేత్రము రామేశ్వరము. తీర్థము తుంగభద్ర. పీఠశక్తి శ్రీశారదాదేవి. ఇచటి బ్రహ్మచారి చైతన్యుడు. ఇచటి మొదటి ఆచార్యుడు వార్తికాదులను రచించినవాడు. మునులచే పూజింపబడినవాడు నగు సురేశ్వరుడు. సరస్వతి, పురి, భారతీ, అరణ్య, తీర్థ, గిరి, ఆశ్రమాది దశనామములతో ఇచటి సన్యాసులను వ్యవహ

రింతురు. వీరి సంప్రదాయము భూరివారము. ఇచటి పఠింప బడు వేదము యజుర్వేదము. ఈ మఠమునకు గల మహా వాక్యము "అహం బ్రహ్మాస్మి".

మఠామ్నాయ సేతువున కొద్ది భేదముగలపాఠముకన్పించుచున్నది. ఈ క్రిందిశ్లోములుకగమనింప దగినవి.

శ్లో॥ చతుర్థో దక్షిణామ్నాయః శృంగేరీ తు మఠో భవేత్।
సంప్రదాయో భూరివారః భూర్భువో గోత్రముచ్యతే॥ 28

శ్లో॥ పదాని త్రీణి ఖ్యాతాని సరస్వతి భారతీ పురీ।
రామేశ్వరాహ్వయం క్షేత్ర మాధి వరాహదేవతా॥ 29

శ్లో॥ కామాక్షీ తస్య దేవీస్యా త్సర్వకామఫలప్రదా।
సురేశ్వరాఖ్య ఆచార్య స్తుంగభద్రేతి తీర్థకమ్॥ 30

శ్లో॥ చైతన్యాఖ్యో బ్రహ్మచారీ యజుర్వేదస్య పాఠకః।
అహం బ్రహ్మాస్మి తత్రైవ మహావాక్యం సమీరితమ్॥ 31

శ్లో॥ ఆంధ్ర ద్రావిడ కర్ణాట కేరళాది ప్రభేదతః
శృంగేర్యధీనా దేశాస్తే హ్యవాచీ దిగవస్థితాః॥ 32

తా॥ దక్షిణమున గల నాల్గవ ఆమ్నాయమఠము శృంగేరీ మఠము. ఇచటిసంప్రదాయముభూరివారము. వీరిది "భూర్భువః" గోత్రము. ఈ సంప్రదాయమునగల సన్యాసులు సరస్వతి. భారతి పురి అను మూడుశబ్దములతో వ్యవహరింప బడుదురు. ఈ మఠమునకు క్షేత్రము రామేశ్వరము. పీఠదేవత ఆదివరాహుడు. పీఠ, శక్తి సర్వకామఫలప్రదయగుకామాక్షి. మొదటి ఆచార్యుడు సురేశ్వరుడు. తీర్థము తుంగభద్ర

బ్రహ్మచారిపేరు చైతన్యుడు. యజుర్వేదము పఠనీయము. "అహం బ్రహ్మాస్మి" అనునది ఇచటగల మహావాక్యము. ఆంధ్ర, ద్రావిడ, కర్నాట, కేరళ దేశములు శృంగేరీ మఠముయొక్క అధీనమునగల దేశములు.

శృంగేరీవారి పాఠముప్రకార మీసన్యాసులకు దశ విధనామములు ఉండవచ్చును. మఠామ్నాయము ప్రకారము వీరికి మూడే నామములు చెప్పబడినవి. వీటిలో తీర్థశబ్దము కన్పించదు. కాని శ్రీవిద్యాతీర్థమహేశ్వరు డను ఆచార్యుడు పదమూడవ శతాబ్దమున పీఠాధిపతి ఆయెను. బహుశః ద్వారకాపీఠాధిపతులవద్ద ఆశ్రమమును గ్రహించియుండుటచే తీర్థశబ్దముగల యతీశ్వరుడు శృంగేరీమఠమున కన్పించి యుండ వీలున్నది. శ్రీవిద్యారణ్యస్వామి చేసిన మార్పులను తర్వాత గమనింతము. శృంగేరిలో మొదటి ఆచార్యుడు పృథ్వీధరుడని కొన్ని ప్రతులలో గలపాఠము. పృథ్వీధవుడని కొందరనిరి. అనేకుల ననుసరించి ఇచటి మొదటి ఆచార్యుడు సురేశ్వరు డని నిర్ణయించవలెను.

శ్లో॥ స్వరజ్ఞానరతో నిత్యం స్వరవాదీ కవీశ్వరః।
సంసార సాగరాసార హంతా సౌహి సరస్వతీ॥ 33

శ్లో॥ విద్యాభారేణ సంపూర్ణః సర్వభారం పరిత్యజన్।
దుఃఖభారం నజానాతి భారతీ పరికీర్త్యతే॥ 34

శ్లో॥ జ్ఞానతత్త్వేన సంపూర్ణః పూర్ణతత్త్వ పదేస్థితః।
వరం బ్రహ్మరతో నిత్యం పురీ నామా స ఉచ్యతే॥ 35

శ్లో॥ భూరిశబ్దేన సౌవర్ణ్యం వార్యతే యేన జీవినామ్।
సంప్రదాయో యతీనాం చ భూరివారః స ఉచ్యతే॥ 36

శ్లో॥ చిన్మాత్రం చే త్యరహిత మనంత మజరం శివమ్।
యో జానాతి సవై విద్వాన్ చైతన్యం తద్విధీయతే॥ 37

వేదోచ్చారణ నెరిగి, అందు నిపుణుడై కవిశ్రేష్ఠుడై, అసారమగు సంసార సాగరమును తుడిచివేయు యతిని సరస్వతి అనిపిలతురు. ఇతర భారముల నన్నిటిని త్యజించి, విద్యా భారముతో నిండి, దుఃఖభారము నెరుగని యతిని భారతి అని వ్యవహరింతురు. జ్ఞానతత్త్వముతో పూర్ణుడై, పూర్ణమగు తత్త్వపదమున నిలిచి, నిత్యము పరబ్రహ్మరతు డగు సన్న్యాసిని పురి అని పిలతురు. భూరిశబ్దమునకు కాంచనమని అర్థము. ఏసంప్రదాయము మానవులను కాంచనాసక్తినుండి వారించునో దానిపేరు భూరివార సంప్రదాయము. చిన్మాత్రము, చిత్తసంబంధరహితము,అనంతము, జరామరణ రహితముఅగు శివస్వరూపము నెరిగిన విద్వాంసుడే చైతన్య బ్రహ్మచారి.

ఈరీతిగా నాలుగు మఠములనుగూర్చి వివరించిన తర్వాత.

శ్లో॥ మర్యాదైషా సువిజ్ఞేయా చతుర్మఠ విధాయినీ।
తా మేతాం సముపాశ్రిత్య ఆచార్యాః సంప్రతిష్ఠితాః॥ 38

అని నారు. ఇది నాలుగు మఠములకును సంబంధించిన నియమము, దీనిని చక్కగా తెలిసికొనవలెను. ఈనియమముల ననుసరించియే వరుసగా ఆచార్యులు ప్రతిష్ఠింపబడిరి.

దృగ్గోచరములగు ఆమ్నాయములు నాలుగు. ఇవిగాక కేవలము జ్ఞానగోచరములగు ఆమ్నాయములు కొన్ని గలవు. వీటిని గురించికూడ మఠామ్నాయసేతువున గలదు. జ్ఞానగోచరము లైనవి నాలుగు ఆమ్నాయముల వారికి సమష్ఠిగా చెందినవని చెప్పవీలున్నది.

శ్లో॥ అథోర్ధ్వం శేష ఆమ్నాయా స్తే విజ్ఞానైక విగ్రహాః।
పంచమ స్తూర్ధ్వ ఆమ్నాయః సుమేరు మఠఉచ్యతే।
సంప్రదాయో ఽస్య కాశీస్యాత్ సత్యజ్ఞానభిదే పదే॥ 39

శ్లో॥ కైలాసః క్షేత్ర మిత్యుక్తం దేవతాస్య నిరంజనః।
దేవీ మాయా తథా చార్య ఈశ్వరో ఽస్య ప్రకీర్తితః॥ 40

శ్లో॥ తీర్థంతు మానసం ప్రోక్తం బ్రహ్మతత్త్వావగాహితత్।
తత్ర సంయోగ మార్గేణ సన్న్యాసం సముపాశ్రయేత్।
సూక్ష్మవేదస్య వక్తాచ తత్ర ధర్మం సమాచరేత్॥ 41

జ్ఞానమాత్రముననే తెలియబడునవి శేషించిన ఆమ్నాయములు. ఊర్ధ్వామ్నాయ మగు ఐదవదానిని సుమేరు మఠమందురు. ఇచట కాశీసంప్రదాయము. ఇందలి సన్న్యాసులను సత్య, జ్ఞాన శబ్దములతో వ్యవహరింతురు. ఈమఠమునకు క్షేత్రము కైలాసము, పీఠదేవత నిరంజనుడు, పీఠశక్తి మాయాదేవి, మొదటి ఆచార్యుడు ఈశ్వరుడు. బ్రహ్మతత్త్వా

మును అవగాహన చేసికొనిన మనస్సే ఇచట తీర్థము. ఇచటి వారు సంయోగమార్గమును అనుసరించి సన్న్యాసము నాశ్రయించవలెను. సూక్ష్మవేద మిట పఠనీయమగుటతో ధర్మమాచరింపబడును.

శ్లో॥ షష్ఠః స్వాత్మాఖ్య అమ్నాయః పరమాత్మా మఠో మహాన్॥ 42

శ్లో॥ సత్త్వతోషః సంప్రదాయః పదంయోగమనుస్మరేత్।
నభః సరోవరం క్షేత్రం పరహంసో ఽస్యదేవతా॥ 43

శ్లో॥ దేవీస్యా న్మానసీ మాయా ఆచార్య శ్చేతనాహ్వయః।
త్రిపుటీ తీర్థ ముత్కృష్టం సర్వపుణ్య ప్రదాయకమ్॥ 44

శ్లో॥ భవపాశ వినాశాయ సన్న్యాసం తత్ర చాశ్రయేత్।
వేదాంత వాక్యవక్తా చ తత్రధర్మం సమాచరేత్॥ 45

ఆరవది యగు ఆత్మామ్నాయమున పరమాత్మ అను మఠముండును. ఇచటి సంప్రదాయము సత్వతోషము ఈ సన్న్యాసులను యోగశబ్దముతో పిలతురు. ఈ మఠమునకు నభః సరోవరము క్షేత్రము. పీఠదేవత పరహంస అను పరబ్రహ్మమే. పీఠశక్తి మానసీ మాయాదేవి. ఇచటి మొదటి ఆచార్యుడు చేతనశబ్దముచే వ్యవహరింప బడువాడు. సర్వపుణ్యప్రదాయక మగు త్రిపుటీతీర్థముగల ఈమఠమునసంసార బంధమును నశింపజేయుటకే సన్న్యాసమును గ్రహింపవలెను.

వేదాంతవాక్యములిట పఠనీయములు.

శ్లో॥ సప్తమో నిష్కలామ్నాయః సహస్రార్క ద్యుతిర్మఠః।
సంప్రదాయో ఽస్య సచ్ఛిష్యః శ్రీగురోః పాదుకే పదే॥ 46

శ్లో॥ తత్రానుభూతిః క్షేత్రం స్యా ద్విశ్వరూపో ఽస్య దేవతా।
దేవీ చిచ్ఛక్తి నా మ్నీ హి ఆచార్యః సద్గురుః స్మృతః. ॥ 47

శ్లో॥ సచ్ఛాస్త్ర శ్రవణం తీర్థం జరామృత్యు వినాశకమ్।
పూర్ణానంద ప్రసాదేన సన్యాసం తత్రచాశ్రయేత్॥ 48

ఏడవది యగు నిష్కలామ్నాయమున సహస్రార్క ద్యుతి యను మఠము గలదు. ఇచట సచ్ఛిష్య సంప్రదాయము గలదు. శ్రీగురుపాదుకలే ఈసన్యాసుల అంకితనామములు. ఈమఠక్షేత్రము అనుభూతి. ఈపీఠదేవత విశ్వరూపుడు. పీఠశక్తి చిచ్ఛక్తి. ఇచటి మొదటి ఆచార్యుడు సద్గురువగు శ్రీశంకర భగవత్పాదులే. సచ్ఛాస్త్ర శ్రవణమే ఈ మఠము నకుగల తీర్థము. ఈతీర్థమేముసలితనమును మృత్యువును నశింప జేయునది. పూర్ణానంద ప్రసాదవశమున ఇచట సన్యాసమును స్వీకరింపవలెను.

మాయను, మానసీమాయను దాటి చిచ్ఛక్తిని ఆశ్రయించు ఆచార్యుడు క్రమముగా నిరంజన, పరహంస, విశ్వరూపుల నర్చించును. ఈ మూడు మఠములలోను తీర్థములు, క్షేత్రములు బ్రహ్మాత్మైక్యాను సంధానమార్గమున సాధకునకు తటస్థించునవి. అందుకనే ఇవి విజ్ఞానైక లభ్యములనినారు. ఈ ఆమ్నాయమఠములను స్పష్టీకరించు పథకమును చూచిన విషయము సులభగ్రాహ్యము కాగలదు.

ఆమ్నాయముల దిగాది క్రమము నీవిధముగా నెరుంగునది ఆమ్నాయములు దృగ్గోచరములు, జ్ఞానగోచరములు అని రెండు విధములుగా గన్పట్టుచున్నవి. దృగ్గోచరములు నాలుగనియు, జ్ఞానగోచరములు మూడనియు తెలియుచున్నది.

దృగ్గోచరములు

ఆమ్నాయ క్రమము	పూర్వా మ్నాయము	దక్షిణా మ్నాయము
1. సంప్రదాయ	భోగవార	భూరివార
2. అంకితనామము	వన, అరణ్య	సరస్వతి, భారతి, పురి
3. బ్రహ్మచారి	ప్రకాశక	చైతన్య
4. వేదము	ఋగ్వేదము	యజుర్వేదము
5. మహావాక్యము	ప్రజ్ఞానం బ్రహ్మ	అహం బ్రహ్మాస్మి
6 గోత్రము	కాశ్యప	భూర్భువః
7. తీర్థము	మహాదధి	తుంగభద్రా
8. క్షేత్రము	పురుషోత్తమక్షేత్రము	రామక్షేత్రము
9. దేవుడు	జగన్నాథ	వారాహ
10. దేవత	విమలా (వృషలా)	శారదా
11. మఠనామము	గోవర్ధన	శృంగేరీ శారదా
12. ఆచార్యుడు	హస్తామలక లేక పద్మపాద	సురేశ్వర లేక పృథ్వీధర
13. శాసనాధీన మగు ప్రాంతము	అంగ, వంగ, కలింగ, ఉత్కల	ఆంధ్ర, ద్రావిడ కర్ణాట, కేరల
14. కేంద్రము	జగన్నాథం	శృంగేరి

ఆమ్నాయ క్రమము	పశ్చిమామ్నాయము	ఉత్తరామ్నాయము
1. సంప్రదాయము	కీటవార	నందవార
2. అంకితనామము	తీర్థ, ఆశ్రమ	గిరి, పర్వత, సాగర
3. బ్రహ్మచారి	స్వరూపక	ఆనంద
4. వేదము	సామవేదము	అథర్వవేదము
5. మహావాక్యము	తత్త్వమసి	అయ మాత్మా బ్రహ్మ
6. గోత్రము	అవిగత	భృగు
7. తీర్థము	గోమతి	అలకనందా
8. క్షేత్రము	ద్వారికా	బదరికాశ్రమము
9. దేవుడు	సిద్ధేశ్వర	నారాయణ
10. దేవత	భద్రకాళీ	పూర్ణగిరి, లేక పున్నగిరి
11. మఠనామము	కాళికా, లేక ద్వారికా శారదా	జ్యోతిర్మఠము
12. ఆచార్యుడు	పద్మపాద, లేక విశ్వరూప	త్రోటక
13. శాసనాధీన మగు ప్రాంతము	సింధు, సౌవీర, మహారాష్ట్రి, సౌరాష్ట్రి	కురు, కాశ్మీర, పాంచాల కాంభోజ
14. కేంద్రము	ద్వారకా	బదరికావనము

జ్ఞానగోచరములు

ఆమ్నాయ క్రమము	ఊర్ధ్వా మ్నాయము	ఆత్మా మ్నాయము
1. సంప్రదాయము	కాశీ	సత్త్వతోషము
2. అంకితనామము	సత్యం, జ్ఞానం	యోగ
3. బ్రహ్మచారి	బ్రహ్మత్వే సంయోగేన సంన్యాసః	సంన్యాసః
4. వేదము	—	—
5. మహావాక్యము	—	—
6. గోత్రము	—	—
7. తీర్థము	మానసం బ్రహ్మ తత్త్వావగాహితం	త్రిపుటి
8. క్షేత్రము	కైలాసము	నభస్సరోవరము
9. దేవుడు	నిరంజన	పరమహంస
10. దేవత	మాయా	మానసీ మాయా
11. మఠనామము	సుమేరు (కైలాస)	పరమాత్మా
12. ఆచార్యుడు	మహేశ్వర	చేతన
13. శాసనాధీనమగు ప్రాంతము	—	—
14. కేంద్రము	—	—

ఆమ్నాయ క్రమము	నిష్కలామ్నాయము
1. సంప్రదాయము	సచ్ఛిష్య
2. అంకితనామము	గురుపాదుకా
3. బ్రహ్మచారి	సంన్యాసః
4. వేదము	—
5. మహావాక్యము	—
6. గోత్రము	—
7. తీర్థము	సచ్ఛాస్త్రశ్రవణము
8. క్షేత్రము	అనుభవము
9. దేవుడు	విశ్వరూప
10. దేవత	చిచ్ఛక్తి
11. మతనామము	సహస్రార్కద్యుతి
12. ఆచార్యుడు	సద్గురు
13. శాసనాధీనమగు ప్రాంతము	—
14. కేంద్రము	—

ఆమ్నాయ మఠముల ద్వారా సన్యాసమును గ్రహించు వారికి దీక్షానామము చివర చేర్చు పదమును అంకిత నామమని యోగపట్ట మని అందురు.

శ్లో॥ తీర్థాశ్రమ వనారణ్య గిరిపర్వత సాగరాః।
సరస్వతీ భారతీ చ పురీ నామాని వై దశ॥

అని చెప్పుటచే అంకితనామములు పదిగలవు. తీర్థ, ఆశ్రమ, వన, అరణ్య, గిరి, పర్వత, సాగర, సరస్వతి, భారతి, పురి అని పది నామములుగలవు.

శ్లో॥ ఇతరేషు చ వర్ణేషు షడ్భేదాః ప్రకీర్తితాః।
ఏకత్ర భిక్షా తీర్థానాం నిద్రాచాన్యత్ర నిత్యశః॥

శ్లో॥ స్వశాఖోపనిషజ్జ్ఞానం విష్ణో ర్నామ సహస్రకమ్।
శ్రీరుద్రం ప్రణవం చైవ నిత్య మావర్తయే ద్యతిః॥
దివాకర సహస్రాఖ్య సంఖ్యయా ప్రణవం జపేత్।

అని రేణుకాతంత్రమున విద్యారణ్యుడు చెప్పినట్లుకలదు. పదినామములలో బ్రాహ్మణ పరివ్రాజకులు కానివారికి ఆరునామములని, బ్రాహ్మణపరివ్రాజకులకు తీర్థ, ఆశ్రమ, సరస్వతి, భారతి అను నాలుగే గలవని చెప్పబడినది. భిక్ష ఒకచోట, నిద్ర వేరొకచోట, స్వశాఖకు చెందిన ఉపనిషత్తును సరిగా అవగాహన చేసికొనుట, విష్ణుసహస్రనామ పారాయణ చేయుట, రుద్రనమక పాఠముచేయుట, ప్రణవ జపము అనునవి తీర్థశబ్దమును గ్రహించు సన్యాసులకు విధించబడినవి.

శ్లో॥ ఏకత్ర పంచదివసా న్నాశ్రమో భైక్ష మాచరేత్।
నిద్రా తత్రైవ కర్తవ్యా తతోఽన్యత వ్రజే ద్ధ్రితమ్॥

శ్లో॥ గీతా పాఠాదికం సర్వం సమమన్య త్పురాయథా।
సప్తరాత్రం సర్వస్వత్యా భిక్షానిద్రాదికం స్మృతమ్॥

ఇక ఆశ్రమ నామమును తీసికొను సన్యాసుల విషయము చెప్పబడుచున్నది. ఒకేచోట ఐదుదినములకు పైగా భిక్షను ఇతడు గ్రహించకూడదు. ఐదుదినములు పూర్తికాగనే ఈ యతి వేరొకచోటికి పోవలెను. తీర్థునకు విధించిన కర్మలతో బాటు ఇతడు గీతాధ్యయనమును కూడచేయవలెను. సరస్వతి అను పేరును గ్రహించు యతి ఒకేచోట ఏడుదినములు మాత్రమే ఉండవచ్చును. తీర్థ, ఆశ్రమ నామములుగల యతులకు విధించిన కర్మల నన్నిటిని ఇతడుకూడ నిర్వర్తింప వలెను.

ఇక మిగిలినది భారతీసన్యాసి విషయము.

శ్లో॥ భారతీ యతయః సర్వే యతీనాం గురవః స్మృతాః।
ద్విమాసం వా త్రిమాసం వా గ్రామేగ్రామే స్థితిః స్మృతా॥

శ్లో॥ గీతాది పాఠః సర్వేషాం సమఏవోదిత స్సదా।
భారతీనాం విశేషస్తు సర్వమంత్ర జప స్సదా॥

శ్లో॥ బాలాది పాదుకాంతానాం మంత్రాణా ముత్తమం జపమ్।
భారతీ యతిభిః కార్యం నిత్యమేవ నసంశయః॥

శ్లో॥ ఓంకారజపమాత్రం త్వన్యేషాం తు విధీయతే।
ప్రణవా దన్యమంత్రాణా మనుష్ఠానం తు నాచరేత్॥

శ్లో॥ ఆచరే ద్యది మూఢాత్మా రౌరవం నరకం ప్రజేత్,
భారతీనాం యతీశానాం ధర్మ ఉక్తః సనాతనః॥

అని రేణుకాతంత్రమున గలదు. భారతీ సంప్రదాయము నకు చెందిన యతులు ఇతరసన్యాసుల కందరకును గురువులు. వీరు ఒక గ్రామమున రెండు, మూడు నెలలు ఉండవచ్చును. గీతాపఠనము, స్వశాఖకు చెందిన ఉపనిషత్తును పఠించుట, విష్ణుసహస్రనామ పారాయణ, శ్రీరుద్రనమకము ప్రణవ జపము వీరికికూడా ఉన్నవి. పైగా వీరికే అన్ని మంత్రము లను జపించుటకు అధికార మున్నది. బాలామంత్రము మొదలుకొని మహాపాదుక వరకు గలమంత్రము లన్నిటిపైన వీరికే అధికార మున్నది. ఇతరయతులు ప్రణవమును ఒక్క మంత్రమునే జపించవచ్చును. వారితర మంత్రములను జపించుట మహాపాపము. ఈ భారతీ సంప్రదాయము శృంగేరీ మఠమునకు, ఈ మఠముయొక్క ఉపమఠములకు మాత్రమే కలదు అని రేణుకాతంత్రము.

భారతీ సంప్రదాయము వారికే అన్నిమంత్రములపై అధికారము గలదని రేణుకాతంత్రము. శ్రీవిద్యారణ్యునకు పూర్వము ఆమ్నాయమఠములుఏస్థితిలో ఉన్నవో తెలియదు. కాని శ్రీవిద్యారణ్యుడు ఈ మఠములకు చక్కని వ్యవస్థను

కలుగజేసి ఆచార్యపీఠమును నిలబెట్టినాడు. శృంగేరీలో శ్రీ విద్యాతీర్థుని మూలకముగా తీర్థసంప్రదాయము కన్పించినను, వస్తుతః ఇచటిది భారతీ సంప్రదాయము. ఈ దక్షిణామ్నాయ మఠమును అన్ని ఆమ్నాయమఠములకు కేంద్రముగా చేసి ఇతరులచే అంగీకరింప జేయగల్గిన మహనీయుడగుటచే విద్యారణ్యుడు స్వతంత్రించి ఉపమఠములను నెలకొల్పగలిగెను. ఇట్టి చొరవ, దూరదృష్టి, గలవ్యక్తి వేరొకడు లేడనుట అతిశయోక్తిగాదు.

ఆత్మబోధేంద్రయతి శృంగేరికి కృష్ణయజుర్వేదము నిచ్చి, "అహం బ్రహ్మాస్మి" అను మహావాక్యమును ఆమఠమున కొసగెను. గోవర్ధనమఠమునకు శుక్లయజుర్వేదము నిచ్చి, "ప్రజ్ఞానం బ్రహ్మ" అను మహావాక్యము వారి దనెను. కాని "అహంబ్రహ్మాస్మి" అను మహావాక్యము శుక్లయజుర్వేదమునకు చెందిన బృహదారణ్యకము లోనిది. "ప్రజ్ఞానం బ్రహ్మ" అనునది ఋగ్వేదమునకు చెందిన ఉపనిషత్తులోనిది.

యతిధర్మనిర్ణయమున నాలుగుమఠములకు నాలుగు గోత్రములు చెప్పబడినవి.

శ్లో॥ వసిష్ఠో భార్గవ శ్చైవ కాశ్యప స్తదనంతరమ్,
భారద్వాజ శ్చ చత్వారి గోత్రాణి కథితాని వై॥

వసిష్ఠ భృగు, కాశ్యప, భారద్వాజ గోత్రములను నాలుగు ఆమ్నాయమఠములకు చెప్పియున్నారు. దీనికి పాఠాంతరమున్నది

తూర్పున కాశ్యపగోత్రము, దక్షిణమున, భూర్భువర్గోత్రము, పశ్చిమమున అవిగతగోత్రము, ఉత్తరమున భృగుగోత్రము అనికూడ గలదు. ఇట్లే ఆమ్నాయమఠములకు భోగవార, కీటవార, భూరివార, ఆనందవారము లను నాలుగు సంప్రదాయములనే యతిధర్మనిర్ణయము మొదలైనవి చెప్పినవి. మిథ్యావార మను సంప్రదాయమును గూర్చి ఈగ్రంథములు చెప్పలేదు. ఆచార్యశంకరుడు ఒక్కొక్క శిష్యుని ఒక్కొక్క ఆమ్నాయ మఠమునకు ఆచార్యునిగా నియమించెను. నలుగురు శిష్యులవిషయమే శంకరవిజయము లన్నియు ప్రస్తుతించినవి. నాలుగు ఆమ్నాయమఠములే చెప్పబడియుండుటచే నల్గురు బ్రహ్మచారుల లక్షణములనే ధర్మశాస్త్రములు నిర్వచించినవి. మిథ్యావార మను సంప్రదాయమున గల సత్య బ్రహ్మచారిని ధర్మశాస్త్రములు నిర్వచింపలేదు. ఈ ఆమ్నాయమఠములలో ప్రతిదానికి ఒక్కొక్క నామము గలదు. గోవర్ధన, శారదా, కాలికాలేక శారాదా, జ్యోతిర్మఠము లని వీటిని పిలతురు. ద్వారకలోను, శృంగేరిలోను శారదా మఠములే ఉండుట గమనీయము. వస్తుతః శారదామఠము శృంగేరిలోనే గలదని అచటనే శారదను శంకరుడు ప్రతిష్ఠించెనని తెలియుచున్నది. ఏవో కారణములవలన ద్వారకా మఠాధిపతి శృంగేరీ వారివద్ద ఎప్పుడో ఉపదేష్టుడై యుండుటచే ద్వారకకూడ శారదామఠమై యుండ వీలున్నది. ద్వారకాపీఠాధిపతివద్ద ఉపదేష్టుడైన ఆచార్యు డెప్పుడో తీర్థ

శబ్దముతో వచ్చినట్లే ద్వారకకుకూడ ఆచార్యులు శృంగేరి నుంచి ఎప్పుడో వెడలినట్లున్నారు. కొల్హాపురమునగల శృంగేరీవారి ఉపమఠ మగు కరవీరమఠము ద్వారకకు దగ్గరలోనే కలదు గదా!

నాలుగు ఆమ్నాయమఠములు నాలుగు వేదముల మీద ఆధారపడి యున్నవని పూర్వమే చెప్పితిమి. మహావాక్యములు నాలుగు మాత్రమే ఉపదేశింప బడినవి. మహావాక్యరత్నావళి, శుకరహస్యోపనిషత్ మొదలగు గ్రంథములలో నాలుగే చెప్పబడినవి. ఋగ్వేదమునకు చెందిన ఐతరేయోపనిషత్ నుంచి "ప్రజ్ఞానం బ్రహ్మ" అని గ్రహించిరి. యజుర్వేదీయమైన బృహదారణ్యకోపనిషత్ లోనిది "అహం బ్రహ్మాస్మి" అను వాక్యము. సామవేదగమైన ఛాందోగ్యోపనిషత్ కు చెందినది. "తత్త్వమసి" అనునది. ఆథర్వణికమైన మాండూక్యములోనిది "అయ మాత్మా బ్రహ్మ" అను వాక్యము.

పీఠమున పరాశక్తి ప్రతిష్ఠింపబడి ఉంటుంది. అందుచేత పీఠము అచలము. స్థానాంతరితమైన పీఠము పూజార్హము కాజాలదు. ఒకేఒక చోటపీఠము స్థావరముగా నుండవలెను. శ్రీవిద్యారణ్యస్వామి విరూపాక్షమున మఠము నేర్పరచి దానికిగూడ శృంగేర్యధీనమైన పీఠముగా చేయ సంకల్పించి, ప్రతాప భారతీపీఠమును ప్రతిష్ఠించెను. విరూపాక్షమఠమున తర్వాతవచ్చిన సన్న్యాసులు అక్కడ ఉండజాలక

పోయిరి. పీఠమును వదలిపోయిన వీరికి మఠాధిపత్యము కుదరదు. హంపీవిరూపాక్ష మనబడు మఠమునకు చెందిన సన్యాసులు పీఠదేవత, పీఠశక్తి లేకుండా, పీఠపూజాదికము లేకుండా వర్తించుటచే వారికి మఠాధిపత్యము కుదరదు. శృంగేరీ శ్రీవిరూపాక్ష పీఠమనబడు అభినవవిరూపాక్ష పీఠము ఆంధ్రదేశపు తూర్పుతీరమునకు వచ్చినది. అక్కడ గుంటూరులో ఈమఠము అచలమై వర్ధిల్లుటకు శ్రీకల్యాణానంద భారతీ శ్రీరాజరాజేశ్వరీ ప్రతిష్ఠగావించి, ఈపీఠమునకు శక్తిని దేవతను యథావిధిగ నెలకొల్పెను.

ఛాత్రాది నిలయమును మఠమందురు, మఠమునకు స్థలాంతర గమనము దోషముకాదు. శక్తిని, దేవతను ప్రతిష్ఠించువరకు మఠముగా నున్న నిలయము, తరువాత పీఠమగును. కాని శ్రీశంకరభగవత్పాదులు నెలకొల్పిన నాలుగు పీఠములే ప్రధానపీఠము లగుటచేతను, ఆపీఠములు కల్పాంతముదాక అచలము లగుటచేతను, వాటికి స్థానచలనము లేనేలేదు. తర్వాత ప్రతిష్ఠింపబడిన పీఠములు ఈనాల్గింటిలో నేదో ఒకదాని పర్యవేక్షణక్రింద వచ్చినవి.

తర్వాతికాలమున దేశములో అనేకశాంకరమఠములు వెలసినవి. వీటిలో కూడలి, సంకేశ్వర, కరవీర, పుష్పగిరి, హావ్యక, శివగంగ, కొప్పాల, శ్రీశైల, రామేశ్వర, రామచంద్రపుర, ఆమని, ఘనగిరి, హోనహళ్లి, భండీగిరి, కైవల్యపుర, ముళబాగల, శిరాలి, ఖిద్రాపుర, నృసింహవాడి,

తీర్థముత్తూరు, తలకాడ, మొల్లవణ, పైరణ, కారీతీర్థ, రాజపుర, గంగోత్రి, తీర్థహళ్ల, మునియూరు, గోకర్ణ, విశ్వేశ్వరారణ్యపుర, సంగమ, నెలమావు, హరిహరపురాది మఠము లనేకము లున్నవి. వీటిలో కొందరు ఏవో ప్రతిష్ఠలు గావించి తమవి పీఠము లని వ్యవహరింప సాగిరి. ఇట్టి ఉపపీఠములను లేవదీసిన శ్రీవిద్యారణ్యుడు వాటిని అన్నిటిని శృంగేరీపీఠమునకు లోబడినవని భావించినాడు.

———

9. మ హా ను శా స న ము

సన్న్యాస మొనగి మఠాధిపతులను గావించిన వారికి శంకరు డిచ్చిన ఉపదేశమును మహానుశాసన మని అందురు. దీనిలో ఇరువదియారు శ్లోకములు గలవు.

శ్లో॥ ఉకా శ్చత్వార ఆమ్నాయా యతీనాం చ పృథక్ పృథక్। 1
తే సర్వే చతురాచార్యాః నియోగేన యథాక్రమమ్॥

శ్లో॥ ప్రయో క్తవ్యాః స్వధర్మేషు శాసనీయా స్తతో ఽన్యథా।
కుర్వంత ఏవ సతత మటనం ధరణీతలే॥ 2

శ్లో॥ విరుద్ధాచార సంప్రాప్తా వాచార్యాణాం సమాజ్ఞయా।
లోకాన్ సంశీలయం త్వేవ స్వధర్మా ప్రతిరోధతః॥ 3

వేర్వేరుగా యతుల నిమిత్తము ఆమ్నాయములు చెప్ప బడినవి. ఈ ఆచార్యులు నలుగురును యథాక్రమముగ నిర్దేశము ననుసరించి స్వధర్మము ననువర్తింతురుగాక! లేనిచో దండనీయు లగుదురు. వీరు సర్వదా ధర్మప్రచార మొనర్చుచు పర్యటన చేయుచుండవలెను. స్వధర్మమునకు వ్యతిరేకము గాకుండా ప్రజలలో కన్పించు విరుద్ధాచారాదులను గమనించి సరిదిద్దుచుండవలెను.

శ్లో॥ స్వస్వ రాష్ట్ర ప్రతిష్ఠిత్యై సంచారః సువిధీయతామ్।
మఠే తు నియతం వాస ఆచార్యస్య న యుజ్యతే॥ 4

తమతమ రాష్ట్రములలో ప్రతిపత్తిని సంపాదించు నిమిత్తము వీరు చక్కగా సంచార మొనర్పవలెను. నిరంతరము మఠ ములో కూరుచుండుట ఆచార్యునకు తగదు. మఠాధిపతి దేశ

సంచారము గావించిననే ధర్మపాలన చక్కగా ఉండగలదు, స్థితిగతులు తెలియగలవు.

శ్లో॥ వర్ణాశ్రమ సదాచారా అస్మాభి ర్యే ప్రసాధితాః।
రక్షణీయా స్తు ఏవై తే స్వేస్వే భాగే యథా విధి॥ 5

శ్లో॥ యతో వినష్టి ర్మహతీ ధర్మస్యాత్ర ప్రజాయతే।
మాంద్యం సంత్యాజ్య మేవాత్ర దాక్ష్యమేవ సమాశ్రయేత్॥ 6

మేము సాధించిన సదాచారములను వర్ణాశ్రమధర్మములు, ఈమతాచార్యులు తమతమ భాగముగా నిర్ణయింపబడిన రాజ్యములో చక్కగా రక్షితము లగునట్లు చూతురుగాక! ప్రస్తుతము ధర్మము ఎంతగానో క్షీణించి యున్నది. కనుక వీరు మందకొడితనమును వదలి, తమసామర్థ్యమును చూపుదురు గాక! ఇందుకే దేశవిభాగము చేయబడినది. ఈ విభాగమున ఏప్రాంతమును వదలలేదు.

శ్లో॥ పరస్పర విభాగే తు ప్రవేశో న కదాచన।
పరస్పరేణ కర్తవ్యా ఆచార్యేణ వ్యవస్థితిః॥ 7

శ్లో॥ మర్యాదాయా వినాశేనా లుప్యేర న్నియామాః శుభాః।
కలహాంగార సంపత్తిరత స్తాం పరివర్జయేత్ ॥ 8

శ్లో పరివ్రాడార్య మర్యాదాం మామకీనాం యథా విధి।
చతుః పీఠాధిగాం సత్తాం ప్రయుంజ్యా శ్చ పృథక్ పృథక్॥ 9

వారివారికి గాను నిర్ణయింపబడిన ప్రదేశములలో ఇంకొకరు ప్రవేశింపగూడదు. అను ఈ నిర్ణయమునకే ఆచార్యులు పరస్పరామోదముతో కట్టుబడి యుందురు

గాక! హద్దుమీరి ప్రవర్తించినచో శుభప్రదములగు నియమములుగూడ లోపించును. కలహమను నిప్పు పుట్టును. కనుక నియమోల్లంఘనము కుదరదు. సన్యాసియగువాడు నేను నిర్మించిన ఈ ఆర్యమర్యాదను యథావిధిగ నాల్గుమఠముల అధిపతులద్వారా రక్షించునట్లు తన శక్తిని వినియోగింపనగును.

శ్లో॥ శుచి ర్జితేంద్రియో వేద వేదాంగాది విశారదః।
యోగజ్ఞః సర్వశాస్త్రాణా మస్మ దాస్థాన మాప్నుయాత్॥ 10

శ్లో॥ ఉక్తలక్షణ సంపన్నః స్యాచ్చే న్మత్పీఠభాగ్భవేత్।
అన్యథా ఽఽరూఢ పీఠోపి నిగ్రహార్హో మనీషిణామ్॥ 11

పవిత్రుడు, జితేంద్రియుడు, వేదవేదాంగ పారగుడు, సర్వశాస్త్రజ్ఞుడు, యోగిపురుషుడు అగు వాడే నా ఆస్థానమును ప్రవేశించునుగాక! ఇట్టి లక్షణములు గల పురుషుడే నాపీఠము నలంకరించుగాక! ఇందుకు వ్యతిక్రమముగ పీఠము నెట్లో సంపాదించినపక్షమున బుద్ధిమంతులగువారి నిగ్రహము నకు పాల్పడును. పదకొండవ శ్లోకమున కన్పించు రాజరికము శంకరునిమాటలలో కన్పించక పోవుటచే ఈమహానుశాసనము శ్రీవిద్యారణ్య విరచితమను సందేహము కలుగ గలదు.

శ్లో॥ నజాతు మఠ ముచ్ఛింద్యా దధికారి ణ్యుపస్థితే।
విఘ్నానా మపి బాహుళ్యా దేషధర్మః సనాతనః॥ 12

ఉపయుక్తుడగు ఆచార్యుడు లభించిన, ఎట్టి విఘ్నపరం పరలనైన ఎదుర్కొని, మఠక్రమమును కాపాడి సనాతన ధర్మమును రక్షించునుగాక !

శ్లో॥ అస్మత్పీఠ సమారూఢః పరివ్రాడుక్తలక్షణః।
అహమేవేతి విజ్ఞేయో యస్య దేవ ఇతి శ్రుతేః॥ 13

పూర్వము చెప్పబడిన లక్షణములుగల పరివ్రాజకుడు నాపీఠమును అలంకరించిన ప్రజలు అతనిని నన్నుగానే భావించి, "యస్య దేవ" అను శ్రుతిని అనుసరించి గురుభక్తిని ప్రదర్శింతురుగాక! ఈ శ్లోకమునగల ప్రతిజ్ఞ కూడ శంకరుని సహజ శైలిలోనిదిగా కన్పించదు. వేరొక శంకరుని దృష్టిలో నుంచుకొని ఆయన శిష్యులిట్లు వ్రాసి యుండవచ్చును.

శ్లో॥ ఏక ఏవాభిషేచ్యః స్యాదంతే లక్షణ సంమతః।
తత్తత్పీఠే క్రమేణైవ న బహూ ర్యుజ్యతే క్వచిత్॥ 14

శ్లో॥ సుధన్వనః సమౌత్సుక్య నిర్వృత్త్యై ధర్మహేతవే।
దేవరాజ్యోపచారాంశ్చ యథావ దనుపాలయేత్॥ 15

శ్లో॥ కేవలం ధర్మ ముద్దిశ్య విభవో బాహ్యచేతసామ్।
విహిత శ్చోపకారాయ పద్మపత్ర నయంవ్రజేత్॥ 16

శ్లో॥ సుధన్వా హి మహారాజ స్తదన్యే చ నరేశ్వరాః।
ధర్మపారంపరీమేతాం పాలయంతు నిరంతరమ్॥ 17

ఒక్కొక్క పీఠమునకు ఆయా ఆచార్యుల కంతిమదశ ప్రాప్తించినపుడు, ఒక్కొక్కనికే పట్టము నొసగవలెనే గాని

ఒకే మఠమునకు పెక్కుమంది ఆచార్యు లుండరాదు. ధర్మ రక్షణార్థము సుధన్వు డను రాజునకు గల ఔత్సుక్యమును గమనించి ఇంద్రాజ్ఞవలె అతని వాక్యములను ప్రజలు పాలింతురుగాక! సాధువుల ఐశ్వర్యము ధర్మరక్షణ నిమిత్తము, బాహ్యచిత్తులగు జనులకు ఉపకరించుటకును, కనుక తామరాకుపై నీటివలె నిర్లిప్తులై ఉండనగును. సుధన్వమహారాజును, మిగిలిన రాజులునుగూడ ఈ ధర్మపరంపరను రక్షింతురు గాక! ఈ సుధన్వశబ్దమునకు శంకరు డను అర్థమురుద్రనమక ప్రయోగముల వలన తెలయుచున్నది.

ఇచ్చట శృంగేరీ వారి మహానుశాసనమున ఈక్రింది ఐదుశ్లోకములు అధికముగా కన్పించుచున్నవి.

శ్లో॥ బ్రహ్మక్షత్ర కులే భూత్వా భారతీపీఠవంచకః।
తదార్థా చ్చ్యవతే చాంతే పైశాచీ యోని మాప్నుయాత్॥

శ్లో॥ శారదామఠ ఆచార్య ఆశ్రమాఖ్యో బహూత్తమః।
గోవర్ధనస్య విజ్ఞేయో ఽరణ్యనామా విచక్షణః॥

శ్లో॥ జ్యోతిర్మఠస్య సతతం పర్వతాఖ్యో విగద్యతే।
శృంగవేర మఠే నిత్యం భారతీ బహు భావనః॥

శ్లో॥ నిర్ణయో ఽసౌ సువిజ్ఞేయ శ్చతుష్పీఠాధికారిణా।
నాత్ర వ్యత్యయ ఆదేయః కదాచిదపి శీలినా॥

శ్లో॥ మఠా శ్చత్వార ఆచార్యా శ్చత్వార శ్చ ధురంధరాః।
సంప్రదాయా శ్చ చత్వార ఏషాధర్మ వ్యవస్థితిః॥

భారతీ పీఠము శృంగేరీపీఠము. ఈ పీఠమును మోస గించువాడు పాపి. అతడు పిశాచ జన్మను లోను కాగలడు. ద్వారకా పీఠమున ఆశ్రమశబ్ద వాచ్యుడగు ఆచార్యుడు ఉత్తముడు. గోవర్ధన మఠమున శ్రేష్ఠమైన ఆచార్యుడు అరణ్యశబ్దముతో వ్యవహరింపబడువాడు. జ్యోతిర్మఠమున ఆచార్యుని పర్వతశబ్దముతో పిలుచుట శ్రేష్ఠము. శృంగేరి యందలి అధిపతిని భారతీ అను పేరుతో వ్యవహరించుట ఉత్తమము. కాని రేణుకాతంత్రము ననుసరించి తీర్థ, ఆశ్రమ సరస్వతి, భారతి అను అంకితనామములే బ్రాహ్మణపరివ్రాజకులు తీసికొనవలసినవని గలదు. ఈ నామములు ద్వారక శృంగేరి, మఠములకు మాత్రమే వర్తించున వగుటచేత, శృంగేరీపాఠమున మార్పులు కన్పించవచ్చును. కాని రేణుకా తంత్ర మిచ్చుచున్న తీర్థ, ఆశ్రమ శబ్దములను వదలుటకు కారణము కన్పించదు.

శ్లో॥ చాతుర్వర్ణ్యం యథా యోగ్యం వాఙ్మనః కాయకర్మభిః
గురోః పీఠం సమర్చేత విభాగానుక్రమేణవై॥ 18

నాలుగు వర్ణములకు చెందిన ప్రజలు యథాయోగ్యముగ దానిని రక్షించుచు పూర్వము చెప్పిన విభాగానుసారము వారివారి గురుపీఠముల నర్చింతురు గాక! ఇట్టి గురుపీఠములు నాలుగే అని పూర్వమే వివరింపబడినది.

శ్లో॥ ధరా మాలంబ్య రాజానః ప్రజాభ్యః కరభాగినః
కృతాధికారా ఆచార్యా ధర్మత స్తద్వదేవహి॥

శ్లో॥ దర్మో మూలం మనుష్యాణాం సచాచార్యావలంబనః।
తస్మా దాచార్యసుమణేః శాసనంసర్వతోఽధికమ్॥ 20

రాజ్యాధికారమును పొందిన రాజులు ప్రజలనుండి పన్నులను గ్రహించునట్లు, ధర్మాధికారమును పొందిన ఆచార్యులు దానిని రక్షించు నిమిత్తము పన్నులను గ్రహింతురు. మానవులకు ధర్మమే ఆధారము. అది ఆచార్యుని అవలంబించి యుండును. కనుక ఆచార్యాను శాసనము లన్నిటిని మించినది పీఠమున నియుక్తు డగు యతీశ్వరునకు ఆధ్యాత్మిక విషయముల పైననే గాక, లౌకికవిషయములపైన గూడ అధికారము శ్రీవిద్యాతీర్థునితో బయలు దేరి, శ్రీవిద్యారణ్యుని చేతిలో పరిపక్వత నందినది.

శ్లో॥ ఆచార్యాక్షిప్త దండాస్తు సంతః సుకృతినో యథా।
నిర్మలాః స్వర్గ మాయాంతి కృత్వా పాపాని మానవాః॥ 21

పాపులుకూడ ఆచార్యుని దండనమును పొందినచో శుద్ధులై, పుణ్యపురుషులవలెనే, స్వర్గమును పొందగలరు. ఆచార్యుని మహిమ అట్టిది. ఆచార్యునకు బహిష్కరించు అధికారము, అను గ్రహించు శక్తి గలవని తాత్పర్యము. ఈ అధికారములను వారు నిర్వర్తించునపుడు ఇతరులు ఎట్టి జోక్యమును కలిగించుకొన జాలరు.

శ్లో॥ తా నాచార్యోపదేశాం శ్చ రాజదండాం శ్చ పాలయేత్।
తస్మా దాచార్య రాజానా వనవద్యౌ ననిందయేత్॥ 22

శ్లో॥ ఇత్యేవం మనురప్యాహ గౌతమో పి విశేషతః।
విశిష్ట శిష్టాచారో ఽపి మూలా దేవ ప్రసిద్ధ్యతి॥ 23

శ్లో॥ తస్మా త్సర్వప్రయత్నేన శాసనం సర్వసంమతమ్।
ఆచార్యస్యవిశేషేణ హ్యౌదార్య భరభాగినః॥ 24

ఆచార్యోపదేశములు, రాజదండములు, పాలనీయములు. రాజును, ఆచార్యుడును, దోషరహితులు నిందనీయులు గారు. ఇట్టి నియమములు స్వకపోలకల్పితములు కావు. మనువు, గౌతముడు మొదలగువారు కూడా వీటినే చెప్పిరి. విశిష్టమగు శిష్టాచారముకూడ మూలభూత మగు వేదమువలననే ప్రసిద్ధమైనది. కావున ఆచార్యుడు ప్రయత్నముతో నొసగు ఉపదేశము నందరును, ముఖ్యముగా ఉదారులగువారు, స్వీకరింప నగును.

ఆచార్యునకు రాజునకు గల సాదృశ్యమును వివరించు ఈశ్లోకములలో శ్రీవిద్యారణ్యుని జీవిత వైభవము స్ఫురించుచున్నది. రాజులనుకూడా శ్రీవిద్యారణ్యుడు అతని గురు వగు శ్రీవిద్యాతీర్థ మహేశ్వరుడు అరచేతిలో నుంచుకొనిరి.

శ్లో॥ ధర్మస్య పద్ధతి ర్హ్యేషా జగతః స్థితిహేతవే॥
సర్వవర్ణాశ్రమాణాం హి యథాశాస్త్రం విధీయతే॥ 25

జగత్తుయొక్క శుభమును గోరి, సర్వవర్ణములకు, ఆశ్రమములకు శాస్త్రవిహితమైన ఈపద్ధతి విధింప బడుచున్నది. దీనిని ఆచరణలో పెట్టవలసిన బాధ్యత ప్రభువుపైన, యతీశ్వరునిమీాదకూడ గలదు.

ఈమహోపదేశమును చేయగల్గినవాడు మహాదేవుని అవతారమే కావలెను.

శ్లో॥ కృతే విశ్వగురు ర్బ్రహ్మా త్రేతాయా మృషిసత్తమః
ద్వాపరే వ్యాసయేవ స్యా త్కలావత్ర భవామ్యహమ్ ॥ 26

కృతయుగమున బ్రహ్మయు, త్రేతాయుగమున వసిష్ఠుడును, ద్వాపరమున వ్యాసుడును జగద్గురువులు. కలియుగమున నేనే జగద్గురువునై జన్మించితిని. కలియుగమున శంకరుడు జగద్గురువని భావము. బహుశః ఈ శంకరుడు ప్రస్థానత్రయ భాష్యకర్త కాకపోవచ్చును. ఈయన విద్యాశంకరు డని ప్రసిద్ధిగన్న శ్రీవిద్యాతీర్థ మహాస్వామి కావచ్చును. శ్రీవిద్యారణ్యుడు మొదలగువారు ఈయనను మహేశ్వరునిగా భావించిరి.

---

10 శాంకర దర్శనము

శంకరభగవత్పాదులు రచించిన గ్రంథము లనేకము లున్నవి. భగవద్గీత, ద్వాదశోపనిషత్తులు, వేదాంత సూత్రములుకలసి ప్రస్థానత్రయము. శంకరుడు ప్రస్థానత్రయ భాష్యములను రచించెను. మాండూక్యకారికపైన విష్ణుసహస్రనామములమీాద, లలితాత్రిశతిమీాద, గాయత్రిపైన భాష్యములను చెప్పెను. శంకరుడు మొదట ఉపనిషద్భాష్యములను తర్వాత గీతాభాష్యమును వ్రాసి, ఆపైి సనత్సుజాతీయ భాష్యమును, నృసింహతాపనీ భాష్యమును రచించినట్లు మాధవీయమున (6.61-62) కలదు. చివరకు వేదాంత సూత్రభాష్యమును రచించెనని (6,82) యున్నది. బ్రహ్మసూత్ర భాష్యరచన చేయుటకు ఉపనిషత్తులు వాటి అర్థములు జిహ్వాగ్రమున ఉండితీరవలెను గనుక శారీరక భాష్యమునకుముందే ఉపనిషద్భాష్యములు రచింపబడిననని యెంచవలెను. ఇవి అన్నియు అద్వైత దర్శనమునకు ప్రాణము వంటివి.

అద్వైతమున భక్తికి తావులేదని తర్వాతివారు యెంచిరి. ఇది పొరబాటు. శంకరు డనేకస్తుతులను గావించెను. గణేశ పంచరత్నములు, గణేశ భుజంగప్రయాతము గణేశాష్టకము, వరదగణేశ స్తోత్రము అనునవి ఆచార్యుని శైలిని, పాండిత్యమును, కవితాపటిమను భక్తిని చాటునవి. తర్వాత ఎన్నిక గన్నవి శివస్తుతులు. వీటిలో శివభుజంగము,

శివానందలహరి, శివాపాదాది కేశాంత స్తోత్రము శివ కేశాది పాదాంతస్తోత్రము, వేదసార శివస్తోత్రము శివా పరాధక్షమాపణ స్తోత్రము, సువర్ణమాలాస్తుతి, దక్షిణా మూర్తి వర్ణమాల, దక్షిణామూర్త్యష్టకము, మృత్యుంజయ మానసికపూజ, శివనామావల్యష్టకము, శివపంచాక్షరము, ఉమామహేశ్వర స్తోత్రము, అర్ధనారీశ్వరస్తోత్రము, దక్షిణా మూర్తి స్తోత్రము, కాలభైరవాష్టకము, శివపంచాక్షర రత్నమాల, దశశ్లోకీస్తుతి, ద్వాదశలింగస్తోత్రముముఖ్యమైనవి.

దేవీస్తుతిని శంకరుడనేక విధముల గావించెను. సౌందర్య లహరి, దేవీ భుజంగస్తోత్రము, ఆనందలహరి, త్రిపురసుందరీ వేదపాదస్తోత్రము, త్రిపురసుందరీ మానసపూజ, దేవీ చతుః షష్ట్యుపచార పూజ, త్రిపురసుందర్యష్టకము, లలితా పంచ రత్నము, కల్యాణవృష్టిస్తవము, నవరత్నమాలిక, మంత్ర మాతృకా పుష్పమాలాస్తవము, గౌరీదశకము, భవానీ భుజంగము, కనకధారాస్తోత్రము, అన్నపూర్ణాష్టకము, మీనాక్షీ పంచరత్నము, మీనాక్షీస్తోత్రము, భ్రమరాంబా ష్టకము, శారదా భుజంగప్రయాతాష్టకము. వీటిలో అద్వైత దృక్పథమును వదలక, సామాన్యునకు అందుబాటులో నుండు నట్లు తత్త్వము హృదయంగమముగా వివరింప బడినది.

విష్ణుస్తుతులలో విష్ణుభుజంగప్రయాత, విష్ణుపాదాది కేశాంతస్తోత్రము, పాండురంగాష్టకము, అచ్యుతాష్టకము, కృష్ణాష్టకము, హరిమీడే స్తోత్రము, గోవిందాష్టకము, భగవ

న్మానసపూజ, జగన్నాథాష్టకము, రామభుజంగప్రయాత లక్ష్మీనృసింహ పంచరత్నము, లక్ష్మీనృసింహ కరుణారస స్తోత్రము ఉన్నవి. వీటిని వివేచించినచో శంకరునకు శివుని యందెంత భక్తియో విష్ణువుపైకూడ అంతభక్తియే కల దని తెలియగలదు.

హనుమత్పంచరత్నము, సుబ్రహ్మణ్య భుజంగ ప్రయాత, ప్రాతః స్మరణస్తోత్రము, గుర్వష్టకము, నర్మదాష్ట కము, యమునాష్టకము, గంగాష్టకము, మణికర్ణికాష్టకము, కాశీపంచకము కూడ ఆచార్యుడు చెప్పిన స్తోత్రములలో గలవు. ఈస్తోత్రములలో జ్ఞానమార్గ మగు అద్వైత దర్శన మును భక్తిమార్గముతో చక్కగా సమన్వయ పరచుట చేతనే తర్వాతి కాలమున అద్వైత దార్శనికు డగు మధు సూదన సరస్వతి భగవద్భక్తిరసాయనము అను గ్రంథమును వ్రాయగల్గెను.

ప్రకరణగ్రంథములు అనేకము శంకరుని పేరుతో నున్నవి. అద్వైతపంచరత్నము, అద్వైతానుభూతి, అనాత్మ శ్రీవిగర్హణ ప్రకరణము, అపరోక్షానుభూతి, ఆత్మబోధ ఉపదేశపంచకము, ఉపదేశసాహస్రీ, ఏకశ్లోకీ, కౌపీనపంచ కము, చర్పటపంజరికా, జీవన్ముక్తానందలహరి, తత్త్వబోధ, తత్త్వోపదేశము, దశశ్లోకీ, ద్వాదశపంజరిక, ధన్యాష్టకము నిర్గుణ మానసపూజ, నిర్వాణమంజరి, నిర్వాణషట్కము, పంచీకరణప్రకరణము, పరాపూజా, ప్రబోధసుధాకరము,

ప్రశ్నోత్తర రత్నమాలిక, ప్రౌఢానుభూతి, బ్రహ్మజ్ఞానావలీ మాల, బ్రహ్మానుచింతనము, మనీషాపంచకము, మాయా పంచకము, ముముక్షుపంచకము, యోగతారావళి, లఘు వాక్యవృత్తి, వాక్యవృత్తి, విజ్ఞాననౌక, వివేకచూడామణి, వైరాగ్యపంచకము;, శతశ్లోకి, షట్పది, సదాచారాను సంధా నము, సర్వవేదాంత సిద్ధాంతసారసంగ్రహము, స్వాత్మనిరూ పణము, స్వాత్మప్రకాశిక అనునవి ఆచార్యుడు చెప్పిన ప్రకరణ గ్రంథములు. వీటిలోఆత్మబోధ, ఏకశ్లోకి, దశశ్లోకి, పంచీకరణప్రకరణము, మనీషాపంచకము, లఘువాక్యవృత్తి అను వాటిపై తర్వాతి, అద్వైతులు వాఖ్యలను గూడ రచించిరి.

వేదాంతసూత్రము 1.3.33 పైగల కల్పతరువులో అమలానందుడు ప్రపంచసార తంత్రమునుండి ఉదహరించెను. ఈతంత్రముపై పద్మపాదుని వ్యాఖ్య ఉన్నది. మంత్రశాస్త్ర మున నిది యొక ప్రధానగ్రంథము. ఇది శంకరభగవత్పాద రచన అనుటలో ఎట్టి సందేహమును కన్పించదు.

ఈవివిధ గ్రంథములలో శంకర భగవత్పాదులు ప్రపం చించిన అద్వైతదర్శనమును స్థూలముగా తెలిసికొనినచో ఆచార్యుని మహత్తరకృషి చక్కగా అర్థము కాగలదు.

అద్వైత వేదాంతమున ప్రధానమైనది అనుభూతి. దీనిని 85శ్లోకములలో ఆచార్యులు వివరించిరి. వీటిని గమ నించిన అద్వైతతత్త్వము సుగమ మగును.

శ్లో॥ సర్గస్థితిప్రలయహేతు మచింత్యశక్తిం
విశ్వేశ్వరం విదితవిశ్వ మనంతమూర్తిమ్।
నిర్ముక్తబంధన మపారసుఖాంబురాశిం
శ్రీవల్లభం విమలబోధఘనం నమామి॥

శ్లో॥ యస్య ప్రసాదా దహమేవ విష్ణుః
ర్మయ్యేవ సర్వం పరికల్పితం చ
ఇత్థం విజానామి సదాత్మరూపం
తస్యాంఘ్రియుగ్మం ప్రణతో౽స్మి నిత్యమ్॥

శ్లో॥ అహ మానందసత్యాదిలక్షణః శ్శివః।
ఆనందాదిరూపం యత్ తన్నాహ మచలో౽ద్వయః॥

పరమేశ్వరుడు సృష్టి, స్థితి, లయములకు కారణభూతుడు; ఆయన శక్తి ఊహింప నలవి గానిది; సమస్త విశ్వమునకు ప్రభువైనవాడు; విశ్వము యొక్క జ్ఞానము గలవాడు; అనంతములైన రూపములను ధరించినవాడు; సంసారబంధము లేనివా డాయన; అపారసుఖాంబురాశి; నిర్మలజ్ఞానఘనుడై వెలుగొందునట్టివాడు. అట్టి శ్రియఃపతికి నమస్కారము.

ఎవని అనుగ్రహము వలన, 'విష్ణుస్వరూపుడను,' అనగా సర్వవ్యాపకుడగు పరమాత్మను నేనే; నాయందే ఈ జగ మంతయు పరికల్పితమైనది' అని తెలిసికొనుచున్నానో, ఎవడు సదాత్మస్వరూపుడో, ఆ పరమేశ్వరుని పాదయుగ్మము నకు నిత్యము నమస్కరింతును.

సచ్చిదానంద లక్షణుడను నేను; కేవల శివస్వరూపు డను నేను, ఆనందరహితమైన దేది కలదో, అదినేను కాదు. నే నచలుడగు అద్వయ స్వరూపుడను.

శ్లో॥ అక్షిదోషా ద్యథైకోపి ద్వయవద్భాతి చంద్రమాః।
ఏకోఽప్యాత్మా తథా భాతి ద్వయవత్ మాయయా మృషా॥

శ్లో॥ అక్షిదోషవిహీనానా మేక ఏవ యథా శశీ।
మాయాదోషవిహీనానా మాత్మైవైక స్తథా సదా॥

శ్లో॥ ద్విత్వం భాత్యక్షిదోషేణ చంద్రే ప్వే మాయయా జగత్।
ద్విత్వం మృషా యథా చంద్రే మృషా ద్వైతం తథాఽఽత్మని॥

శ్లో॥ ఆత్మనః కార్య ఆకాశో వినాఽఽత్మానం న సంభవేత్।
కార్యస్య పూర్ణతా సిద్ధా కిం పునః పూర్ణతాఽఽత్మనః॥

శ్లో॥ కార్యభూతో యథాఽఽకాశ ఎక ఏవ న హి ద్విధా।
హేతుభూత స్తథాఽఽత్మాఽయ మేక ఏవ విజానతః॥

తా॥ కాచకామలాదిదోషగ్రస్తమైన నేత్రమునకు ఒకే చంద్రుడు ఇద్దరు చంద్రులు వలె కనిపించునట్లు, మాయా వృతమైన బుద్ధికి అద్వయాత్మ ద్విధాగా భాసించును. ఇది మిథ్యాజ్ఞాన మని తెలియనగును.

దోషరహితమైన చూపు గలవారు ఒకే చంద్రుని దర్శించు రీతిగా, మాయచే అనావృతమైన చైతన్యము గల వారు నిరంతరము ఏకాత్మదర్శనమునే చేయుదురు.

కంటి దోషము చేతనే చంద్రుడు రెండుగా భాసించు చున్నాడు. అదేరీతిగా, మాయావృతు డగుటచే తనయందు అనగా, అఖండమగు ఆత్మపదార్థమునందు ద్వైత ప్రపంచ భ్రాంతికలుగుచున్నది. కాన చంద్రునియందు సద్వితీయత్వము,ఆత్మయందు ద్వైతము- రెండును మిథ్యయే.

ఆత్మకార్యమగు ఆకాశము ఆత్మ లేకుండా ఉనికి కలిగి యుండుట అసంభవము. కార్యమగు ఆకాశమునకు పూర్ణత్వము, అనగా సర్వవ్యాపకత్వము కలుగుచుండగా కారణమగు ఆత్మయొక్క స్థితి వేరే చెప్పవలసిన పని యేము న్నది? అనగా, ఆత్మపదార్థమునకు పూర్ణత సిద్ధించుమనే యున్నది అని గ్రహింపనగును.

ఆత్మకార్యమగు ఆకాశము ఏకమే గాని, రెండు గాదు. అదే విధముగ కారణభూతమైన ఈ యాత్మగూడ ఒక్కటియే యని తెలిసికొననగును.

శ్లో॥ ఏకో౽పి ద్వయవద్భాతి యథా౽౽కాశ ఉపాధితః।
ఏకోపి ద్వయవత్ పూర్ణ స్తథా౽౽త్మా౽య ముపాధితః॥

శ్లో॥ కారణోపాధిచైతన్యం కార్యసంస్థచితో౽ధికమ్।
న ఘటాభ్రాత్ మృదాకాశః కుత్రచిత్ నాధికోభవేత్॥

శ్లో॥ నిర్గతోపాధి రాకాశః ఏకః ఏవ యథా భవేత్
ఏక ఏవ తథా౽౽త్మాయం నిర్గతోపాధిక స్సదా॥

శ్లో॥ ఆకాశా దన్య దాకాశ మాకాశస్పృక్ యథా న హి।
ఏకత్వా దాత్మనో నాన్య ఆత్మా సిధ్యతి చాత్మని॥

శో॥ మేఘయోగాత్ యథా నీరం కరకాకారతా మియాత్।
మాయాయోగాత్ తథైవాత్మా ప్రపంచాకారతా మియాత్॥

ఆకాశము ఏకమయ్యు ఘటమఠాది ఉపాధిభేదమువలన ఇది ఘటాకాశము, ఇది మఠాకాశము అని భిన్నముగ గన్పడునట్లు పూర్ణమగు ఆత్మయు దేహేంద్రియ బుద్ధ్యాది ఉపాధిభేదము ననుసరించి అనేకరూపముల భాసించుచుండును.

మృదాకాశము ఘటాకాశము కంటె ఎచ్చటను, ఎన్నడును, అధికమై భిన్నము గానియట్లు కారణోపాధి చైతన్యమగు ఈశ్వరుడు కార్యోపాధి సంఘాతచైతన్యమగు జీవునికంటె అధికమును గాదు; భిన్నమును గాదు. మృదాకాశభిన్నమైన ఘటాకాశము లేనియట్లు కారణోపాధి చైతన్యమగు ఈశ్వరుని కంటె భిన్నమగు కార్యోపాధిసంఘాత చైతన్యమగు జీవుడును లేడు. ఆ యిరువురును ఒక్కరే.

ఘటమఠాది ఉపాధులు నశించినంతనే ఆకాశము అఖండమై ఏకరూపమున భాసించునట్లుగా శరీరదేహేంద్రియాది ఉపాధులు తొలగినంతనే ఆత్మయు ఏకమై అద్వితీయమై యొప్పారును.

ఏకమైన ఆకాశము కంటె భిన్నమగు ఆకాశము మరొకటి యుండజాలదు. దానియందలి భేదము ఉపాధి

కల్పితము గాని, వాస్తవము గాదు. అట్లే, ఏకత్వ హేతువు వలన ఆత్మాన్యమైన యాత్మ యుండనేరదు.

మేఘసంబంధము వలన జలము మంచుగడ్డ రూపమును పొందుచున్నది. అదేవిధముగ మాయాసంపర్కము చేత ఆత్మ ప్రపంచాకారమును భజించుచున్నది.

శ్లో॥ వర్షోపల ఇవాభాతి నీరమేవాభ్రయోగతః।
వర్షోపలవినాశేన నీరనాశో యథా న హి॥

శ్లో॥ ఆత్మైవాయం తథా భాతి మాయాయోగాత్ ప్రపంచవత్।
ప్రపంచస్య వినాశేన స్వాత్మనాశో న హి క్వచిత్॥

శ్లో॥ జలా దన్య ఇవాభాతి జలోత్థో బుద్బుదో యథా।
తథాఽఽత్మనః పృథగివ ప్రపంచోఽయ మనేకథా॥

శ్లో॥ యథా బుద్బుదనాసేన జలనాశో న హి క్వచిత్।
తథా ప్రపంచనాశేన నాశ స్స్యా దాత్మనో న హి॥

శ్లో॥ అహినిర్ల్వయినీజాతః శుచ్యాది ర్న అహి మాప్నుయాత్।
తథా స్థూలాదిసంభూతః శుచ్యాది ర్నాప్నుయా దిమమ్॥

తా॥ మేఘసంపర్కము చేత ఉదకమే ఘనీభవించి వడగళ్ళ రూపమున భాసించును. వడగళ్ళు మరల ద్రవీభవనము చెందినను జలమునకు నాశము లేదు.

అదేరీతిగ మాయ యొక్క సంసర్గము వలన ఈ ఆత్మయే ప్రపంచముగ భాసించుచున్నది. ఆ ప్రపంచము నాశమొందినను, ఆత్మకు నాశ మెన్నడును సంభవించదు.

జలము నుండి ఆవిర్భవించిన బుద్బుదము జలము కంటె భిన్నముగ గన్పట్టినట్లు ఆత్మకంటె భిన్నమైనదానివలె ఈ ప్రపంచము అనేకరూపముల నాభాసించుచున్నది.

బుద్బుదనాశము వలన జల మెన్నడును నష్టము కాదు. అట్లే ప్రపంచము వినష్టమైనను, ఆత్మనాశము ఎన్నడును సంభవించదు.

పాము కుబుసము యొక్క శుద్ధత్వ మాలిన్యాదులు సర్పమును స్పృశింపజాలని రీతిగా, స్థూలాదిశరీర గుణము లైన స్వచ్ఛత, మాలిన్యము మున్నగునవి ఈ ఆత్మను స్పృశింపజాలవు.

శ్లో॥ త్యక్తాం త్వచ మహిః యద్వత్ ఆత్మత్వేన న మన్యతే।
ఆత్మత్వేన తథా జ్ఞానీ త్యక్తదేహత్రయం సదా॥

శ్లో॥ అహినిర్ల్వయినీనాశాత్ అహేర్నాశో యథా న హి।
దేహత్రయవినాశేన నాత్మనాశ స్తథా భవేత్॥

శ్లో॥ తక్రాది లవణోపేత మజ్ఞైః లవణవ ద్యథా।
ఆత్మా స్థూలాదిసంయుక్తో దృశ్యతే స్థూలకాదివత్॥

శ్లో॥ అయఃకాష్ఠాదికం యద్వత్ వహ్నివ ద్వహ్నియోగతః।
భాతి స్థూలాదికం సర్వం ఆత్మవత్ స్వాత్మయోగతః॥

శ్లో॥ దాహకో నైవ దాహ్యం స్యాత్ దాహ్యం యద్వత్ న దాహకః।
న చాత్మాఽఽయ మనాత్మా స్యాత్ అనాఽత్మాయం న చాత్మకః॥

తా॥ సర్పము తాను వదలిన కుబుసమును తాను అని భావించదు. అట్లే జ్ఞాని తనచే పరిత్యజింపబడిన స్థూలాదిశరీరత్రయము ఆత్మభావమున జూడడు.

పాముకుబుసము నాశ మందినను పాము నష్టముకాదు. అదేవిధముగ, దేహత్రయము వినష్టమైనను ఆత్మ నాశ మందదు.

ఉప్పు వేసిన మజ్జిగను అజ్ఞానులు లవణమయ మని భావించురీతిగ, స్థూలాదిఉపాధియుక్తమైన ఆత్మను అజ్ఞులు స్థూలాదులుగనే భావింతురు.

వహ్నిసంసర్గముచే లోహకాష్ఠములు వహ్నివలెనే అనిపించునట్లు ఆత్మసంసర్గము వలన ఈ స్థూల సూక్ష్మాది ప్రపంచ మంతయు ఆత్మగా భాసమాన మగుచున్నది.

దాహకమగు అగ్ని దాహ్యవస్తువు కాజాలదు; దాహ్యవస్తువును దాహకమగు అగ్ని కానేరదు. అదే రీతిగా ఆత్మ అనాత్మయు గాదు; అనాత్మ ఆత్మయును కానోపదు.

శ్లో॥ ప్రమేయ దిత్రయం సాక్షిం భానునా ఘటకుడ్యవత్।
యేన భాతి స ఏవాహం ప్రమేయాదివిలక్షణః॥

శ్లో॥ భానుస్ఫురణతో యద్వత్ స్ఫురతీవ ఘటాదికమ్।
స్ఫురతీవ ప్రమేయాది స్వాత్మస్ఫురణత స్తథా॥

శ్లో॥ పిష్టాదిః గుడసంయోగాత్ గుడవత్ ప్రీతిమాన్ యథా।
ఆత్మయోగాత్ ప్రమేయాదిః ఆత్మవత్ ప్రీతిమాన్భవేత్॥

శ్లో॥ ఘటనీరాన్నపిష్టానా ముష్ణత్వం వహ్నియోగతః।
వహ్నిం వినా కథం తేషా ముష్ణత్వంస్యాత్ యథాక్వచిత్॥

శ్లో॥ భూతభౌతికదేహానాం స్ఫూర్తిత్వం స్వాత్మయోగతః।
వినాఽఽత్మానం కథం తేషాం స్ఫూర్తితా స్యాత్ తథా క్వచిత్॥

తా॥ సూర్యుని వలన ఘటము కుడ్యము మున్నగు వస్తుజాత మంతయు ప్రకాశించుచుండును. అట్లె పరమాత్మ వలన ప్రమేయ-ప్రమాణ ప్రమాతృత్రయము ఇంద్రియసహిత ముగ భాసమాన మగుచుండును. అట్టిప్రమేయాదిత్రయాతీతుడగు పరమాత్మను నేనే.

సూర్యప్రకాశము వలన ఘటకుడ్యాదు లవభాసించు రీతిగా, స్వాత్మప్రకాశము వలన ప్రమేయాదిత్రయము భాసించుచుండును.

పిష్టము మున్నగు భోజ్యపదార్థములు గుడసహిత మైనపుడు బెల్లము వలె మధురమై ప్రీతిని గొల్పుచుండును. అట్లే, ప్రమేయాదికము ఆత్మసహితమై ఆత్మవలెనె ప్రీతి దాయకమగుచున్నది.

అగ్నిసంపర్కము వలన ఘటము, జలము, అన్నము, పిష్టము మున్నగు పదార్థములకు ఉష్ణత్వము కలుగుచున్నది. వహ్నిసంయోగము లేకుండా వానికి ఉష్ణత్వము కలుగ నేరదు.

అదేరీతిగా, స్వాత్మసంబంధము వలననే భూత, భౌతిక శరీరములకు స్ఫురణము కలుగుచున్నది. ఆత్మ లేకుండిన, వానికి స్ఫూర్తి ఎట్లు కలుగును ? అవి ప్రకాశింప జాలవు.

శ్లో॥ నానావిధేషు కుంభేషు వసే దేకం నభో యథా।
నానావిధేషు దేహేషు తథైవైకో వసామ్యహమ్॥

శ్లో॥ నానావిధత్వం కుంభానాం న యాత్యేవ యథా నభః।
నానావిధత్వం దేహానాం తద్వదేవ న యామ్యహమ్॥

శ్లో॥ యథా ఘటేషు నష్టేషు ఘటాకాశో న నశ్యతి।
తథా దేహేషు నష్టేషు నైవ నశ్యామి సర్వగః॥

శ్లో॥ ఉత్తమాదీని పుష్పాణి వర్తంతే సూత్రకే యథా।
ఉత్తమాద్యా స్తథా దేహా వర్తంతే మయి సర్వగే॥

శ్లో॥ యథా న సంస్పృశేత్ సూత్రం పుష్పాణా ముత్తమాదితా।
తథా నైవం సర్వగం మాం దేహానా ముత్తమాదితా॥

తా॥ భిన్నరూపములతో నుండు ఘటములలో ఒకే ఆకాశము ఉండును. అట్లే నానావిధములైన దేహాద్యుపాధులందు నేనొక్కడనే వెలుగొందుచుందును.

ఘటములు నానారూపములు. అయినను తదాకాశము మాత్రము నానావిధము గాదు. అదేరీతిగా, దేహములు నానావిధము లయినను ఆత్మ నానావిధము గాదు; అది ఒక్కటే.

ఘటములు వినష్టమైనను, ఘటాకాశము నాశ మొందని విధమున, నానావిధములగు శరీరములు నష్టమైనప్పటికి, సర్వగతుడ నగుటచే నాకు; అనగా ఆత్మకు నాశము లేదు.

ఒకే దారమున ఉత్తమ, మధ్యమ, అధమములగు పూలు గ్రుచ్చబడు చందముగా, సర్వవ్యాపకమైన ఆత్మ యందు ఉత్తమ మధ్యమాధమ శరీరములు వెలయుచున్నవి.

సూత్రగ్రథితములైన పుష్పముల యొక్క ఉత్తమత్వాది ధర్మములు సూత్రమును స్పృశింపజాలని రీతిగా, సర్వగతుడ నగు నన్ను దేహధర్మములైన ఉత్తమత్వాదులు స్పృశింపజాలవు.

శ్లో॥ పుష్పేషు తేషు నష్టేషు యద్వత్ సూత్రం న నశ్యతి।
తథా దేహేషు నష్టేషు నైవ నశ్యామి సర్వగః॥

శ్లో॥ రజ్జురంధ్రస్థదోషాది సూర్యాభం న స్పృశే ద్యథా।
తథా క్షేత్రస్థదోషాది సర్వగం మాం న స్పృశేత్॥

శ్లో॥ తద్రజ్జురంధ్రనాశేషు నైవ నశ్యతి సూర్యభా।
తథా క్షేత్రవినాశేషు నైవ నశ్యామి సర్వగః॥

శ్లో॥ దేహో నాహం దృశ్యత్వాత్ భౌతికత్వా న్న చేంద్రియమ్।
ప్రాణో నాహ మనేకత్వాత్ మనో నాహం చలత్వతః॥

శ్లో॥ బుద్ధి ర్నాహం వికారిత్వాత్ తమో నాహం జడత్వతః।
దేహేంద్రియాదికం నాహం వినాశిత్వాత్ ఘటాదివత్॥

తా॥ గ్రథితములైన ఆ పుష్పములు వాడిపోయినను, తదాధారభూతమైన సూత్రమునకు వికార మేమియు నుండదు. అదే మాదిరిగ, నానావిధములగు ఈ దేహము లన్నియు వికారమునంది వినష్టములైనను, సర్వగతుడను, నిత్యుడను అగు నాకు ఎట్టి నాశము లేదు.

రజ్జురంధ్రస్థదోషములు సూర్యప్రకాశమును అంటజాలవు. అట్లే, శరీరగత దోషాదులు సర్వగతుడ నగు నన్ను స్పృశింపజాలవు.

రజ్జురంధ్రములు నశించినను, సూర్యభానమునకు క్షతి యుండనట్లు క్షేత్రవినాశమైనను, క్షేత్రియు, సర్వగతుడ నగు నాకు వినాశము లేదు.

దేహము దృశ్యము గాన, నేను దేహమును గాను; ఇంద్రియములు భౌతికములు అందుచే నేను ఇంద్రియములను గాను; ప్రాణము లనేకము లగుటవలన నేను ప్రాణములను కాను; మనసు చంచలమైన దగుటవలన మనసును నేను గాను.

బుద్ధివికారి గాన, నేను బుద్ధిని గాను; తమస్సు జడవస్తువగుటచే నేను తమస్స్వరూపమును గాను; ఘట, పటాదులవలె దేహేంద్రియాదులు వినాశశీలములు గాన, నేను దేహేంద్రియాదిస్వరూపమును గాను.

శ్లో॥ దేహేంద్రియ మనోబుద్ధ్యజ్ఞానాని భాసయన్ః
అహంకారం తథా భామి చైతేషాం చాభిమానినమ్॥

శ్లో॥ సర్వం జగదిదం నాహం విషయత్వాదికం ధియః।
అహం నాహం సుషుప్త్యాదౌ అహామ స్సాక్షిత స్సదా॥

శ్లో॥ సుప్తౌ యథా నిర్వికార స్తథాఽవస్థాద్వయేఽపి చ।
ద్వయో ర్మాత్రాదియోగేన న వికారీ భవామ్యహమ్॥

శ్లో॥ ఉపాధినీలరక్తాద్యైః స్ఫటికో నైవ లిప్యతే।
తథాఽఽత్మా కోశాద్యై స్సర్వైః కామాద్యైః నైవ లిప్యతే॥

శ్లో॥ పాలేన భ్రామ్యమాణేన భ్రమతీవ యథా మహీ।
అగోఽప్యాత్మా విమూఢేన చలతీవ ప్రదృశ్యతే॥

తా॥ దేహేంద్రియ ప్రాణమనోబుద్ధులను అజ్ఞానమును భాసింపజేయుచు ఈ దేహేంద్రియాదులందు ఆత్మభావముతో నభిమానించు అహంకారమును గూడ నేనే భాసింప జేయు చున్నాను.

ఈ సకల జగత్తు విషయాదులు బుద్ధియు నేను గాను. సుషుప్త్యాదులందు అహంకారసాక్షిస్వరూపమున నేనే వెలుగొందుచున్నాను.

సుషుప్తికాలమున నేను నిర్వికారుడనై యుందును. అట్లే జాగ్రత్స్వప్నదశలందును వికారరహితుడ నయియే భాసమాన మగుచుందును. జాగ్రత్స్వప్నము లందలి విషయ సంపర్కము వలన నేను వికారము నొందను.

జపాకుసుమాది ఉపాధిగతములైన నీలరక్తాదులచే స్ఫటికము లిప్తము కానట్లు అన్నమయాదికోశముల వలన ఉద్భవించు కామక్రోధాదుల చేత ఆత్మ స్పృశింపబడజాలదు.

నాగటి మొన తిరుగుచున్నపుడు భూమిగూడ పరిభ్రమించుచున్నట్లు కన్పడు రీతిగా అజ్ఞానికి నిశ్చలమగు ఆత్మ చలనస్వభావము గలదిగ గన్పట్టుచున్నది

శ్లో॥ దేహత్రయ మిదం నిత్య మాత్మత్వే నాభిమన్యతే।
యావత్తావత్ అయం మూఢో నానాయోనిషు జాయతే॥

శ్లో॥ నిద్రాదేహజదుఃఖాది జాగ్రద్దేహం న సంస్పృశేత్।
జాగ్రద్దేహజదుఃఖాది స్తథాఽఽత్మానం న సంస్పృశేత్॥

శ్లో॥ జాగ్రద్దేహవ దాభాతి నిద్రాదేహస్తు నిద్రయా।
నిద్రాదేహవినాశేన జాగ్రద్దేహో న నశ్యతి॥

శ్లో॥ తథాఽయ మాత్మవద్భాతి జాగ్రద్దేహస్తు జాగరే।
జాగ్రద్దేహవినాశేన నాత్మా నశ్యతి కర్హిచిత్॥

శ్లో॥ హిత్వాఽయం స్వప్నగం దేహం జాగ్రద్దేహ మపేక్షతే।
జాగ్రద్దేహం ప్రబుద్ధోఽయం హిత్వాఽఽత్మానంయథా తథా॥

తా॥ మూఢుడు ఈ దేహత్రయమును 'అనగా, స్థూల, సూక్ష్మ, కారణ శరీరములను నిత్యమని ఆత్మస్వరూపముగా ఎంతవరకు అభిమానించుచుండునో, అంతదనుక నానావిధ యోనులందు జన్మించుచునే యుండును.

స్వప్నప్రపంచమున శరీర మనుభవించు సుఖదుఃఖాదులు జాగ్రద్దశలో శరీరమును తాకజాలనట్లు, జాగ్రదవస్థలో శరీరమనుభవించు సుఖదుఃఖాదులును ఆత్మను స్పృశింప జాలవు.

స్వప్నప్రపంచమున గన్పట్టు శరీరము అజ్ఞానము వలన, జాగ్రత్ప్రపంచమునందలి శరీరముభాతి తోచును. కాని, స్వప్నపరికల్పితశరీరము జాగరణ మందినంతనే వినష్టమగును; కాని, జాగ్రదవస్థ యందలి దేహము నాశ మొందదు.

అదేరీతిగ, జాగరణసమయమున జాగ్రదవస్థయందలి శరీరమునందు ఆత్మప్రతీతి కలుగుచున్నది; కాని జాగ్రద్దశ యందు ప్రతీయమానమగు ఈ దేహము నాశ మొందినప్పుడు ఆత్మనశించదు.

స్వప్నగతమైన శరీరమును వదలి ప్రబోధము నందిన వ్యక్తి జాగ్రద్దశయందలి శరీరమును దర్శించురీతిగానే, జాగ్రచ్ఛరీరభ్రాంతి నుండి విముక్తుడైన జ్ఞాని ఆత్మను దర్శించును.

శ్లో॥ స్వప్నభోగే యథైవేచ్ఛా ప్రబుద్ధస్య న విద్యతే।
అసత్స్వర్గాదికే భోగే నైవేచ్ఛా జ్ఞానిన స్తథా॥

శ్లో॥ భోక్తా బర్హీ యథా భోగ్యః సర్పో దృషది కల్పితః।
రూపం శిలాఒఒవయో ఠాతాౡబో క౯ బోగ౯స౯ రూపకః॥

శ్లో॥ జ్ఞస్య నాస్త్యేవ సంసారో యద్వ దజ్ఞస్య కర్మిణః।
జానతో నైవ భీః యద్వత్ రజ్జుసర్ప మజానతః॥

శ్లో॥ సైంధవస్య ఘనో యద్వత్ జలయోగాత్ జలం భవేత్।
ఆత్మయోగా త్తథా బుద్ధిః ఆత్మవత్ బ్రహ్మవేదినః

శ్లో॥ తోయాశయేషు సర్వేషు భాను రేకోఽప్యనేకవత్।
ఏకోఽప్యాత్మా తథా భాతి సర్వక్షేత్రేషు అనేకవత్॥

తా॥ జాగరణము నందినవాడు స్వప్నప్రపంచములో అనుభవించిన భోగములందు వాంఛ చూపడు. అట్లే జ్ఞానులు అనిత్యములగు స్వర్గాదిభోగములను పొందగోరరు.

శిలయందు మయూరమును భోక్తగాను, సర్పమును భోగ్యముగను మలచినను ఆ రెండును శిలారూపములే. ఆ రెంటియందు భోక్తృభోగ్యభావము కల్పింపబడినట్లు నిష్క్రియమగు ఆత్మయందు భోక్తృభోగ్యభావము పరికల్పనము చేయబడుచున్నది.

భోగఫలార్థియై కామ్యకర్మానుష్ఠాన మొనర్చునట్టి అజ్ఞానికే ఈ సంసారచక్రపరిభ్రమణ ముండును గాని, నిష్కామియగు జ్ఞానికి సంసారములేదు; బంధము లేదు. మునిమాపువేళ రజ్జువును జూచి సర్ప మని భ్రాంతి నందినవానికే భయము గాని యథార్థమగు రజ్జుజ్ఞానము కలవానికి భయ మెట్లు కలుగును? మిథ్యాభిభూతుడు కానట్టి జీవన్ముక్తునకు సంసారభయ ముండదు.

సైంధవఘనము, అనగా ఉప్పుకల్లు జలసంబంధము చేత జలరూప మందినట్లు, బ్రహ్మవేత్తయొక్క బుద్ధియు ఆత్మసంపర్కము వలన ఆత్మాకారము నొందును.

వివిధ జలాశయములలో ప్రతిఫలించు సూర్యుడు నానావిధముల ప్రతీయమానమైనట్లు, ఒకే ఆత్మ సర్వ దేహములందు భాసమానమగుచు నానావిధముల స్ఫురించు చుండును.

శ్లో॥ భానో రన్య ఇవాభాతి జలభాను ర్జలే యథా।
ఆత్మనోఽన్య ఇవాభాసో భాతి బుద్ధౌ తథాఽఽత్మనః॥

శ్లో॥ బింబం వినా యథా నీరే ప్రతిబింబో భవేత్ కథమ్।
బింబాత్మానం తథా బుద్ధౌ చిదాభాసో భవేత్ కథమ్॥

శ్లో॥ ప్రతిబింబచలత్వాద్యా యథా బింబస్య కర్హిచిత్,
న భవేయు స్తథా ఆభాసకర్తృత్వాద్యాస్తు నాత్మనః॥

శ్లో॥ జలశైత్యాదికం యద్వత్ జలభానుం న సంస్పృశేత్।
బుద్ధేః కర్తృత్వ భోక్తృత్వ దుఃఖిత్వాద్యైస్తు సంయుతః।
శ్చిదాభాసో వికారీవ శరావస్థాంబుభానువత్॥

తా॥ జలమునందు ప్రతిఫలించు సూర్యుడు బింబభూతు డయిన సూర్యుని కంటె అన్యుడుగా దోచునట్లు, బుద్ధి యందు భాసించు ఆత్మభాసముగూడ ఆత్మభిన్నముగ ప్రతీయమాన మగును.

బింబము లేనిచో, నీటియందు ప్రతిబింబము కన్ప ట్టదు. అట్లే, బింబభూతమైన ఆత్మ లేనిచో, బుద్ధియందు,

చిదాభాస, స్ఫురించదు. ఆత్మవిరహితముగా చిదాభాస ప్రతిఫలింపనేరదు.

జలమున ప్రతిబింబించునట్టి సూర్యుని చంచలత్వాదులు బింబభూతుడైన సూర్యునియందు ఉండవు. అట్లే చిదాభాసుని కర్తృత్వ, భోక్తృత్వాది ధర్మములు ఆత్మకు నుండజాలవు.

శైత్యాదికములు ఉదకధర్మములు. అవి జలమున ప్రతిఫలించు సూర్యుని స్పృశింపజాలునా? అట్లు స్పృశించుట అనుభవదూరము. అదేరీతిగ, బుద్ధిసంబంధులగు కామ క్రోధాదులచే ఆత్మ స్పృశింపబడజాలదు.

ఘటము, శరావము మున్నగువాని యుదకమున ప్రతిఫలన మందు సూర్యుడు వికారివలె గన్పట్టురీతిగా, బుద్ధి సంబంధులగు కర్తృత్వ-భోక్తృత్వ-సుఖిత్వ-దుఃఖిత్వాదుల సంపర్కమువలన చిదాభాసుడు వికార మందినవానివలె అనగా, వాని ననుభవించు వానివోలె, పరిదృశ్యమానుడగును.

శ్లో॥ శరావస్థోదకే నష్టే తత్స్థభాను ర్వినష్టవత్।
బుద్ధేర్లయే తథా సుప్తౌ నష్టవత్ ప్రతిభా త్యయమ్॥

శ్లో॥ జలస్థార్కం జలం చోర్మిం భాసయన్ భాతి భాస్కరః।
ఆత్మభాసం ధియం బుద్ధేః కర్తృత్వాదీ నయం తథా॥

శ్లో॥ మేఘావభాసకో భానుః మేఘాచ్ఛన్నోఽపి భాసతే।
మోహావభాసక స్తద్వత్ మోహాచ్ఛన్నోఽపి భాత్యయమ్॥

శ్లో॥ భాస్యం మేఘాదికం భానుః భాసయన్ ప్రతిభాసతే।
తథా స్థూలాదికం భాస్యం భాసయన్ ప్రతిభా త్యయమ్॥

శ్లో॥ సర్వప్రకాశకో భానుః ప్రకాశ్యై ర్న దూష్యతే।
సర్వప్రకాశకో హ్యాత్మా సర్వై స్తద్వత్ న దూష్యతే॥

తా॥ ఘటశరావాదులందలి జలము వినష్టమయినంతనే, ఆ యుదకమున ప్రతిభాన మొందిన సూర్యుడును వినాశ మొందినట్లు, అనిపించును. అదే మాదిరిగా, బుద్ధి లయము చెందినంతనే, బుద్ధిప్రతిఫలిత చిదాభాసుడు కూడ సుప్త డయినట్లును వినష్టు డయినట్లును ప్రతీతమగును.

భాస్కరుడు తాను ప్రకాశించుచు, జలప్రతిఫలిత భానుని, జలమును, జలతరంగములను, భాసింపజేయుచుండును. అదేరీతిగ, ఆత్మ స్వయంప్రకాశమానుడై చిదాభాసుని, బుద్ధిని, బుద్ధిధర్మములైన కర్తృత్వ, భోక్తృత్వాదులను భాసమానములనుగా నొనర్చుచుండును.

మేఘాచ్ఛన్నుడైనను, భాస్కరుడు తాను ప్రకా శించుచు మేఘములను గూడ భాసింపజేయుచుండును. అట్లే ప్రత్యగాత్మయు మోహాచ్ఛన్నుడైనను, ఆ మోహము నవభాసింపజేయుచు, తానును భాసమానుడగుచుండును.

భాస్కరుడు భాస్యములగు మేఘాదుల నవభాసింప జేయుచు తాను తేజరిల్లుచుండును. అట్లే, ప్రకాశ్యమగు

స్థూలవస్తుజాతము నంతయు ప్రకాశింపజేయుచు ఆత్మ స్వయం ప్రకాశుడై యొప్పారుచుండును.

సర్వప్రకాశకుడైన భాస్కరుడు ప్రకాశ్యములగు వస్తుదోషముల వలన మలినుడు కాజాలని రీతిగా, నిఖిల జగత్ప్రకాశన శీలుడైన ఆత్మయు తద్దోష దూషితుడు కానేరడు.

శ్లో॥ ముకురస్థం ముఖం యద్వత్ ముఖవత్ ప్రథతే మృషా।
బుద్ధిస్థాభాసక స్తద్వత్ ఆత్మవత్ ప్రథతే మృషా॥

శ్లో॥ ముకురస్థస్య నాశేస ముఖనాశో భవేత్ కథమ్।
బుద్ధిస్థాభాసనాశేన నాశో నైవాత్మనః క్వచిత్॥

శ్లో॥ తామ్రకల్పితదేవాదిః తామ్రా దన్య ఇవ స్ఫురేత్।
పతిభార్యాదిరూపేణ తథాఽఽత్మోత్థ మిదం జగత్॥

శ్లో॥ ఈశజీవాదివద్భాతి యథైకమపి తామ్రకమ్।
ఏకోఽప్యాత్మా తథైవాయ మీశజీవాదివత్ మృషా।

శ్లో॥ యథేశత్వాదినాశేన తామ్రనాశో న విద్యతే।
తథేశత్వాదినాశేన నాశో నైవాత్మన స్సదా॥

తా॥ దర్పణమునందలి ముఖము యథార్థముఖము వలె అని పించినను, అది మిథ్యయే. అటులే బుద్ధియందు గోచరమగు చిదాభాసయు ఆత్మవలె ప్రతీతమగును. అదియు మృషయే.

దర్పణమందు ప్రతిఫలించు ముఖము నష్టమైనను బింబభూతమైన ముఖమున కేమియు క్షతి లేనట్లు, బుద్ధిస్థమైన చిదాభాసమునకు వినాశము కల్గినను, ఆత్మ కెన్నడును వినాశము లేదు.

తామ్రముతో చేయబడిన దేవతామూర్తులు తామ్ర భిన్నములుగ గన్పట్టురీతిగ, ఆత్మనుండి యావిర్భూతమైన యీ జగమంతయు సతి, పతి, పుత్రాదిరూపమున, ఆత్మ భిన్నముగా గన్పట్టును.

ఒకే తామ్రఖండము ఈశ, జీవ, వస్త్వాది రూపమున భాసిల్లుచుండునట్లు ఈ ఆత్మయు జీవ, ఈశ్వరాది మిథ్యా రూపములతో నానావిధములుగా భాసమాన మగుచుండును.

తామ్రమునందు కల్పితములైన జీవేశ్వరాదిరూపములు వినష్టమైనను, తామ్రఖండమున కెట్లు నాశము లేదో, అట్లే జీవేశ్వరాదులు నశించినను, అద్వయాత్మతత్త్వమునకు నాశము లేదు.

శ్లో॥ అధ్యస్తో రజ్జుసర్పోఽయం సత్యవత్ రజ్జుసత్తయా।
తథా జగదిదం భాతి సత్యవత్ స్వాత్మసత్తయా॥

శ్లో॥ అధ్యస్తాహే రభావేన రజ్జురేవ అవశిష్యతే।
తథా జగదభావేన సదాత్మైవ అవశిష్యతే॥

శ్లో॥ స్ఫటికే రక్తతా యద్వత్ ఉపాధే ర్నీలతాంబరే।
యథా జగదిదం భాతి తథా సత్య మివాద్వయే॥

శ్లో॥ స్ఫటికే రక్తతా మిథ్యా మృషా ఖే నీలతా యథా।
తథా జగదిదం మిథ్యా త్వేకస్మి న్నద్వయే మయి॥

శ్లో॥ జీవేశ్వరాదిభావేన భేదం పశ్యతి మూఢధీః।
నిర్భేదే నిర్విశేషేఽస్మిన్ కథం భేదా భవే ద్ధ్రువమ్॥

తా॥ నిరధిష్ఠానముగ భ్రాంతి యుండదు. రజ్జువును జూచి సర్పభ్రాంతి కలుగుచున్నది. రజ్జుసత్తచేతనే, అధ్యస్తసర్పము సత్యము వలె ప్రతీయమాన మగుచున్నవి. అటులనే, ఆత్మ యందు అధ్యస్తమైన జగత్తుఆత్మసత్తవలననే సత్యవస్తువువలె అవభాసించుచున్నది.

అధ్యస్తమగు సర్పము యొక్క భ్రాంతి తొలగినంతనే రజ్జువే మిగులుచున్నది. అట్లే జగన్మిథ్యాత్వజ్ఞానము కలిగి నంతనే సద్రూపమగు ఆత్మ యొక్కటే మిగులును.

ఉపాధిప్రయుక్తములైన రక్త, నీలవర్ణములు స్ఫటికము, ఆకాశాదులందు దృగ్గోచరమగు చందమున ఈ ప్రపంచము గూడ నిర్మలమైన అద్వయ ఆత్మతత్వమునందు సత్యవస్తువు వలె కన్పట్టును.

స్ఫటికమందలి ఎఱ్ఱదనము ఆకాశమందలి నీలిమ మిథ్యయయినట్లు, ఈ ప్రపంచమును మిథ్యయే. రక్తత్వ, నీలత్వగుణములు స్ఫటిక-ఆకాశము లందు కల్పితమైనట్లు ఈ జగత్తుఆత్మయం దధ్యస్తమై యున్నది.

అజ్ఞానవిమోహితచిత్తుడు జీవేశ్వరులందు భేదమును దర్శించును. కాని, సజాతీయ, విజాతీయ, స్వగత భేదశూన్యము నిర్విశేషము నగు ఆత్మయందు భేదభావము లెట్లుండును.

శ్లో॥ లింగస్య ధారణాదేవ యతోఽయం జీవతాం వ్రజేత్।
లింగనాశే శివస్యాస్య జీవతాఽఽవేశతా కుతః॥

శ్లో॥ శివ ఏవ సదా జీవో జీవ ఏవ సదా శివః।
వేత్తి ఐక్య మనయో ర్యస్తు స ఆత్మజ్ఞో న చేతరః॥

శ్లో॥ క్షీరయోగా ద్యథా నీరం క్షీరవ ద్దృశ్యతే మృషా।
ఆత్మయోగా దనాత్మాయ మాత్మవ ద్దృశ్యతే తథా॥

శ్లో॥ నీరాత్ క్షీరం పృథక్కృత్య హంసో భవతి నాన్యథా।
స్థూలాదేః స్వం పృథక్కృత్య ముక్తో భవతి నాన్యథా॥

శ్లో॥ క్షీరనీరవివేకజ్ఞో హంస ఏవ న చేతరః।
ఆత్మానాత్మవివేకజ్ఞో యతిరేవ న చేతరః॥

తా॥ కేవలచిత్స్వరూపమగు ఆత్మ లింగమును, అనగా ఉపాధిని ధరించుట చేత జీవభావమును పొందుచున్న దగుట వలన, లింగనాశ మయినంతనే అనగా, ఉపాధులు వినష్టమైనంతనే, అది జీవభావమును పొందుట యనున దేమియుండును ? నిరుపాధికమైన ఆత్మతత్త్వమే యుండును.

సర్వదా శివుడే జీవస్వరూపమున వెలయుచుండును. అట్లే జీవుడే శివస్వరూపమున విభ్రాజమాను డగును. జీవేశ్వరుల ఐక్యము నెరిగినవాడే, ఆత్మవేత్త; భేదదర్శన మొనర్చువాడు ఆత్మజ్ఞుడు కానేరడు.

క్షీరముతో గలిసిన నీరము క్షీరమువలె పరిలక్షిత మగుచుండును; ఇదివట్టికల్ల. అట్లే ఆత్మసంపర్కము వలన, అనాత్మయు ఆత్మవలెనె అవభాసించు చుండును.

నీరక్షీరవివేకము కలదియే హంస; మరొకవిధమున గాదు. స్థూల దేహేంద్రియాదులనుండి తనను - ఆత్మను పృథక్కరించగల వాడే సంసారబంధమునుండి విముక్తుడగును; ఉపాయాంతరములచే కానేరడు.

నీరక్షీరవివేకజ్ఞాన మొక్క హంసకే గలదు. మరొక దానికి యీ జ్ఞానము లేదు. ఆత్మానాత్మవివేకము కలవాడు ఒక్క యతిమాత్రమే, కర్మోపాసనానిష్ఠులకు ఆత్మానాత్మ వివేకజ్ఞులు కాజాలరు.

శ్లో॥ అధ్యస్తచోరజః స్థాణోర్వికార స్స్యాత్ న హి క్వచిత్।
నాత్మనో నిర్వికారస్య వికారో బింబజ స్తథా॥

శ్లో॥ జ్ఞాతే స్థాణౌ కుతశ్చోరః చౌరాభావే భయం కుతః।
జాతే స్వస్మిన్ కుతో విశ్వం విశ్వాభావే కుతోఽఖిలమ్।

శ్లో॥ గుణమూర్తిత్రయం భాతి పరస్పరవిలక్షణమ్।
సత్త్వాదిలక్షణో యస్మిన్ స ఏవాహం నిరంశకః।

శ్లో॥ దేహత్రయ మిదం భాతి యస్మిన్ బ్రహ్మణి సత్యవత్।
తదేవాహం పరబ్రహ్మ దేహత్రయవిలక్షణమ్॥

శ్లో॥ జాగ్రదాదిత్రయం యస్మిన్ ప్రత్యగాత్మని సత్యవత్।
స ఏవాహం పరం బ్రహ్మ జాగ్రదాదివిలక్షణః॥

శ్లో॥ విశ్వాదికం త్రయం యస్మిన్ పరమాత్మని సంస్థితమ్।
స ఏవ పరమాత్మాఽహం విశ్వాదికవిలక్షణః॥

శ్లో॥ విరాడాదిత్రయం భాతి యస్మిన్ బ్రహ్మణి నశ్వరమ్।
స ఏవ సచ్చిదానందలక్షణోఽహం స్వయంప్రభః॥

తా॥ అంధకారమునందు స్థాణువును జూచి భ్రాంతితో చోరుడని తలతుము; కాని అధ్యస్తమగు ఆస్థాణువునందు ఎట్టి వికారమును కలుగదు. అట్లే, నిర్వికారమగు ఆత్మకు బింబజమైన వికార మేదియు కలుగదు.

సమీపమున కేగినపుడు 'ఇది స్థాణువే; దొంగ కాదు' అను జ్ఞానము కలిగినంతనే యిక దొంగ యెక్కడ యుండును ? చోరాభావమున భయ మెట్లు కలుగును? అట్లే ఆత్మస్వరూపావగతి కలిగినంతనే విశ్వ మెక్కడ యుండును? ఈ సంసారమే లేనప్పుడు తత్సంబద్ధమగు ఈ నిఖిలవస్తుజాత మెట్లుండును ?

పరస్పరవిరుద్ధములు, త్రిగుణాత్మకములునగు త్రిమూర్తులు, వెలుగొందుచున్నవి. వానిలో నేది సత్త్వగుణసంపన్నమో, ఏదినిరంశమో, అనగా పూర్ణమో అట్టి ఆత్మస్వరూపము నేనే.

ఏ పరబ్రహ్మస్వరూపమునందు స్థూల,సూక్ష్మ, కారణ, శరీరత్రయము సత్యమైనదానివలె ప్రతీత మగు

చున్నదో, ఏ పరబ్రహ్మ శరీరత్రయవిలక్షణమై భాసిల్లు చున్నదో, ఆ పరబ్రహ్మను నేనే యని గ్రహింపనగును.

జాగ్రత్-స్వప్న-సుషుప్తు లనబడు అవస్థాత్రయము ఏ ప్రత్యగాత్మయందు సత్యమువలె భాసించుచున్నదో, ఏది జాగ్రదాది అవస్థాత్రయవిలక్షణమై విభ్రాజమాన మగు చున్నదో, ఆ పరబ్రహ్మస్వరూపమును నేనే.

విశ్వ-తైజస-ప్రాజ్ఞ నామములతో అవస్థాత్రయము నందు విరాజిల్లు చిదాభాసుడు ఏ పరమాత్మయందు సుస్థితి కలిగియున్నాడో, ఆ విశ్వాదిత్రయవిలక్షణుడైన ఆ పర మాత్మను నేనే.

విరాట్టు, హిరణ్యగర్భుడు, ఈశ్వరుడు-ఈ సశ్వరమైన మూర్తిత్రయము పరబ్రహ్మయందు భాసించుచుండును. అట్టి సచ్చిదానందస్వరూపుడు స్వయంప్రకాశుడు నగు పర బ్రహ్మను నేనే యని చింతనము సేయనగును.

ప్రత్యక్షము, అనుమానము, శబ్దము, ఉపమానము, అర్థాపత్తి, అనుపలబ్ధి అను ఆరు ప్రమాణములలో ముఖ్య మైనవి శబ్దము, ప్రత్యక్షము. శబ్దప్రమాణమున శ్రుతికూడ కలదు. "సదేవ సోమ్యేద మగ్రఆసీదేక మేవాద్వితీయం" అను ఛాందోగ్యశ్రుతి పరమాత్మ ఏక మని, ఇదే తత్త్వమని చెప్పు చున్నది. ఈ పరమాత్మ చిత్స్వరూపుడు. వస్తుతః చూచువాడు

(ద్రష్టా), చూడబడునది (దృశ్యం), చూచుట (దృశి) అను మూటిని అందరును అనుభవించుచున్నను. దృశ్యమగు వస్తువునకు ఆశ్రయము ద్రష్ట యని చూచుటకు విషయమైనది దృశ్య మని చెప్పవలెను. అప్పుడు దృశ్యము, ద్రష్ట అనునవి రెండును చూచుట లేనిదే ఉండుజాలవు గనుక దృశ్యాదికమును నిర్వచింపవలె ననిన, దృశి స్వరూపమును తెలిసికొనవలెను. దృశిని నిరుపాధిక మని, సోపాధిక మని వ్యవహరింతురు. నిరాశ్రయము, నిర్విషయము, సన్మాత్ర రూపమున సజ్జానమును నిరుపాధికమైన దృశి యందురు, దీనినే బ్రహ్మ యని పరమాత్మ యని పిలతురు. ఆశ్రయము కలది, విషయము నపేక్షించునదియునై లౌకికమగు ప్రమాణాదిజన్య జ్ఞానరూపము గలది సోపాధికము. కల్పితములగు అఖిలవస్తువులకు ఆశ్రయమై, కల్పనాధిష్ఠానభూతమగునది సర్వజగన్మూలభూత మగు బ్రహ్మ. కావున "యతో వా ఇమాని" అను తైత్తిరీయశ్రుతి, "జన్మాద్యస్య యతః" అను బ్రహ్మసూత్రము, వీటిపై గల భాష్యము బ్రహ్మను సర్వజగత్తుకు మూలకారణముగా వివరించినవి.

కార్యాపేక్ష ననుసరించి కారణము సూక్ష్మము, వ్యాపకము కూడ అగుచున్నది.

"సూక్ష్మతావ్యాపితేజ్ఞేయే గకథాదేయత్తరోత్తరమ్
ప్రత్యగాత్మావసానేషు పూర్వపూర్వప్రహాణతః"

అని ఉపదేశసాహస్రిలో ననిరి. పృథివ్యాది కార్యములకు ముందు చెప్పినదానికి తర్వాతది కారణము. ఈ కారణమునకు సూక్ష్మత్వము, వ్యాపిత్వము కలవని తెలియగలదు. పృథివికి జలము, జలమునకు తేజస్సు, తేజమునకు వాయువు, వాయువునకు ఆకాశము కారణములు. కారణము కార్యము కన్నసూక్ష్మము, వ్యాపకము. కార్యగత విశేషము లేనిది కారణము. మట్టితో చేసిన కుండయొక్క విశేష లక్షణములు మట్టియందు లేవు గదా! కావున సకల కార్యములకు మూల కారణమగు బ్రహ్మ సర్వవిశేషరహితము. ఎట్టి విశేష మున్నను ఈ బ్రహ్మకు వేరొక కారణ ముండవలసి వచ్చును.

విశేషరహిత మగుటచే సజాతీయభేదము గాని, విజాతీయభేదము గాని, స్వగతభేదము కాని బ్రహ్మయం దుండ జాలవు. భేదత్రయశూన్యము, నిర్విశేషము నైన బ్రహ్మ పరమార్థసత్యము. "యతో వాచో నివర్తంతే" అని తైత్తిరీయశ్రుతి ఈ యర్థమునే ప్రతిపాదించుచున్నది. బ్రహ్మనిర్వికల్పము, నిర్గుణము.

కాని, కొన్ని సగుణవాక్యములు ఉపనిషత్తులలో విన్పించుచున్నవి. వీటిని నిర్గుణవాక్యములతో సమన్వయ పరచుటకై శంకరుడు అధ్యాసను ప్రపంచించెను. సగుణ శ్రుతులు ఆరోపితగుణములను ప్రతిపాదించునవి. అప్పుడు

మహావాక్యములలో బ్రహ్మకు ఆత్మకు అనన్యత్వము చెప్ప బడుటచే ఆత్మ కూడ నిర్గుణమే అగును. వ్యావహారికదశలో ఈ గుణములకు ప్రయోజన మున్నది.

జ్ఞానము పరబ్రహ్మ యొక్క స్వరూపమే కాని, గుణము కాదు. "విజ్ఞానఘనః", "సత్యం జ్ఞానం" "విజ్ఞాన మానందం బ్రహ్మ" అను ఉపనిషద్వాక్యములు జ్ఞానమే బ్రహ్మ అని చెప్పుచున్నవి. "విజ్ఞాతార మరే" అను వాక్యమున విజ్ఞాతృత్వము ఔపచారికముగా చెప్పబడినది. భేదమూలకమగు ధర్మ ధర్మిభావము అద్వితీయబ్రహ్మవిషయ మున పొసగదు. గనుక, బ్రహ్మను జ్ఞానాశ్రయముగా వర్ణింప వీలుపడదు. జ్ఞానమునకు ఆశ్రయముకాదు, విషయము కూడ కాదు.

బ్రహ్మ నిత్యమని శ్రుతులు ఘోషించుచున్నవి. అనిత్యమైనది మూలకారణము కాజాలదు గనుక జగత్తుకు మూలకారణమగు బ్రహ్మ నిత్య మని ఆనుమానికముగా గూడసాధింపవచ్చును. సువర్ణము బంగారు నగలకు కారణమై ఆ నగలలో కూడ ఉండునది. ఈ బంగారమునకు పరిణామి నిత్యత్వము కలదు. ఆభరణరూపమున బంగారము పరిణామము చెందుచున్నది. కాని ఆత్మను "నిష్కలం నిష్క్రియం" అని శ్వేతాశ్వతరము చెప్పుటలో ఈ పరిణామి నిత్యత్వము ప్రపంచింపబడలేదు. మూలకారణము మార్పులను చెంది

వనే పరిణామసంబంధము రాగలదు. పాలు పెరుగుగను, మట్టి కుండగను, నువ్వులు నూనెగను మారునప్పుడు కారణము కార్యరూపమున పరిణమించినదని యందురు. జగత్కారణ మగు బ్రహ్మ ఈవిధముగా పరిణమించదు గనుక బ్రహ్మను కూటస్థనిత్య మందురు.

ఈ బ్రహ్మ అద్వితీయము. ఇది ఏకైకసత్యము దీనితో సంబద్ధమైనది కాని, అసంబద్ధమైనది కాని, తచ్ఛరీరభూత మైనది కాని, తదంశభూతమైనది కాని, తద్ధర్మభూతమైనది కాని వేరొకటి లేదని శ్రుతులు ఘోషించుచున్నవి. బ్రహ్మను సన్మాత్రమనవలెను. ఉన్నది అని మాత్రమే చెప్పగలము కాని, ఇటువంటిదని, అటువంటిదని పల్కజాలము. ఈ బ్రహ్మ బ్రహ్మానుభూతి కంటె భిన్నముకాదు.

ఈ సందర్భమున శంకరుడు ప్రస్థానత్రయభాష్యము లలో పారమార్థికసత్త అని వ్యావహారికసత్త అని సత్తాద్వైవిధ్యమును చెప్పెను. ప్రకరణ గ్రంథములలో ప్రాతిభాసిక సత్త కూడ చెప్పబడినది. త్రాటిని జూచి ఇది పాము అని ఎంచి భయపడుచుంటిమి. తర్వాత యదార్థజ్ఞానము కలుగగా పాము మాయమై త్రాడే మిగులుచున్నది. భ్రమ కల్గిన కాలమున అచటపామే ఉన్నదిగాని త్రాడుకాదు. త్రాడు ఉన్నను పాముగనే భాసించినది. ఈ భాసనమున ప్రాతి భాసికసత్యత్వము గల పామున్నది. ఇది జ్ఞానముచే నివృత్త మగుచున్నది. ప్రతిభాస కాలమున గల పాము వాస్తవము

కాదు,అసత్యముకాదు సదసదాత్మకము కాదు. దీనికి విలక్షణము కూడ కాదు. కనుక ఇది అనిర్వచనీయమైన పాము అని అందురు.

మనము ప్రవర్తించు లౌకికజగమున ప్రమాణ ప్రమేయవ్యవస్థ ఉన్నది. మనకు కొన్ని గుణములు కలవని భావించుకొందుము. నిర్గుణము నిష్క్రియము నగు ఆత్మను తద్విపరీతముగా గ్రహించుచున్నాము. వీటికి మూలము ద్వైత బుద్ధి. ఈ ద్వైతవ్యవహారము ఆత్మజ్ఞానము కలుగునంత వరకు ఉండునది. ఆత్మజ్ఞానము కలుగుట యనగా, ఈ ద్వైతబుద్ధి నశించుటయే. కాని అంతవరకు సత్యమగు జగమునకు వ్యవహారికసత్యత గలదు.

ఈ రెంటికిని విలక్షణమైన బ్రహ్మ పరమార్థసత్యము. ఈ ముత్తెరగుల సత్యమును గ్రహించి, అధ్యాస అను సూత్రమును ప్రతిపాదించి,శ్రుతులను సగుణములని, నిర్గుణములని వేర్వేరుగా చూపి, సంప్రదాయమును సరియైనమార్గమున నడపిన శంకరుడు జీవత్వము, ఈశ్వరత్వము కూడ ఔపాధిక ములే అని చూపినాడు, ఇచట, ఉపాధి యనునది మాయచే సృష్టింపబడినది. మాయ, అవిద్య అను శబ్దములను శంకరుడు పర్యాయపదములుగా వాడెను. తర్వాతివారు వీటిని వేర్వేరుగా నిర్వచించిరి. మాయోపహిత చైతన్యమీశ్వరుడని అవిద్యోపహితచైతన్యము జీవుడని చెప్పుదురు. వస్తుతః ఏక రూపమగు అజ్ఞానమునకు జ్ఞానశక్తి, క్రియాశక్తి గలవు.

శబ్దాదివిషయకమగు జ్ఞానమునకు జ్ఞానశక్తి హేతువు. క్రియా శక్తిమాత్రము ఆవరణ శక్తియని, విక్షేపశక్తి యని రెండు తెఱగుల కలదు. బ్రహ్మచైతన్యమునకు ఆవరకముగా నిలచి, ఏకత్వమునకు బదులు నానాత్వమును చూపుటలో ఈ రెండు శక్తులు కన్పించుచున్నవి. "యథోర్ణనాభిః సృజతే గృహ్ణతే చ" అను ముండకోపనిషద్వాక్యము విక్షేపశక్తిని తెలుపునది. "నీహారేణ ప్రావృతా జల్ప్యా చ" అను ఋగ్వేదవాక్యము ఆవరణశక్తిని తెలుపునది. ఆవరణశక్తి ప్రధానమగు అజ్ఞానమును అవిద్య యని, విక్షేపశక్తి ప్రధానమగు అజ్ఞానమును మాయ అని వ్యవహరింతురు.

జీవునకు ఈశ్వరునకుగల సంబంధమును తెలుపు వాదములలో అవచ్ఛేదవాదము, ఆభాసవాదము, ప్రతిబింబవాదము అనునవి శంకరుని రచనలలో చెప్పబడినవి. సురేశ్వరుడాభాసవాదమును, పద్మపాదుడు ప్రతిబింబవాదమును స్వీకరించిరి. ఈ రెండును ఏకజీవవాదములే. వాచస్పతి స్వీకరించిన అవచ్ఛేదవాదము నానాజీవవాదము. ఇవన్నియు అజ్ఞాన స్వరూపము నాశ్రయించుకొని వచ్చిన వాదములే. అజ్ఞానమగునది అనిర్వచనీయము, త్రిగుణాత్మకము, భావరూపము, జ్ఞానముచే తొలగునది. "భూయశ్చాంతే విశ్వమాయానివృత్తిః" మొదలగు వాక్యములు జ్ఞాననివర్త్యమగు అజ్ఞానమునుగూర్చి పల్కినవి.

మరణకాలమున స్థూలశరీరము, ప్రళయకాలమున సూక్ష్మ శరీరము నశించునవి. వీటికి కారణభూతమైన అజ్ఞానము మిగిలియే యుండును. దీనినే కారణశరీరమందురు. తత్త్వ జ్ఞానము కలిగినప్పుడు ఈ కారణశరీరము నశించును. ఈ మోక్షదశ వచ్చువరకు ఏదియు మిథ్య కాదు గనుకనే.

"దేహాత్మ ప్రత్యయో యద్వత్ప్రమాణత్వేన సంమతః।
లౌకికం తద్వదేవేదం ప్రమాణం త్వాత్మనిశ్చయాత్॥"

అని సమన్వయ సూత్రభాష్యమునకు చివర శంకరుడు ఉద హరించెను. ఆత్మనిశ్చయ మెంతవరకు కలుగదో అంతవరకు లౌకికవిషయములు వాస్తవములే; ప్రమాణ ప్రమేయవ్యవస్థ అంతవరకు ప్రామాణికమే.

ప్రత్యక్షాది ప్రమాణముల ద్వారా కలుగు లౌకిక జ్ఞానము సాశ్రయము, సవిషయము కూడ ఈ జ్ఞానమునకు అభివ్యంజకముగా అంతఃకరణము గలదు. అంతఃకరణ వృత్తియే లౌకికజ్ఞానము గనుక అంతఃకరణమును గాని, అంతఃకరణోపాధి గల జీవునిగాని, జ్ఞాత యని వ్యవహరించ గల్గుచున్నాము.

బ్రహ్మజ్ఞానము తెలిసికొనగోరు వానికి కొన్ని లక్షణములను శంకరుడు విధించెను. ఈలక్షణములను కల్గి యున్న వాడే అధికారి. నిత్యానిత్య వస్తువివేకము, ఇహాముత్రార్థఫల భోగవిరాగము, శమదమాదిసంపద,

ముముక్షుత్వము అను సాధన చతుష్టయము గలవాడే సరియైన అధికారి.

కర్మాచరణము చిత్తశుద్ధిద్వారా జ్ఞానసాధనమగు బహిరంగము. అంతరమైన సాధనము శ్రవణము, మననము, నిదిధ్యాసనము అను మూడు విధముల గలదు. "ఆత్మా వా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః" అను బృహదారణ్యక శ్రుతి ననుసరించి బ్రహ్మను దర్శించవలెను. దర్శన మనగా, అపరోక్షానుభూతి. ఈ అనుభూతికి సాధనములు శ్రవణ, మనన, నిదిధ్యాసనలు. వేదాంతవాక్యములకు అద్వితీయ బ్రహ్మవిషయకముగా, తాత్పర్యము కలదని నిర్ణయించుటయే శ్రవణము. వినిన అర్థమును ఉపనిషత్తులతో ఆలోచించి, తర్కించుట మననము. విజాతీయప్రత్యయమును వదలివేసి, సజాతీయ ప్రత్యయమును ధారావాహికముగా ప్రవహింపజేయుట నిదిధ్యాసనము. వేదాంతవాక్యములు అద్వితీయబ్రహ్మ విషయమున ప్రమాణము లగునా, కాదా? అను సంశయము శ్రవణము ద్వారా నివర్తించును. అనేకసంశయములను నివర్తింపజేయునది మననము. తర్కాత్మకమైన మననము చాల అవసరము గనుకనే, అద్వైతమున శ్రుతులు, అనుభవము కూడ ప్రమాణమని శంకరు డనెను. అనుభవావసానత్వాత్ బ్రహ్మజ్ఞానస్య బ్రహ్మజ్ఞానము అనుభూతియేగనుక, ఈ యనుభవమే ప్రామాణికము.

ఈ అద్వైతదర్శనమును మూడు ప్రకరణ గ్రంథము లలో భగవత్పాదులు చక్కగా వివరించిరి. ఇందు మొద టిది వాక్యవృత్తి.

శ్లో॥ సర్గస్థితిప్రలయహేతుయ మంచిత్యశక్తిం
విశ్వేశ్వరం విదితవిశ్వ మనంతమూర్తిమ్॥
నిర్ముక్తబంధన మపారసుఖాంబురాశిం
శ్రీవల్లభం విమలబోధఘనం నమామి॥

శ్లో॥ యస్య ప్రసాదా దహమేవవిష్ణుః
మయ్యేవ సర్వం పరికల్పితంచ।
ఇత్థం విజానామి సదాత్మరూపం
తస్యాంఘ్రిపద్మం ప్రణతోఽస్మి నిత్యమ్॥

తా॥ పరమేశ్వరుడు సృష్టి, స్థితి, లయములకు కారణ భూతుడు. ఆయన శక్తి ఊహింప నలవిగానిది; సమస్తవిశ్వ మునకు ప్రభువైనవాడు; విశ్వము యొక్క జ్ఞానము కల వాడు; అనంతములైన రూపములను ధరించినవాడు; సంసార బంధము లేనివాడాయన; అపారసుఖాంబురాశి; నిర్మల జ్ఞానఘనుడై వెలుగొందునట్టివాడు; అట్టి శ్రియఃపతికి నమస్కారము.

ఎవని అనుగ్రహము వలన "విష్ణుస్వరూపుడను, అనగా వ్యాపకుడగు పరమాత్మను నేనే" అని తెలిసికొనుచున్నానో, ఎవడు సదాత్మస్వరూపుడో, ఆ పరమేశ్వరుని పాదయుగ్మ మునకు నిత్యము నమస్కరింతును.

శ్లో॥ తాపత్రయార్కసంతప్తః కశ్చి దుద్విగ్నమానసః।
శమాదిసాధనైర్యుక్తః సద్గురుం పరిపృచ్ఛతి॥

శ్లో॥ అనాయసేన యేనాస్మాన్ ముచ్యేయం భవబంధనాత్।
తన్మే సంక్షిప్య భగవన్ కేవలం కృపయా వద॥

తా॥ ఒకానొకడు తాపత్రయబాధాపరితప్తుడై ఉద్విగ్న మానసు డాయెను. తర్వాత, శమ, దమాదిసాధనషట్క-సంపత్సమవేతుడై సద్గురువు నాశ్రయించి యిట్లు మనవి చేసెను. హే భగవన్ నేను అనాయాసముగా, ఈసంసార బంధము నుండి విముక్తుడనగు నుపాయమును సంక్షేపముగా దయతో నాకుపదేశింపుడు.

గురు రువాచ :-

శ్లో॥ సాధ్వీ తే వచనవ్యక్తిః ప్రతిభాతి వదామి తే।
ఇదం తదితి విస్పష్టం సావధానమనాః శృణు॥

శ్లో॥ తత్త్వమస్యాదివాక్యోత్థం యజ్జీవపరమాత్మనోః।
తాదాత్మ్యవిషయం జ్ఞానం తదిదం ముక్తిసాధనమ్॥

తా॥ గురు విట్లు చెప్పెను :- వత్సా ! నీ వచనాభివ్యక్తి సాధువుగా నున్నది, జిజ్ఞాస్యమగు విషయమును నీవు దేనిని అడిగితివో దానిని స్పష్టముగా చెప్పుచున్నాను; సావధాన చిత్తుడవై వినుము.

తత్త్వమస్యాది మహావాక్యముల వలన జనించునట్టి జీవబ్రహ్మల తాదాత్మ్యవిషయకజ్ఞాన మేది కలదో, అదియే మోక్షసాధన మని తెలిసికొనుము.

శిష్య ఉవాచ :-

శ్లో॥ కో జీవః కః పరశ్చాత్మా తాదాత్మ్యం వా కథం తయోః।
తత్త్వమస్యాదివాక్యం వా కథం తత్ప్రతిపాదయేత్॥

తా॥ అంత శిష్యు డిట్లు పలికెను- జీవు డెవరు ? పరమాత్మ యెవరు ? వారిరువురికి తాదాత్మ్యము - ఐక్యము- ఎట్లు ఘటిల్లును ? తత్త్వమస్యాది ఉపనిషద్వాక్యములు జీవపరమాత్మైక్యము నేరీతిగా ప్రతిపాదన మొనర్చుచున్నవి ?

గురు రువాచ :-

శ్లో॥ అత్ర బ్రూమః సమాధానం కోఽన్యో జీవ స్త్వమేవ హి।
య స్త్వం పృచ్ఛసి మాం కోఽహం బ్రహ్మైవాసి న సంశయః॥

తా॥ గురు విట్లు చెప్పెను- ఈ విషయమున సమాధానము చెప్పుచున్నాము. జీవు డింకెవరు? నీవే ? 'నేనెవరిని' అని నీవు నన్నడుగుచున్నావు. నీవే బ్రహ్మవు ఇందులో సంశయము లేదు.

శిష్య ఉవాచ :-

శ్లో॥ పదార్థమేవ జానామి నాద్యాపి భగవన్ స్ఫుటమ్।
అహం బ్రహ్మేతి వాక్యార్థం ప్రతిపద్యే కథం వద॥

తా॥ అంత శిష్యు డిట్లు పలికెను- హే భగవన్ నేనింత దనుక 'తత్' 'త్వం' పదముల యర్థమునే స్పష్టముగా నెరుగను. ఇట్టి స్థితిలో 'అహంబ్రహ్మాస్మి' అనువాక్యార్థ జ్ఞానము నాకెట్లు కలుగునో, సెలవిండు.

గురురువాచ :-

శ్లో॥ సత్య మాహ భవానత్ర విగానం నైవ విద్యతే।
హేతుః పదార్థబోధో హి వాక్యార్థావగతేరిహ॥

శ్లో॥ అంతఃకరణ తద్వృత్తిసాక్షీ చైతన్యవిగ్రహః॥
ఆనందరూపః సత్య స్సన్ కిం నాత్మానం ప్రతిపద్యసే॥

శ్లో॥ సత్యానందస్వరూపిణం ధీసాక్షిణం బోధవిగ్రహమ్।
చింతయ ఆత్మతయా నిత్యం త్యక్త్వా దేహాదిగాం ధియమ్॥

తా॥ గురు విట్లు చెప్పెను- నీవు నిజమునే పలికితివి: ఈ సందర్భమున వివాద మనునది లేదు. వాక్యార్థజ్ఞానమునకు పదములయొక్క అర్థబోధయే హేతువు.

నీవు అంతఃకరణమునకు తద్వృత్తికి సాక్షిమాత్రుడవు; చైతన్యమూర్తివి; సద్రూపుడవు, ఆనందరూపుడవు; ఇట్టి నీవు ఆత్మను, తెలిసికొన జాలకుంటివేమి ?

దేహాత్మబుద్ధిని పరిత్యజించి, సత్యానందస్వరూపు మును, ధీసాక్షిని, జ్ఞానమూర్తియు నగుదానిని ప్రత్య గాత్మగా నిత్యము మననము చేయుము.

శ్లో॥ రూపాదిమాన్ యతః పిండ స్తతో నాత్మా ఘటాదివత్।
వియదాది మహాభూత వికారత్వాచ్చ కుంభవత్॥

శ్లో॥ అనాత్మా యది పిండోఽయం ఉక్తహేతుబలాత్ మతః।
కరామలకవత్ సాక్షా దాత్మానం ప్రతిపాదయ।

శ్లో॥ ఘటద్రష్టా ఘటాద్భిన్నః సర్వథా న ఘటో యథా।
దేహద్రష్టా తథా దేహో నాహ మిత్యవధారయ॥

శ్లో॥ ఏవమింద్రియ దృక్ నాహం ఇంద్రియాణీతి నిశ్చిను।
మనోబుద్ధి స్తథా ప్రాణో నాహ మిత్యవధారయ॥

శ్లో॥ సంఘాతోఽపి తథా నాహ మితి దృశ్యవిలక్షణమ్।
ద్రష్టార మనుమానేన నిపుణం సంప్రధారయ॥

తా॥ ఘటము వలె శరీరము రూపము గలది, వికారి యగుట చేత ఆత్మ కాదు. ఇది ఆకాశాది మహాభూత కార్య మగుట జేసి నిత్యము కాదు.

ఈ శరీరము ఉక్తబల హేతువు చేత అనాత్మ యగుచో ఆత్మనస్తునును కరతలామలకమునవలె ప్రతిపాదించుము. ఘట ద్రష్ట ఘటము కంటె భిన్నుడు; అతడు ఎన్నడును ఘటము గాడు. అటులనే దేహద్రష్టయు దేహము కంటె భిన్నుడు. దేహ మెన్నటికిని కాజాలడు. కాన, నేను దేహమును గానని నిర్ధారణ చేసికొనుము.

ఈవిధముగానే ఇంద్రియద్రష్ట యగు నేను ఇంద్రియములను గానని మనసున నిశ్చయించుకొనుము. మనోబుద్ధి ప్రాణములు గూడ నేను గానని అవధారణము సేయుము.

దేహేంద్రియ మనోబుద్ధి ప్రాణసంఘాతమును గూడ నేను కానని తెలిసికొనుము. ఈ రీతిగ, దృశ్యవిలక్షణమైన ద్రష్టను నేనని, అనుప్రమాణముతో నిర్ధారణ చేసికొనుము.

శ్లో॥ దేహేంద్రియాదయో భావా హానాదివ్యాపృతిక్షమాః।
యస్య సన్నిధిమాత్రేణ సోఽహ మిత్యవధారయ॥

శ్లో॥ అనాపన్నవికార స్సన్ అయస్కాంతవదేవ యః।
బుద్ధ్యాదీంశ్చాలయేత్ ప్రత్యక్ సోఽహ మిత్యవధారయ॥

శ్లో॥ అజడాత్మవ దాభాంతి యత్సాన్నిధ్యా జ్జడా అపి।
దేహేంద్రియమనఃప్రాణాః సోఽహ మిత్యవధారయ॥

శ్లో॥ అగమన్మే మనో౽న్యత్ర సాంప్రతం చ స్థిరీకృతమ్।
ఏవం యో వేత్తి ధీవృత్తిం సోఽహ మిత్యవధారయ

శ్లో॥ స్వప్నజాగరితే సుప్తిం భావాభావౌ ధియాం తథా।
యో వేత్తి అవిక్రియ స్సాక్షాత్ సోఽహమిత్యవధారయ॥

తా॥ ఏ పరమాత్మయొక్క సంనిధిమాత్రము చేతనే, దేహేంద్రియాదులు జన్మజరామరణాదులను, భావములను పొందుచున్నవో, ఆ ఆత్మను నేను అని నిర్ధారణ చేసికొనుము.

ఎట్టి వికారమును పొందకయే అయస్కాంతమణి లోహాదులను ఆకర్షించుచుండును. అదేమాదిరిగ, ఏ ప్రత్యగాత్మ ఎట్టి వికృతి చెందకయే మనోబుద్ధ్యాదులను తత్త్వాది షయముల యందు ప్రవర్తింపజేయునో, ఆ ఆత్మ నేను అని నిర్ధారణ చేసికొనుము.

ఏ పరమాత్మ సంపర్కము వలన జడములు మిథ్యాభూతములు అగు దేహేంద్రియ మనఃప్రాణాదులు చేతనముల వలె ఆభాసించునో, ఆ ఆత్మను నేను అని నిర్ధారణ చేసికొనుము.

'నా మనస్సు చంచలము; అది దాని యిచ్ఛ ననుసరించి సర్వత్రతిరుగాడుచుండును; అది యిప్పుడే స్థిరీభవనము చెందినది' అని తన బుద్ధివృత్తిని గ్రహించున దేది కలదో, ఆ ఆత్మను నేను అని నిర్ధారణ చేసికొనుము.

జాగ్రత్-స్వప్న-సుషుప్తిదశలను, బుద్ధియొక్క భావాభావములను యేది నిర్వికారమై తెలిసికొనుచున్నదో ఆ ఆత్మ నేను అని నిర్ధారణ చేసికొనుము.

శ్లో॥ ఘటావభాసకో ద్దేహీ తథాఽహం ఘటా దన్యో యథేష్యతే।
దేహావభాసకో దేహీ తథాఽహం బోధవిగ్రహః॥

శ్లో॥ పుత్రవిత్తాదయో భావా యస్య శేషతయా ప్రియాః।
ద్రష్టా సర్వప్రియతమః సోఽహ మిత్యవధారయ॥

శ్లో॥ పరప్రేమాస్పదతయా మా న భూవం అహం సదా।
భూయాస మితి యో ద్రష్టా సోఽహ మిత్యవధారయ॥

శ్లో॥ య స్సాక్షిలక్షణో బోధ స్త్వం పదార్థః స ఉచ్యతే।
సాక్షిత్వ ఽపి బోద్ధృత్వ మవికారయాఽఽత్మతః॥

శ్లో॥ దేహేంద్రియ మనఃప్రాణాహంకృతిభ్యో విలక్షణః।
ప్రోజ్ఝితాశేషషడ్భావవికార స్త్వంపదాభిధః॥

తా॥ ఘటమును ప్రకాశింపజేయు దీపము ఘటము కంటె భిన్నమైన రీతిగా, దేహమును ప్రకాశింపజేయు దేహిని, జ్ఞానరూపమైన ఆత్మను నేనై యున్నాను.

పుత్రవిత్తాదికము లన్నియును, ఆత్మకు అంగభూతము లగుటచేత ప్రియము లగుచున్నవి. వానికి ద్రష్ట సాక్షియు నగుటచేత ఆత్మ ప్రియతమమైనది. అట్టి ఆత్మను నేను అని నిర్ధారణ చేసి కొనుము.

'మా న భూవ మహం భూయాసమ్' అనుచు ఆత్మ పరమప్రేమాస్పద మగుట వలన, నాకు వినాశము లేకుండు గాక; నేను సర్వదా యుండునుగాక యని, ఏ ద్రష్ట తలచునో ద్రష్టృరూపమైన ఆ ఆత్మనే, నేను అని నిర్ధారణచేసికొనుము.

ఏది సాక్షిలక్షణము బోధస్వరూపము నగునో, అదియే 'త్వం' పదార్థ మని చెప్ప బడును. సర్వద్రష్టయై సాక్షిత్వము, బోద్ధృత్వము జ్ఞాతృస్వరూపము ఆత్మ యొక్క లక్షణములుగా గ్రహింపనగును.

దేహేంద్రియమనః ప్రాణాహంకారముల కంటె విలక్షణమై షడ్విధభావవికారరహిత మైన దేది కలదో, అదియే 'త్వం' పదము యొక్క వాచ్యార్థము.

శ్లో॥ త్వమర్థ మేవం నిశ్చిత్య తదర్థం చింతయేత్ పునః।
అతద్వ్యావృత్తిరూపేణ సాక్షా ద్విధిముఖేన చ॥

శ్లో॥ నిరస్తాశేషసంసారదోషోఽస్థూలాదిలక్షణః।
అదృశ్యత్వాదిగుణకః పరాకృతతమోమలః॥

శ్లో॥ నిరస్తాతిశయానందః సత్యః ప్రజ్ఞానవిగ్రహః।
సత్తాస్వలక్షణః పూర్ణః పరమాత్మేతి గీయతే॥

శ్లో॥ సర్వజ్ఞత్వం పరేశత్వం తథా సంపూర్ణశక్తితా।
వేదైస్సమర్థ్యతే యస్య తద్బ్రహ్మేత్యవధారయ॥

శ్లో॥ యద్ జ్ఞానాత్ సర్వవిజ్ఞానం శ్రుతిషు ప్రతిపాదితమ్।
మృదాద్యనేకదృష్టాంతైః తద్బ్రహ్మేత్యవధారయ॥

తా॥ ఈ విధముగా, 'త్వం' పదము యొక్క అర్థమును నిశ్చయించి, 'తత్' పదార్థమును చింతింపనగును. అతద్వ్యావృత్తి రూపముననుసాక్షాత్తుగ విధిముఖముగను 'తత్' పదముయొక్క అర్థము మననము చేయనగును.

సంసారదోషరహితమును, అస్థూలాదిలక్షణసమన్వితమును, అదృశ్యత్వాదిగుణయుతమును, నిరస్తతమోమలము కలదియునై 'తత్' పదార్థము వెలయుచుండును.

అతిశయానందపరమావధియు, సత్యస్వరూపము. ప్రజ్ఞానఘనమూర్తియు, సత్తయే స్వలక్షణము కలదియు, పూర్ణము పరమాత్మయు నని 'తత్' పదార్థము గానము చేయబడుచున్నది.

ఏది వేదములచేత సర్వజ్ఞ మనియు, పరేశు డనియు, సంపూర్ణశక్తిమంతు డనియు సమర్థింపబడుచున్నదో అదియే పరమాత్మ యని నిర్ధారణచేసికొనుము.

మృత్, సువర్ణము అనేక దృష్టాంతముల ద్వారా వేదముల చేత 'ఏకవిజ్ఞానేన సర్వవిజ్ఞానం భవతి' అనుచు దేనిని తెలిసికొనిన, అంతయు తెలియును' అని ప్రతిపాదింపబడినదో, అదియే బ్రహ్మ యని నిర్ధారణ చేసికొనుము.

శ్లో॥ యదానంత్యం ప్రతిజ్ఞాయ శ్రుతి స్తత్ సిద్ధయే జగౌ।
తత్కార్యత్వం ప్రపంచస్య తద్బ్రహ్మేత్యవధారయ॥

శ్లో॥ విజిజ్ఞాసతయా యచ్చ వేదాన్తేషు ముముక్షుభిః।
సమర్థ్యతేఽతియత్నేన తద్బ్రహ్మేత్యవధారయ॥

శ్లో॥ జీవాత్మనా ప్రవేశశ్చ నియంతృత్వంచ తాన్ ప్రతి।
శ్రూయతే యస్య వేదేషు తద్బ్రహ్మేత్యవధారయ॥

శ్లో॥ కర్మణాం ఫలదాతృత్వం యస్యైవ శ్రూయతే శ్రుతౌ।
జీవానాం హేతుకర్తృత్వం తద్బ్రహ్మేత్యవధారయ॥

తా॥ శ్రుతులు ఏపరతత్త్వము యొక్క అనంతత్వమును 'సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ' యనుచు ప్రతిజ్ఞ చేసినవో, అవి తదానంత్యసిద్ధికొరకు ఈ ప్రపంచమును తత్కార్యముగ వర్ణించినవి. అదియే బ్రహ్మ యని నిర్ధారణ చేసికొనుము.

సర్వవేదాంతములందు ఏ సత్యవస్తువు ముముక్షువుల చేత జిజ్ఞాస్యముగా సమర్థింపబడుచున్నదో, అదియే బ్రహ్మ యని నిర్ధారణ చేసికొనుము.

'తదేవానుప్రావిశత్' అనుచు శ్రుతి ఏ ఆత్మను జీవ రూపమున శరీరమున ప్రవేశించుచున్నదని ప్రతిపాదించు

చున్నదో, ఎవనిని సర్వాంతర్యామియైన సర్వనియంతగా ప్రస్తుతించుచున్నదో అదియే బ్రహ్మ యని నిర్ధారణ చేసికొనుము.

శ్రుతి ఎవనిని కర్మఫలదాత యని అభివర్ణించుచున్నదో ఎవనిని సకలజీవతతి యొక్క కర్మనియోక్తగా ప్రతి పాదించుచున్నదో, అదియే బ్రహ్మయని నిర్ధారణ చేసికొనుము.

శ్లో॥ తత్త్వంపదార్థౌ నిర్ణీతే వాక్యార్థ శ్చింత్యతేఽధునా।
తాదాత్మ్య మత్ర వాక్యార్థ స్తయోరేవ పదార్థయోః॥

శ్లో॥ సంసర్గో వా విశిష్టో వా వాక్యార్థో నాత్ర సంశయః
అఖండైకరసత్వేన వాక్యార్థో విదుషాం మతః॥

శ్లో॥ ప్రత్యగ్బోధో య ఆభాతి సోఽద్వయానందలక్షణః।
అద్వయానందరూపశ్చ ప్రత్యగ్బోధైకలక్షణః॥

శ్లో॥ ఇత్థ మన్యోన్య తాదాత్మ్యప్రతిపత్తి ర్యదా భవేత్।
అబ్రహ్మత్వం త్వమర్థస్య వ్యావర్తేత తదైవ హి॥

శ్లో॥ తదర్థస్య చ పారోక్ష్యం యద్యేవం కిం తతః శృణు!
పూర్ణానందైకరూపేణ ప్రత్యగ్బోధోఽవతిష్ఠతే॥

శ్లో॥ తత్త్వమస్యాదివాక్యం చ తాదాత్మ్యప్రతిపాదనే।
లక్ష్యే తత్త్వం పదార్థౌ ద్వా వుపాదాయ ప్రవర్తతే॥

తా॥ ఇంతవరకు 'తత్,త్వం' పదముల యొక్క అర్థములు నిర్ణయింపబడినవి. ఇక, వాక్యార్థము విచారణ చేయబడును. ఈ పదార్థద్వయము యొక్క తాదాత్మ్యమే- ఐక్యమే- వాక్యార్థ మని తెలియనగును.

ఈ స్థలమునందు సంసర్గార్థము గాని, విశిష్టార్థము గాని, వాక్యార్థ మనదగదు. ఇట, అఖండము, ఏకరసము నగు అర్థమే వాక్యార్థమని వేదాంతతత్త్వజ్ఞుల యభిమతము.

ప్రత్యగాత్మబోధయే అద్వయానందలక్షణ మగు బ్రహ్మ; అద్వయానందరూపమగు బ్రహ్మవస్తువు ప్రత్యగ్బోధయే లక్షణముగా గలదని యెరుగునది.

ఈరీతిగ, అన్యోన్యతాదాత్మ్యజ్ఞానము, అనగా జీవబ్రహ్మైక్యజ్ఞానము కలిగినంతనే, 'త్వం' పదార్థము యొక్క అబ్రహ్మత్వము అనగా, జీవత్వము వ్యావృత్తమగును.

తదర్థము యొక్క పారోక్ష్యము గూడ, వ్యావృత్తమగును. అప్పుడు ఏమి జరుగునో, వినుము. జీవబ్రహ్మైక్య జ్ఞానము కలిగినంతనే, పూర్ణానందైకరసస్వరూపముతో ప్రత్యగ్బోధ వెలయుచుండును.

'తత్త్వమసి' యను వాక్యము జీవబ్రహ్మైక్యమును ప్రతిపాదించునపుడు 'తత్,త్వం' పదముల యొక్క రెండర్థములను గ్రహించి, లక్ష్యార్థమగు చైతన్యమునందే ప్రవర్తించును.

శ్లో॥ హిత్వా ద్వౌ శబలౌ వాచ్యౌ వాక్యం వాక్యార్థబోధనే।
యథా ప్రవర్తతేఽస్మాభి స్తథా వ్యాఖ్యాత మాదరాత్॥

శ్లో॥ ఆలంబనతయా భాతియోఽస్మత్ ప్రత్యయశబ్దయోః।
అంతఃకరణసంభిన్నబోధః స త్వంపదాభిదః॥

శ్లో॥ మాయోపాధి ర్జగద్యోనిః సర్వజ్ఞత్వాదిలక్షణః ।
పారోక్ష్యశబలః సత్యాద్యాత్మక స్తత్పదాభిదః ॥

శ్లో॥ ప్రత్యక్పరోక్షతై కస్య సద్వితీయత్వపూర్ణతా ।
విరుధ్యేతే యత స్తస్మా ల్లక్షణా సంప్రవర్తతే ॥

శ్లో॥ మానాంతరవిరోధే తు ముఖ్యార్థ స్యాపరిగ్రహే ,
ముఖ్యార్థేనావినాభూతే ప్రతీతి ర్లక్షణోచ్యతే ॥

తా॥ 'తత్త్వమసి' వాక్యము శబలములగు కించిజ్ఞత్వ, సర్వజ్ఞత్వాది వాచ్యార్థములను పరిత్యజించి, లక్ష్యార్థ ప్రతిపాదనమునందు ప్రవర్తిలుచున్నట్టి రీతిని మేము సాదరముగ వివరించితిమి.

ఏది అస్మత్ ప్రత్యయ; అస్మత్ శబ్దములకు ఆలంబనముగా అనగా, విషయతారూపమున, భాసించుచున్నదో, ఏది అంతఃకరణసంభిన్నమైన బోధయో, అదియే 'త్వం' పదము యొక్క వాచ్యార్థమని గ్రహింపనగును.

మాయోపాధిక చైతన్యమే జగత్కారణమై సర్వజ్ఞత్వాదిలక్షణములతో విరాజిల్లుచుండును. ఆచైతన్యమే పారోక్ష్యశబలమై సచ్చిదానందస్వరూపముతో వెలుగొందుచుండును. అట్టి ఈశ్వరచైతన్యమే 'తత్' పదమునకు వాచ్యార్థమని తెలిసికొనవలెను

ప్రత్యక్త్వ-పరోక్షత్వములు; సద్వితీయత్వ-పూర్ణత్వములు విరుద్ధధర్మములు. అట్టివిరుద్ధస్వభావములు ఒకేవస్తువునందుండనేరవు. కాన; లక్షణ ప్రవర్తిలుచున్నది.

ప్రమాణాంతరవిరోధమునందు ముఖ్యార్థము గ్రహింపబడదు. అట్టి సమయమున ముఖ్యార్థమునకు వ్యతిరిక్తము కాని అన్యార్థప్రతీతియే లక్షణ యనబడును.

శ్లో॥ తత్త్వమస్యాదివాక్యేషు లక్షణా భాగలక్షణా ।
సోఽయ మిత్యాదివాక్యస్థపదయో రివ నాపరా॥

శ్లో॥ అహం బ్రహ్మేతి వాక్యార్థ బోధో యావ ద్దృఢీభవేత్ ।
శమాదిసహిత స్తావ దభ్యసేత్ శ్రవణాదికమ్॥

శ్లో॥ శ్రుత్యాచార్యప్రసాదేన దృఢో బోధో యదా భవేత్।
నిరస్తాశేషసంసారనిదానః పురుష స్తదా॥

శ్లో॥ విశీర్ణకార్యకరణో భూతసూక్ష్మై రనావృతః।
విముక్తకర్మనిగడః సద్య ఏవ విముచ్యతే॥

శ్లో॥ ప్రారబ్ధకర్మభోగేన జీవన్ముక్తో యదా భవేత్।
కించిత్కాల మనారబ్ధకర్మబంధస్య సంక్షయే॥

శ్లో॥ నిరస్తాతిశయానందం వైష్ణవం పరమం పదమ్।
పునరావృత్తిరహితం కైవల్యం ప్రతిపద్యతే॥

తా॥ సోఽయం దేవదత్తః-అతడే యీ దేవదత్తుడు' అను వాక్యమందలి పదములకు వలెనే, 'తత్త్వమస్యాది వాక్యమందలి పదములకును భాగలక్షణయే అనగా, జహదజహల్లక్షణయే చెప్పనగును గాని, మరియొక లక్షణ చెప్పవలనుపడదు.

'అహం బ్రహ్మాస్మి, నేనే సచ్చిదానందలక్షణమైన బ్రహ్మను' అనుజ్ఞానము ఎంతవరకు దృఢపడదో, అంతదనుక, శమదమాదిసహితుడై శ్రవణ, మననాదికముల నభ్యాస మొనర్పవలయును.

శ్రుతి, ఆచార్యప్రసాదము వలన, దృఢజ్ఞానమును సంపాదించిన మనుజుడు నిఖిలసంసారబంధములకు కారణభూతమైన మాయనుండి విముక్తుడగును.

ఎవనికి కార్యకరణములైన శరీరేంద్రియాదులు విశీర్ణము లగునో, ఎవడు సూక్ష్మభూతముల యావరణ నుండి విముక్తుడగునో, ఎవనికి కర్మపాశమునుండి విముక్తి కలుగునో అట్టివాడు వెంటనే మోక్షోపలబ్ధి నందును.

అట్టిసాధకునికి అనారబ్ధమైన సంచితకర్మబంధముండదు. ప్రారబ్ధకర్మఫలము ననుభవించుటవలన, అతడు జీవన్ముక్తుడగును.

అట్టి జీవన్ముక్తుడు అంతకంటె అతిశయానందము లేనట్టియు, పునరావృత్తిరహితము, వైష్ణవమైన పరమపదమునగు కైవల్యమును పొందును

ఈ విధముగా, వాక్యవృత్తిని చెప్పినతర్వాత శ్రీ శంకరుడు రెండవదియు, దీనికి సంక్షేపరూపము నగు లఘువాక్యవృత్తి నీవిధముగా వివరించిరి.

శ్లో॥ స్థూలో మాంసమయో దేహో సూక్ష్మ స్స్యా ద్వాసనామయః।
జ్ఞానకర్మేంద్రియై స్సార్థం ధీప్రాణౌ తచ్ఛరీరగౌ॥

శ్లో॥ అజ్ఞానం కారణం సాక్షి బోధ స్తేషాం విభాసకః।
బోధాభాసో బుద్ధిగతః కర్తా స్యాత్ పుణ్యపాపయోః॥

శ్లో॥ స ఏవ సంసరేత్ కర్మవశాత్ లోకద్వయే సదా।
బోధాభాసాత్ శుద్ధబోధం వివిచ్యా దతియత్నతః॥

శ్లో॥ జాగరస్వప్నయో రేవ బోధాభాసవిడంబనా।
సుప్తౌ తు తల్లయే బోధః శుద్ధో జాడ్యం ప్రకాశయేత్॥

తా॥ త్వగస్థిమజ్జామాంసమయ మగు దేహము స్థూలశరీర మనబడును. పంచజ్ఞానేంద్రియములు, పంచకర్మేంద్రియములు, పంచ ప్రాణములు, మనోబుద్ధులు-వీనితో గూడిన శరీరమువాసనామయ మగు సూక్ష్మశరీర మనబడును.

అజ్ఞానమే కారణశరీర మనబడును సాక్షియగు బోధయే ఈశరీరత్రయమును భాసింపజేయును. బుద్ధిప్రతిబింబిత బోధాభాసయే పాపపుణ్యములకు కర్తయగు చున్నది.

బోధాభాసుడగు కర్తయే కర్మవశమున ఇహలోక పరలోకములందు నిరంతరము సంసరణము నొందుచుండును. కాన ఈ బోధాభాసునినుండి శుద్ధబోధస్వరూపమును వివిక్త మొనరింపనగును.

ఈ బోధాభాసుని సంరంభ మంతయు జాగ్రత్స్వప్నములందు మాత్రమే కన్పట్టును. సుషుప్తియందు ఈ బోధాభాసుడు లయము నొందును. అప్పుడు శుద్ధబోధయే జడత్వమును అనగా అజ్ఞానమును భాసింపజేయును. నాహం కించ దవేదిషమ్' అను జ్ఞానము శుద్ధబోధ వలననే కలుగుచున్నది.

శ్లో॥ జాగరేఽపి ధియ స్తూష్ణీంభావః శుద్ధేన భాస్యతే।
ధీవ్యాపారాశ్చ చిద్భాస్యాః చిదాభాసేన సంయుతాః॥

శ్లో॥ వహ్నితప్తజలం తాపయుక్తం దేహస్య తాపకమ్।
చిద్భాస్యా ధీ స్తథాఽఽభాసయుక్తాఽన్యం భాసయేత్తథా॥

శ్లో॥ రూపాదౌ గుణదోషాదివికల్పా బుద్ధిగాః క్రియాః।
తాః క్రియాః విషయైః స్సార్థం భాసయంతీ చితి ర్మతా॥

శ్లో॥ రూపాచ్చ గుణదోషాభ్యాం వివిక్తా కేవలా చితిః।
సైవానువర్తతే రూప రసాదీనాం వికల్పనే॥

శ్లో॥ క్షణే క్షణేఽన్యథాభూతా ధీవికల్పా శ్చితి ర్నతు।
ముక్తాసు సూత్రవత్ బుద్ధివికల్పేషు చితి స్తథా॥

తా॥ జాగ్రదవస్థయందుకూడ, బుద్ధి యొక్క తూష్ణీంభావము శుద్ధ బోధవలనచే భాసించును. చిద్భాస్యములగు బుద్ధి వ్యాపారములును, చిదాభాసునితో కూడినవై ప్రకాశించుచుండును.

అగ్నితప్తజలము తాపయుక్తమై శరీరమునకు తాప జనకమగుచుండును. అదేరీతిగ, చిదాభాస్యమైనధీవృత్తియు, చిదాభాసయుక్తమై అన్యపదార్థములనుగూడ ఆభాసింప జేయును.

రూపాదులందు గుణదోషాదివికల్పములు బుద్ధిగతములగు క్రియలు మాత్రమే యని తెలిసికొననగును. చైతన్యమే రూపాది విషయములతో గూడ, ఆ బుద్ధిగతక్రియలనన్నిటిని భాసింపజేయును.

ఆ చైతన్యము రూపాదివిషయములకంటె; గుణదోషాది వికల్పనలకంటె వ్యతిరిక్తముఅయినను, అదియే రూప రసాదుల వికల్పనలయందు అనువర్తించుచుండును. అనగా, తదాభాసక మగుచుండునని భావము.

ధీవికల్పనలు క్షణక్షణమునకు అన్యథాభూతము లగు చుండును. అనగా మారుచుండును. కాని, చైతన్యము మాత్రము పరిణామ రహితమై యొప్పారుచుండును. ముక్తాహారమందలి ముత్తియములు వేరైనను, సూత్రముమాత్రము ఏకముగనే ముత్తెము లన్నిటియం దనుస్యూతమై యుండును. అట్లే, ధీవృత్తులు మార్పు నొందుచున్నను, చైతన్యము ఎట్టి మార్పు నొందక, ఏకమై; సర్వానుగతమై వెలుగొందు చుండును.

శ్లో॥ ముక్తాభి రావృతం సూత్రం ముక్తయో ర్మధ్య ఈక్షతే।
తథా వృత్తివికల్పై శ్చిత్ స్పష్టా మధ్యే, వికల్పయోః॥

శ్లో॥ నష్టే పూర్వవికల్పే తు యావ దన్యస్య నోదయః।
నిర్వికల్పకచైతన్యం స్పష్టం తావ ద్విభాసతే,।

శ్లో॥ ఏక ద్వి త్రి క్షణేషు ఏవం వికల్పస్య నిరోధనమ్।
క్రమేణాభ్యస్యతాం యత్నా ద్బ్రహ్మానుభవకాంక్షిభిః॥

శ్లో॥ సవికల్పకజీవో౽యం బ్రహ్మ తన్నిర్వికల్పకమ్।
అహం బ్రహ్మేతి వాక్యేన సో౽య మర్థో౽భిధీయతే॥

శ్లో॥ సవికల్పకచిద్ యో౽హం బ్రహ్మైకం నిర్వికల్పకమ్।
స్వత స్సిద్ధా వికల్పాప్తే నిరోద్ధవ్యాః ప్రయత్నతః॥

తా॥ ముత్యములచేత సూత్రము ఆవృతమైయున్నను, రెండు ముత్తియముల మధ్యభాగమునందు ఆ దారము కనిపించుచుండును. అదేరీతిగా, ధీవృత్తివికల్పనాదులచే చైతన్యమావృతమైయున్నను, రెండు వికల్పముల మధ్యనాచైతన్యము స్ఫురించుచునేయుండును.

పూర్వవికల్పము నష్టమై మరొక వికల్ప ముదయించనంతవరకు వికల్పరహితమైన చైతన్యము స్పష్టముగా భాసించుచునే యుండును.

బ్రహ్మావగతి నందగోరు సాధకులు ఒకటి, రెండు, మూడు క్షణముల కాలము వికల్పనిరోధమును క్రమముగా పూనికతో నభ్యసింపనగును.

ఈ జీవుడు సవికల్పకుడు; ఆ బ్రహ్మ నిర్వికల్పకము. 'అహం బ్రహ్మాస్మి'-'నేను బ్రహ్మమును'-అను వాక్యముచేత 'సోఽయం'-'ఆ బ్రహ్మయే ఈ జీవుడు'-అను అర్థము అభిహితమగుచున్నది.

సవికల్పక చైతన్య మేది గలదో, ఆ నేనే నిర్వికల్పకము అద్వయము నగు బ్రహ్మమను. ఆ వికల్పములు సహజములు; అవిద్యాకల్పితములు. ఆ వికల్పములు పూనికతో నిరోధింపదగినవని తెలియనగును.

శ్లో॥ శక్యః సర్వనిరోధేన సమాధిః యోగినాం ప్రియః।
తదశక్తౌ క్షణం రుద్ధ్వా శ్రద్ధాలుః బ్రహ్మతాఽఽత్మనః॥

శ్లో॥ శ్రద్ధాలుః బ్రహ్మతాం స్వస్య చింతయే ద్బుద్ధివృత్తిభిః।
వాక్యవృత్త్యా యథాశక్తి జ్ఞాత్వాఽభ్యస్యతాం సదా॥

శ్లో॥ తచ్చింతనం తత్కథన మన్యోన్యం తత్ప్రబోధనమ్।
ఏత దేకపరత్వం చ బ్రహ్మాభ్యాసం విదు ర్బుధాః॥

శ్లో॥ దేహాత్మధీవత్ బ్రహ్మాత్మధీదార్ఢ్యే కృతకృత్యతా।
యదా తదాఽయం మ్రియతాంముక్తోఽసౌనాత్ర సంశయః॥

తా॥ సర్వవికల్పములను నిరోధించుట వలన, యోగులకు ప్రియమైన సమాధి పొంద శక్యమగును. అట్లు చేయుటకు సామర్థ్యము లేనిచో క్షణకాలమైనను నిరోధించి బ్రహ్మాత్మభావమును పొందనగును.

శ్రద్ధాళువైన సాధకుడు బుద్ధివృత్తులచేతనే, నిజ బ్రహ్మత్వము చింతింపనగును. వాక్య వృత్తి సహాయమున తెలిసికొని, సర్వదా బ్రహ్మాభ్యాసము చేయనగును.

బ్రహ్మాత్మైక్యము యొక్క చింతనము, భాషణము, పరస్పరము తత్ప్రబోధము, తత్పరత్వము - ఇదియే బ్రహ్మాభ్యాస మని, పండితు లందురు.

దేహాత్మబుద్ధి మానవులకు సహజముగా నుండును. దానివలెనే, బ్రహ్మాత్మబుద్ధి దృఢమైనప్పుడు అతడు కృతకృత్యు డగును. అప్పుడాతని శరీరపాతము జరిగినను, ముక్తుడే యనుటలో సందేహము లేశమాత్రమైనను లేదు.

ఇట్లు లఘువాక్యవృత్తి ద్వారా బ్రహ్మాత్మైక్యమును వివరించి, శ్రీఆచార్యుడు మూడవదియగు దృగ్దృశ్యవివేక మను నామాంతరము గల వాక్యసుధను చెప్పినారు.

శ్లో॥ రూపం దృశ్యం లోచనం దృక్ తద్దృశ్యం దృక్ తు మానసమ్।
దృశ్యా ధీవృత్తయః సాక్షీ దృగేవ న తు దృశ్యతే॥

శ్లో॥ నీల పీత స్థూల సూక్ష్మ హ్రస్వ దీర్ఘాదిభేదతః।
నానావిధాని రూపాణి పశ్యేత్ లోచన మేకధా।

శ్లో॥ ఆంధ్య, మాంద్య, పటుత్వేషు నేత్రధర్మేషు చైకధా।
సంకల్పయేత్ మనః, శ్రోత్ర, త్వగాదౌ యోజ్యతా మిదమ్॥

తా॥ రూపము దృశ్యమైన, నేత్రము దృక్ (ద్రష్ట) అగును. ఆనేత్రము దృశ్య మయినచో, మనస్సు దృక్ అగును. ధీవృ

త్తులు దృశ్యమైనపుడు సాక్షిచైతన్యము దృక్ అగును. కాని ఈ సాక్షిచైతన్య మెన్నడును దర్శనవిషయము కానేరదు.

నీల, పీతాది వర్ణభేదముతోను; స్థూల, సూక్ష్మాది ఆకృతి భేదముతోను, హ్రస్వ దీర్ఘాది పరిమాణభేదముతోను, నొప్పారు నానావిధరూపములను మానస చక్షువు చూచును కాని, అట్టి దృక్స్వరూపమగు మనసు ఒక్కటియే; అది నానా గాదు.

అంధత్వ, మందత్వ, పటుత్వరూప నేత్రధర్మములందు మనసు ఒకేవిధముగా సంకల్పించును. దీనిని, శ్రోత్ర, త్వగాది విషయమునగూడ, అన్వయింపనగును. దీనివలన. త్వక్, చక్షుః, శ్రోత్రాదీంద్రియములకు మనస్సే, ద్రష్ట యని స్పష్ట మగుచున్నది.

శ్లో॥ కామ స్సంకల్పసందేహౌ శ్రద్ధాశ్రద్ధే ధృతీతరే।
హ్రీర్ధీర్భీ రిత్యేవమాదీన్ భాసయ త్యేకధా చితిః ॥

శ్లో॥ నోదేతి నాస్త మేత్యేషా న వృద్ధిం యాతి న క్షయమ్।
స్వయం విభా త్యథాన్యాని భాసయేత్ సాధనం వినా ॥

శ్లో॥ చిచ్ఛాయావశతో బుద్ధౌ భావం ధీస్తు ద్విధా స్థితా।
ఏకాఽహంకృతి రన్యా స్యా దంతఃకరణరూపిణీ ॥

శ్లో॥ ఛాయాఽహంకారయో రైక్యం తప్తాయఃపిండవత్ మతమ్।
తదహంకారతాదాత్మ్యాత్ దేహః చేతనతా మగాత్ ॥

శ్లో॥ అహంకారస్యతాదాత్మ్యం చిచ్ఛాయాదేహసాక్షిభిః ।
సహజం కర్మజం భ్రాంతిజన్యం చ త్రివిధం క్రమాత్ ॥

తా॥ కామ, సంకల్ప, సందేహ, శ్రద్ధా, అశ్రద్ధా, ధైర్య, అధైర్య, లజ్జా, జ్ఞాన, భయాది ధీవృత్తులను చైతన్య మొక్కటియే భాసింపజేయును.

ఈ చైతన్యమున కుదయాస్తమయములు లేవు; వృద్ధిక్షయములును లేవు. ఇది స్వయంప్రకాశమై సాధనాంతరముల నపేక్షింపకయే అన్యపదార్థముల నన్నిటిని భాసింపజేయుచుండును.

చిచ్ఛాయావశము వలన అనగా, చైతన్యము ప్రతిఫలించుటవలన బుద్ధి భాసించుచున్నది. అట్టి బుద్ధి అహంకారము అంతఃకరణము - అని రెండు విధములుగ నుండును.

చిచ్ఛాయకు అహంకారమునకు గల తాదాత్మ్యము తప్తాయఃపిండము వంటిదని తెలియనగును. అహంకార తాదాత్మ్యము వలన దేహము చేతనము వలె గన్పట్టును. చైతన్యప్రతిఫలిత అహంకారతాదాత్మ్యము వలన, దేహము జడమయ్యు, చేతనముభాతి తోచును.

చిచ్ఛాయ, దేహము, సాక్షి ఈ త్రికముతో అహంకారమునకు తాదాత్మ్య మేర్పడుచున్నది. ఈ తాదాత్మ్య సంబంధము క్రమముగా, సహజము, కర్మజము, భ్రాంతిజన్యమని మూడు తెరగుల నొప్పుచుండును.

శ్లో॥ సంబంధినో స్సతోః నాస్తి నివృత్తిః సహజస్య తుః
కర్మక్షయాత్ ప్రబోధాచ్చ నవర్తేతే క్రమా దుభే॥

శ్లో॥ అహంకారలయే సుప్తౌ భవే ద్దేహోఽప్యచేతనః।
అహంకారవికాసార్ధః స్వప్నః సర్వస్తు జాగరః॥

శ్లో॥ అంతఃకరణవృత్తిశ్చ చితిచ్ఛాయైక్య మాగతా।
వాసనాః కల్పయే త్స్వప్నే బోధేఽక్షై ర్విషయాన్ బహిః॥

శ్లో॥ మనోహంకృత్యుపాదానం లింగమేకం జడాత్మకమ్।
అవస్థాత్రయ మన్వేతి జాయతే మ్రియతే తథా॥

తా॥ అహంకారమునకును, చేతనచ్ఛాయకును గల సంబంధము సహజమైనది. అందుచే, అహంకారము నివృత్తమైనప్పుడే ఆ సంబంధము నివృత్త మగును. ఇక అహంకార, శరీరముల తాదాత్మ్యము కర్మజ మగుటం జేసి కర్మక్షయ మయినంతనే అది తొలగిపోవును. అహంకారమునకును సాక్షికిని గల తాదాత్మ్యసంబంధము భ్రాంతిజన్యము. అందుచే, వివేకోదయ మైనంతనే ఆ భ్రాంతి తొలగి ఆ సంబంధము తొలగి పోవును.

సుషుప్తియందు అహంకారము లయము చెందును. అందువలన, దేహ మచేతనమగును. స్వప్నమున అహంకారము అర్ధవికాసము కలిగియుండును. జాగరణమునందు అది సంపూర్ణవికాసము నందును.

అంతఃకరణవృత్తి చిచ్ఛాయతో తాదాత్మ్యము నంది స్వప్నప్రపంచమున వాసనలను అనగా, సంస్కారములను కల్పించును. చైతన్యప్రతిఫలితమగు ఆ అంతఃకరణవృత్తియే జాగ్రద్దశలో ఇంద్రియముల సహాయముతో బాహ్యవిషయములను కల్పించును.

మనోరూపమైన అహంకారము నుపాదానముగా జేసికొనిన అంతఃకరణము జడాత్మకము. ఈ జడాత్మకమైన లింగమే జాగ్రత్, స్వప్న, సుషుప్తిరూపమైన అవస్థాత్రయము నందు అనువర్తించుచున్నది; జనన మరణరూప పరిణామములను బొందుచున్నది.

శ్లో॥ శక్తిద్వయం హి మాయాయా విక్షేపావృతిరూపకమ్।
విక్షేపశక్తిః లింగాదిబ్రహ్మాండాంతం జగత్ సృజేత్॥

శ్లో॥ సృష్టి ర్నామ బ్రహ్మరూపే సచ్చిదానందవస్తుని।
అబ్ధౌ ఫేనాదివత్ సర్వనామరూపప్రసారణా॥

శ్లో॥ అంతర్దృగ్దృశ్యయోః భేదం బహిశ్చ బ్రహ్మసర్గయోః।
ఆవృణో త్యపరా శక్తిః సా సంసారస్య కారణమ్॥

శ్లో॥ సాక్షిణః పురతో భాంతం లింగం దేహేన సంయుతమ్।
చితిచ్ఛాయాసమావేశాత్ జీవ స్స్యాత్ వ్యావహారికః॥

శ్లో॥ అస్య జీవత్వ మారోపాత్ సాక్షిణ్యప్యవభాసతే।
ఆవృతౌ తు వినష్టాయాం భేదే భాతేఽపయాతి తత్॥

తా॥ ఈ మాయ విక్షేపశక్తి, ఆవరణశక్తి, యను రెండు శక్తులు కలిగియుండును. విక్షేపశక్తివలన లింగదేహము మొదలుకొని బ్రహ్మాండము వరకు గల సంసార మంతయు సృష్టమగుచున్నది.

సాగరమున లేచు ఫేన; తరంగాదులవలె సచ్చిదానందవస్తువగు బ్రహ్మయందు నామరూప ప్రసారమే సృష్టి యనబడును.

ఆంతరజగత్తులో దృక్-దృశ్యములకు గల భేదమును' బాహ్యజగమున, బ్రహ్మకును, సృష్టికిని గల భేదమును, తెలియబడకుండా ఆవరించియుండు శక్తియే ఆవరణ శక్తి. ఇదియే సంసారమునకు కారణము.

లింగశరీరము స్థూలదేహముతో సంబద్ధమై సాక్షి చైతన్యమున కెదుటనే వెలుగొందుచుండును. ఆ లింగశరీరము చైతన్యచ్ఛాయావిలసితమై జీవు డను నామముతో వ్యవహరింపబడుచుండును.

ఈ జీవుని జీవత్వము ఆరోపము వలన సాక్షిచైతన్యము నందును అవభాసించుచుండును అనగా అధ్యాసవలన సాక్షి చైతన్యము జీవుడని తోచును. ఆవరణశక్తి వినష్టమైనంతనే, భేదము స్పష్టముగా ప్రతీయమాన మగును; జీవభావము గూడ నశించును.

శ్లో॥ తథా సర్గబ్రహ్మణోశ్చ భేద మావృత్య తిష్ఠతి।
యా శక్తి స్తద్వశాత్ బ్రహ్మ వికృతత్వేన భాసతే॥

శ్లో॥ అత్రా ప్యావృతినాశేన విభాతి బ్రహ్మసర్గయోః।
భేద స్తయో ర్వికార స్స్యాత్ సర్గే న బ్రహ్మణి క్వచిత్॥

శ్లో॥ అస్తి భాతి ప్రియం రూపం నామ చేత్యంశపంచకమ్।
ఆద్యద్వ౦ం బ్రహ్మరూపం జగద్రూపం తతో ద్వయమ్॥

శ్లో॥ ఖ-వాయు-అగ్ని-జల-ఉర్వీషు దేవ తిర్య ఙ్నరాదిషు।
అభిన్నాః సచ్చిదానందాః భిద్యతే రూపనామనీ॥

శ్లో॥ ఉపేక్ష్య నామరూపే ద్వే సచ్చిదానందతత్పరః।
సమాధిం సర్వదా కుర్యాత్ హృదయే వాఽథవా బహిః॥

తా॥ అదేవిధముగా, సృష్టికిని, బ్రహ్మకును గల భేదము నావరించి యుండునది ఆవరణశక్తి. ఈ యావరణశక్తివల ననే, బ్రహ్మ జగద్రూపమున భాసించును.

ఈ స్థలమునందుగూడ, ఆవరణశక్తి నాశమొందగానే సృష్టికిని, బ్రహ్మకును గల భేదము స్ఫురించును. నామరూప వ్యాకరణము సృష్టిగతమైనది గాని, బ్రహ్మసంబద్ధమైనది కాదు.

ఈ జగత్తు అయిదు విధములుగా గోచరించును. అవి యివి అస్తిత్వము, ప్రకాశత్వము, ప్రియత్వము, నామము, రూపము. వీనిలో మొదటి మూడును బ్రహ్మరూపములు; మిగిలినవి రెండును జగద్రూపములు.

పృథివ్యాది పంచభూతములందును, దేవ, నర, మృగాదులందును సచ్చిదానందములు అభిన్నముగనే, అనగా ఒకే విధముగనే కలవు. కాని, నామరూపములు మాత్రము భేదించుచున్నవి.

నామరూపములను రెంటిని పరిత్యజించి, సచ్చిదానందపరబ్రహ్మయందు నిష్ఠ గల సాధకుడు హృదయమున గాని, బాహ్యజగమున గాని, సమాధి ననుష్ఠింపనగును.

శ్లో॥ సవికల్పో నిర్వికల్పః సమాధిః ద్వివిధో హృది।
దృశ్యశబ్దానువేధేన సవికల్పం పున ర్ద్విధా॥

శ్లో॥ కామాద్యా శ్చిత్తగా దృశ్యాః తత్సాక్షిత్వేన చేతనమ్।
ధ్యాయేత్ దృశ్యానువిద్ధోఽయం సమాధి స్సవికల్పకః॥

శ్లో॥ అసంగ స్సచ్చిదానందః స్వప్రభః ద్వైతవర్జితః।
అస్మీతి శబ్దవిద్ధోఽయం సమాధి స్సవికల్పకః॥

శ్లో॥ స్వానుభూతిరసావేశాత్ దృశ్యశబ్దా వుపేక్ష్య తు।
నిర్వికల్ప స్సమాధి స్స్యాత్ నివాతస్థితదీపవత్॥

తా॥ హృదయమున సమాధి సవికల్పము, నిర్వికల్పము అని ద్వివిధమై యుండును. సవికల్పసమాధి దృశ్యానువిద్ధము, శబ్దానువిద్ధ మని మరల ద్వివిధము.

మనోధర్మములగు కామాదులు దృశ్యములని యందురు. ఈ దృశ్యములకు సాక్షిభూతముగ నొప్పారుచున్న చిదాత్మను

ధ్యానింపుము. ఇట్టి దృశ్యానువిద్ధమగు సమాధినే సవికల్ప సమాధి యందురు.

'నిస్సంగుడు, స్వయంప్రకాశుడు, ద్వైతవర్జితుడు' సచ్చిదానంద స్వరూపుడు నగు బ్రహ్మయే నేను' అని ధ్యానించుట వలన కలుగు సవికల్పక సమాధినే శబ్దానువిద్ధమైన సమాధి యందురు.

ఆత్మానుభూతిరసావేశము వలన, దృశ్య - శబ్దాదుల నుండి మనస్సు విడివడి, నిర్వాతదీపము వలె సహజస్థితిని బొందును. ఆ స్థితినే నిర్వికల్పసమాధి యందురు.

శ్లో॥ హృదీవ బాహ్యదేశేఽపి యస్మిన్ కస్మింశ్చ వస్తుని।
సమాధి రాద్యః సన్మాత్రాత్ నామరూపపృథక్కృతిః॥

శ్లో॥ అఖండైకరసం వస్తు సచ్చిదానందలక్షణమ్।
ఇత్యవచ్ఛిన్న చింతేయం సమాధిః మధ్యమో భవేత్॥

శ్లో॥ స్తబ్ధీభావో రసాస్వాదవత్ తృతీయః పూర్వవన్మతః।
ఏతైః స్సమాదిభి ష్షడ్భిః నయేత్ కాలం నిరంతరమ్॥

శ్లో॥ దేహాభిమానే గలితే విజ్ఞాతే పరమాత్మని।
యత్ర యత్ర మనో యాతి తత్ర తత్ర సమాధయః॥

తా॥ హృదయమునందు కామాదిదృశ్యములకు సాక్షిగా ఆత్మనుధ్యానించినట్లు బాహ్యప్రపంచమున గూడ, సూర్యాది వస్తువు లందు సన్మాత్రమునుండి నామరూపములను పృథక్క-

రించి సన్మాత్రమును ధ్యానించుటవలన ఏ సమాధి లభించునో అదియే, మొదటిదగు బాహ్య దృశ్యానువిద్ధమైన బాహ్య సవికల్పక సమాధి యనబడును.

సజాతీయ, విజాతీయ, స్వగతభేదశూన్యము, ఏకరసము, సచ్చిదానందలక్షణము నగు బ్రహ్మవస్తువును అవిచ్ఛిన్న తైలధారవలె నిరంతరధ్యాన మొనర్చుటవలన కలుగు సమాధి శబ్దానువిద్ధమైన బాహ్యసవికల్పక సమాధి యన బడును. ఇది మధ్య సమాధి.

బ్రహ్మ రసానుభవము వలన కలుగు స్తబ్ధీభావమే అనగా, నిశ్చలత్వమే మూడవదగు నిర్వికల్పసమాధి యని గ్రహింపనగును. ఇది పూర్వము వలెనే యుండును. ఈ విధ ముగ, షడ్విధములైన సమాధిస్థితుల ననుభవించుచు సాధకుడు కాలమును గడుపవలెను.

దేహాభిమానము వినష్టమై పరమాత్మస్వరూప మవ గత మయినంతనే; మనస్సు ఎచట సంచరించినను, వీనిలో నేదేని నొక సమాధిని సాధకుడు అనాయాసముగ పొందు చుండును

శ్లో॥ "భిద్యతే హృదయగ్రంథి శ్ఛిద్యంతే సర్వసంశయాః
క్షీయంతే చాస్య కర్మాణి తస్మిన్ దృష్టే పరావరే॥"

శ్లో॥ అవచ్ఛిన్న శ్చిదాభాసః తృతీయ స్స్వప్నకల్పితః।
విజ్ఞేయ స్త్రివిధో జీవః తత్రాద్యః పారమార్థికః॥

శ్లో॥ అవచ్ఛేదః కల్పిత స్స్యాత్ అవచ్ఛేద్యం తు వాస్తవమ్।
తస్మిన్ జీవత్వమారోపాత్ బ్రహ్మత్వం తు స్వభావతః॥

శ్లో॥ అవచ్ఛిన్నస్య జీవస్య తాదాత్మ్యం బ్రహ్మణా సహ।
తత్త్వమస్యాదివాక్యాని జగు ర్నేతరజీవయోః॥

శ్లో॥ బ్రహ్మణ్యవస్థితా మాయా విక్షేపావృతిరూపిణీ।
ఆవృత్యాఖండతాం తస్మిన్ జగజ్జీవౌ ప్రకల్పయేత్॥

తా॥ పరావర బ్రహ్మసాక్షాత్కారము నందిన సాధకుని హృదయమున నాశ్రయించియున్న అహంకారగ్రంధి విడిపోవును; ఛిన్నసంశయు డగును; వాని సంచితకర్మ లన్నియు క్షయము నొందును.

జీవుడుఅవచ్ఛిన్న, చిదాభాస, స్వప్నకల్పిత - భేదములతో త్రివిధముగా నుండును. వీనిలో మొదటివాడగు అవచ్ఛిన్నుడు పారమార్థికుడని తెలియనగును.

అవచ్ఛేదము కల్పితము; అవచ్ఛేద్యము యథార్థము. అనగా, జీవత్వము కల్పితము: శుద్ధచైతన్యము వాస్తవము. సద్రూపమైన ఆచైతన్యమందు జీవత్వ మధ్యస్తమగుచున్నది; సహజముగ నుండునది బ్రహ్మత్వమే.

తత్త్వమస్యాది మహావాక్యములు అవచ్ఛిన్నజీవునికి అనగా, సాక్షిచైతన్యమునకు బ్రహ్మతో తాదాత్మ్యమును వర్ణించుచున్నవి. చిదాభాసునికిగాని, స్వప్నకల్పితునికిగాని, బ్రహ్మతో తాదాత్మ్యమును వర్ణించుటలేదు.

ఆవరణ విక్షేప రూపములతో ద్వివిధముగా నొప్పు మాయ బ్రహ్మాయందు వెలయుచు, అఖండత్వము నావరించి యుండును. ఆ మాయ బ్రహ్మాయందు జగత్తును, జీవుని కల్పించుచున్నది.

శ్లో॥ జీవో ధీస్థచిదాభాసో భవేత్ భోక్తా హి కర్మకృత్।
భోజ్యరూప మిదం సర్వం జగత్ స్యాత్ భూతభౌతికమ్॥

శ్లో॥ అనాదికాల మారభ్య మోక్షాత్ పూర్వ మిదం ద్వయమ్।
వ్యవహారే స్థితం తస్మా దుభయం వ్యావహారికమ్॥

శ్లో॥ చిదాభాసస్థితా నిద్రా విక్షేపావృతిరూపిణీ।
ఆవృత్య జీవజగతి పూర్వే నూత్నం తు కల్పయేత్॥

శ్లో॥ ప్రతీతికాలే ఏవైతే స్థితత్వాత్ ప్రాతిభాసికే।
న హి స్వప్నప్రబుద్ధస్య పునః స్వప్నేఽపి స్థితి స్తయోః॥

తా॥ బుద్ధి యందుండు చిదాభాసుడే జీవనామముతో బరగును. అతడే కర్తయు భోక్తయునై వెలయును. ఈ భూతభౌతికప్రపంచ మంతయు ఆ జీవునికి భోగస్థానమై యుండును.

అనాదికాలము నుండి మోక్షోపలబ్ధిపర్యంతము ఈ జీవ-జగత్తులు రెండును వ్యవహారమున నున్నవి. కావున, ఇవి వ్యావహారికములే గాని, పరమార్థమున లేవు.

అవిద్యాఖ్యమగు తమోరూపనిద్ర చిదాభాసు నాశ్రయించి యుండును. ఆ యవిద్య, లేక నిద్ర, చిదాభాసుని

యందు, అనగా వ్యావహారికజీవుని యందు ఆవరణ-విక్షేప శక్తిరూపమున నుండును. ఆవరణశక్తి పూర్వానుభూతము లైన జీవజగత్తుల నావృత మొనర్పగా, విక్షేపశక్తి స్వప్నావస్థయందు మరల నూత్నజీవజగత్తులను కల్పించును.

స్వప్నగతములైన ఈ జీవజగత్తులు రెండును ప్రాతిభాసికములే. ఏలనన, స్వప్నమునం దనుభూతములైన యా జీవజత్తుగలు రెండును స్వప్నమునుండి ప్రబోధ నుందిన వ్యక్తి యందు గాని, మరల స్వప్నమున గాని, యుండవు.

శ్లో॥ ప్రాతిభాసికజీవో య స్తజ్జగత్ ప్రాతిభాసికమ్ ।
వాస్తవం మన్యతేఽన్యస్తు మిథ్యేతి వ్యావహారికః ॥

శ్లో॥ వ్యావహారికజీవో య స్తజ్జగద్ వ్యావహారికమ్ ।
సత్యం ప్రత్యేతి మిథ్యేతి మన్యతే పారమార్థికః ॥

శ్లో॥ పారమార్థికజీవస్తు బ్రహ్మైక్యం పారమార్థికమ్ ।
ప్రత్యేతి వీక్షతే నాన్య ద్వీక్షతే త్వనృతాత్మనా ॥

శ్లో॥ మాధుర్యద్రవశైత్యాని నీరధర్మా స్తరంగకే ॥
అనుగమ్యాథ తన్నిష్ఠే ఫేనేఽప్యనుగతా యథా ।

శ్లో॥ సాక్షిస్థాః సచ్చిదానందాః సంబంధా వ్యావహారికే ।
తద్ద్వారేణానుగచ్ఛంతి తథైవ ప్రాతిభాసికే ॥

తా॥ ప్రాతిభాసికజీవుడు ఏ ప్రాతిభాసికజగత్తును యథార్థమని భావించునో, దానిని వ్యావహారికజీవుడు మిథ్యగా తలచును.

వ్యావహారికజీవుడు ఏ వ్యావహారిక ప్రపంచమును సత్యమని తలంచునో దానిని పారమార్థికజీవుడు మిథ్యాకల్పితమని భావించును.

పారమార్థికజీవుడు బ్రహ్మాత్మైక్యమునే పరమార్థమని తలపోయును; ఆ యఖండాత్మస్వరూపమునే వీక్షించును. తద్భిన్నమైన దానిని అతడు చూడడు. ఒకవేళ బ్రహ్మాభిన్నమైన వస్తువును వీక్షించినను, మిథ్య యనియే భావించును.

మాధుర్యము, ద్రవత్వము, శైత్యము మున్నగునవి జలధర్మములు. ఆ ధర్మములు తరంగము ననుసరించి తన్నిష్ఠమగు ఫేనమునం దనుగతము లగును.

అదేవిధముగా సాక్షి యందుండు సత్, చిత్, ఆనందములు వ్యావహారికజీవ సంబద్ధములై, తద్ద్వారమున ప్రాతిభాసిక జీవుని యందనుగతము లగును.

శ్లో॥ లయే ఫేనస్య తద్ధర్మా ద్రవాద్యాః స్యు స్తరంగకే।
తస్యాపి విలయే నీరే తిష్ఠంత్యేతే యథా పురా॥

శ్లో॥ ప్రాతిభాసికజీవస్య లయే స్యు ర్వ్యావహారికే।
తల్లయే సచ్చిదానందాః పర్యవస్యంతి సాక్షిణి॥

తా॥ ఫేనము లయము చెందినంతనే, తద్ధర్మము లగు ద్రవశైత్యాదులు తరంగమునం దుండును; ఆ తరంగము గూడ

లీనమైనంతనే ఆ ధర్మములు యథాతథముగా, జలమున వెలయును.

అదేరీతిగ, సచ్చిదానందములు ప్రాతిభాసికజీవుడు విలీన మైనంతనే వ్యావహారికజీవునం దవస్థితము లగును; వ్యావహారిక జీవుడును లయ మొంగగానే,ఆ సచ్చిదానందాది ధర్మములు సాక్షియందు యథాపూర్వము వెలయును.

ఇటు పిమ్మట శ్రీ ఆచార్యపాదులచే అద్వైతసారము మూడు శ్లోకములలో నిట్లు ప్రపంచింపబడినది.

శ్లో॥ గురు ర్బ్రహ్మ స్వయం సాక్షాత్ సేవ్యో వంద్యో ముముక్షుభిః
నోద్వేజనీయ ఏవాయం కృతజ్ఞేన వివేకినా ॥

శ్లో॥ యావ దాయు స్త్రయో వంద్యో వేదాంతో గురు రీశ్వరః ।
మనసా కర్మణా వాచా శ్రుతే రేవైష నిశ్చయః ॥

శ్లో॥ భావాద్వైతం సదా కుర్యాత్ క్రియాద్వైతం న కర్హిచిత్।
అద్వైతం త్రిషు లోకేషు నాద్వైతం గురుణా సహ ॥

తా॥ గురువు సాక్షాత్తుగ బ్రహ్మ యని యెరుంగునది. ఆ యాచార్యుడు మోక్షార్థులగు సాధక జనులకు సేవనీయుడు, వందనీయుడు నని భావింపనగును. కృతజ్ఞుడు, సదసద్వివేకము కల శిష్యు డెన్నడును గురువున కుద్వేగము కలుగనీయరాదు.

జీవించియున్నంతవరకు మనసా, వాచా, కర్మణా అనగా, త్రికరణశుద్ధిగా ఉపనిషద్వాక్యములకు, గురువునకు, ఈశ్వరునకు నమస్కార మాచరింప నగును.

భావమున అద్వైతము ఉండదగును; కాని, క్రియాఽద్వైత మెన్నడును జూపజనదు. త్రిభువనములం దద్వైత భావము ఉంచదగును గాని, గురువు ఎడ అద్వైతబుద్ధిని చూపదగదు. గురువు సదా వందనీయుడని భావన చేయవలెను.

అటు తర్వాత పరమార్థసత్యమును 'స్వాత్మప్రకాశికా' అను పేరుతో ఆచార్యులు విశదముగా వివరించిరి.

శ్లో॥ జగత్కారణ మజ్ఞాన మేకమేవ చిదన్వితమ్।
ఏక ఏవ మనస్సాక్షీ జానా త్యేవం జగత్త్రియమ్॥

శ్లో॥ వివేకయుక్తబుద్ధ్యాఽహం జానా మ్యాత్మాన మద్వయమ్।
తథాఽపి బంధమోక్షాది ర్వ్యవహారః ప్రతీయతే॥

శ్లో॥ వివర్తోఽపి ప్రపంచో మే సత్యవద్భాతి సర్వదా।
ఇతి సంశయపాశేన బద్ధోఽహం ఛింది సంశయమ్॥

శ్లో॥ ఏవం శిష్యవచ శ్శ్రుత్వా గురురాహోత్తరం స్ఫుటమ్।
నాజ్ఞానం న చ బుద్ధిశ్చ న జగన్న చ సాక్షితా॥

శ్లో॥ బంధమోక్షాదయ స్సర్వే కృతాః సత్యేఽద్వయే త్వయి।
భాతీత్యుక్తే జగత్సర్వం సద్రూపం బ్రహ్మ తద్భవేత్॥

తా॥ చైతన్యాన్వితమైన అజ్ఞానమే జగత్కారణ మనియు, మనస్సాక్షి యగు ఆత్మయొక్కటియె ముల్లోకములను తెలుసుకొనుచున్నదనియు తెలియుచున్నది.

సదసద్వివేకయుక్తమైన బుద్ధిద్వారా, నేను అద్వితీయ మగు ఆత్మస్వరూపమును తెలిసికొనుచున్నాను. అయినను, బంధము, మోక్షము మున్నగు వ్యవహార మంతయు ప్రతీయమాన మగుచునే యున్నది.

ఈ ప్రపంచము బ్రహ్మయొక్క వివర్తమే. అయినను, నాకు సర్వదా, ఇది సత్యవస్తువుగనే భాసించుచున్నది. ఇట్టి సంశయపాశముచే బద్ధుడనై యుంటిని. ఆచార్యవర్యా! నా సంశయమును పోగొట్టుడు.

పైన చెప్పబడిన రీతిగా, శిష్యవచనము లాలకించి గురువు స్పష్టముగా ఇట్లు పలికెను- అజ్ఞానములేదు; బుద్ధియును లేదు. జగత్తు లేదు; సాక్షిత్వమును లేదు.

బంధమోక్షాదు లన్నియు, సత్యస్వరూపుడవును, అద్వయుడవు నగు నీయందు కల్పితములైనవి; నిఖిలప్రపంచము నీయందే భాసమాన మగుచున్న దనిన, నీవే ఆ సద్రూప మగు బ్రహ్మమ వగుచున్నావు అని తెలియనగును.

శ్లో॥ సర్పాదౌ రజ్జుసత్తేవ బ్రహ్మసత్తైవ కేవలమ్ ।
ప్రపంచాధారరూపేణ వర్తతేసజ్జగ న్నహి ॥

శ్లో॥ యథేక్షు మధిసంవ్యాప్య శర్కరా వర్తతే తథా ।
అశ్చర్యబ్రహ్మరూపేణ త్వం వ్యాప్తోఽసి జగత్త్రయమ్ ॥

శ్లో॥ మరుభూమౌ జలం సర్వం మరుభూమాత్రమేవ తత్,
జగత్రయ మిదం సర్వం చిన్మాత్రం సువిచారతః ॥

శ్లో॥ బ్రహ్మాదిస్తంబపర్యంతాః ప్రాణినస్త్వయి కల్పితాః ।
బుద్బుదాదితరంగాంతా వికారాః సాగరే యథా॥

శ్లో॥ తరంగత్వం ధ్రువం సింధు ర్న వాంఛతి యథా తథా।
విషయానందవాంఛా తే మహానందస్వరూపతః ॥

తా॥ రజ్జువును జూచి సర్పమని భ్రాంతి కలిగినప్పుడు రజ్జుసత్తయే యుండును. అదేరీతిగ, ప్రపంచభానసమయమున తదాధారరూపమున కేవల మొక్క బ్రహ్మయే నెలకొని యుండును. రజ్జుసర్పము సత్యము కానట్లు, సత్యమగు జగత్తును లేదు.

చెరకుగడ నంతటిని వ్యాపించి పంచదార యుండును. అదేవిధముగ, ఆశ్చర్యబ్రహ్మరూపమున నీవే జగత్త్రియము నందభివ్యాప్తమై యుంటివి.

మరుభూమియందు గన్పట్టు జలమంతయు మరుభూమి మాత్రమే. అదేరితిగ, చక్కగ విచారించినచో, ఈ జగత్త్రియ మంతయు చిన్మాత్రమే యని తెలియును.

బుద్బుదాదులు మొదలుకొని తరంగాంతములైన వికారము సాగరమున ఏరీతిగా, కల్పితము లగుచున్నవో, అదే మాదిరిగ, బ్రహ్మాది స్తంబ (రెల్లుదుబ్బు) పర్యంతము గల

ప్రాణులన్నియు బ్రహ్మస్వరూపుడవైన నీయందు కల్పితములే యని తెలియనగును.

సాగరము తరంగత్వమును పొందగోరదు. ఇది నిశ్చయము. అదేరీతిగ, మహానందస్వరూపుడ వగుటచేత నీకును, విషయానందము నందభిలాష కలుగనేరదు.

శ్లో॥ పిష్టం వ్యాప్య గుడం యద్వత్ మాధుర్యం న హి వాంఛతి ।
పూర్ణానందో జగద్ వ్యాప్య తదాఽఽనందం న వాంఛతి ॥

శ్లో॥ దారిద్ర్యాశా యథా నాస్తి సంపన్నస్య యథా తవ ।
బ్రహ్మానందనిమగ్నస్య విషయాశా న సంభవేత్ ॥

శ్లో॥ విషం దృష్ట్వాఽమృతం దృష్ట్వా విషం త్యజతి బుద్ధిమాన్ ।
ఆత్మాన మపి దృష్ట్వా త్వం త్యజానాత్మాన మాదరాత్ ॥

శ్లో॥ ఘటావభాసకో భాను ర్ఘటనాశే న నశ్యతి ।
దేహావభాసక స్సాక్షీ దేహనాశే న నశ్యతి ॥

శ్లో॥ నిరాకారం జగత్సర్వం నిర్మలం సచ్చిదాత్మకమ్ ।
ద్వైతభావాత్ కథం కస్మా ద్భయం పూర్ణస్య మే వద ॥

తా॥ పిష్టమును వ్యాపించియున్న గుడము మాధుర్యమును వాంఛింపదు. అదేవిధముగా, పూర్ణానందస్వరూపమగు బ్రహ్మ ప్రపంచమును వ్యాపించియుండి ఆ ప్రాపంచికానందమును కోరదు.

ధనసంపన్నుడైన వ్యక్తికి దారిద్ర్యమునందు ఆశ యెట్లుండదో, అదేరీతిగ బ్రహ్మానందసాగరమున ఓలలాడు నీకును భౌతికవిషయములందు అభిలాష యుండదు.

యుక్తాయుక్తజ్ఞానము గల బుద్ధిమంతుడు విషమును, అమృతమును రెంటిని జూచి, విషమును పరిత్యజించును. అట్లే నీవును, ఆత్మను, అనాత్మయగు జగత్తునుగాంచి, పూనికతో అనాత్మయగు ఈ భూతభౌతికప్రపంచమును పరిత్యజింపుము.

ఘటము నవభాసింపజేయు సూర్యుడు ఘటనాశమైనను, తాను వినాశ మందడు. అదేవిధముగా, దేహావభాసకమైన సాక్షిచైతన్యము దేహము వినష్టమైనను, తాను వినాశ మందదు.

ఈ జగత్తంతయు నిరాకారము, నిర్మలము, సచ్చిదాత్మకముగా దర్శించునట్టియు, పూర్ణపురుషుడునైన నాకు ద్వైత భావము ఎక్కడిది? దేనివలన నాకు భయము కలుగును? చెప్పుము.

శ్లో॥ బ్రహ్మాదికం జగత్సర్వం త్వయ్యానందే ప్రకల్పితమ్ ।
జగత్ త్వయ్యేవ లీనం తత్ కథం త్వం లీయసే వద ॥

శ్లో॥ న హి ప్రపంచో న హి భూతజాతం
న చేంద్రియం ప్రాణగణో న దేహః ।
న బుద్ధిచిత్తం న మనో న కర్తా
బ్రహ్మైవ సత్యం పరమార్థరూపమ్ ॥

శ్లో॥ సర్వం సుఖం విద్ధి సుదుఃఖనాశాత్
సర్వం చ సద్రూప మసత్యనాశాత్ ।
చిద్రూపమేవ ప్రతిభానయుక్తం
తస్మా దఖండం పరమాత్మరూపమ్ ॥

శ్లో॥ చిదేవ దేహస్తు చిదేవ లోకా
శ్చిదేవ భూతాని చిదింద్రియాణి ।
కర్తా చిదంతఃకరణం చిదేవ
చిదేవ సత్యం పరమార్థరూపమ్ ॥

తా॥ పిపీలికాది బ్రహ్మపర్యంతము గల ప్రపంచమంతయు, ఆనందస్వరూపుడవైన నీయందు కల్పితమై నీయందే విలీన మగుచున్నది. అట్టి సర్వాధారుడవైన నీ వెట్లు వినాశ మంద గలవు ? చెప్పుము.

ప్రపంచము లేదు; భూతజాతమును లేదు. ఇంద్రియ ములు లేవు; ప్రాణములును, లేవు; దేహమును లేదు. బుద్ధి గాని, చిత్తము గాని, మనస్సుగాని, కర్త యగు అహంకారము గాని, లేదు. పరమార్థభూతమైన బ్రహ్మ మొక్కటియే సత్యమై వెలుగొందుచున్నది.

ఆత్యంతిక దుఃఖనాశము వలన, సర్వము సుఖమయ ముగ నెరుగుము. అసత్యనాశము వలన, సర్వము సద్రూప మనియే, తెలిసికొనుము. ప్రతిభానముతో కూడిన దంతయు చిద్రూపమే యని గ్రహింపనగును. కనుక, అఖండమగు పర

మాత్మస్వరూప మొక్కటియే సర్వదా భాసించుచుండునని తెలియనగును.

శరీరము, లోకములు చిద్రూపములే. భూతములు; ఇంద్రియములు చిచ్ఛాయా విలసితములే. కర్తయగు అహంకారము; అంతఃకరణము రెండును చైతన్యరూపములే. చైతన్యమే పరమార్థభూతమైన సత్యవస్తువు.

శ్లో॥ న మే బంధో న మే ముక్తిః న మే శాస్త్రం న మే గురుః।
మాయామాత్రవిలాసో హి మాయాతీత మద్వయః ॥

శ్లో॥ రాజ్యం కరోతు విజ్ఞానీ భిక్షా మటతు నిర్భయః ।
దోషై ర్న లిప్యతే శుద్ధః పద్మపత్ర మివాంభసా॥

శ్లో॥ పుణ్యాని పాపకర్మాణి స్వప్నగాని న జాగ్రతి।
ఏవం జాగ్రత్పుణ్యపాపకర్మాణి న హి మే ప్రభోః॥

శ్లో॥ కాయః కరోతు కర్మాణి వృథా వాగుచ్యతా మిహ।
రాజ్యం ధ్యాయతు వా బుద్ధిః పూర్ణస్య మమ కా క్షతిః॥

శ్లో॥ ప్రాణా శ్చరంతు తద్ధర్మైః కామైర్వా హన్యతాం మనః।
ఆనందామృతపూర్ణస్య మమ దుఃఖం కథం భవేత్॥

తా॥ నాకు బంధము, మోక్షము రెండును లేవు; నాకు శాస్త్రము లేదు; గురువు లేడు. ఇవన్నియును, మాయా విలాసమాత్రములే. నేను; మాయాతీతుడను; అద్వయ స్వరూపమున వెలుగొందువాడను.

విజ్ఞాని రాజ్యమునే పాలించును గాక! లేక భిక్షాటనమే చేయునుగాక! అభయస్థితిని బొందిన పరిశుద్ధస్వరూపుడు తామరాకుమీది నీటిబొట్టువలె దోషములచే లిప్తుడుగాక వెలయుచుండును.

స్వప్నప్రపంచమున చేయునట్టి పాపపుణ్యములు జాగరణకాలమున నుండవు. అట్లే జాగ్రదవస్థయందలి పాపపుణ్యములు ప్రభుడనగు నాకు లేవు.

శరీరము కర్మల నొనర్చునుగాక! వాక్కు వృథా ప్రసంగములనే చేయుగాక! బుద్ధి రాజ్యవిషయములనే ధ్యానించును గాక! పూర్ణస్వరూపుడ నగు నాకు క్షతియేమి ?

ప్రాణాదిపంచకము తమ ధర్మములను నిర్వర్తించుచుండును గాక! మనస్సు కామాదులచే పీడన మొందుగాక! ఆనందామృత పూర్ణస్వరూపుడనగు నాకు దుఃఖ మెట్లు కలుగును?

శ్లో॥ ఆనందాంబుధిమగ్నో ఒసౌ దేహీ తత్ర న దృశ్యతే।
లవణం జలమధ్యస్థం యథా తత్ర లయం గతమ్॥

శ్లో॥ ఇంద్రియాణి మనః ప్రాణా అహంకారః పరస్పరమ్।
జాడ్యసంగతి ముత్సృజ్య మగ్నా మయి చిదర్ణవే॥

శ్లో॥ ఆత్మాన మంజసా వేద్మి త్వజ్ఞానం ప్రపలాయితమ్।
కర్తృత్వ మద్య మే నష్టం కర్తవ్యం వాఽపి న క్వచిత్॥

శ్లో॥ చిదమృతసుఖరాశౌ చిత్తఫేనం విలీనం
క్షయ మధిగత ఏవ వృత్తిచంచత్తరంగః।
స్తిమితసుఖసముద్రో నిర్వ్విచేష్టః సుపూర్ణః
కథ మిహ మమ దుఃఖం సర్వదైకోఽహ మస్మి॥

తా॥ జలమున పడిన లవణఖండము దానిలో విలీనమై కని పించనట్లు ఆనందమహాసాగరమున మునిగిన ఈ దేహియు అనగా, జీవుడును, అచట విలీనమై తద్భిన్నుడుగ స్ఫురిం చడు. స్వస్వరూపావస్థితి నందినపుడు సచ్చిదానందస్వరూప మైన బ్రహ్మమే యగును.

ఇంద్రియములు, మనస్సు, ప్రాణములు, అహం కారము ఇవన్నియు తమ జడభావమును పరిత్యజించి చిదం బోధినగు నాయందు విలీనమగును.

నేను ఆత్మాపరోక్షానుభూతి నందితిని; అజ్ఞానము పలాయితమైనది; నాయందు కర్తృత్వ - భోక్తృత్వాదులు వినష్టము లైనవి; కర్తవ్య మనున దేదియు నాకు లేదు.

చైతన్యసుధాసుఖసాగరమున; చిత్త మను ఫేనము విలీనమైనది; చిత్తవృత్తు లను చంచలతరంగములు క్షయము నందినవి. కావున, నేనిప్పుడు ప్రశాంతసుఖసాగరుడను,

నిష్క్రియుడను, పూర్ణస్వరూపుడ నైతిని. సర్వదా అఖండ స్వరూపమున నొప్పునట్టి నాకిక దుఃఖ మెట్లు కలుగును?

శ్లో॥ ఆనందరూపోఽహ మఖండబోధః
పరాత్ పరోఽహం ఘనచిత్ప్రకాశః।
మేఘా యథా వ్యోమ న చ స్పృశంతి
సంసారదుఃఖాని న మాం స్పృశంతి॥

శ్లో॥ అస్థిమాంస పురీషాంత్ర చర్మలోమసమన్వితః।
అన్నాదః స్థూలదేహః స్యా దతోఽహం శుద్ధచిద్ఘనః॥

శ్లో॥ స్థూలదేహాశ్రితా ఏతే స్థూలా ద్భిన్నస్య మే న హి।
లింగం జడాత్మకం నాహం చిత్స్వరూపోఽహ మద్వయః॥

శ్లో॥ క్షుత్పిపాసాంధ్యబాధిర్య కామక్రోధాదయోఽఖిలాః।
లింగదేహాశ్రితా హ్యేతే నైవాలింగస్య మే విభోః॥

తా॥ నే నానందస్వరూపుడను; అఖండబోధస్వరూపుడను; పరము కంటె పరమైన బ్రహ్మమను; చిద్ఘనప్రకాశమునై వెలుగొందువాడను. మేఘములు ఆకాశమును స్పృశింప జాలనట్లు దుఃఖములు నిర్మలస్వరూపుడనైన నన్ను తాక జాలవు.

ఈ స్థూలశరీరము అస్థిమాంసమయము; మలము, ప్రేగులు, చర్మము, లోమములతో కూడియున్నట్టిది; ఇది అన్నమయము. నేను చిద్ఘనుడను గాన, శరీరమును గాను.

ఇవన్నియు స్థూలదేహము కంటె భిన్నుడనై వెలయు నట్టి నాకు అస్థిమాంసాదులు ఏవియును లేవు. లింగదేహము జడము, నేను చిత్స్వరూపుడను. అద్వయ స్వరూపుడను. కాననేనీ జడాత్మకలింగదేహమును గాను.

క్షుత్పిపాసలు, అంధత్వ బధిరత్వాదులు, కామ, క్రోధాదు లివన్నియు లింగదేహాశ్రితములు. సర్వవ్యాపియు, లింగదేహాతీతుడ నగు నాకు ఆయా గుణములు లేవనియే తెలియనగును.

శ్లో॥ అనాద్యజ్ఞానమేవాత్ర కారణం దేహ ముచ్యతే ।
నాహం కారణదేహోఽపి స్వప్రకాశో నిరంజనః ॥

శ్లో॥ జడత్వ ప్రియత్వ మోదత్వధర్మాః కారణ దేహజాః
న సంతి మమ నిత్యస్య నిర్వికారస్వరూపిణః ॥

శ్లో॥ జీవాద్భిన్నః పరేశోఽస్తి పరేశత్వం కుత స్తవ ।
ఇత్యజ్ఞజనసంవాదో విచారః క్రియతేఽధునా ॥

శ్లో॥ అధిష్ఠానం చిదాభాసో బుద్ధిః ఏత త్త్రియం యదా ।
అజ్ఞానా దేకవద్భాతి జీవ ఇత్యుచ్యతే తదా ॥

శ్లో॥ అధిష్ఠానం న జీవ స్స్యాత్ ప్రత్యేకం నిర్వికారతః ।
అవస్తుత్వా చ్చిదాభాసో నా స్తి తస్య జీవతా ॥

తా॥ అనాది యగు అజ్ఞానమే, కారణశరీర మనబడును. నేనీకారణశరీరమును గూడ కాను. ఏలనన, నేను స్వయం ప్రకాశుడను, నిరంజనుడనై వెలుగొందువాడను.

జాడ్యము, ప్రియము, మోదము మున్నగు ధర్మములు కారణశరీరమువలన కలుగునట్టివి. నిత్యుడను, నిర్వికారస్వరూపుడనై తేజరిల్లు నాకు ఆ జడతాది ధర్మములు లేవు.

'పరమేశ్వరుడు జీవునికంటె భిన్నుడు; ఇక, నీకు పరమేశ్వరత్వ మెట్లు సంభవము?' అను అజ్ఞజనుల సంవాదమును గూర్చి విచారింతము.

అధిష్ఠానము, చిదాభాసుడు, బుద్ధి - ఈ మూడును అజ్ఞానము వలన ఒకటిగా ఆభాసించును. అప్పుడు ఈ అధిష్ఠానాది త్రయము జీవనామమున అభిహిత మగుచుండును. కూటస్థమగు అధిష్ఠానము నిర్వికార మగుటవలన, అది యొన్నడును జీవుడు కాదు: చిదాభాసుడు అవస్తువు అగుటవలన అనగా, మిథ్యాకల్పిత మగుట వలన, వానికి జీవత్వము చెప్ప వలనుపడదు.

శ్లో॥ ప్రత్యేకం జీవతా నాస్తి బుద్ధేరపి జడత్వతః ।
జీవ ఆభాసకూటస్థ బుద్ధిత్రయ మతో భవేత్ ॥

శ్లో॥ మాయాభాసో విశుద్ధాత్మా త్రయి మేతన్మహేశ్వరః ।
మాయాభాసోఽప్యవస్తుత్వాత్ ప్రత్యేకం నేశ్వరో భవేత్ ॥

శ్లో॥ పూర్ణత్వా న్నిర్వికారత్వా ద్విశుద్ధత్వా న్మహేశ్వరః ।
జడత్వహేతో ర్మాయాయా మీశ్వరత్వం తు దుర్ఘటమ్ ॥

శ్లో॥ తస్మా దేతత్త్రయం మిథ్యా తదర్థో నేశ్వరో భవేత్ ।
ఇతి జీవేశ్వరౌ భాతః స్వాజ్ఞానాత్ న హి వస్తుతః ॥

శ్లో॥ ఘటాకాశమఠాకాశౌ మహాకాశే ప్రకల్పితౌ ।
ఏవం మయి చిదాకాశే జీవేశౌ పరికల్పితౌ ॥

శ్లో॥ మాయా తత్కార్యవిలయే నేశ్వరత్వం న జీవతా ।
తతః శుద్ధచిదేవాహం చిద్వ్యోమ నిరుపాధితః ॥

తా॥ బుద్ధి జడ మగుటవలన దానికిని జీవత్వము చెప్ప వలను పడదు. కావున, అధిష్ఠానము, చిదాభాసుడు, బుద్ధి- ఈ మూడును కలిసియే జీవవ్యవహారము నొందును.

మాయ, చిదాభాసుడు, విశుద్ధాత్మ- ఈ మూడును కలిసియే మహేశ్వరనామమున బరగును. మాయయు, చిదాభాసుడును అవస్తువులగుటవలన అనగా, అయథార్థము లగుట వలన ఇవి వేరు-వేరుగ ఈశ్వరసంజ్ఞచే వివక్షితములు కాజాలవు.

పూర్ణత్వ, నిర్వికారత్వ, విశుద్ధత్వ హేతువుల వలననే ఈశ్వరసంజ్ఞ యొప్పును. మాయ జడము. కాన, అదెన్నటికిని ఈశ్వరుడు కాజాలదు.

కావున, ఈ మూడును మిథ్యయే. 'తత్' పదము నకు అర్థము ఈశ్వరుడు కాదు. స్వాజ్ఞానము వలననే జీవ-ఈశ్వర భేదము కలుగుచున్నది. వాస్తవమునందు లేదు.

అఖండమగు మహాకాశమందు ఉపాధిభేదము వలన ఘటాకాశ మనియు, మఠాకాశ మనియు భేదబుద్ధి కల్పితమగుచున్నది. అదేరీతిగ, చిదాకాశస్వరూపుడనగు నాయందు జీవేశ్వరులుకల్పితులగుచున్నారు.

మాయ; మాయాకార్యము రెండును విలయము నందినప్పుడు ఈశ్వరత్వమును లేదు, జీవభావమును లేదు. చిదాకాశము ఉపాధిశూన్యము. కాన, అప్పుడు చిదాకాశ స్వరూపుడ నగు నేనే యుందును.

శ్లో॥ సత్యచిద్ఘన మనంత మద్వయం
సర్వదృశ్యరహితం నిరామయమ్।
యత్పదం విమల మద్వయం శివః
తత్సదాఽహ మితి మౌన మాశ్రయే॥

శ్లో॥ పూర్ణ మద్వయ మఖండచేతనం
విశ్వభేదకలనావివర్జితమ్।
అద్వితీయపరసంవిదంశకం
తత్సదాఽహ మితి మౌన మాశ్రయే॥

శ్లో॥ జన్మమృత్యుసుఖదుఃఖవర్జితం
జాతినీతికులగోత్ర దూరగమ్।
చిద్వివర్తజగతోఽస్య కారణం
తత్సదాఽహ మితి మౌన మాశ్రయే॥

తా॥ శివపదము సత్యము, చిద్ఘనమునై యొప్పును. అది అనంతము, సర్వదృశ్యరహితము, నిరామయమునై భాసిల్లుచుండును. అట్టి శుద్ధ-అద్వయ-శివపద మేది గలదో, అదియే, నేనని భావన సేయుచు సర్వదా మౌనమును బూని యుందును.

ఏ సచ్చిదానందస్వరూపము పూర్ణము, అద్వయము, అఖండచిద్రూపము, విశ్వభేదకల్పనావర్జితమునై భాసించుచుండునో, స్వృత్తిజ్ఞానము గూడ ఏ పరసంవిత్తు యొక్క అంశయో, ఆ పరసంవిద్రూపము నేనని భావన సేయుచు సర్వదా మౌనమును బూని యుందును.

జననమరణములు, సుఖదుఃఖములును లేనట్టిదియు, జాతి, నీతి, కుల, గోత్రముల కతీతమైనదియు నగు సచ్చిద్రూప మేది గలదో, ఏ చైతన్య మీజగత్తునకు వివర్తోపాదానకారణమో ఆ బ్రహ్మవస్తువు నేనని భావన సేయుచు సర్వదా మౌనమును బూని యుందును.

శ్లో॥ ఉలూకస్య యథా భానా వంధకారః ప్రతీయతే।
స్వప్రకాశే పరానందే తమో మూఢస్య భాసతే॥

శ్లో॥ యథా దృష్టినిరోధా దార్త్ర స్సూర్యో నాస్తీతి మన్యతే।
తథా జ్ఞానావృతో దేహీ బ్రహ్మ నాస్తీతి మన్యతే॥

శ్లో॥ యథాఽమృతం విషాద్భిన్నం విషదోషైః న లిప్యతే।
న స్పృశామి జడాద్భిన్నో జడదోషాన్ ప్రకాశయన్॥

శ్లో॥ స్వల్పాఽపి దీపకణికా బహులం నాశయేత్తమః।
స్వల్పోఽపి బోధో మహతీ మవిద్యాం శమయేత్తథా॥

శ్లో॥ చిద్రూపత్వాత్ న మే జాడ్యం సత్యత్వాత్ నానృతం మమ।
ఆనందత్వాత్ న మే దుఃఖ మజ్ఞానా ద్భాతి హి త్రయమ్॥

తా॥ గుడ్లగూబ దివాంధము. దానికి సూర్యునియందు అంధకారము ప్రతీత మగుచుండును. అట్లే, అజ్ఞానవిమూఢచిత్తునికి స్వయంప్రకాశము, పరమానందస్వరూపమునగు చిద్రూప బ్రహ్మయందు అజ్ఞానము భాసించును.

కాచ కామలాది రోగపీడితుడు సూర్యుడు లేడని తలచును. అదేరీతిగ, అజ్ఞానావరణము వలన వివేకము కోల్పోయిన దేహియు, అనగా జీవుడును; బ్రహ్మ యను సద్వస్తువు లేదని భావించును.

అమృతము విషముకంటె భిన్నము. అది విషదోషములచే స్పృశింపబడదు. అట్లే, జడము కంటె భిన్నుడనైన నేను జడదోషములచే లిప్తుడను గాకయే, జడదోషములను ప్రకాశింపచేయుచుందును.

చిన్న దీపకళిక ఎంతటి చీకటినైనను పారద్రోలును. అట్లే, అత్యంతము అల్పమైన బోధయు, ప్రవేల్లియున్న అవిద్యను నాశమొందించును.

నేను చిద్రూపుడను; కాన నాకు జాడ్య మనునది లేదు. నేను సత్యస్వరూపుడను; కనుక, నాకు అనృత మనునది, అనగా, వినాశ మనునది లేదు. నే నానందస్వరూపుడనుగాన, నాకు దుఃఖ మనునది లేదు. జడత్వ, అనృతత్వ, దుఃఖములు మూడును అజ్ఞానమువలన, ప్రతీయమానము లగుచున్నవి.

శ్లో॥ కాలత్రయే యథా సర్పో రజ్జౌ నాస్తి తథా మయి।
అహంకారాదిదేహాంతం జగ న్నాస్త్యహ మద్వయః ॥

శ్లో॥ భానౌ తమః ప్రకాశత్వా న్నాంగీకుర్వంతి సజ్జనాః ।
తమ స్తత్కార్యసాక్షీతి భ్రాంతబుద్ధి రహో మయి ॥

శ్లో॥ యథా శీతం జలం వహ్నిసంబంధా దుష్ణవ ద్భవేత్ ।
బుద్ధితాదాత్మ్యసంబంధాత్ కర్తృత్వం వస్తుతో నహి ॥

శ్లో॥ జలబిందుభి రాకాశం న సిక్తం న చ శుష్యతి ।
తథా గంగాజలేనాయం న శుద్ధో నిత్యశుద్ధతః॥

శ్లో॥ వృక్షోత్పన్నఫలైః వృక్షో యథా తృప్తిం న గచ్ఛతి।
మయ్యధ్యస్తాన్నపానాద్యైః తథా తృప్తిః న విద్యతే॥

తా॥ రజ్జువునందు సర్ప మెన్నడు నుండనట్లు అహంకారము మొదలుకొని శరీరపర్యంతము గల జగత్తు నాయందు లేదు. నే నద్వయస్వరూపుడను.

సదసద్వివేకము గల సజ్జనులు ప్రకాశస్వరూపుడైన సూర్యునియందు తమస్సు నంగీకరింపరు. అజ్ఞానమునకు, తత్కార్యమగు జగత్తునకును, సాక్షియని, నాయందు అజ్ఞాన-తత్కార్యములు-రెంటిని కల్పించుచున్నారు. అహో! భ్రాంత బుద్ధికల్పనలు.

శీతలమగు జలము వహ్నిసంపర్కము వలన, ఉష్ణతా ధర్మము కలదానివోలె కన్పట్టును. వహ్నిసంబంధము ఎడమైనంతనే ఆ జలము సహజశైత్యము నందును. అట్లే, బుద్ధి తాదాత్మ్యసంబంధము వలన ఆత్మ కర్తృత్వ- భోక్తృత్వాది విశిష్టమై తోచును. వాస్తవమునకు ఆత్మ నిష్క్రియము.

జలబిందువుల చేత ఆకాశము తడియుటగాని, మరల యెండుటగాని, అసంభవము. అట్లే నిరంజనమైన యీ ఆత్మ గంగాజలముచే పరిశుద్ధ మగుటలేదు.

వృక్షములు వాటియందు పండిన ఫలముల వలన తృప్తిని బొందుటలేదు. అదేరీతిగ, నాయందధ్యస్తములైన క్షుత్పిపాసలను శమింపజేయు నిమిత్త మొసగబడు అన్న పానాదుల వలన నేను తృప్తుడను గాను. నిత్యతృప్తుడనగు నాకు మరియొక పదార్థముతో పని యేమి?

శ్లో॥ స్థాణౌ ప్రకల్పిత శ్చోరః స స్థాణుత్వం న బాధతే।
స్వస్మిన్ కల్పితజీవశ్చ స్వం బాధితుం న శక్యతే॥

శ్లో॥ అజ్ఞానే బుద్ధివిలయే నిద్రా సా భణ్యతే బుధైః ।
విలీనాజ్ఞానతత్కార్యే మయి నిద్రా కథం భవేత్ ॥

శ్లో॥ బుద్ధేః పూర్ణవికాసోఽయం జాగరః పరికీర్త్యతే ।
వికారాదివిహీనత్వా జ్జాగరో మే న విద్యతే ॥

శ్లో॥ సూక్ష్మనాడీషు సంచారో బుద్ధేః స్వప్నః ప్రజాయతే ।
సంచారధర్మరహితే స్వప్నో నాస్తి యథా మయి ॥

శ్లో॥ పరిపూర్ణస్య నిత్యస్య శుద్ధస్య జ్యోతిషో మమ ।
ఆగంతుకమలాభావాత్ కిం స్నానేన ప్రయోజనమ్ ॥

తా॥ చీకటిలో స్థాణువును చూచి దొంగ యని భ్రాంతి నందుదుము. ఈ కల్పితచోరుడు స్థాణుత్వము నెన్నడు బాధింప జాలడు. ఆత్మయందు జీవభావము అట్లే కల్పితమగుచున్నది. అట్టి కల్పితజీవత్వము ఆత్మ నెన్నడు బాధింపనేరదు.

బుద్ధి అజ్ఞానమునందు విలీన మగును. అట్టి దశను నిద్ర యని పండితులు చెప్పుదురు. అజ్ఞానము, తత్కార్యము నాయందు విలీనమగుచుండగా, నాకు నిద్ర యెట్లు కలుగును?

బుద్ధియొక్క సంపూర్ణవికాసమే జాగ్రదవస్థ యని చెప్పబడును. నిర్వికారుడ నగుటవలన నాకు జాగర మనునది యుండదు.

సూక్ష్మనాడులందు బుద్ధియొక్క సంచారమే స్వప్న మని చెప్పబడును. సంచారధర్మరహితుడనైన నాయందు అసగా, నిశ్చలమైన ఆత్మయందు స్వప్నము గూడ లేదు.

పరిపూర్ణుడను, నిత్యుడను, శుద్ధుడను, జ్యోతిస్స్వరూపుడ నగు నాకు ఆగంతుకమైన మాలిన్య మేదియును లేదు. అందువలన నాకు స్నానముతో పని యేమి?

శ్లో॥ దేశాభావాత్ క్వ గంతవ్యం స్థానాభావాత్ క్వ వా స్థితిః।
పూర్ణే మయి స్థానదేశౌ కల్పితౌ వహ మద్వయః॥

శ్లో॥ ప్రాణసంచారసంశోషాత్ పిపాసా జాయతే ఖలు।
శోషణానర్హచిద్రూపే మయ్యేషా జాయతే కథమ్॥

శ్లో॥ నాడీషు పీడ్యమానాసు వాయ్వగ్నిభ్యాం భవేత్ క్షుధా।
తయోః పీడనహేతుత్వాత్ సంవిద్రూపే కథం మయి॥

శ్లో॥ శరీరస్థితిశైథిల్యం శ్వేతలోమసమన్వితమ్।
జరా భవతి సా నాస్తి నిరంశే సర్వగే మయి॥

శ్లో॥ యోషిత్క్రీడాసుఖా దంతర్గర్వాఢ్యం యౌవనం కిల।
ఆత్మానందే పరే పూర్ణే మయి నాస్తి హి యౌవనమ్॥

శ్లో॥ మూఢబుద్ధిపరివ్యాప్తం దుఃఖానా మాలయ స్సదా।
బాల్యం కోపనశీలాంతం న మే సుఖజలాంబుధేః॥

శ్లో॥ ఏవం తత్త్వవిచారాబ్ధౌ విమగ్నానాం సదా నృణామ్।
పరమాద్వైతవిజ్ఞాన మపరోక్షం న సంశయః॥

తా॥ అపరిచ్ఛిన్నుడనగు నాకు వెళ్లదగు దేశముగాని, స్థానముగాని, లేదు. కాన, స్థానాభావము వలన నేనెక్కడ ఉందును? అద్వయాత్మ స్వరూపుడనైన నాయందు దేశము, స్థానము-రెండును కల్పితములే.

శరీరములోపల ప్రాణసంచారము వలన జలమంతయుఁ శోషణము చెందుటచే దప్పిక యగుచున్నది. నేనో, చిద్రూపుడను. అందుచే శోషణ మనునది నాకు లేదు. కాన, నాకు దప్పికయెట్లు కలుగును?

వాయువుచేతను, అగ్నిచేతను నాడులు పీడింపబడుట వలన ఆకలి కలుగుచున్నది. వానికి గూడ పీడనహేతువు నగుటవలన సంవిద్రూపుడనగు నాకు క్షుద్బాధ యెక్కడిది?

వయసు వచ్చుకొలది శరీరము శిథిలమగును; వెంట్రుకలు నెరయును. అట్టి స్థితిని 'జర' యందురు. నిరంశకుడును, సర్వగతుడనగు నాకు జర యనునది లేదు.

కాంతాసంగసుఖము వలన హృదయము గర్వాఢ్యమై యుండును. అట్టి దశను యౌవన మందురు. ఆత్మానంద స్వరూపుడను, పరుడను, పూర్ణుడనగు నాకు యౌవన మనునది లేదు.

మూఢచిత్త పరివ్యాప్తమై, సర్వదా దుఃఖములకు నిలయమై, కోపస్వభావమే అవసానముగా గలదానిని బాల్య మందురు. ఆనందసాగరుడనగు నాకు అట్టి బాల్యావస్థ యెట్లుండును ?

ఈ రీతిగా, తత్త్వవిచారసాగరమున సర్వదా నిమగ్నులై యుండు మనుజులకు సాక్షాదపరోక్ష పరమాద్వైతజ్ఞానము నిస్సంశయముగా లభించును.

ఈ విధముగా, శ్రీ శంకరులు అతిగహనమైన అద్వైత తత్త్వమును, కరతలామలక మగురీతిగ, ముముక్షువులైన శిష్యుల కుపదేశించిరి.

జీవుడు వేరు, బ్రహ్మ వేరు అను వాదమును "తత్త్వమసి" మొదలగు శ్రుతివాక్యములు తిరస్కరించుచున్నవి. ఆత్మజ్ఞానము మోక్షసాధనము కాదనిగాని, జ్ఞానకర్మసముచ్చయమే మోక్షసాధనమనికాని వాదించువారు "నాన్యః పంథా విద్యతేఽయనాయ" అను శ్వేతాశ్వతశ్రుతిని వదలుకొనవలెను.

శ్రవణాదుల ద్వారా సంశయము, భ్రమ నివృత్తము లగును. అప్పుడే ప్రతిబంధములు లేకపోవుటచే "నేనే బ్రహ్మను" ("అహంబ్రహ్మాస్మి") అను అపరోక్షజ్ఞానము కలుగును.

భూతభవిష్య ద్వర్తమానములకు చెందిన మూడు విధములగు ప్రతిబంధము లున్నవి. వెనుక అనుభవించిన విషయమును మాటిమాటికి స్మరించుచు, దానిని వదలలేక పోయినచో నిది మోక్షమునకు భూతప్రతిబంధము. భవిష్యత్ ప్రతి బంధము ప్రారబ్ధకర్మశేషము. ఫలమును అనుభవించిన తర్వాతనే కర్మశేషము నివర్తించును ప్రబలమగు కామ్యకర్మశేష మున్నచోఅది జ్ఞానప్రతిబంధకము కాగలదు.

ఇది దుర్బలమైనచో, శరీరస్థితికి ఇది హేతు వగునే కాని, జ్ఞానమునకు ప్రతిబంధకము కాజాలదు. విషయాసక్తి, కుతర్కము, ప్రజ్ఞామాంద్యము మొదలగు అనేకవిధముల నున్నది వర్తమాన ప్రతిబంధము.

ప్రతిబంధము లన్నియు తొలగిపోగా, మోక్షము అనుభూత మగును. "అహం బ్రహ్మాస్మి" అను అపరోక్ష జ్ఞానమే మోక్షము. అఖండైకరసము, సచ్చిదానందము నగు బ్రహ్మానుభూతిని మోక్ష మందురు. ఆత్మయొక్క నిజ స్వరూపమే ఇది. కాని అవిద్యావశమున ఈ నిజస్వరూపమును గుర్తించక సంసారబంధమున ఆత్మ మెలగుచుండును. రాజ కులమున జన్మించినను కర్ణుడు పుట్టినది మొదలు సూతుని ఇంట పెరిగి, అచట లభించిన సహవాసాదుల ద్వారా భ్రాంతి లక్షణమగు అవిద్యకు లోనాయెను. దానితో తాను రాధేయుడనే అని ఎంచినాడు కాని, కౌంతేయుడ నని తలచలేదు. కౌంతేయత్వము విస్మృతము కాగా నానావిధ శాపావమానాది దుఃఖముల ననుభవించెను. సూర్యుడు వచ్చి కర్ణునితో "నీవు కౌంతేయుడవు"అని చెప్పగా రాధేయత్వము వలన వచ్చిన దుఃఖము పోయి కౌంతేయత్వజ్ఞానము కల్గినది. ఇట్లే దేహాదులతో సంబంధము పెంచుకొనిన ఆత్మ, రాగ ద్వేషాదులకు లోనై దుఃఖము ననుభవించును. ఆత్మ

స్వరూపమును శ్రవణ మొనర్చి, మననము చేసి, నిజ స్వరూపమును తెలిసికొనిన, ఈ ఆత్మ శ్రేయఃప్రాప్తికి ప్రయత్నించును.

తాను వస్తుతః బ్రహ్మమే అని, అనాదిసిద్ధమైన అవిద్యచే నిజస్వరూప మావృతమైపోగా, జీవభావము ఆరోపింపబడినదని తెలిసికొనును. దానితో బ్రహ్మైవగతి కలుగును. ఇది నిత్య, నిరతిశయానంద స్వరూపానుభవము. ఇట్టి ముక్తి శరీరపాతానంతరమే గాక, దేహముతో జీవించుచున్నప్పుడు గూడ కలుగవచ్చును. అప్పుడు ఆ స్థితిని జీవన్ముక్తి యందురు. జ్ఞానరక్ష, తపస్సు, విసంవాదాభావము, దుఃఖనివృత్తి, సుఖావిర్భావము అను ఐదు ప్రయోజనములు జీవన్ముక్తావస్థకు గలవు. నివృత్తిమార్గమున నున్న జీవన్ముక్తులు తపోనిష్ఠలో నుండు మహర్షులు, ప్రవృత్తిమార్గమున నున్న జీవన్ముక్తులు శ్రీ శంకరభగవత్పాదులవంటివారు. లోకోద్ధరణమే వారి లక్ష్యము.

సైన్యములు గాని. ఆయుధములు గాని, లేకుండా, ప్రభువుల అండదండలు లేకుండా, ఒక్క బ్రహ్మవర్చస్సుతో దేశమునంతను వైదికమార్గమునకు మరల్చి, దేశసమైక్యతకు ధర్మప్రాతిపదికపై పునాదులను వేసి, అద్వైతమును సుప్రతిష్ఠితము చేసిన శంకరభగవత్పాదులు, జీవన్ముక్తు లనుటలో సందేహములేదు. ఆచార్యుని కాలమునుంచి నేటిదాక వచ్చిన అద్వైత దార్శనికులు శాంకరాద్వైతపు ప్రధానరూపమును

మార్పు లేదు. ఆ యా కాలములలో న్యాయ, మీమాంసా, బౌద్ధ, సాంఖ్యాది దార్శనికులు చేసిన ఆక్షేపములకు సమాధానముల నొసగుచు, శంకరుడు ప్రపంచించిన అద్వైతమును నిర్దుష్టముగా వ్యాఖ్య చేసిరి. తర్వాత వచ్చిన ద్వైత, విశిష్టాద్వైత విమర్శనలకు కూడ సమగ్రమగు ప్రత్యుత్తరముల నొసగిరి. అద్వైతవేదాంతము కేవలము తార్కికవిషయము కాదని, విధి నిర్వహణను వదలునట్టి మెట్టవేదాంతము కాదని స్పష్టముగా తెలియజేయుటకే శంకరుడు భగవద్గీతా భాష్యమును రచించెను.

శ్రుతి, స్మృతి, తర్కసంమతమైన అద్వైతదర్శనమునకు సమగ్రరూపము నొసగిన శ్రీమచ్ఛంకర భగవత్పాదులు భారతదేశమున అవతరించి-

"యదా యదా హి ధర్మస్య. గ్లాని ర్భవతి భావతి-
అభ్యుత్థాన మధర్మస్య, తదాఽఽత్మానం సృజా మ్యహమ్"॥

అను వాగ్దానమును నెరవేర్చుకొనెను. వారి మహత్తరకృషి కూడ భగవద్గీతలోనే

"పరిత్రాణాయ సాధూనాం, వినాశాయ చ దుష్కృతామ్'
ధర్మసంస్థాపనార్థాయ, సంభవామి యుగే యుగే॥"

అని ప్రస్తుతించబడినది.

శుభం భూయాత్.

సవరణల పట్టిక

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
2	9	యికులను	యికులకు
5	20	వృజ	నృప
8	4	ల్పలతిక	కల్పలతిక
19	3	పురుష	పౌరుష
19	7	లినిని	లితనిని
19	18	కాలము	కాలమున
20	5	వాం	వ్యా
33	16	వా	ను
35	18	లోగా	లోగాగాని
35	19	శబరని	శబర,
41	9	తెనియు	తెలియు
41	16	పంచి	పంచ
46	23	రిచెను	రించెను
47	6	డో	డు
53	6	వసింతురు	వసింతురు. గోమతీ తీరమున కర్దల్య వనమున గౌడపాదుల ఆశ్రమమున్నది.
54	11	—	(చేర్పవలసినది)

విట్ఠలదేవునకు గుణవతీదేవికి నేటి సాంగ్లి జిల్లాలోని భూపాల నగరమున (విత్తకు సమీపమున) గౌడసారస్వత బ్రాహ్మణ వంశములో జన్మించిన శ్రీ గౌడపాదుల పూర్వాశ్రమనామము దత్తదేవుడు. ఆయన ఋగ్వేది

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
87	3	లా_త్రారాలి	లాన్త్రారాల
89	16	వివృతము	నివృత్తము
98	10	గుఃఖతతి	దుఃఖతతి
112	10	యు_ద్ధైర్యం	యద్ధైర్యం
115	4	సువృతము	సుకృతము
145	2	పాన	పావన
145	6	వృద్ధుడు	—
146	9	జన్మ	జనన
147	13	భోగ	భోగః
151	7	కిమున	మున
169	4	పంచము	పంచకము
174	13	ఒప్పుడు	ఒకప్పుడు
179	15	వానింటె	వానికంటె
197	5	సృష్టమొనర్చు	సృష్టిచేసి
199	1	యథావి	యథావిధి
206	10	తస్త్మై	తస్మై
221	15	చిత్తావాం	చిత్తాహం
222	22	స్వానువ	స్వాను
227	17	పాప	పాన
228	9	ముచేయనగును	మగును

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
228	15	జపము	అజపాజపము
234	20	మును	ము
241	1	క్షి	క్షియ
248	10	అనినవ	నవ
249	15	డితని	డితనిది
250	15	దగె	దగ్ధై
262	22	బట్టి	దీనినిబట్టి
262	9	మునును	మును
263	1	తింగ	లింగ
263	8	శ్రీనై	శ్రీశై
267	2	స్తమై	స్థమై
273	5	వాదము	వాదములతో
283	16	ఐ	ఐం
286	7	ఐ	ఐం
287	5	తెలిను	తెలియును
306	1	కుంకు	కుంకుమాం
306	1	ర్పూర	కర్పూర
306	13	గనగాం	గగనగాం
313	2	ప్రశాశ్యమ్	ప్రకాశ్యమ్
313	14	ధీష్వేమ	ధీష్వేవ

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
314	10	సమసాని	సమస్తాని
316	22	తనమ	తనకు
333	8	సాధ్య	సాద్య
333	11	చిః	చి
345	20	ర్జ	ర్ద
349	2	సితే	స్థితే
351	15	తత్త	తత్త్వ
358	11	ధూ	దు
359	18	ప్తైః	స్తైః
360	2	సయో	సంయో
361	4	విరిం	నిరిం
361	6	శృతి	శ్రుతి
363	15	వగా	పరా
363	22	సే	శే
365	1	స్వ	త్స్వ
365	8	సఛ్ఛి	సచ్చి
387	22	ష్ఠినవాడుంచి	ష్ఠించినవాడు
393	4	ముకుశా	ముకుళా
398	1	రాయగు	యగు

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
398	2	ఠము	రము
400	19	క్నపత్	క్షపత్
401	1	స్యః	సః
401	7	ర్గచయ	రచయ
403	7	—	త్రోటకాచార్య నామానం
406	20	శాంకరీ	శాంకర
410	22	టకి	కీట
411	8	జ్గగ	జ్జగ
411	10	ప్రోక్తం	ప్రోక్తః
413	18	ఇదట	ఇచట
415	12	అహోబ్రహ్మాం	అహంబ్రహ్మ
416	9	సూధ	మాది
418	3	సౌనర్యం	సౌపర్ణ్యం
419	9	స్రై	స్త్రై
423	12, 16	ద్వారికా	ద్వారకా
427	2	న్యత	న్యత్ర
427	4	సర్వ	సర
429	19	కథ	కథి
430	15	శారాదా	శారదా